

Unique Telugu Novelist Whose English Novel
**"THE ENEMY OF MANKIND"**
Has Been Published and Released Worldwide


# సూర్యదేవర రామ్ మోహన రావు

**Author of Highest Number of Novels In Telugu**




# కృతయుగ్

తెలుగులో అత్యంత ఎక్కువ సోషల్ నవలలు రాసి రికార్డ్ సృష్టించి
100 వ నవలకు చేరువవుతున్న మీ అభిమాన రచయిత
The Number One Best Selling Author


# సూర్యదేవర రామ్మోహనరావు


# కృతయుగ్


మధుప్రియ పబ్లికేషన్స్
మాచవరం • విజయవాడ - 520 004

# KRUTAYUG

(Serialised in 'Swathi' weekly)

By

**SURYADEVARA RAM MOHANA RAO**
Sri Venkata Anantha Sai Nilayam
Flat No.63, Road No.71
Navanirman Colony, Jubilee Hills
Hyderabad - 500 096
E-mail : suryadevaranovelist@gmail.com
www.suryadevararammohanrao.com
www.suryadevaranovelist.com.

Published by:
**MADHU PRIYA PUBLICATIONS**
Machavaram, Vijayawada - 520 004
Phone : 0866 - 2431969

First Edition :
**2014**

Price :
**Rs. 140-00**

Cover Design :
**DURGA RAO**

Printers :
**SRI CHAITANYA OFFSET PRINTERS**
Vijayawada-2

# కృతయుగ్

అది ఉత్తరాంధ్రలోని చెర్ల గ్రామంనుండి ఛత్తీస్‌ఘర్ రాష్ట్రంలోని దంతెవారాకు వెళ్ళే రహదారి. సరిహద్దుకు సుమారు నలభై కిలోమీటర్ల దూరం ఇవతలే ఉంది చెర్ల. ఆ మార్గంలో సరిహద్దు వైపు – పరుగుతీస్తోంది ఒక ట్యాక్సీ. ఉదయం తొమ్మిది గంటల ప్రాంతం. వాతావరణం ఆహ్లాదభరితంగాఉంది. ఈ సంవత్సరం వేసవి అంతగా తెలీటం లేదు. పగలు ఎండ, రాత్రిళ్ళు చలిగా ఉంటోంది.

కారు నడుపుతున్న యువకుడికి ఇరవై ఏడు సంవత్సరాల వయసుంటుంది.

మనిషి ఆరడుగుల పొడవుకు తగ్గడు. తగినలావు, కండలు తిరిగిన దండలు అతడి అందాన్ని, ఆరోగ్యాన్ని చాటుతున్నాయి. తీర్చిదిద్దినట్లుండే కను ముక్కుతీరు, ఒకసారి చూస్తే తిరిగి చూడాలనిపించే ఆకర్షణ అతడిలో వుంది.

సాధారణంగా మగవారిలో ఎర్రని పెదవులుండటం అరుదు. కోరమీసం, ఎర్రని పెదవులు, కోలముఖం అతడికో విలక్షణమైన అందాన్ని తెచ్చిపెడ్తున్నాయి.

ట్యాక్సీని అద్దెకు తిప్పుతాడుగాని దాని ఓనరు కమ్ డ్రైవర్ అతడే. ఇక ఆ ట్యాక్సీ అంటారా! అదో పాత మోడల్ అంబాసిడార్ కారు.

డీజిలింజను, డకోటా విమానంలా శబ్దంచేస్తూ పరుగెత్తడం దాని స్పెషాలిటీ. ఆ రూటు రోడ్డు బాగుంటుంది గాని అక్కడక్కడా రోడ్డు పాడై గతుకులమయంగా ఉండి వేగంగా ప్రయాణించడం కష్టం.

ట్యాక్సీ వెనకసీట్లో వృద్ధ దంపతులిద్దరున్నారు. ఆయనకు అరవైఅయిదు, ఆమెకు అరవై సంవత్సరాల వయసుంటుంది. సాంప్రదాయ దుస్తుల్లో ఆది దంపతుల్లా వున్నారిద్దరూ. ఈ వయసులో కూడా వారిద్దరి అన్యోన్యత చూడముచ్చటగా ఉంది.

చెర్ల గ్రామం వద్ద ఎక్కారు వాళ్ళు. సరిహద్దు ఉమ్మడి చెక్‌పోస్ట్‌ల వద్ద దిగిపోతారు. ఖాళీగా వెళ్ళడం ఎందుకని వాళ్ళని ఎక్కించుకున్నాడు. అతను ట్యాక్సీ డ్రైవరే కాదు, మంచి టూరిస్ట్ గైడ్ కూడ.

ఇటు భద్రాచలం నుండి అటు ఛత్తీస్‌ఘర్ స్టేట్ వరకు పర్యాటక ప్రాంతాలన్నీ అతడికి కొట్టిన పిండి. ఉండేది భద్రాచలమైనా శని, ఆదివారాలొస్తే టూరిస్ట్‌ల కోసం దంతెవారా వెళ్ళిపోతుంటాడు. ఆ రెండు రోజులు ట్యాక్సీ అక్కడే ఉంటుంది.

ఆ రెండ్రోజులు దంతెవారాలో టూరిస్టుల తాకిడి ఉంటుంది. చుట్టుపక్కల అటవీప్రాంతాల్లో గుళ్ళు గోపురాలు, కనువిందు చేసే లోయలు మొదలయిన పర్యాటక ప్రాంతాలు అనేకం వున్నాయి.

ముఖ్యంగా దంతెవారాకు పదిహేను కిలోమీటర్ల దూరంలోని అడవిలోని కొండమీదగల పురాతన కోట టూరిస్ట్‌లకు ప్రత్యేక ఆకర్షణ.

రోడ్‌వెంట ట్రాఫిక్ అంతగా లేదు. కారు నడుపుతున్నాడే గాని యువకుడి చూపులు అప్పుడప్పుడూ వ్యూమిర్రర్‌లోంచి వెనకసీట్లోని వృద్ధజంటను గమనిస్తూనే వున్నాయి.

ఈ వయసులోకూడా ఆ ఇద్దరి అన్యోన్యత నమ్మశక్యంగాకుండా ఉంది. అప్పుడే పెళ్ళయిన కొత్తదంపతుల్లా అంత ఉత్సాహంగాను, ఆనందంగాను

ఉన్నారు. గుసగుసలు, ముసి ముసినవ్వులు. అతడి భుజంమీదకు వాలి కూర్చుని కబుర్లు చెప్తోందావిడ.

ఒలిచిన కమలాపండు తొనల్ని కొసరి కొసరి ఆమె నోటికందిస్తుంటే తింటూ ఊ కొడుతున్నాడు. వారి చూపుల్ని బట్టే అర్థమైపోతోంది ఒకరంటే ఒకరికి ఎంత ప్రేమో! కొత్తగా పెళ్ళయిన జంట కూడా ఇంత అనురాగంతో ఉండరేమో అన్పించింది.

అలాగే చిన్న సందేహం కూడా ఏర్పడింది.

"బాబాయిగారు. ఓ మాటడగనా?" పిలిచాడు.

చురుగ్గా చూశాడా పెద్దమనిషి.

"ఏరా అబ్బీ! నీకు నేను బాబాయిలా కన్పిస్తున్నానా?" ఒకింత సీరియస్‌గా అడిగాడు.

"అబ్బో!... పోనీ తాతయ్యని పిలవనా? బాగుండదేమో!" అన్నాడా యువకుడు.

కిసుక్కున నవ్వింది బాబాయి సతీమణి.

"ఓ.కె. బాబాయికి ఫిక్సయిపో. అడుగు ఏమిటా మాట?" వెంటనే రాజీకొచ్చేసాడాయన.

"నాదో డౌటు!"

"ఏమిటా డౌటు?"

"తీరా అడిగాక కోప్పడకూడదు!"

"నాకు బిపి, షుగరులాంటివేమీ లేవురా అబ్బీ. కోపంరాదు. భయపడకుండా అడుగు"

"ఏంలేదు. మీ ఆదర్శదాంపత్యం చూస్తుంటే భలే ముచ్చటేస్తోంది. నాకు తెలీకడుగుతాను..."

"తెలియకపోతే అడగడమెందుకు. కారు జాగ్రత్తగా పోనీ"

"అయ్యో చెప్పేది వినరేమిటి?..."

"ఈయనకంతా తొందరే బాబూ. నువ్వడుగు ఏమిటా సందేహం?" అడిగిందావిడ.

"విషయం ఏమంటే బాబాయిగారూ, మీరు కలిసి కాపురం చేసిన ఇన్నేళ్ళలో ఎప్పుడైనా ఒకరికొకరు బోర్‌కొట్టి విడిపోవాలనిపించలేదా?

ఇప్పటికీ ఇంత ప్రేమగా ఉంటున్నారంటే ఆ ప్రేమలోని రహస్యం ఏమిటి?... తెలుసుకోవాలనుంది" డౌటు చెప్పేశాడు. నిజానికి ఆ ప్రశ్న వినగానే ఇద్దరూ కోపంతో తన మీద విరుచుకుపడాలి. కాని అలాంటి ప్రమాదం ఏమీ జరక్కపోగా - దంపతులిద్దరూ ముఖముఖాలు చూసుకుని ముసిముసిగా నవ్వుకున్నారు.

"మా ప్రేమకు ఈ జన్మ ఒక్కటే చాలదని మేం బాధపడుతుంటే నువ్వేమిట్రా అబ్బీ, విసుగుపుట్టి విడిపోవాలనిపించలేదా అనడుగుతావ్. బాగుంది! ఇంతకీ నీ పేరేమిట్రా అబ్బీ?" భార్య అందించిన కమలాపండు తొన నములుతూ అడిగాడాయన.

"నన్ను కృతయుగ్ అంటారండి" చెప్పాడు డ్రైవరు.

"నేనడిగింది యుగాల గురించి కాదయ్యా. నీ పేరు?"

"నా పేరే కృతయుగ్ అండి"

"అలాగా... కృతయుగ్. బాగుంది. నాలుగు యుగాల్లోనూ ఆదియుగం. ధర్మం నాలుగుపాదాలా నడిచిన యుగం. మన పురాణదేవతలు ఆవిర్భవించిన పుణ్యయుగం. అలాంటి పేరు పెట్టుకున్నావంటే"

"నేను పెట్టుకోలేదండి. అమ్మనాన్న పెట్టారు."

"నీకా పేరు పెట్టి నీ తల్లిదండ్రులు ధన్యులయ్యార్రా అబ్బీ" అన్నాడు.

"అవునండి. అందుకే వాళ్ళిద్దరూ నా చిన్నప్పుడే గోదావరీ పుష్కరాల్లో మునిగిపోయి మా భద్రాద్రి రాముడి సన్నిధికి వెళ్ళిపోయారు. ప్రస్తుతం మా బామ్మ తప్ప నాకు నా అనే వాళ్ళెవరూ లేరండి."

"అయ్యోపాపం. అలాగా బాబూ. పోనీ పెళ్ళయినా చేసుకున్నావా, లేదా?" అడిగిందావిడ.

"లేదండి"

"చూడరా అబ్బీ. లోకంలో ఎవరూ ఒంటరివాళ్ళు కాదు. నీకు బామ్మయినా ఉంది. ఎవరూ లేనివాళ్ళు ఎందరో ఉన్నారు. మనకన్నా తక్కువవాళ్ళని చూసి వీళ్ళకన్నా మనం బెటర్ అనుకుని తృప్తిపడాలేకాని మనకన్నా ఉన్నతంగా వున్నవాళ్ళని చూసి అసూయపడకూడదు. నన్నడిగితే ఆత్మతృప్తిలేని వాడు జీవితంలో ఎన్నడూ సుఖపడలేదు. అవునూ, మీ సొంత ఊరు భద్రాచలమా?" అడిగాడు పెద్దాయన.

"అవునండి. ఇంకా చెప్పాలంటే మా పూర్వీకులది కృష్ణాజిల్లా మున్నలూరు గ్రామమండి. మా తాతగారి హయాంలో భద్రాచలానికి వలస వచ్చేశారట.

ఇప్పటికీ మున్నలూరు, నందిగామ, గొల్లపూడి, అమరావతి ప్రాంతాల్లో మా చుట్టాలు చాలామంది ఉన్నారని మా బామ్మ అంటూంటుంది.

కాని ఏనాడో రాకపోకలు తెగిపోవటం చేత ఇప్పుడు వాళ్ళెవరూ నాకుతెలీదు."

"మీ పూర్వీకుల వృత్తి ఏమిటి?"

"అబ్బో, చాలా ఉందండి. ఇంతకీ మీరు నా ప్రశ్నకి బదులు చెప్పలేదు" గుర్తుచేశాడు కృతయుగ్.

"అక్కడకే వస్తున్నారా. నువ్వడిగిన ప్రశ్న ఉందే... తరానికి, తరానికి మధ్య అంతరం. అంతరం ఏమిటో నీ ప్రశ్న వింటే అర్థమవుతుంది.

మా కాలంలో భార్యాభర్తల సంబంధానికి ఎంతో ప్రాధాన్యత ఉండేది. మూడు ముళ్ళువేసి అగ్నిసాక్షిగా ఏడడుగులు నడిచామంటే జీవితాంతం ఆ అడుగులు అలా కలిసి నడవాల్సిందే.

చకోరపక్షుల జంటలా కలిసి బ్రతకాల్సిందే. సుఖ సంతోషాలన్నీ కలసి అనుభవించాల్సిందే. జీవితమంటే అదే అనే సూత్రానికి కట్టుబడి ఉంటాం. మధ్యలో బోర్ కొట్టడమో, విడిపోవాలనే ఆలోచన వుండవు.

కాని ఈ తరం పిల్లలు ఈకాలం పరిస్థితులు వేరు. పూర్తిగా విదేశీ సంస్కృతికి నేటి యువత పూర్తిగా అలవాటుపడిపోయింది. దీనికి స్త్రీ పురుష భేదం లేదు. విచ్చలవిడితనం, విశృంఖలత వెర్రితలలు వేసి యువతని ఆడిస్తోంది. బాధ్యత లేకుండా తిరిగే గాలి తిరుగుళ్ళే జీవితం అనుకుంటున్నారు.

నిజమైన ప్రేమ అంటే ఏమిటో వీళ్ళకు తెలీదు. ఎవర్ని చూసినా హక్కుల గురించి పోరాడే వాళ్ళేగాని బాధ్యతలు పట్టించుకునేవాళ్ళు లేరు. ఇచ్చి పుచ్చు కోవడం లోని తృప్తిగాని, వీళ్ళకి తెలీదు.

ఇగో ప్రాబ్లంతో చిన్న విషయాల్ని కూడా భూతద్దంలో చూసి గొడవలు పడిపోతున్నారు. దాంతో ఇవాళ పెళ్ళి చేసుకుని రేపు విడాకులు తీసుకునే సంస్కృతి వచ్చేసింది. కాబట్టి మా జంటను చూసి నీకీ అనుమానం రావటంలో ఆశ్చర్యం లేదు. కాని–

అలాంటి పరిస్థితి మాకు ఎప్పుడూ రాలేదు. కలత లొచ్చినా కన్నీళ్ళొచ్చినా విడిపోవాలనే ఆలోచనే మాకెప్పుడూ రాలేదు. అందుకే మా పిల్లలకు మేమంటే ఇప్పటికీ భయభక్తులు గౌరవ మర్యాదలు.

అందరికీ పెళ్ళిళ్ళు చేసేశాం. మనవలు, మనవరాళ్ళు ఉన్నారు. విడిపోయి ఉంటే ఆ ఆనందమంతా మిస్సయ్యే వాళ్ళం గదా!" అంటూ ఆయన వివరిస్తుంటే ఆసక్తిగా విన్నాడు కృతయుగ్.

ఆయన చెప్పింది వాస్తవమే అన్పించింది కృతయుగ్‌కి. తరతరాలుగా సమాజశ్రేయస్సు కోసం మన పెద్దలు కాపాడుకుంటూ వచ్చిన వ్యవస్థలు అనేకం భ్రష్టుపట్టినట్టే చివరికి వివాహవ్యవస్థ కూడా విచ్ఛిత్తికి దారితీస్తోంది.

స్వలింగ సంపర్కాన్ని కూడా చట్టబద్ధం చేయాలని చూస్తున్నారంటే మితిమీరిన తెలివి అనుకోవాలో, పిచ్చివాళ్ళ రాజ్యం అనుకోవాలో అర్థం కాదు.

అన్యోన్యమైన జంటలే కానరావట్లేదు. ఎక్కడ చూసినా అశాంతి, అరాచకత్వం, స్త్రీ వేధింపులు, స్త్రీలలో నిర్లజ్జ, విచ్చలవిడితనం ఒకటేమిటి ఖర్మ... అన్నిరకాల వికారాలు సమాజంలో చోటుచేసుకోవటం నేడు చూస్తున్నాం. విడాకుల కోసం కోర్టుకెక్కే జంటలు ఎక్కువైపోతున్నాయి. మనిషి సృష్టించిన కాగితం డబ్బే ఈ రోజు మనిషినెత్తిన కూచుని విపరీత నాట్యాలు చేయిస్తోంది.

కృతయుగ్ ఆలోచనలు అంతమయ్యేలోన ట్యాక్సీ ఒక్క కుదుపు కుదిపి అంత ఎత్తుకు లేచి కిందకు దూకింది. ఆ విసురుకు వెనకసీట్లోని దంపతులు కీచుగా అరిచి ఒకరిమీద ఒకరు పడ్డారు. జాగ్రత్తగా స్టీరింగ్ కంట్రోల్ చేసి కారు స్లో చేశాడు కృతయుగ్.

ఏ మాత్రం ఏమరిపాటుగా ఉన్నా అక్కడో యాక్సిడెంట్ జరిగేదే. ఎందుకంటే అక్కడి నుంచి ఎగుడు దిగుడు గతుకుల రోడ్డు ఆరంభమవుతుంది.

సుమారు మూడు కిలోమీటర్ల దూరం రోడ్డు పూర్తిగా పాడయిపోయింది. ఒక్కోచోట రెండడుగులు మించి లోతు గోతులు కూడా ఉన్నాయి.

ఆ రోడ్డులో ఎప్పుడూ ట్రాఫిక్ ఉంటుంది. అయినా పట్టించుకునే వాళ్ళు లేరు. "సారీ బాబాయ్. కబుర్లలో పడి గమనించలేదు. గతుకుల రోడ్డు వచ్చేసింది. ఇక జాగ్రత్తగా ఉంటాను" అన్నాడు జరిగిందానికి నొచ్చుకుంటూ కృతయుగ్. అప్పటికి కాస్త సర్దుకు కూచున్నారు వాళ్ళిద్దరూ.

తుఫానులో ఊగిపోతున్న పడవలా ట్యాక్సీ ఊగిపోతుంటే సీట్లోంచి జారిపోకుండా డోర్స్‌ని గట్టిగా పట్టుకున్నారు. "ఈ మాత్రానికి సారీలెందుకులేరా అబ్బీ. ఎప్పుడూ ఉండే కష్టాలేగా ఇవి. ఎన్ని వినతిపత్రాలు పెట్టినా, ఎందరు గోలచేసినా ఈ రోడ్లు మాత్రం బాగుపడవు" అన్నాడు పెద్దాయన.

"అవును బాబాయ్. ఇలాంటి అధ్వాన్నం రోడ్లు ఆంధ్రప్రదేశ్‌లో చాలా వున్నాయి. రెండేళ్ళకో, మూడేళ్ళకో ఓసారి రోడ్డు కొత్తగా వేసినట్టు రికార్డుల్లో ఉంటుంది. వేయని రోడ్లనే వేసినట్టు భోంచేస్తూ వుంటారు. ఇది ప్రజాస్వామ్యం కాదు. ప్రజాభోజ్యం" అంటూ నవ్వాడు కృతయుగ్.

"ప్రజలు తిరగబడనంతవరకేరా అబ్బీ వీళ్ళ ఆటలు సాగుతాయి. నన్నడిగితే రోడ్డు రవాణామంత్రిని కారులో ఈ రోడ్డుమీద ప్రయాణం చేయిస్తే గాని మనకష్టాలు వాళ్ళకితెలీదు." అన్నాడు పెద్దాయన.

"అప్పుడు కూడా తెలీదు బాబాయ్. మన నాయకులు ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు వీళ్ళేమన్నా తెలివితక్కువ వాళ్ళా. ఈ రూట్లో మంత్రిగారి ప్రయాణం ఉందనగానే రాత్రికి రాత్రి గోతులు పూడ్పించి సరిచేసేస్తారు. ఇంకేమిటి తెలిసేది?" అంతా నవ్వుకున్నారు.

కిందా మీదా అవుతూ ఇరవై కిలోమీటర్ల వేగంతో గతుకుల రోడ్డు వెంట సాగుతోంది టాక్సీ, చుట్టూ అటవీ భూములు వీటి మధ్యగా రోడ్డు.

ఎటు చూసినా ఇంపైన పచ్చదనం, అప్పట్లో ఛత్తీస్‌ఘర్ ఏర్పడకముందు మధ్యప్రదేశ్‌లో అంతర్భాగంగా ఉన్నప్పుడు ఈ మార్గం చాలా రద్దీగా ఉండేది. ఛత్తీస్‌ఘర్ ఏర్పడ్డాక రద్దీ చాలా తగ్గింది.

గతుకుల రోడ్డు మూడు కిలోమీటర్లు దాటగానే కాస్త మంచిరోడ్డు ఆరంభమైంది. అక్కడినుంచి పదిహేను కిలో మీటర్ల దూరం ముందుకు పోగానే ఉమ్మడి చెక్‌పోస్ట్‌లను చేరుకున్నారు.

ఆంధ్రాచెక్‌పోస్ట్ సమీపంలో టాక్సీ ఆపించి దిగిపోయారా దంపతులు. కృతయుగ్ కారు డిక్కీ తెరిచాడు. లోన ఒక అమృతపాణి అరటిపళ్ళగెల, ఒక ఏర్‌బ్యాగ్ ఉన్నాయి. పెద్దాయన గెల అందుకుని భుజాన వేసుకున్నాడు.

డ్రైవరు చేతిలో వంద రూపాయల నోట్ ఉంచి – 'రావే' అంటూ బయలుదేరాడు. ఆవిడ ఏర్‌బ్యాగ్ భుజాన వేసుకుని పోబోతూ ఆగి కృతయుగ్ వంక చూసింది. "ఇదిగో అబ్బాయ్. నీకో రహస్యం చెప్పనా?" అంది నవ్వుతూ.

"చెప్పండి పిన్నిగారూ. ఏమిటా రహస్యం?" కుతూహలంగా అడిగాడు.

"నా మొగుడి మాటలు విని ఆయనేదో సత్యసంధుడనుకునేవు. వయసులో ఉండగా చాలా సెటప్పులు ఉండేవి. పేరుకు మొగుడేగాని ఆయనకన్నా చిత్తకార్తి కుక్క నయం. ఏదో వయసవుతోంది గాబట్టి కాస్త కుదురుపడి ఇలా నీతులు చెప్తున్నాడు.

మా చిన్నమ్మాయినీ ఊరు ఇచ్చాం గదా. వాళ్ళని చూడ్డానికెళ్తున్నామన్న మాట. ఇంతకీ నే చెప్పొచ్చేదేమంటే చూడ్డానికి అమాయకుడిలా వున్నావు. జాగ్రత్త.

మెరిసేదంతా బంగారం కాదు. నీతులు చెప్పేవాళ్ళంతా మహానుభావులూ కాదు. వస్తానూ" అంటూ గబగబా వెళ్ళి భర్తను చేరుకుంది.

చెక్‌పోస్ట్‌నుంచి ఎడంపక్కగా ఉన్న కాలిబాట దగ్గర్లోని చిన్న గ్రామంవైపు పోతోంది. పిన్నిగారి మాటలు వినగానే - పాపం కృతయుగ్‌కి షాక్. వెళ్తోన్న జంటను చూస్తూ-అలాగే ఉండిపోయాడు కాసేపు. ఒక విషయం తనకిప్పుడు బాగా బోధపడింది.

అదేమంటే నీతులు చెప్పేవాళ్ళంతా చిన్నప్పట్నుంచీ నీతిమంతులేమీ కాదు. తను చెడాల్సిందంతా చెడిపోయి జ్ఞానోదయం పొందాకే నీతులు ఆరంభిస్తారు. ఏం బిడ్డపిచ్చావ్ బాబాయ్? డీక్కీ మూసి కారు స్టార్ట్ చేశాడు.

ఇటు ఆంధ్రా చెక్‌పోస్ట్‌లోగాని అటు ఛత్తీస్‌ఘర్ చెక్‌పోస్ట్‌లో గాని కృతయుగ్‌ని అతడి డొక్కు ట్యాక్సీని తెలీనివాళ్ళు లేరు. వారంవారం వెళ్ళొస్తుంటాడు. అక్కడి అధికారులతో బాటు స్టాఫ్ కూడా పరిచయస్తులే. కాబట్టి అతడి ట్యాక్సీని ఎవరూ పట్టించుకోరు. వాళ్ళకో సలాంకొట్టి చెక్‌పోస్ట్ దాటి వెళ్ళిపోతాడు.

* * * * *

వెల్ కమ్ టు ఛత్తీస్‌ఘర్ ఆర్చి కిందనుంచి ముందుకు పరుగెత్తింది ట్యాక్సీ. ఇటు ఆంధ్రా కన్నా ఛత్తీస్‌ఘర్ రోడ్లు చాలా బాగుంటాయి. చిన్న కుదుపు కూడా తగలకుండా రివ్వున పరుగు తీస్తోంది ట్యాక్సీ. చెక్‌పోస్ట్‌లకి సరిగ్గా అయిదు కిలోమీటర్ల దూరం ఎగువన ఒక కొండగుట్ట పాదంలో వుందో ఊరు. ఆ ఊరి పేరు కంకుపూర్.

అటవీ ప్రాంతంలో పచ్చని గుబురు చెట్లకింద హాయిగా నిద్రపోతున్న ట్టుంటుందా ఊరు. చాలా చిన్న ఊరు. మొత్తం ఐదువందల గడప మించదు.

నిజానికిది ఒకప్పుడు అగ్రహారం. దాని ప్రాచీన నామం కంకుభట్ల వారి అగ్రహారం. కాలం తెచ్చిన మార్పులో నేడు కంకుపూర్ అయింది.

ఒకనాడు అగ్నిహోత్రులయిన బ్రాహ్మణ కుటుంబాలు నివసించే అగ్రహారం. దంతెవారా రాజుగారి రాజగురువుకు ఈ అగ్రహారం, ఇక్కడి సమీప భూములు ఇవ్వబడ్డాయట. కంకుభట్ల పేరి శాస్త్రిగారనే ఆ రాజగురువు పేరు మీదే అది కంకుభట్ల వారి అగ్రహారం అయింది. ఇది ఒకప్పటి మాట. ప్రస్తుతం అక్కడ అన్ని కులాలవారూ ఉన్నారు. కంకుభట్ల వారి వంశీకులూ ఉన్నారు.

హైవేకు ఎడంపక్కగా కొండ పాదంలో విస్తరించి ఉంది ఊరు. కుడిపక్క అడవి. రోడ్డునానుకుని కొన్ని అంగళ్ళు ఉన్నాయి. గ్రామం మెయిన్‌వీధికి ఎదురుగా రోడ్‌కి అవతల ఒక కాకా హోటల్ ఉంది. అక్కడ టీ చాలా బాగుంటుంది. సరిగ్గా అక్కడికి రాగానే టీ తాగడం కృతయుగ్ అలవాటు.

అలాగే రోడ్డు పక్కగా ట్యాక్సీ ఆపి వెళ్ళి బల్లమీద కూచుని టీ చెప్పాడు. అటు ఇటు మరికొన్ని వాహనాలు నిలిచివున్నాయి. కృతయుగ్‌కి తెలిసిన ఒకరిద్దరు డ్రైవర్లు ఉన్నారు. వాళ్ళతో కబుర్లు చెప్పుకుంటూ టీ తాగాడు. తర్వాత వచ్చి ట్యాక్సీ స్టార్ట్‌చేశాడు.

అది రివ్వున ముందుకు దూకింది.

అలా ఒక కిలోమీటరు వెళ్ళాడో లేదో వ్యూమిర్రర్‌లో వెనక్కి చూసి ఉలిక్కిపడ్డాడు. "ఏమైంది? ఎవరు వాళ్ళు" అంటూ అప్రయత్నంగా గొణుక్కున్నాడు.

తనని అనుసరించి వెనకే నాలుగు బైక్‌లూ, రెండు స్కూటర్లు రివ్వు రివ్వున దూసుకొస్తున్నాయి. వాళ్ళలో కొందరి చేతుల్లో కర్రలున్నాయి! 'ఆపు ట్యాక్సీ ఆపు' అనరుస్తున్నారు. కృతయుగ్‌కి షాక్...!

తన ట్యాక్సీకి, వాళ్ళకి ఏమిటి సంబంధం? ఎందుకు ఆపమంటున్నారు? చూస్తే వాళ్ళంతా యువకుల్లా ఉన్నారు. పైగా రౌడీషీటర్లలా కర్రలు ఊపుతూ వస్తున్నారు. ఏమిటి సంగతి? ఏమై ఉంటుంది?

ఆపటమా వేగంగా వెళ్ళిపోవడమా?

ఆ ఊళ్ళో ట్యాక్సీ ఆపి టీ తాగడం తప్పా? అదే తనుచేసిన నేరమా? పోనీ తనను కాదనుకోవడానికి లేదు. తనముందు వెనకా మరేవాహనం లేదు. ఏమైంది వీళ్ళకి? ఎవరు వీళ్ళు...?

ఎవరైతే తనకేంటి... తనే తప్పు చేయనప్పుడు... అని అనుకుంటూ కారు స్లో చేశాడు. అప్పుడు... సరిగ్గా అప్పుడు జరిగిందో విచిత్రం. ట్యాక్సీ వెనక సీట్లోంచి నెమ్మదిగా పైకి లేస్తున్న ఆకారాన్ని చూసి ఝడుసుకుని కెవ్వున అరవబోయి నిభాయించుకున్నాడు.

చూడచక్కని ఓ అందమైన అమ్మాయి సీట్లో లేచి కూచుని భయంభయంగా తమని వెంబడిస్తున్న యువకుల్ని చూస్తోంది. సుమారు పాతికేళ్ళ వయసు ఉంటుందామెకి. గిల్లితే పాలుగారే చక్కని బుగ్గలు, పిరుదులు దాటే దట్టమైన నిడుపాటి జడ. అలాంటి జడవున్న అమ్మాయిలంటే కృతయుగ్‌కి భలే ఇష్టం.

ముఖం అటు తిప్పటంతో పూర్తిగా చూళ్ళేకపోతున్నాడు గాని చాలా అందమైన యువతి.

ఆమె తన ట్యాక్సీలోకి ఎలావచ్చింది, వాళ్ళు ఎందుకు తరుము కొస్తున్నారు? మధ్యలో తనకీ టెన్షనేమిటి ఏమీ అర్ధంగాక అయోమయంగా చూశాడు కృతయుగ్. ట్యాక్సీ ఆపాలా వద్దా అర్ధంకాలేదు.

"ఏయ్ ఎవరు నువ్వు? నా ట్యాక్సీ ఎందుకెక్కావ్?" కోపంతో అరిచాడు.

"ట్యాక్సీ గాబట్టి ఎక్కాను. నీ కిరాయి నీకిస్తాను. నోరు మూసుకుని త్వరగా పో" తల తిప్పకుండానే రఫ్‌గా బదులిచ్చిందామె.

"ట్యాక్సీ అయితే ఎక్కేస్తావా? నా పర్మిషనక్కర్లేదా" గద్దించాడు.

"టైమ్ వేస్ట్‌చేయకు. త్వరగా పోనీమంటున్నా గదా!" విసుక్కుందామె. ఆమె ధోరణి చూస్తుంటే – ఒళ్ళు మండింది కృతయుగ్‌కి.

"అమ్మాయిలు అందంగా ఉంటే చాలదు. కాస్త ధైర్యం కూడా ఉండాలి" అంటూ సర్రున ట్యాక్సీని రోడ్ సైడ్‌కి తీసి – సడెన్ బ్రేక్‌తో ఆపేశాడు.

అదిరిపడిందామె. భయంతో బిగుసుకుపోయింది. కళ్ళలోంచి దూకటానికి సిద్ధంగా ఉంది నీరు.

"ఇది న్యాయం కాదు. వాళ్ళు నన్ను బతకనిచ్చేలాలేరు. ప్లీజ్". చివరి ప్రయత్నంగా వేడుకుంది.

అవేమీ వినిపించుకోలేదతను. దురుసుగా కారు దిగి వెనకడోర్ వోపెన్‌చేసి పట్టుకున్నాడు.

సీరియస్‌గా ఆమెని చూశాడు. భుజాన చిన్న ఏర్‌బ్యాగ్ తప్ప – ఆమె వద్ద లగేజీ ఏమీ లేదు.

ఖరీదైన చుడీదార్ డ్రెస్‌లో అమ్మాయి మాత్రం చాలా అందంగా ఉంది. ఈమెను వాళ్ళెందుకు తరుముకొస్తున్నట్టు? అదీ బ్రాహ్మణ యువకులు. అతడి మనసులో అనేక ప్రశ్నలు పుట్టుకొస్తుండగా అనుమానంగా చూశాడు.

"ఏం చేశావ్? దొంగతనమా?" అడిగాడు.

విసుగ్గా నెత్తి కొట్టుకుందామె.

"నన్ను చూస్తే దొంగలా కన్పిస్తున్నానా?"

"నా ట్యాక్సీలో దొంగలా ఎక్కి కూచుని నన్నే దబాయిస్తున్నావ్. నిజం చెప్పు. మర్డర్ చేసి పారిపోయొస్తున్నావా?" గద్దించాడు.

"ఓరి దేవుడో. ఈ అనుమానపు పిశాచం చివరికి నన్ను హంతకురాలిని చేసేస్తున్నాడ్రా నాయనో. నువ్వే కాపాడు. నేనే మర్డరూ చేయలేదు.

వివరంగా చెప్పేటైమూలేదు. ట్యాక్సీ పోనీ వాళ్ళొచ్చేశారు" తిరిగి చూస్తూ భయంగా అరిచింది.

తల విదిలించి విసుగ్గా చూశాడు కృతయుగ్.

"ఏయ్. ముందు నువ్వు ట్యాక్సీ దిగు. మేటర్ సెటిల్ గాకుండా ట్యాక్సీ కదలదు. దిగు" హుంకరించాడు.

"ఊహు. నేను దిగను" అంటూ సీట్లో వెనక్కి జరిగిందామె. కోపంతో డోర్ ధడాలున మూసి – వచ్చిన వాళ్ళవైపు తిరిగాడు.

"రండయ్యారండి! ఈ అమ్మాయెవరో నాకు తెలీదు. నాకు తెలీకుండా ట్యాక్సీలో దాక్కుంది. ఇందులో నా తప్పేంలేదు. రండిరండి" అంటూ పిలిచాడు.

అప్పటికి ఆమెను తరుముతున్నవాళ్ళంతా అక్కడ బైక్‌లు దిగుతున్నారు. మొత్తం అయిదు బైక్‌లమీద తొమ్మిదిమంది వచ్చారు. బైక్‌లు దిగుతూనే కర్రలు ఝుళిపిస్తూ దురుసుగా దగ్గరకొచ్చేశారు.

"రండిరా. ట్యాక్సీలోంచి బయటకు లాగండిరా దాన్ని" అంటూ వాళ్ళలో కాస్త బక్కగావున్న యువకుడు మిగిలిన వాళ్ళకి ఆర్డర్ వేశాడు. ఒంటిమీద షర్టు లేదతడికి. నుదుట విభూదిరేఖలున్నాయి. ఆవేశంతో జంధ్యం పోగును రుద్దుతున్నాడు. ఆ మాట వింటూనే చట్టున అడ్డంగా నిలబడ్డాడు కృతయుగ్.

"హలో! రమ్మని పిలిచానుగాని, ఆ అమ్మాయిని మీకు వప్పగిస్తానని చెప్పలేదే. ముందు మేటరేమిటో చెప్పండి. ఆ పిల్ల తప్పుంటే నేను నాలుగు తగిలించి మీకు వప్పగించేస్తాను. తప్పులేదంటే... మీకు వప్పగించే ప్రసక్తే లేదు." నిష్కర్షగా తేల్చిచెప్పేశాడు.

"అడగవయ్యా. ఆ పిల్లనే అడుగు" వచ్చినవాళ్ళలో ఒకడు అరిచాడు.

"తను చెప్పడం లేదు... మీరే చెప్పాలి."

ట్యాక్సీలో యువతికి బయటి సంభాషణ వినపడుతూనే ఉంది. కృతయుగ్ మాట విని తేలిగ్గా ఊపిరి తీసుకుంది. తనను వప్పగించడన్న ధైర్యం ఏర్పడింది. ఈ లోపల – "మేం మాత్రం ఎందుకు చెప్పాలి?" అంటూ కోపంగా ప్రశ్నించాడు వంటిమీద చొక్కాలేని బక్క యువకుడు.

"అయినా మధ్యలో నీ పంచాయితీ ఏమిట్రా?"

"అవును. వాడితో మాటలేమిట్రా! దాన్ని ట్యాక్సీలోంచి బయటికి లాగండి. ఇంకోసారి అది మన అగ్రహారంలో అడుగుపెట్టకూడదు. తీసుకురండి" అంటూ మరొకడు వాడ్ని సపోర్ట్ చేశాడు.

"హలో! అనవసరంగా మీరు ఆవేశపడి టైమ్ వేస్ట్ చేయకండి. అసలేనాకు కాస్త తిక్క. తనూ చెప్పక మీరూ చెప్పక... నాకు మేటరెలా తెలుస్తుంది?" మర్యాదగా అడిగాడు కృతయుగ్.

"ఏయ్ ఇది నీకు సంబంధంలేని విషయం. నీకు మేటర్ తెలియాల్సిన అవసరం లేదు. పక్కకు తప్పుకోకపోతే నీకూ దేహశుద్ధితప్పదు" జంధ్యంపోగు రుద్దుకుంటున్న యువకుడు అసహనంగా అరిచాడు.

వాళ్ళధోరణి చూస్తుంటే మాటలతో వినరని కృతయుగ్‌కి అర్థమైపోయింది.

వెంటనే ఫ్రంట్ సీట్‌లోకి చేయి పెట్టి మూడడుగుల పొడవున్న ఐరన్‌రాడ్‌ని సర్రున బయటికి లాగాడు.

"నేను ముందే చెప్పాను. అసలేనాకు కాస్త తిక్క అని. అయినా మరోసారి హెచ్చరిస్తున్నాను. మీరు చూస్తే బ్రాహ్మణ యువకులు. అనవసరంగా బ్రహ్మహత్యా పాతకం ఎందుకని ఆలోచిస్తున్నాను.

మర్యాదగా మేటరేంటో చెప్పండి. ఆ పిల్ల చేసిన నేరం ఏమిటి?" మృదువుగా మరోసారి అడిగాడు.

"ఏందిరో? నువ్వు ఇనుపరాడ్ తీస్తే భయపడి పారిపోతామనుకున్నావా? చెప్పేది నీక్కాదూ? దారినపోయేవాడివి. నీకెందుకురా ఈ గొడవలు? చూస్తారేమిట్రా... దాన్ని లాక్కురమ్మన్నానా?" చొక్కాలేని యువకుడు బోర విరిచి ముందుకొస్తూ పెద్దగా అరిచాడు.

అంతటితో కృతయుగ్‌లో సహనం నశించింది. క్షణకాలంలో అతని పీకపుచ్చుకుని గడ్డిబొమ్మను లాగినట్టు లాగి ట్యాక్సీకి అదిమి ఇనపరాడ్‌ని గొంతుమీద ఉంచాడు. కెవ్వుమన్నాడతను. అది చూసి కర్రలులేపి పెద్దగా అరుస్తూ ముందుకు రాబోతున్న మిగిలిన వాళ్ళని కన్నెర్రచేశాడు.

"అడుగు ముందుకు వేశారంటే ముందు వీణ్ణి చంపేస్తాను. గో... గోబ్యాక్" అరిచాడు కృతయుగ్.

అతడి కళ్ళలోని కృతనిశ్చయం చూసి అదిరిపడ్డారు వాళ్ళు. అక్కడే ఆగిపోయి రెండడుగులు వెనక్కివేశారు. గొంతుమీద రాడ్ అదుముతుంటే ఊపిరాడక గింజుకుంటున్నాడు బక్కపీచు యువకుడు.

"కాసేపు ఇక్కడుంటే ఇక పాపపుణ్యాల గురించి ఆలోచించను. తలకాయలు పగిలిపోతాయి. వెంటనే వాళ్ళని తీసుకెళ్ళిపో." అంటూ అతని జబ్బపుచ్చుకుని విసిరేశాడు.

ఆ మాత్రానికే సుడిగాలికి చిక్కిన ఎండుటాకులా తిరుగుతూ వెళ్ళి మిగిలినవాళ్ళ కాళ్ళ దగ్గర పడ్డాడు.

ట్యాక్సీలోని యువతి జరుగుతున్నదంతా చూస్తూనే ఉంది. ట్యాక్సీ డ్రైవరు తనను వాళ్ళకు అప్పగించేస్తాడని మొదట చాలా భయపడింది. కాని అతడికాఉద్దేశం లేదని తెలీగానే ధైర్యం తెచ్చుకుంది. ఫరవాలేదు, మనిషేకాదు, మనసుకూడా మంచిదిలాగే ఉంది.

పైగా తొమ్మిదిమంది కట్టగట్టుకొచ్చినా నిలబెట్టేశాడంటే... మంచి దమ్మున్నవాడే అనుకొని... ముఖానికి పట్టిన చెమటలు తుడుచుకుంది.

ఈ లోపల – చేతిలో ఇనుపరాడ్‌తో అరివీర భయంకరుడిలా ఒక్కో అడుగు వేస్తూ ముందుకొస్తున్న కృతయుగ్‌ను చూడగానే వచ్చినవాళ్ళకి కాళ్ళలో వణుకుపుట్టింది. ఇనుపరాడ్‌ముందు కర్రలు ఎందుకూ కొరగావని తెలుసు. దాంతో వాళ్ళ ధైర్యం అణగారిపోగా కర్రలు అక్కడే పడేసి గిర్రున వెనుతిరిగారు.

బైక్‌లు స్టార్ట్ గావటంతో ఇక ఆశ వదులుకుని చొక్కాలేని వీరుడు కూడా చివ్వున లేచి పరుగెత్తి బైక్ ఎక్కేశాడు. అంతే – అయిదు బైక్‌లూ రివ్వున వెనుతిరిగి వచ్చినదారినే వెళ్ళిపోయాయి.

వాళ్ళు కనుమరుగు కాగానే వెనక్కి వచ్చి ఇనుపరాడ్‌ని ఫ్రంట్‌సీట్లో పడేసి వెనుక సీట్లోని యువతివంక చూశాడు కృతయుగ్.

"వాళ్ళు వెళ్ళిపోయారు. ఇక నువ్వు ట్యాక్సీదిగితే నా దారిన వెళ్ళిపోతాను" అన్నాడు.

"అసలేమనుకుంటున్నావ్ నువ్వు? నడిరోడ్డుమీద అదీ అటవీ ప్రాంతంలో... నన్నొంటరిగా వదిలేసి వెళ్ళిపోతానంటావేంటి? దిగనుగాక దిగను" సీట్లో ఆ చివరకు జరుగుతూ అంది.

పొరబాటున చేతికందితే బయటకు లాగేస్తాడని భయం. "చూడు ఇక్కడివరకూ తీసుకొచ్చినందుకు నేనేమీ నిన్ను ట్యాక్సీఫేర్ అడగటంలేదు. వాళ్ళు వెళ్ళిపోయారుగాబట్టి నీకొచ్చిన భయంలేదు. మర్యాదగా దిగు. నీ దారి నీది. నాదారి నాది"

"హలో! ఇది ట్యాక్సీనే గదా?"

"అవును"

"అద్దె ఎంతో చెప్పు ఇస్తాను. అంతేగాని దిగిపొమ్మని చెప్పకు" అంది ఆమె.

"ఎక్కడికెళ్ళాలి?"

"దంతెవారా"

"అప్పుడు కూడా ట్యాక్సీ కదలదు"

"ఎందుకు కదలదు? డబ్బులిస్తానన్నాగా?"

"నీ దగ్గర డబ్బులున్నాయో లేదో ఎవరికి తెలుసు?" కంకునూరులో ఏ వెధవ పనిచేసి పారిపోయొచ్చావో. మళ్ళీ పదిమంది నా ట్యాక్సీ వెనకపడితే నా పరిస్థితి ఏమిటి? వద్దు తల్లీ. నా ట్యాక్సీ వదిలెయ్."

"ఏయ్. తల్లీ పిల్లి అనకు మర్యాదగా ఉండదు" వేలెత్తి చూపించి హెచ్చరించింది.

దాంతో చిర్రెత్తుకొచ్చి ఆసహనంతో డోర్ తెరిచాడు కృతయుగ్. "ఏమిటి నీ ధీమా? నీకు మర్యాద కూడ తెలుసా? నిన్ను... లాగి బయటికి విసిరేస్తా చూడు" వంగి చేయి పట్టుకోబోయాడు. అందకుండా మరింత చివరకు జరిగిందామె.

"ఏమిటి అంత కోపం. ఆడపిల్లనని కూడా చూడకుండా బయటికిసి రేస్తావా! ఇప్పుడేమన్నానని? వయసులో వున్న కన్నెపిల్లని అలా తల్లీ అనొద్దు అన్నాను. అంతేకదా. ట్యాక్సీ పోనీ. నా దగ్గర డబ్బులున్నాయి. ఇస్తానన్నా గదా!" అంది బుంగమూతి పెట్టి.

తల కొట్టుకున్నాడు కృతయుగ్.

"ఛ! ఇవాళ ఎవరి ముఖం చూశానోగాని ఇలా బంకలా తగులుకున్నావ్. ట్యాక్సీ దిగు. నీకు దండం పెడతాను" చివరికి బ్రతిమాలుకోక తప్పలేదు.

ఆమె ముచ్చటగా నవ్వింది. "ఇదే మరి. ట్యాక్సీపోనీ. నీకు దండం పెడతానంటే పోనిచ్చావా? లేదు. ఇప్పుడు చూడు ట్యాక్సీ దిగమని నువ్వే నాకు దండం పెడుతున్నావు. ఇంతకీ ఏమిటి నీ సమస్య?

కంకునూరులో ఏం జరిగిందనేగా? రా, వచ్చి ట్యాక్సీలో కూచో, చెప్తాను. అది విన్నాకే ట్యాక్సీ స్టార్ట్ చేయొచ్చు. తొందరేం లేదు" అంది.

"సరి. అదీ చూద్దాం" అంటూ వెనక డోర్ మూసి డ్రైవింగ్‌సీట్లో కూచున్నాడు. ఆమె ఫ్రంట్‌సీట్లోకి అతడి కన్నా ముందే దూకేసింది.

"ఏమిటా దూకటం గతజన్మలో కోతివా?" డోర్ మూస్తూ విసుక్కున్నాడు.

"కాదులే. నేను ట్యాక్సీ దిగి ముందుసీట్లోకొచ్చేలోన నువ్వు వెళ్ళిపోతావని భయం. అందుకే సీటుమీంచి దూకేశాను." అంది నవ్వుతూ.

"సంతోషించాలే చెప్పు. ఏం జరిగిందసలు?"

"అదో పెద్ద కథ."

"పిట్టకథగా చెప్పు చాలు"

"నేనో పుస్తకం అడిగాను. డబ్బు కూడా ఇస్తానన్నాను. దానికే కోపం వచ్చింది వాళ్ళకి"

ఆమె మాటలు వినగానే జుత్తు పీక్కోవాలన్నంతగా పిచ్చికోపం ముంచు కొచ్చింది కృతయుగ్‌కి.

"ఓరి నాయనో. ఈ పిల్ల నా బుర్ర తినేస్తోందిరా దేవుడో. ఏయ్... నీకంటికి అంత వెంగళప్పలా కనబడుతున్నానా? పుస్తకం అడిగావా! వాళ్ళక్కోపం వచ్చిందా... నిన్నూ" అంటూ చేయెత్తాడు.

అది చూసి కంగారుగా "ఆగాగు. తొందరపడ్తావేం... పుస్తకం అంటే అది మామూలు పుస్తకంకాదు. తాళపత్ర గ్రంధం" అనరిచింది. అంతే! ఆశ్చర్యంతో షాకయ్యాడు కృతయుగ్. చటుక్కున చేయి దించేశాడు.

కృతయుగ్ ఊహించని విషయం ఇది. తాళపత్ర గ్రంధం అంటే ప్రాచీనగ్రంధం. తాటియాకుల మీద లిఖించబడ్డది. అలాంటి వాటిలో చాలా అమూల్యమైన విషయాలుంటాయంటారు.

ఇంతకీ ఈ తాళపత్ర గ్రంధంలో విషయం ఏమిటో, అందులో నిధుల రహస్యం ఏమన్నా దాగుందా, నిధుల గురించిన సమాచారం ఉందా! ఉండే వుంటుంది.

లేకపోతే ఈ అమ్మాయికి – ఆ తాళపత్ర గ్రంధం మీద – ఇంత ఇంట్రస్ట్ దేనికి? అతని ఆలోచనలు ఒక కొలిక్కి రాకముందే – "హలో! ఏమిట్రా అలా సైలెంటైపోయావ్?" అంటూ అడిగిందామె.

"ఏమంటున్నావ్? తాళపత్ర గ్రంధమా! అందులో ఏముంది?" కుతూహ లంగా అడిగాడు.

"నువ్వు ఊహిస్తున్నట్టు అందులో ఏమీ నిధినిక్షేపాల గురించి ఉండదు."

మరోసారి షాకయ్యాడు కృతయుగ్. తను వాటి గురించి ఊహించినట్టు – ఈ అమ్మాయికి ఎలా తెలుసు? "నేను వాటి గురించే ఊహించాను. నువ్వెలా కనిపెట్టావ్?" అడిగాడు.

"నీ ముఖం చూస్తే అర్ధమైందిలే"

"చాలా తెలివైనదానివే. సరి. విషయానికిరా. ఆ గ్రంధంలో ఏముంది?"

"అలా అడిగావ్ బాగుంది. దంతెవారా కోట వుంది గదా?" "ఉంది. అదెక్కడికి పోతుంది?"

"జోకులేయక చెప్పేది విను. ఆ కోటకి సంబంధించిన చారిత్రక ఆధారాలు చాలా మరుగున పడిపోయాయి. ఇక్కడి నుంచి పరిపాలించిన రాజవంశాల గురించి వారి చరిత్ర గురించి తెలిపే ఆధారాల్లేవు.

శిలాశాసనాలు కూడా గత యుద్ధాలతో నాశనమయ్యాయి. ఒకప్పుడు ఆ కోటలో ఆస్థాన పురోహితుడు రాజగురువుగా కంకుభట్టు అనే అగ్నిహోత్ర బ్రాహ్మణుడుండేవారు. ఆయనకు దానంగా ఇవ్వబడిందే కంకుభట్లవారి అగ్రహారం. అదే కాలక్రమంలో నేటి కంకునూరు గ్రామం అయింది.

ఆనాటి రాజకీయ సాంఘిక పరిస్థితులు, చుట్టుపక్కల రాజ్యాలకు వారు గ్రంధస్థం చేశారు.

ఆయన వంశీకులు ఇప్పటికీ కంకునూరులో నివసిస్తున్నారు. ఆ గ్రంధాన్ని పూజగదిలో ఉంచి దేవుడితోబాటు గ్రంధానికీ పూజలు చేస్తున్నారు.

అసలా గ్రంధాన్ని చదవాలన్నా ఇప్పటివాళ్ళకి సాధ్యంకాదు. నాకీ గ్రంధం గురించి తెలిసి దానికోసం చాలా ప్రయత్నించాను. ఇవాళ కూడా కంకునూరు అందుకే వచ్చాను. పదివేల రూపాయలు ఇస్తానని కావాలంటే గ్రంధాన్నీ నకలు తీసుకుని తిరిగి ఇస్తానని కూడా చెప్పాను. వాళ్ళకి కోపం వచ్చేసింది.

కంకుభట్ల వారి వంశీకులం, వంశపారంపర్యంగా వస్తున్న గ్రంధం. దాన్ని ఇమ్మంటావా. నువ్వు మళ్ళీ మా ఊళ్ళో అడుగుపెట్టకూడదు. నిన్ను చంపేస్తాం అంటూ తరుముకొచ్చారు. రోడ్డుమీదకు రాగానే నీ ట్యాక్సీ కన్పించింది. నక్కి కూర్చున్నాను."

"ఆగాగు" అంటూ ఆమె మాటలకి అడ్డం వచ్చేశాడు కృతయుగ్. "ఈ కాలం వాళ్ళు చదవలేని ఆ గ్రంధంతో నీకేంపని? దానికోసం అంత డబ్బు వెచ్చించాల్సిన అవసరం ఏమొచ్చింది? ఉపయోగం ఏమిటి?" ఆశ్చర్యాన్ని అణచుకుంటూ అడిగాడు.

"ఉపయోగం ఏమిటా!... అలా అనుకుంటే మనకి చారిత్రకాధారాలు ఎక్కడ్నుంచి వస్తాయి? శాసనాలు, తాళపత్ర గ్రంధాలే ఆధారం.

చిన్నప్పట్నుంచీ నాకు చరిత్రన్నా, చారిత్రకాధారాలు అన్నా చాలా ఇష్టం. నా చదువు కూడా ఆ దిశగానే సాగింది" అందామె.

"అంటే నువ్వు..."

"ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్లో భాషా విభాగంలో జూనియర్ ప్రొఫెసర్ని"

"ఓ మైగాడ్" అంటూ షాక్‌తో అలాగే చూస్తూండిపోయాడు కృతయుగ్.

"ఏమిటి నమ్మకం కుదరలేదా. ఐడెంటిటీ చూపించనా?" అంటూ హ్యాండ్‌బ్యాగ్ తెరవబోతుంటే ఆమెను వారించాడు.

"సో... పురాతత్త్వశాఖలో పనిచేస్తున్నావ్!" అడిగాడు. "అవును" "ప్రాచీన భాషలు... తెలుసా!"

"తెలుసు. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం ఇవి నాలుగూ ద్రవిడ భాషలు. ఒకే భాషాకుదురు నుంచి ఇవి ఆ యా భాషలుగా చీలిపోయాయి. దీనికి చాలాకాలం పట్టింది. అందుకే లిపి విషయంలో శాసనాలు, ప్రాచీన గ్రంధాల అక్షరాలు కాస్త కలగాపులగంగా ఉండి సామాన్యులకు అర్ధంకావు.

ఒకప్పుడు తెలుగులో వాడుకలో ఉన్న పదాలు ఇప్పుడులేవు. అంతేకాదు. ఒకే పదం ఒక భాషనుంచి మరోభాషలో వెళ్ళేసరికి అర్ధం మారిపోతుంది. నీకు అర్ధమయ్యేలా చెప్పాలంటే తెలుగులో ప్రమాదం అంటే యాక్సిడెంట్. అవునా?"

"అవును కదా!"

"ఇదే పదం తమిళంలోకి వెళ్ళేసరికి దీని అర్ధం ఏమిటో తెలుసా? చాలా బాగుంది అని, సో... దేశ కాల పరిస్థితుల్ని బట్టి లిపి, పదాల అర్ధాలు, వాడే సందర్భాలు, ఎన్నో మార్పులు చేర్పులకి గురవుతూ వచ్చాయి. కాబట్టి ఇప్పుడు వాటిని చదివి అర్ధం చేసుకోవాలంటే చాలా భాషాధ్యయనం చేయాలి.

ఇప్పుడు మనం చదువుతున్న తెలుగు అక్షరాల స్వరూపం ఆ కాలంలో ఇలా ఉండేదికాదు. నాకు తెలుగుతో బాటు దక్షిణాదిభాషలు ఇంకా సంస్కృతం, ప్రాకృతం, పాళీ, హిందీ, ఇంగ్లీషు ఇలా ఓ డజనుభాషలు వచ్చు" అంటూ చెప్పటం ఆపిందామె.

షాక్‌తో నోటమాట రాలేదు కృతయుగ్‌కి. ఆశ్చర్యంతో అలా చూస్తూండి పోయాడు. సాదాసీదా అమ్మాయిలో ఇంత టాలెంట్ ఉందా అన్పించింది.

ఒక్కక్షణం ఆగి-తిరిగి తన మాటల్ని పొడిగించింది.

"మా డిపార్ట్‌మెంట్ ద్వారా వచ్చే శాసనాల్ని ప్రాచీన గ్రంథాల్ని విశ్లేసించటంతోబాటు స్వయంగా కూడా పరిశోధించి డిపార్ట్‌మెంట్‌కి అంది స్తుంటాను.

నా తెలివితేటలు నిరూపించుకుంటేనే కదా నాకు మరింత ఉన్నత పదవి లభిస్తుంది?

ఆ ప్రయత్నంలో భాగంగానే కంకునూరులో తాళపత్ర గ్రంథంకోసం ప్రయత్నించి భంగపడ్డాను" అంటూ బాధగా నిట్టూర్చిందామె.

అసలు విషయం తెలిసి దిగ్భ్రాంతికి లోనయ్యాడు కృతయుగ్. ఒక్కసారిగా ఆమెపట్ల గౌరవం పెరిగింది. "బాప్ రే! నీ వద్ద ఇంత విషయం ఉందా! నేనస్సలు ఊహించలేదు. సారీ మేడం. అయాం వెరి వెరి సారీ" అన్నాడు కృతయుగ్.

"ఏయ్. ఉన్నట్టుండి ఏమైంది నీకు? సారీ దేనికి?"

"ఇంకా దేనికి అంటారేమిటి మేడం. నేనో ఫూల్‌ని. మీరేదో మామూలు అమ్మాయనుకుని నోటికొచ్చింది వాగేశాను. అవేమీ మనసులో పెట్టుకోవద్దు."

"పెట్టుకోనులే" అందామె.

"ఇంతకీ మీ పేరేమిటో చెప్పలేదు మేడం"

"చెప్పను"

"అయ్యో... అలాంటి పేరు కూడ ఒకటుందా?"

"ఎలాంటి పేరు?"

"అదేనండి 'చెప్పను' అన్నారుగా"

"స్టుపిడ్. దటీజ్ నాట్ మై నేమ్" అంది నవ్వుతూ.

"మీరలా ఇంగ్లీష్‌లో మాట్లాడితే నాకేం అర్థమైచావదుగాని తెలుగులో చెప్పండి"

"నీ పేరు చెప్పు"

"కృతయుగ్"

"నైస్ నేమ్. ఏం చదువుకున్నావ్?"

"అయిదో తరగతి"

"వ్వాట్?"

"అవునండి. మా ఊళ్ళో అదే ఎక్కువ. ఏదో బతుకు తెరువు కోసం ట్యాక్సీ తోలుకుంటున్నాను. నా సంగతి వదిలేయండి మేడమ్. మీ పేరు చెప్పండి."

"అవునూ ఉన్నట్టుండి ఈ మర్యాదేమిటి?"

"అప్పుడంటే మీరెవరో తెలీక అన్నామండి, అవన్నీ పట్టించుకుంటే ఎలా? మీ చదువుకీ, మీ ఉద్యోగానికీ మర్యాదివ్వాలిగా... అదన్నమాట"

"సో... జ్ఞానోదయమైంది నీకు. కీపిటప్. ట్యాక్సీపోనీ"

"మీ పేరు చెప్పలేదు"

"స్నిగ్ధ"

"వామ్మో... మీరే అర్థంకాలేదంటే మీ పేరుకూడా అర్థంగాకుండా పోవాలా, అసలే నా నాలుక కొంచెం మందం. పలకలేనేమో"

"ట్రై చెయ్ వస్తుంది" అంది నవ్వుతూ.

"వద్దులెండి. ఎంచక్కా మేడం అంటే సింపుల్‌గా ఉంటుంది. ఇంతకీ మనం ట్యాక్సీ ఫేర్ మాట్లాడుకోలేదు"

"ఈ రోజంతా నాతో ఉంటున్నావ్. ఎంత కావాలి?"

"నేను ట్యాక్సీ డ్రైవర్నేకాదు, టూరిస్ట్ గైడ్‌నికూడా. సో రెంటికీ ఓ ఐదువేలివ్వండి"

"ఓ.కె. నువ్వడిగినంత ఇస్తాను. ఇంద మూడువేలు అడ్వాన్స్" అంటూ మూడువేలు చేతిలో ఉంచింది. కాదనకుండా క్యాష్ జేబులో ఉంచుకుని ట్యాక్సీ స్టార్ట్‌చేశాడు. హైవేలో మెత్తగా దూసుకుపోతోంది ట్యాక్సీ. అటు ఇటు కొండలు, అడవి, పచ్చదనం కనువిందుచేస్తున్నాయి.

అటు విశాఖ మన్యం ప్రాంతం, పాడేరు ప్రాంతం అడవులు ఇటు ఛత్తీస్‌ఘర్ లోతట్టు ప్రాంతాల వరకు విస్తరించి ఉన్నాయి.

సరిహద్దునుంచి సుమారు నూట ఎనభై కిలోమీటర్ల దూరంలో ఉంది దంతెవారా సిటీ. దారిలో చిన్న చిన్న పల్లెలు, గ్రామాలు వెనక్కిపోతున్నాయి. ఇవాళ ట్రాఫిక్ తక్కువగానే ఉంది.

ఎగువన రోడ్డుమీదకు వస్తున్న ఆలమందను గమనించి బిగ్గరగా హారన్ కొడుతూ– వాటి సమీపంలోకి కారును పోనిచ్చాడు. ఐనా నదురూ బెదురూ లేకుండా మంద మొత్తం రోడ్డుమీద తిష్టవేసింది.

కొన్ని పడుకుని నెమరువేస్తుంటే కొన్ని నిలబడి దిక్కులుచూస్తున్నాయి. కొన్ని కోపంతో గుర్రుగా ట్యాక్సీ వంక చూస్తున్నాయి. "వద్దు. దగ్గరకు పోవద్దు" గాభరాగా అరిచింది స్నిగ్ధ. "ఏం ఫరవాలేదు".

"వద్దంటున్నానా! వాటిని చూడు. ఎలా చూస్తున్నాయో. వాటితో మనకి గొడవలొద్దు".

"ఓ.కె. మీరు భయపడుతున్నారు గాబట్టి ఆగిపోతున్నాను" అంటూ ట్యాక్సీని రివర్స్‌లో కొంతదూరం వెనక్కి తీసుకొని వచ్చి అక్కడ ఆపాడు కృతయుగ్.

ఈలోపల అటునుంచి వచ్చే కొన్ని లారీలు కార్లు ఇటునుంచి కొన్ని వాహనాలు వచ్చి అటు ఇటు ఆగిపోయి హారన్లు కొడుతూ వాటిని బెదిరించే

ప్రయత్నాలు ఆరంభించాయి. అవేమీ పట్టించుకోకుండా రిలాక్స్‌గా సీట్‌కి జేరబడుతూ సైడ్ మిర్రర్‌లోంచి వెనక్కి దృష్టి సారించాడు కృతయుగ్.

అక్కడికి మూడు వందల గజాలదూరంలో ఎగువన నిలిచి ఉంది రెడ్ కలర్ ఓల్డ్ ఫియట్ కారొకటి.

కంకునూరు నుంచి బయలుదేరినప్పుడు ఆ కారు తన వెనుకలేదు. బ్రాహ్మణ యువకులతో గొడవపడుతున్నప్పుడు ఇలాగే ఎగువన ఆగుంది. అప్పుడు దాని గురించి తను పట్టించుకోలేదు.

అయితే అక్కడినుంచి కదిలాక ఆ కారు ఎడంగా తమని ఫాలో అవటం గమనించాడు.

ఎవరు వాళ్ళు. ఎందుకు తన కారు వెంటపడ్డారు? ఆ కారులో ఎవరున్నారో, ఎందరున్నారో కూడా తెలీదు.

ఎందుకు తన ట్యాక్సీ వెంట పడుతుందో తెలీదు.

వాళ్ళు అటాక్‌చేసే ఉద్దేశంతో వచ్చుంటే ఎక్కడోచోట అటాక్ జరిపేవాళ్ళు. కాని అలా చేయటం లేదు. దూరంగా ఆగిపోయి వాచ్ చేస్తున్నారు ఎందుకు? తీవ్రంగా ఆలోచిస్తున్నాడు కృతయుగ్.

ఒకవేళ వాళ్ళు ఫాలో చేస్తున్నది స్నిగ్ధ కోసం కాదు గదా! ఈ ఆలోచన రాగానే ఉలిక్కిపడి నిటారుగా కూర్చున్నాడు కృతయుగ్.

"ఏమైంది?" అతడ్నే గమనిస్తూ అడిగింది స్నిగ్ధ.

"ఏమైంది? ఏమీ కాలేదుగా" అన్నాడు నవ్వుతూ. అతడి చూపులు సైడ్ మిర్రర్‌మీదే వున్నాయి.

"లేదు లేదు. నువ్వేదో దాస్తున్నావ్. ఆ విషయం నీ ముఖంలో తెలుస్తోంది"

"అయితే ముఖం దాచేసుకోమంటావా? ఏమీ లేదంటున్నాగా"

"అంతేనా? ఓ.కె." అంటూ ముఖం తిప్పుకుంది.

"అలిగింది చాలుగాని మేడం నాకో సంగతి చెప్తారా?" స్టీరింగ్ మీద చేతులతో తాళం వేస్తూ అడిగాడు.

"ఏ విషయం?"

"మీరు ఎక్కడ్నుంచి వస్తున్నారు?"

"హైదరాబాద్ నుంచి"

"కంకునూరు వరకు ఎలా వచ్చారు?"

"భద్రాచలంరోడ్ వరకు ట్రైన్ మార్గంలో వచ్చి అక్కడ్నుంచి బస్సులు, ఆటోలు మారుతూ వచ్చాను. ఎందుకలా అడిగావ్?"

"ఏం లేదులే" అంతకుమించి ఏమీ చెప్పలేదు కృతయుగ్. అలాగని ఆ రెడ్‌ఫియట్ గురించి ఆమెను అడగాలని కూడా అనుకోలేదు. ఎందుకంటే వాళ్ళు ఫాలో చేస్తున్నది తన ట్యాక్సీనా లేక స్నిగ్ధనా అనేది స్పష్టంగా తెలీకుండా ఆమెను విచారించటమో, హెచ్చరించటమో మంచిది కాదనిపించింది.

ఒకవేళ ఆమెనే వాళ్ళు ఫాలో చేసేట్టయితే వాళ్ళు ఎక్కడ్నుంచి వస్తున్నారు? హైదరాబాద్ నుంచే అయితే ఆమెతోబాటు రైల్లోనే వచ్చేవారు.

కారులో వస్తున్నారంటే... ఒకవేళ ఆమె అందం చూసి కిడ్నాప్ చేసేందుకు వస్తున్న దుండగులు కాదు గదా! తనకయితే వాళ్ళు వస్తోంది ఖచ్చితంగా ఆమె కోసమే అన్పిస్తోంది.

తనకోసం వచ్చే వెధవలెవరూ ఉండరు. ఎందుకంటే తనతో పెట్టుకుంటే ఫలితం ఎంత దారుణంగా ఉంటుందో తన పరిచయస్తులందరికీ తెలుసు.

కళ్ళు మూసుకుని ఆలోచిస్తూ చాలాసేపు అలాగే ఉండిపోయాడు. ఆలోచనలమధ్య ఆలమంద రోడ్డు వదిలి అడవిలోకిపోవటం, ట్రాఫిక్ మూవ్ కావటం అతడికి తెలీదు. స్నిగ్ధ అసహనంగా అతడ్ని తట్టింది.

"ఏమిటి? నిద్రపోతున్నావా? పోదాం పద" అంది విసుగ్గా. సైడ్ మిర్రర్‌లోకి చూశాడు కృతయుగ్. వాహనాలన్నీ కదులుతున్నా ఆ కారు నిశ్శబ్దంగా అక్కడే ఉంది. వాళ్ళు ఎంతసేపు అక్కడ ఉంటారో చూడాలనిపించింది. డోర్ తెరుచుకుని దిగాడు.

"ఒక్క నిముషం మేడమ్. ఇంజన్ చెక్ చేయాలి" అంటూ కారు బోనెట్ తెరిచి ఇంజన్ చెక్ చేయనారంభించాడు.

"ఏమైంది? ఇంతసేపూ బాగానే వుందిగా" కారు దిగివస్తూ విసుగ్గా అడిగిందామె.

ఆమె ప్రశ్నకు బదులివ్వకుండా– ఎగువకుచూశాడు. తాము ఇక్కడినుంచి కదిలేవరకు ముందుకువచ్చే ఉద్దేశం వాళ్ళకి లేనట్టుంది. స్థిరంగా అక్కడే ఉందాకారు. ఒక్కరూ కిందకు దిగలేదు.

"ఏమిటి? స్టార్ట్ కాదా? ట్రాఫిక్ క్లియరైపోయింది. వెళ్దామా?" అసహనంగా అడిగింది.

"ఫైవ్ మినిట్స్ మేడం"

"ఛ! డొక్కు కార్లను నమ్ముకుంటే ఇలాగే వుంటుంది. ట్యాక్సీ తిప్పేవాడివి, కాస్త మంచికారు కొనుక్కోవచ్చుగా?" కోప్పడింది.

"హలో! ఈ డొక్కుకారే ఆపదలో మిమ్మల్ని కాపాడింది. మర్చిపోయారా? ఓల్డీజ్ గోల్డ్ అన్నారు.

ఇది నా గోల్డ్. మా కుటుంబాన్ని పోషిస్తోంది. దయచేసి దీన్నేమీ అనకండి. కార్లో కూర్చోండి వచ్చేస్తున్నాను" అన్నాడు బోనెట్ మూస్తూ.

ఓ సారి అతడ్ని గుర్రుగా చూసి– కార్లో కూచుంది స్నిగ్ధ. కృతయుగ్ కార్ స్టార్ట్ చేశాడు.

అంబాసిడర్ మూవ్ కాగానే ఎగువన ఎర్ర ఫియట్ కూడా మూవయింది. ఇంత జరుగుతున్నా స్నిగ్ధకు ఏమీ తెలీదు. అనవసరంగా ప్రయాణం ఆగిందని ఆమె కోపం. దానికి ఆకలి కూడా తోడయింది. ఉదయం నుంచీ ఆమె ఏమీ తినలేదన్న సంగతి కృతయుగ్‌కి తెలీదు. అతడి ఆలోచన ఒక్కటే.

ఆ ఫియట్ కారు వ్యవహారం ఏమిటో తెలుసుకోవటం ఎలా? కారు ఆపి వాళ్ళతో గొడవపడ్డం మంచిదా లేక స్లిప్ ఇచ్చి ఆ కారును వదిలించుకుని వెళ్ళిపోవడం మంచిదా! తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

వాళ్ళు తనను ఓవర్‌టేక్ చేసి వెళ్తారా లేదా చూడాలని స్లోగా పోనిస్తున్నాడు.

ఆ సంగతి గమనించింది స్నిగ్ధ.

"ఏమైందిరా నీకు? ఎందుకు కారు స్లోచేశావ్? ఉదయం నుంచీ ఏమీ తినలేదు. ఆకలిగా ఉంది. త్వరగా పోనీ నీకు పుణ్యం ఉంటుంది" వేడుకుంది.

ఆశ్చర్యంగా చూశాడు. "ఆ మాట ముందే చెప్పొచ్చుగా మేడం" అంటూ కారు డాష్‌బోర్డు తెరిచి అందులోంచి ఒక ఆపిలు, మూడు అరటిపళ్ళు, టీఫ్లాస్కు తీసి ఆమె పక్కన ఉంచాడు.

"టైమ్ పదకొండు దాటింది. ఏకంగా భోంచేయొచ్చు. ప్రస్తుతానికి ఇవి లాగించండి" అంటూ కారువేగం పెంచాడు. ఆమెకు చాలా సంతోషం కలిగింది.

"థ్యాంక్స్ నాలాగే నువ్వూ తిండిపోతువని, ఇవన్నీ వెంట తెచ్చుకుంటావని నాకేం తెలుసు? తెలిస్తే ముందే అడిగేదాన్ని?" అంటూ ఆపిల్ అందుకుంది.

"మీ కాంప్లిమెంట్స్‌కి థ్యాంక్స్ మేడమ్. బట్ నేనేమీ తిండిపోతుని కాదు. నా ట్యాక్సీ ఎక్కే ఆకలిరాయుళ్ళ కోసం స్టోర్ చేస్తాను. వీటికి ఛార్జ్ చేయన్లే"

"సంతోషించాంలే"

తన కారు స్లో చేస్తే ఆ రెడ్‌ఫియట్ కూడా స్లో అవుతోంది. స్పీడ్ పెంచితే అదీ స్పీడ్‌గా వస్తోంది.

సుమారు రెండు ఫర్లాంగుల దూరం ఎడంగా ఫాలో అవుతూనే ఉందది. వాళ్ళ ధోరణి చూస్తే ఒళ్ళు మండుతోంది కృతయుగ్‌కి.

మొదటవాళ్ళకి స్లిప్ ఇవ్వాలనుకున్నాడు. కాని వెంటనే ఆ ఉద్దేశం విరమించుకున్నాడు. వాళ్ళు ఎవరో తెలుసుకోవడం చాలా ముఖ్యం అన్పించింది. సమయం కోసం వెయిట్ చేస్తూ కారు వేగంగా పోనిస్తున్నాడు కృతయుగ్.

ఈ లోపల అరటిపళ్ళు, ఆపిలు లాగించేసి కాఫీ తాగి మగతగా నిద్రలోకి జారుకుంది స్నిగ్ధ.

అర్ధగంట ప్రయాణం తర్వాత కృతయుగ్ ఎదురు చూసిన చోటు వచ్చింది. అక్కడ రోడ్డు స్ట్రెయిట్‌గా లేకుండా పాము మెలికల్లా వంపులు తిరుగుతూపోతోంది. వెనుక వాళ్ళకి ముందు బళ్ళు కన్పించవు.

ఒక మలుపు తిరగ్గానే కారుని సర్రున రోడ్డు పక్క పొదలు, చెట్ల వెనక్కు పోనిచ్చి ఇంజన్ ఆపేశాడు. అదటుకు నిద్రలేచి ఆశ్చర్యంగా చూసింది స్నిగ్ధ. ఏం జరుగుతోందీ అర్థం కాలేదామెకు.

భయం భయంగా చూసింది. చెట్లమధ్యలో తెచ్చి కారాపాడంటే... ఏదన్నా పాడు ఆలోచనలో వున్నాడా... వీడిక్కడ తననేం చేసినా అడిగే దిక్కులేదు.

ఆమె పరిస్థితి అర్థంచేసుకుని– తేలిగ్గా నవ్వాడు కృతయుగ్. "అనవసరంగా భయపడకండి మేడమ్. నేనలాంటివాడ్నికాను. మీకొచ్చిన భయంలేదు"

"ఏం జరుగుతోంది?" ధైర్యాన్ని కూడగట్టుకుంటూ అడిగింది స్నిగ్ధ.

"కంగారు పడాల్సిందేమీ లేదు. రెడ్ ఫియట్ కారొకటి మనల్ని ఫాలో అవుతోంది. విషయం ఏమిటో తెలుసుకుందామని చిన్న ట్రిక్ ప్లే చేశాను. ఆ కారు మనల్ని దాటిపోతే మనం వెళదాం" అన్నాడు.

స్నిగ్ధకు అర్థంగాక అయోమయంగా చూసింది. అంతలో రోడ్డువెంట ఫియట్‌కారు వెళ్తోన్న సౌండ్ విన్పించింది. అది చాలా వేగంగా దూసుకెళ్తోంది.

"ఎవరు వాళ్ళు? మనల్ని ఎందుకు ఫాలో చేస్తున్నారు?" గాబరా చెందుతూ అడిగింది.

ఆమె భయం ఆమెది. కంకునూరు యువకులు మరి కొంతమందితో తనకోసం వెదుకుతూ వస్తున్నారేమోనని గాబరాపడుతోంది.

"ఆ విషయాలు తెలుసుకోవాలనే ఆగాను. ఇప్పుడు చూడు. మనం వాళ్ళ వెనకపడతాం" అంటూ కారు స్టార్ట్ చేశాడు కృతయుగ్. ట్యాక్సీ హైవేలోకి

ఎక్కి వేగం పుంజుకుంది. ఎగువన మలుపు తిరుగుతూ కన్పించింది ఫియట్ కారు.

పది మలుపులు తిరిగి ఒక కొండ పాదం దాటగానే గీత గీచినట్టు స్ట్రెయిట్‌గా కన్పించింది రోడ్డు. ఒక చోట చెట్టునీడన కన్పించింది రెడ్ ఫియట్.

ఎగువన ట్యాక్సీ కనపడకపోయేసరికి తాము మోసపోయినట్టు గ్రహించి ఉండాలి. అందుకే చెట్టునీడన కారాపి కూర్చున్నారు.

"మనల్ని ఫాలో చేస్తోంది ఈ కారేనా?" అడిగింది స్నిగ్ధ. "అవును" కారుని గమనిస్తూ చెప్పాడు.

ఆ కారుకి చుట్టూ నల్లద్దాలు బిగించి వున్నాయి. కారులో ఎవరున్నారో కన్పించడం లేదు. కారును దాటి వందగజాలు ముందుకెళ్ళగానే సడెన్ బ్రేక్‌తో కారు ఆపాడు కృతయుగ్.

"మీరు కార్లోనే ఉండండి మేడమ్. నేను విషయం ఏమిటో తెలుసు కొస్తాను" అంటూ కారు దిగాడు.

"ఏయ్ జాగ్రత్త. వాళ్ళెవరో ఏమిటో" వెనక నుంచి హెచ్చరించింది స్నిగ్ధ.

"వాళ్ళెవరయినా ఈ రోజు నా చేతిలో అయిపోయారే... తమాషా చేస్తున్నారు రాస్కెల్స్" అంటూ పెద్ద పెద్ద అంగలతో ఫియట్ కారువైపు నడిచాడు.

లెక్క ప్రకారం తనను చూడగానే- ఎవరో ఒకరు కారు దిగాలి. కాని అలాంటిసూచన ఏదీ లేదు. తుఫాను ముందు ప్రశాంతతలా, ఉప్పెన ముందు సముద్రంలా మౌనంగా నిలబడుందా కారు. వడివడిగా వెళ్ళి డ్రైవర్ డోర్‌పక్కన నిలబడి దబదబ చప్పుడుచేశాడు. "లోన ఎవరు? కమవుట్. ఓపెన్‌ది డోర్" అనరిచాడు.

క్లిక్‌మంది డోర్. కాస్త వెనక్కుజరిగి నిలబడ్డాడు. ఎవరు బయటికొచ్చినా- ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాడు. పిడికిళ్ళుబిగించి- ఆతృతగా చూస్తున్నాడు. డోర్ కొద్దిగా తెరుచుకుంది.

దాంతోబాటే మృదువుగా గాజుల చప్పుడు. మువ్వల పట్టీల అలికిడి. వింటూనే అతడి ఆవేశం మీద నీళ్ళు చిలకరించినట్టయింది. కృతయుగ్‌కి పెద్ద షాక్.

డామిట్... కారులో దుండగులు ఎవరో ఉంటారనుకుంటే లేడీస్ ఏమిటి? కొంపదీసి కారు మారిపోయిందా! లేదే అదే నంబరు. అదే కారు.

విప్పారిన కళ్ళతో అతడు అలా చూస్తూండగానే కారు డోర్ బార్లా తెరుచుకుంది. బాటా చెప్పులతోకూడిన నాజూకుపాదం ఒకటి ముందుగా నేలను

తాకింది. ఆ వెనకే నెమలికన్నుల చీర కట్టిన నీలిమబ్బులాంటి లతాంగి కారు దిగి విలాసంగా కారుకు జేరబడి నిలబడి నవ్వుతూ "హలో!" అంది.

కృతయుగ్‌కి ఒకింత షాక్. ఒకింత కన్ఫ్యూజన్. ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో అర్థం కాలేదు. అసలు తను ఊహించిందేమిటి, ఎదురుగా జరుగుతున్నదేమిటి? అక్కడికీ సందేహంతీరక తొంగి చూశాడు. కారులో ఎవరూ లేరు.

ఆమె సింగిల్‌గానే వస్తోంది. ఎవరీమె? ఎందుకు ఫాలో చేస్తోంది? కలర్ కాస్త తక్కువైనా మనిషి చాలా అందంగా ఉంది. సాంప్రదాయంగా చీరకట్టినా చాలా అల్ట్రా మోడరన్‌గా ఉంది.

జబ్బల నునుపు కనిపించేలా జాకెట్టు, నాజూకైన నడుము, లోతైన బొడ్డు, షేపులు తెలిసేలా మక్కెల మీద చీరకట్టు, బాబ్డ్ హెయిర్, కూలింగ్ గ్లాసెస్ షోకేస్‌లో బొమ్మలా చాలా అందంగా ఉంది.

స్నిగ్ధ కూడా చాలా అందంగా ఉంది. కాని ఆమెకు, ఈమెకు ఒక తేడా ఉంది. స్నిగ్ధ అందం చూడముచ్చటగా, సాంప్రదాయంగా ఉంటే, ఈమె అందం మగాడ్ని కవ్వించి రెచ్చగొట్టేలా వుంది.

"ఎవరు నువ్వు?" సూటిగా అడిగాడు.

"అయాం ముగ్ధ" కళ్ళజోడు తీసి ముఖంలోకి చూస్తూ బదులిచ్చిందామె.

గాలికి చెదరి ముఖంమీద అల్లరి చేస్తున్న జుత్తును మాటిమాటికీ సవరించుకోవటం ఆమె అలవాటు కావచ్చు. కాని అదో స్టయిల్‌గా ఉంది.

ఆమె కళ్ళు విశాలంగా, చాలా అందంగా ఉన్నాయి. కాని ఆ కళ్ళలో సంచలత్వం ఉంది. సూదంటురాయి లాంటి ఆకర్షణ ఉంది. మగాడు ఆ కళ్ళలో కళ్ళు పెట్టి చూస్తే– మాడి మసైపోవాల్సిందే.

అంత మత్తుగా సెక్సీగా వున్న కళ్ళను ఇంత వరకు చూళ్ళేదు కృతయుగ్. అంతే కాదు. ఆమె పైట చాటున చిన్న సైజు కొండల్లా ఒదిగిన ఆమె పరువాల పొంగులు మగాడి మతి తప్పిస్తాయంటే ఆశ్చర్యంలేదు.

"హలో! నువ్వు ముగ్ధవయితే ఏమి, ముద్దబంతివయితే నాకేమి. ఎవర్నువ్వు? ఎందుకు నా ట్యాక్సీని ఫాలో చేస్తున్నావ్?" కోపంగా అడిగాడు.

"ఊహించు. నీకే అర్థమవుతుంది!" కొంటె నవ్వు నవ్వింది.

"అంత అవసరం నాకు లేదు. మర్యాదగా నిజం చెప్పు" అన్నాడు కృతయుగ్.

"యూ సీ! ఒక పడుచుపిల్ల ఒక చాకులాంటి కుర్రాడి వెంట ఎందుకు పడుతుంది? ఆ మాత్రం ఊహించలేవా?"

"పజిల్స్ వేయకు. నాకసలే కోపం ఎక్కువ. నా ట్యాక్సీనెందుకు ఫాలోచేస్తున్నావ్.?"

"ఇంకా అర్థంకాలేదా? ఏ కాలం కుర్రాడివిరా. యస్. నేను నిన్ను ఫాలోచేస్తున్నాను.

బికాజ్ ఐ....లవ్....యూ!"

"వ్వాట్?"

"ఐ లవ్ యూ...."

"హే భగవాన్" అంటూ పిచ్చిగా నుదురు కొట్టుకున్నాడు కృతయుగ్.

"ఆల్రెడీ ట్యాక్సీలో ఓ పిచ్చిదుంది. దాంతోనే వేగలేక ఛస్తుంటే నువ్వు వేరేనా. చూడు నన్ను అనవసరంగా కన్ఫ్యూజ్ చేయకు. నువ్వెవరో నాకు తెలీదు. నీకూ నాకూ లవ్వేమిటి? నిజం చెప్పు. ఎందుకు ఫాలోచేస్తున్నావ్?" గద్దించాడు.

ముసిముసి నవ్వులు నవ్వుతూ-దిక్కులు చూస్తూ నిలబడిందామె. అతడి ప్రశ్నకు బదులివ్వలేదు.

ఈ లోపల- అక్కడ ట్యాక్సీలో ఉన్న స్నిగ్ధకి చెప్పరానంత టెన్షన్‌గా ఉంది. వాళ్ళిద్దర్నీ గమనిస్తూనే ఉంది. మాటలు వినబడక అనీజీగా ఫీలయింది.

ఇక ఆత్రుత ఆపుకోలేక ట్యాక్సీ స్టార్ట్ చేసి రివర్స్‌లో కృతయుగ్ పక్కకు తీసుకొచ్చి ఆపింది.

"మాట్లాడవేం? ఎందుకు ఫాలో చేస్తున్నావ్?" గద్దించాడు కృతయుగ్.

విసుగ్గా చూసింది ముగ్ధ. "మళ్ళీమళ్ళీ చెప్పాలా? ఎన్నిసార్లు చెప్పాల్రా నీకు? ఒక్కసారి చెప్తే అర్థంకాదా? నువ్వు గమనించలేదు గాని ఎన్ని రోజులుగా నిన్ను ఫాలో చేస్తున్నానో తెలుసా?"

"ఫాలోచేసి ఏం తెలుసుకున్నావ్?"

"నీ పేరు కృతయుగ్. ట్యాక్సీ ఓనర్‌కమ్ డ్రైవర్‌వి. టూరిస్ట్‌గైడ్‌వి కూడా. సొంత ఊరు భద్రాచలం.

ఎందరో టూరిస్ట్‌లను తిప్పుతుంటావ్‌గాబట్టి నీకు నేను గుర్తులేను.

గతనెల్లో మేం అమ్మాయిలం కోట చూడ్డానికొచ్చినప్పుడు మొదటిసారిగా నిన్ను చూసి లవ్‌లో పడిపోయాను. అప్పుడు మా గైడ్ కూడా నువ్వే.

ఈ వివరాలు చాలా ఇంకా చెప్పాలా? ఇప్పుడు కూడా వెంటపడేదాన్ని కాదు. ఎవరో అమ్మాయితో నువ్వు ట్యాక్సీలో రావడంచూసి, మీ మధ్య ఏం నడుస్తోందో అర్థంగాక ఇలా వెంటపడ్డాను. తప్పయితే సారీ. బట్ నువ్వంటే చచ్చేంత ప్రేమ. అది మర్చిపోకు" అంది.

ట్యాక్సీ దిగిన స్నిగ్ధ–మౌనంగా ప్రేక్షకురాలిగా నిలబడిపోయింది. ఆ కారులో తన కోసం ఎవరన్నా వస్తున్నారేమోనని మొదట భయపడింది.

కాని కారులో ఉన్నది ఎవరో అమ్మాయని తెలీగానే తేలిగ్గా ఊపిరితీసుకుంది. అయితే వాళ్ళమాటలు వినాలని ట్యాక్సీని వెనక్కి తీసుకొచ్చింది.

ఆ అమ్మాయి అతడ్ని లవ్ చేస్తోందని వినగానే తనిక మాట్లాడవలసిందేమీ లేదని మౌనం వహించింది.

కృతయుగ్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఆమె చెప్పింది కరెక్టేగాని ఆ మాటలు–ఎంత వరకు నమ్మొచ్చో తెలీదు. "ఏ ఊరు నీది?" ఆలోచనల నుండి బయటపడుతూ అడిగాడు.

"మీ భద్రాచలం మాత్రం కాదు" అంది నవ్వుతూ.

"విసిగించక ఊరు పేరు చెప్పు"

"చెర్ల" "చెర్ల నుంచి సరిహద్దు దాటి నన్ను ఫాలో చేస్తున్నావా? నేన్నమ్మను. కంకునూరు అవతల నీ కారు నాకంట పడలేదు"

"ఎందుకు పడుతుంది? రాత్రి కంకునూరులో మా బంధువులింట్లో ఉన్నాను. ఉదయం ఆమె నీ ట్యాక్సీలో దాక్కోవడం చూసి ఫాలో అయ్యాను.

అయినా ఏమిటి నీ ఉద్దేశ్యం. నిన్ను లవ్‌చేస్తున్న అమ్మాయిని ఇలాగేనా ప్రశ్నలతో వేధించేది? మనసులో మాట చెప్పాక కూడా ఐ లవ్ యూ అని చెప్పలేవా? ఆమె ఎవరు? నిన్ను లవ్ చేస్తోందా?" అంది స్నిగ్ధను చూపిస్తూ.

అప్పుడు పెదవి విప్పింది స్నిగ్ధ.

"ఏయ్... అనవసరంగా మీ మధ్యకు నన్ను లాగొద్దు. నువ్వనుకుంటున్నట్టు మా మధ్య ఎలాంటి సంబంధం లేదు. నేను టూరిస్ట్‌ని అంతే" అంది.

సీరియస్‌గా చూశాడు ముగ్ధ వంక కృతయుగ్.

"విన్నావ్‌గా? ఆమె నా టూరిస్ట్ కస్టమర్. మా గురించి పిచ్చిపిచ్చిగా ఆలోచించకు. అంతేకాదు ఇంకెప్పుడూ నా కంటపడే ప్రయత్నం చేయకు.

నువ్వు ప్రేమించినా నిన్ను ప్రేమించేంత తీరిక నాకు లేదు. మరోసారి నా ట్యాక్సీ వెనక నీ కారు కన్పించకూడదు. అనవసరంగా డ్యామేజ్ అయిపోతావ్. జాగ్రత్త" అంటూ హెచ్చరిస్తూ వెళ్ళి తన ట్యాక్సీలో కూర్చున్నాడు.

అప్పుడు కూడా చెరగని చిరునవ్వుతో ఇద్దర్నీ చూస్తూనే ఉంది ముగ్ధ. ఆమెనే గమనిస్తూ వచ్చి ట్యాక్సీలో కూర్చుని డోర్ మూసింది స్నిగ్ధ.

ట్యాక్సీ ఒక్క జర్క్‌తో రివ్వున ముందుకు దూసుకుపోయింది. ట్యాక్సీ దూరం వెళ్ళిపోగానే సెల్‌ఫోన్ అందుకుని ఒక నంబర్‌కి ఫోన్ చేసింది ముగ్ధ.

*      *      *      *      *

దంతెవారా సిటీ అవుట్ స్కర్ట్స్‌లో హైవేనానుకుని ఎడంపక్కగా ఉందో పాడుపడ్డ మండపం. దాన్ని ఏ కాలంలో ఎవరు కట్టించారో కూడా ఇప్పుడు తెలిసిన వాళ్ళు ఎవరూ లేరు. కాని బాటసారులకు అది ఇప్పటికీ నీడనిస్తోంది. సేదతీరుస్తోంది.

ఆ మండపంముందు ఒక టాప్‌లెస్ జీప్ ఆగుంది. సుమారు ఏభై సంవత్సరాల వ్యక్తి ఒకడు జీప్ పక్క నిలబడి బీడీ దమ్ముకొడుతున్నాడు.

మండపంలో నలుగురున్నారు. వాళ్ళంతా ముప్ఫైలోపు యువకులు. తీరిగ్గా అరుగుమీద కూర్చుని పేకాడుకుంటున్నారు. వాళ్ళంతా రఫ్‌గా కన్పిస్తున్నారు. బలిష్టంగా ఉన్నారు.

బీడీ దమ్ము కొడుతున్నవాడు అందరికీ లీడర్ కావచ్చు. కాస్త హుందా వెలగబెడుతున్నాడు.

"ఒరే ఆడింది చాలు. ఆపండిరా... "మేడమ్ ఏ క్షణంలోనైనా రావచ్చు. చూసిందంటే కాల్చుకుతింటుంది. స్టాపిట్." బీడీ పడేస్తూ విసుగ్గా అరిచాడు.

"అయిపోయింది బాబాయ్. ఆపేస్తున్నాం" మండపం మీది వాళ్ళలో ఒకడు అరిచాడు. అయితే ఆట మాత్రం ఆపలేదు. గోల చేస్తున్నారు. ఇంతలో సదరు బాబాయ్‌గారి సెల్‌ఫోన్ మోగింది.

తీసి చూస్తూనే తేలు కుట్టినట్టుగా ఉలిక్కిపడ్డాడు బాబాయి.

"ఒరే కాంచన మేడమ్ లైన్లోవున్నారు. ఇప్పుడన్నా ఆపుతారా?" అరిచాడు.

అంతే! అంతవరకు లోన బయట పేకాటలో గోలగోలగా ఉన్న నలుగురూ ఏదో పిశాచం వస్తోందన్నంత భయంతో ఒక్కసారిగా గప్‌చుప్ అయిపోయారు. "మేడమ్! నమస్తే మేడమ్" సెల్‌ఫోన్ చెవికానించుకుంటూ వినయం ఒలకబోశాడు సదరు బాబాయి.

"పీటర్. ఎక్కడ చచ్చార్రా మీరంతా?" మేడమ్ గొంతు కటువుగా పలికింది.

"ఇక్కడే చచ్చాం... సారీ. ఉన్నాం మేడమ్" తడబడ్డాడు పీటర్. "ఇక్కడే అంటే?... సంతలోనా, స్మశానంలోనా ఇడియట్"

ఆమె ప్రశ్నలకి ఠారెత్తిపోతూ – తల బరుక్కున్నాడు పీటర్. "దంతెవారా బయట మండపం దగ్గరున్నాం మేడమ్" అన్నాడు కంగారు ఆపుకుంటూ.

"అప్పుడే అంతదూరం వెళ్ళిపోయారా? ఏం చేస్తున్నారు?"

"ఏం చేయడం లేదు మేడమ్"

"ఏం చేయనప్పుడు మీరంతా ఎందుకొచ్చార్రా? పీకలదాకా తాగి మండపంలో దొర్లుతున్నారా?

డాడీతో ఒక్క మాట చెప్తే చాలు. మిమ్మల్ని షూట్ చేసి పారేస్తారు."

"మేం తాగలేదు మేడమ్. అంతా అప్రమత్తంగానే ఉన్నాం"

"ఓ.కె. ఒళ్ళు దగ్గర పెట్టుకుని విను. ప్రోగ్రామ్‌లో చిన్న మార్పు జరిగింది. స్నిగ్ధ దంతెవారా వస్తోంది. కాని ఒంటరిగా రావడం లేదు. ట్యాక్సీలో వస్తోంది. ఆ ట్యాక్సీ ఎవరిదో తెలుసా?"

"మీరు చెప్పలేదు మేడమ్. నాకెలా తెలుస్తుంది?"

"ఇప్పుడు తెలుసుకో. అది కృతయుగ్ ట్యాక్సీ. వాడిని ఏమార్చడం కాస్త కష్టం"

"అవును మేడమ్"

"డోంట్ వర్రీ. నేను వాళ్ళని ఫాలో చేస్తూ అటేవస్తున్నా. దంతెవారానుంచి వాళ్ళని మీరు ఫాలో చేయాలి. గుర్తుందిగా? మనం ఫోన్ కాంటాక్ట్‌లో మాత్రం ఉంటాం. పని ముగిసేవరకు మీరు నాకు, నేను మీకు తెలీదు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేయొద్దు.

ఎప్పటికప్పుడు నేను సూచనలిస్తాను. కృతయుగ్ కన్నుగప్పి పని ముగించాలి, జాగ్రత్త" అంది ముగ్ధ.

"అలాగే మేడమ్"

అవతల లైన్ కట్టయింది.

పెద్ద బరువు దిగిపోయినట్టు పెద్దగా నిట్టూర్చి మిగిలిన వాళ్ళవంక చూశాడు పీటర్.

"ఓరి దేవుడా. ఇది కాంచన కాదురా బాబు. పెద్ద కంచు" అన్నాడు కోపంగా.

"ఏమైంది బాబాయ్" అడిగాడొకడు.

మేడమ్ ఆర్డర్‌ను పీటర్ అందరికీ వివరించనారంభించాడు.

* * * * *

"మనం ప్రేమించేవారికన్నా మనల్ని ప్రేమించే వారు దొరకడం చాలా కష్టం. ఈ విషయంలో నువ్వు చాలా లక్కీ" దారిలో కామెంట్ చేసింది స్నిగ్ధ.

వేగంగా పరుగుతీస్తోంది ట్యాక్సీ. అంతకన్నా వేగంగా పరుగుతీస్తున్నాయి కృతయుగ్ ఆలోచనలు. అదేమిటోగాని ఉదయంనుంచి ఇవాళ అన్నీ ఊహించని సంఘటనలే జరుగుతున్నాయి.

చెర్లవద్ద తనకారెక్కిన దంపతులు తనకో షాకిచ్చి చెక్‌పోస్ట్ వద్ద దిగిపోయారంటే, కంకునూరు వద్ద స్నిగ్ధ తన ట్యాక్సీలో దాక్కుని అదో గొడవకు దారి తీసింది. అది సద్దుమణిగేలోగా ఆ రెడ్ ఫియట్ కారు.

ఏమిటిదంతా?

ఆ బ్లాక్ బ్యూటీ ఇంకా కళ్ళలో మెదులుతూనే ఉంది. ముగ్ధ అనే ఆ అపరిచిత ఇప్పటికీ తనకు పజిల్‌గానే ఉంది.

ఆమెను చూస్తుంటే పైకి కన్పిస్తున్నంత అమాయకురాలు కాదనిపిస్తోంది. చెప్పేది ఒకటి చేసేది మరొకటి టైప్‌లా ఉంది. ఆమె మాటలు నిజం కాదని తన అంతరాత్మ హెచ్చరిస్తోంది. సొంత ఊరు చెర్ల అంది. కాని ఇంతకాలం తన సర్వీస్‌లో చెర్ల పరిసరాల్లో తనకు ఎన్నడూ తారసపడలేదు.

ఒక్కసారి చూస్తే మర్చిపోయే ఫిగర్ కాదామె. సమ్‌థింగ్ స్పెషల్. తను గతంలో టూరిస్ట్‌గైడ్‌గా వ్యవహరించి ఉంటే ఖచ్చితంగా తనకు గుర్తుండాలి. కాని లేదు. అంటే – ఆమె మాటలు నిజంకాదు.

అయితే నిజం ఏమిటి?

అదేమిటో ట్రేసవుట్ చేయాలని ఎంత ప్రయత్నించినా సాధ్యంగావడం లేదు. ఆ ఆలోచనల్లో ఉండగా స్నిగ్ధ మాటలు సరిగా వినబడక–

"మీరేదో అంటున్నట్టున్నారు!" అన్నాడు తల తిప్పి చూస్తూ. ఆమె విసుక్కుంది.

"ముందా మర్యాదలు ఆపుతావా? దానివల్ల మనం ఫ్రీగా మాట్లాడుకోలేక పోతున్నాం. ఎప్పటిలా ఏకవచనంలో పిలు" అంది.

"అదెలా? మీరేగా 'కీపిటప్' అన్నారు"

తన అభిప్రాయాన్ని తిరిగి విన్పించింది స్నిగ్ధ. విని ఫక్కున నవ్వాడు కృతయుగ్.

ఆమె ఉడుక్కుంది.

"ఎందుకా వెధవ నవ్వు? నేనేం తప్పు మాట్లాడానని? మీ మగాళ్ళు ఎప్పటికి మారతారు? ఆడపిల్ల ప్రేమ అర్థం కాలేదా? అందంగానే ఉందిగా?

నోరు తెరిచి ఐ లవ్ యూ చెప్పినా అంత కఠినంగా ఎలా మాట్లాడ గలిగావ్? నీ ప్రాబ్లం ఏమిటి?" కాస్త గట్టిగానే అడిగింది. "తెలీదు" అన్నాడు.

"ఏం తెలీదు?"

"ఏమీ తెలీదు. ఎందుకంటే నాకు చదువులేదు. అమ్మాయిలతో చనువూ లేదు. కాబట్టి లవ్ విషయాల్లో నాకేమీ తెలీదు. కాని లోకాన్ని చదివిన అనుభవం చాలా ఉంది. మంచి చెడు విషయాల్లో అది నన్ను హెచ్చరిస్తూనే ఉంటుంది"

"ఆహా! అయితే ఇప్పుడేమని హెచ్చరిస్తోందో"

"మేడిపండు చూడ మేలిమై ఉండు. పొట్ట విప్పి చూడ పురుగులుండు" అన్నాడో కవి. దీన్నే మరో పెద్దాయన మెరిసేదంతా బంగారం కాదని క్లుప్తంగా విశదీకరించేశాడు. మీరు..."

"మీరు కాదు... నువ్వు..." సవరించింది.

"ఓ.కె... నువ్వు చాలా చదువుకున్నావ్ గాని బొత్తిగా నీకు లోకానుభవం ఉన్నట్టు లేదు. ఇప్పటికీ నాకు అర్థంగాని విషయం ఏమిటో తెలుసా? ఆ అమ్మాయి మనిద్దరిలో ఎవరిని ఫాలో చేస్తుందన్నది."

"నో నో... నువ్వు మరీ ఎక్కువగా ఆలోచిస్తున్నావ్. నన్ను ఫాలో చేయాల్సిన అవసరం ఆ అమ్మాయికేం ఉందని?" అంది స్నిగ్ధ.

"ఏమో! ఎవరికి తెలుసు? అలాగని నన్ను ఫాలో చేయాల్సిన అవసరమూ లేదు"

"ప్రేమిస్తోంది గదా"

"ప్రేమ... ప్రేమ, లవ్, మొహబ్బత్, ఇష్క్, కాదల్ ప్రీతి... పేరు ఏదయినా భావం ఒక్కటే. ఈ లవ్వనేది ఉందే... అది కరెంట్ తీగ లాంటిది. ఒక్కసారి తాకామా ఫినిష్. చచ్చేవరకు వదలదు"

"ఏయ్. ఇది మరీ దారుణం. పవిత్రమైన ప్రేమను నువ్విలా అవమానించడం బాగాలేదు"

"బాగుండదు. నీకు అర్థంకాలేదు గాబట్టి ఖచ్చితంగా బాగుండదు. నీకు అర్థమయ్యేలా చెప్పాలంటే ఉదాహరణకి సెల్‌ఫోన్ ఉంది. మంచిదే.

కాని ఈ రోజుల్లో మంచికన్నా అది చెడుకే ఎక్కువ ఉపయోగపడుతోంది. ఎన్నో విపరీతాలు జరగటానికి స్త్రీ పురుష సంబంధాలు నాశనం గావటానికి కారణం అవుతోంది. కత్తి ఉంది.

దాంతో కూరలు తరుక్కోవచ్చు. పీక కోసుకోవచ్చు. సో...లోకంలో చెడు అనేది ఏదీలేదు. సందర్భాన్ని బట్టి మంచి చెడు ఏర్పడుతుంది. ప్రేమకూడా అంతే"

"నువ్వు నెగిటివ్ దృష్టితో చూస్తే లోకమంతా నెగిటివ్ గానే కన్పిస్తుంది. పాజిటివ్‌గా ఎందుకు చూడవు?"

"నువ్వెవరినన్నా ప్రేమించావా?" సడెన్‌గా అడిగాడు.

అతడినుంచి ఇలాంటి ప్రశ్నను ఊహించలేదు స్నిగ్ధ. అందుకే తత్తర పడింది. బిడియంగా చూసింది. "ఊరికే అడిగాను. చెప్పు" అన్నాడు.

"చెప్పడానికేముంది? నేనెవరినీ ప్రేమించలేదు. అయినా ప్రేమలో పడేంత తీరిక నాకెక్కడిది? నా కెరియర్ నాకు ముఖ్యం.

ఎప్పటికయినా ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్‌కి డైరెక్టర్ కావాలన్నది నా లక్ష్యం. అది నెరవేరేవరకు నో ప్రేమ... నో పెళ్ళి" అంది బదులిస్తూ.

"డౌట్ లేదు. ఇది కన్యగానే ముసలమ్మయిపోతుంది" గొణిగాడు. "ఏమన్నావ్?" గుర్రుగా చూసింది.

"ఇంకా ఏమీ అనలేదండి. ఎందుకంత కోపం? ఒకవేళ... ఎవరినయినా ప్రేమిస్తే... ఏం చేస్తావ్? ఉత్తినే చెప్పు చూద్దాం"

"అతను చెప్పలేకపోతే నేనే ధైర్యంగా ముందుకెళ్ళి ఐ లవ్ యూ చెప్పేస్తాను"

"సో దట్సిట్. నిజంగా ప్రేమించేవాళ్ళు ముందుకొచ్చి ధైర్యంగా చెప్పేస్తారు. అంతేగాని నీడలా ఫాలో చేయరు. నువ్వు గమనించావో లేదో, ఆమె నాతో ఐ లవ్ యూ చెప్పాల్సిన సందర్భమా అది?"

"నీ ఆలోచన తప్పు కృతయుగ్. ఆ అమ్మాయి ఇంకొంత కాలం ఆగేదేమో. కాని మనిద్దర్ని చూసి ఏదేదో ఊహించుకుని అలా బయటపడిపోయింది. దీన్ని తప్పుపడితే ఎలా? నాకయితే ఆ అమ్మాయి నిజమే చెప్పిందనిపిస్తోంది"

"నిజం నిప్పులాంటిదంటారు గదా. నిప్పు బయట పడ్డప్పుడు నీకు తప్పకుండా నిజం అర్థమవుతుంది. రాజకీయ నాయకుల మాటలు నమ్మి ఓటరు ప్రతిసారీ మోసపోతూనే ఉన్నాడు. ఇదీ అంతే"

"నువ్వు విషయాన్ని అనవసరంగా రాజకీయం చేయకు. ఓటరు మోసపోవడమేంటి?" కోప్పడింది.

కృతయుగ్ ఏదో చెప్పబోయాడు. అంతలో అతడి సెల్‌ఫోన్ మోగింది. అవతల లైన్లో ఉంది అతడి బామ్మ నారాయణమ్మ. విసుగ్గా ఓసారి ఫోన్ వంక చూసి స్పీకర్ ఫోన్ ఆన్ చేశాడు.

"చెప్పవే నాయనమ్మ. భోంచేశావా?" అడిగాడు.

"ఆ మాట నేనడగాల్రా శుంఠ. ఏమన్నా తిన్నావా. ఇంకా లేదా?" అరిచిందావిడ.

"ఇంకా లేదులేవే. దారిలో ఉన్నాను"

"పొద్దుటే ఎంచక్కా ముద్దపప్పు, ఆవకాయ గడ్డ పెరుగుతో భోంచేసి వెళ్ళరా అంటే విన్నావా? ఎగరేసుకుంటూ బయల్దేరావ్. భోజనం టైమైంది. తింటానికి హోటల్ దొరకలేదా?!"

"అబ్బా తింటాలేవే. ఈ లోపల నువ్వు నా బుర్రతినకు. నువ్వు ఆరోగ్యసూత్రాలు ఆరంభిస్తే అయిపోతాను. భోజనం దంతెవారా చేరగానే తింటాను సరా?"

"ఏం తింటావో చెప్పు"

"ఏం దొరికితే అది తింటాలేవే"

"అలాగని మందుకొట్టి, కక్కా ముక్కా కొరికి కొంపకొస్తే కాళ్ళు విరగ్గొడతాను భడవా. అంట్ల వెధవ. తిక్క వెధవ. పెళ్ళి చేసుకోవు. ఇంటిచాకిరీ చేయలేక ఛస్తున్నాను. నీకేం తెలుసు? నా భయం నాది. శాఖాహారం వంశంరా నాయనా మనది. అవే తిను. వేళకి తిను. ఇంటికెప్పుడొస్తున్నావో చెప్పి అఘోరించు"

"బామ్మా ఆపుతావా? పరువు తీయకే. నేను పద్ధతిగానే ఉన్నాను. నువ్విలా విసిగిస్తే ఏదో రోజు పీకనొక్కి చంపేస్తాను"

"ఏడ్చావ్‌లే. నా చావు నీ చేతిలో లేదుగాని. ఆ గాజుల చప్పుడేమిట్రా? పక్కనెవరు?"

అంతవరకూ ఎలాగో నవ్వాపుకుంది స్నిగ్ధ.

బామ్మ గారి ప్రశ్న వింటూనే ఉలిక్కిపడి కృతయుగ్ వంక చూసింది.

"ఓసి నీ అనుమానం కూల బామ్మా. అది అమ్మాయి కాదే. గాజుల చప్పుడు అంతకన్నా కాదు.

కోతిమెడలో మువ్వలచప్పుడు చాలా. నీకు సెల్‌ఫోన్ కొనిచ్చి తప్పు చేశానే. రావటానికి రెండ్రోజులు పడుతుంది. ట్రాఫిక్‌లో ఉన్నాను. గోల చేయకు" అంటూ లైన్ కట్ చేసి స్నిగ్ధ వంక చూశాడు.

ఆమె కోపంగా చూడ్డం చూసి ఖంగుతిన్నాడు. "వామ్మో ఏమైంది మేడమ్. ఆ చూపేమిటి?" కంగారుగా అడిగాడు.

"నేను కోతినా? నా మెళ్ళో మువ్వలున్నాయా? అసలేమనుకుంటున్నావ్‌రా నా గురించి. కోతి. నన్ను కోతినంటావా! నిన్నూ..." అంటూ స్నిగ్ధ పిడికిళ్ళు బిగించేస్తుంటే అదిరిపడి కారు పక్కకు తీసి ఆపేశాడు కృతయుగ్.

"ఇదన్యాయం. నిన్ను నేను కోతి అనలేదు" అనరిచాడు కంగారుపడుతూ.

"ఇప్పుడన్నావ్‌గా? కోతి అన్నావ్"

"బామ్మకోసం అలా అబద్ధం చెప్పామండి. అమ్మాయని చెప్తే అరవై ఆరు అర్థాలు తీసి చంపుతుంది. దాని ప్రశ్నలకు బదులు చెప్పే ఓపిక నాకు లేదు. అందుకే అబద్ధం చెప్పాను.

నీ అందం చూసి కూడా కోతి అని ఎలా చెప్తాను చెప్పండి. ప్లీజ్... కూల్" బ్రతిమాలుకున్నాడు.

ఉన్నట్టుండి ఫక్కున నవ్వింది స్నిగ్ధ.

ఇంతసేపు ఆపుకున్న నవ్వు వరదలా పొంగింది. అలా నవ్వుతూనే ఉంది కాస్సేపు. ఆమె కోపం పోయిందని గ్రహించి తిరిగి ట్యాక్సీని పరుగెత్తించాడు.

"మొత్తానికి నీలో చాలా వెధవల్ని చూస్తోంది నీ బామ్మ. ఉండాల్సిందే. లేకపోతే మీ కుర్రాళ్ళు చెప్పిన మాట వినరు" అంది నవ్వాపుకుంటూ.

"ఏంటి వినేది. దాని నస భరించలేకే కొంత ఇంట్లోంచి పారిపోయి వస్తూంటాను. అయితే ఏం? దానికి నేను నాకు అదీ తప్ప మాకెవరూ లేరు. అందుకే బామ్మంటే నాకు ప్రాణం. అదీ అంతే"

"అదృష్టవంతుడివి. ఇంతకీ మనం మేటరు ఎక్కడో వదిలేసినట్టున్నాం"

"ఎక్కడ?"

"రాజకీయనాయకుల మాటలు నమ్మి ఓటరు ప్రతిసారీ మోసపోతూనే ఉన్నాడన్నావ్‌గా! ఆ మాట నేనంగీకరించను. అమాయకులున్నంత వరకు లోకంలో మోసం చేసేవాళ్ళు చేస్తూనే ఉంటారు.

అయినా ఓటు అమ్ముకునే ఓటరుకి నాయకుడ్ని నిలదీసే హక్కు ఎక్కడిది? అయిదేళ్ళు దోచుకుంటాడని తెలిసి కూడా డబ్బు తీసుకుని ఓటేసే ఓటర్లున్నంత వరకు ఈ దేశం తలరాత అంతే. అవునూ. నేనంత అమాయకురాలిలా కన్పిస్తున్నానా నీకు?"

"టైమొస్తే నీకే అర్థమవుతుందిలే. నా అంచనా కరక్టయితే ఆ రెడ్ ఫియట్ కారు మన వెనకే వస్తుండాలి. చూడు" అన్నాడు కృతయుగ్.

"నీ అంచనా తప్పింది బాబూ. మన వెనక పెద్ద లారీ వస్తోంది"

"ఆ లారీ వెనక ఎక్కడో ఉండే ఉంటుందిలే"

కృతయుగ్ మాటలమీద స్నిగ్ధకు నమ్మకం లేదు. ఆమె అటునుంచి అటే వెనక్కి వెళ్ళిపోయి ఉంటుందనుకుంది. అప్పటికి సమయం మధ్యాహ్నం ఒంటిగంటకావస్తోంది. కబుర్లమధ్య సమయం తెలీలేదు.

దంతెవారా సిటీ ఇంకో అయిదు కిలోమీటర్ల దూరంలో ఉందనగా ఒక గ్రామం ఉంది. గ్రామాన్ని రెండుగా చీలుస్తూ హైవే పోతోంది. గ్రామం బయట ఎడంపక్క ఒక భోజన హోటలుంది.

సడ్రున ట్యాక్సీని హోటల్ ఆవరణలోకి పోనిచ్చి పార్కింగ్‌లో ఆపాడు కృతయుగ్. కారు దిగుతూ ఆమె వంక చూశాడు.

"ఏమిటి?" అర్థంగాక అడిగింది.

"ఆకలన్నావుగా. భోంచేయవా?"

"ఇక్కడా. దీన్ని హోటలంటారా. ఐ డోన్ట్" అంది చుట్టూ చూస్తూ.

ఆమె భోంచేయడానికి అయిష్టత ప్రకటించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. పైన తాటాకుల కప్పుతో పెద్ద పర్ణశాలలా ఉందా హోటల్. చుట్టూ వెదురుబద్దల మెస్ ఉంది. లోన టేబుల్స్, అక్కడి మనుషులు స్పష్టంగా కనిపిస్తున్నారు. దానికి వెనకపక్క వంటశాల ఉంది.

రోడ్డువెంట లారీలు, కార్లు చాలా ఆగున్నాయి. లోన టేబుల్సన్నీ భోజనప్రియులతో బిజీగా ఉన్నాయి.

"చూడు ఇది హోటలే, సందేహపడక్కర్లేదు. అచ్చమైన ఆంధ్రాభోజనం ఇక్కడ తప్ప మరెక్కడా దొరకదు. హోటల్ ఓనర్ నాకు బాగా తెలిసినవాడు. భోంచేయడానికి ఏమిటి నీ ప్రాబ్లం?" విసుక్కోకుండా అడిగాడు కృతయుగ్.

"అలా ఓపెన్‌గా నలుగురిలో తినలేను" అంది స్నిగ్ధ.

"నీ ప్రాబ్లం నేను సాల్వ్ చేస్తాను. కమాన్" పిలిచాడు. అయిష్టంగానే కారు దిగింది స్నిగ్ధ.

ఆ హోటల్ పేరు హోటల్ భద్రాచలం. దాని ఓనరు పేరు సీతారామయ్య. అయిదేళ్ళక్రితం వరకు సీతారామయ్య కుటుంబం భద్రాచలంలోనే కృతయుగ్ వాళ్ళుంటున్న వీధిలోనే ఉండేవారు. పక్క పక్క ఇళ్ళు. చిన్నప్పట్నుంచి కృతయుగ్ ఆయనకు తెలుసు.

అక్కడ ఏ వ్యాపారం చేసినా ఆయనకు కలసిరాలేదు. దాంతో ఇక్కడికొచ్చి హోటల్ ఆరంభించాడు. కాలం కలిసొచ్చింది. వ్యాపారం బాగుంది.

కృతయుగ్ అంటే సీతారామయ్యకు చాలా అభిమానం. అందుచేత అక్కడ కృతయుగ్‌కి అడ్డుచెప్పే వాళ్ళుండరు. అతడి భోజనానికి ఎప్పుడూ డబ్బులు తీసుకోడాయన.

కౌంటర్ వెనక సీతారామయ్యకి పర్సనల్ రూమ్ ఉంది. దాని వెనుక పెద్ద స్టోర్‌గది కూడా ఉంది. అవన్నీ పక్కా సిమ్మెంట్‌తో కట్టినవి.

సీతారామయ్యనడిగి తాళాలు తీసుకుని ఆయన పర్సనల్ రూమ్‌లో కూచుని కావలసినవి రప్పించుకుని భోంచేశారిద్దరూ. భోజనం చాలా బాగుంది.

ఆమె కన్నా ముందే భోజనం ముగించుకుని బయటికొచ్చేశాడు కృతయుగ్.

స్నిగ్ధ భోజనం ముగించి లేస్తుండగా సీతారామయ్య లోనకొచ్చాడు. "వీడికి కాలు కుదురుండదు... ఏడమ్మా వీడు?" అనడిగాడు.

"బయటికొచ్చేశాడు అంకుల్" అంది.

"అలాగా" అంటూ ఆయన పోబోతుంటే "అంకుల్" అంటూ పిలిచింది.

"చెప్పమ్మా. ఇంకేమన్నా కావాలా?" అడిగాడు.

"వద్దంకుల్. నాకో సందేహం"

"అడుగమ్మా"

"ఏం లేదు. కృతయుగ్ మంచోడు. కాని అయిదో తరగతితో చదువు ఆపేయడం ఏమిటి? ఏమైంది?" ఒక్క క్షణం ఆశ్చర్యంగా చూసి–

వెంటనే ఫక్కున నవ్వాడాయన.

"నీతో అలా చెప్పాడా వాడు? అబద్ధాలు చెప్పడంలో ముందుంటాడు" అన్నాడు నవ్వాపుకుంటూ.

"అంటే తను చెప్పిందంతా"

"పచ్చి అబద్ధం"

స్నిగ్ధకు షాక్. ఒకింత కోపం. ఒకింత ఆశ్చర్యం.

"ఏం చదివాడు?" నమ్మలేనట్టు అడిగింది.

"వాడెప్పుడూ చదువులో ఫస్ట్. ఆటోమొబైల్ ఇంజనీరింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించినవాడు. హైదరాబాద్‌లో నెలకి నలభై వేలు జీతంతో జాబ్ కూడా చేశాడు. కంపెనీవాళ్ళే వీడ్ని అమెరికాలోని డెట్రాయిట్‌కి పంపించి ఫారెన్ కార్ల రిపేర్‌లో ఆరుమాసాలు శిక్షణ కూడా ఇప్పించారు.

తెలుగుతోపాటు తమిళం, కన్నడం, ఇంగ్లీషు, హిందీ భాషలు అనర్గళంగా మాట్లాడగలడు. చీఫ్ ఇంజనీర్‌గా మంచి ఉద్యోగం. కాని ఏం లాభం? తిక్క సన్నాసి. ఎవరు చెప్పినా వినడు. తనకు తోచింది చేస్తాడు. రూపాయి కోసం తలొంచే మనిషి కాదు.

కంపెనీతో ఏవో అభిప్రాయభేదాలొచ్చి జాబ్ వదిలేసి వచ్చి ఇదో... ట్యాక్సీ తోలుకుంటున్నాడు. వాడు చాలా నిజాయితీపరుడమ్మా. తన నాయనమ్మకు తప్ప ఎవరికీ భయపడడు. అబద్ధాలు చెప్తాడు.

కానీ అవి ఎవరినీ బాధించవు. ఇవన్నీ నేను చెప్పానని చెప్పమాకు తల్లీ. నా గొంతు పట్టుకుంటాడు" అంటూ కౌంటర్ వైపు వెళ్ళిపోయాడాయన.

కృతయుగ్ ఎందుకు అబద్ధంచెప్పాడు? చదవలేదనటంలో ఉద్దేశ్యం ఏమిటి.

తనను ఫూల్ చేయాలనా? తన స్థాయికి తగ్గట్టుగా తగ్గి ఉండాలనా? ఇగో ప్రాబ్లమా?

అసలు వీడి క్యారెక్టరేమిటి?

అస్సలు అర్థంగావడం లేదే!

చాలాసేపు ఆలోచిస్తూ అక్కడే కూర్చుండిపోయింది. ఎంతకీ కృతయుగ్ రాకపోవడంతో తనే గదికి తాళం పెట్టి తాళాలు కౌంటర్లోని సీతారామయ్యకిచ్చి థ్యాంక్స్ చెప్పింది. భోజనం డబ్బులివ్వబోతుంటే తీసుకోలేదాయన.

"వద్దమ్మా. కృతయుగ్ డబ్బు తీసుకోవద్దు బాబాయ్ అని చెప్పాడు. వాడు చెప్పాక తిరుగులేదు. వెళ్ళి రామ్మా" అన్నాడు. మరోసారి థ్యాంక్స్ చెప్పి బైటికొచ్చింది స్నిగ్ధ. ఆవరణలో అడుగుపెట్టగానే ఆమెకు మరో షాక్.

పార్కింగ్ ప్లేస్‌లో తమ ట్యాక్సీ పక్కనే ఆగుంది రెడ్ ఫియట్. అంటే... కృతయుగ్ అంచనా వాస్తవం అయింది. తను ఊహించినవిధంగా ఆ అమ్మాయి తన దారిన వెళ్ళిపోలేదు. తమ వెనకే వచ్చేసింది.

లోన భోంచేస్తోందా లేక – స్నిగ్ధ కళ్ళు కృతయుగ్‌ని గాలిస్తుండగా ఆమెకు మరో షాక్ తగిలింది.

కార్ల వెనక చివరగా గుబురుగా ఎత్తుగా పెరిగిన ఒక పొన్నచెట్టు ఉంది. దాని మొదలు చుట్టూ కూర్చోడానికి అనువుగా సిమ్మెంట్ దిమ్మ ఉంది. వాళ్ళిద్దరూ జంటగా అక్కడ కూర్చునుండటమే స్నిగ్ధకు తగిలిన పెద్ద షాక్.

అతడికి రాసుకుంటున్నంత దగ్గరగా పక్కన కూర్చుని మాటమాటకీ పైట చెంగుతో కళ్ళు ఒత్తుకుంటూ ఏమో చెబుతోంది ముగ్ధ.

వాళ్ళిద్దర్నీ అలా చూస్తుంటే – ఒళ్ళు మండిపోతున్నట్టుంది స్నిగ్ధకు.

ఏమిటి వీడి ఉద్దేశ్యం? ఆ అమ్మాయి తనకు తెలీదన్నాడు. నమ్మదగ్గ క్యారెక్టర్ కాదన్నాడు. అన్ని వెధవ కబుర్లు చెప్పి ఇప్పుడు దాని పక్కన తీరిగ్గా కూర్చున్నాడంటే ఏమనుకోవాలి?

కావాలనే ఆమెను మోసం చేస్తున్నాడా! అబద్ధాలు వీడికి అలవాటేగా!

ప్రేమంటే కరెంటు తీగలాంటిదని లెక్చరిచ్చినవాడు ఆ వన్నెల విసనకర్ర పక్కనచేరాల్సిన అవసరం ఏమిటి? వెళ్ళి నాలుగు మాటలు అడిగేస్తే...

సరి అడుగుతావు. ఆ తరువాత అంటూ ఎదురుతిరిగింది ఆమె అంతరాత్మ. 'అసలు నీకేం సంబంధం ఉందని అడుగుతావ్? వాడు నీకేమవుతాడు? నువ్వువాడ్ని ప్రేమిస్తున్నావా?'

'నొనొ... అలాంటిదేం లేదు. నాకు లక్ష్యం ముఖ్యం. ప్రేమ కాదు'

'అలాంటప్పుడు ఎవరెలాపోతే నీకెందుకే స్నిగ్ధా. రెండ్రోజుల టూరిస్ట్‌వి. నీకివన్నీ అవసరమా? వెళ్ళు వెళ్ళవమ్మా. బుద్ధిగా వచ్చినపని చూసుకో... పో...' అంటూ హెచ్చరించింది.

అంతే. ఒక్కసారిగా చల్లారిపోయింది ఆమె ఆవేశం. అవును కదా! తనకెందుకు కోపమొస్తోంది. తనెందుకు ఆవేశపడుతోంది? ఇష్టమైతే పెళ్ళిచేసుకుంటారు. తనకేమిటి బాధ? అతను తన అద్దె ట్యాక్సీ డ్రైవరు. అంతే అంతకుమించి ఏమీ కాదు.

ఇలా ఆలోచించగానే ఆమె మనసు తేలికపడింది. ట్యాక్సీ వద్దకెళ్ళి నిలబడి హారన్ కొట్టింది. సౌండ్ వింటూనే లేచి వచ్చేశాడు కృతయుగ్. అతని వెనకే తనూ వచ్చింది ముగ్ధ. "హాయ్" అంటూ స్నిగ్ధను పలకరించింది కూడ.

ముఖం తిప్పుకుంది స్నిగ్ధ.

"ఓకే... నేనింకా భోంచేయలేదు. వస్తాను కృతా... సీయూ" అంటూ పైట భుజాలమీదుగా లాక్కుని హోటల్ ఎంట్రన్స్ వైపు నడిచింది ముగ్ధ.

వెళ్తున్న ఆమెనే చూస్తూ నిలబడిపోయింది స్నిగ్ధ. హైహీల్స్ చెప్పుల్స్ టకటక లాడించుకుంటూ ఆమె నడుస్తూంటే ఆమె వెనక షేపులు మగాళ్ళ మతిపోగొడతాయనిపించింది.

ఎంత కాదనుకున్నా ఏదో తెలీని కోపం స్నిగ్ధ మనసుని కుతకుతలాడి స్తోంది. ట్యాక్సీలో కూర్చుని ధడాలున తలుపు మూసింది. కృతయుగ్ ట్యాక్సీని రివర్స్ తీసి హైవేకి దూకించాడు.

హోటల్ ఎంట్రన్స్‌లోనే నిలబడిన ముగ్ధ ట్యాక్సీ గేటుదాటగానే ఇవతలి కొచ్చి సెల్‌ఫోన్ నుంచి ఫోన్‌చేసింది. అవతల పీటర్ లైన్లోకొచ్చాడు.

"ఒళ్ళు దగ్గరపెట్టుకు విను. ట్యాక్సీ బయలు దేరింది. కాస్సేపట్లో అటుగా వస్తుంది. అనుమానం రాకుండా ఫాలో చేయండి. ఇవాళే పని పూర్తికావాలి. కృతయుగ్ అనుమానిస్తే మీ తాటతీస్తాడు జాగ్రత్త. భోంచేసి నేనూ వచ్చేస్తాను" అంటూ హెచ్చరించింది.

ఫోన్ ఆఫ్‌చేసి భోజనానికి హోటల్లోకి నడిచింది ముగ్ధ.

*  *  *  *  *

"ఏమైంది అలా ఉన్నావ్?" దారిలో అడిగాడు కృతయుగ్. ట్యాక్సీ గ్రామాన్ని వదిలింది. ట్రాఫిక్ పల్చగా ఉంది. "నథింగ్" అంది క్లుప్తంగా. "నాకు తెలుసు. ఆ అమ్మాయి గురించేగా?"

"ఏ అమ్మాయి గురించయితే ఏమి? నాకేంటి? అబద్ధాలు చెప్పేవాళ్ళు, మాటలు చేతలకు పొంతన లేనివాళ్ళను చూస్తే నాకు నచ్చదు."

"అరె. ఇప్పుడేమైందని?" "ఏం కాలేదా? దాని పక్కన కూర్చుని ఆ కబుర్లేమిటి? సరదాగా ఉంటే అక్కడే మాట్లాడొచ్చుగా..."

"హలో! నేనేమీ తన పక్కన కూర్చోలేదు. తనే నన్ను చూసి వచ్చి పక్కన కూర్చుంది. నేనంటే ఎంత ప్రేమో చెప్పి కళ్ళు ఒత్తుకుంటుంటే పిచ్చి ఆలోచనలు వద్దని మంచిగా చెప్పాను. నువ్వేగా అన్నావ్ హర్ట్ చేయొద్దని"

"ఇది మాత్రం ఎలా నమ్మమంటావ్. నోరు విప్పావంటే అన్నీ అబద్ధాలే కదా!" మనసు చేసిన హెచ్చరికలు మర్చిపోయి బయటపడిపోయింది స్నిగ్ధ.

ఆశ్చర్యంగా నోరు తెరిచాడు కృతయుగ్.

"అయ్యబాబోయ్. ఇన్ని అభాండాలా. నేనేం అబద్ధాలు చెప్పాను?" అడిగాడు.

"నీకు చదువు రాదని చెప్పింది అబద్ధం కాదా? ఆటోమొబైల్ ఇంజనీరింగ్ చదివి అమెరికా వెళ్ళి రావడం నిజంకాదా? నువ్వు ఫూల్ చేయడానికి నేనే దొరికానా? వద్దు. నేను టూరిస్ట్‌ని, నువ్వు ట్యాక్సీ డ్రైవర్‌వి. అంతే లీవిట్" అంటూ అసహనంగా ఓ చూపు చూసి ముఖం తిప్పుకుంది.

అంతలో "ఢాం" అంటూ వెనుక టైరు పేలి ట్యాక్సీ ఆగిపోయింది. రోడ్డు సైడ్‌లో చెట్టు నీడన ఆపాడు కృతయుగ్. "ఓర్నాయనో. ఒక్క చూపుకే టైరు పేలింది. రెండోసారి చూస్తే నా ట్యాక్సీ ఏమయ్యేదో. థాంక్‌గాడ్" అంటూ డోర్ తెరిచాడు.

స్నిగ్ధ ఏమనుకుందోగాని ఇంకేం మాట్లాడలేదు. కామ్‌గా ట్యాక్సీ దిగి వెళ్ళి చెట్టు పక్కనున్న మైలురాయి మీద కూర్చుంది. తనూ మాటలు ఆపేసి కారు డిక్కీ తెరిచాడు కృతయుగ్.

అతడు స్టెఫినీ తీసి కారు టైరు మార్చేసరికి ఇరవై నిముషాలు పట్టింది. కారు రెడీ అవగానే పిలవకుండానే వచ్చి కూర్చుంది. తిరిగి ప్రయాణం మొదలైంది.

"చూడు. రెండ్రోజులు టూర్ చేసి వెళ్ళిపోతావ్. ఈ మాత్రానికి మనం గొడవ పడ్డం ఏం బాగుంటుంది చెప్పు. నేను కొన్ని అబద్ధాలు చెప్పాను కాదనడం లేదు. ట్యాక్సీ తోలుకునేవాడు అమెరికా వెళ్ళొచ్చానంటే ఎవరూనమ్మరు. నవ్వుతారు. స్థాయికి తగ్గట్టే మాటలు ఉండాలి. అందుకే అబద్ధం చెప్పాను.

బాబాయి నీతో చెప్పేస్తాడని ఊహించలేదు. ఇప్పటికీ ముగ్ధ ఎవరో నిజంగా నాకు తెలీదు. ఆమె ప్రేమనూ నమ్మలేను. ఎనీవే. నీకేమన్నా బాధ కలిగించి ఉంటే సారీ" అన్నాడు.

"రెండ్రోజులు తిరిగి వెళ్ళిపోయే టూరిస్ట్‌ని. నాకెందుకు సారీ చెప్పడం. నీవద్దే ఉంచుకో" అంది తనూ సీరియస్‌గానే.

"ఓకే... ఓ మాట చెప్పు. ఇప్పటికే లేటయింది. దంతెవారా మీదుగా కోటకు వెళ్ళాలంటే దూరం. ఇటు దగ్గరగా నాటుదారి ఒకటి ఉంది. ఎటు వెళ్ళాలో చెప్పు" అడిగాడు.

"నీ ఇష్టం. తొందరగా కోటకు చేరుకుంటే చాలు" అంది స్నిగ్ధ. ఆమె అలా ముభావంగా ఉండటం, కట్టె విరిచినట్టు బదులివ్వడం – కృతయుగ్‌కి నచ్చలేదు.

నవ్వితే బుగ్గలు సొట్టలుపడి మరింత అందంగా ఉంటుంది స్నిగ్ధ. మల్లెమొగ్గల్లా మెరిసే పలువరుస, పగడాల్లాంటి పెదవులు, విశాలమైన సోగకళ్ళు, ఆమె ముఖారవిందానికి ప్రత్యేకార్షణ.

గలగలా మాట్లాడుతుంటే ఇంకా వినాలనిపిస్తుంది. కయ్యంతో మొదలైన తమ పరిచయం తిరిగి కయ్యంతో ముగియకూడదు.

అయినా ముగ్ధ విషయంలో ఏం జరిగిందనీ... తను చెప్పాకకూడా ఆమె ఇంకా ఫీలవుతోందంటే తన మనసులో కూడా వలపు అలజడి ఏదన్నా... ఛఛ. అదేంకాదు. తన మనసుకు తనే సమాధానం చెప్పుకున్నాడు. ఆమె కోపమంతా అబద్ధం చెప్పినందుకే.

ఆలోచనలు ఆపి ట్యాక్సీని ఎడంపక్కగా పోతున్న ఒక నాటు దారికి మళ్ళించాడు. గతుకుల బాటన అడవి దారిలోకి ఎంటరైంది ట్యాక్సీ.

* * * * *

"ఏరా! ఆ ట్యాక్సీ ఇటే వస్తోందని మేడమ్ చెప్పి అర్ధగంట దాటింది. ఇంకా రాదేమిట్రా?" వస్తున్న వాహనాలను పరికిస్తూ అడిగాడు పీటర్.

అర్ధగంట దాటినా ట్యాక్సీ జాడ కనబడకపోవడంతో పీటర్‌కి అనుమానం వచ్చింది. "బాబాయ్. మేడమ్‌కి ఫోన్‌చేసి అడిగిచూడు" ఒకడు సలహా ఇచ్చాడు.

"ఆవిడతో ఏం చెప్పినా తంటానే. ఆడపిల్లకాదురా బాబూ. ఆడపిశాచి" గొణిగాడు పీటర్.

"పోనీ ఓ పనిచేస్తే?" మరొకడు అడిగాడు.

"అదేంటో చెప్పితగలడు." "మనమే ఎదురెళ్తే?"

ఆ మాట వినగానే పీటర్ ముఖం వికసించింది. "ఇది బాగుంది. ఇక్కడ కూర్చుని ఈగల్ని తోలుకునే కన్నా అదే మంచిపని. ఎక్కండి. జీప్ ఎక్కండి" అనరిచాడు. జీప్ బయలుదేరింది.

* * * * *

ఒకగోతిలో దిగి ట్యాక్సీ పైకి ఎగిరేసరికి దాంతోబాటు ఎగిరొచ్చి కృతయుగ్ మీదపడింది స్నిగ్ధ. సమయానికి ఎడం చేయి అడ్డం పెట్టి ఆపాడు గాని లేకపోతే ఆమె తల స్టీరింగ్‌ని గుద్దుకునేది.

అయితే ఆ సంఘటనలో అనూహ్యంగా ఆమె పరువాల పొంగులు పూబంతుల్లా అతడి భుజాన్ని బలంగా తాకి నరాలకు మంటపెట్టేశాయి.

తత్తరపడిపోయాడు కృతయుగ్. పక్కకు జరిగే అవకాశంలేదు. ట్యాక్సీ స్లో చేశాడు. ఆమె సిగ్గుపడుతూ వెనక్కి జరిగి సర్దుకు కూర్చుంది. వయసు మత్తు అందరికీ సమానమే. స్త్రీ పురుష భేదం లేదు.

"ఆర్ యు ఓకే?" అడిగాడు గొంతు సవరించుకుంటూ. "ఓ.కే." అంది పొడిగా.

"సారీ... కావాలని చేయలేదు. నాటు దారి. మనమే జాగ్రత్తగా ఉండాలి. డోర్ గట్టిగా పట్టుక్కూర్చో" హెచ్చరించాడు. ఆమె మౌనం వహించింది.

"పోనీ స్టీరింగ్ నువ్వు తీసుకో" అడిగాడు.

"అక్కర్లేదు పోనీ"

"అది కాదు"

"ష్... నేనేమీ అనలేదు గదా?" విసుక్కుంది.

"అవును కదా. ఓ మైగాడ్. అమ్మాయిల ఒంట్లో ఇంత కరెంట్ ఉంటుందని అస్సలు ఊహించలేదు. కాస్త లేటయితే షాక్‌తో మాడి మసైపోయేవాడ్నేమో" అన్నాడు సరదాగా ఉడికించాలని.

అంతే – ముఖం నిండా అలుముకుంది ఆమెకు కోపం. "ఓ.కే. అపుతావా? చేసింది చాలక వెధవ కామెంట్లు వేరేనా... నాకు తిక్కరేగిందంటే నిజంగా నిన్ను మర్డర్ చేసేస్తాను. ఊరుకుంటున్నా అనుకుంటున్నావా?... నిన్నేం చేస్తానో చూడు" అంటూ తన ఎయిర్‌బ్యాగ్ ఎత్తి ఆమె యుద్ధానికి సిద్ధమయ్యేసరికి–

సడెన్‌గా కారాపి బయటకు దూకేశాడు కృతయుగ్. "శాంతి... శాంతి" అనరిచాడు.

ఎయిర్‌బ్యాగ్ పక్కన పడేసి కోపంగా చూసింది స్నిగ్ధ. "అలా చూడకు. స్టీరింగ్ నువ్వు తీసుకో. వెనక సీట్లో హాయిగా నిద్రపోతాను. ఓకేనా? ఈ ఒప్పందం ఓకేనా?" అంటూ చేతులు కట్టుకుని అడిగాడు.

"ఛత్. నీకు సిగ్గులేదు. ఇంత అల్లరోడివని తెలిస్తే నీ ట్యాక్సీ ఎక్కేదాన్ని కాదు" అంది పెదవులు బిగించి. ఆమె కనులు సూటిగా అతడ్నే చూస్తున్నాయి.

"పోనీ వేరే ట్యాక్సీ పిలవనా? నాకీ తలనొప్పి తగ్గుతుంది" అడిగాడు.

ఆమె బదులు చెప్పకుండా అలా అతడి ముఖంలోకి చూస్తూనే ఉంది. అందమైన ఆమె కళ్ళల్లో ఏదో కొత్త కాంతి. అది కృతయుగ్‌ని కాస్త తికమక పెట్టింది.

"ఏంటా చూపు. నాకు సిగ్గేస్తోంది" అన్నాడు ముఖం తిప్పుకుంటూ. అంతే – ఇక ఆపుకోలేక ఫక్కున నవ్వేసింది స్నిగ్ధ. "నీకు సిగ్గా... యూ నాటీ" అంటూ తెరలు తెరలుగా నవ్వుతూనే ఉంది.

ఆమె నవ్వుతో శృతి కలిపాడు కృతయుగ్. ఇద్దరి నవ్వులతో అడవి పులకించింది. అప్పటికి సగం దూరం వచ్చేశారు. ఎటు చూసినా ఎత్తయిన వృక్షాలు.

దట్టమైన పొదలు, లతలు, పచ్చగా కనువిందు చేస్తున్న అడవి. ఒక కొండపాదంలోని మడుగును చుట్టి ఎగువకుపోతోంది గ్రావెల్ రోడ్డు. దారిలో రెండు గిరిజన గూడేల్ని చూశారు.

ఈ మార్గంలో ఎప్పుడో ఒకవెహికిల్ ఎదురవుతోంది. తనూ కారుదిగింది స్నిగ్ధ.

"వావ్. బ్యూటిఫుల్" అంటూ పరవశంతో అలా చూస్తూ నిలబడి పోయింది. పొదల వెంట చెంగుచెంగున దూకుతున్నాయి కుందేళ్ళు. తటాక తీరంలో జింకల గుంపొకటి పచ్చిక మేస్తోంది.

కొమ్మల వెంట అడవి పక్షుల కిలకిలా రావాలు కొత్త సంగీతం విన్పిస్తున్నాయి. తమ పక్కనుంచే పరుగులు తీస్తున్న నెమళ్ళ గుంపును చూడ్డానికి రెండుకళ్ళు చాలడంలేదు. మడుగు అవతల కొండపైనుంచి ఎక్కడో కోయిల కూహూకుహూ నాదం కమ్మగా మనసును పులకింప చేస్తోంది. మడుగులో విరబూసిన తామర పూలవెంట తుమ్మెదల ఝుంకారనాదం స్పష్టంగా వినవస్తోంది. ఏదో ఒక అద్భుతలోకంలో ఉన్నట్టుంది. స్నిగ్ధ ముగ్ధురాలయిపోయి అలా నిలబడి పోయింది.

"తీసుకొచ్చి అడవిలో పడేశానేమిటని చూస్తున్నావా?" పక్కకొస్తూ అడిగాడు కృతయుగ్.

"అలాగని నేనన్నానా?" దూరంగా ఎగురుతున్న గువ్వలజంటని చూస్తూ అడిగింది.

"ఫీలవుతున్నావేమోనని..."

"లేదు... నువ్విటు తీసుకురాకపోతే ఈ అడవి అందాలన్నీ మిస్సయ్యే దాన్ని. థ్యాంక్స్" అంది కళ్ళలోకి చూస్తూ. పది సెకన్లు అలా చూస్తూండిపోయారు.

ఆమె చూపుల్లో ఏవో కొత్త అర్థాలు తెలుస్తున్నాయి అతడికి. అది నిజమా కాదా తెలీని పరిస్థితి. కాని అలా చూస్తూంటే తెలీని పులకింత.

"లేటవుతోంది. బయలుదేరదాం" హెచ్చరించాడు.

"ఈ అడవిలో క్రూరమృగాలుండవా?" అడిగింది.

"ఉంటాయి. లోతట్టు అడవిలో ఉంటాయి. జనావాసాల వైపు రావు. కాని పాములు, కొండచిలువలు, మండ్రగబ్బలు తిరుగుతుంటాయి. ఎక్కువ సేపు నేలమీద నిలవడం ప్రమాదం."

"అలాగా... ఓ మైగాడ్. కృతా... చూడు అటు చూడు" అంటూ అతడి భుజం మీద చెయ్యేసి రెండో చేయెత్తి దూరంలోని ఒక పొదవైపు చూపించింది స్నిగ్ధ.

అటూ చూసిన కృతయుగ్ కూడా ఆశ్చర్యపోయాడు. ముద్దపసుపు రంగులో మెరిసిపోతున్న బంగారు కుందేలు ఒకటి ఆ పొదమీద కూర్చుని చిగురుటాకులు తుంచి తింటోంది. దాన్ని గోల్డెన్ రేబిట్ అంటారు.

చాలా అరుదైన కుందేలు జాతి అది. ఈ ప్రాంతాల్లో ఉన్నాయని విన్నాడు గాని తనూ ఇప్పుడే చూడ్డం. వీటికి ఒంటినిండా దట్టమైన బొచ్చు ఉండి ఎనిమిది నుంచి పది అంగుళాల ఎత్తుకు మించి పెరగవు. అందంలో వీటికి సాటి మరేదీ లేదు. వీటిని పట్టాలన్నా కష్టమే. అంత తేలిగ్గా దొరకవు.

"చాలా అందంగా ఉంది. ముద్దొస్తోంది" అన్నాడు.

"ఆ ముద్దు నాక్కావాలి" అంది. "వ్యాట్?"

"ఆ కుందేలు నాక్కావాలి. తెచ్చియ్యవా"

"స్నిగ్ధా. మనం కోటకు వెళ్ళాలి గదా..."

"నో ప్రాబ్లం. అదక్కడే ఉంటుంది. ఎప్పుడైనా చూడొచ్చు. ఇది కావాలంటే దొరకదు. పెంచుకుంటాను. ప్లీజ్. నాకోసం తెచ్చియ్యవా?" చిన్న పిల్లలా మారాంచేసింది. ఒకమ్మాయి మోజుపడి నాకోసం తెచ్చియ్యవా అంటే సాహసించని మగాడుంటాడా? ఆమె సరదా చూసి ముచ్చటేసింది కృతయుగ్‌కి.

"ఓ.కే. ట్రై చేస్తాను..."

"ట్రై చేయడం కాదు. పట్టుకు రావాలి. ప్రాణాలతో"

"ఓ.కే. ఓకే. నే వచ్చేవరకు కారు దిగొద్దు. లోనకూర్చో" "ఓ.కే" అంటూ కార్లోజొరబడి డోర్ మూసుకుంది స్నిగ్ధ. చప్పుడుగాకుండా కుందేలువున్న పొదవైపు బయలుదేరాడు కృతయుగ్.

*   *   *   *   *

"ఏరా. ఏమైపోయింది ట్యాక్సీ. ఇదిగో వచ్చేస్తుందని మేడమ్ చెప్పడమేగాని కానరాదేం? అదేమన్నా జంతర్ మంతర్ మాయ ట్యాక్సీనా! ఆకాశానికెగిరి పోయిందా?" గ్రామం దగ్గర పడుతున్నా తమ క్కావలసిన నంబర్ ట్యాక్సీ జాడ కనబడక విసుగ్గా అరిచాడు పీటర్.

వాడి అరుపులు వినికూడా ఒక్కడూ బదులివ్వలేదు. ఇవ్వటానికి సమాధానం వాళ్ళకి తెలిస్తే గదా! ట్యాక్సీ కోసం ఎదురుచూసిచూసి కళ్ళు కాయలు కాచి పిచ్చెక్కి నట్టుంది అందరికీ.

స్లోగా వెళ్తోంది వాళ్ళ జీప్. ట్యాక్సీకోసం వెదుకు లాడ్డంలో ఎదురుగా వస్తున్న రెడ్ ఫియట్‌ని ఎవడూ గమనించలేదు. గ్రామం ఆ చివరవున్న హోటల్ భద్రాచలంలో భోంచేసి బైలుదేరివస్తోంది ముగ్ధ.

గ్రామం దాటగానే తమ జీప్ ఎదుర్రావటం గమనించి కోపంతో కరినాగులా బుసలుకొడుతూ కారు పక్కకు తీసి పీటర్‌కి ఫోన్‌చేసింది.

అప్పటికే ఆమెనుదాటి రెండువందల గజాలు ముందుకు పోయింది జీప్. "చుంచుముఖం వెధవల్లారా. ట్యాక్సీని ఫాలో చేయకుండా ఇక్కడేం చేస్తున్నార్రా?" కొరడా ఝుళిపించినట్టు అరిచింది.

"ట్యాక్సీ... ట్యాక్సీ కనబడలేదు మేడమ్" కంగారుగా బదులిచ్చాడు పీటర్.

"కనిపించలేదా! ఐతే పేపర్‌లో ప్రకటనిద్దామా?"

"అది కాదు మేడమ్..."

"పీటర్ యూ బ్లడీ యూస్‌లెస్ ఫెలో. నేను చెప్పిందేమిటి మీరు చేస్తోంది ఏమిటి? రోడ్డుమీద షికారు చేస్తే ట్యాక్సీ కన్పిస్తుందా?"

"మేడమ్. మీరు మా సిన్సియారిటీని అవమానిస్తున్నారు. సార్‌నడగండి మా గురించి, చెప్తారు."

"మా డాడీనా...? ఆయన మతిమరుపు సంగతి నాకు తెలుసుగాని, తిప్పండి ముందు మీ జీప్‌ని వెనక్కి తిప్పండి"

"తిప్పి... చెప్పండి మేడమ్. మీ కారుని ఫాలో చేయమంటారా?"

"ముందు చెప్పింది చెయ్యరా జంబూకం" అనరిచి లైన్ కట్ చేసింది ముగ్ధ.

అవతల జీప్‌లో వున్న పీటర్‌కి పిచ్చి పట్టినంత పనై జుత్తు పీక్కుంటూ "ఆపు. జీప్ ఆపరా" అనరిచాడు.

సడెన్ బ్రేక్‌తో జీప్ ఆపాడు డ్రైవర్. "వెనక్కి తిప్పు" మళ్ళీ అరిచాడు. జీప్ వెనక్కి తిరిగింది. "ఆగనా, వెళ్ళనా?" అనుమానంగా అడిగాడు డ్రైవర్.

"రెండూ వద్దు. చచ్చిపో. ఇక్కడే చచ్చిపోరా. మెంటల్‌దాంతో పనిచేయడం కన్నా చావడమే మేలు. ఇంతకీ... జంబూకం అంటే ఏమిట్రా?"

"జంబూకం అంటే కుక్కనుకుంటా బాబాయ్" చెప్పాడొకడు. "కాదుకాదు. నక్క" అన్నాడు ఇంకొకడు.

"నక్కా... అయితే ఆడనక్కని ఏమంటార్రా?"

"ఆడజంబూకం బాబాయ్"

"అలాగా... ఐతే అదే మన లేడీబాస్. ఇప్పుడు ఫోన్ చేస్తుంది ఆగండి" పీటర్ మాటల్లోనే ఫోన్‌మోగింది.

ముగ్ధ చాలా చురుకైనది, తెలివైనది. తన మనుషులు ట్యాక్సీ ఎదురుపడలేదని చెప్పగానే తీవ్రంగా ఆలోచించడం ఆరంభించింది.

మెయిన్ రూటు లేటైనా ప్రయాణం సాఫీగా సజావుగా సాగుతోంది గాబట్టి కృతయుగ్ ట్యాక్సీ దంతెవారా వెళ్ళి కోటమార్గంగా ప్రయాణిస్తుందనుకుంది. అందుకే ఆల్టర్నేటివ్ గురించి ఆలోచించలేదు.

తన మనుషుల్ని తను కావాలని తిడుతుందేగాని వాళ్ళు చాలా ఖచ్చితంగా చెప్పింది చేస్తారని తెలుసు. ట్యాక్సీ వాళ్ళకి ఎదురుకాలేదంటే డౌటు లేదు. నాటు మార్గంగా వాళ్ళు వెళ్తూండాలి.

పీటర్ వర్గాన్ని ఆ రూట్‌లో పంపించి తను – మెయిన్ రూట్‌లో వెళ్తే సరి. వాళ్లు ఏ రూట్‌లో వెళ్ళినా తమ నుంచి మిస్ కాలేరు. ఈ ఆలోచన రాగానే – పీటర్‌కి ఫోన్ చేసింది. "జీప్ రివర్స్ తీసుకున్నాం మేడమ్. చెప్పండి" అడిగాడు వాడు.

"ఎగువన కోటకుపోయే అడ్డదారి నాటు రూటొకటుంది తెలుసా?" అడిగింది.

"తెలుసు మేడమ్"

"ట్యాక్సీ ఆ రూట్‌లో వెళ్తోంది. అందుకే మీకు ఎదురుకాలేదు. మీరు ఆ రూట్‌లో రండి. వీలయితే దారిలోనే పని పూర్తిచేయండి.

మనం కోట దగ్గర కలుసుకుందాం. మూవ్ ఫాస్ట్" అంటూ ఆర్డర్ చేసి తన ఫియట్ కార్లో వేగంగా అక్కడ్నుంచి ముందుకెళ్ళిపోయింది ముగ్ధ.

కాస్సేపట్లోనే పీటర్ బృందం జీప్ నాటుదారివెంట అడవిలో ప్రవేశించింది.

* * * * *

స్నిగ్ధ ముచ్చట తీర్చడంకోసం - గోల్డెన్ రేబిట్‌ను పట్టాలని - వీరాధివీరుడిలా బయలుదేరాడేగాని అదంత సులువుకాదని కాసేపటికే అర్ధమైంది కృతయుగ్‌కి. ఎంత సద్దుచేయకుండా వెనకమాటున సమీపించినా అది పసిగట్టేసింది. చెంగున పొదనుంచి దూకి ఎగువకు పరుగిచ్చుకుంది.

ఇక మొదలయ్యాయి అతడి కష్టాలు. బయలు ప్రదేశంలో అయితే కుందేలును పట్టడం ఏమంత కష్టమైన పనికాదు. కాని అక్కడ చుట్టూ అన్నీ పొదలు, తీగలు. వాటిలో ఇటునుంచి దూరి అటునుంచి పరుగెత్తే కుందేలు చేతికి చిక్కడం అసాధ్యం.

పైగా అక్కడక్కడా ఆగి తీరిగ్గా చేతికి దొరికిన కాయో దుంపోతింటూ పొడవాటి చెవుల్ని రిక్కించి గోళీల్లాంటి కళ్ళతో తనను వెక్కిరిస్తున్నట్టు అది చూస్తుంటే కృతయుగ్‌లో పట్టుదల రెట్టింపయింది.

తరుముతూనే ఉన్నాడు. అలా ట్యాక్సీ నుంచి ఎంత దూరం వచ్చాడో అతను గమనించలేదు. కుందేలును పట్టడమే లక్ష్యంగా ముందుకు సాగాడు.

అర్ధగంటపైగా కనీకనిపించకుండా, దొరికీ దొరక్కుండా ముప్పుతిప్పలు పెట్టిన కుందేలు ఒక ఒంటరి పొదలో దూరి నక్కి కూర్చుంది.

ఏం చేయాలో పాలుపోలేదతనికి. ఎటునుంచి చేయిచాపినా రెండోపక్క నుంచి జారుకోవడానికి సిద్ధంగా ఉందది. అప్పటికే అలసిపోయాడు. ముళ్ళపొదలు ఒంటిని గీకి వదిలాయి. షర్టు కొంతమేర చినిగింది. ఒళ్ళంతా చెమటలు కారుతున్నాయి. ఏం చేయాలి?

అప్పుడో విషయం ఫ్లాష్‌లా గుర్తొచ్చింది కృతయుగ్‌కి. జాతి కుందేళ్ళకి ఓ అలవాటుంది. అదే వాటిని పట్టిస్తుందని విన్నాడు. ఒకరుపోసిన నీళ్ళు తాగామా ఒకరు గీచిన గీత దాటామా అని అవి వెక్కిరిస్తాయట. ఇదేదో తమాషాకి చెప్పుకున్నా వాస్తవం.

అడవి కుందేళ్ళు మామూలు నీళ్ళుతాగవు. ఆకుల మీద మంచునీళ్ళు తాగి బతుకుతాయి. అలాగే ఎవరన్నా గీత గీస్తే ఆ గీత దాటి అవతలికి పోవు. మరో దారి వెతుక్కుంటాయి.

అందుకే వేటగాళ్ళు కుందేళ్ళున్న పొద చుట్టూ గీత గీచి చిన్నదారి వదిలి అక్కడ వల ఉంచుతారు. పొదను కదపగానే అవి వచ్చి వల్లోపడతాయి.

ఈ విషయం గుర్తురాగానే కృతయుగ్ ఒక ఎండుకట్టె అందుకుని దాంతో పొద చుట్టూ గీత గీచి చిన్నదారి వదిలాడు. అక్కడ తను మోకాళ్ళమీద కూర్చుని కట్టెతో పొదను తట్టాడు.

అంతే. దూకుతూ బయటికొచ్చి పొద చుట్టూ తిరిగి వచ్చి నేరుగా అతడి చేతులకు చిక్కింది బంగారు కుందేలు. అయితే ఆశ్చర్యం. ఒకటికాదు రెండు అవి. ఒకటి ఆడ ఒకటి మగ. అవి జంట కావచ్చు. అందుకే జంటగా చిక్కాయి.

వీటిని చూస్తే స్నిగ్ధ చాలా సంతోషిస్తుంది. పారిపోకుండా వాటి కాళ్ళు కట్టి చెవులు పట్టుకుని తిరుగు ముఖం పట్టాడు. అవి తినడం కోసం దారిలో కొన్ని దుంపలూ అవీ సేకరించాడు.

ట్యాక్సీని సమీపిస్తుండగానే జరక్కూడనిదేదో జరిగిపోయిందనిపించింది కృతయుగ్‌కి. ట్యాక్సీ ఎక్కడ ఆపాడో అక్కడే ఒంటరిగా నిలబడుంది అది. కాని ట్యాక్సీలో ఉండాల్సిన స్నిగ్ధ లేదు.

ఆమె ఎయిర్‌బ్యాగ్ కూడా లేదు. "స్నిగ్ధా..." పెద్దగా అరిచాడు కృతయుగ్.

* * * * *

కృతయుగ్ కుందేలు కోసం వెళ్ళాక చాలాసేపు ట్యాక్సీలోనే కూచుంది స్నిగ్ధ. ఎంతకీ అతను వెనక్కి రాకపోవడంతో ఆమె మనసు ఆందోళనకు గురైంది. అసలే ఈ అడవిలో పాములూ, మండ్రగబ్బలూ తిరుగుతాయని తనే చెప్పాడు.

అక్కడ కృతయుగ్‌కి ఏమన్నా జరిగితే ఎవరుదిక్కు? ఛ! తనేమిటి ఇంత ఫూలిష్‌గా ప్రవర్తించింది? అడిగే ముందు ఏదీ ఆలోచించక్కర్లేదా? ఆ కుందేలు లేకపోతే నష్టం ఏమిటి? కాని కృతయుగ్.

అతడికేమన్నా అయితే తను తట్టుకోగలదా? అతడి బామ్మకు దిక్కెవరు?

వచ్చేస్తాడులే అని మనసును ఎంత సరిపెట్టుకున్నా గుండెల్లో ఆందోళన పెరుగుతోందే గాని తగ్గడంలేదు. అతడు వెళ్ళినవైపే చూస్తూ ఎలాగో ఇరవై నిముషాలు ఓపిక పట్టింది. ఇక ఆగలేక కారు దిగింది.

అతడు వెళ్ళిన దిశగా వెళ్ళి ఏం జరిగిందో చూడాలనుకుంటుండగా ఎగువనుంచి ఏదో వెహికల్ వస్తున్న ఇంజన్ సౌండ్ విన్పించింది. గిరుక్కున తిరిగి అటు చూసింది. జీప్ ఒకటి ఇటే వస్తోంది.

దాన్ని చూడగానే ప్రాణం లేచి వచ్చినట్టయింది స్నిగ్ధకు. వాళ్ళ సాయం తీసుకుని కృతయుగ్‌ని వెతకాలనుకుని అక్కడే ఆగింది.

రివ్వున వచ్చి పక్కన ఆగింది జీప్.

అందులోంచి దిగుతున్న మనుషుల్ని చూడగానే గుటకలు మింగింది. అంతా దుక్కల్లాంటి రఫ్ మనుషులు. డ్రైవరుతో కలిపి అయిదుగురున్నారు. వాళ్ళంతా పీటరు మనుషులని ఆమెకు తెలీదు.

ట్యాక్సీని చూడగానే వెదకబోయిన తీగ కాలికి తగిలినంతగా సంబర పడ్డాడు పీటర్. కాని కృతయుగ్ అక్కడుంటే తమ ఆటలు సాగవని తెలుసు. తొందర పడకూడదు అనుకుంటూ–

"అరె. ఇది మన కృతయుగ్ ట్యాక్సీ. ఇక్కడుందేమిట్రా? ఎవరమ్మా నువ్వు? కృతయుగ్ ఎక్కడా?" అంటూ ఎంతో మంచిగా అడిగాడు పీటర్.

"కృతయుగ్ మీకు తెలుసా?" అంది స్నిగ్ధ.

"మాకు తెలీకపోవడం ఏమిటి. మేం ఫ్రెండ్స్" చెప్పాడు ఒకడు. ఆ మాటలు నమ్మి – అమాయకంగా జరిగిందంతా చెప్పింది స్నిగ్ధ.

కృతయుగ్‌ని వెదికి పెట్టమని అర్థించింది. కృతయుగ్ అక్కడలేదని తెలీగానే పీటర్ ఉబ్బితబ్బిబ్బయ్యాడు. ఆనందంతో పొంగిపోయాడు. తన మనుషులకి సైగచేశాడు. అంతే...

ఒకడు సడెన్‌గా స్నిగ్ధ ముక్కువద్ద జేబురుమాలు అదిమాడు. మరుక్షణం తెలివితప్పి పడిపోయింది. ఆమెను జీప్‌లోకి చేర్చారు. ఆమె ఎయిర్‌బ్యాగ్ ట్యాక్సీలో ఉంది. దాన్ని కూడా తెచ్చి జీప్‌లో పడేశారు.

కన్నుమూసి తెరిచేలోన – ఆ ప్రాంతానికి దూరంగా వెళ్లిపోయింది జీప్.

* * * * *

"స్నిగ్ధా! ఎక్కడున్నావ్?" అప్పటికి పదిసార్లయినా అరిచి ఉంటాడు కృతయుగ్. అతడి అరుపులు కొండకోనల్లో ప్రతిధ్వనిస్తున్నాయి గాని స్నిగ్ధ జాడ మాత్రం లేదు.

స్నిగ్ధను ఒంటరిగా వదిలివెళ్ళి తను తప్పు చేశాడా! తొలిసారిగా ఆలోచనలో పడ్డాడు కృతయుగ్.

ఇది నట్టడవి ఎటునుంచయినా ప్రమాదం పొంచి ఉండొచ్చు. ఆ పైన ముగ్ధ అనే ఆ అపరిచిత ఉండనే ఉంది. ఎవరిని ఎందుకు ఫాలో చేస్తోందో అర్థం కాలేదు. ఇదంతా తెలిసీ ఆమె అడిగిందే తడవుగా తను కుందేలుకోసం పరుగు తీయడం ఏమిటి?

బుద్ధికర్మానుసారిణి అంటే ఇదేనా?

ఆమె అడగటం ఏమిటి? తను వెళ్ళడం ఏమిటి? తిరిగి వచ్చేసరికి ఆమె కనబడకుండా పోవడం ఏమిటి? అలాగని ఆలోచిస్తూ కూర్చునే సమయమూ లేదు. ఎలాగయినా వెదకి ఆమెను పట్టుకోవాలి.

కారు డిక్కీ తెరిచి కుందేళ్ళను, దుంపల్నికూడా లోన ఉంచి డిక్కీమూసి తాళంవేశాడు.

ఇక తన పరిశోధన ఆరంభించాడు. కారుచుట్టూ నేలను పరిశీలించాడు. నేలమీద తమ కారుటైర్ల గుర్తులతో బాటు కొన్ని అడుగుజాడలూ కన్పించాయి.

కాస్త ముందుకు వెళ్ళిచూడగానే జీప్‌టైర్ల గుర్తులు కన్పించాయి. మొదట అవి రెడ్‌ఫియట్ గుర్తులనుకున్నాడు. కాని వెడల్పును బట్టి అవి ఖచ్చితంగా జీప్ గుర్తులుగా నిర్ధారించుకున్నాడు.

పైగా జీప్ రివర్సయి వెళ్ళినట్టు తెలుస్తోంది. బాగా శిథిలమై దుమ్ము రేగి వున్న బాట మీద గుర్తులు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

జీప్‌లో వచ్చి ఆమెను ఎత్తుకెళ్ళిన వాళ్ళు ఎవరు? గూండాలా? ముగ్ధ తాలూకు మనుషులా? వాళ్ళు ఎవరైనా గానీ తన చేతిలో చచ్చారే.

ట్యాక్సీని రివర్స్ తీశాడు కృతయుగ్. కొంతదూరం వెనక్కి వచ్చాక జీప్ బాట వదిలి ఎడంపక్కగా అడవిలోకి ప్రయాణించినట్టు గుర్తుల్ని బట్టి నిర్ధారించుకుని ట్యాక్సీని కూడా అటు మళ్ళించాడు.

* * * * *

స్నిగ్ధకు స్పృహ తెలిసేసరికి ఒక ఫోల్డింగ్ కాట్‌మీద పడుకునుంది. కళ్ళు మండుతున్నాయి. తలంతా దిమ్ముగా ఉండి కాసేపు తనెవరు, ఎక్కడుంది, ఏం జరిగింది... ఏదీ గుర్తులేకుండా పోయింది.

కళ్ళు మూసుకుని కాసేపు అలాగే ఉండిపోయింది. క్రమంగా జరిగిన సంఘటనలన్నీ ఒక్కటొక్కటీ గుర్తు రానారంభించాయి. ఎగువన సమీపంలోంచి జలపాతం శబ్దం హోరు వినవస్తోంది. దానికి సంబంధించిన వాగు దగ్గర గుడారం అది.

వాళ్ళు తనను మత్తుమందిచ్చి ఎత్తుకొచ్చారు. ఆ సంగతి గుర్తు రాగానే ఉలిక్కిపడి లేచి కూర్చుంది.

చేతి వాచీ వంక చూసింది. సాయంకాలం నాలుగు గంటలు చూపింది. డేటు మారలేదు. మూడు గంటల సమయంలో వీళ్ళ జీప్ వచ్చింది. అంటే సుమారు ఒక గంటసేపు తను స్పృహలో లేదు.

స్నిగ్ధకు అంతా అయోమయంగా ఉంది. అక్కడ కృతయుగ్ పరిస్థితి ఏమిటో తెలీదు. ట్యాక్సీలో తను కనిపించక ఎంత కంగారుపడుతున్నాడో ఏమో. ఆ బంగారు కుందేలు కనబడ్డం ఏమిటి, అది కావాలని తను పంపించడం ఏమిటి!

అలనాడు సీతాదేవి కూడా బంగారులేడి కావాలని రాములవారిని పంపించి గీత దాటి కష్టాలపాలయింది. ఇప్పుడు బంగారు కుందేలు కావాలని కృతయుగ్‌ని పంపించి తనూ కష్టాల పాలయింది.

టాక్సీ దిగొద్దని చేసిన హెచ్చరిక పెడచెవిన పెట్టి దిగడం తను చేసిన ఘోరమైన తప్పిదమే. అందుకే సీతకష్టాలు తనకీ చుట్టుకున్నాయి.

ఆమె ఆవేదన చెందుతుంటే ఉన్నట్టుండి ఎదురు తిరిగింది అంతరాత్మ. 'ఏయ్... ఏమిటే కొత్తగా ఆలోచిస్తున్నావ్? సీతారాములతో పోలికేమిటి? సీతమ్మవారు రాములవారి భార్య. లోకమాత. నువ్వేమీ కృతయుగ్‌కి పెళ్ళానివి కావు. సీతతో పోల్చుకుంటావేంటి నాన్సెన్స్' అంటూ వెక్కిరించింది.

'నువ్వు నోరు మూస్తావా? చేసుకుంటే పెళ్ళాన్ని కానా ఏమిటి? అవతలికి పో' అంటూ అంతరాత్మని గదమాయించి చుట్టూ పరికించింది.

అందమైన రంగుల క్లాత్ కలిగిన చిన్న గుడారంలో ఉంది తను. పక్కన ఒక ఫోల్డింగ్ టేబుల్, దానిపక్కన రెండు ఫోల్డింగ్ ఛైర్స్ ఉన్నాయి. గుడారం ఎంట్రన్స్‌లో అడ్డంగా కట్టినక్లాత్ గాలికి ఎగురుతుంటే బయట మనుషులు కన్పిస్తున్నారు.

కొంతదూరంలో వాళ్ళు చితుకులమంట వద్ద కూర్చున్నారు. మందు కొడుతూ కాల్చిన చేపలు తింటున్నారు. మొత్తం అయిదుగురున్నారు. వాళ్ళ పక్కనే జీప్ ఉంది. తీవ్రంగా ఆలోచిస్తోంది స్నిగ్ధ.

మొదటినుంచీ కృతయుగ్ ఏదో జరగనుందని అనుమానిస్తూనే ఉన్నాడు. అందుకే ఆ రెడ్ ఫియట్ ఫాలో చేయడాన్ని సందేహిస్తూ వచ్చాడు.

ఈ కిడ్నాప్‌కి ముగ్ధ అనే ఆ యువతికి ఏమన్నా సంబంధం ఉందా? ఉంటే తనిక్కడికి రావాలిగా. రాలేదూ అంటే వీళ్ళువేరేమో. కావచ్చు. లేదా ఆమె మనుషులు కావచ్చు. ఇప్పుడే ఒక నిర్ణయానికి రావడానికి లేదు. ముందు అర్జంట్‌గా ఈ సంగతి కృతయుగ్ సెల్‌కి ఫోన్‌చేసి చెప్పాలి.

తన ఎయిర్‌బ్యాగ్ అందుకుని సెల్‌ఫోన్ కోసం వెదికింది. ఫోన్‌లేదు. వాళ్ళు తీసేసుకున్నట్టున్నారు. ఆమె నిరుత్సాహపడుతుండగా టేబుల్ మీద ఇంకో సెల్ కన్పించింది. బహుశా దీన్ని వాళ్ళిక్కడ మర్చిపోయి ఉండాలి. ఎవరో ఒకరు వచ్చేలోన కృతయుగ్‌కి మెసేజ్ పాస్ చేయాలి. ఆలోచిస్తూ ఫోన్ అందుకుంది.

అంతలో జీవం పోసుకుంది ఫోన్. యధాలాపంగా నంబర్ చూసింది స్నిగ్ధ. ఆ నంబరు ఆమె మైండ్‌లో రిజిష్టరయిపోయింది.

ఇంతలో ఫోన్‌శబ్దంవిని ఎవరోవస్తున్న అలికిడైంది. అంతే – ఫోన్ టేబుల్ మీదవదిలి ఎప్పటిలా పడుకుని కళ్ళుమూసుకుంది. వచ్చినవాడు ఓసారి స్నిగ్ధవంక చూసి ఫోన్ ఆన్‌చేశాడు.

"మేడమ్.... ఆ పనిమీదే ఉన్నాం మేడమ్. ఇంకా స్పృహలోకి రాలేదు మేడమ్. పీటర్‌ని నమ్మండి మేడమ్" బయటకుపోతూ వాడు ఫోన్‌లో మాట్లాడుతున్న మాటలు అంతవరకే వింది స్నిగ్ధ.

క్రమంగా అతని మాటలు దూరమై ఏమీ విన్పించలేదు స్నిగ్ధకి.

అంటే ఈ కిడ్నాప్ ముఠాలీడరు ఈ చింపిరి జుట్టు పీటరయి ఉండాలి. మరి వీళ్ళని ఫోన్‌లో కమాండ్ చేస్తున్న మేడమ్‌గారు ఎవరు?... ముగ్ధ?!

తొలిసారిగా ఆమెలో తొంగిచూసిందా అనుమానం. వీళ్ళధోరణి చూస్తుంటే తనకి హానిచేసే ఉద్దేశంలో వున్నట్టు కన్పించడంలేదు. ఇక దాగుడు మూతలు అనవసరం అన్పించింది. లేచి కూర్చుంది. అంతలో పీటర్ లోపలకొచ్చి ఆమెను చూశాడు. ఒకసారి కోపంగా అతడ్ని చూసి మౌనంగా కూర్చుంది స్నిగ్ధ. వాడు బయటకు చూస్తూ-

"అరే. మేడమ్‌గారికి స్పృహవచ్చింది కాఫీప్లాస్కు పట్రండి రా" అనరిచాడు.

"మర్యాదలు తర్వాత. నన్నెందుకు ఎత్తుకొచ్చారు? ఏం చేద్దామనీ?" సీరియస్‌గా అడిగింది.

"క్షమించండి మేడమ్. మీకెలాంటి హాని జరగదు. అలాంటి ఉద్దేశం కూడా మాకులేదు. మీవల్ల మాకు ఉపకారం జరగాలి. అందుకే ఇదంతా" చెప్పాడు.

"ఉపకారం కోరే పద్ధతి ఇదేనా? నావల్ల ఏ మవుతుంది?"

"మీ వల్ల అవుతుంది మేడమ్. పని పూర్తికాగానే మిమ్మల్ని భద్రంగా కృతయుగ్ వద్దకి చేరుస్తాం"

"చేర్చలేరు. వాడు మిమ్మల్ని చంపేస్తాడు. ఇంతకీ పనేమిటో చెప్పు. కూర్చో"

"అయ్యో. మీముందు కూర్చునేంత వాళ్ళం కాదు తల్లీ. ముందు కాఫీ తాగండి చెప్తాను" అంటూ అనుచరుడు అందించిన కాఫీ ప్లాస్కు, గ్లాసు టేబుల్ మీద ఉంచాడు. మందు కొట్టున్నా చాలా పద్ధతిగా మాట్లాడుతున్నాడు పీటర్.

ఈ పరిస్థితిలో కాఫీ తనకి అవసరమే. కాదనకుండా కాఫీ గ్లాసులోకి వంచుకుని తాగింది స్నిగ్ధ.

అంతవరకు చేతులు కట్టుకుని వినయంగా అక్కడే నిలబడ్డాడు పీటర్. "ఇప్పుడు చెప్పు పీటర్. ఎందుకు తీసుకొచ్చారు నన్ను?" అడిగింది.

అతను సమాధానం చెప్పకుండా దుస్తుల్లోంచి ఒక వస్తువును తీసి ఆమె ముందుంచాడు. గ్రీన్ కలర్ ముఖమల్ క్లాత్‌లో చుట్టివున్న ఆ వస్తువు ఏమిటో అర్థంగాక ఏమిటన్నట్టు చూసింది.

"మీరు పురావస్తుశాఖలో పనిచేస్తున్నారు. విప్పి చూడండి మేడమ్. మీకు అర్థమవుతుంది." చేతులు కట్టుకుని అదే వినయంతో చెప్పాడు పీటర్.

స్నిగ్ధకు విషయం కొంత బోధపడింది. కాని ఇంకా స్పష్టమైన రూపం రాలేదు. సందేహించకుండా ఆ వస్తువును తీసుకుని ముఖమల్ క్లాత్‌ని విప్పింది. లోన ఒక రాగి గొట్టంలాంటిది బయటపడగా ఆమె కళ్ళు ఆశ్చర్యంతో మెరిశాయి.

సుమారు పది అంగుళాల పొడవున్న దళసరి రాగి గొట్టం అది. ఒకవైపు మూసి ఉండి రెండోవైపు మూత ఉంది. అది ఈ కాలం వస్తువు కాదు.

చాలా కళాత్మకమయిన పనితనం దానిమీద కన్పిస్తోంది. గొట్టం మధ్యలో సూర్యబింబం, దానినుంచి ప్రసరిస్తున్న కిరణాలు చెక్కి ఉండగా మిగిలినవన్నీ లతలు, పూలు చక్కగా డిజైన్ చేయబడ్డాయి.

దీన్ని చూస్తుంటే సుమారు అయిదు లేదా ఆరు వందల సంవత్సరాల క్రితం నాటిది అయిఉండొచ్చునిపించింది. ఇంతకీ ఇందులో ఏముంది? దేనికి సంబంధించిన రహస్యం దాగుంది?

ఒకప్పుడు రాజులు, చక్రవర్తులు లిఖించిన లేఖలను ఇలాంటి వాటిలో ఉంచి సీలువేసి వార్తాహరుల చేతికిచ్చి పంపించేవారు. అప్పటి సమాచార వ్యవస్థ అది. అది కూడా సీలు వేయబడినదే. కాని సీలు తీసేసి ఇంతకు ముందే ఎవరో ఇందులో ఏముందో చూశారు. ఆలోచిస్తూ మూత తెరిచింది స్నిగ్ధ.

జాగ్రత్తగా లోపల్నుంచి చుట్టచుట్టిన ఒకరాగిరేకును బయటికి తీసింది. చుట్టవిప్పి టేబుల్‌మీద పరిచి గమనించింది. విచిత్రం అది పరిపూర్ణమైన రేకు కాదు. ఎనిమిది అంగుళాల వెడల్పు, సుమారు పన్నెండు అంగుళాల పొడవు కలిగిన రేకులో–

ఎడంపక్క దిగువ మూలనుంచి కుడిపక్క పైమూల వరకు క్రాస్‌గా కత్తిరించి రెండు భాగాలు చేయగా అందులో ఒక భాగం ఇది.

రెండో భాగం ఏది? గొట్టాన్ని దులిపి చూసింది. లోన ఇంకేమీ ఆధారాల్లేవు.

ఇందులో అమూల్యమైన సమాచారం ఏదో ఉందనటానికి ఈ ఒక్క కారణం చాలు. ఆ కాలం వాళ్ళు మన కన్నా తెలివైనవాళ్ళు.

మనకన్నా అనేకన్నా మనిషి తెలివితేటలు ఆయా కాలాలకనుగుణంగా సమృద్ధిగా ఉన్నాయని చెప్పుకుంటే సముచితంగా ఉంటుంది.

పూర్తి సమాచారం ఏ ఒక్కరికో అందితే రహస్యం బయటపడుతుందన్న ఉద్దేశ్యంతో దీన్ని రెండు భాగాలు చేసి ఒక ముక్క ఇందులో ఉంచారు. రెండో ముక్క ఎక్కడుందో ఆ దేవుడికెరుక. రెండూ కలిపితే గాని పూర్తి సమాచారం తెలీదు.

తీవ్రంగా ఆలోచిస్తూ రేకు మీది రాతల్ని పరిశీలించడం ఆరంభించింది.

ఈ లోపల పీటర్ కాగితాలతో కూడిన ఒక రైటింగ్ పాడ్, ఒక పెన్ను తెచ్చి టేబుల్ మీదుంచాడు.

"అందులో సమాచారం బుర్ర చించుకున్నా మా వాళ్ళకు అర్ధంకాలేదు మేడమ్. ఆ భాష ఇప్పటిది కాదు. మీరు దీన్ని డీకోడ్ చేసి మాకిస్తే చాలు. మీ కష్టం ఉంచుకోం."

ఉన్నట్టుండి రాకూడని అనుమానమే వచ్చింది స్నిగ్ధకి. కళ్ళముందు పీటర్ ముఠా కనబడుతున్నప్పటికీ అసలు సూత్రధారులు వీళ్ళు కాదనిపిస్తోంది. వీళ్ళవెనక ఏదో పెద్ద ముఠా వుండే వుంటుంది.

అయినా తను పురావస్తు శాఖలో పనిచేస్తున్నట్టు వీళ్ళకెలా తెలిసింది. హైదరాబాద్ నుంచి తను దంతేవారా వస్తున్న సంగతి వీళ్ళకెలా తెలుసు?

సందేహం లేదు. హైదరాబాద్ నుంచే వీళ్ళు తనను ఫాలోచేసి వచ్చుండాలి. "ఇప్పుడు మీరు చెప్పినట్టు చేయనంటే ఏం చేస్తారు?" అడిగింది.

"అంత మాటనకండి మేడమ్. మిమ్మల్ని ఏం చేయం. కాని పెళ్ళాం పిల్లలు గలవాళ్ళం. మా బాస్ మమ్మల్ని చంపేస్తాడు."

"ఎవరు మీ బాస్?"

"అది చెప్పకూడదు మేడమ్. ప్లీజ్. చీకటి పడకముందే పని పూర్తి చేస్తే ఎవరి దారిన వాళ్ళం హ్యాపీగా వెళ్ళిపోవచ్చు" అభ్యర్థించాడు. తల పంకించింది స్నిగ్ధ. "చివరిగా ఒక ప్రశ్న. మీరంతా హైదరాబాద్ నుంచే నన్ను ఫాలోచేశారు కదూ?" అడిగింది.

అవునన్నట్టు తలూపాడు పీటర్.

"ఓ.కే. మీ పనిచేసి పెడతాను. బయట వెయిట్ చెయ్యి. అన్నట్టు నా సెల్‌ఫోనిస్తే సంతోషిస్తాను."

"వెళ్ళేప్పుడు తప్పకుండా ఇస్తాను మేడమ్"

మరో మాటకు అవకాశం ఇవ్వకుండా బయటికెళ్ళిపోయాడు పీటర్. వాడి జాగ్రత్త వాడిది. ఇందులో అతన్ని తప్పుపట్టాల్సిన పనిలేదు. రాగిరేకును చేతుల్లోకి తీసుకుని తిరిగి పరిశీలించడం ఆరంభించింది.

*         *         *         *         *

ఆ కాలంలో ఉత్తరాదిన పాళీభాష దక్షిణాదిన ప్రాకృతం ప్రాచుర్యంలో ఉండేవి. సంస్కృతం అందరికీ కామన్ లాంగ్వేజ్.

ప్రాంతీయ భాషలున్నా ఉత్తర ప్రత్యుత్తరాలు రాత కోతలన్నీ ఆ భాషల్లోనే జరిగేవి. శాసనాలనుబట్టి కూడా ఈ విషయం మనకు అర్థమవుతుంది. ప్రస్తుతం రాగి రేకులో లిఖించబడ్డ భాష పాళీభాష, కాబట్టి ఇది ఉత్తరాదిన ఎక్కడో వీళ్ళకి లభించి ఉండాలి.

రేకుమీద ఏవో గుళ్ళు, గోపురాలు, ఊళ్ళకు సంబంధించి సమాచారం, గుర్తులు ఉన్నాయి.

నిధి గురించి చెప్పబడింది. అయితే సగం సమాచారం రెండు ముక్కల్లోకి పోయినందువలన ఈ ఒక్క రేకునుంచి పూర్తి సమాచారం లిఖించడం కష్టం– కాని.. ముందు ముందు ఏమన్నా ఉపయోగపడుతుందేమో... ఎవరు చెప్పగలరు?

ఈ ఆలోచన రాగానే ముందుగా ఒక పేపర్ తీసుకుని మర్చిపోకుండా పీటర్ సెల్‌లో తను చూసిన సెల్‌ఫోన్ నంబరు రాసుకుంది స్నిగ్ధ. తర్వాత రాగిరేకు నమూనాను గీసి అందులో సమాచారాన్ని యాజిటీజ్‌గా ఎక్కించుకుని కాగితాన్ని మడిచి ఎయిర్‌బ్యాగ్‌లో సీక్రెట్ అరలో భద్రం చేసింది.

తర్వాత పీటర్ కోసం రాగిరేకు సమాచారాన్ని పాళీ నుంచి తెలుగులోకి అనువదిస్తూ ఉన్నదున్నట్టుగా పొందుపరచడం ఆరంభించింది. సరిగ్గా అయిదున్నర గంటలకు పని పూర్తయింది.

పీటర్‌ని లోనకుపిలిచింది. అతడి కళ్ళముందే రాగిరేకును చుట్టచుట్టి రాగిగొట్టంలో ఉంచింది. తను డీకోడ్‌చేసిన పేపర్లను కూడా మడిచి అందులోనే ఉంచి మూతపెట్టి అతడికి అందించింది.

అతడి ముఖం సంతోషంతో వికసించింది. చెప్పినట్టే కరెన్సీనోట్ల కట్టను టేబుల్‌మీదుంచాడు. "వద్దు పీటర్. నాకు డబ్బుకి లోటులేదు. ఇది మీరే ఉంచుకుని ఖర్చుపెట్టుకోండి" అంది స్నిగ్ధ.

"అది మీ మంచిమనసు తల్లీ. మమ్మల్ని క్షమించి పనిచేసి పెట్టారు. మీరు నా తృప్తికోసం తీసుకోవాలి. తప్పదు. ఇది మీ సెల్‌పోన్" అంటూ ఫోన్‌కూడా ఇచ్చాడు. ఇక కాదనకుండా వాటిని తీసుకుని లేచింది.

"ఒక్కమాట చెప్పండి మేడమ్. ఇందులో పని కొచ్చే సమాచారం ఏమన్నా ఉందా?" కుతూహలం అణచుకోలేక అడిగాడు పీటర్.

"ఉంది పీటర్. ఏవో పురాతన ఆలయాలకు సంబంధించిన సమాచారం ఉంది. ఒక ఆలయంలో దాచిపెట్టిన నిధి గురించి ఉంది. కాని దాని రెండోభాగం రాగిరేకు దొరికితేనే ఫలితం ఉంటుంది. ఓ.కె. బయలుదేరడం మంచిది కదూ. పొద్దు పోతోంది" అంటూ గుడారంలోంచి బయటికొచ్చింది స్నిగ్ధ.

పీటర్ మనుషులు చకచకా గుడారాన్ని తీసి మడతపెట్టారు. ఫోల్డింగ్ కాట్, ఛైర్స్ సరంజామా అంతా జీప్‌లోకి చేర్చారు. అంతలో ఒకడు పరుగెత్తు కొచ్చాడు. ఎగువన కాపలా ఉంచినవాడు అతను.

"బాబాయ్. ఆ కృతయుగ్ ట్యాక్సీ ఇటే వస్తోంది. మనం బయల్దేరడం మంచిది" అనరిచాడు.

"బాప్‌రే. హరియప్. జీప్ స్టార్ట్ చేయండ్రా" అనరిచాడు పీటర్.

జీప్ బయలుదేరింది. "నువ్విక్కడే ఉండమ్మా ట్యాక్సీ వచ్చేస్తోంది భయంలేదు. థ్యాంక్సమ్మా" అంటూ వెళ్తున్న జీప్‌లోంచి అరిచాడు పీటర్.

చేయి ఊపి వీడ్కోలు చెప్పింది స్నిగ్ధ.

వాగుకు అడ్డంబడి అవతలికెళ్ళి చెట్ల గుబురులో అదృశ్యమైంది జీప్. అది అటువెళ్ళిన రెండో నిముషంలోనే రొదలుచేస్తూ రివ్వున అక్కడికి దూసుకొచ్చి ఆగింది ట్యాక్సీ. ట్యాక్సీ దిగుతున్న కృతయుగ్‌ని చూస్తూ అలాగే నిలబడిపోయింది స్నిగ్ధ. తనకే తెలీకుండా కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

ఆమె క్షేమంగా దొరికినందుకు సంతోషంగా ఉన్నా, ఒంటరిగా నిలబడిన ఆమెను చూసి ఒకింత షాకయ్యాడు కృతయుగ్. అందుకే పరిసరాల్ని గమనిస్తూ అక్కడే ఆగిపోయాడు. ఆమెను కిడ్నాప్ చేసినవాళ్ళ అంతు చూడాలన్న ఆవేశంతో వచ్చాడతను.

కాని అక్కడ గూండాలు లేరు. ఎలాంటి ఘోరాలు జరగలేదు. నిక్షేపంగా ఎయిర్‌బ్యాగ్‌తో దర్శనమిచ్చింది. ఏమనుకోవాలి? అతడా సందిగ్ధత నుంచి బయటపడేలోపలే–ఉన్నట్టుండి కదిలింది స్నిగ్ధ.

సుడిగాలిలా దూసుకొచ్చి అతడ్ని వాటేసుకుంది. మళ్ళీ తప్పిపోతాడేమో అనేంత బలంగా హత్తుకుపోతూ గుండెల్లో ముఖం దాచుకుని ఏడ్చేసింది.

"ఏమైపోయావ్. పాడు కుందేలు. అది దొరక్కపోతే వచ్చేయాలి. ఎక్కడికి పోయావ్. నీ గురించి ఎంత భయపడ్డానో తెలుసా?" అంటూ ఏడుస్తుంటే ఆమెను ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు.

ఆమె గురించి టెన్షన్‌పడుతూ తనొస్తే ఇక్కడ సీన్ రివర్సైకూర్చుంది. పైగా... ఆమె ఇంతగా తనకు దగ్గరయిపోతుందని అస్సలు ఊహించలేదు. ఇది కలా... నిజమా!

ఒక్కరోజు... అదీ ఇరవై నాలుగు గంటలు కాలేదు. ఉదయం పరిచయమైన తమ మధ్య సాయంకాలంలోన ఇంత ప్రేమా... నమ్మలేకపోతున్నాడు.

నో డౌట్ తను స్నిగ్ధను ప్రేమిస్తున్నాడు. కాని తను చెప్పలేదు. ఆమె చేతల్లో చూపించింది. కాని. తనింకా ఐలవ్‌యూ చెప్పలేదు. కాబట్టి ఇది ప్రేమా లేక తాత్కాలిక భావోద్రేకమా... చెప్పలేం. ఏదైనా కావచ్చు.

“ఓ.కె. ఇట్సాల్‌రైట్ స్నిగ్ధా. నేను వచ్చేశాగా. రిలాక్స్ ప్లీజ్ ఊరుకో” అంటూ ఓదార్చాడు.

అప్పుడు కూడా ఆమె కౌగిలి బిగించిందని తాను తొందరపడి ఆమెను కౌగిలించుకోలేదు. ఎలాంటి తొందరపాటు చూపలేదు. స్థిరంగా ఉన్నాడు.

“కుందేలు దొరికిందా?” కళ్ళు తుడుచుకుని దూరంగా జరుగుతూ అడిగింది.

“లేదు పారిపోయింది” కావాలని అబద్ధం చెప్పాడు.

“నాకు తెలుసు నీ వల్లకాదని” నవ్వింది.

“బట్ కష్టపడ్డావ్. ఆ విషయం నిన్ను చూస్తే అర్థమవుతోంది. అనవసరంగా షర్టు చింపుకున్నావ్. ముళ్ళు చీరేసినట్టున్నాయి. అంతా నా మూలంగానే” అంది నొచ్చుకుంటూ. “ఆ సంగతి వదులు. ఏం జరిగింది? నిన్ను కిడ్నాప్ చేసినవాళ్ళు ఎక్కడ?”

“వాళ్ళు వెళ్ళిపోయార్లే”

“నిన్నేమన్నా ఇబ్బంది పెట్టారా?”

“లేదు లేదు. చాలా మర్యాదగా చూసుకున్నారు. ఒక పురాతన రాగిరేకు మీది విషయాన్ని డీకోడ్ చేయడానికి తీసుకొచ్చారు. అదో పెద్ద కథ. తర్వాత చెప్తాను” చెప్పమని ఒత్తిడి చేయలేదు కృతయుగ్.

ఆమె క్షేమంగా ఉంది. అది చాలు అనుకుంటూ వెళ్ళి వాగులో ముఖం కాళ్ళు చేతులు కడుక్కుని నీరు తాగి వచ్చాడు. ఈ లోపల జలపాతాన్ని అక్కడి వాగు ఆ పరిసరాలు అన్నీ తన డిజిటల్ కెమేరాతో ఫోటోలు తీసుకుంది స్నిగ్ధ.

ట్యాక్సీ బయలుదేరేసరికి సూర్యుడు అస్తమించాడు. అడవి మీదుగా చీకట్లు ముసురుకొస్తున్నాయి.

"ఈ రోజుకి కోట చూడ్డం సాధ్యపడదు. ఏం చేద్దాం చెప్పు" ట్యాక్సీ పోనిస్తూ అడిగాడు.

"రాత్రికి హోటల్లో స్టేచేసి ఉదయంవెళ్దాం" అంది.

బాగా చీకట్లు వ్యాపించేసరికి హెడ్‌లైట్ల కాంతిలో నాటుదారిని చేరుకుంది ట్యాక్సీ. అక్కడినుండి కోట దిశగా గాకుండా దంతెవారా సిటీకి పోవడానికి హైవే దిశగా పరుగుతీసింది ట్యాక్సీ. అతడి భుజంమీద తలాన్చుకుని మగతగా నిద్రలోకి జారుకుంది స్నిగ్ధ.

* * * * *

హోటల్ భద్రాచలంలో భోంచేసి మేడమ్ రాక కోసం ఎదురుచూస్తోంది పీటర్ వర్గం. పని పూర్తికాగానే మేడమ్‌కి ఫోన్‌చేసి చెప్పాడు పీటర్. అప్పటికింకా కోట దగ్గర ఉందామె. కృతయుగ్ ట్యాక్సీ చీకటి పడుతున్నా అక్కడికి రాకపోవడంతో ఏం జరిగిందో ఊహించిందామె.

పీటర్ రిపోర్ట్ వినగానే హోటల్ భద్రాచలం వద్ద వెయిట్ చేయమని తను వస్తున్నట్టు చెప్పింది. అంతా ఎదురుచూస్తున్నారు. ఇంతలో మళ్ళీ ఫోన్ చేసింది మేడమ్. "పీటర్. మీరు నాకోసం ఎదురుచూడొద్దు. హైదరాబాద్ వెళ్ళిపోండి" అంది.

పీటర్ బుర్ర బరుక్కుని – విసుగ్గా చూశాడు. క్షణానికో రకంగా మాట్లాడుతోంది. అసలేమిటీ అమ్మాయి ఉద్దేశం. చూడ్డానికి ఫైర్ బ్రాండ్‌లా ఉంటుంది. ఎవడు చేసుకుంటాడోగాని మాడి మసైపోతాడు.

వచ్చినపని అయిపోయిందిరా. ఇంకా ఇక్కడ ఏంపని ఈవిడకు. మనసులో సణుగుతూనే ఫోన్ చెవి దగ్గరుంచుకున్నాడు.

"మీరు కూడా వస్తేనే బాగుంటుంది మేడమ్. ఓసారి పేపర్స్ చెక్ చేస్తే బాస్‌కిచ్చేయొచ్చు" అన్నాడు.

"దటీజ్ నాట్ మై జాబ్" వెంటనే బదులిచ్చింది మేడమ్. "ఈ ప్రాజెక్ట్ డాడీ ఇంట్రస్ట్. ఆయన చూసుకుంటారు. వెళ్ళి ఇవ్వండి. నేను ఫోన్‌లో మాట్లాడతాను. నేను రావటానికి రెండు మూడు రోజులు పడుతుంది. ఓ.కె?"

"అది కాదు మేడమ్?..."

"ఏది కాదు? చెప్పింది చేయరా భల్లూకం"

లైన్ కట్ చేసింది. ఫోన్ వంక పిచ్చిచూపులు చూస్తూ అలా నిలబడి పోయాడు పీటర్.

"ఏమైంది బాబాయ్. మేడమ్ వచ్చేస్తున్నారా?" అడిగాడొకడు.

"ఒరే. భల్లూకం అంటే ఏమిట్రా?"

"అదో జంతువు బాబాయ్"

"నీ ముఖం. భల్లూకం అంటే ఎలుగుబంటి" మరొకడు చెప్పాడు.

"అయితే ఆడ ఎలుగ్గొడ్డునేమంటార్రా?"

"ఆడ భల్లూకం"

"అయితే మేడమ్ తనే ఓ ఆడ భల్లూకం. వయసు కయినా మర్యాద ఇవ్వకుండా నన్ను భల్లూకం అంటుందా" ఆవేశపడ్డాడు.

పీటర్ ఉడుక్కోవడం చూసి – నవ్వారంతా.

"నవ్వింది చాలు పదండి. ఆవిడ రాదట. మనం వెళ్ళిపోదాం. ఒరే. జీప్ తియ్యరా" అనరిచాడు పీటర్. జీప్ ఆంధ్రా సరిహద్దువైపు పరుగుతీసింది.

* * * * *

దంతెవారా పెద్ద సిటీ. పైగా టూరిస్ట్ సెంటర్. స్టార్ హోటళ్ళున్నాయి. ఒక హోటల్ ముందు స్నిగ్ధను దించాడు కృతయుగ్. "కారు పార్కింగ్‌లో ఉంచిరా. రిసెప్షన్‌లో ఉంటాను" అంది ఎయిర్‌బ్యాగ్ భుజాన వేసుకుని.

"లేదు స్నిగ్ధా చిన్న పనుంది. అది చూసుకుని ఫ్రెండ్ ఇంటికెళ్ళి ఉదయం వచ్చి నిన్ను కలుస్తాను. నైట్‌కి నువ్విక్కడే స్టేచెయ్యి. సీయు" అంటూ మరోమాటకి అవకాశం ఇవ్వకుండా కారును ముందుకు పోనిచ్చాడు.

స్నిగ్ధకు సర్రున ముంచుకొచ్చింది కోపం.

వెంటనే సెల్‌తీసి ఫోన్‌చేసింది.

"వెనక్కి వస్తున్నావా లేదా?" గద్దించింది.

"స్నిగ్ధా ప్లీజ్. ఉదయం కలుద్దాం"

"ఉదయం వరకు ఇక్కడే హోటల్ బయట నిలబడుంటాను"

"ఓ మైగాడ్. చెప్పింది వినవా..."

"నథింగ్‌డూయింగ్. కమ్‌బాక్. వస్తున్నావా లేదా?"

"ఓ.కె. నాకో అరగంట టైమివ్వు. వచ్చేస్తాను"

"నువ్వు వచ్చేవరకు ఇక్కడే ఉంటాను. నీ యిష్టం" లైన్ కట్‌చేసింది.

ఎయిర్‌బ్యాగ్ ఒళ్ళో పెట్టుకుని పక్కన కూర్చుంది. ఆమె ఆలోచనలు కృతయుగ్ చుట్టూ తిరుగుతున్నాయి. ఏమిటి ఇతడిలో ప్రత్యేకత? అవి చెప్పాలంటే చాలా ఉన్నాయనిపించింది.

విలక్షణంగా వ్యక్తిత్వం కృతయుగ్‌ది. ఆత్మాభిమానం ఎక్కువ. ఎవరికీ తలవంచడు. డబ్బుకోసం పరుగుతీయడు. సెన్సాఫ్ హ్యూమర్ ఎక్కువ. సదా నవ్వుతూ నవ్విస్తుంటాడు. ధైర్యసాహసాలు అధికం.

ఒక విషయాన్ని అన్ని కోణాల్లోను ఆలోచించిగాని నిర్ణయం తీసుకోడు. అనవసరంగా ఎవరినీ హర్ట్‌చేయడు. అన్నిటికీమించి అందగాడు. ఈ క్వాలిఫికేషన్స్‌లో ఏ ఒక్కటైనా చాలు అమ్మాయిలు ఇష్టపడ్డానికి.

పరువంలో అడుగు పెట్టి ఇంత కాలమైనా ఎన్నడూ చలించని తనమనసు ఒక్కరోజు పరిచయంలోనే ఇంతగా ఇతడికి అంకితమైపోవడం ఏమిటి?

గతజన్మబంధం అంటే ఇదేనా!... ఏమో... కాని నిజమైన ప్రేమంటే మాత్రం ఇదేననిపిస్తోంది. వాడిని వదిలి ఉండలేననిపిస్తోంది.

మగాళ్ళలో ప్రత్యేక వ్యక్తిత్వం కృతయుగ్‌ది. తనిచ్చిన చనువుకి మరో మగాడైతే చొరవ తీసుకునేవాడు. గాఢంగా కౌగిలించుకున్నప్పుడూ అతడు పాటించిన నిగ్రహం ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంది.

బహుశ మరోసారి అలాంటి ఇబ్బందికర పరిస్థితి రాకూడదనే – తనతో హోటల్లో ఉండటం ఇష్టంలేక బయటకి పోవాలనుకున్నాడు. కాని తను వదలదుగా. ఇంతకీ వస్తాడా... రాడా!

ఎదురుచూస్తూ కదలకుండా అక్కడే కూర్చుంది. అర్ధగంటన్నది సుమారు గంట తర్వాత తిరిగి వచ్చాడు కృతయుగ్. ట్యాక్సీని పార్కింగ్‌లో ఉంచి లాక్ చేశాడు. డిక్కీ తెరిచి తన ఎయిర్‌బ్యాగ్ తీసి భుజానవేసుకున్నాడు. టవలు చుట్టిన బ్యాక్స్ లాంటి వస్తువుని చంకన పెట్టుకుని డిక్కీ మూసి లాక్‌చేశాడు.

"స్నిగ్ధా. నా మాట విను. ఇద్దరం హోటల్లో ఉండటం పద్ధతి కాదు. నేను ట్యాక్సీలో పడుకుంటాను" మరోసారి నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు.

"షటప్. పద్ధతుల గురించి నాకు చెప్పకు. మనం చర్చించాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. నాతోరా. అంతే" అంటూ అతడి నోరు కట్టేసింది స్నిగ్ధ.

రిసెప్షన్‌లో అడ్వాన్స్ కట్టి డబుల్ సూట్ తీసుకుంది. రిజిష్టర్‌లో మిస్టర్ అండ్ మిస్సెస్ కృతయుగ్ అండ్ స్నిగ్ధ ఫ్రమ్ హైదరాబాద్. టూరిస్ట్సు అని రాసి సంతకం చేసింది. ఇది కృతయుగ్‌కి తెలీదు.

వాళ్ళకివ్వబడిన ముప్పై ఆరోనంబరు డబుల్‌సూట్ సెకండ్‌ఫ్లోర్‌లో ఉంది. చాలా కంఫర్టబుల్‌గా, అందంగా ఉంది సూట్. ముందు డ్రాయింగ్ రూమ్ ఎదురుగా డబుల్ కాట్ బెడ్‌రూమ్ అవతల బాల్కనీ.

మధ్యడోర్ తెరిస్తే లోన మరో బెడ్‌రూమ్. రెంటికీ అటాచ్డ్ బాత్‌రూమ్స్ ఉన్నాయి. ఇద్దరూ లోనకు రాగానే ఎంట్రన్స్ డోర్ మూసి బోల్ట్ వేసింది స్నిగ్ధ.

"సో ఈ బెడ్‌రూమ్ నాది. లోన బెడ్‌రూమ్ నీది. త్వరగా స్నానం చేసి ఫ్రెషప్ అయివస్తే భోజనం ఆర్డర్ చేస్తాను" అంది నవ్వుతూ.

ఇబ్బందికరంగా చూశాడు కృతయుగ్.

"నాకెందుకో ఇది సరికాదనిపిస్తోంది స్నిగ్ధా. వదిలేస్తే హాయిగా ట్యాక్సీలో పడుకుంటానుగదా!" చివరి ప్రయత్నంగా చెప్పి చూసాడు.

"ఇక్కడే నాతో ఉంటే హాయిగా ఉండదా?" ఆమె మాటల్లోని జాణతనం– అతడ్ని గిలిగింతలు పెట్టింది.

"నువ్విలా మొండిగా వాదిస్తే నీకెలా చెప్పాలో తెలియట్లేదు. పెళ్ళిగాని జంట ఒకే సూట్‌లో గడపటం సంప్రదాయం కాదు" తన అభిప్రాయం చెప్పాడు.

"పెళ్ళిగాకుండా డేటింగ్ చేయటం సంప్రదాయమా?" ఎదురు ప్రశ్నించింది స్నిగ్ధ.

"విదేశీ సంప్రదాయాలు మనకీ వచ్చేశాయి. సహజీవనం అని, డేటింగ్ అని అందమైన పేర్లు పెట్టి సెక్స్ అనుభవిస్తున్నారు. ఫ్రాంక్‌గా మాట్లాడుకుందాం.

పబ్లిక్‌గా వాళ్ళు తప్పుచేస్తున్నా మన సంప్రదాయాల్ని భగ్నం చేస్తున్నా పట్టించుకునేవాళ్ళు లేరు. అది ఫ్యాషనైపోయింది. టెక్నాలజీతోబాటు మానవ సంబంధాల్లో కూడ మార్పులొచ్చాయి.

నా ఉద్దేశం ప్రకారమైతే మనం తప్పుచేయనంత వరకు భయపడాల్సిన పనిలేదు. మన ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలంటే నీకన్నా ఎక్కువ గౌరవిస్తాను. కాని లోకంకోసం వాటిని పాటించాలంటే మాత్రం ఒప్పుకోను. ఇలాంటి ఏకాంతంలోనే మనసు విప్పి మాట్లాడుకునే అవకాశం ఉంటుంది. అవునా?"

"అదేగా నా భయం!"

"వ్యాట్?"

"మరి కాదా? మనసు విప్పితే నిజాలు బయటపడతాయి..." అన్నాడు కృతయుగ్.

"పడనీ... సంతోషమే కదా. అందుకని వదిలేయమంటే ఎలా? చెప్పానుగదా. మనం చాలా విషయాలు చర్చించుకోవాలి. వెళ్ళి త్వరగా స్నానం చేసిరా... అవునూ. టవల్ చుట్టి తెచ్చావ్. ఏమిటది?"

"ఓహ్... మర్చేపోయాను చూసావా? దీని గురించే లేటయింది. ఇది నా గిఫ్ట్" అంటూ టవల్ చుట్టి తెచ్చిన బాక్స్ లాంటి వస్తువుని టేబిల్ మీద ఉంచాడు.

"గిఫ్టా... ఏమిటది?" అంటూ ఉత్సాహంగా టవల్ విప్పింది స్నిగ్ధ. అంతే–

'బాప్‌రే' అంటూ రెండు చేతులూ నోటికి అడ్డం పెట్టుకుని ఆశ్చర్యంతో అలా చూస్తూండిపోయింది.

ఎదురుగా పంజరంలాంటి స్టీల్ కేజ్‌లో అందమైన కుందేళ్ళ జంట. తను ముచ్చటపడిన గోల్డెన్ రేబిట్. తను ఒకటి అడిగితే జంటగా రెండు తెచ్చాడు. కారెట్ ముక్కలు తింటూ కళ్ళు చక్రాల్లా తిప్పి అవి తనను చూస్తుంటే సంతోషంతో ఉక్కిరిబిక్కిరయింది.

"ఓ మైగాడ్. కృతా... ఐ లైకిట్. ఐ లవ్విట్. హౌ స్వీట్ యు ఆర్" అంటూ ఆనందం తట్టుకోలేక అతడి మెడ వంచి చెంపమీద ముద్దు పెట్టేసింది.

"ఆర్ యు హ్యాపీ?" అడిగాడు.

"చాలా చాలా హ్యేపీగా వుంది" అంది కుందేళ్ళ జంటను చూసి ముచ్చటపడుతూ.

"నీకు సర్ప్రయిజ్ ఇద్దామని దొరకలేదని అబద్ధం చెప్పాను. వీటికి కేజ్ కొనడానికెళ్ళాను. అందుకే లేటయింది" చెప్పాడు.

"నా కోరిక తీర్చాలని ఎందుకంత కష్టపడ్డావ్?"

"సంతోషిస్తావని"

"దీనికి అర్థం ఏమిటో తెలుసా?" "ప్చ్... తెలీదు"

"అబద్ధం చెప్పక. మనం ఒకర్నొకరు ప్రేమించుకుంటున్నాం. ఐ లవ్ యూ. కిస్ మి కృతా... ప్లీజ్ కిస్‌మి" హత్తుకుపోతూ ముఖంలో ముఖంపెట్టి అర్థిస్తుంటే ఇక ఆగటం అతడికి సాధ్యంకాలేదు. ఆమెను బలంగా కౌగిట పొదువుకొని – అదురుతున్న ఆమె పగడాల పెదవుల్ని గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు.

"కయ్యాలతో ఆరంభమైన మన పరిచయం అలాగే ముగుస్తుందని భయపడ్డాను. ఇలా వియ్యంగా మారుతుందనుకోలేదు. ఐ లవ్ యూ స్నిగ్ధా. నీలా నా మనసుకు హత్తుకున్న అమ్మాయి ఎవరూలేరు. బట్ నీ గురించి నీ ఉద్యోగం గురించి తప్ప మీ ఫ్యామిలీ సంగతులేవీ నాకు చెప్పలేదు" అన్నాడు.

"నా ఫ్యామిలీ సంగతులు ఇప్పుడు అవసరమా? సమయం వస్తే నీకే తెలుస్తుంది"

"ఆ సమయం ఎప్పుడు? మన ప్రేమ గురించి తెలిసి మీ డాడీ తుపాకి పుచ్చుకుని నాతో యుద్ధానికొచ్చినప్పుడా?"

"అంత సీన్ లేదులే. పెళ్ళి నా స్వంత విషయం. ఎవరూ అభ్యంతరం చెప్పరు సంతోషిస్తారు. టైమవుతోంది. వెళ్ళి స్నానం చేసిరా. కబుర్లు చెప్పుకోవడానికి చాలా రాత్రుంది మనకి" అంటూ మరోసారి ప్రేమమీరా ముద్దాడింది.

స్నానాదులు ముగించి భోజనం చేసేసరికి రాత్రి పదిగంటలు దాటింది సమయం.

అడవిలో సంఘటనగురించి రాగిరేకు గురించి కృతయుగ్‌కి చెప్పాలనుకుంది స్నిగ్ధ. కాని పగలంతా జర్నీతో అలసిపోయిన శరీరాలకు భోంచేయగానే నిద్రముంచుకొచ్చింది. ఆ రాత్రికి గుడ్‌నైట్ చెప్పుకుని ఎవరి గదిలో వారు ప్రశాంతంగా నిద్రపోయారు.

* * * * *

అదే రోజు అర్ధరాత్రి.... హైదరాబాద్‌కి చెందిన ఒక టూరిస్ట్ కోచ్ అదే స్టార్ హోటల్‌కొచ్చింది. సుమారు ఏభైమంది కాలేజీ అమ్మాయిలు దంతెవారా టూర్‌కొచ్చారు. కోచ్ డ్రయివరు క్లీనరు తప్ప అంతా లేడీస్.

స్టూడెంట్స్‌వెంట నలుగురు లేడీ లెక్చరర్లు వున్నారు. వాళ్ళంతా అయిదు సూట్లు బుక్‌చేసుకున్నారు. అవన్నీ గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఉన్నాయి.

ఒక్కో సూట్‌లోను పదిమంది అమ్మాయిలు చొప్పున షేర్ చేసుకుని నిద్రపోయారు.

మరునాడు ఉదయం - కృతయుగ్, స్నిగ్ధలు నిద్రలేచేసరికి ఏడు దాటింది సమయం. బయటికెళ్ళటానికి త్వరగా రెడీ అవుతున్నారు.

ముందుగా కృతయుగ్ రెడీ అయ్యాడు. వేరే డ్రస్సు వేసుకుని స్మార్ట్‌గా అందంగా వున్నాడు.

స్నిగ్ధ ఇంకా అద్దంముందునుంచి ఇవతలికి రాలేదు. అంతలో కాలింగ్ బజర్ మోగింది. "చూడు కృతా. బోయ్ వచ్చాడేమో కాఫీ చెప్పు" అంది స్నిగ్ధ.

కృతయుగ్ వెళ్ళి డోర్ తెరిచాడు. కాని వచ్చింది హోటల్ బోయ్ కాదు. ఎవరో అందమైన యువతి సుమారు పందొమ్మిది లేదా ఇరవై సంవత్సరాల వయసులో గాగ్రాఛోళీలో గంధర్వకన్యలా మెరిసిపోతోంది. ఆమె ఎవరు, ఎందుకొచ్చింది ఏమీ అర్థంగాక అయోమయంగా చూశాడు.

"కృతయుగ్ మీరేనా?" అడిగిందా అమ్మాయి.

"యస్... మీరెవరు?"

"నిత్య... అయామ్ నిత్య... మీరు... చాలా హేండ్సమ్‌గా ఉన్నారు" నవ్వింది. ఆ నవ్వులో స్నిగ్ధ పోలికలు కన్పించాయి.

"థాంక్యూ. ఇంతకీ ఎవరు కావాలి మీకు?"

"అయామ్ నిత్యా... చెప్పాను గదా, హైదరాబాద్ మాది. కంప్యూటర్ సైన్స్ ఫైనల్ ఇయర్ స్టూడెంట్‌ని. మా ఉమెన్స్ కాలేజీ నుంచి బస్‌లో టూర్‌కి వచ్చాం. రాత్రే వచ్చాం"

"ఇవన్నీ నాకు ఎందుకు చెప్తున్నారు?"

"మీరు కొత్తగా పెళ్ళయిన జంట అనుకుంటాను. తొందరపడుతున్నారు"

"హలో! ఆర్ యూ క్రేజీ. కొత్తగా పెళ్ళవటం ఏమిటి తొందరపడ్డం ఏమిటి?"

"లేదా?... అదేమిటిసార్. రిజిష్టర్‌లో చూశానే. మిష్టర్ అండ్ మిసెస్ కృతయుగ్ అండ్ స్నిగ్ధ ఫ్రమ్ హైదరాబాద్. టూరిస్ట్సు అని రిజిష్టర్‌లో రాసి మీ మిస్సెస్ సంతకం చేశారు గదా. నేను చూశాను.

ఆ చేతిరాత నాకు బాగా తెలుసు. ఓసారి... మా అక్కను పిలుస్తారా బావగారూ?" అంది అంతే-

పిలుపు వరస కలిపేసరికి-

పక్కన చిన్నసైజు బాంబు పేలినట్టు ఉలిక్కిపడ్డాడు కృతయుగ్. ఆ అమ్మాయికి ఏం చెప్పాలో అర్థంగాక అయోమయంగా చూశాడు.

ఈ అమ్మాయి చెప్పేవరకు రిజిష్టర్‌లో అలా రాసి సంతకంచేసి స్నిగ్ధ సూట్ తీసుకుందని తనకి తెలీదు. ముఖంలో స్నిగ్ధ పోలికలు గమనించినప్పుడన్నా ఆలోచించక్కర్లా... నేను కృతయుగ్ అని స్టైల్‌గా చెప్పి దొరికిపోయాడు. తనకో అందమైన చెల్లెలుందని స్నిగ్ధా చెప్పలేదు.

కాకతాళీయం అంటే ఇదే. సరిగ్గా ఇప్పుడే హైదరాబాద్ నుంచి ఈ అమ్మాయి రావాలా? చూస్తే ఇదేదో పండుమిరపకాయలా వుంది. తమ లవ్ యల్ బోర్డు స్టేజిలోనే ఉందని ఇంకా పెళ్ళి కాలేదని చెప్తే నమ్ముతుందా? ఇలా దిరికిపోయాడేమిటి తాను? సమాధానం చెప్పలేక తీవ్రంగా ఆలోచిస్తుండి పోయాడు.

"బావగారేదో షాకైనట్టున్నారు. లోనకురావచ్చా?" అంటూ పిలవకుండానే లోపలకొచ్చేసింది నిత్య.

అంతలో బెడ్‌రూమ్ డోర్‌లో ప్రత్యక్షమైంది స్నిగ్ధ. బయటి సంభాషణంతా వింటూనే వుందామె.

"ఏయ్ నిత్యా. నీ సందేహాలేమన్నా ఉంటే నన్నడుగు. బావగార్ని ఇబ్బంది పెట్టకు. లోపలకురా" అంటూ చేయిపుచ్చుకుని బెడ్‌రూమ్‌లోకి లాక్కుపోయింది.

చేయి విదిలించుకుని కోపంగా చూసింది నిత్య.

"ఎందుకిలా చేశావ్. చెప్పక్కా. అంత కానివాళ్ళమైపోయామా? నీకెవరూ లేరనుకున్నావా?

మాతో ఒక్క మాటయినా చెప్పకుండా పెళ్ళిచేసేసుకుంటావా? ఈ సంగతి మమ్మీడాడీ వింటే ఎంత బాధపడతారోతెలుసా?" అంటూ చెల్లెలు నిలదీస్తూంటే గలగలా నవ్వింది స్నిగ్ధ.

ముఖం ముడుచుకుంది నిత్య.

"ఏమిటక్కా. నా మాటలు నీకు నవ్వులాటగా వుందా?" అంది.

"నీ గోల చూస్తే నవ్వొస్తోంది. ఏం చేయమంటావే? నన్ను చూశాక కూడా నీకర్థం కాలేదా మాకింకా పెళ్ళికాలేదని? మెళ్ళోతాళి, నుదుట సింధూరం, మెట్టెలు ఏమన్నా కన్పిస్తున్నాయా నా దగ్గర?"

"అవును కదా! నాదో మట్టి బుర్ర" అంటూ తల మీద కొట్టుకుంది నిత్య. "మరి రిజిష్టర్‌లో అలా ఎందుకు రాశావ్?" తిరిగి తనే అడిగింది.

"మరెలా రాయాలి? పెళ్ళిగాని జంటకు సూట్ ఇస్తారా? ఇచ్చినా ఇదేదో లేచొచ్చిన బాపతని చులకనగా చూస్తారు. ప్రేమించుకున్నాం.

పెళ్ళిచేసుకోబోతున్నాం. రాస్తే తప్పేమిటి? అందుకే రిజిష్టర్‌లో పెళ్ళయి నట్టు రాశాను."

"అదా సంగతి. బతికించావే తల్లీ. ఇప్పుడన్నా మమ్మీ డాడీకి చెప్తావా?"

"చెప్పకుండానా!... కాని నేను జాబ్‌చేయటమే వాళ్ళకిష్టంలేదు. ఆపైన తన ఫ్రెండు శంకరయ్య కొడుకును కాదన్నానని డాడీ అలిగారుగదా. అందుకే మా మధ్య మాటల్లేవు. ఫోన్లు లేవు"

"అక్కా! నువ్వింకా అక్కడే ఉన్నావా! మమ్మీతో డాడీ చెప్పటం నా చెవులతో విన్నాను తెలుసా! ఆయన కోపం నువ్వీ సంబంధం కాదన్నావని కాదు. పెళ్ళే వద్దన్నావని. ఇప్పుడు నువ్వు చేసుకుంటానంటే ఎంత ఆనందిస్తారో తెలుసా? పెళ్ళి చేసుకోవాలే గాని తనకిష్టమైనవాడ్ని చూపించమను.

ఆస్తి అంతస్థులతో పనిలేకుండా సంతోషంగా పెళ్ళి జరిపిస్తానన్నారు. ఇంకేం కావాలి.

అక్కడికొచ్చి మీరు తొందరగా చేసుకుంటే నాకు లైన్ క్లియరైపోతుంది" అంది నిత్య.

"అంటే నువ్వుకూడా లవ్‌లో పడ్డావా?" అడిగింది.

"అదేం కాదు. ఫైనల్ ఎగ్జామయిపోతే పెళ్ళిచేసుకుని సెటిలయిపోదామని"

"మరీ తొందరపడకు. కొంచెం ఆగాలి. ఇంతకీ మమ్మీడాడీ ఎలావున్నారు. అన్నయ్య, వదిన వాళ్ళ పిల్లలు"

"ఊఁ కొత్తగా చెప్పేదేముంది. మమ్మీ సోషల్ వర్క్‌లో బిజీ. డాడీ రాజకీయాల్లో బిజీ. అన్నయ్య వ్యాపారంలో, నేను చదువులో బిజీ. అంతా రొటీనే.

సెంట్రల్ మినిస్టర్‌గాబట్టి ఒక్కోసారి డాడీని చూడ్డమే గగనమవుతోంది. నువ్వు అలిగి వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో ఉంటూ జాబ్ చేయటం అందరికీ బాధగా ఉంది తెలుసా? మీ పంతాలతో పెద్దపిల్లని ఇంట్లోంచి పంపించేశారు గదా అంటూ మమ్మీ డాడీని గొడవ చేస్తూంటుంది. వచ్చెయ్యక్కా. హైదరాబాద్ రాగానే ఇంటికొచ్చెయ్." గడగడా మాట్లాడేస్తోంది నిత్య.

అక్కా చెల్లెళ్ళు కబుర్లలోపడి తన గురించి మర్చిపోయారని గ్రహించి లేచి అలా వరండాలోకి వెళ్ళిపోయాడు కృతయుగ్.

వరండా చివరకు వెళ్ళి కిటికీ పక్కన నిలబడి సిగరెట్ ముట్టించుకున్నాడు. ఆలోచనలు చుట్టుముట్టాయి. వాళ్ళిద్దరి మాటల్ని బట్టి స్నిగ్ధ విషయంలో తన అంచనా తప్పిందని అర్థమైంది.

తన సింప్లిసిటీని బట్టి మధ్యతరగతి లేదా ఆపైస్థాయి ఫ్యామిలీ అమ్మాయనుకున్నాడు. కాని కోట్లకు పడగలెత్తిన రాజకీయ కుటుంబంలో అమ్మాయని ఇప్పుడర్థమవుతోంది. కేంద్ర పెట్రోలియం శాఖామంత్రి ప్రసాద్‌గారి అమ్మాయని ఇప్పుడు తెలిసింది.

ముందే ఈ విషయాలు తెలిస్తే తను వెనుకంజ వేస్తాడని కాబోలు తమ ఫ్యామిలీ గురించి ఏమీ చెప్పకుండా దాచింది స్నిగ్ధ. ఇప్పుడయినా అనుకోకుండా నిత్య రావటంతో తనకీ విషయాలు తెలిసిపోయాయిగాని లేదంటే ఇప్పట్లో చెప్పేది కాదేమో. ఇప్పుడు తన పొజిషనేమిటి? ఏం చేయాలి?

ఆలోచనల్లో మునిగి పక్క సూట్ డోర్ ఓపెన్ గావటం గమనించలేదతను. గమనించే లోపల ఒక గాజుల చేయి అతడి చేయిపట్టుకుని విసురుగా లోపలకు లాగి తలుపు మూసేసింది.

* * * * *

“ఓ మైగాడ్... గోల్డెన్ రాబిట్స్. బ్యూటిఫుల్. మార్వెలెస్. ఎంత ముద్దొస్తున్నాయో. అక్కా ఎక్కడ సంపాదించావే వీటిని? పెంచుకుంటాను. నాకివ్వవా?” కుందేళ్ళను ముద్దాడుతూ అడిగింది నిత్య.

‘ఇవ్వను’ అంది స్నిగ్ధ. ముఖం ముడుచుకుంది నిత్య. “నేనడిగినా ఇవ్వవా? నీ చిట్టి చెల్లెల్ని గదా” అంది.

“ఎవరడిగినా ఇవ్వను... కావాలంటే నీకు వీటి పిల్లల్ని ఇస్తాగాని వీటినివ్వను. ఎందుకో తెలుసా? నాకోసం అడవిలో ఎన్నో కష్టాలుపడి కృతయుగ్ వీటిని పట్టి తెచ్చాడు. నాకోసం తెచ్చాడు” అంది గర్వంగా స్నిగ్ధ.

“అదన్నమాట సంగతి. ఓ.కె... నాకూ తెచ్చివ్వమని బావగార్ని అడుగుతాను”

“చంపుతాను కోతి. నాకు పోటీ వద్దామనా... నేనూరుకోను”

“అయితే నువ్వే ఉంచుకో తల్లీ” అంటూ కుందేళ్ళను బోనులో వదిలి ఇవతలికొచ్చింది నిత్య.

“అవునూ. మీ లవ్ స్టోరీ ఎలా మొదలైంది. చెప్పే కోతి నువ్వే పడేశావా తనే పడిపోయాడా?” కొంటెగా అడిగింది.

“తెలీదు. ఎవరికి ఎవరుపడ్డామంటే బదులు చెప్పటం కష్టం. కాని ఆఫ్ డే... ఒక ఆఫ్ డేలో లవ్‌లో పడ్డ జంట బహుశా మాదే కావచ్చు.”

“హాఫ్ డే...” నమ్మలేనట్టు కళ్ళు చక్రాల్లా తిప్పింది నిత్య. ‘యస్...’ అంటూ స్నిగ్ధ ఏదో చెప్పబోయింది. అంతలో కాలేజీ బస్సు బయలుదేరబోతున్నట్టు హారన్ సౌండ్ విన్పించింది.

“సరే అక్కా. సాయంత్రం కలుద్దాం. అప్పుడు డీటైల్డ్‌గా మీ లవ్‌స్టోరీ చెప్పాలి” అంటూ లేచింది నిత్య.

“ఏయ్ నిత్యా. ఈ గాగ్రాచోళీలో చాలా అందంగా వున్నావే. నాదిష్టే తగిలేలా వుంది” అంటూ కంటిరెప్ప నుంచి కొద్దిగా కాటుక తీసి చెల్లెలి చుబుకంమీద దిష్టిచుక్క పెట్టింది స్నిగ్ధ.

“థాంక్యు అక్కా, బట్ ఈ డ్రెస్ వేసుకుంటే నాకన్నా నువ్వే ఎక్కువ అందంగా ఉంటావ్ తెలుసా. వెళ్ళేటప్పుడు నీకు ఇలాంటి డ్రెస్సు ప్రజంట్ చేస్తాను సరేనా? టైమైంది. బావగారెక్కడ? నేను వెళ్తాను” అంటూ కదిలింది. కృతయుగ్ వాళ్ళకి కనబడలేదు.

నిత్య వెళ్ళగానే తన సెల్ నుంచి కృతయుగ్‌కి ఫోన్ చేసింది స్నిగ్ధ. స్విచ్చాఫ్ అని రిప్లై వచ్చింది.

*          *          *          *          *

ఆమెను చూడగానే కళ్ళు తిరిగి కింద పడబోయి నిలదొక్కుకుంటూ "నువ్వా!" అనరిచాడు.

"యస్ నేనే డియర్. డౌటా?" మత్తుగా చిలిపిగా కళ్ళలోకి చూస్తూ గొణిగిందామె.

ఆమె ఎవరో కాదు. ముగ్ధ. అతడ్ని అటోచేయి ఇటో చేయివేసి డోర్‌కి అదిమేస్తూ కొంటెగా నవ్వుతోంది.

"నువ్వేమిటిక్కడ?" ఇబ్బందిగా కదులుతూ అడిగాడు. కదిలేకొద్దీ తాడు బిగిసినట్టు అతడికి అంగాంగం హత్తుకుపోతోందామె.

అంతక్రితమే స్నానం చేసినట్టుంది. ఒంటి మీద ఇంకా నీటిబిందువులున్నాయి.

పూల సిల్కునైటీ వంటిమీద నిలవనంటోంది. లోదుస్తులు ధరించినట్లు లేదు. ఆమె ఒంటి నుండి వీచే ఖరీదైన సబ్బు, సెంటువాసనలు గమ్మత్తుగా మత్తులోకి దించుతున్నాయి.

మనసు నిగ్రహంతో వున్నా శరీరం వశంతప్పే ప్రమాదం గ్రహింపవుతోంది. ఆమె పరువాలు కసిగా తనను హత్తుకుపోతుంటే అతలాకుతలమైపోతూ ఇబ్బందిగా చూశాడు. "భూమిని చుట్టే చంద్రుడుంటాడు. నిన్ను చుట్టి నేనుంటాను. ఎక్కడికి వెళ్తాను? నీ ట్యాక్సీని వెదికి పట్టుకుని మరీ రాత్రి ఈ సూట్ తీసుకున్నాను తెలుసా?" చెప్పింది.

"తెలీదు. అందుకే పొరపాటున వచ్చి దొరికిపోయాను"

"ఐ లవ్ యూ కృతా..."

"వినీ వినీ విసుగుపుడుతోంది. ఇక చెప్పకు. ఐ లవ్ స్నిగ్ధ. అర్థమైందా ప్లీజ్ వదిలెయ్"

"వదిలేస్తాను. నన్నుకూడా లవ్ చెయ్"

"అదెలా? ఒక్క మనసు ఇద్దరికి పంచలేను గదా!"

"మగాడి మనసు విశాలమైంది. ఎంతమందికయినా పంచొచ్చు"

"పొరబడుతున్నావ్. నా మనసు చాలా చిన్నది. పంచలేను. వదిలేయవా ప్లీజ్"

"వదిలినా వెళ్ళలేవు. ఎందుకో తెలుసా? నా గదిలోంచి నువ్వు బయటికెళ్ళటం చూస్తే స్నిగ్ధ అసహ్యించుకుంటుంది. సో... నేను వరండాలో ఎవరూ లేనప్పుడు చూసి పంపాలి. అలా చేయాలంటే కిస్ మి"

"ఇది బ్లాక్‌మెయిల్. దారుణం. నావల్లకాదు"

"నీవల్ల అవుతుంది" అంటూ చటుక్కున పెదవులతో పెదవులు కలిపి ముద్దు పెట్టేసింది.

"నీకు అర్థంగావటం లేదు కృతా. నా ప్రాణం కన్నా మిన్నగా నిన్ను ప్రేమిస్తున్నాను. నాకో మాట చెప్పు, రాత్రి మీ ఇద్దరూ ఒకే సూట్‌లో ఉన్నారు. స్నిగ్ధ ఏమన్నా సహకరించిందా?" పచ్చిగా అడిగేసింది.

"ఛఛ. అదేం లేదు" అంటూ సున్నితంగా ఆమెను తప్పించుకుని బయటపడ్డాడు.

"లేదా! గ్రేట్ ఇన్‌సల్ట్. అదే నారూమ్‌లో ఉంటే నీకు స్వర్గం చూపించేదాన్ని" నవ్వింది.

కృతయుగ్ ఓ నమస్కారం పెట్టేశాడు.

"వద్దు ముగ్ధా. చదువు, సంస్కారం ఉన్నదానివి. ఒకసారి చెబితే వినాలి. నాకు స్వర్గం వద్దు నువ్వు మాటి మాటికీ నా దారికి అడ్డం పడకుండా ఉంటే అదే నాకు స్వర్గం. బై" అంటూ తలుపు తీసుకుని వరండాలోకి వచ్చేశాడు. అదృష్టం కొద్దీ అక్కడెవరూ లేరు.

అతడ్ని ఆపే ప్రయత్నం చేయకుండా కన్నీళ్ళతో డోర్ దగ్గరే నిలబడి పోయింది ముగ్ధ. వేడి నిట్టూర్పులు విడుస్తూ దీర్ఘంగా అతడి గురించే ఆలోచిస్తోంది. అతను తిరస్కరించేకొద్దీ మనసు అతడితోనే ఉంటానంటోంది. వెనక్కి రానంటోంది. ఏమిటీ మనసు?

టూర్‌కి ఇటు వచ్చిన చాలా సందర్భాల్లో కృతయుగ్‌ని చూసింది. మనసుకు నచ్చాడు. అతని వివరాలు సేకరించింది గాని ఎదుటపడి తన ప్రేమ వ్యక్తం చేయలేకపోయింది.

ఈ ట్రిప్‌లో అతడ్ని ఎలాగయినా కలిసి తన ప్రేమ గురించి చెప్పాలనుకుంది.

స్నిగ్ధతో తమకు పనుంది. ఆమెను ఫాలోచేసి వస్తున్న క్రమంలో స్నిగ్ధ అతడి ట్యాక్సీ ఎక్కడంతో పరిస్థితి మారిపోయింది. వాళ్ళిద్దరూ లవ్‌లో పడిపోయారు. టైమ్ బ్యాడ్ అంటే ఇదే కావచ్చు. ఇప్పుడు ఎంత చెప్పినా వాడు

తన ప్రేమను నమ్మటంలేదు. ఏం చేయాలి? మనసు చంపుకొని అతడ్ని మర్చి పోగలదా?

ఆమె ఆలోచనలు ఓ కొలిక్కి రాకముందే సెల్‌ఫోన్ మోగింది. అవతల లైన్లో ఉంది ఆమె తండ్రి ఆత్మకూరు అన్నారావు. అతనికి లేని బిజినెస్ లేదు.

మాఫియాతో సంబంధాలున్నాయి. పురాతన నిధులంటే చాలాఇష్టం. ఎక్కడ నిధిఉందని తెలిసినా గద్దలా అక్కడే వాలిపోతాడు. గప్‌చుప్‌గా తవ్వి తెచ్చేస్తాడు. దీనికోసం అతడి చేతి కింద పెద్ద ముఠానే పనిచేస్తోంది. ఒక్కగానొక్క కూతురు కాంచన. ఉరఫ్ ముగ్ధ.

"చెప్పండి డాడీ" అంది చెమర్చిన కళ్ళు తుడుచుకుంటూ.

"పీటర్ వాళ్ళు తెల్లారేసరికి వచ్చేశారమ్మా. నువ్వు ఇంకా అక్కడే ఉండిపోయావ్. హైదరాబాద్ ఎప్పుడు వస్తున్నావ్?" అడిగాడు.

"వస్తాను. సాయంత్రం బైలుదేరతాను" చెప్పింది.

"నీ గొంతు అదోలా ఉంది. ఎందుకో బాధపడుతున్నావ్? ఏమైందిరా. నిన్ను బాధపెట్టినవాళ్ళెవరు చెప్పు. ఏం జరిగింది?" అన్నారావు ఆందోళన.

"అదేం లేదు డాడీ! జలుబుచేసి గొంతు అలావుంది. అంతే. డోంట్ వర్రీ. సాయంత్రం బయలుదేరి వచ్చేస్తున్నాను" అంటూ మరోమాటకి అవకాశం ఇవ్వకుండా లైన్ కట్‌చేసి లోపలకెళ్ళి డోర్ వేసుకుంది.

* * * * *

"ఏంటీ అంతసేపు చూస్తున్నావ్? అందులో నిధి రహస్యం ఉందన్న ఆశతో లక్షరూపాయలు పోసి భోపాల్లో కొన్న రాగిరేకురా అది. పనికొస్తుందా లేదా? ఆ అమ్మాయి స్నిగ్ధ ఏం రాసింది?" ఎదురుగా వున్న మేనల్లుడు మహీధర్‌ని తొందరచేశాడు అన్నారావు.

"ఆగు మావయ్యా నీకంతా తొందరే... చూస్తున్నానుగా" అంటూ విసుక్కున్నాడు మహీధర్.

హైదరాబాద్ మాదాపూర్ ప్రాంతంలోని అన్నారావు భవంతి అది. మేడమీద విశాలమైన గదిలో వాళ్ళంతా సమావేశమై ఉన్నారు. మహీధర్‌కు అటూ ఇటూ మరో ముఖ్యమైన వ్యక్తులు ఇద్దరు కూర్చున్నారు.

మహీధర్ అన్నారావు చెల్లెలి కొడుకు. మేనమామ ఇంట్లోనే ఉంటాడు. బాగా చదువుకున్నాడు. అన్నారావు వ్యాపార బాధ్యతలు చూసేది అతడే. మరదలు

కాంచన తన కాబోయే భార్య అని అతడి నమ్మకం. ఇంట్లోవాళ్ళ అభిప్రాయమూ అదే. కీలకమైన విషయాల్లో అతడి సలహాకు ప్రాధాన్యతనిస్తాడు అన్నారావు.

మహీధర్‌కి కుడిపక్క నున్న వ్యక్తి పేరు అనంతస్వామి. డెబ్భైయ్యేళ్ళ వయసుంటుంది. ఆజానుబాహుడు. ఒత్తుగా పెరిగిన జుత్తు, గడ్డం, మీసాలు, వెండి తీగల్లా మెరుస్తున్నాయి.

పెద్ద కళ్ళు, పొడవాటి ముక్కు, నుదుట అర్ధరూపాయంత కుంకుమబొట్టు, మెడలో రుద్రాక్షలు, కాషాయ దుస్తుల్లో మనిషి గంభీరంగా ఉంటాడు.

ఆయన తాంత్రిక మంత్ర తంత్ర శాస్త్రాల్లో దిట్ట. ఎలాంటి శక్తులనైనా వశపర్చుకొని శాంతింపచేయగల ప్రతిభాశాలి. నిధులు వెలికితీసేప్పుడు ఈయన ముఖ్య పాత్ర వహిస్తాడు. వయసులో పెద్దవాడు గాబట్టి ఆయనంటే అందరికీ గౌరవమే.

ఇక నాలుగోవాడి పేరు బసవడు. మనిషి మొరటుగా చాలా రఫ్‌గా కన్పిస్తాడు. ముఠాకి నాయకత్వం అతడిదే. అన్నారావు ఆర్డర్ అంటే వాడికి సుగ్రీవాజ్ఞ లాంటిది. ముఠా సభ్యులంతా అతడి చేతికిందే వుంటారు.

ఈ నలుగురితోపాటు కీలక నిర్ణయాలు తీసుకునేటప్పుడు కాంచన కూడా తండ్రిపక్కన వుంటుంది. ప్రస్తుతం ఆమె అందుబాటులో లేదుగాబట్టి నలుగురూ సమావేశమయ్యారు.

పీటర్ బృందం వచ్చేస్తోందని తెలీగానే ఉదయం రమ్మని ముగ్గురికీ ఫోన్లు కొట్టాడు అన్నారావు.

"ఏరా? ఇంకా అర్ధంగాలేదా? ఏం చూస్తున్నావు?"

అన్నారావు మరోసారి అడగటంతో కాగితాల్లోంచి తలెత్తి చూశాడు మహీధర్.

"మావయ్యా. నా అభిప్రాయం ప్రకారమైతే ప్రస్తుతం ఈ రాగిరేకు మనకు ఎందుకూ పనికిరాదు" అన్నాడు నిస్పృహగా.

"నిధి ఉందా లేదా? ముందా సంగతి చెప్పు" అడిగాడు అన్నారావు.

"ఉంది"

"మరయితే పనికిరాకపోడమేంటి?"

"అదెక్కడ ఉందో తెలియాలిగా"

"అందులో లేదా?"

"నిధి గురించి ఉంది. కాని అది వున్నచోటు తెలియాలంటే దీని తాలూకు రెండో రాగి రేకు కావాలి."

"గొప్ప చిక్కే వచ్చిందే. అదేమన్నా అంగట్లో సరుకా కొనితెచ్చుకోడానికి. ఏ కాలంలో ఎవరు రాసిపెట్టారో. ఆ రెండో ముక్క ఉందో మట్టిలో కలిసి పోయిందో. అలాగని నిధిని వదులుకుంటామా, మన బుర్ర ఉపయోగించి కనిపెట్టాలి. ఇంతకీ స్నిగ్ధ ఏం రాసింది చెప్పు"

"మావయ్యా. అదంత తేలికయిన విషయం కాదనుకుంటాను. నిధిని దాచిపెట్టినవాళ్ళు చాలా తెలివైన వాళ్ళు. మొత్తం సమాచారం ఒకేచోట వుంటే శత్రువుల చేతిలో పడితే కొల్లగొడతారన్న భయంతో రాగిరేకును రెండు భాగాలుగా కత్తిరించి రెండు గొట్టాల్లో వేరు వేరుచోట్ల భద్రం చేసి ఉంటారు.

రెండోది కూడా దొరికితేగాని నిధి వున్న చోటు కనిపెట్టడం సాధ్యంకాదని స్నిగ్ధ స్పష్టంగా రాసింది. చూడండి" అంటూ స్నిగ్ధ రాసిన కాగితాన్ని అన్నారావు చేతికిచ్చాడు మహీధర్. అలాగే రాగిరేకును విప్పి టేబిల్‌మీద పరిచి చుట్టుకు పోకుండా పేపర్ వెయిట్ పెట్టాడు.

స్నిగ్ధ గీచిన నకలు డయాగ్రమ్ పేపర్‌ని దాని పక్కన ఉంచి వెంటనే పరిశీలించాడు. ఉన్నదున్నట్టు పేపర్‌మీద మార్క్ చేయబడింది.

పాళీ భాషలో రాగిరేకుమీద రాసున్న అక్షరాలను అదేచోట తెలుగు అర్ధంలో రాయబడివుంది.

"ఆ అమ్మాయి ఏమన్నా మార్పులు చేసుంటుందా?" సందేహించాడు అన్నారావు. మహీధర్ ఒప్పుకోలేదు.

"ఆ అమ్మాయి మనల్నేమీ చీట్ చేయలేదు. నిజాయితీగానే డీకోడ్ చేసిచ్చింది. ఇది చూసారా? వంకరటింకర గీత. ఇది క్షిప్రానది. మధ్యప్రదేశ్‌లో వుంది. ఉజ్జయినీ నగరం ఈ నదిమీద ఉందని మీకూ తెలుసు. నదిని సూచించే ఈ గీత ఇందులో సగమే ఉంది. మిగిలింది రెండో రాగిరేకులోకి పోయింది. ఇది ఉజ్జయినికి ఎగువ ప్రాంతమా దిగువ ప్రాంతమా అని కనిపెట్టడం ఒక సమస్య" అంటూ చెప్పటం ఆపాడు మహీధర్.

"ఇంతకీ నిధి మాటేమిటి? అది ఎక్కడ గుర్తించబడింది?" ఆసక్తిగా డయాఫ్రమ్‌లోకి తొంగి చూస్తూ అడిగాడు అన్నారావు. నది పక్కన రౌండ్ చుట్టిన చోటు వేలుపెట్టి చూపించాడు మహీధర్.

"ఇక్కడ అపారమైన నిధి దాచిపెట్టబడింది. అలా నిధి నిక్షిప్తం చేసినచోట ఏదో దేవాలయం వెనకభాగం కావచ్చని స్నిగ్ధ సూచించింది. అలాగే ఆ చోటు

నుండి ఇదో... కొంత దూరంలో నాలుగు పక్కలా నాలుగు గుడులు సూచించబడ్డాయి.

అవి ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, విద్యాలక్ష్మి అనే అష్టలక్ష్ములల్లో నాలుగు లక్ష్మీదేవిల ఆలయాలున్నట్టు సూచించబడింది" అంటూ ఆ నాలుగు ప్రదేశాలనూ వేలితో చూపించాడు మహీధర్.

ఆసక్తిగా వింటూ పేపర్‌వంక చూస్తున్నారంతా.

"నది నుంచి ఆలయాల దూరం చెప్పబడిందా?" అడిగాడు అన్నారావు.

"అవును మామయ్యా. నిధి నిక్షిప్తమైన చోటునుండి ఒక్కో ఆలయం ఇప్పటి లెక్కన పదికిలోమీటర్ల దూరం ఉండొచ్చని రాసింది స్నిగ్ధ"

"నో... నమ్మలేకపోతున్నాను. ఇలాంటి ఆలయ నిర్మాణాల గురించి నేను వినలేదు. చూడలేదు" అన్నాడు ఆశ్చర్యపోతూ అన్నారావు.

అంతవరకూ మౌనంగా ప్రేక్షకుడిలా కూర్చునున్న మంత్రవాది అనంతస్వామి పెదవి విప్పాడు.

"అవును. నేనూ వినలేదు. నా అభిప్రాయం ప్రకారమైతే క్షిప్రానది తీరంలో మహావిష్ణువు ఆలయం ఏదో ఉండాలి. దాని సమీపంలో ఎక్కడో నిధి దాచారు.

ఆ ఆలయాన్ని చుట్టి అష్టదిక్కుల్లో అష్టలక్ష్మి ఆలయాల నిర్మాణం జరిగివుంటుంది.

అదే నిజమైతే ఆ యా ప్రాంతాల్లో ఊళ్ళు కూడా ఉండివుండాలి. మిగిలిన ఆలయాల వివరాలు రాగిరేకు రెండో భాగంలో ఉండివుంటాయి.

శ్రీమన్నారాయణుడి ఆలయం నుండి అష్టదిక్కుల్లో లక్ష్మి ఆలయాల నిర్మాణం గురించిగాని అలాంటి ప్రాంతం ఉందనిగాని ఇంతవరకు నేనూ వినలేదు. ఒకప్పుడు ఉంటే ఉండుగాక. ప్రస్తుతం ఎక్కడా ఉన్నట్టు లేదు" అన్నాడు.

"అవును నేనూ వినలేదు. ఇలాంటి ఆలయాల గురించి విన్నదే లేదు" అన్నాడు బసవడు.

"అయితే ఈ ప్రాజెక్టు వదులుకుందామా? మనం విననంత మాత్రాన లేవనుకుంటే ఎలా? ఏరా మహీధర్. దిగువన ఇక్కడేదో రాసుంది ఏమిటది చదువు?" అన్నాడు ఆవేశాన్ని, కోపాన్ని అదుపు చేసుకుంటూ అన్నారావు. అంత సులువుగా ఆశవదులుకునే మనిషి కాదు అతను.

"ఇది నిధి రహస్యాన్ని ఈ రాగిరేకులో పొందు పరిచిన వ్యక్తి పేరయివుం టుంది మావయ్యా. ఆయన పేరు స్థిపతి శ్రీ శంభులింగయాచారి అని వుంది" చెప్పాడు మహీధర్.

"స్థపతి అంటే ఇంటిపేరా?" అడిగాడు బసవడు. అతడి ప్రశ్నకు అనంతయ్య బదులిచ్చాడు.

"అది ఇంటి పేరు కాదు. శంభులింగయాచారి హోదాను తెలియజేస్తుంది. మహాశిల్పి అయి వుండి గుడులు, గోపురాలు, కోటలు, పేటలు మొదలయిన కట్టడాల నిర్మాణాలను కళాత్మకంగా తీర్చిదిద్దే వానిని స్థపతి అంటారు.

డిజైనింగు లేఅవుట్ అంతా ఆయనిస్తాడు. అలాగే శిల్పులకు పనులు కేటాయించి ఆయా పనులు వారి చేత చేయించి వాటిని నిర్మాణంలో అనుసంధానం చేయిస్తాడు. పూర్తిగా నిర్మాణ పనులన్నీ ఆయన ఆధ్వర్యంలోనే సాగుతాయి. అతన్ని స్థపతి అంటారు. ఆచార్యుడంటే బోధించేవాడు.

కాబట్టి ఆయనకి అనేకమంది శిష్యులు కూడా ఉంటారు. వీరంతా ఆయన చేపట్టే నిర్మాణం పనుల్లో పాలుపంచుకుంటారు" వివరించాడు.

"మీరు చెప్పింది బాగానే వుంది స్వామి కాని కట్టడాల నిర్మాణం చేపట్టే స్థపతికి అంత నిధి ఎక్కడిది? ఎలా వచ్చుంటుంది?" ఈసారి మహీధర్ అనుమానంగా అడిగాడు.

"ఆ నిధి అతడిదై ఉండదు మహీధర్. ఆయా ఆలయాల్ని నిర్మింపజేసిన రాజు లేదా చక్రవర్తికి చెందిన సంపద అయివుంటుంది. కారణాలు ఏమైనాగాని రాజుగారి ఆనతితోనే నిధిని అక్కడ నిక్షిప్తం చేయించి ఉంటాడు స్థపతి శంభులింగయాచారి. రెండో రాగిరేకు లభిస్తేగాని మనకు పూర్తి వివరాలు తెలీవు.

సాధారణంగా నిధి రహస్యాలు అనామకులు, అసమర్ధులవద్ద ఉండవు. నిధి దాచినతర్వాత దానికి సంబంధించిన సంజ్ఞలు గుర్తులతో కూడిన నిధి రహస్యాన్ని తెలిపే మేప్ గీసి దాన్ని రాజుగారికి ఇచ్చేస్తారు.

తరువాత అది ఆ రాజుగారి వారసుల వద్దే భద్రంగా ఉంటుంది. కాని ఈ రాగిరేకులు గమనిస్తే ఇది అప్పటి రాజు లేదా చక్రవర్తి కోసం తయారు చేసిందిగా లేదు.

"స్థపతి శంభులింగయాచారి స్వంతంగా దీన్ని తయారించి సగం తన వద్ద ఉంచుకొని మిగిలినసగం ఎవరివద్దో భద్రం చేసివుంటాడు. ఇది రాజ్యం పతనమయిన తర్వాత జరిగివుండాలి" అంటూ తన అభిప్రాయం వివరించాడు అనంతస్వామి.

అంతా శ్రద్ధగా విన్నారు.

"అంటే ఆలయాల నిర్మాణం చేపట్టినప్పుడే నిధిని కూడా నిక్షిప్తం చేసివుంటారా?" అడిగాడు మహీధర్.

"నేనలా అనుకోవటంలేదు. అప్పటికే ఆలయాల నిర్మాణం జరిగిపోయి వుండొచ్చు. ఆ తర్వాత కాల పరిస్థితుల్లోనే భవిష్యత్తరాల కోసం లేదా దేశ భద్రత కోసం నిధిని దాచిపెట్టాల్సివచ్చినప్పుడు విష్ణు ఆలయం వద్ద భద్రంచేసి వుంటారు" చెప్పాడు అనంతస్వామి.

అంతా విని ఉత్సాహంగా చూశాడు అన్నారావు.

"అదే నిజమైతే అది సాధారణ నిధికాదు. అనంత పద్మనాభస్వామి ఆలయంలో బయటపడిన నేలమాళిగల్లోని నిధుల్లా అవీర సంపదై వుంటుంది. ఇక మీదట ఆ నిధిని చేరుకోవటమే మనలక్ష్యం. బసవా వెంట ఎంత మందిని తీసుకెళ్తావో తెలీదు. ఉజ్జయినిలో మకాంచేసి ఆలయాల గురించి తెలుసుకు రావాలి. రేపే మీ ప్రయాణం" అంటూ లేచాడు అన్నారావు.

సరిగ్గా ఇక్కడ రాగిరేకు మీది నిధి రహస్యంగురించి చర్చ జరుగుతూండ గానే అక్కడ దంతెవారాలోని హోటల్‌సూట్‌లో కూడా ఇదే విషయం మీద కృతయుగ్ స్నిగ్ధల మధ్య రసవత్తరమైన చర్చ సాగుతోంది.

"కృతా!... నీకు నిధి నిక్షేపాల మీద నమ్మకముందా?" తన ఎయిర్‌బ్యాగ్ సీక్రెట్ అరలోని కాగితాన్నితీసి కృతయుగ్ ఎదురుగా సోఫాలో కూర్చుంటూ అడిగింది.

స్నిగ్ధ ప్రశ్న విని భుజాలెగరేశాడు.

"ఉన్నాయో లేదో నాకయితే తెలీదు. కాని నువ్వు నాకు దొరకటం ఒక నిధి దొరికినట్టే. ఇక వేరే నిధులు నాకెందుకు?" అన్నాడు ఛలోక్తిగా.

"మా ఫ్యామిలీ బ్యాగ్రౌండ్‌ని దృష్టిలో ఉంచుకుని ఈ మాటంటున్నావ్ కదూ?"

"లేదు. ఎందుకంటే నేనేమిటో నీకు తెలుసు. కోరితే మీ ఆస్తి అంతస్థుల్ని వదిలి నాతో వచ్చేస్తావని తెలుసు. ఇక మీ ఫ్యామిలీ బ్యాగ్రౌండ్‌తో నాకేంపని?"

"థాంక్స్ కృతయుగ్. నా మీద నమ్మకం ఉంచావ్" ప్రేమగా చెప్పింది. అంత క్రితం, కృతయుగ్ తమ సూట్‌లోకి తిరిగివచ్చేసరికి నిత్య వెళ్ళిపోయింది.

అప్పటికింకా అనీజీగానే ఉన్నాడతను. వరండా చివర ముగ్ధ సూట్‌లో సంఘటన ఇంకా మర్చిపోలేదు. ఆమె కౌగిలితో పాదరసంలా ఎగసిన వేడి అతడ్ని చికాకుపరుస్తూనే వుంది.

"ఎక్కడికెళ్ళిపోయావ్? నువ్వు కనబడలేదని నిత్య ఫీలయింది తెలుసా?" అంది అతన్ని చూస్తూనే స్నిగ్ధ.

"ఫోన్ స్విచ్చాఫ్ చేశావే?" తిరిగి తనే అడిగింది దగ్గరకొస్తూ.

"ఛార్జింగ్ లేనట్టుంది" అంటూ వెళ్ళి ఫోన్ ఛార్జింగ్‌లో ఉంచి వచ్చాడు.

అంతలో కాఫీ, టిఫిన్లు రావటంతో మాటలు ఆగిపోయాయి. "నిత్యను కోటవద్ద కలవచ్చులే. బయలుదేరదాం" అంటూ స్నిగ్ధను తొందరచేశాడు.

అప్పుడు అసలు విషయం చెప్పింది స్నిగ్ధ. "ఈపూట మనం ఎక్కడికీ వెళ్ళటం లేదు. ఏకంగా భోంచేసి మధ్యాహ్నం వెళ్దాం" అంది.

"ప్రోగ్రామ్ ఎందుకు మార్చావ్? నిత్య వచ్చిందనా?" అడిగాడు.

"అదేంకాదు ఈ పూట ఫుల్ రెస్ట్. మధ్యాహ్నం వెళదాం. అప్పటికి చుట్టు పక్కల అన్నీ చూసి స్టూడెంట్స్ బస్సు కూడా కోటకొస్తుంది. రాత్రి ఓ ముఖ్య విషయం నీతో చర్చించాలనుకున్నాను. నిద్ర ముంచుకొచ్చి వీలుకాలేదు. ఇప్పుడు అదే మన ప్రోగ్రామ్."

"అంతేనా! అంతకుమించి ఇంకో ప్రోగ్రామ్ ఏమీ లేదా?" అతడి ప్రశ్న.

అందులో కొసరే కొంటెతనం తొంగి చూస్తోంది.

"ఇంకో ప్రోగ్రామా... ఏం వుంది?" అంటూ అతడి కళ్ళలోకి చూసి ఆ కళ్ళలోని చిలిపితనం చూసి మాటల్ని మింగేసింది స్నిగ్ధ. బుగ్గలకి ఎరుపురంగు పులుముకుని సిగ్గుతో ముఖం దించుకుంది. "ఏయ్. నువ్విలాటి కొంటె ప్రశ్నలేసి అలజడిరేపి నన్ను రెచ్చగొట్టకు. ముందే తొందరపడితే శోభనం రాత్రి పొందే థ్రిల్‌ని మనం కోల్పోతాం. అది నాకిష్టం లేదు. ప్లీజ్" అంది మృదువుగా.

ఆమె సిగ్గుపడుతుంటే అలాగే చూడాలన్పిస్తోంది. మనసు ఆగనంటున్నా కంట్రోల్ చేసుకున్నాడు.

* * * * *

తన జాతకం ఏమిటోగాని విధి తనకే ఎందుకిలా పరీక్ష పెడుతోంది. ఈ ట్రయాంగిలర్ లవ్ గేమ్ ఏమిటో ఎక్కడికి తీసుకుపోతుందో అర్థంగావటం లేదు.

తను ప్రేమించే అమ్మాయి ఒకపక్క, తనని ప్రేమించే అమ్మాయి మరోపక్క. వీళ్ళిద్దరూ ఒకేరోజు పరిచయం గావటం ఏమిటి? తన మనశ్శాంతిని కొల్లగొట్టడం ఏమిటి? తనని ఇలా ఇరికించి విధి తమాషా చూడ్డం ఏమిటి?

స్నిగ్ధ తొందరపడొద్దంటుంది. ముగ్ధ తొందరపడమంటూ మీదపడుతోంది.

ఈ పరిస్థితిలో తటస్థంగా ఉండటం కన్నా నరకం మరోటి ఉండదు. నిగ్రహమే తనకి శ్రీరామరక్ష.

"ఏంటా మౌనం? కోపం వచ్చిందా?" కనురెప్పలెత్తి చూస్తూ స్నిగ్ధ అడుగుతుంటే పరిహాసంగా నవ్వాడు కృతయుగ్.

"ఏయ్. నా మాటల్ని తప్పుగా అర్థం చేసుకున్నట్టున్నావ్. ఇంకో ప్రోగ్రామ్ లేదా అనటంలో నా ఉద్దేశం షాపింగ్‌కో, సినిమాకో, సిటీ చూడ్డానికో బయటికెళ్ళే ప్రోగ్రామ్ లేదాని. నువ్వనుకుంటున్నట్టు శోభనం అనికాదు అర్థం" అన్నాడు.

స్నిగ్ధకు కోపం వచ్చేసింది.

"మార్చకు. మాట మార్చకు. నేను చిన్నపిల్లనికాదు. ఆ మాత్రం తెలుసుకోలేననుకున్నావా? నాకంతా తెలుసు" అంటూ చివ్వున లేచి వచ్చి ఒడిలో కూర్చుని ముద్దులు పెట్టేసింది.

"ఇదే మరి. టిఫిన్లు, కాఫీలు ఇచ్చి సరిపెట్టేయాలని చూస్తావ్. మరి భోజనం మాటేమిటి" అన్నాడు ఆమెను ఇంకొంచెం ఉడికించాలని. ఆమె ఉడికిపోలేదు. ప్రేమగా కళ్ళలోకి చూసింది.

"భోజనానికీ ఓ సమయం ఉంటుంది. అప్పుడు అడక్కుండా నేనే వడ్డిస్తాను. అంతవరకు మారాం చేయకు. కృతయుగ్ మంచి బాలుడు. ఓ.కె.?" అంటూ జుత్తు నిమిరి పలపు రంగరించిన వేడి ముద్దులిచ్చి అతడ్ని శాంతింపజేసింది.

"ఓ.కె. డియర్. ఇప్పుడు మనం – ఇక్కడ చర్చించాల్సినంత ముఖ్య విషయాలేమున్నాయి?" అడిగాడు.

"నిన్న అడవిలో ఏం జరిగిందో తెలుసుకోవాలని లేదా?" అతడి ఒడిలోంచి లేచి ఎదురుగా సోఫాలో కూర్చుంటూ అడిగింది.

"నువ్వు క్షేమంగా బయటపడ్డావ్ దట్సాల్ మిగిలిన విషయాలతో నాకేం పని?"

"పని ఉంది. ఈ విషయాలు నువ్వుకూడా తెలుసుకోవాలి." అంటూ పీటర్ బృందం తనను కిడ్నాప్‌చేశాక, కృతయుగ్ తనను వెదుకుతూ వచ్చేలోపల జరిగిన సంగతులన్నీ వివరంగా చెప్పింది.

ఆమె చెప్పిందంతా శ్రద్ధగా విన్నాడు కృతయుగ్.

"అంటే వాళ్ళంతా హైదరాబాద్ నుంచే నిన్ను ఫాలోచేసి వచ్చారంటావా?" నమ్మలేనట్టు అడిగాడు.

"అవును. ఆ విషయాన్ని స్వయంగా పీటరే చెప్పాడు. హైదరాబాద్‌లో ఉండగా నాచేత పని చేయించుకోవటం వీలుకాదని వాళ్ళకి తెలుసు. నేను

దంతెవారావైపు వస్తున్న విషయం ఎలాగోతెలుసుకొని ఫాలోఅయ్యారు. మరో ముఖ్య విషయం, వాళ్ళని ఎప్పటికప్పుడు ఫోన్‌లో కాంటాక్ట్ చేస్తూ కమాండ్ చేస్తున్నది ఒక లేడీ. ఇది ఆమె నంబరు.

పీటరు చూడకుండా అతడి సెల్‌లో పడిన నంబర్ నోట్ చేసుకున్నాను" అంటూ ఒక స్లిప్ మీద నంబర్‌వేసి కృతయుగ్‌కిచ్చింది స్నిగ్ధ.

"నా అనుమానం కూడా చెప్పేస్తున్నాను. ఆ ముఠా నాయకురాలు నా అంచనా కరక్టయితే నీ వెంటపడుతున్న ముగ్ధ అయివుండాలి" అంది.

ఆ మాట వింటూనే కొరడా ఝుళిపించినట్టు తృళ్లిపడ్డాడు కృతయుగ్. నమ్మలేనట్టు చూశాడు.

"వాళ్ళు నీకోసం వచ్చుంటే మరి నాతో ఈ ప్రేమగోల దేనికి? లింకు కలవటంలేదే!" ఆశ్చర్యపోయాడు.

"ఈ విషయంలో నాకన్నా నువ్వే అలర్ట్‌గా ఉన్నావ్. మర్చిపోయావా? ఆ రెడ్‌ఫియట్ ఫాలో చేస్తోంది నిన్నానన్నా అని డౌట్‌పడ్డావ్. గుర్తుందా? ఇప్పుడు డౌటు క్లియరైపోయింది.

నన్నే ఫాలో చేసిందామె. ఎప్పటికప్పుడు మన మూమెంట్స్‌ని ఫోన్‌లో పీటర్ ముఠాకి ఉప్పందించింది. అందుకే మనం అడ్డదారిన కోటకు వెళ్తున్నామని పీటర్‌కి తెలిసి అటు వచ్చాడు. లేదంటే వాడికి తెలిసే అవకాశమే లేదు" అంటూ వివరించింది.

"ఓ.కె. ఈ విషయాన్ని పక్కన పెడదాం కాస్సేపు. రాగిరేకు విశేషాలేమిటి చెప్పు" కుతూహలంగా అడిగాడు. రాగిరేకు నమూనాగా తను గీచిన నమూనా పేపర్‌ని టీపాయ్‌మీద పరిచింది స్నిగ్ధ. దాన్ని పరిశీలించాడు. "ఇందులో నిధి రహస్యం ఉందంటావా?" అనుమానంగా అడిగాడు.

"ఉంది. సందేహం లేదు" చెప్పింది.

"ఇదేదో దీర్ఘచతురస్రం రాగిరేకును ఓ మూలగా కత్తిరించిన ముక్కోణ త్రిభుజంలా ఉంది"

"నీ అనుమానం కరక్టే. నిధి రహస్యాన్ని రెండు భాగాలుగా కత్తిరించి మడిచి రాగిగొట్టంలో భద్రం చేశారు. దీని రెండో భాగం ఎక్కడో ఉండొచ్చు ఉండకపోవచ్చు. అది లభిస్తేగాని ఈ మిస్టరీ సాల్వ్ కాదు" అంటూ క్షిప్రానది విష్ణు ఆలయం, అష్టలక్ష్ముల ఆలయాల గురించి వివరించింది స్నిగ్ధ.

"ఇందులో విశేషం మధ్యప్రదేశ్‌లో ఇలాంటి ఆలయాల నిర్మాణం ఉందన్న సంగతి నేనింతవరకు వినలేదు. అవి ఇప్పటికీ ఉన్నాయో కాలగర్భంలో కలిసిపోయాయో కూడా తెలీదు" అంది.

"నేనూ వినలేదు. ఇలాంటి నిర్మాణాలు ఎక్కడా లేవు కూడా" అన్నాడు కృతయుగ్.

"లేవు అనకు. ఉన్నాయి. ఉదాహరణకి కుంభకోణం దేవాలయం. ఇది తమిళనాడులో ఉంది"

"ఏమిటి అక్కడ విశేషం?"

"కుంభకోణానికి ఓ ప్రత్యేకత ఉంది. అక్కడ ఆదికుంభేశ్వరుడి ఆలయం మూలంగా దానికి కుంభకోణం అనే పేరు వచ్చింది.

ఇంకా అక్కడ కాలాధీశ్వర గుడి, శంకరపాణి గుడి, నాగేశ్వర గుడి, రామాలయం, కాళీ విశ్వనాథాలయం, భృమన్ ఆలయం, సోమేశ్వరాలయం, రాజగోపాల స్వామి ఆలయం, పానపురేశ్వరం ఆలయమని ఇలా మరో తొమ్మిది ప్రసిద్ధ ఆలయాలు పరివేష్టించి వుండటం విశేషం. అందుకే ఆ వూరికి కుంభకోణం అని నామం స్థిరపడింది. ఈ కుంభకోణాన్ని చుట్టూ నవగ్రహ ఆలయాలు ఉండటం విశేషం.

కుంభకోణం నుండి నవగ్రహ ఆలయాలన్నీ దర్శించవచ్చు. కుంభకోణం నుంచి పదహారు కిలోమీటర్ల దూరంలో సూర్యదేవాలయం ఉంది.

సుమారు నలభై కిలోమీటర్ల దూరంలోని తింగళూరులో చంద్రుడి ఆలయం వుంది.

ఏభై అయిదుకిలోమీటర్ల దూరంలోని వైదీశ్వరన్‌లో కుజక్షేత్రం ఉంది. అరవై కిలోమీటర్ల దూరంలోని తిరువెంగాడులో బుధక్షేత్రం ఉంది.

కుంభకోణం నుంచి ఇరవై కిలోమీటర్ల దూరంలోని అలంగురులో గురుడికి ఆలయం ఉంది. ఇరవై కిలోమీటర్ల దూరంలోని కంచణ్ణూరులో శుక్రుడికి ఆలయం ఉంది. ఆరు కిలోమీటర్ల దూరంలోని తిరునాగేశ్వరం వూళ్లో సుప్రసిద్ధ రాహువు ఆలయం వుంది.

ఇక అరవై కిలోమీటర్ల దూరంలోని కీళ్ళ పెరుంపాళెంలో కేతువు ఆలయం ఉంది. ఈ ప్రసిద్ధ క్షేత్రాలన్నీ కుంభకోణం చుట్టూ ఉన్నాయి.

కాబట్టి ఆదివిష్ణు ఆలయం చుట్టూ అష్టలక్ష్ముల ఆలయ నిర్మాణం జరిగివుంటుందనటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. కాదంటే ఈ ఆలయాలు

ఇప్పుడున్నాయా లేదా అన్నదే సమస్య. క్షిప్రానదీ తీరం వెంట ఈ ఆలయాలుండే ప్రాంతం ఏదో స్పష్టంగా తెలియాలంటే దీనితాలూకు రెండోరాగిరేకు లభిస్తేగాని సాధ్యం కాదు" అంటూ తన మాటల్ని ముగించింది స్నిగ్ధ.

ఓ పక్క ఆమె మాటలు వింటూనే మరోపక్క ఆలోచనల్లో మునిగిపోయాడు కృతయుగ్.

"ఏమైంది? ఎందుకలా ఉన్నావ్?" విస్మయంతో అడిగింది స్నిగ్ధ.

"ఏం లేదు. ఇలాంటిది అంటే ఇలా ముక్కోణంలో ఉన్న రాగిరేకును ఎప్పుడో ఎక్కడో చూశాను... యస్. చూసిన గుర్తు. ఎక్కడా అని ఆలోచిస్తున్నాను. అవునూ. రాగిరేకు చుట్టి ఒక రాగిగొట్టంలో ఉంచబడిందని కదూ చెప్పావ్?" అడిగాడు.

"అవును" అంది ఉద్వేగభరితురాలవుతూ స్నిగ్ధ.

"నేను ఇలాంటి రాగిరేకును చూశాను"

"ఎక్కడ? గుర్తుచేసుకో కృతా. ప్లీజ్. దీన్ని సాధించగలిగితే మనకి గొప్ప పేరొస్తుంది తెలుసా?" ఉత్సాహంగా అంది స్నిగ్ధ.

"నాకు పేరు ముఖ్యం కాదు. నువ్వు ముఖ్యం. నీ సంతోషం ముఖ్యం. బహుశా ఆ రాగిరేకు నీకు చూపించిన ముఠా ఎవరోగాని చాలాపెద్ద తప్పు చేశారనుకుంటా. పోయిపోయి ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్‌లోని నీకే చూపించారు చూడు" అంటూ నవ్వాడు కృతయుగ్.

"నవ్వకు ప్లీజ్ ఆలోచించు. దీన్ని ఛేదించగలిగితే నిధి ఒక్కటేకాదు. ముఖ్యమైన ఎంతో చరిత్ర కూడా బయటపడుతుంది. ఆలోచించి చెప్పు"

"ఏమో. ఒకవేళ నేను చూసిన రాగిరేకు దీనికి సంబంధించినది కాదేమో... ఓమాట చెప్పు. ఆ రాగిగొట్టం సుమారుగా అడుగు పొడవుంటుందా?"

"ఉంటుంది. కాస్త తగ్గొచ్చుకూడా"

"గొట్టంమీద సూర్యుడి చుట్టూ కిరణాలు మిగిలిన భాగమంతా లతలు, పూలతో కళాత్మకంగా వుందా?" అతడిమాటలు వింటూనే ఉత్సాహంతో కెవ్వున అరవాలనిపించింది స్నిగ్ధకి.

తను అంతా చెప్పిందిగాని రాగి గొట్టం గురించి వర్ణించి చెప్పలేదు. కాని దాని గురించి చూసినట్టు చెప్పాడు కృతయుగ్. అంటే అది రాగిరేకు రెండో భాగం అని స్పష్టమవుతోంది.

"ఎగ్జాక్ట్‌లీ అదే. చెప్పు కృతా... ఎక్కడ చూశావ్? ఎవరి దగ్గర చూశావ్?" ఉత్సాహంగా అడిగింది. "ప్చ్... గుర్తురావటం లేదు" అన్నాడు తల విదిలిస్తూ.

"చూశావ్. కాని గుర్తురావటంలేదు. ఎందుకు రాదు? ట్రైచెయ్. ఆలోచించు కృతా... ప్లీజ్" చిన్నపిల్లలా ఆమె మారాం చేస్తుంటే కృతయుగ్‌కి నవ్వొచ్చేసింది. అతడు నవ్వటం చూసి మూతి ముడుచుకుంది స్నిగ్ధ. వచ్చి పక్కన కూచుని ఆమె చేయి అందుకుని వేళ్ళ మధ్య వేళ్ళు జొనిపి లాలనగా ముద్దాడాడు.

"విషయం చెప్పావ్ గదా. ఇక నాకు వదిలెయ్. ఎప్పుడు చూశాను. ఇప్పటికిప్పుడు తొందరపడితే గుర్తురాదు సరికదా మొత్తం మర్చిపోయే ప్రమాదం ఉంది. కొంత టైమివ్వు. తప్పకుండా గుర్తొస్తుంది అప్పుడు చెప్తాను. ఓ.కె?" అన్నాడు.

"ఓ.కె. నేను కర్మసిద్ధాంతాన్ని నమ్ముతాను. కారణం లేకుండా విధి ఏదీ నడిపించదు. బహుశా మనిద్దర్నీ కలపడంలో విధి ఈ ఆలయాల రహస్యాన్ని మన ద్వారా వెలికితీయించాలని నిర్ణయించినట్టుంది. దేవుడు మనకిచ్చిన గొప్ప అవకాశంగా దీన్ని భావించి మనం కృషి చేయాలి" అంది.

"ఓ.కె." అన్నాడు కళ్ళలోకి చూస్తూ.

"ఒక్క విషయం మర్చిపోకు స్నిగ్ధా! చూస్తుంటే ఈ నిధికోసం ప్రయత్నిస్తోంది చాలా పెద్ద ముఠా అనిపిస్తోంది. వాళ్ళతో చాలా ప్రమాదం. మీ డిపార్ట్‌మెంట్ సాయం లేకుండా మనం ఏమీ చేయలేం" హెచ్చరించాడు. అవునన్నట్టు తలూపింది.

"నిజమే. కాని ప్రాథమిక ఆధారాలు సేకరించకుండా అప్రోచ్ అయితే వాళ్ళు పటించుకోరు. రిపోర్ట్‌ని బుట్టదాఖలు చేస్తారు. అందుచేత సమస్యలొస్తే మనమే ఫేస్ చేయాలి. తప్పదు" అంది.

మాటల్లోనే మధ్యాహ్నం భోజనం వేళయింది. అంతసేపు మాటలతో కాలక్షేపం చేసినా వరండా చివర సూట్‌లో ముగ్ధ ఉందన్న సంగతి కావాలనే బయటపెట్టలేదు కృతయుగ్. చెప్పేకన్నా చెప్పకుండా ఉండటమే మంచిదని పించింది.

అనుమానం ముందు, అమ్మాయిలు తర్వాత పుడతారంటారు. తనిప్పుడు ముగ్ధ గురించి చెప్తే నీకెలా తెలుసు? అంత ఇంట్రెస్టు ఏమిటి అని స్నిగ్ధ అడిగిందంటే చిక్కుల్లో పడతాడు.

మొత్తానికి భోజనాలు ముగియగానే ఇద్దరూ కోటకు ప్రయాణమయ్యారు. ముగ్ధగాని పార్కింగ్‌లో ఆమె కారుగాని కృతయుగ్‌కి కన్పించలేదు. ట్యాక్సీ దంతెవారాను వదిలి పాతిక కిలోమీటర్ల దూరంలో వున్న కోట దిశగా పరుగు తీసింది.

దంతెవారా సిటీ నుంచి ఉత్తరంగా వెళ్ళేకొద్దీ అటవీ భూములు తరిగి వ్యవసాయ భూములు దర్శనమిస్తాయి. ఆ మార్గంలో అయిదు కిలోమీటర్ల దూరాన ఎడం పక్కగా పశ్చిమంగా ఒక రోడ్డు చీలిపోతుంది. కోటకు వెళ్ళే మార్గం అదే. అటు ఇటు దట్టమైన అడవిగుండా ఇరవై కిలోమీటర్ల దూరంలో కోట ఉంది.

దారిలో ఒకటి రెండు గిరిజన తండాలు కన్పిస్తాయి. చెట్ల కొమ్మల ముసుగులోంచి ప్రయాణం. అదోవింత అనుభూతి. కొత్త ప్రపంచంలోకి ప్రయాణిస్తున్నట్టుంటుంది. దారి పొడవునా జింకలు, కోతులు, నెమళ్ళు, కుందేళ్ళ వంటివి గుంపులుగా తిరుగుతూ కనువిందు చేస్తాయి.

సుమారు ఐదు వందల అడుగుల ఎత్తున్న కొండగుట్ట మీద ఎన్నో ఎకరాల విస్తీర్ణంలో, బండరాళ్ళతో కళాత్మకంగా నిర్మించిన అద్భుతమైన కోట దంతెవారా కోట.

గుట్టపైన ఎత్తైన కోటగోడ చుట్టూ కందకం, లోన కట్టడాలు యధాతధంగా ఇప్పటికీ చెక్కు చెదరకుండా పర్యాటకుల్ని ఆకర్షిస్తోంది. ఒకప్పుడు గుట్ట దిగువన దంతెవారా నగరం ఉండేదట. ఎంతో వైభవాన్ని చవిచూసిన కోట అది.

కళింగులు ఓఢ్రుల సంయుక్త దండయాత్రలో నగరం కొల్లగొట్టబడి బ్రిటీషు వారి కాలానికి ముందే నగరం శిథిలమై అడవిలో అంతర్భాగంగా మారిపోగా అక్కడికి దూరంగా ప్రస్తుతం ఉన్న దంతెవారా ఊరు ఏర్పడి క్రమంగా అది తంతెవారా నగరంగా అభివృద్ధి చెందింది. బ్రిటీషు పాలనాకాలంలో ఒక సైన్యాధికారి అడవిలోని ఈ కోటను కనుగొని బయటి ప్రపంచానికి తెలిసేలా చేశాట్ట. ఆ కోటకు సంబంధించిన రాజ వంశీకులు ఇప్పటికీ ఉన్నారు.

వారంతా విదేశాల్లో స్థిరపడ్డారు. మనకి స్వాతంత్ర్యం వచ్చాక ఆర్కియాలజీ శాఖ పర్యాటక శాఖలు సంయుక్తంగా కోటను అభివృద్ధిపరచి రోడ్డు వేసి పర్యాటక కేంద్రంగా మార్చాయి.

దంతెవారా వద్ద ఆకర్షణ ఈ ఒక్క కోట మాత్రమే కాదు. చుట్టుపక్కల చక్కని ఆలయాలున్నాయి.

కాబట్టి ఈ ప్రాంతం పుణ్యక్షేత్రంగా భక్తుల్ని కూడా ఆకర్షిస్తూంటుంది. అలాగే అటవీ ప్రాంతంలోని రెండు జలపాతాలు కనువిందు చేస్తాయి.

ఇవన్నీ చూడాలంటే కనీసం మూడురోజులు దంతెవారాలో స్టే చేయక తప్పదు.

*  *  *  *  *

హైదరాబాద్ ఉమెన్స్ కాలేజీ నుంచి వచ్చిన విహారయాత్రా బస్సు ముందుగా గుళ్ళు గోపురాలు దర్శించుకుని మధ్యాహ్నం భోజన సమయానికి కోటకు చేరుకుంది.

అదే సమయానికి దంతెవారాలోని ఒక భోజనహోటల్ నుంచి ముందే ఆర్డరిచ్చిన ప్రకారం ఒక ప్రత్యేక వ్యాన్‌లో భోజనాలు వచ్చి సిద్ధంగా ఉన్నాయి అందరికీ.

అమ్మాయిలంతా కాసేపు కోట పరిసరాల్ని చూసి వచ్చేసరికి మండపంలో భోజనాలకి ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. భోజనం విశ్రాంతి తర్వాత కోట మొత్తం తిరిగి చూసి సాయంకాలం హోటల్‌కి తిరుగు ప్రయాణం. ఇదే వాళ్ళ షెడ్యూలు.

వెంట వచ్చిన లేడీలెక్చరర్లు అమ్మాయిలను హెచ్చరించి భోజనాలకు కూర్చున్నారు.

అందరితో పాటు నిత్య కూడా భోంచేసింది. అందరికన్నా ముందుగానే ముగించి లేచింది. ఆమెతో మరో ఇద్దరు ఫ్రెండ్స్ కూడా లేచారు.

మిగితావాళ్ళింకా భోంచేస్తూండగానే వీళ్ళు ముగ్గురూ కోట గుమ్మం దాటి అలా కోట ఆవరణలోకి వచ్చేశారు. గోడ పంచన నిలబడి చూస్తూంటే చుట్టూ అడవి కనువిందు చేస్తోంది.

ఆకాశం మబ్బుపట్టి సూర్యుడు కన్పించటంలేదు. చల్లటి గాలి ఆహ్లాదంగా వస్తోంది. తన్మయం చెందుతూ పరిసరాల్ని గమనించలేదు వాళ్ళు.

ఒక్కోసారి ఆపదలు చెప్పిరావు. కొత్త చోటు. విడిగా అమ్మాయిలెవరూ తిరగొద్దు. అంతా ఒకటిగా తిరగాలని లెక్చరర్లు హెచ్చరిస్తూనే వున్నారు. ఆ హెచ్చరికల్ని లెక్కచేయకుండా ముగ్గురూ విడిగా బయటకొచ్చి అతిపెద్ద తప్పు చేశారు.

ఆ తప్పునకు భారీమూల్యమే చెల్లించాల్సివస్తుందని వాళ్ళు ఊహించలేదు. 'హలో యంగ్ లేడీస్' అంటూ అపరిచిత గొంతు ఒకటి పలకరించేసరికి ఉలిక్కిపడి తిరిగి చూశారంతా.

ఎదురుగా పాతికేళ్ళ నల్లటి దుక్కలాంటి యువకుడు నిలబడున్నాడు. జీన్స్ ప్యాంటు, టీషర్టు ధరించిన కుర్ర చింపాంజీలా వున్నాడు. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. తాగి వున్నాడు. నాలుగు వేళ్ళకి ఉంగరాలు, బ్రాస్ లెట్, మెళ్ళో గోల్డ్‌చైను... చూపులు చాలా నిర్లక్ష్యంగాను, ఆకలిగాను ఉన్నాయి.

వేటను చూసిన పులి పెదవులు తడుపుకుంటున్నట్టు నిత్యవంక చూస్తూ పెదవులు కొరుక్కున్నాడు.

"వావ్... వాటె బ్యూటీ... చాంద్‌కా తుకడా... మై మర్‌గయారే...." అంటూ సినిమాఫక్కీలో మాటలు వదులుతూ గుండె రుద్దుకున్నాడు.

"కౌన్ రేతు? హట్‌జావ్..." కోపంగా కసురుకుంది నిత్య. "ఏయ్. ఎవర్నువ్వు. ఈ అమ్మాయెవరనుకున్నావ్?" పక్కమ్మాయి నిత్యకు సపోర్టుగా తెలుగులో దబాయించింది. ఫక్కున నవ్వాడు వాడు.

"ఓ మైగాడ్. యు తెలుగూ? నాకు తెలుగంటే చాలా ఇష్టం. ఆంధ్రా అమ్మాయిలంటే చాలా చాలా ఇష్టం." అనరిచాడు తెలుగులో.

"అయితే ఇప్పుడేమంటావ్?" చేతులు కట్టుకునిలబడి సీరియస్‌గా అడిగింది నిత్య.

ఆమె ఎంత గలగలా మాట్లాడుతుందో అంతకంత తెగువ ధైర్యం గల యువతి. ఓ పట్టాన భయపడదు. తండ్రి సెంట్రల్ మినిస్టర్‌గాబట్టి భయపడే ఛాన్సేలేదు. ఆమె మాటలకు వంకరగా నవ్వాడు వాడు.

"ఏమంటాను డియర్. ఇంత అందాన్ని వదిలిపోలేను. నువ్వే కావాలంటాను. పద"

ఆమాట వింటూనే నిత్యకన్నా వేగంగా రియాక్టయింది పక్క అమ్మాయి. "చెప్పు తెగుతుంది. ఎవడ్రా నువ్వు రాస్కెల్. మా నిత్యను చూసి ఆ మాటనడానికి ఎంత ధైర్యం?" అనరిచింది.

"ధైర్యం" అంటూ పకపకా నవ్వాడు వాడు.

"అది నా దగ్గర కావలసినంత వుంది. నన్నెవడూ ఆపలేడు" అంటూ క్రూరంగా చూశాడు. అప్పటికి స్కార్పియో దగ్గర పడుతోంది. అందులో వాడి బ్యాచ్ కుర్రాళ్ళు చాలామందున్నారు.

పరిస్థితి శృతి మించుతోందని అమ్మాయిలకు అర్థమవుతోంది.

"ఏయ్... నా పేరు చింటూ... చింటూ భాయ్... స్టేట్ హోంమినిస్టర్ కొడుకుని. నా ధైర్యం గురించి మీకు తెలీదు. నేను కన్నేసిన ఏ పిల్లా తప్పించుకోలేదు. నాకే ధమ్కీ ఇస్తారే? రావే" అంటూ సడెన్‌గా నిత్య చేయిపట్టుకు లాగాడు వాడు. ఊహించని పరిణామానికి బిత్తరపోయారు అమ్మాయిలు. వాడి చేయి విడిపించుకోలేక పెద్దగా అరిచింది నిత్య.

షాక్ నుంచి తేరుకున్న అమ్మాయిలిద్దరూ సాయం కోసం అందర్నీ పిలవడానికి లోపలికి పరుగుతీశారు. వాడు చూస్తే స్థానిక హోమ్ మినిస్టర్ కొడుకునంటున్నాడు. స్థానబలం ఎక్కువ. నిత్యకు ఏంచేయాలో తోచక భయంతో అరిచింది. కాని తప్పించుకోలేకపోయింది.

స్కార్పియో వచ్చి పక్కన ఆగింది. చింటూ ఆమెను చివరిసీట్లోకి తోసి తనూ ఎక్కి కూచుని డోర్ మూశాడు. అటుపక్క ఇద్దరు ఆమెను కదలకుండా పట్టుకుని నోరు మూశారు. స్కార్పియో కదిలింది.

అంతలోపల అక్కడ భోజనాలు ముగించి లేచిన లెక్చరర్లు అమ్మాయిలు జరిగింది విని భయాందోళనలతో వేగంగా బయటకు పరుగులెత్తుకొచ్చారు. కాని అప్పటికే స్కార్పియో వేగంగా వెళ్ళిపోతూ కన్పించింది.

*　　　*　　　*　　　*　　　*

కృతయుగ్ డ్రైవ్ చేస్తున్న ట్యాక్సీ కొండగుట్టను సమీపిస్తోంది. కొండమీది కోటగోడ – ఎత్తయిన కోటబురుజులు చాలా దూరంలోకి కన్పిస్తున్నాయి.

అతడి భుజంమీద తలాన్చుకుని అరమోడ్పుకళ్ళతో కునుకుతీస్తోంది స్నిగ్ధ. ఉన్నట్టుండి కృతయుగ్ చిన్నగా నవ్వటం గమనించి ముఖం ఎత్తిచూసింది.

“ఎందుకా నవ్వు? చెప్తే నేనూ నవ్వుతాగా” అంది వేలితో భుజం మీద గోకుతూ.

“ఓసారి అలా వెనక్కి చూడు. నువ్వూ నవ్వుతావ్” అన్నాడు.

“ఏం? మన కారువెనక కోతులున్నాయా?”

“కోతి కాదు. రెడ్ ఫియట్ ఉంది”

“ఛ! జోక్ చేయకు. నేన్నమ్మను”

“చూడమంటున్నాగా ఆ కారు తోకలా మన వెనకే వస్తోంది.”

అప్పుడు చూసింది స్నిగ్ధ. చూడగానే పెద్ద షాక్. ఫర్లాంగు దూరం ఎడంగా తమ వెనకే వస్తోంది రెడ్ ఫియట్.

హోటల్ నుంచి బయలుదేరినప్పుడు అది కన్పించలేదు. దారిలో ఎక్కడ తమవెంటపడిందో తెలీదు. కాని ఎప్పటిలాగే తమని ఫాలోచేస్తోంది.

ఆ కారును చూడగానే కోపంతో వివర్ణమైంది స్నిగ్ధ ముఖం. “ఆపు. కారాపు కృతా. దాని సంగతి ఇప్పుడే ఇక్కడే తెల్చేస్తాను” ఆవేశంగా అరిచింది.

“ఆ తొందరే వద్దనేది” అన్నాడు శాంతంగా కృతయుగ్ ఆమెను చూస్తూ.

“ఇప్పుడేమైందని? తన గురించి మనకు తెలిసి పోయిందిగా. ఎంతవరకు వస్తుందో రానీ. వీలు చూసి ఫోన్ కొడితే నువ్వు అనుమానించినట్టు దొంగలరాణి అవునో కాదో తేలిపోతుంది” అన్నాడు.

"ఓ.కె. నువ్వు చెప్తున్నావుగాబట్టి ఊరుకుంటున్నాను. రానీ. నాకు పోటీ వస్తుందా... కోట దగ్గర దీని సంగతి చూస్తా" అంది శాంతిస్తూ స్నిగ్ధ.

క్రమంగా కొండగుట్టను చేరుకుంది ట్యాక్సీ.

*          *          *          *          *

గుట్టపైకి వెళ్ళే షూట్‌రోడ్ ఆరంభంలో అద్భుతంగా మలచబడి ఆహ్వానం పలుకుతున్న శిలాతోరణం ఒకటుంది.

దానికిందుగా వంపులు తిరుగుతున్న రోడ్డువెంట కొండగుట్టపైకి పరుగుతీసింది కారు. వెనక రెడ్ ఫియట్ కూడా వారిని అనుసరించే వస్తోంది.

గుట్టపైన కోటగోడ గుమ్మం విశాలంగా చాలా ఎత్తుగా ఉంది. సువిశాల మైన కోట ఆవరణనుండి గుమ్మం బయట రెండు ఫర్లాంగుల దూరం వరకు స్ట్రెయిట్‌గా గీత గీచినట్టు ఉంది రోడ్డు.

సరిగ్గా చింటూ భాయ్ బృందం స్కార్పియో వ్యాన్ గోడ గుమ్మం దాటే సమయానికి అటునుంచి గుట్ట పైకెక్కి వ్యాన్‌కి ఎదురువస్తోంది ట్యాక్సీ.

స్కార్పియో చివరిసీట్లో నిత్యను అరవకుండా నోరు మూసి అదిమిపట్టు కున్నారు ఇద్దరు యువకులు. గింజుకుంటోంది నిత్య. డోర్ గ్లాస్ దించివుండటంతో బయట స్పష్టంగా కన్పిస్తోంది.

అనుకోకుండా నిత్య చూపులు ఎదురుగా వస్తున్న ట్యాక్సీమీద పడ్డాయి. డ్రైవ్ చేస్తున్న కృతయుగ్‌ని పక్కనున్న అక్క స్నిగ్ధని గుర్తుపట్టేసింది. ఒక్కసారిగా ఆమెలో బలం పుంజుకుంది.

చివరి ప్రయత్నంగా తన నోరు మూసినవాడి చేతిని బలంగా కొరికింది. కెవ్వుమంటూ చేయి వెనక్కి లాక్కున్నాడు వాడు.

అదే సమయంలో తల కిటికీలో ఉంచి – "అక్కా– బావా. కాపాడండి బావా." అంటూ పెద్దగా అరిచింది. పక్కనున్న చింటూభాయ్ కోపంతో ఆమెను వెనక్కిలాగి "ఎవడే నిన్ను కాపాడేది?" అంటూ సాచి చెంపమీద కొట్టాడు.

చిన్నప్పట్నుంచి ఎంతో సుకుమారంగా, గారాబంగా పెరిగిన నిత్య అతడి దెబ్బతో తెలివితప్పి తలవాల్చేసింది. బుగ్గ ఎర్రగా కందిపోయింది.

అదే సమయంలో వ్యాన్‌ని దాటిన ట్యాక్సీ సడెన్ బ్రేక్‌తో ఆగింది. పక్కనున్న స్నిగ్ధ అయోమయంగా చూసింది.

"అది నిత్య గొంతులా వుంది. ఏదో ప్రమాదం జరుగుతోంది." అనరిచింది వ్యాన్‌వంక చూస్తూ.

ఆమె మాటలు కృతయుగ్‌కి విన్పించలేదు. "బావా కాపాడు" అంటూ వ్యాన్‌లోంచి నిత్య అరుపులే చెవిలో మారుమోగుతున్నాయి. చాలా వేగంగా ట్యాక్సీని రివర్స్ తీసి వ్యాన్ వెనక దూకించాడు. ఈలోపల ఎగువనుంచి వస్తున్న రెడ్ ఫియట్‌లోని ముగ్ధ జరిగిందంతా స్పష్టంగా చూస్తూనేవుంది.

ఏదో జరిగిందని గ్రహిస్తూ వెంటనే హుషారయింది. తన కారును సడెన్‌బ్రేక్‌తో ఆపి ఆ వ్యాన్ తనను దాటి పోకుండా రోడ్డుకి అడ్డంతిప్పి ఆపేసి కిందకు దిగింది. ఇప్పుడు చీర జాకెట్‌లో లేదామె.

చక్కని చుడీదార్ డ్రస్‌లో వుంది. ఆమెనుగాని, కారును గాని తప్పించు కొని ముందుకుపోవడానికి దారిలేదు. కారును గుద్దుకొని వెళ్ళిపోదామంటే అడ్డంగా నిలబడుందామె. తప్పని పరిస్థితిలో వ్యాన్‌ను స్లోచేశాడు డ్రైవరు.

"ఏయ్. కారు పక్కకు తియ్యి. లేకపోతే చస్తావ్?" తల బయటపెట్టి అరిచాడు డ్రైవర్.

"చంపగలిగే దమ్ముంటే ట్రై చేయరా. ఇక్కడ నేను ఉండగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేరు" అంటూ అంతకన్నా ఘాటుగా బదులిచ్చింది ముగ్ధ.

ఆమెకు పదడుగుల దూరంలో వ్యాన్ ఆగింది. గుద్దుకుపోవాలనే ఉద్దేశంతో డ్రైవరు ఇంజన్ రెయిజ్ చేస్తున్నాడు. అంతలో వెనక సీట్లోంచి చింటూభాయ్ అరిచాడు.

"రేయ్. బ్లాక్ బ్యూటీ. మాంచి వగరు చూపిస్తోంది. తెచ్చి లోన పడేయండిరా. మనమేంటో చూపిద్దాం" అంటూ. వెంటనే ఫ్రంట్ సీట్లో ఇద్దరు బయటికొచ్చి వేగంగా ముగ్ధమీదికి దూకారు.

మెరుపు తీగలా కదిలింది ముగ్ధ. ఎలా కొట్టిందో, దేంతో కొట్టిందో కూడా వాళ్ళకి అర్ధంకాలేదు. అర్ధమయ్యేలోన 'బాప్‌రే!' అనరుస్తూ రోడ్‌కి అడ్డంగా పడిపోయారు అంతే. పడ్డవాళ్ళు తిరిగి లేవలేదు.

ఆమె కరాటేలో బ్లాక్ బెల్ట్ హోల్డరని తెలిసుంటే వాళ్ళు అంత సాహసం చేసుండేవాళ్ళు కాదేమో, కళ్ళముందు జరిగింది చూడగానే వ్యాన్‌లోని యువకులకు తాగింది మొత్తం దిగిపోయినట్టయింది.

తిరుగులేని చింటూభాయ్‌కి మొదటిసారిగా ఎదురుదెబ్బ తగిలింది. కోపంతో వ్యాన్ దిగి ముందుకొచ్చాడు. వెనకే ఆరుగురు దిగారు.

నిత్యను పట్టుకుని లోన ఇంకా ఇద్దరున్నారు. డ్రైవరు ఇంకా కారు దిగలేదు. సరిగ్గా అప్పుడే-దుమ్ముతెరలు రేపుతూ దూసుకొచ్చి ఆగింది ట్యాక్సీ.

పొడవాటి ఇనపరాడ్ అందుకుని దూకుడుగా కారు దిగాడు కృతయుగ్. అటునుంచి స్నిగ్ధ దిగింది.

చేతిలో ఇనపరాడ్‌తో సుడిగాలిలా వస్తున్న కృతయుగ్‌ను చూడగానే రివాల్వర్ తీసి ముగ్ధకు గురిచేశాడు చింటూభాయ్.

"పోండిరా. వాడెవడో పెద్ద మొనగాడిలా వస్తున్నాడు. వాడి సంగతి చూడండి. చంపేయండి వాడ్ని. తర్వాత నేను చూసుకుంటాను" అనరిచాడు.

"ఏమిట్రా నన్నుకూడా చంపేస్తావా?" అంటూ కొంచెం కూడా భయం లేకుండా నవ్వింది ముగ్ధ. రివాల్వర్ చూసి కూడా ఆమెలో కించిత్తు కూడా భయం కనబడకపోవడంతో చింటూభాయ్‌కి చిర్రెత్తుకొచ్చింది.

"ఏమిటే నవ్వుతావ్. నేనెవరో తెలుసా? ఈ స్టేట్ హోంమినిస్టర్ కొడుకుని. నా దారికి అడ్డం వస్తే ఛస్తారు" అనరిచాడు.

"అయితే నిన్ను కాదురా, నీ అబ్బని తన్నాలి. వాడ్ని మంత్రిని చేసిన పెద్దమనుషుల్ని తన్నాలి. మంత్రిపదవి రాగానే స్టేట్‌లో జాగీరనుకుంటున్నార్రా" అంటూ మాటల్లోనే వేగంగా కదిలింది ముగ్ధ.

కన్నుమూసి తెరిచేలోపు చింటూభాయ్ చేతిలో రివాల్వర్ ఎగిరివచ్చి ఆమె చేతిలోపడింది. బిత్తరపోయాడు చింటూభాయ్.

"నీ వేషాలు నా దగ్గర కాదురా. మీకు సరైన మొగుడువాడే. మీరు ఏ వెధవ పనిచేశారో నాకు తెలీదుగాని ఇలాంటితప్పు ఎందుకు చేశామా అని జీవితాంతం బాధపడతావ్" అంటూ-రివాల్వర్ బుల్లెట్లతో వాడిచుట్టూ దుమ్ముతెరలు రేపి వాడ్ని గంతులేయించింది.

అప్పటికే ప్రత్యర్థుల మీద రాక్షసుడిలా విరుచుకు పడ్డాడు కృతయుగ్. వచ్చినవాళ్ళని వచ్చినట్టు ఇనపరాడ్‌తో విరగ్గొట్టి దారి చేసుకుంటూ వేగంగా వ్యాన్‌ని చేరుకుని వెనక డోర్ తెరిచాడు.

లోపల పరిస్థితి చూసి షాకైపోయాడు.

అతడే కాదు. దూరంగా నిలబడి చూస్తున్న స్నిగ్ధ కూడా షాక్‌తో కెవ్వున అరిచింది.

సీటుమీద స్పృహలేకుండా పడుంది నిత్య. అయిదు వేళ్ళు తట్టు తేలి ఎర్రగా కందిపోయింది బుగ్గ. పక్కనే ఇంకా ఇద్దరు కుర్రాళ్ళు కూచునున్నారు.

"రాకు... దగ్గరకి రాకు. వస్తే దీన్ని చంపేస్తాం" అంటూ ఒకడు డాగర్ చూపించి కృతయుగ్‌ని బెదిరించాలని చూశాడు.

అంతటితో కృతయుగ్‌లోని సహనం పూర్తిగా అంతరించిపోయింది. వాడి బెదిరింపుల్ని ఏమాత్రం లెక్క చేయకుండా. 'యూ బాస్టర్డ్స్' అంటూ ఇద్దరి జుట్టు పట్టి దూది మూటల్ని లాగినట్టు వ్యాన్‌లోంచి లాగి అవతలకు విసిరేశాడు.

"స్నిగ్ధా హరియప్. నిత్యను ట్యాక్సీలోకి చేర్చు" అనరిచాడు. పరుగెత్తు కొచ్చింది స్నిగ్ధ.

కాని స్పృహలో లేని నిత్యను బయటకు తీయటం ఆమెవల్ల కాలేదు. అది గమనించి ముగ్ధను పిలిచాడు కృతయుగ్. చింటూభాయ్ రివాల్వర్ అవతలకు విసిరేశాక వాడిని నాలుగు పీకి కృతయుగ్‌కి సాయంగా మిగిలిన వాళ్ళమీదకు అటాక్ చేసిందామె.

కృతయుగ్ పిలుపు వింటూనే నిత్యవద్దకు పరుగెత్తింది ముగ్ధ. నిత్యను వ్యాన్‌లోంచి బయటకు తీశారు. సాయంపట్టి తీసుకెళ్ళి ట్యాక్సీ వెనకసీట్లో పడుకోబెట్టారు. చెల్లెలి పరిస్థితి చూసి ఏడుస్తున్న స్నిగ్ధకు ధైర్యం చెప్పింది ముగ్ధ. "డోన్ట్ వర్రీ. జస్ట్ ఫెయింటయింది. వాటరందుకో" అంటూ వాటర్ బాటిల్ అందుకుని నిత్య ముఖంమీద చిలకరించింది.

వెంటనే తెలివి వచ్చి లేచి కూచుంది నిత్య. అక్కను చూడగానే దుఃఖం ఆపుకోలేక ఆమెను కౌగిలించుకుని పెద్దగా ఏడ్చేసింది. వాళ్ళిద్దర్నీ అక్కడే వదిలి కృతయుగ్‌కి సాయంగా తిరిగి పోరాటంలోకి వచ్చేసింది ముగ్ధ.

కృతయుగ్‌కి మార్షల్ ఆర్ట్స్ తెలుసని ముగ్ధకు తెలుసు. చాలా రోజులుగా అతడ్ని గమనిస్తూనే వుందామె. ఇక ఇద్దరు ఫైటర్స్ నిలబడితే పన్నెండుమంది రౌడీకుర్రాళ్ళు ఎంతసేపు నిలబడగలరు?

తర్వాత జరిగిన పరిణామాల్లో కృతయుగ్ ఇనపరాడ్ దెబ్బకి తల పగిలి కుప్పకూలిపోయాడు చింటూభాయ్. వాడి మిత్రవర్గంలో ఇద్దరికి కాళ్ళు విరిగాయి. ముగ్గురికి చేతులు విరిగాయి.

నలుగురు తెలివితప్పారు. వ్యాన్ అద్దాలు పగిలి ధ్వంసమైంది. ఈ గొడవలో కొద్దిపాటి దెబ్బలతో స్పృహలో వుంది వ్యాన్ డ్రయివర్ ఒక్కడే.

ఈ గొడవ జరుగుతున్న సమయంలోనే అటు కోటవద్దనుంచి కాలేజీ టూర్ బస్ రివ్వున వచ్చేసింది. నిత్యకోసం కంగారుపడుతూ వస్తున్నారు వాళ్ళు. వాళ్ళంతా బస్సు దిగి ట్యాక్సీని చేరుకున్నారు. నిత్య క్షేమంగా ఉన్నందుకు సంతోషించారంతా.

కోపం పట్టలేక అమ్మాయిలంతా ఎగబడి చింటూభాయ్ వర్గాన్ని తలో చేయి పంచుకున్నారు. వాళ్ళందర్నీ అదిలించి వెనక్కిపంపాడు కృతయుగ్.

"జరిగింది చాలు. చచ్చిన పాముల్ని ఇంకా చంపాల్సిన పనిలేదు. ఈ గొడవకి మీరు దూరంగా ఉండండి" అంటూ పక్కనున్న ముగ్ధవంక చూశాడు.

"థ్యాంక్స్ ముగ్ధా. సమయానికి నువ్వు అడ్డంపడకపోతే ఇంత త్వరగా నిత్యను దక్కించుకునేవాళ్ళం కాదు. బట్. నువ్వు కూడా ఈ గొడవకి దూరంగా ఉంటే మంచిది. ఏం జరిగినా నేను ఫేస్ చేస్తాను. స్నిగ్ధకు సాయంగా నువ్వూ అక్కడే ఉండు" అన్నాడు.

అతడి మాట తనకు వేదవాక్కు అయినట్టు తల ఊపి ట్యాక్సీవైపు అడుగు వేసింది ముగ్ధ.

ఈ లోపల ట్రాఫిక్ ఆగిపోడంతో ముగ్ధ ఫియట్‌ని తనే పక్కకు తీశాడు కృతయుగ్. కిందపడున్న వాళ్ళని పక్కకు లాగి ట్రాఫిక్‌కి దారి వదిలాడు. తర్వాత వ్యాన్ డ్రైవర్‌ని దగ్గరకు పిలిచాడు కృతయుగ్. "ఫోన్ ఉందా?" అడిగాడు. "ఉంది సాబ్" భయపడ్తూ బదులిచ్చాడు వాడు.

"హాస్పిటల్‌కి ఫోన్‌చేసి వెంటనే అరడజను అంబులెన్స్‌లు పంపించమను. ఇంకెవరికన్నా చేయాల్సుంటే ఫోన్లు చేసుకో. త్వరగా" అన్నాడు.

"సార్. మీరు చాలా తప్పు చేస్తున్నారు సార్. చింటూభాయ్ సాక్షాత్తూ హోమ్ మినిస్టర్ కొడుకు. వీళ్ళంతా ఆయన ఫ్రెండ్స్. సమాజంలో డబ్బూ, హోదా ఉన్నవాళ్ళ పిల్లలు..." హెచ్చరించబోయాడు డ్రైవర్.

కేర్‌లెస్‌గా చూశాడు కృతయుగ్. "హోం మినిష్టరా వాడి అబ్బా. వెధవలకి పదవులు కట్టబెడితే దేశం ఇలాగే వుంటుంది. అమ్మాయిల్ని కిడ్నాప్ చేసే వెధవలు ఎవరైతే నాకేంటి?

సమాజంలో పెద్ద మనుషులంటున్నావ్‌గా. పుత్రోత్సాహంతో వాళ్ళు ఈ వెధవల్ని వెనకేసుకొస్తారో ధర్మాన్ని వెనకేసుకొస్తారో చూస్తాను. ఫోన్ చెయ్యి" ఆర్డర్ వేశాడు.

"చిన్నప్పట్నుంచి ఒంటిమీద దెబ్బంటే ఏంటో తెలియకుండా ఎంతో గారాబంగా పెరిగాం. అలాంటి నా చెల్లెల్ని బుగ్గ వాచిపోయేలా కొట్టాడు వెధవ.

వాడి చేతులు విరగ్గొట్టివుండాల్సింది" అంటూ కళ్ళు తుడుచుకుంది స్నిగ్ధ.

"డోంట్‌వర్రీ. అంతకన్నా ఎక్కువే చేశాడు కృతయుగ్. వాడి తల పగిలింది. కొద్దిరోజుల వరకు తనెవరో కూడా వాడికి గుర్తుండదు" అంది ముగ్ధ.

తిరిగి తనే చెప్పింది. "అయితే ఇంతటితో ఇది ఆగిపోతుందనుకోను. కృతయుగ్ చాలా రిస్క్ ఫేస్ చేయాలి" అంటూ గుర్తుచేసింది. అంతవరకూ మౌనంగా వున్న నిత్య వెంటనే ఫోన్ అందుకుంది.

"అక్కా డాడీకి ఫోన్ చేస్తాను. ఇప్పుడే ఫోన్‌చేసి జరిగింది చెప్పేస్తాను." మనకిప్పుడు ఆయన సాయం అవసరమంటూ ఢిల్లీలో వున్న తండ్రి శివప్రసాద్‌గారి నంబర్‌కి ఫోన్ చేసింది.

అంతలో అక్కడికొచ్చిన కృతయుగ్ ఆమె చేతిలోంచి ఫోన్ లాక్కుని కాల్ కట్‌చేశాడు. ఐతే అప్పటికే అవతలికి మిస్డ్‌కాల్ వెళ్ళిపోయిన సంగతి అతడికి తెలీదు. నిత్య వంక చూసి "ఆర్ యు ఓ.కె.?" అనడిగాడు.

"ఓ.కె. బావా... థాంక్స్. సమయానికి మీరిటురాబట్టి బతికిపోయాను. లేదంటే" అంటూ ఏడ్చేసింది నిత్య.

"కూల్‌డౌన్ నిత్యా. రిలాక్స్. ఇంతమంది అమ్మాయిలుండగా నువ్వు ఒంటరిగా ఆ దుర్మార్గుల చేతికెలా చిక్కావ్?" అడిగాడు.

అతడి ప్రశ్నకు సంఘటన సమయంలో నిత్యవెంట వున్న స్నేహితురాళ్ళు ఇద్దరూ ఏం జరిగిందో వివరించారు. "ఓ.కె. నిత్యా. అయిందేదో అయింది. విషయాన్ని పెద్దది చేయకు. మీవాళ్ళకి తెలిస్తే బాధపడతారు. మీ పేరు ప్రతిష్ఠలకు సంబంధించిన సమస్య ఇది. ఎవరికీ ఫోన్లు చేయకు" అంటూ ఫోన్ తిరిగిచ్చేశాడు.

అంతా వింటున్న ముగ్ధ చూస్తూ వూరుకోలేకపోయింది. "ఇది ఇంతటితో పోతుందని నేననుకోవటం లేదు కృతయుగ్. స్టేట్ హోంమినిస్టర్‌తో వ్యవహారం. పోలీస్ బలగమంతా అతడి చేతిలో ఉంటుంది.

వీళ్ళ డాడీకి ఫోన్ చేయటం మంచిది కాదనుకుంటే ఓ పనిచేద్దాం. మా డాడీకి ఫోన్‌చేస్తాను. ఇప్పుడు ఎవరో ఒకరి హెల్ప్ మనకు అవసరం" నచ్చజెప్పాలని ప్రయత్నించింది కాని ఇది కూడా తిరస్కరించాడు కృతయుగ్. "మీకు అర్థంగావటంలేదు. నిత్య భవిష్యత్తుకు సంబంధించిన సమస్య ఇది. తనే కాదు. మీ పేర్లుకూడా బయటపడ్డం నాకు ఇష్టం లేదు.

ఏం జరిగినా నేను ఫేస్ చేస్తాను. మీరు తొందరపడి ఎవరికీ ఫోన్లు చేయొద్దు" అంటూ కరుగ్గా హెచ్చరించి వెళ్ళి ప్రత్యర్థుల ధ్వంసమైన వ్యాన్‌లో కూర్చుని సిగరెట్ ముట్టించుకున్నాడు. ఇదిలా ఉండగానే-ఎవరికీ తెలీని మరో విశేషం అక్కడ చోటుచేసుకుంది. విషయం బయటికి పొక్కడానికి అదే కారణమైంది.

ఈ సంఘటన జరగటానికి ముందే టీవీ ఛానల్ ప్రతినిధి ఒకడు, ప్రముఖ వార్తాపత్రిక విలేఖరి ఒకడు కోట ప్రాంతంలో పర్యటిస్తున్నారు.

ఎప్పుడైతే గొడవ సంగతి విన్నారో వెనువెంటనే స్టూడెంట్స్ బస్‌తో బాటే బైక్‌ల మీద స్పాట్‌కి వచ్చేశారు. వాళ్ళు ఎవరో తెలీక అమ్మాయిల్లో కొందరు వాళ్ళకి మేటర్ లీక్ చేసేశారు.

అసలే మీడియా ప్రతినిధులు. ఇక చెప్పాలా!

కేంద్ర పెట్రోలియం శాఖమంత్రి ఎంపి శివప్రసాద్ గారి అమ్మాయి నిత్యని స్టేట్ హోంమినిస్టర్ కొడుకు చింటూభాయ్ కిడ్నాప్ ప్రయత్నం–

అడ్డుకున్న యువకుడి చేతిలో వాళ్ళకి దేహశుద్ధి ఇది సామాన్య విషయంకాదు గదా. అద్భుతమైన న్యూస్ కవరేజి దొరికింది వాళ్ళకి. వెంటనే సెల్‌ఫోన్ల నుంచి వార్తలు పరుగుతీయటం ఆరంభమైంది.

ఏ విషయాన్ని గుంభనగా ఉంచాలని కృతయుగ్ ఆశించాడో అది ఎవరి ప్రమేయం లేకుండానే సెన్సేషనల్ న్యూస్ అయికూచుంది. దంతెవారా నుండి అంబులెన్సులు పోలీసు వ్యాన్‌లతోపాటు మీడియావాళ్ళ వాహనాలు కూడా శరవేగంతో కోటబాట పట్టాయి.

ఈ లోపల–నిత్య ఫోన్ నుంచి మిస్డ్‌కాల్ వెళ్ళిన సరిగ్గా పదినిముషాల తర్వాత అటునుంచి ఫోన్ చేశాడు మంత్రి శివప్రసాద్. నిత్య ఫోన్ తీసింది.

"సారీరా! పనిలో ఉండి నీ మిస్డ్ కాల్ గమనించలేదు. హౌ ఆర్ యు? టూర్ బాగా ఎంజాయ్ చేస్తున్నావా? ఎక్కడున్నావ్ తల్లీ. నేనడుగుతూనే వున్నాను బదులుచెప్పవేమిటి. నిత్యా... ఆర్ యు ఓ.కె.?" ఆయన గొంతులో కాస్త ఆత్రుత ధ్వనించింది.

తండ్రి గొంతు వింటూనే– ఇక దుఃఖం ఆపుకోలేక పోయింది నిత్య. భోరున ఏడ్చేసింది. అవతల కేంద్ర పెట్రోలియం శాఖామంత్రి శివప్రసాద్ కూతురి దుఃఖం వింటూనే ఎంతగా షాకైవుంటాడో ఊహించవచ్చు.

"ఏమైంది? ఏం జరిగిందిరా. ఎందుకేడుస్తావ్? నిన్నింతగా బాధపెట్టింది ఎవరు? చెప్పు తల్లీ, టూర్‌లో ఆక్సిడెంట్‌లాంటిదేమన్నా జరిగిందా?" కంగారుగా అడుగుతున్నాడాయన.

"లేదు డాడీ" అంది కళ్ళు తుడుచుకుంటూ.

"మరేమిటి?"

నిత్య ఏదీ దాచలేదు. జరిగింది గబగబా చెప్పింది. అక్క స్నిగ్ధ తనతో ఉన్నట్టూ చెప్పింది. కాపాడిన కృతయుగ్ గురించి, వాళ్ళిద్దరి లవ్ గురించీ చెప్పేసింది.

కృతయుగ్ తనమూలంగా రిస్క్‌లో పడే అవకాశాన్నీ చెప్పింది. వింటూనే ఆయనకు విషయం అర్థమైనట్టుంది. "ఇప్పుడు మీరంతా ఎక్కడ ఉన్నారు?" అడిగాడు.

చెప్పింది నిత్య.

"ఓ.కె. మీరేం కంగారుపడకండి. అతనికేం కాదు. నేను వస్తున్నాను. ఇప్పుడే బయలుదేరుతున్నాను" అంటూ వెంటనే లైన్ కట్ చేశాడాయన.

ఒక అస్త్రాన్ని ఎదుర్కోవాలంటే దానికన్నా పెద్ద అస్త్రం ప్రయోగించాలి. అలాగే స్టేట్‌మంత్రిని ఎదుర్కోవాలంటే సెంట్రల్ మినిస్టర్ కరెక్ట్.

అందుకే– నిత్య ఢిల్లీలోని తండ్రితో మాట్లాడ్డం గమనించగానే తన తండ్రి అన్నారావుకు ఫోన్ చేయాలన్న ఆలోచన విరమించుకుంది ముగ్ధ.

ఆ తర్వాత జరిగిన నాటకీయ పరిణామాల్లో చాలా సంఘటనలు చోటుచేసుకున్నాయి.

పోలీసుల రంగప్రవేశంతో–అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఇద్దరు ఎస్సైలు తమ బలగాలతో ఒక జీపు రెండు వ్యాన్‌లలో వచ్చి చేరారు.

దంతెవారా నుంచి బయలుదేరుతున్నప్పుడే హోం మినిస్టర్ నుండి ఎస్సైలకు ఆర్డర్స్ అందాయి.

తన కొడుకు ఒంటిమీద చేయి వేసినవాడు తను వచ్చేసరికి ప్రాణాలతో ఉండాలి. కాని ఎముకలన్నీ విరిగి కుళ్ళికుళ్ళి ఏడుస్తూండాలని ఆర్డర్.

ఆ ఆర్డర్ భుజాన వేసుకుని సంఘటన స్థలానికి చేరిన పోలీసులు అతిగా ప్రవర్తించటం ఆరంభించారు. అందర్నీ దూరంగా తరమాలని ప్రయత్నించారు.

కాని సాధ్యం కాలేదు. కాలేజీ అమ్మాయిలకు పబ్లిక్ సపోర్ట్ ఏర్పడింది. ఐతే పోలీసులు హోంమినిస్టర్ మెప్పు కోసం చాలా దురుసుగా ప్రవర్తించారు. ఒక సందర్భంలో ఘర్షణ తోపులాట కూడా చోటుచేసుకున్నాయి.

ఓ పక్క ఈ గొడవ జరుగుతుండగానే చింటూభాయ్‌నీ, అతడి మిత్ర బృందాన్ని అంబులెన్సుల్లో ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ మొత్తం గొడవలో– నిత్య పేరు బయటకు రాకూడదనుకున్న కృతయుగ్ ఉద్దేశం నెరవేరలేదు. ఒక ఎస్సై దురుసుగా కృతయుగ్‌ని అరెస్టు చేయడానికి బేడీలు తీశాడు.

అలాంటిదేదో జరగొచ్చని ముందే ఊహించారు కాబట్టి స్నిగ్ధ, నిత్యలతో పాటు ముగ్ధ కూడా అడ్డం వచ్చేశారు. వెంట ఒక మధ్యవయసు లెక్చరర్ కూడా వుంది. ఆమెకు ధైర్యం ఎక్కువ.

ఎవరికీ భయపడదు. ఆమె స్వభావానికి తగ్గట్టే ఆమె పేరు కూడా ఝాన్సీరాణి. "ఈ కుర్రాడ్ని ఎందుకు అరెస్ట్ చేస్తారు?" అంటూ ఎస్సైని నిలదీసిందావిడ.

"ఇంతమందిని కొట్టిపడేశాడు. అరెస్టు చేయక సన్మానించాలా? తప్పుకోవమ్మా. లేదంటే మీ అందర్నీ అరెస్ట్ చేయాల్సుంటుంది" బెదిరించాడు ఎస్సై.

"చేస్తావా? అరెస్ట్ చెయ్యి మేమూ చూస్తాం. ఇక్కడ అరెస్టు చేయాల్సింది ఇతన్ని కాదు, చింటూభాయ్‌ని, వాడి ఫ్రెండ్స్‌ని. వాళ్ళకి ఎంత ధైర్యం ఉంటే సెంట్రల్ మినిస్టర్ కూతుర్నే కిడ్నాప్ చేస్తారు?" అంటూ ఆవేశంతో అరిచింది ఆమె.

కృతయుగ్ ఆపాలని చూసినా ఆమె ఆగలేదు. పైగా "నీకు తెలీదుబాబూ. ఒక్కసారి వీళ్ళ చేతికిచిక్కితే నిన్ను మనిషిగా వదలరు.

ఏం జరుగుతుందో చూద్దాం. ఇది మీకే కాదు, మా కాలేజీ పరువు ప్రతిష్ఠలకు సంబంధించిన ప్రశ్న. టూరిస్ట్‌లు అంటే అతిధులకింద లెక్క. అలాంటి మనల్ని అవమానించే హక్కు వీళ్ళకిలేదు" అంది. ఆమె మాటలు వింటూ వెకిలిగా నవ్వాడు ఎస్సై.

"హలో! ఆ అమ్మాయి సెంట్రల్ మినిస్టర్ కూతురు. ఆ మాట మేం నమ్మాలా! ఈ మధ్య దొంగలు కూడా దొరికితే ఎమ్మెల్యే బామ్మర్దినని ఎమ్.పి. ఉంచుకున్నదాని తమ్ముడ్నని చెప్పి తప్పించుకుంటున్నారు. ఇక్కడ సమస్య ఆ అమ్మాయి కానేకాదు.

వీడికి ఎంత ధైర్యం ఉంటే హోంమినిస్టర్ కొడుకునే చావగొడతాడు? వీడు సామాన్యుడు కాదు. ఖచ్చితంగా టెర్రరిస్ట్ అయివుంటాడు" అన్నాడు లాఠీ ఊపుతూ ఆ ఎస్.ఐ.

ఆ మాటలకి ఆవేశం కట్టలు తెంచుకుని "షటప్" అంది ఝాన్సీరాణి.

"ఏమనుకుంటున్నార్రా మీరు? ఎక్కడో ఆంధ్రా నుంచి వచ్చారు వీళ్ళేం చేస్తారని పొగరా? ఇక్కడ సమస్య అమ్మాయి కదా! ప్రాణాలకు తెగించి ఆ పిల్లను కాపాడ్డం నేరమా! మీ చట్టప్రకారం ద్రోహమా? పైగా టెర్రరిస్టని ముద్రవేస్తారా!" అరిచింది.

"హలో! నీ లెక్చర్లు కాలేజీలో పెట్టుకోవమ్మా. ఇక్కడ కాదు. చట్టం గురించి నువ్వు క్లాసు తీసుకోనక్కర్లేదు. తప్పుచేస్తే శిక్షించడానికి కోర్టులున్నాయి. చావగొట్టే హక్కు పబ్లిక్‌కి లేదు".

"అంటే... నీ పెళ్ళాన్నో, కూతుర్నో, చెల్లెలినో ఇలాగే ఎవడన్నా ఎత్తుకు పోతుంటే కోర్టులో తేల్చుకుందామని చూస్తూంటావా? సిగ్గులేని వెధవా! ఎవడ్రా నీకు పోలీసు ఉద్యోగం ఇచ్చింది.

మీ హోంమినిస్టర్ మీద అంత భక్తి ఉంటే వెళ్ళి పాదపూజచేసి నీళ్ళు తాగండిరా, అంతేగాని న్యాయాన్ని తారుమారు చేయాలని చూస్తే సహించం" అంటూ ఘాటుగా హెచ్చరించిందామె.

ఆ మాటతో పాపం అమాంతం రోషం ముంచుకొచ్చిందా ఎస్సైకి. "ఏమిటే ఎక్కువగా మాట్లాడుతున్నావ్? నీ పొగరు దించేస్తా చూడు" అంటూ లాఠీ దురుసుగా పైకెత్తాడు. అది చూడగానే "ఏయ్..." అంటూ ఒక్కసారిగా అరిచారు అమ్మాయిలంతా.

లాఠీ దెబ్బపడుంటే ఝాన్సీరాణి నోటి పళ్ళు కనీసం పదయినా గవ్వల్లా రాలిపోయి వుండేవి. కాని పక్కనేవున్న కృతయుగ్ లాఠీని మధ్యలోనే అడ్డుకుని ఎస్సైముఖంలో ముఖంపెట్టి ఆగ్రహంగా చూశాడు.

"ఏయ్ ఎస్సై. ఒంటిమీద ఖాకీడ్రెస్సు ఉందని మిడిసిపడకు. పన్నెండు మందిని మట్టి కరిపించిన చేతులివి.

మిమ్మల్నందర్నీ కొట్టడం ఓ లెక్క కాదు. ఆడవాళ్ళ మీద జులుం సాగిస్తే ఫలితం దారుణంగా వుంటుంది" అంటూ లాఠీని విరిచి చేతిలో పెట్టాడు.

అది చూడగానే ఎస్సై వెన్నులో జలదరింపు ఏర్పడింది. బదులుచెప్పలేక వెర్రిచూపులు చూశాడు.

ఈ లోపల పరిస్థితి ఉద్రిక్తంగా మారుతోందని రెండో ఎస్సై గ్రహించాడు.

కృతయుగ్‌ని అరెస్ట్ చేయబూనటం, తమ లెక్చరర్ మీదే ఎస్సై లాఠీ ఎత్తడం కాలేజి యువతులు సహించలేకపోతున్నారు. కోపంతో ఉన్నారు. పిడికిళ్ళు బిగించి కదనరంగంలోకి దూకటానికి సిద్ధంగా ఉన్నారు.

ముందు కృతయుగ్‌ని వీళ్ళకి దూరంచేస్తేగాని అతడ్ని కుళ్ళబొడవటం సాధ్యం కాదు. ప్రస్తుత పరిస్థితిలో లాఠీ ఛార్జింగ్‌కి ఆర్డరిస్తే లాఠీలు ఊడ లాక్కుని పోలీసుల తాట తీసేలా ఉన్నారు. తొందరపడితే ఇష్యూ పెద్దదవుతోంది. అవతల మీడియావాళ్ళంతా గమనిస్తూనే ఉన్నారు. అందుకే యుక్తిగా–

"ఓ.కె... సారీ... జరిగిందానికి సారీ చెప్తున్నాను" అన్నాడు రాజీధోరణిలో.

"మేం ఇతన్ని అరెస్ట్ చేయటంలేదు. అందుచేత అంతా శాంతించాలి. అయితే జరిగిందంతా రిపోర్ట్ రాసివ్వాల్సిన బాధ్యత ఇతనికుందిగాబట్టి ఫార్మాలిటీగా సగౌరవంగా ఇతన్ని మా వెంట పోలీస్‌స్టేషనుకు తీసుకెళ్ళడానికి మీరు సహకరించాలి. దయచేసి అభ్యంతరం చెప్పకండి" అన్నాడు.

"చెప్పం. కాని ఒంటరిగా మీ వెంట పంపించటానికి ఒప్పుకోను. నేను వెంట వస్తాను" అంది ఝాన్సీరాణి.

కృతయుగ్‌తో బాటు స్నిగ్ధ కూడా వ్యాన్ ఎక్కింది. వాళ్ళ వెనకే ఝాన్సీరాణి ఎక్కి కూచుంది. ముగ్ధ నిత్యలు కూడా రాబోతుంటే వారించాడు కృతయుగ్.

"నిత్యా, నా ట్యాక్సీని తీసుకురా. ముగ్ధ నీవెంట ఫియట్‌లో వస్తుంది" అన్నాడు.

ఆ విధంగా వాహనాలు అక్కడ్నుంచి కదిలాయి. ఈ ఇష్యూకి తదుపరి వేదిక పోలీస్‌స్టేషనయింది.

* * * * *

దంతెవారా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కి చేరుకోగానే ప్లేటు ఫిరాయించారు పోలీసులు.

కృతయుగ్‌ని సెల్‌లోకి తోసి లాక్ చేశారు. వెంట వచ్చిన స్నిగ్ధ, ఝాన్సీరాణిలను బయటకు నెట్టేశారు. బస్ దిగిన అమ్మాయిలుగాని మీడియా ప్రతినిధులు గానీ ఎవరూ స్టేషన్‌లో అడుగుపెట్టకుండా అందర్నీ బయటే ఆపేశారు. ఈ లోపల బలమైన అరడజనుమంది పోలీసులు కృతయుగ్‌ని విరగదీయటం కోసం లాఠీలు సిద్ధంచేస్తున్నారు. బయట పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నా పోలీసులు పట్టించుకోలేదు. కృతయుగ్ కీళ్ళు విరిచేయాలని పట్టుదలగా ఉన్నారు.

ఎస్సై కృతయుగ్ నుంచిన సెల్ తాళం తెరుస్తుండగా టేబిల్ మీది లాండ్‌లైన్ మోగింది. విసుక్కుంటూనే వెళ్ళి రిసీవర్ ఎత్తిన ఎస్సైకి ఒక్కసారిగా షాక్.

అవతల లైన్లో ఉంది సాక్షాత్తూ ఛత్తీస్‌ఘర్ స్టేట్ సి.ఎమ్.ఆయన ఏ ఆర్డరు వేశారో ఏమిటోగాని రిసీవర్ క్రెడిల్ చేస్తూనే, "ఆగండి మీరంతా ఆగిపోండి" అనరిచాడు. అంతేకాదు.

లాఠీలు ఊపుకుంటూ సెల్‌లోకిపోతున్న వాళ్ళకి అడ్డంబడి వెనక్కి లాక్కొచ్చాడు. హడావుడి వింటూనే "ఏమైంది?" అంటూ అవతలి గదిలోంచి బయటికొచ్చాడు రెండో ఎస్సై.

"సి.ఎమ్ ఇక్కడికి రాబోతున్నారు. ఆ కుర్రాడి ఒంటి మీద చిన్నదెబ్బ కనబడినా అందర్నీ డిస్మిస్‌చేసి ఇళ్ళకు పంపించేస్తాను. వాళ్ళకి మర్యాదలకి లోటురాకుండా కూర్చోబెట్టండి అని ఆర్డర్".

కంగారుగా అసలు విషయం చెప్పాడు మొదటి ఎస్సై. అంతేకాదు.

సగౌరవంగా సెల్‌లోంచి కృతయుగ్‌ని తీసుకొచ్చి కుర్చీలో కూర్చోబెట్టాడు.

"ఏమిటి సార్ ఇది. మీరు సి.ఎమ్.కి కావలసినవారని ముందే ఒక్కమాట చెప్పొచ్చు గదా" అని కూడా బాధపడ్డాడు. కృతయుగ్ పెదవి విప్పలేదు. ఈ మార్పుకి కారణం మాత్రం ఊహించగలిగాడు. పోలీసులు బయటవున్న స్నిగ్ధ, నిత్య, ఝాన్సీరాణిలను కూడా లోపలికి తీసుకొచ్చి కుర్చీలు వేశారు.

క్షణాలు భారంగా దొర్లిపోయాయి.

సాయంకాలం అయిదుగంటలకి ముందుగా చిందులు తొక్కుతూ స్టేషన్‌కొచ్చాడు హోంమినిస్టర్. అప్పటికే అతను ఆస్పత్రికెళ్ళి అందర్నీ చూసి వస్తున్నాడు. కొడుకు చింటూభాయ్ తలమీద మూడు కుట్లుపడ్డాయి. ఇంకా స్పృహరాలేదు వాడికి.

ఆ కోపంలో చాలా దురుసుగా స్టేషన్లో అడుగుపెట్టాడు. వస్తూనే– "ఎక్కడ్రావాడు? నా బిడ్డ తల పగల గొట్టినవాడి ప్రాణం తీస్తాను. వాడిని బతకనివ్వను" అంటూ చిందులేశాడు.

"మీరు శాంతించాలి సార్. సి.ఎమ్.గారి ఆర్డరు" అంటూ కృతయుగ్‌ను చూపించి సి.ఎమ్. ఆర్డర్ విన్పించాడు ఎస్సై. కోపంతో మండిపడుతూ వెంటనే సి.ఎమ్‌కి ఫోన్‌చేశాడు హోంమినిస్టర్. అటునుంచి వచ్చిన సమాధానం విని షాక్‌తో కొయ్యబారిపోయాడు.

"ఈ మధ్య నీ మీద చాలా ఆరోపణలున్నా పట్టించుకోలేదు. ఈ రోజు నువ్వు నీ కొడుకుమూలంగా పార్టీపరువు, ప్రభుత్వంపరువు బజారునపడ్డాయి. టీవీల్లో స్క్రోలింగ్ వార్తలు చూడలేదా?

కేంద్రమంత్రి శివప్రసాద్ గారమ్మాయినే మీవాడు కిడ్నాప్ చేయటానికి తెగబడ్డాక ఇక నీకు పదవి అవసరమా? నిన్ను హోంశాఖ నుంచి తప్పిస్తున్నాను. నువ్వే రాజీనామా చేస్తే గౌరవంగా ఉంటుంది.

పదవికన్నా ముందు కొడుకునెలా పెంచాలో నేర్చుకో" అదీ సి.ఎమ్. మాటల సారాంశం. ఎంత కోపంగా వచ్చాడో అంత కోపంగానూ కృతయుగ్‌ను చూస్తూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు హోం మినిస్టర్.

కనుచీకటిపడుతుండగా స్వయంగా సి.ఎమ్. స్టేషన్ కొచ్చి కృతయుగ్‌ను అభినందించాడు. ఆయన వెంట కేంద్రమంత్రి శివప్రసాద్ ఉన్నారు.

నిత్య ఫోన్‌లో మాట్లాడగానే వెంటనే దొరికిన ఫ్లైట్ పట్టుకుని ఆదరాబాదరా హైదరాబాద్ వచ్చి అక్కడ్నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో దంతెవారా వచ్చాడాయన. మొత్తానికి ఎన్నో గొడవలకి దారి తీస్తుందనుకున్న సంఘటన ప్రశాంతంగానే ముగిసింది.

నిత్య భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎలాంటి కేసు ఎవరిమీదా పోలీస్‌స్టేషన్లో ఫైల్ చేయలేదు.

కూతుళ్ళిద్దర్నీ ప్రేమగా అక్కున చేర్చుకున్నాడు శివప్రసాద్. కృతయుగ్‌ని అభినందించాడు.

"నువ్వు నచ్చావ్. నీ సాహసం నచ్చింది. నా పెద్ద కూతురు మనసు దోచుకున్నావ్.

నా చిన్నకూతుర్ని కాపాడావ్. ఇంతకుమించి నీ వివరాలు నాకు అక్కర్లేదు. మీ ఇద్దరూ వచ్చి ఎప్పుడు అడిగితే అప్పుడు వైభవంగా మీ పెళ్ళి జరిపించేస్తాను. మీరుకూడా నాతో వచ్చేస్తే సంతోషిస్తాను" అన్నాడు.

"లేదు డాడీ. కొన్ని పనులున్నాయి. అవి చూసుకుని ఇంటికొస్తాను. వచ్చేప్పుడు కృతయుగ్‌ని తీసుకొస్తాను" అంది స్నిగ్ధ.

ఆ విధంగా టూర్ మధ్యలోనే ఆపించి నిత్యను తన వెంట హైదరాబాద్ తీసుకెళ్ళిపోయాడు శివప్రసాద్. వెళ్ళేముందు ఆయనిచ్చిన సలహామేరకు కృతయుగ్ స్నిగ్ధలు హోటల్‌సూట్ ఖాళీ చేసేవరకు ఆరుగురు పోలీసుల్ని అక్కడ సెక్యూరిటీగా ఉండే ఏర్పాటుచేసి సి.ఎమ్. కూడా వెళ్ళిపోయాడు.

జరిగిన చేదు అనుభవంతో అంతటితో ఛత్తీస్‌ఘర్ టూర్ ఆపేసి–కాలేజి టూర్ బస్సు అమ్మాయిల్ని తీసుకుని రాత్రికిరాత్రి ఒరిస్సా దిశగా దంతెవారా వదిలి పరుగుతీసింది.

* * * * *

హోటల్‌కి వచ్చిన కాస్సేపటికే ముగ్ధకూడా కృతయుగ్, స్నిగ్ధలకు గుడ్‌బై చెప్పి తన రెడ్ ఫియట్‌లో హైదరాబాద్‌కి బయలుదేరి వెళ్ళిపోయింది.

ఇక మిగిలింది కృతయుగ్ స్నిగ్ధలు.

రాత్రికి హోటల్ సూట్‌లోనే గడిపి ఉదయం వెళ్ళి పోవాలనుకున్నారు కృతయుగ్ స్నిగ్ధలు. స్నానాదులు ముగించుకుని భోంచేసి రిలాక్స్‌గా కూచున్న సమయానికి రాత్రి తొమ్మిది గంటలు సమీపించింది.

"గుర్తొచ్చిందా? రాగిరేకు ఎక్కడ చూశావ్?" అంటూ సడెన్‌గా గుర్తుచేసింది స్నిగ్ధ.

"ఓ మైగాడ్!" అంటూ తలపట్టుకున్నాడు కృతయుగ్. "నిద్రలో కూడా దాని గురించే కలవరిస్తావా? గుర్తురాగానే నేనే చెప్తాను గదా!

ఇంత రిస్కులోంచి బయటపడ్డాం. కాస్సేపు ప్రశాంతంగా ఉండొచ్చుగదా!" అన్నాడు కృతయుగ్.

"ఇప్పుడు రిలాక్స్‌గానే ఉన్నాంగదా! కార్యసాధకులు ఎన్ని అవాంతరాలు ఎదురైనా లక్ష్యాన్ని వదలకూడదని మా తాతయ్య అంటుండేవారు తెలుసా?"

"ఏ పనైనా ఆ టైమొస్తే అవుతుంది. ఉరుకులెత్తినా ప్రయోజనంలేదని మా పక్కింటాయన చెప్పేవాడు".

"వాడెవడో సన్యాసి అయ్యుంటాడు. వెంటనే గుర్తు తెచ్చుకుని చెప్తావా లేదా?"

కృతయుగ్ ఏదో చెప్పబోయాడు.

సరిగ్గా అప్పుడే అతడి సెల్ మోగింది.

అది మున్నలూరు నుంచి వచ్చిన కాల్.

అతడి ఫ్రెండ్ సిద్ధేశ్వర్ ఫోన్ చేశాడు.

విషయం వింటూనే "ఓ షిట్... ఎప్పుడు జరిగింది?" అనరిచాడు నిటారుగా కూచుంటూ. స్నిగ్ధ ఏం జరిగిందో తెలీక అయోమయంగా చూసింది.

మూడునిముషాలు సిద్ధేశ్వర్‌తో మాట్లాడి–

"అలా గేరా... ప్రస్తుతం భద్రాచలానికి దూరంగా ఉన్నాను. నో ప్రాబ్లమ్. ఉదయానికంతా వచ్చేస్తాలే. అక్కడంతా జాగ్రత్తగా చూస్తూండు" అంటూ లైన్ కట్ చేశాడు కృతయుగ్.

"ఏమైంది కృతా... అంతా క్షేమమే గదా" ఆత్రంగా అడిగింది స్నిగ్ధ.

"నువ్వు కంగారుపడకు. ఎవరికీ ఏం కాలేదు. కాని దారుణం జరిగి పోయింది. మున్నలూరులోని మా పూర్వీకుల శిథిల మండువా లోగిలి కాలిపోయింది" అన్నాడు బాధగా.

"అయ్యయ్యో... ఎలా జరిగింది?"

"అదే ఎవరికీ అర్థంగావటంలేదట. వెంటనే రమ్మని నా ఫ్రెండ్ సిద్ధేశ్వర్ ఫోన్ చేశాడు. నీకు తెలీదు స్నిగ్ధా! నా చిన్నతనం ఆ ఇంట్లోనే గడిచింది.

మా పూర్వీకులు ఓ పదితరాలు అక్కడే గడిపారంటే నమ్ముతావా? కాని అదే నిజం. మూడుసార్లు పునర్నిర్మించిన పెద్ద మండువా లోగిలి.

ఆ ఇంటిని ఊడదీస్తే అందులోని టేకు కలప లక్షల విలువ చేస్తుంది. ఎంతోమంది అడిగినా బామ్మ ఒప్పుకోలేదు. మా వంశం గుర్తుగా అదలాగే ఉండాలని కోరుకుంది. కాలం కలిసొస్తే దాన్ని పునర్నిర్మించి అక్కడే నివసించాలని ఆమె కోరిక. బామ్మకీ సంగతి తెలిస్తే చాలా బాధపడుతుంది."

"ఇంకా తెలీదా?"

"తెలీదు. తెలిస్తే ఈ పాటికే నాకు ఫోన్ చేసేది"

"ఇప్పుడేంచేద్దాం?" ఏదో చెప్పబోతూ మాటలు మింగేసి ఆశ్చర్యంగా స్నిగ్ధ వంక చూశాడు కృతయుగ్.

"నీ ప్రశ్నకు సమాధానం దొరికింది. గుర్తొచ్చింది" అన్నాడు సడెన్‌గా.

"నిజంగానా... రాగిరేకు ఎక్కడ చూశావ్?" ఉద్విగ్న భరితంగా అడిగింది స్నిగ్ధ.

"అక్కడే... మా శిథిలమండువా లోగిట్లో. ఆ ఇంటికి భూమిలో నేలమాళిగ ఒకటుంది. మా పూర్వీకుల ఆయుధాలు, పనిముట్లు మొదలైనవి ఉన్న బోషాణం ఒకటి అందులో ఉంది. నా పదోఏట అనుకుంటాను మా నాన్నగారివెంట నేలమాళిగలోకి వెళ్ళినప్పుడు బోషాణంలోని పని ముట్లతోపాటు ఆ రాగిగొట్టాన్ని చూశాను. దాని మూత సీల్ వేయబడివుంది.

ఆడుకోడానికి దాన్ని నాకిమ్మని అడిగితే మా నాన్నగారు కోప్పడ్డారు. దాన్ని యథాప్రకారం లోన ఉంచి బోషాణం మూసి తాళంవేశారు.

చాలాకాలం కిందట సంగతి గాబట్టి వెంటనే గుర్తు రాలేదు. నీకు అవసరమైన రాగిగొట్టం అదే కావచ్చు. అయితే గ్యారంటీ చెప్పలేను. మంటలు నేలమాళిగలోకి వ్యాపించకుండా వుంటే అది తప్పకుండా దొరుకుతుంది. నాకు, బామ్మకు తప్ప ఆ నేలమాళిగ రహస్యం ఎవరికీ తెలీదు" అంటూ వివరిస్తూంటే కృతయుగ్ వంక ఆశ్చర్యంగా చూసింది స్నిగ్ధ.

"నీ మాటలు నాలో నమ్మకాన్ని పెంచుతున్నాయి కృతా. ఆ రాగిగొట్టం భద్రంగా లభిస్తుందన్న నమ్మకం ఏర్పడుతోంది. లే. మనం వెంటనే బయల్దేరాలి" అంటూ లేచింది. "ఇప్పుడా!" విసుగ్గా చూశాడు కృతయుగ్.

"అవును. ఇప్పుడే. మనం సూట్ ఖాళీ చేసి వెళ్ళిపోతున్నాం. నీకు విశ్రాంతి కావాలంటే ట్యాక్సీ వెనక సీట్లో హాయిగా నిద్రపో. ఖమ్మం దాటగానే లేపుతాను"

అంటూ హడావుడిగా ఎయిర్‌బ్యాగ్‌లు సర్దేయటం ఆరంభించింది, ఇంకేం చెప్పినా ఆమె వినదని తెలిసి ఇష్టం లేకున్నా తనూ రెడీ అయ్యాడు కృతయుగ్.

లగేజి ఎయిర్‌బ్యాగ్స్‌లో సర్దుకుని సూట్ ఖాళీచేసి ట్యాక్సీలో బయలుదేరారు. తనే స్టీరింగ్ తీసుకున్నాడు కృతయుగ్. అప్పటికి రాత్రి పదిగంటలు సమయం.

హోటల్ ముందు కాపలా ఉన్న పోలీసులు వద్దని వారించినా వినకుండా ఎస్కార్ట్‌గా ట్యాక్సీని అనుసరించి జీప్‌లో ఫాలో అయ్యారు. సి.ఎమ్. ఆర్డరు గదా!

స్నిగ్ధ, కృతయుగ్‌లు హోటల్ వదిలి వెళ్ళిపోయిన సరిగ్గా గంటతర్వాత– అంటే రాత్రి సుమారు పదకొండు గంటల ప్రాంతంలో గుర్తుతెలీని గూండాలు పాతికమంది హోటల్‌పైన దాడిచేసి బీభత్సం సృష్టించటం, తమకోసం గాలించి వెళ్ళటం, కృతయుగ్ స్నిగ్ధలకు తెలీదు.

అర్ధరాత్రి సుమారు రెండు గంటల ప్రాంతంలో ట్యాక్సీ ఉమ్మడి చెక్‌పోస్ట్‌లు దాటి క్షేమంగా ఆంధ్రా భూభాగంలోకి దూసుకుపోగానే, ఎస్కార్ట్‌గా వచ్చిన పోలీసులు చెక్‌పోస్ట్ అధికారుల వద్ద సంతకాలు తీసుకుని దంతెవారాకు తిరుగుముఖం పట్టారు.

ట్యాక్సీ దంతెవారా వదిలిన కొద్దిసేపటికే స్నిగ్ధ నిద్రలోకి జారుకుంది. అర్ధరాత్రి చెక్‌పోస్ట్‌లు దాటడం కూడా ఆమెకు తెలీదు.

చెర్లమీదుగా ట్యాక్సీ భద్రాచలం వచ్చేసరికి తెల్లవారుఝాము నాలుగు గంటలైంది. అప్పటికి మెలుకువ వచ్చింది స్నిగ్ధకు. ఇంటికెళ్ళి విషయం చెప్పి బామ్మను వెంట తీసుకెళ్ళాలనుకున్నాడు గాని వెంటనే ఆ ఉద్దేశం విరమించు కున్నాడు కృతయుగ్.

ఆవిడవస్తే తమ పూర్వీకుల తాలూకు ఏ వస్తువూ ఎవరికీ ఇవ్వనివ్వదు. ఇబ్బందులున్నాయి. కాబట్టి ఇంటికెళ్ళకుండానే ట్యాక్సీని భద్రాచలం దాటించాడు.

అక్కడ్నుంచి స్టీరింగ్ తను తీసుకుంది స్నిగ్ధ. కృతయుగ్ వెనకసీట్లో చేరి నిద్రపోయాడు.

మొత్తానికి ట్యాక్సీ ఖమ్మం మీదుగా నందిగామ చేరుకునేసరికి బాగా తెల్లవారిపోయింది. నందిగామ సెంటర్లో కారాపి కృతయుగ్‌ని లేపింది స్నిగ్ధ.

నందిగామ నుండి మున్నలూరు గ్రామం ఇంకా ఇరవై రెండు కిలోమీటర్ల దూరంలో వుంది. ఆకాశం ఉదయం నుంచి మబ్బుపట్టి సూర్యుడు కనిపించటం

లేదు. చలిగాలితిరిగి వర్షంపడే సూచనలు కన్పిస్తున్నాయి. ఇంతాచేసి మున్నలూరు చేరుకున్నా అక్కడ తాము ఫ్రెషప్ అవటానికి వసతిలేదు.

తెలిసినవాళ్ళున్నా వాళ్ళ ఇళ్ళకు స్నిగ్ధను వెంటబెట్టుకుపోలేడు. అంతా చోద్యం చూస్తారు. ఆరాతీసి ప్రశ్నలు సంధిస్తారు.

అందుకే బాగా ఆలోచించి నందిగామలోనే మంచిపేరున్న లాడ్జికి ట్యాక్సీని పోనిచ్చాడు.

రూమ్ తీసుకుని ఫ్రెషప్ అయి స్నానాదికాలు ముగించి తిరిగి రెడీ అయ్యేసరికి సమయం పదిగంటలు దాటింది. అక్కడే కాఫీ, టిఫిన్లు కూడా తీసుకుని రూమ్ తమకిందే ఉంచుకుని బయలుదేరారు.

ఒక పెట్రోల్ బంక్‌లో ఆయిల్ కొట్టించుకుని ట్యాక్సీని మున్నలూరు రూట్‌లోకి మళ్ళించాడు. అదే సమయంలో సన్నటి చిరుజల్లు వారికి స్వాగతం పలికింది.

మండువా లోగిలి! ఇప్పటి తరం వారికి ఈ మాటే కొత్తగా ఉండొచ్చు. ఎక్కడికక్కడ మేడలు మిద్దెలతో సిటీలను కాంక్రీట్ జరిగేలాగా మార్చేస్తున్న ఈ కాలంలో పాతకాలం ఇళ్ళ గురించి వాటి పద్ధతుల గురించి తెలీదు చాలామందికి.

ఇప్పటికీ పూర్వం కట్టిన మండువా లోగిళ్ళు దేశంలో అక్కడక్కడా వున్నా, అడపాతడపా సినిమాల్లో చూడ్డం తప్ప డైరెక్ట్‌గా అలాంటి ఇళ్ళతో అనుబంధం ఉన్నవాళ్ళు చాలా తక్కువ. లోగిలి అంటే ఇల్లు.

మండపం అంటూ నలుచదరపు కట్టడం. నలుచదరంగా నాలుగుఇళ్ళను ఒకే ఇంటిగా చేర్చి కట్టబడే నిర్మాణంగాబట్టి దీన్ని మండువాలోగిలి అని పిలిచేవారు.

ఇలాంటివి అనేక గదులు కలిగినవి పెద్ద ఇళ్ళయి ఉంటాయి. దీనికి ఇంటిపైన నాలుగుపక్కలా నాలుగు వెన్నుదూలాలు చదరంగా అమరివుంటాయి.

వాటినుంచి లోపల బయటకు వాలుదిగి పైకప్పు పెంకునేత కలిగి వుంటుంది. వాస్తు ప్రకారం గుమ్మానికి గుమ్మం, కిటికీకి కిటికీ ఇవ్వబడి ధారాళంగా గాలి వెలుతురు లోపలికొస్తాయి. నాలుగు దిక్కులకు నాలుగు ప్రధాన ద్వారాలుంటాయి.

లోపల నాలుగు చూరులు కలవగా ఆరు లేదా ఎనిమిది అడుగుల చదరంగా ఆకాశం కనబడేలా ఖాళీ చోటు వస్తుంది. దీనికి తిన్నగా కింద నలుచదరంగా తొట్టి లాంటి అమరిక ఉంటుంది.

వర్షం నీరు ఈ తొట్టిలోకి జారి ఒక తూముగుండా బయట ఈశాన్యంలోని తోటకు ప్రవహిస్తాయి.

ఎండ వెన్నెలకూడా ఇంటి లోపలికి పడటం అదో అద్భుత అనుభూతి. ఇక ఇంటిని చుట్టి వసారాలు, కొయ్య స్తంభాలతో అద్భుతంగా ఉంటుందా నిర్మాణం.

బయట అరుగులు చాలా ఎత్తుగా ఉంటాయి.

ఇంటిచుట్టూ విశాలమైన ఆవరణ, ఎత్తయిన ప్రహరీ గోడ ఉండాల్సిందే. పూర్వం ఉమ్మడి కుటుంబాల్లో జనం ఎక్కువగాబట్టి అంతా ఒకే ఇంట నివసించడానికి అలాంటి ఇళ్ళ నిర్మాణాలు అవసరమయ్యాయి.

అంతేకాదు, అలాంటి ఇంట్లో నివసించే వారికి ఊళ్ళో ఒక స్టేటస్, పరపతి, గౌరవం ఉండేవి. అలాంటి మండువా లోగిళ్ళు ఒకప్పుడు మున్నలూరులో కూడా చాలా ఉండేవిగాని కాలక్రమేణా అవన్నీ మారిపోయాయి. అసలు ఒకప్పుడు ఊరు పశ్చిమం లోతట్టు ప్రాంతంలో ఉండేదట.

అప్పట్లో తరచూ వరదముంపుల కారణంగా అటు ఖాళీచేసి ఇటు మెరక ప్రాంతంలో ఊరు విస్తరించిందట. ఇప్పుడు వరదల సమస్య లేదు గాబట్టి గ్రామం ఇప్పుడిప్పుడే అటువైపుకీ విస్తరిస్తోంది.

సరిగ్గా ఊరు చివర రోడ్డునానుకొని పల్లపు ప్రాంతంలో ఉంది కృతయుగ్ పూర్వీకుల మండువా లోగిలి. లోగిలి చాలావరకు కూలిపోగా నిన్న సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో సగంపైగా కాలి బూడిదైపోయింది కలప. కూలిన గోడలు, సగానికి కాలిపోయిన టేకు దుంగలతో బీభత్సంగా ఉందా ప్రాంతం.

తన ట్యాక్సీకి జేరబడి బాధగా ఆ ఇంటివంకే చూస్తున్నాడు కృతయుగ్. సకాలంలో గ్రామస్తులు మంటలు ఆర్పేశారుగాని లేకపోతే మిగిలిన కలప కూడా తగలబడివుండేది.

అంతక్రితమే అక్కడికి చేరుకున్నారు కృతయుగ్, స్నిగ్ధలు. నందిగామలో బయలుదేరినప్పట్నుంచి ఆకాశం నుంచి తడిపొడి చినుకులు రాలుతూనేవున్నాయి. ఇప్పుడూ అలాగే ఉంది వాతావరణం. ఆగి ఆగి ఈదురుగాలి వీస్తోంది. "సారీ కృతయుగ్, చాలా నష్టం వాటిల్లినట్లుంది" అంది నొచ్చుకుంటూ స్నిగ్ధ.

"అవును. మండువా లోగిలి పునర్నిర్మించేటప్పుడు ఇదే కలపను వాడొచ్చని ఎంతమంది అడిగినా కలపగాని, స్థలంగాని అమ్మలేదు బామ్మ. ఇప్పుడీ విషయం

తెలిస్తే చాలా బాధపడుతుంది" అంటూ ముందుకు కదిలాడు. కృతయుగ్ రాకను ఎవరూ గమనించకపోవడానికి కారణం ఊరుచివర ప్రాంతంగావటం.

సమీపంలో ఎవరూ లేరు.

ఎవరో ఒకరు వచ్చేలోగ లోపలకు వెళ్ళి నేలమాళిగ పరిస్థితి ఏంటో తెలుసుకోవాలి. మంటలు లోనకు వ్యాపించివుంటే మాత్రం అక్కడేమీ దొరకదు.

"స్నిగ్ధా! నువ్విక్కడే ఉండు. నేను వెళ్ళి చూసొస్తాను" అంటూ బయలు దేరాడు. "అదేమిటి? నేను రాకూడదా?" వెంటనే అడిగింది. "రాకూడదని కాదు, పరిస్థితి చూస్తున్నావ్‌గా. ఇక్కడంతా బొగ్గుతో బురదగా ఉంది. బట్టలు పాడవుతాయి. అందుకే వద్దంటున్నాను"

"అలాగనుకుంటే నీ బట్టలూ పాడవుతాయి గదా. ఫరవాలేదు నేనూ వస్తున్నా" అంటూ వెంబడించింది స్నిగ్ధ. కూలిన కాంపౌండ్ దాటి శిథిలగృహంలో అడుగుపెట్టారు. ఒకపక్క కూలి సగం కాలిపోయిన కలప, మరోపక్క కూలడానికి సిద్ధంగా ఉన్న మొండిగోడలు, నేలంతా నల్లనిబొగ్గు కలిసి బురద తారులా దర్శనమిస్తోంది. బొగ్గు వాసన ఘాటుగా ఉంది.

నేలమాళిగలోకి వెళ్ళే దారి ఎక్కడుందో ఓసారి గుర్తుతెచ్చుకున్నాడు కృతయుగ్.

బాల్యం కళ్ళముందు కదిలింది. అప్పట్లో తన తండ్రిగారి గదిలో నైరుతిమూల నేలమీద మూడడుగుల చతురస్రంలో ఒకే పీటలాంటి చెక్కబల్ల ఉండి, దానిమీద బరువైన చెక్కబీరువా ఉండేది.

అడుగున చెక్కబల్ల కింద చాలా మందంగా ఉండే ఉక్కుపలక ఒకటి మెట్లమార్గాన్ని మూసివుంచేది. కొత్తవాళ్ళకి అక్కడ గల రహస్యమార్గం గురించి తెలిసే అవకాశమే లేదు. అయితే ఇల్లు పాడుపడ్డాక ఇంట్లో వస్తువులన్నీ భద్రాచలంలోని తమ కొత్త ఇంటికి పట్టుకుపోయారు. నేలమాళిగ గురించి ఎవరికీ తెలీదుగాబట్టి దీనిగురించి పట్టించుకోలేదు.

సరిగ్గా ఇప్పుడు కాలిబూడిదైన ప్రాంతంలోనే ఉంది నైఋతి భాగం. కలపను లాగి దారిచేసుకుంటూ అక్కడికి చేరుకున్నాడు కృతయుగ్.

అక్కడ కాలిపోయిన రెండు మొండిగోడలు ఏ క్షణమైనా కూలిపోడానికి సిద్ధంగా ఉన్నాయా అన్పించేలా ఉన్నాయి.

అడ్డంగా ఉన్నవాటిని పక్కకు లాగి దారిచేసుకుంటూ చిక్కటి తారులా ఉన్న నేలమీద అడుగులు జాగ్రత్తగా వేస్తూ ఇద్దరూ ముందుకెళ్ళారు.

సరిగ్గా నైఋతి గదివద్ద ఆగి నేలను పరిశీలించాడు.

నిన్నటి మంటల్లో చెక్కపీట కాలిపోయి ఒంపులు తిరిగి బొగ్గుపీటలా ఉంది. దాన్ని పక్కకు లాగి చూశాడు. నేలమీద తడిసిన నల్లటి బొగ్గు పరచుకుని ఏమీ కనబడలేదు. చేతులతో చెత్తను తొలగించగానే చేతికి తగిలింది ఉక్కు ప్లేటు.

అయితే దాన్ని తెరవటం అంత సులువనిపించలేదు. చాలా సంవత్సరాలుగా మూసివున్నందున బాగా తుప్పుపట్టింది. ఆపైన నిన్నటి అగ్ని ప్రమాదంలో వేడిమికి అతుక్కుపోయింది. ఎంత ప్రయత్నించినా దాన్ని లేపటం సాధ్యంకాలేదు.

స్నిగ్ధ సాయపడినా ఏమాత్రం ప్రయోజనం లేకపోగా ఇద్దరి దుస్తులు, కాళ్ళూ చేతులు నల్లటి బురదతో అసహ్యంగా తయారయ్యాయి.

ఇలా లాభం లేదనుకున్నాడు కృతయుగ్. ఒక బలమైన దుంగను తెచ్చి ఉక్కు పలకను బలంగా మోదటం ఆరంభించాడు. చివరకు లొంగిపోయిందది. ఎగిరి అవతల పడింది.

లోపలికి మెట్లదారి కనిపించింది. మంటలు లోపలికి వ్యాపించలేదుగాని, పైన మంటలకు వేడెక్కిన నేలమాళిగ ఇంకా చల్లారలేదు. ఒళ్ళు మంట పుట్టేంత వేడి ఇంకా లోపల అలాగే ఉంది.

ఒక విధమైన వెగటు వాసన ముక్కు పుటాల్ని అదరగొడుతోంది.

వేడిమిని లెక్కచేయకుండా ముందుగా కృతయుగ్ కిందకు దిగాడు.

అతడ్ని అనుసరించింది స్నిగ్ధ.

సరిగ్గా పంతొమ్మిది మెట్లు ఏటవాలుగా లోపలికి దిగాక అక్కడ ఉంది విశాలమైన గది. అదే నేలమాళిగ, మెట్లపైన ఓపెన్‌గా ఉన్నందున లోపలికి వెలుతురువస్తోంది. పూర్వంఐతే కాగడా చేతపట్టుకుని దిగిరావలసొచ్చేది.

అక్కడ అడుగుపెడుతూనే ఎందుకో కొంచెం భయపడింది స్నిగ్ధ. బిక్కుబిక్కుమంటూ చుట్టూ చూసింది. ఎదురుగా గోడదగ్గర పెద్ద బోషాణం ఉంది. చుట్టూ చిన్నా, పెద్ద కొన్ని అద్భుత శిల్పాలు, వాటి పక్కగా ఏవో పనిముట్లు కన్పించాయి. అదంతా చూస్తూనే అక్కడ కంటికి కనబడని విశేషం ఏదో ఉందనిపించి స్నిగ్ధ తనకు తెలీకుండానే ఒక విధమైన భయోద్వేగానికి గురైంది.

"ఏమిటలా ఉన్నావ్?" అడిగాడు "ఏదో కొత్త లోకానికి వచ్చినట్టుంది" అంది, గాభరాను అణచుకుంటూ.

"అలాగే ఉంటుంది. కమాన్. నేను చెప్పిన బోషాణం అదే" అంటూ అటు కదిలాడు కృతయుగ్.

సరిగ్గా అప్పుడే–పైన ఎక్కడో కిరకిర మంటూ ఒక వికృతశబ్దం విన్పించింది. వింటూనే ఒక్కసారిగా అదిరిపడి కృతయుగ్ భుజం పట్టుకుంది స్నిగ్ధ. ఉలికిపాటుతో ఇద్దరూ మెట్లవైపు చూస్తూండగానే మొండిగోడ ఒకటి విరుచుకుపడి మెట్లదారిని మూసేసింది.

చెవుల్లోని కర్ణభేరిలు పగిలిపోతాయా అన్నంతగా వినవచ్చిన శబ్దాన్ని తట్టుకోలేక భయంతో కృతయుగ్‌ని కావులించుకుని కెవ్వుమని అరిచింది స్నిగ్ధ.

ఎప్పుడైతే మొండిగోడ విరిగి మెట్లదారిని మూసేసిందో మరుక్షణమే నేలమాళిగలో గాఢంధకారం అలముకుంది. ఇటుకలతో కూడిన దిమ్మలు మెట్లమీద వేగంగా దొర్లివస్తున్నాయి.

శబ్దం వింటూనే అంతకన్నా వేగంగా స్పందించాడు కృతయుగ్. స్నిగ్ధతో సహా వాటి దారికి ఎడంగా పక్కకు ఒదిగిపోయాడు.

వేగంగా వచ్చి వారి కాళ్ళ సమీపంలోనే పడ్డాయి కొన్ని ఇటుకలు. ప్రేలుడు శబ్దాల్లా మూడు నిమిషాల వరకు నేలమాళిగ శబ్దాలతో ప్రతిధ్వనిస్తూనే ఉంది.

లోపలికొచ్చిన ధూళి ధూసరికి ఇద్దరూ కాస్సేపు ఉక్కిరి బిక్కిరయ్యారు.

వేగంగా పక్కకు తొలగటంవల్ల పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డారిద్దరూ. నేలమాళిగ గాబట్టి గోడపడిన అదటుకు అంత శబ్దం రావటంలో ఆశ్చర్యం ఏమీలేదు. ఐదు నిమిషాలపాటు ఒకరికౌగిట ఒకరు అక్కడే అలాగే నిలబడి పోయారు. గాఢాంధకారంలో ఎక్కడ ఏముందీ కన్పించటంలేదు.

అసలే అక్కడ చర్మాన్ని చిటపటలాడిస్తున్న వేడి, ఆపైన ఒకరి ఊపిరి ఒకరికి వెచ్చగా కాల్చేస్తోంది. ఒక విధంగా ఇది అదృష్టమనే చెప్పుకోవాలి.

లోపలుండగా గోడ కూలింది. అదే ఉక్కుప్లేటును తొలగించే సమయంలో కూలివుంటే దానికింద జంటగా సమాధి అయిపోయేవాళ్ళు.

"స్నిగ్ధా... ఆర్ యు ఓ.కె.?" అడిగాడు బుజ్జగిస్తూ.

"ఊఁ" అంది.

ఇప్పుడిప్పుడే ఆమెలో కొత్త అనుమానాలు మొదలవుతున్నాయి. ఎందుకిలా జరిగింది? దంతెవారాలో ఉండగా తమమధ్య రాగిగొట్టం ప్రస్తావన వచ్చింది. అది కృతయుగ్‌కి ఎక్కడుందో గుర్తురాకముందే శిథిలమండువా లోగిలి తగలబడింది. ఇప్పుడు తామిద్దరూ నేలమాళిగలో ప్రవేశించగానే గోడ కూలింది.

ఇవన్నీ యాదృచ్ఛికంగా జరుగుతున్నాయా లేక మానవాతీత శక్తులేమన్నా తమని అడ్డుకుంటున్నాయా? అదే నిజమైతే రెండోముక్క రాగి రేకును కలిగివున్న పీటర్ వర్గానికీ ఇలాంటి సమస్యలు ఏర్పడాలి. ఏమో... ఏర్పాడ్డాయేమో. తనతో ఏమీ వాళ్ళు చెప్పలేదు గదా, పరిపరివిధాలా ఆలోచిస్తోంది స్నిగ్ధ.

కృతయుగ్ తన జేబులోంచి సిగరెట్ వెలిగించుకునే గ్యాస్ లైటర్ తీసి వెలిగించాడు. ఆ వెలుగులో మెట్లవెంట లోపలికి పడిన రాళ్ళకుప్పను చూసి ఆశ్చర్యపోయాడు. ఇక్కడ్నుంచి బయటపడాలంటే మెట్లదారి ఒక్కటే శరణ్యం. మరోదారి లేదు.

"స్నిగ్ధా... మనం ఎక్కువసేపు ఇక్కడుంటే ఊపిరాడక చస్తాం. త్వరగా బయటపడాలి. కమాన్" అంటూ లైటు వెలుగులో బోషాణం వద్దకు చేరుకున్నాడు.

బోదురుకప్ప సైజులో ఒక పెద్ద తాళం కప్ప దానికి వేలాడుతోంది. దాని తాళం చెవి ఎక్కడుంటుందో కృతయుగ్‌కి కూడా తెలీదు. అది తుప్పుపట్టి ఉంది. తెరుచుకుంటుందన్న నమ్మకం లేదు.

ముఖ్యంగా గ్యాస్‌లైటర్‌తో పనికాదని అతడికి అర్ధమైంది. అటూ ఇటూ చూశాడు.

మెట్లదారి పక్కన ఏనాటిదో ఒక కాగడా తగిలించి ఉంది. పక్కన చిన్న గూటిలో ఆముదం డబ్బా ఉంది. లోపల ఇంకా కొంత ఆముదం ఉంది. దాన్నిపోసి కాగడా వెలిగించి గ్యాస్‌లైటర్ ఆర్పి జేబులో వేసుకున్నాడు.

కాగడాని స్నిగ్ధ చేతికిచ్చి ఒక పలుగు అందుకుని బలంగా నాలుగు దెబ్బలు వేయగానే తాళం కప్ప ఊడిపోయింది. బోషాణం మూత పైకి లేపాడు.

అరడుగు ఎత్తున్న దృఢమైన కాళ్ళమీద నిలబడుందా బోషాణం. సుమారు అయిదడుగుల పొడవు, మూడు అడుగుల వెడల్పు, నాలుగడుగుల లోతు కలిగిన దళసరి రోజ్‌వుడ్ మందసం అది.

దానికి చుట్టూ ఇత్తడి బందులు బిగించివున్నాయి. ఇక దానిమీద అద్భుతమైన లతలు, పూలతో కూడిన అందమైన చెక్కడం. పనితనం చూస్తుంటే ఆ కాలం వడ్రంగుల నేర్పరితనం ఆహా అనిపించకమానదు.

కాగడా వెలుతురులో బోషాణంలోకి చూసి ఆశ్చర్యచకిత అయింది స్నిగ్ధ. లోన, శిల్పులు ఉపయోగించే ఉలి, సేనం, సుత్తిలాంటి పనిముట్లు చిన్న చిన్న కట్టలుగాకట్టి పేర్చబడివున్నాయి.

ఒక్కో కట్టమీద వాటిని ఉపయోగించిన శిల్పిపేరు, సంవత్సరాలు రాసిన తోలుపట్టీ చుట్టబడివుంది.

"ఆశ్చర్యపోతున్నావా?" అడిగాడు కృతయుగ్.

"ఇవన్నీ వెనుకటి తరాల్లోని మా వంశీకులు ఉపయోగించిన పనిముట్లు. వీటిని ఉపయోగించే మహాశిల్పులయ్యారు వాళ్ళు. మాకు వంశపారంపర్యంగా వచ్చిన వెలకట్టలేని సంపద ఇది. అమరశిల్పి జక్కనాచార్యుడు మా వంశంలో వాడే. హంపీశిల్పాలు చూస్తే చాలు, ఆయన గురించి చెప్పక్కర్లేదు.

ఓరుగంటి చరిత్రలో ముడిపడివున్న మహాశిల్పి రామప్ప మా వంశానికి బంధువే.

మా వంశంలో చిట్టచివరి శిల్పి నా తండ్రిగారే. ఇక్కడున్న శిల్పాలన్నీ మా తాతగారు, మా తండ్రిగారు చెక్కినవి" అంటూ వివరించాడు.

బోషాణం అడుగున ఆ యా కాలాలకు చెందిన బంగారు వెండి రాగినాణాలు అనేకం చెల్లాచెదురుగా పడున్నాయి. వాటిమధ్య ఒక మూలగా కన్పించింది తమకు కావలసిన రాగి గొట్టం.

రంగు తెలీనంతగా వెలిసి చివికిపోయిన ఒక ముఖమల్ గుడ్డలో చుట్టబడివుంది అది. దాన్ని అలాగే తీసి స్నిగ్ధకి అందించాడు.

"ఇది నీకు పనికొచ్చేదో కాదో తెలీదు. అలాగని ఇప్పుడు దీన్ని తెరిచి చూసే సమయం లేదు. ముందు దీన్ని ఇలాగే నీ హ్యాండ్‌బ్యాగ్‌లో వేసుకో. మనం త్వరగా ఇక్కడి నుంచి బయటపడాలి" అంటూ ఆమె చేతిలోంచి దివిటీ అందుకున్నాడు.

స్నిగ్ధ రాగిగొట్టాన్ని హ్యాండ్‌బ్యాగ్‌లో వేసుకుని జిప్ మూసింది. కృతయుగ్ బోషాణం మూత వేసి యథాప్రకారం తాళం కప్ప తగిలించాడు. "ఈ శిల్పాల్ని ఒక్కసారి చూడాలనుంది" అంది స్నిగ్ధ.

"అంత టైమ్ లేదు. ఊపిరాడ్డం కష్టమవుతోంది. గమనించావా, కమాన్" అంటూ మెట్లవెంట బయలుదేరుతూ ఒక పలుగు వెంట తెచ్చాడు.

మెట్లెక్కి పైకి వచ్చారిద్దరూ. మార్గాన్ని మూసివున్న గోడను భుజంతో తొలగించాలని చూశాడుగాని సాధ్యం కాలేదు. పలుగుతో పొడిచి ఒక్కో ఇటుకను

లాగిపారేసి మార్గాన్ని ఏర్పరిచాడు. ముందు తాను బయటకి వెళ్ళి తర్వాత జాగ్రత్తగా స్నిగ్ధను బయటకు లాగాడు. గాల్లోకి రాగానే పునర్జన్మ లభించినట్టయింది ఇద్దరికీ.

"నువ్వు ట్యాక్సీ తీసుకుని నందిగామ వెళ్ళిపో. లాడ్జిలోనే ఉండు. ఇక్కడి పనులు చూసుకుని నేను సాయంత్రం వచ్చేస్తాను" ట్యాక్సీవద్దకు రాగానే చెప్పాడు కృతయుగ్.

నేలమాళిగనుంచి బయటపడగానే దగ్గరలోని చిన్న కాలువలో కాళ్ళుచేతులు శుభ్రం చేసుకున్నారు. దుస్తుల కంటిన మసిని వదిలించారు. అక్కడికీ దుస్తులు, తలమీద పడిన ధూళిధూసరి అలాగే ఉంది. వాటిని కొంత మేర వదిలించుకుని ట్యాక్సీ వద్దకొచ్చారు.

ఈపాటికి సిద్ధేశ్వర్ తనకు ఫోన్ చేయాలి లేదా ఇక్కడికి రావాలి. వాడి జాడలేదు. ముందు స్నిగ్ధను అవతలికి పంపించేస్తే మిగిలిన పనులు చూసు కోవచ్చు. కాని అలా వెళ్ళటం స్నిగ్ధకి ఇష్టంలేదు.

"ఇద్దరం కలిసే వెళ్దాం" అంది.

"నా మాట విను స్నిగ్ధా. నేలమాళిగను అలా వదిలేసి రాలేను. చూశావ్‌గా, బోషాణం అడుగున విలువైన నాణాలున్నాయి, శిల్పాలున్నాయి.

అలా వదిలి వచ్చేస్తే అవి చోరీకి గురవుతాయి. బామ్మ నన్ను క్షమించదు. ముందు మినీలారీ ఒకటి మాట్లాడి వాటన్నిటినీ భద్రాచలంలోని మా ఇంటికి భద్రంగా తరలించాలి. ప్లీజ్. నువ్వు బయల్దేరు" తొందరచేశాడు.

"ఓ.కె. చీకటి పడకముందే వచ్చేయాలి" అంటూ అయిష్టంగానే ట్యాక్సీ తీసుకుని వెళ్ళిపోయింది స్నిగ్ధ.

ట్యాక్సీ కనుమరుగుకాగానే సెల్ అందుకుని ఫ్రెండ్ సిద్ధేశ్వర్‌కి ఫోన్ చేశాడు. ఫోన్ రింగవుతోంది కాని ఎత్తడంలేదు. వాడి ఇంటి వరకూ వెళ్ళొద్దామని ఊరు వైపు కదిలాడు.

పదడుగులు కూడా వేయకముందే దుమ్ముతెరలు రేపుతూ దూసుకొచ్చి అతడి పక్కన ఆగింది సిద్ధేశ్వర్ బైక్. అతడొక్కడే రాలేదు. వెంట తన బామ్మ నారాయణమ్మ కూడా ఉంది.

సిద్ధేశ్వర్ స్వయంగా భద్రాచలం వెళ్ళి జరిగింది చెప్పి ఆవిడ్ని తీసుకొచ్చాడు. తనకన్నా ముందే అక్కడున్న మనవడ్ని చూసి మండిపడిందావిడ.

"ఏరా, నీ ట్యాక్సీ తీసుకుపోతోంది ఎవరు? ఆ అమ్మాయి ఎవరేమిటి? ఆపమని సైగచేసినా ట్యాక్సీ ఆపలేదు" అడిగాడు సిద్ధేశ్వర్.

"నేనే ఇచ్చి పంపించాను. ఫ్రెండ్ నీలాగే" నవ్వాడు కృతయుగ్. ఆ నవ్వు వెనుక అర్థం గ్రహించి ఇంకేం అడగలేదు సిద్ధేశ్వర్. బాధపడుతున్న బామ్మవెంట మొండి గోడలవైపు అడుగులేశారు.

*    *    *    *    *

"ట్యాక్సీ వేగంగా పరుగు తీస్తోంది. స్నిగ్ధ ఆలోచనలు అంతకన్నా వేగంగా పరుగుతీస్తున్నాయి. అవి తన హ్యాండ్‌బ్యాగ్‌లోని రాగి గొట్టాన్ని చుట్టివస్తున్నాయి. ఎప్పుడు నందిగామ చేరుకుందామా, ఎప్పుడు రాగిగొట్టం తెరిచి పరిశీలిద్దామాని వేగిరపడుతోందామె మనసు.

అందుక్కారణం నిధి కానేకాదు. పీటర్ చూపిన రాగిగొట్టంలోని రేకు మొదటిభాగం ఇందులో ఉందా లేదా అనే సందేహమే కారణం. తీసి చూసేవరకు అదేనని గ్యారంటీగా చెప్పలేం.

ఒకవేళ నిజంగానే అదే అయివుండి ఆ యా దేవాలయాలను గుర్తించి, నిధిని పట్టుకోగలిగితే నిజంగానే తనకు మంచిపేరు వస్తుంది.

తాను ఆశించిన పదవీ దక్కుతుంది. అయితే కృతయుగ్‌లాంటి మొండివాడు, సాహసి తనపక్కన ఉండితీరాలి. లేదంటే సాధించటం కష్టం. అడుగడుగునా అవాంతరాలు ఎదురుకావచ్చు. ముఖ్యంగా పీటర్ వర్గం వాళ్ళను నడిపిస్తున్న ముగ్ధ ఉండనే ఉన్నారు.

ముగ్ధ గుర్తుకురాగానే ఎందుకో చిన్న అసూయ రేగింది మనసులో. నిధి విషయంలోనే కాదు, తన ప్రేమవిషయంలో కూడా ఆమె పోటీకి రావటమే అందుక్కారణం కావచ్చు. కాని నిత్యను రక్షించటంలో ఆమె చేసిన సహాయం మాత్రం మరువలేనిది.

ఇంతకీ అసలీ ముగ్ధ ఎవరు? హైదరాబాద్‌లో ఎక్కడ ఉంటోంది? పీటర్ వర్గాన్ని ఫోన్‌లో కంట్రోల్ చేస్తున్న యువతి ముగ్ధ అవునా కాదా?

నంబరున్నా తనింతవరకు ఫోన్‌చేసి నిజం తెలుసుకోవటం వీలు కాలేదు. కారు డ్రైవ్ చేస్తూనే సెల్‌ఫోన్ అందుకుని ఆ నంబరుకు ఫోన్ చేసింది.

ఫోన్ రింగవుతోంది. కాని ఎవరూ లిఫ్ట్ చేయటంలేదు. రాత్రంతా కారు నడిపి హైదరాబాద్ చేరుకున్న ముగ్ధ బెడ్‌రూమ్‌లో గాఢనిద్రలో ఉందన్న సంగతి

స్నిగ్ధకు తెలీదు. మున్నలూరు బయట ఎదురయిన బైక్ ఆమె కళ్ళముందు మెదిలింది. ఎవరో యువకుడు వెనుక ఒక బామ్మ. ట్యాక్సీని గుర్తించి ఆపమన్నట్టు వాళ్ళు సైగలు చేశారు.

మొదట ఆగాలనుకుని కూడా వెంటనే మనసు మార్చుకుని వచ్చేసింది. అసలే తన బామ్మ పెద్ద రాక్షసి అన్నాడు కృతయుగ్. ఆ బైక్‌మీది యువకుడు ఫ్రెండ్ సిద్ధేశ్వర్, ఆవిడ బామ్మ అయ్యుంటే తనని మళ్ళీ వెనక్కి నడిపిస్తారని భయం వేసింది. అందుకే ఆగకుండా వచ్చేసింది, ఏమనుకున్నారో ఏమో.

ఆలోచనల నుంచి బయటపడుతూ ఎగువకు చూసి ఉల్కిపడింది స్నిగ్ధ.

ఎవరో మనిషి రోడ్డు మధ్యలో నడుస్తున్నాడు. వాడు ఎటు తప్పుకుంటాడో కూడా అర్థంగావటంలేదు.

గట్టిగా హారన్ కొట్టింది. అప్పటికీ ట్యాక్సీ ఇంకో అయిదు కిలోమీటర్ల దూరం ఉంది నందిగామకు.

ట్యాక్సీ క్రమంగా ఆ వ్యక్తిని సమీపిస్తోంది. అతడు నడుంకి కావితుండు చుట్టుకున్నాడు.

ఒంటిమీద చొక్కాలేదు. ఆరడుగుల పొడవున బక్కచిక్కిన ముసలాడు. బవిరి గడ్డం, చింపిరి జుట్టు. చేతులు పైకెత్తి ఎగిరెగిరి దూకుతూ రోడ్డుమీద గాలి పటంలా నడుస్తున్నాడు.

గట్టిగా హారన్ కొట్టింది మళ్ళీ.

వాడోసారి వెనక్కి చూసి పిచ్చిగా నవ్వాడు.

ఆ నవ్వు ఎందుకో స్నిగ్ధను ఉలిక్కిపడేలా చేసింది. అతడు రోడ్డు కుడిపక్కకు నడిచాడు. దారి వదులుతున్నాడన్న ఉద్దేశంతో కారు వేగం తగ్గించలేదు స్నిగ్ధ.

తీరా సమీపంలోకి వచ్చేసరికి ఉన్నట్టుండి అతడు తిరిగి రోడ్డు మధ్యకు వచ్చేశాడు. కంగారుపడి సడెన్‌బ్రేక్ వేస్తూ వాడ్ని తప్పించబోయి రోడ్‌సైడ్‌లో ఉన్న చింతమానుకు పట్టించేసింది ట్యాక్సీని.

'ధన్'మని పెద్ద శబ్దం.

తల దిమ్మెక్కి మైండ్ బ్లాంక్ అయిపోయింది కాసేపు. ఆ అదటుకు డోర్ తెరుచుకుని దొర్లి కిందపడింది. ఆ షాక్‌నుంచి రెండు నిముషాలగ్గాని కోలుకోలేక పోయింది. అదృష్టవశాత్తూ దెబ్బలైతే ఏమీ తగల్లేదు గాని కారు ముందు భాగం దెబ్బతింది.

స్నిగ్ధకు వచ్చిన కోపానికి ఆ ముసలోడ్ని చంపిపారేయాలనిపించింది. విచిత్రం – కనుచూపుమేరలో అతని జాడలేదు. ఇంతలోనే ఎటుపోయాడు? ఒకవేళ యాక్సిడెంటు చూసి భయంతో పారిపోయాడనుకున్నా రోడ్డు వదిలి ఎంత దూరం పోగలడు?

ఇది కాకతాళీయమా లేక నిధి తాలూకు శక్తులేవన్నా తనను ఆపే ప్రయత్నమా! ఎటూ అర్థంకావటంలేదు.

కారు స్టార్ట్ చేయాలని చూసింది. అది ఉలుకూపలుకూ లేకుండా మొరాయించింది.

స్నిగ్ధకు ఒకటే నీరసం. కారుకు జేరబడి కృతయుగ్‌కి ఫోన్‌చేసింది. ఫోన్ రింగయిందిగాని ఎత్తలేదు. రెండో సారి ట్రయ్ చేశాక తీశాడు. “పక్కన బామ్మ ఉందని తీయలేదు. ఇప్పుడు దూరంగా వచ్చాలే. ఎక్కడున్నావ్. నందిగామ చేరుకున్నావా?” అడిగాడు.

“లేదు. నందిగామ బయట ఆగిపోయాను...” చెప్పింది స్నిగ్ధ.

“ఆగిపోవడం ఏమిటి?”

“చిన్న ఆక్సిడెంటయ్యింది.”

“ఓ మైగాడ్. నీకేం కాలేదుగదా?”

“ట్యాక్సీకేం కాలేదుగదా అంటావనుకున్నాను.”

“ట్యాక్సీకేం కాలేదు గదా?”

“మూతి పగిలింది”

“డామిట్. ఏం జరిగింది?”

జరిగింది చెప్పింది స్నిగ్ధ. “నేను వెనక్కి మున్నలూరు వచ్చేద్దామను కుంటున్నాను” అని కూడా అంది.

“అంతపని మాత్రం చేయకు. అసలే జరిగిందానికి మంటమీద ఉంది బామ్మ. ఇప్పుడు వచ్చావంటే నీకు, నాకు కూడా వాతలు పెట్టేస్తుంది.

ఓ పనిచెయ్యి. ట్యాక్సీని అక్కడే వదిలి ఏదో ఆటో పట్టుకుని నందిగామ వెళ్ళిపో. నేను నా ఫ్రెండ్‌ని పంపించి ట్యాక్సీ రిపేర్ చేయిస్తాను.”

“రాత్రికి వచ్చేస్తావా?“

“ప్రామిస్‌గా వస్తాను సరేనా?”

“నువ్వొచ్చేవరకు రాగిగొట్టం ఓపెన్ చేయను”

"అదేమిటి?"

"సెంటిమెంట్ బాబూ. జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే ఏవో అనుమానాలు బుర్రను తొలుస్తున్నాయి. నువ్వు త్వరగా రావాలి."

"నువ్వనవసరంగా సెంటిమెంట్లతో ఫీలవుతున్నావ్. అంతా ట్రాష్. ఓ.కె. నమ్మకాన్ని ఎందుక్కాదనాలి. వచ్చేస్తాలే" అంటూ ప్రామిస్ చేశాడు.

ఆ కాషాయతుండు ముసలాయన మళ్ళీ కనిపిస్తాడేమోనని దారిపొడవునా చూస్తూనే ఉంది.

కాని మళ్ళీ కంటికి కనబడలేదు. ఒక ఆటో పట్టుకుని నందిగామవైపు వెళ్ళిపోయింది స్నిగ్ధ.

* * * * *

"ఎవరినయినా ప్రేమిస్తున్నావా?" సడెన్‌గా, సూటిగా అడిగిన తండ్రి ప్రశ్నకు ఉలిక్కిపడింది కాంచన. తత్తరపడింది.

సీరియస్‌గా కూతుర్నే చూస్తున్నాడు ఆత్మకూరు అన్నారావు. అతడి కుడిచేతికి ఆరు, ఎడమచేతికి నాలుగు వేళ్ళే ఉండటం విశేషం.

ఆమె బదులివ్వకుండా మౌనంగా ముఖం దించుకుంది. మౌనం అర్ధాంగీ కారంగా భావించాడాయన.

"ఎవడు వాడు?" తన రెండో ప్రశ్న సంధించాడు.

"లేదు. అలాంటిదేమీలేదు" పొడిగా బదులిచ్చింది. ఆ ప్రశ్న ఆ తండ్రికి సంతృప్తినివ్వలేదు. అది కాంచన ఏ.సి. బెడ్‌రూమ్. తామంతా నిధిగురించి, ఆలయాల గురించి చర్చల్లో ఉండగా మధ్యలోనే కాంచనలేచి వచ్చేయడంతో ఆయనకు అనుమానం బలపడి అందర్నీ పంపించేశాక కూతురి గదిలోకి వచ్చాడు.

"ఈ మధ్య నువ్వు చాలా మారిపోయావని, తనతో సరిగ్గా మాట్లాడ్డంలేదని బావ మహీధర్ బాధపడుతున్నాడు.

ఇప్పుడు దంతెవారా నుంచి తిరిగివచ్చాక ఆ మార్పు నీలో నాకూ తెలుస్తోంది. మేం నిధి గురించి చర్చిస్తుంటే నువ్వు గోళ్ళకు రంగు వేసుకుంటూ కూచున్నావుగాని ఒక్కమాట కూడా మాట్లాడలేదు.

నలుగురిముందూ మాట్లాడటం మంచిది కాదని ఊరుకున్నాను. నిజం చెప్పు ఏం జరిగింది?" చాలా శాంతంగా కూతుర్ని అడిగాడు.

"లేదు డాడీ, ఏం జరగలేదు" అంది.

"ఎవడు వాడు?" తన ప్రశ్న రిపీట్ చేశాడు.

"ఓ.కె. మీరింతగా అడుగుతున్నారు కాబట్టి చెప్తాను. నా మనసులో ఒకడున్నాడు."

"ఆ ఒక్కడూ ఎవడు?"

"చెప్పను"

"నువ్వు చెప్పకపోయినా నాకు తెలుస్తుంది. తప్పు చేస్తున్నావ్. మహీధర్ నీ బావ. చిన్నప్పుడే మీ ఇద్దరికీ పెళ్ళిచేయాలని నిశ్చయించుకున్నాం. నువ్వంటే వాడికి పిచ్చిప్రేమ" అన్నాడు అన్నారావు.

"నామీదా.... ఆస్తిమీదా?"

"షటప్... పిచ్చి ఆలోచనలు చేయకు. ఈ ప్రాజెక్టు పూర్తయి నిధి చేతికి రాగానే మీ పెళ్ళి జరిపించబోతున్నాను. నీ మనసులో వాడ్ని తుడిచెయ్."

"సాధ్యంకాదు డాడీ, నేనెప్పుడూ బావను ప్రేమించలేదు. వాడితో నా పెళ్ళిజరగదు"

"జరక్కపోతే నీ మనసులో వాడు బతకడు. మహీధర్ వాడ్ని చంపేస్తాడు"

"నా గొంతులో ప్రాణం ఉండగా అది జరగదు. అంతవరకూ వస్తే నేను బావను చంపేస్తాను. మీరో విషయం మర్చిపోతున్నారు.

నేను యుద్ధ విద్యలు తెలిసినదాన్ని. నన్ను మించిన వీరుడు నేను ప్రేమించినవాడు. తెలిసీ కరెంట్ తీగను ముట్టుకుంటే తీగ ఏమీకాదు. మనమే చస్తాం. పిచ్చి ఆలోచనలు చేయొద్దని బావతో చెప్పండి."

కూతురు అంతగా తెగేసి చెప్పాక ఇక ఏం మాట్లాడాలో ఆత్మకూరు అన్నారావుకి తోచలేదు. మౌనంగా వచ్చి కాంచన పక్కన కూచున్నాడు.

"ఓ.కె.... నీ మనసు అర్థం చేసుకున్నాను. మహీధర్‌కి నచ్చచెప్పే ప్రయత్నం చేస్తాను. కాని ఇప్పుడు కాదు. ముందు మనం సాధించవలసిన పనులు చాలావున్నాయి. ఈ పరిస్థితిలో ఎవరూ అలిగి కూచోడం సరికాదు. మన బసవడు, మరికొందరు ఆలయాల ఆచూకీ తెలుసుకోడానికి ఉజ్జయిని వెళ్ళారు.

వాళ్ళనుంచి ఫోన్ రాగానే ఏ క్షణాన్నయినా మనం బయలుదేరవలసి వుంటుంది. కాబట్టి ఈ విషయాన్ని ఇంతటితో వదిలేద్దాం. ఎందుకు చెప్తున్నానో అర్థం చేసుకో" అంటూ హెచ్చరించి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడాయన. ఆయన వెళ్ళిపోయిన చాలా సేపటి వరకు ఆలోచిస్తూనేవుంది కాంచన.

*   *   *   *   *

ఆ రాగి గొట్టంవంక మరోసారి విసుగ్గా చూసింది స్నిగ్ధ. అది టేబుల్‌మీద అలానే ఉంది.

స్నిగ్ధకు ఏం చేయాలో తోచటంలేదు. దయ్యం పట్టినట్టు అలా చూస్తూ కూచుంది.

ఎంత ప్రయత్నించినా మూత ఎందుకు ఊడిరాదు? ఆమె ముందున్న పెద్ద ప్రశ్న ఇది. తెరిచి చూడాలని ఆమె ఎంతగా ఆరాటపడుతోందో అంతకు అంత బిగిసిపోయి తెరుచుకోవటంలేదది.

ఏం జరిగివుంటుంది? గతంలో ఓసారి తను తెరిచి చూశానని కృతయుగ్ చెప్పాడు. అతడి చిన్నప్పటి సంగతి. ఇనుమైతే తుప్పుపట్టి బిగిసి పోయిందను కోవచ్చు. కాని రాగికి ఆ ఛాన్స్ లేనేలేదు.

మున్నలూరు నుంచి వస్తూండగా కారు యాక్సిడెంట్ గావటం, లింగాలపాడు నుంచి ఆటోలో తను నందిగామ లాడ్జికి తిరిగిరావటం జరిగేసరికి మధ్యాహ్నం పన్నెండు దాటింది సమయం.

తలారా స్నానంచేసి నైటీ వేసుకుని భోజనం కేరియర్ తెప్పించుకుంది స్నిగ్ధ. రూమ్‌బోయ్ వెళ్ళిపోగానే డోర్ లాక్‌చేసుకుని హ్యాండ్‌బ్యాగ్‌లోంచి రాగిగొట్టం తీసి కూచుని దాన్ని మరోసారి పరిశీలించింది. అదే డిజైను. పీటరు తెచ్చిన రాగిగొట్టంలాంటిదే. మూతకు లక్కతో వేసిన సీలు ఉంది. కాని ఒకసారి తీసినట్టుగా సీలు లేచివుంది.

లక్కసీలు ముద్రమీద సర్పం గుర్తు అస్పష్టంగా కనబడుతోంది.

అంటే కృతయుగ్ చెప్పింది కరెక్టే. అప్పట్లో బాల్య చాపల్యంతో దీన్ని తెరిచి చూసుంటాడు.

గొట్టం మూత తెరవాలని ప్రయత్నించింది. సాధ్యం కాలేదు. సుమారు గంటసేపు దాంతో కుస్తీపట్టినా తెరవటం కుదరలేదు. తన బలం చాలటంలేదా లేక గొట్టాన్ని అంటిపెట్టుకున్న శక్తులేమన్నా తన ప్రయత్నాన్ని అడ్డుకుంటున్నాయా.

తనకు తెలుసు. పీటర్ తెచ్చిందీ ఇలాంటి రాగి గొట్టమే కదా. నాలుగు పక్కలా అరంగుళం పొడవున సన్నటి బద్దల్లాంటి అమరిక ఉంటుంది.

మూతను నొక్కి పక్కకు తిప్పితే ఇక మూత రాదు. అలాగే వెనక్కి తిప్పితే వస్తుంది.

ఇది ఆ కాలం పద్ధతి. ఇప్పటిలా స్క్రూ సిస్టమ్ అప్పుడు లేదు. చాలా సులువుగా ఊడి రావలసిన మూత ఎలా బిగిసిపోయింది?

ఇందులో మర్మం ఏమిటి? ఎంత ఆలోచించినా ఒక నిర్ణయానికి రాలేకపోయింది స్నిగ్ధ. విసుగుపుట్టి దాన్ని అలాగే వదిలేసి భోజనం చేసింది.

రాత్రంతా దంతెవారా నుంచి ఎడతెగని ప్రయాణం. ఉదయం మున్నలూరు వెళ్ళిరావటం, మొత్తానికి బాగా అలసిపోయున్న స్నిగ్ధకు భోంచేయగానే నిద్ర ముంచుకొచ్చింది. బెడ్‌మీదకు వాలగానే గాఢనిద్రలోకి జారుకుంది. అలా ఎంత సమయం గడిచిందో తెలీదు. తిరిగి ఆమెకు మెలుకువ వచ్చేసరికి బయట చీకటిపడుతోంది. గదంతా చీకటి. తలుపుకొడుతున్నారెవరో.

"ఎవరది?" లేచి బెడ్ దిగుతూ అడిగింది.

"నేను, కృతయుగ్." బయటినుంచి కృతయుగ్ గొంతు విని గుర్తుపట్టింది. నైటీ సరిచేసుకుని జుట్టులాగి ముడివేసుకుంటూ వెళ్ళి తలుపు తీసింది.

"చీకటిపడింది. లైటుకూడా వేసుకోకుండా ఏంచేస్తున్నావ్?" లోపలికొచ్చి లైట్లు ఆన్‌చేస్తూ అడిగాడు.

"నిద్రపోతున్నాలే. ఇప్పుడే వస్తాను" అంటూ బాత్‌రూమ్‌కెళ్ళి ముఖం కడుక్కుని ఫ్రెషప్ అయివచ్చింది.

కృతయుగ్ దుస్తులు మాసివున్నాయి. మనిషిబాగా అలసిపోయినట్టు కనిపిస్తున్నాడు. "ఏమైంది ఇంతసేపున్నావు?" పక్కన కూచుంటూ అడిగింది.

"కాలిపోగా మిగిలిన ఇంటి టేకు కలప గుమ్మాలు అవీ కంచికచర్ల వ్యాపారి ఒకడికి అమ్మేశాము.

ఏభైవేలు వచ్చాయి. మినీలారీ ఒకటి మాట్లాడి నేలమాళిగలో బోషాణం, మిగిలిన శిల్పాలు, పనిముట్లు అన్నీ లారీకెక్కించి ఐదుగురు పనివాళ్లని సాయం ఇచ్చి బామ్మను అదే లారీలో భద్రాచలం పంపించి వచ్చేసరికి ఈ టైమైంది" వివరించాడు.

"ఇంటికి రమ్మని బామ్మ గొడవ చేయలేదా?"

"చేసింది. పైగా నువ్వు ట్యాక్సీ తీసుకురావటం వాళ్ళిద్దరూ చూశారు. నీ గురించి గుచ్చిగుచ్చి అడిగింది. ప్రస్తుతం ఏదో చెప్పి మేనేజ్ చేశాలే"

"మరి ట్యాక్సీ?... అక్కడే ఉందా?"

"లేదు. సాయంకాలం బండిని గ్యారేజ్‌కి తెచ్చేశారు. పక్కవీధిలోనే ఉందా గ్యారేజి. వెళ్ళి చూసొస్తున్నాను. రిపేరుకి వారం టైమ్ పడుతుందన్నాడు. ఎంత ఖర్చైనా ఫరవాలేదు. ఎల్లుండి ఉదయానికి డెలివరీ ఇవ్వాలని చెప్పి అడ్వాన్సు అయిదువేలిచ్చి వస్తున్నాను"

"ఖర్చంతా నేనిస్తాలే"

"నేనడిగానా? అవసరమైతే అడిగి తీసుకుంటాలే. రాత్రికి మనం మున్నలూరు వెళ్ళిపోతున్నాం. నేను స్నానం చేసొస్తాను" అంటూ లేచాడు.

"ఆగాగు. ఏమిటి సడెన్‌గా. ఇప్పుడు అక్కడేం పని?" ఆశ్చర్యపడుతూ అడిగింది.

"పనికాదు. అవసరం. మనం ఇక్కడ ఉండటం క్షేమం కాదు" అన్నాడు కృతయుగ్.

"ఎందుచేత?"

"స్నిగ్ధా అర్ధంచేసుకో. పెళ్ళికాని మనిద్దరం ఇలా లాడ్జిలో ఒకే గదిలో ఉండటం మంచిది కాదు. దంతెవారాలో ఉన్నామంటే అది పరాయి రాష్ట్రంగాబట్టి ఇబ్బంది లేకుండా పోయింది. కాని ఇక్కడి పరిస్థితి వేరు. మీ నాన్న మినిస్టర్ అని మర్చిపోకు.

మీడియా దృష్టిలో పడ్డామంటే రకరకాల కథనాలు అల్లి రచ్చరచ్చ చేసి పరువుతీస్తారు. పోలీసు రైడింగ్ జరిగితే ఇది పెద్ద ఇష్యూ అవుతుంది. ఏం లేకపోయినా పెళ్లికాకుండానే మనం తప్పుచేస్తున్నామనుకుంటారు. ఇదంతా అవసరమా?

మీ డాడీ పేరుప్రతిష్ఠలకు భంగం రాకూడదు. అందుకే మనం ఇక్కడ్నుంచి వెళ్ళిపోతున్నాం. నా ఫ్రెండ్ సిద్ధేశ్వర్ వాళ్ళింట్లో మేడమీద రెండు గదులు మనకోసం కేటాయిస్తున్నాడు" వివరించి చెప్పాడు.

అంతా వినికూడా కేర్‌లెస్‌గా చూసింది స్నిగ్ధ. "ఫోన్ చేసి అవేం వద్దని, మనం రావట్లేదని చెప్పు" అంది.

"స్నిగ్ధా..."

"ష్ః... కాబోయే మామగారి పేరుప్రతిష్ఠల గురించి నువ్వేమీ బెంగపడిపోవద్దు. పోలీసులొస్తే నేను చూసుకుంటాను. చాలా వర్కుంది. చోటుమారితే మూడ్ పోతుంది. ముందు నువ్వు స్నానం చేసిరా చెప్తాను. డూ వాటైసే" అంది సీరియస్‌గా.

ఒక్కక్షణం ఆమె ముఖంలోకి చూశాడు. ఏమనుకున్నాడో ఏమో ఇక వాదించకుండా సిద్ధేశ్వర్‌కి ఫోన్ చేసి రావట్లేదని చెప్పి స్నానానికి వెళ్ళిపోయాడు.

బాత్‌రూమ్‌లో హాట్ వాటర్‌తో తలార స్నానం చేసి లుంగీ కట్టుకుని మాసిన దుస్తులు ఉతికి ఆరేసి బయటికొచ్చేసరికింకా టేబుల్‌ముందు అలాగే కూచునుంది స్నిగ్ధ. రాగి గొట్టాన్ని తదేకంగా పరిశీలిస్తోంది.

"ఏమైంది? ఇంకా దాన్ని ఓపెన్‌చేసి చూడలేదా?" చెయిర్ దగ్గరకు లాక్కుని కూచుంటూ అడిగాడు. "మూత ఊడొస్తేగా చూడ్డానికి. నావల్లగావటం లేదు. లక్కసీలుమీద నాగముద్రనుబట్టి దీనికి నాగబంధం వేశారేమోనని అనుమానంగా ఉంది" గొట్టాన్ని అతడికి అందిస్తూ చెప్పింది.

"నాకలాంటి వాటిమీద నమ్మకం లేదు. అలాంటి వేమన్నా ఉంటే నిధి ఉన్నచోట ఉండొచ్చుగాని దీనికంత సీనుండదు. పైగా గతంలో నేను మూత తీసి బిగించిందేగా ఇది" అంటూ గొట్టం మూతను తిప్పాడు.

ఆశ్చర్యం. చాలా సులువుగా మూత అతడి చేతిలోకి ఊడివచ్చింది. అందులో ఏముందన్న సంగతి వదిలి కృతయుగ్‌ని ఉత్కంఠగా చూసింది స్నిగ్ధ.

తను శక్తినంతా ఉపయోగించినా ఊడిరాక విసిగి ఒక స్టేజిలో దాన్ని విసిరి నేలకేసి కొట్టాలన్నంతగా కోపం కూడా వచ్చింది. అలాంటిది ఇంత సులువుగా అతడి చేయి పడగానే ఊడిరావడం ఏమిటి?

"నువ్వేదో దాస్తున్నావ్. నిజం చెప్పు. నాకు ఊడిరాని మూత నీకెలా వచ్చింది?" ఆశ్చర్యాన్ని ఆపుకోలేక అడిగింది.

"ఇందులో దాపరికం ఏంలేదు. నాకు మంత్రాలేమీ రావు" నవ్వుతూ బదులిచ్చాడు.

"సరి. మూత బిగించి ఇవ్వు"

"టెస్టింగా! అందులో ఏముందో చూడవా?"

"చూద్దాం. మూతపెట్టు" మూతబిగించి ఇచ్చాడు.

స్నిగ్ధ దాన్ని తెరవాలని ప్రయత్నించి మరోసారి భంగపడింది. బలమంతా చేతులోకి తెచ్చుకుని తిప్పినా మూత ఊడిరాలేదు. అంటే... సందేహం లేదు.

ఏదో అదృశ్యశక్తి దీన్నిపట్టి బిగించి ఉంచుతోంది. బహుశా ఇది నాగబంధంగాకున్నా నాగశక్తి కావచ్చు. "ఇంకా దాచాలని చూడకు. నాకు రాని మూత నీకెలా వస్తోంది. దీని మర్మం ఏంటో చెప్పాల్సిందే" అంటూ కృతయుగ్‌కి ఇచ్చింది.

మూత తీసి గొట్టాన్ని టేబుల్‌మీద ఉంచి నవ్వాడు.

"నవ్వకు మర్మం ఏమిటి?" అడిగింది.

"నీ అనుమానం నిజమే. కాని మంత్రం, మాయ ఏమీలేదు. నా అరచేతిలో గరుడరేఖ ఉంది" అన్నాడు.

నమ్మలేనట్టు చూసింది స్నిగ్ధ.

"గరుడరేఖ ఉన్నవాళ్ళని పాములేమీ చేయవంటారు. ఈ గొట్టానికి, రేఖకి ఏమిటి సంబంధం?" అనుమానం వ్యక్తం చేసింది.

"నీకు మూత ఊడిరావటం ముఖ్యమా? వివరాలు ముఖ్యమా?" అడిగాడు కృతయుగ్.

"రెండూ ముఖ్యమే. నీ గురించి తెల్సుకోవలసింది ఇంకా చాలా ఉందనిపిస్తోంది."

"స్నిగ్ధా! నాకే నా గురించి పూర్తిగా తెలీదు. ఇంక నీకేం చెప్పను? గరుడరేఖ గురించి మొదట్లో నాకే తెలీదు. అయితే పాముల్ని చూస్తే నాకెప్పుడూ భయం ఉండేదికాదు. ఓసారి ఇంటర్ చదువుతున్న రోజుల్లో అనుకుంటాను, ఒక పెద్ద నల్లతాచు క్లాస్‌రూమ్‌లోకి వచ్చేసింది. దాన్ని చూసి భయంతో బయటకు పరుగులెత్తారంతా. నేను, మరికొందరు ఉండిపోయాం.

కుర్రాళ్ళను చూసి బుసలుకొడుతున్న పాము, నేను ముందుకు రాగానే ఉన్నట్టుండి పడగదించి గిరుక్కున వెనుతిరిగి పారిపోయింది. అది నా మొదటి అనుభవం. అలా ఎందుకు జరిగిందో అప్పట్లో నాకు తెలీదు.

ఈ సంఘటన జరిగిన కొద్ది రోజులకి ఒక సాధువు నా చేయి చూసి గరుడరేఖ ఉందని, నిన్ను చూస్తే పాములు పారిపోతాయనీ చెప్పాడు. బహుశా ఈ రాగిగొట్టానికి రక్షణగా ప్రయోగింపబడిన నాగశక్తి ఏదో నా చేయి పడగానే తప్పుకుంటున్నట్టుంది. అందుకే మూత నాకే ఊడివస్తోంది" అంటూ అతడు వివరిస్తుంటే ఆశ్చర్యపోయింది స్నిగ్ధ.

"ఏదీ గరుడరేఖ చూపించవా?" అడిగింది.

కుడిచేయి చాచి అరచేయి విప్పి చూపించాడు. అరచేయి ఉబ్బెత్తుగా ఉండి రెక్కలు చాచిన గరుడపక్షి ఆకారంలో చిన్న రేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"అయితే నాదో అనుమానం. ఇది తెరవటానికి నీవింత కష్టపడ్డా ప్రయోజనం లేనప్పుడు పీటర్‌వాళ్ళు తెచ్చిన రాగిగొట్టాన్ని వాళ్ళు ఎలా తెరిచి వుంటారు?" అడిగాడు.

"దానికి ఇలా లక్కసీలు ఏదీలేదు. బహుశా దానికి ఇలాంటి మంత్ర ప్రయోగం ఏదీ చేసుండకపోవచ్చు" అంది స్నిగ్ధ.

అప్పటికి రాత్రి తొమ్మిది దాటింది సమయం.

రూమ్‌కి భోజనం ఆర్డర్ చేసి ఇద్దరూ భోంచేశారు. డోర్ క్లోజ్ చేసి లాక్ చేసింది స్నిగ్ధ.

"నాకు నిద్రొస్తోంది. బాగా అలసిపోయాను. గుడ్‌నైట్" అంటూ బెడ్‌మీద వాలిపోయాడు కృతయుగ్.

"ఓ.కె. నేను ఆ రాగిగొట్టంలో ఏమున్నాయో చూసి స్టడీ చేయాలి. లైటు ఆన్‌లో ఉంటే నీకేం ప్రాబ్లమ్‌లేదుకదా?" అడిగింది స్నిగ్ధ.

"నో ప్రాబ్లమ్. బట్, నీకు తెలీని మరో విశేషంకూడా నాలో ఉంది. అదేమిటో సమయం వచ్చినప్పుడు చెప్తాను. ఏమీ అనుకోకు" అంటూ కళ్ళు మూసుకున్నాడు.

ఒక్కక్షణం అతడ్ని చూసింది. నవ్వుకుంటూ వెళ్ళి టేబుల్‌ముందు కూచుని రాగిగొట్టంలోని చుట్టచుట్టిన రాగిరేకుతోబాటు ఆరు తాళపత్రాల్ని బయటికి తీసింది. కృతయుగ్‌కి ఉదయం మెలుకువ వచ్చేసరికి ఆరుగంటలు దాటింది సమయం. పక్కన స్నిగ్ధలేదు.

బెడ్‌దిగి ఇవతలకు వచ్చేసరికి స్నిగ్ధ ఇంకా టేబుల్ ముందే కూచునుంది. ట్యూబ్‌లైటు ఆన్‌లోనే ఉంది. కాని ఆమె మెలుకువగా లేదు.

రాత్రి ఎన్ని గంటలవరకూ వర్క్ చేసిందో గాని అలాగే టేబుల్‌మీదకు వాలిపోయి గాఢనిద్రలో మునిగిపోయింది. పెన్ను ఇంకా చేతిలోనే ఉంది.

జుట్టు ముడి వీడి ముఖంమీద పడుతూ మబ్బుల్లోని జాబిలిలా ఉందామె ముఖం.

"స్నిగ్ధా!" అంటూ భుజంతట్టి రెండుసార్లు పిలిచాడు. అయినా లేవలేదామె.

ఆమె కురులు తప్పించి నుదుట ముద్దుపెట్టుకున్నాడు. రెండుచేతుల మీద ఎత్తుకుని జాగ్రత్తగా తీసుకెళ్ళి బెడ్‌మీద పరుండజేసి దుప్పటి కప్పాడు.

వెనుతిరిగి వచ్చి టేబుల్‌మీద కాగితాలు, తాళపత్రాలు, రాగిరేకు అన్నిటినీ పరిశీలించాడు. చూడగానే ఆమెకు కావలసిన రాగిరేకు మొదటి భాగం ఇదేనని అర్థమైపోయింది. అయితే రాగిరేకుమీద గాని, తాళపత్రాలమీదగాని రాయబడున్న ప్రాకృతభాష లిపి ఒక్క అక్షరం కూడా అర్థంకాలేదు.

అవి మాత్రమే కాదు, ఆమె డీ కోడ్ చేసిన కాగితాలన్నీ మోర్స్‌కోడ్‌లాంటి ప్రత్యేక కోడ్ లాంగ్వేజ్‌లో గీతలు, చుక్కలు, కామాలుగా ఉండి అదీ అర్థంకాలేదు.

ఖాళీ రాగిగొట్టంతో సహా వాటినన్నిటినీ టేబుల్ సొరుగులోకి తోసి మూసేశాడు. కాఫీ పంపించమని రిసెప్షన్‌కి ఫోన్‌చేసి ఫ్రంట్‌డోర్ లాక్‌తీసి ఓపెన్ చేసి వుంచాడు.

బాత్‌రూమ్‌కు వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చి కూచున్న కాసేపటికి రూమ్‌బోయ్ ట్రేలో కాఫీప్లాస్కు, రెండు పెద్ద సైజు అందమైన కప్పులు తెచ్చి టీపామీద ఉంచి వెళ్ళాడు. డోర్ క్లోజ్‌చేశాడు కృతయుగ్.

ఫ్లాస్కులోంచి కాఫీ కప్పులోకి వంచుకుని తాగాడు. స్నిగ్ధను లేపి బెడ్ కాఫీ ఇవ్వాలనివున్నా నిద్రాభంగం కలిగించటం ఇష్టంలేక ఊరుకున్నాడు.

భద్రాచలం బామ్మకు, మున్నలూరు సిద్ధేశ్వర్‌కు ఫోన్లుచేసి మాట్లాడాక కృతయుగ్‌కి ఒక నంబరు గుర్తుకొచ్చింది అది ముగ్ధ నంబరు.

పీటర్ సెల్ నుంచి స్నిగ్ధ తీసుకున్న నంబరు.

ఈ నంబరు ముగ్ధది అవునోకాదో తెలియాలంటే ఓసారి ఫోన్ చేయాలి. అప్పుడే ఆమె గురించి తెలిసే అవకాశం ఉంది. జేబులోని కాగితాల్లోంచి ఆ నంబర్ తీసి డయల్ చేశాడు. అవతల రింగ్‌టోన్ వినబడుతోంది. సరిగ్గా అయిదో సెకన్లో ఫోన్ లిఫ్ట్ చేయబడింది.

"హలో... ఎవరు?!" అవతలి నుంచి ఒక యువతి గొంతు విన్పించింది.

కృతయుగ్ మౌనం వహించాడు.

"హలో... కాంచన హియర్. మీకు ఎవరు కావాలి?" కాస్త విసుగు ధ్వనించింది అవతలి గొంతులో.

"సో... నీ అసలు పేరు కాంచన, ముగ్ధ కాదు" అడిగాడు. అవతల చిన్న షాక్.

"ఓ మైగాడ్... కృ... కృతయుగ్...." గొంతులో ఉత్కంఠ స్పష్టంగా తెలుస్తోంది.

"ఆ కృతయుగ్‌నే..."

"నా సెల్‌నెంబర్ ఎలా దొరికింది?"

"అదంతా చెప్పాలంటే చాలా చెప్పాలి. ఈసారి మనం కలవటం జరిగితే చెప్తాను. బట్, నాతో నీ పేరెందుకు అబద్ధం చెప్పావ్. ఈ నెంబరు నీది అవునా కాదాని డౌట్ క్లియర్ చేసుకోడానికి ఫోన్ చేశాను."

"మంచి పనిచేశావ్. చూశావ్‌గా నా పేరు అబద్ధం చెప్పటం వల్లే గదా నీ సెల్ నెంబర్ నా ఫోన్‌లో కొచ్చింది" కాంచన ఉత్సాహంగా చెప్తుంటే– "ఓ షిట్!" అనుకుంటూ నుదురు కొట్టుకున్నాడు. ముందుచూపు లేని పనులు చేస్తే ఇలాగే వుంటుంది.

ఇన్ని తెలిసిన తనకు బయట కాయిన్‌బాక్స్ నుంచి ఫోన్ చేద్దామన్న ఆలోచన ఎందుకు రాలేదు?

"ఇది నా నెంబర్ కాదులే... ఫ్రెండ్ ఫోన్..."

"నీ ఫ్రెండ్స్ మంచివాళ్ళేగా. అబద్ధం చెప్పరు. నీ నెంబరిస్తారు. అయినా నీ నెంబరు నా దగ్గరుండకూడదా? ఓ.కె. నీకు నామీద కోపం వచ్చినట్టుంది.

సారీ. ఆ పరిస్థితుల్లో నీతో అలా అబద్ధం చెప్పాల్సొచ్చింది. ఎక్కడున్నారు? స్నిగ్ధ, నీతోనే ఉందా? ఇంకా దంతెవారాలోనే ఉన్నారా?"

"లేదు. నేను భద్రాచలం వచ్చేశాను. స్నిగ్ధ హైదరాబాద్ వెళ్ళిపోయింది" అబద్ధం చెప్పాడు.

అయితే నేను భద్రాచలం వస్తాను. నిన్ను చూడాలనుంది" అంది కాంచన.

"ఏయ్... ఏమిటీ పిచ్చి. ఆఫ్టరాల్ ఒక ట్యాక్సీ డ్రైవర్ని. అనవసరంగా నామీద పిచ్చి ఆలోచనలు వద్దు. సాయంత్రం తిరుపతికి కిరాయి ఉంది. వారం రోజులు ఉంటే ఉంటాను"

"ఎలా ఉండగలవ్? స్నిగ్ధ ఊరుకుంటుందా?" హైదరాబాద్ ఎప్పుడొస్తు న్నావ్?

"ఇప్పుడే వీలుకాదు. రావటం జరిగితే నీకు ఫోన్ చేస్తాను. బై" లైన్ కట్‌చేశాడు.

కాంచన మళ్ళీ ఫోన్ చేసి విసిగిస్తుందనుకున్నాడు. కాని ఏమనుకుందో ఏమో, ఫోన్ చేయలేదు. అయితే ఒక విషయం మాత్రం స్పష్టమైపోయింది. ఆమె విషయంలో స్నిగ్ధ అనుమానించింది నిజమే.

పీటర్ వర్గాన్ని ఫోన్‌లో కమాండ్ చేసింది కాంచనే. ఈ నెంబరు ఆమెదే. అంటే.... గుప్త నిధులు అన్వేషించే ముఠాకి ఆమె నాయకురాలో లేక ముఠాలో సభ్యురాలో తెలియాలి.

ఈ విషయాలు తెలుసుకోవడానికి ఫోన్‌లో నిలదీసి ప్రయోజనం ఉండదు. అందుకే అడగలేదు.

ఆలోచిస్తూ ఫ్లాస్కులో మిగిలిన కాఫీకూడా కప్పులోకి వంచుకుని తాగి సిగరెట్ ముట్టించుకున్నాడు. క్రమంగా సమయం ఎనిమిది దాటింది.

అప్పటికీ గాఢనిద్రలో ఉంది స్నిగ్ధ.

రిసెప్షన్‌కి ఫోన్ చేసి కాఫీతోపాటు టిఫిన్ కూడా ఆర్డర్ చేశాడు. స్నిగ్ధను తట్టిలేపాడు. ఆమె స్నానంచేసి వచ్చేసరికి కాఫీ టిఫిన్లు రెడీగా ఉన్నాయి.

తర్వాత తనూ వెళ్ళి స్నానంచేసి వచ్చాడు.

"సారీ కృతా, తెల్లవారుజాము మూడు గంటలకి నాకు తెలీకుండానే నిద్రపట్టేసింది. అందుకే తెల్లారి లేవలేకపోయాను" అంది స్నిగ్ధ.

"ఇట్సాల్ రైట్. ముందు టిఫిన్ కానిచ్చేస్తే తర్వాత మాట్లాడుకోవచ్చు. కమాన్" కాఫీ టిఫిన్లు ముగించి రూమ్‌బాయ్ ఖాళీప్లేట్లు తీసుకెళ్ళగానే డోర్ మూసి లాక్ చేశాడు కృతయుగ్. ఛైర్ లాక్కుని టేబుల్‌ముందు స్నిగ్ధపక్కన కూచున్నాడు.

టేబుల్ సొరుగులోంచి పేపర్లు, రాగిరేకు అన్నీ తీసి తిరిగి టేబుల్‌మీద సర్దింది.

"చెప్పు స్నిగ్ధా! రాగిరేకులో విశేషాలేంటి?" ఎంతో కుతూహలంగా అడిగాడు.

అతడ్ని తేరిపార చూసిందామె. "ఆ విశేషాలు చెప్పుకునేముందు నీ గురించి చెప్పుకోవాలి" అంది.

"నా గురించా... నేను చెప్పకుండా ఎలా చెప్పగలవ్?" నవ్వాడు.

"నీ అరచేతిలో గరుడరేఖ గురించి నువ్వే చెప్పావు. నీలో ఇంకో ప్రత్యేకత ఉందని సమయం వచ్చినప్పుడు చెప్తాను అన్నావు. అవునా?"

"అన్నాను. అయితే?"

"అదేమిటో నేనే చెప్తాను."

"ఆహాఁ. చెప్పుకో చూద్దాం"

"సిద్ధయోగాల్లో ఛాయాపురుష యోగసిద్ధి అనే ఒక యోగం ఉంది. అది సాధించుకున్న సిద్ధపురుషుడివి నువ్వు. అవునా?" ఆ మాటలు వినగానే కృతయుగ్‌కి షాక్. ఎంత షాకంటే తను పొరపాటున వింటున్నాడేమో అనేంత. కుర్చీలో ముందుకు జరిగి విస్తుపోతూ చూశాడు. అవుననీ కాదనీ చెప్పలేక సందిగ్ధావస్థలో స్నిగ్ధ ముఖంలోకి అలా చూస్తుండిపోయాడు.

ఈ విషయం తన బామ్మ నారాయణమ్మకు గానీ, సిద్దేశ్వర్‌లాంటి మిత్రులకు గానీ, ఆ మాటకొస్తే ఈ లోకంలో తనగురించి తనకేగాని రెండో మనిషికి తెలీని రహస్యమిది.

అంతటి నిగూఢ రహస్యాన్ని స్నిగ్ధ ఎలా తెలుసుకోగలిగింది? నమ్మలేక పోయాడు.

అతడి అవస్థ గ్రహించి చిన్నగా నవ్వింది స్నిగ్ధ.

"ఆన్సర్ ప్లీజ్. ఎస్ ఆర్ నో" హెచ్చరించింది.

"ఎస్..." అంటూ తలపంకించాడు. "అయితే చెప్పు. ఛాయా పురుష యోగం అంటే ఏంటి?"

"తెలీకుండానే చెప్పావా?" అంటూ పకపకా నవ్వేశాడు కృతయుగ్.

బుంగమూతి పెట్టి కోపంగా చూసింది స్నిగ్ధ.

"చెప్తావా లేదా?" అంది సీరియస్‌గా.

"చెప్తాను. కానీ దీనిగురించి నువ్వెక్కడ తెలుసుకున్నావో చెప్పాలి" అన్నాడు కృతయుగ్.

"ముందు నువ్వు చెప్పు."

"ఓకె! ఈ ఛాయా పురుషయోగం చాలా క్లిష్టమైన, అనితరసాధ్యమైన, ఇంకా చెప్పాలంటే చాలా కఠినమైన యోగం. వినడానికి చాలా సులువు అనిపిస్తుంది. కాని యోగసాధన చాలా కష్టం.

"నిజం చెప్పాలంటే ఈ యోగాలు, సిద్ధులు, మంత్రతంత్రాలు అంటే చిన్నప్పట్నుంచీ నాకు ఏమాత్రం నమ్మకంలేదు. నాకు పది పన్నెండేళ్ళ వయసులో మా నాన్నగారి వెంట నేలమాళిగలోకి వెళ్ళినప్పుడు ఈ రాగిగొట్టం మూతతీసి చూశాను.

ఆడుకోడానికి ఇమ్మంటే నాన్నగారు తిట్టి, మూతపెట్టి బోషాణంలో పడేయమంటే అలానే చేశాను" అన్నాడు కృతయుగ్.

"ఆ సంఘటన జరిగిన ఆరునెలల తర్వాతనుకుంటాను నేను మోగులూరు హైస్కూలునుంచి ఒంటరిగా ఇంటికి నడుచుకుంటూ వస్తూండగా ఒక సన్యాసి ఎదురయ్యాడు.

ఆయన నన్ను చూస్తూనే ఆగమని సైగ చేసి నా వద్దకు వచ్చాడు. నా ముఖంవంక దీక్షగా చూశాడు. నాకు భయం వేసింది. పారిపోవాలనిపించింది. పోలేకపోయాను.

ఆయన నా రెండు చేతులు అరచేతి రేఖల్ని పరీక్షించాడు. అప్పుడు నాతో– "నువ్వు యోగజాతకుడివి. కారణజన్ముడవి నాయనా. భయపడకు. నీ అరచేతిలో గరుడరేఖ ఉంది. పాములు నిన్ను చూస్తే పారిపోతాయి. ఎలాంటి గొప్ప సర్పమైనా నీ చేయి వేస్తే తలవంచి తొలగిపోతుంది" అని చెప్పాడు.

"నీకు ఛాయా పురుష యోగసిద్ధికి మంత్రం ఉపదేశిస్తాను. ఆరుమాసాలు సాధనచేస్తే నీకు యోగసిద్ధి అవుతుంది. ఇది సాధన చేసినవానికి అనేక సిద్ధులు లభిస్తాయి. భేతాళుణ్ణి వశం చేసుకోగలుగుతావు. సాధన చేస్తావా?" అనడిగాడు.

భయంతో చెప్పానో, భక్తితో చెప్పానో నాకే తెలీదు. "చేస్తాను గురుదేవా" అన్నాను. ఆయన మంత్రోపదేశం చేసి విధివిధానాలు చెప్పి ఆశీర్వదించి తన దారిన వెళ్ళిపోయాడు.

ఆయన చెప్పిన మంత్రం గుర్తుంది. కాని సాధన చేయాలన్న ఆలోచన రాలేదు. కాని క్లాస్‌రూమ్‌లోకి పాము వచ్చినప్పటి సంఘటనతో నా అరచేతిలో గరుడరేఖ మహిమ యథార్థమని గ్రహించాను. ఈ లోపల ఇంటర్ పరీక్షలై సెలవులు వచ్చినప్పుడు ఎందుకో ఈ సెలవుల్లో సాధన చేసిచూస్తేపోలా అన్పించింది. దాంతో మంచిరోజు చూసి ఆరుమాసాలపాటు సాధన చేసి మంత్రసిద్ధి పొందాను" అంటూ చెప్పటం ఆపాడు.

"అంతేనా... ఇంకా చెప్పాల్సింది ఏమీలేదా?"

"ఏముంది?"

"జరిగింది చెప్పావు. అంతేగాని అర్థం చెప్పలేదు" అంది స్నిగ్ధ.

"అదా... ఓ.కె. అదీ చెప్తా విను. ప్రతి ఉదయం చెట్టు చేమలు అడ్డురాని మైదానప్రాంతంలో ఏ డిస్ట్రబెన్సు లేనిచోట మన నీడ సుమారు తొమ్మిది అడుగుల పొడవు కన్పిస్తున్న సమయంలో నిలబడాలి.

నీడను చూస్తూ మంత్రాన్ని ఏకాగ్రతతో జపిస్తూ నీడనే తదేకదీక్షగా చూస్తూండాలి.

ఆ విధంగా మననీడ మూడు అడుగులు తగ్గి ఆరు అడుగుల ప్రమాణంలోకి వచ్చే వరకు జపించాక, కాసేపు కళ్ళుమూసుకుని ఆకాశంవంక చూసి తెరిచినప్పుడు తెల్లని ఛాయాపురుష ఆకారం కొద్దిసేపు కన్పించి అదృశ్య మవుతుంది.

ఇలా ఉదయం పశ్చిమాభిముఖంగానూ, సాయంకాలం తూర్పు అభిముఖంగానూ నిలబడి సాధన చేస్తూండాలి. అది అంత సులువు కాదు. రోజులు గడిచేకొద్దీ సాధన సమయంలో చిత్రవిచిత్రమైన ధ్వనులు, భీకర ఘర్జనలు, పైశాచిక అరుపులు విన్పిస్తుంటాయి. మన చుట్టూ కనిపించని శక్తులేవో సంచరిస్తూ సాధకుడి దీక్షను భగ్నంచేసే ప్రయత్నాలు చేస్తాయి.

భయపెడతాయి. బెదిరిస్తాయి.

మనోధైర్యంతో వాటిని అధిగమిస్తూ దీక్షను ఆరుమాసాలు కొనసాగిస్తే మంత్రం సిద్ధిస్తుంది. గగనంలో ఛాయాపురుషుడు మన రూపంలోనే గోచరించి ఆశీర్వదిస్తాడు" అంటూ వివరించాడు.

ఇప్పుడు కూడా కృతయుగ్ పూర్తి సమాచారం ఇవ్వలేదని, అరకొరగా చెప్పి ముగించాడని గ్రహించింది స్నిగ్ధ. అలాగని ఒత్తిడి చేసి మంత్రం ఏమిటో తెలుసుకోవాలనో, మరిన్ని వివరాలు రాబట్టాలనో అనుకోలేదు స్నిగ్ధ. కాని ఈ

విషయంలో కొన్ని సందేహాలు ఇంకా మిగిలిపోయాయి. అవి తెలుసుకోవాలను కుంది.

"ఓ.కె. మరిన్ని ప్రశ్నలు వేసి నిన్ను విసిగించను. కాని మనం చూస్తూనే వుంటాం. ఆకాశం ఎప్పుడూ నిర్మలంగా ఉండదు. మబ్బులుపట్టి సూర్యుడు కనబడకపోవచ్చు. వారంరోజులు ముసురుపట్టొచ్చు. అలాంటి సందర్భాల్లో సాధన అసాధ్యంకదా!" అడిగింది.

"నిజమే. కాని... అలాంటి సందర్భాల్లో కూడా సూర్యుడు ఉన్నాడనుకొని, తన నీడ కన్పిస్తున్నట్టు ఊహించుకొని సాధన కొనసాగిస్తే గగనంలో ఛాయారూపం దర్శనమిస్తూనే వుంటుంది.

ఇది ఒక ఆత్మ సందర్శనయోగం. ఇది తెలిసీ తెలీని వయసులో ఓ సన్యాసి నాకీ యోగాన్ని ఎందుకుచెప్పాడో చెప్పాడు. అది ఎంతవరకు ఫలిస్తుందో చూడాలన్న పట్టుదలతో ధైర్యంగా సాధనచేశానేగాని మానవాతీత శక్తుల్ని వశపర్చుకోవాలన్న ఆశతో కాదు"

అతడి మాటల్ని ఎంతో ఆసక్తిగా వింది స్నిగ్ధ. ఏవేవో ఆలోచనల్లో కూరుకుపోయినట్టు కాసేపు మౌనం వహించింది. ఏవో నాలుగు గారడీ విద్యలు తెలిసినవాడే ఈ రోజుల్లో డబ్బుకోసం, పేరుప్రతిష్ఠలకోసం పిచ్చి ప్రదర్శనలు ఇచ్చి ప్రచారంలోకి వచ్చి ప్రముఖుడిగా చలామణి అయిపోతున్నాడు.

అలాంటిది ఇంత ప్రతిభ ఉండికూడా సామాన్యుడిగా ఉండగలగటం అంటే ఇది అసాధారణ విషయం. ఆపైన అరచేతిలో ఉబ్బెత్తుకండ ఏర్పడితే అతడికి నాయకత్వ లక్షణాలు, గొప్ప పదవీయోగం ఉంటుందన్నది హస్తసాముద్రికం మాట.

మంగోలియా వీరుడైన చెంఘిజ్‌ఖాన్ అరచేతిలో ఎద్దు మూపురంలా ఉబ్బెత్తుగా కండ ఉండేదట. అతడి విషయంలో జోస్యం అక్షరసత్యమైంది. చెంఘిజ్‌ఖాన్ మంగోలియా చరిత్ర నాయకుడయ్యాడు.

కొందరు చరిత్రకారులు అతడు క్రూరుడని, లక్షలాదిమందిని ఊచకోత కోసిన నరరూప రాక్షసుడని అభివర్ణించారు. నిజమే.

అయితే అతడ్ని నిందించేముందు ఆనాటి మంగోలియా పరిస్థితుల్ని అర్ధంచేసుకోవాలి.

చెంఘిజ్‌ఖాన్ తండ్రి ఖాఖాన్ హయాం నాటికి మంగోలియా ఒక దేశం కాదు. ఏ దేశానికీ చెందని గోబీ ఎడారి. ఆ ఎడారివెంట సువిశాలమైన అడవులు,

పచ్చిక బీళ్ళు. ఆ ఎడారి భూములవెంట సంచరించే సంచార తెగలు. ఈ తెగల మధ్య ఎన్నడూ సయోధ్య లేదు.

ఎప్పుడూ ఒక తండామీద మరో తండా దాడులు చేసి జయించి, ఎదిరించినవాళ్ళని చంపి, జయించిన తండాను తమలో కలిపేసుకునేవారు.

ఇలా తండాలన్నీ ఒకరిమీద ఒకరు పరస్పర దాడులతో ఎడారి భూమి రక్తసిక్తమయ్యేది. ఈ పరిస్థితి పోవాలని, మంగోలియా ఏకరాజ్యం కావాలని, శాంతి సుభిక్షంగా ఉండాలని ఖాఖాన్ కలలు కనేవాడు.

ఖాఖాన్ హత్యకు గురయ్యాక తండ్రి ఆశయం నెరవేర్చాలని కంకణం కట్టుకున్నాడు చెంఘిజ్‌ఖాన్. అంతే- లొంగిన తండాలను క్షమించాడు. లొంగనివాటిని ఊచకోత కోసి దారికి తెచ్చాడు.

అలా సువిశాల మంగోలియా రాజ్యం స్థాపించి ప్రజలకు సుఖశాంతులు సమకూర్చాడు. పక్క రాజ్యాలకు పక్కలో బల్లెమై కంటిమీద కునుకులేకుండా చేశాడు. ఆ విధంగా మంగోలియా రాజ్యస్థాపకుడయ్యాడు.

ఈ రోజుకీ చెంఘిజ్‌ఖాన్ సమాధిలో అంతులేని సంపద నిక్షిప్తమైవుందని ప్రచారంలో ఉంది.

కాని ఆ సమాధికోసం ఎన్నో ఏళ్ళుగా అన్వేషిస్తున్నా కనిపెట్టలేకపోయారు.

"హలో మేడమ్? ఉన్నట్టుండి ఏమైంది నీకు? ఏ లోకంలో ఆలోచిస్తున్నావు?" అంటూ కృతయుగ్ పలకరింపుతో స్నిగ్ధ ఆలోచనలు చెదరిపోయాయి.

"చెప్పు కృతా... ఏమైంది?" అంది నవ్వుతూ.

"చెప్పాల్సింది నువ్వు. దీర్ఘాలోచనలో మునిగిపోయినట్టున్నావు. ఏమైంది?" అన్నాడు.

"నథింగ్. ఏదో గుర్తొచ్చింది"

"అవన్నీ పక్కనపడేసి విషయానికిరా. ఈ రాగిగొట్టంలో విశేషాలేమిటి? నిధి రహస్యం తెలిసిందా?" అడిగాడు కృతయుగ్.

"తెలిసీ తెలీనట్టుగా ఉంది" నిట్టూర్చింది స్నిగ్ధ.

"ప్రాకృతభాషను డీకోడ్ చేయటానికి రాత్రంతా చాలా శ్రమపడ్డాను. కాసేపు రాగిరేకును పక్కన ఉంచి ఈ తాళపత్రాలు ఆరింటి గురించి చెప్పుకుందాం. దీనివల్ల నీ సందేహాలు కూడా తీరే అవకాశం ఉంది"

"అయితే చెప్పు"

"నాకో విషయం తెలియాలి. మీ వంశీకుల... నా ఉద్దేశం మీ వంశవృక్షం గురించి నీకు తెలుసా?"

"తెలీదు..." వెంటనే బదులిచ్చాడు కృతయుగ్.

"నా తండ్రి, తాత, ముత్తాతవరకు పేర్లు చెప్పగలను. దానికి మించి వెనక్కి వెళ్తే నాకేమీ తెలీదు. ఒకప్పుడు మా వంశవృక్షాన్ని తెలిపే తాళపత్ర గ్రంథం ఒకటి మా కుటుంబంలో ఉండేదట. మా ముత్తాత కాలంలో మున్నలూరు వరదముంపుకు గురైనప్పుడు ఆ తాళపత్రాలు వరదలో కొట్టుకుపోయాయట. మా తాతగారు చెప్తుంటే విన్నవిషయం ఇది.

ఇక ఆర్డర్ కరెక్టుగా ఉంటుందో లేదోగాని మావద్ద ఉన్న పనిముట్లమీద, వాటిని ఉపయోగించిన స్థపతుల పేర్ల ఆధారంగా కొత్తగా వంశవృక్షాన్ని తయారు చేసుకోవచ్చు. కాని నాకు ఇంట్రెస్ట్‌లేక ఆ పని చేయలేదు" అన్నాడు కృతయుగ్.

"ఓ.కే! మీ వంశం ముందుతరాల్లో ఎప్పుడో స్థపతి అక్కనాచార్యుడనే మహాశిల్పి ఉండేవాడు.

శంభులింగయాచారి అనే ఉజ్జయినికి చెందిన వృద్ధస్థపతి ఒకరు ఈ రాగిగొట్టాన్ని, ఒక లేఖను కాలనేమి అనే నమ్మకమైన తన నౌకరుకి ఇచ్చి మారికపురి అనే గ్రామంలో నివసిస్తున్న అక్కనాచార్యునికి అందజేయమని పంపించాడు. ఆవిధంగా ఈ రాగిగొట్టం నిధి రహస్యాన్ని నిక్షిప్తం చేసుకుని మీ వంశంలోకి వచ్చింది" అంటూ చెప్పటం ఆపింది స్నిగ్ధ.

"బాప్‌రే!... ఎక్కడి ఉజ్జయిని, ఎక్కడి ఆంధ్ర?! ప్రయాణవసతుల్లేని ఆ కాలంలో కాలనేమి అనే ఆ నౌకరు ఎన్ని కష్టాలుపడి ఇక్కడికొచ్చాడో తలచుకుంటే ఆశ్చర్యంగా ఉంది. లేఖమీద డేటు పేర్కొనబడిందా?" ఎంతో కుతూహలంగా అడిగాడు కృతయుగ్.

"ఉంది" విక్రమార్క శకం తేదీ అది. దాని ఆధారంగా పరిశీలిస్తే సుమారుగా క్రీస్తుశకం 250 నుంచి 350 సంవత్సరాల మధ్యకాలం కావచ్చు. ఖచ్చితమైన లెక్కలుగట్టి చూడాలంటే సమయం పడుతుంది. అసలీ శకాలలోనే కొంత అస్తవ్యస్తంగా అన్పిస్తుంది. ఆ విషయం తర్వాత చెప్తాను. నీకో ముఖ్య విషయం కూడా చెప్తాను.

శంభులింగయాచారి చాలా తెలివైనవాడు. దూరదృష్టి గలవాడు. అందుకే తన మేనల్లుడైన అక్కనాచార్యుడికి ఒక లేఖ రాశాక దానికి నకలు ఒకటి తీసి రాగిరేకుతో కలిపి గొట్టంలో ఉంచాడు.

ముందుతరాల్లో గొట్టాన్ని తెరిచినవారికి విషయగ్రాహ్యం కావాలని అలా చేశాడాయన.

లేఖ అసలుప్రతిని, ఈ గొట్టాన్ని ఒక పెద్ద రాగిగొట్టంలో ఉంచి సీలువేసి నౌకరుకిచ్చి పంపాడు. కాబట్టి వీటిని తెచ్చిన నౌకరుకు కూడా తానో నిధి రహస్యాన్ని తెస్తున్న సంగతి తెలీదు" వివరించింది.

"ఇంతకీ మారికపురి అనే గ్రామం ఎక్కడుంది? అసలు ఉందో కాలగర్భంలో కలిసిపోయిందో లేక పేరుమార్చు కొని అన్యనామంతో వ్యవహరింప బడుతోందో..."

"నువ్వు చివర చెప్పిందే కరెక్ట్"

"అంటే పేరు మారిందనేగా?"

అవునన్నట్టు తలూపింది స్నిగ్ధ.

"ఒకప్పుడు మారికపురమని, మారకపురమని పిలువబడిన ఆనాటి గ్రామమే నేడు ప్రకాశంజిల్లాలోని మార్కాపురం. ఇక్కడ సుప్రసిద్ధమైనది చెన్నకేశవస్వామి ఆలయం" అంది.

"ఆలయ ప్రత్యేకతలు ఏమిటి?" వెంటనే ఎంతో ఆసక్తిగా, ఉత్కంఠగా అడిగాడు కృతయుగ్.

స్నిగ్ధ కోప్పడింది- "ఏమిటిది చిన్నపిల్లాడిలా అన్నీ అడుగుతావ్, ఇలా అయితే మనం అసలు విషయం చెప్పుకునేదెప్పుడు?" అంటూ.

"హలో డియర్. ఎన్ని చెప్పుకున్నా మనకీ రోజంతా సరిపోతుంది. ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ గదా. క్లుప్తంగా కాస్త చరిత్ర చెప్తే విని తరిస్తాం" అన్నాడు సరదాగా.

"ఓ.కె. అడిగావుగాబట్టి క్లుప్తంగానే చెప్తా విను..." అంటూ చెప్పడం ప్రారంభించింది స్నిగ్ధ.

"ఒకప్పుడీ ఆలయప్రాంత అరణ్యాన్ని గబీరణ్యమని వ్యవహరించేవారు. ఈ మన్వంతరంలోగాక గత మన్వంతరంలోనే ఎప్పుడో ఇక్కడ చెన్న కేశవుడు వెలిశాడంటారు. అందుకే ఈయన యుగయుగాల స్వామిగా భక్తులు ఆరాధిస్తారు.

ఒకప్పుడిది దేవభూమి. మహర్షుల పుణ్యభూమి. రాక్షసులు తరచూ దాడిచేసి వేధిస్తుంటే అప్పుడు మహర్షుల కోరికమీద విష్ణుమూర్తి ఇక్కడ చెన్నకేశవునిగా వెలిశాడంటారు. అమ్మవారు రాజ్యలక్ష్మీదేవి.

ఈ మన్వంతరం మొదటి యుగకాలంలో ఏనుగులు గుండికానది (గుండ్లకమ్మ ఏరు) నుంచి తొండాలతో నీరుతెచ్చి స్వామిని అభిషేకించేవట.

కలియుగ ఆరంభకాలంలో మారిక, మారకులనే విష్ణుభక్తులయిన దంపతులు ఘోరతపం చేసి చెన్నకేశవుని ప్రసన్నం చేసుకున్నారు.

ఆ దంపతుల పేరుమీదుగా దీన్ని కొంతకాలం మారికాపురమని, తర్వాత మారకాపురమని వ్యవహరించగా కాలక్రమంలో అదే మార్కాపురమైంది. ఆ యా కాలాల్లో రాజులు, మహారాజులు, చక్రవర్తులు స్వామిని దర్శించుకుని, ఆలయాభివృద్ధికి కృషిచేసి గుడులు, గోపురాలు కట్టించినట్టు శాసనాలద్వారా తెలుస్తోంది.

పన్నెండో శతాబ్దంలో కోడిపందాల్లో ఓడిన పల్నాటిరాజు మలిదేవుడు తన మంత్రి బ్రహ్మనాయుడుతో సహా వచ్చి ఈ స్వామిని అర్చించాడు. కృష్ణదేవరాయలు ఆలయానికి ఎన్నో దానాలిచ్చాడు. నీ అభిప్రాయం ప్రకారమైతే ఈ రాగిగొట్టం అందే నాటికి అక్కనాచార్యుడు ఇక్కడి ఆలయ నిర్మాణాల్లో స్థపతిగా వ్యవహరిస్తూవుండాలి...” అంటూ వివరించింది స్నిగ్ధ.

“వెరీ వెరీ ఇంట్రెస్టింగ్. ఇంతకీ శంభులింగయాచారి రాసిన లేఖ తెనుగు సేత యథాతథంగా చదువు. నాకేమన్నా అర్థమవుతుందేమో చూస్తాను” అన్నాడు కృతయుగ్.

“ఓ.కె.చదువుతాను. బట్ మధ్యలో ప్రశ్నలేసి విసిగించకు” “ఓ.కె.చదువు” కోడ్‌భాషలో రాసివుంచిన కాగితాలు అందుకుని చదవటం ఆరంభించింది స్నిగ్ధ.

“ఉజ్జయినీ నగరం. విక్రమార్క శకం, రెండొందల అరవై ఒకటో సంవత్సరం– ఉత్తరాయణం– విభవనామ సంవత్సరం– వసంతరుతువు– జ్యేష్ఠమాసం– తొమ్మిదో తేదీ–శుక్లపక్ష దశమీ గురువారం–మదీయ మేనల్లుండును, మహాశిల్పి స్థపతియునగు చిరంజీవి అక్కనాచార్యుని ముదమార ఆశీర్వదించి– ఉజ్జయినీ నగరవాసియు, మేనమామయు, శిల్పాచార్యుండను అగు శంభులింగయాచారియను నేను రాయు లేఖార్థములు...

ఇచట మనవారంతా క్షేమంబు. అచట నీవును, మా ప్రియపుత్రిక యగుమహాదేవియును మరియు మనమలు, మనవరాండ్రు, బంధుజనులు, చుట్టములు అందరూ సుఖులని, క్షేమంబని తలంచెద.

ఈ కమ్మను, తామ్రనాళికను సేవకుడు కాలనేమికి ఇచ్చి నీవద్దకు పంపించుటకు కారణము కలదు. ఈ కార్యభారము అర్థము జేసుకొని సమర్థముగా కాపాడగలవన్న నమ్మకంతో పంపియున్నాను. జాగ్రత్తగా అవధరింపవలె. నాయనా అక్కనాచారి, ఇచ్చోట ఉజ్జయినియందు పరిస్థితులు విషమించుచున్నవి.

పెనుకష్టములు దాపురించు సూచనలు అగుపడుచున్నవి. భోజవంశము, భోజరాజ్యంబు అంతరించు కాలంబు ఆసన్నమైనటుల ద్యోతకమవుచున్నది.

అవక్రపరాక్రములగు భోజవంశజులందు చివరివాడగు విక్రమభోజుడు జరాభారమున రాజ్యభారము వహింపజాలకుండె. నీకును దెలియు, ప్రభువులకు సంతానం లేదాయె! దత్తపుత్రుడగు మదనభోజుడు మధుపానమత్తుడు, వేశ్యాలోలుడు.

మదోన్మత్తుడు మూర్ఖుడై చరించి అజ్ఞాతశత్రువుల చేత హతమారినాడు. ఆ హత్య చేసినది దేశద్రోహులగు ప్రమర వంశీయులని ప్రభువుల సందియము.

సైన్యమందు ప్రమరుల ప్రాబల్యమున్నది. ఉజ్జయిని అంటే గిట్టని కణ్వులు, కొరట జాతీయులతో ప్రమరులకు సంబంధబాంధవ్యములున్నవి.

అందుచే ప్రభువు ప్రమరుల శిక్షింపనేరడు. ప్రభువు వృద్ధడగుటయు, యువరాజు హత్య-

ఈ సందర్భములు శత్రువులకు అనుకూలమై, ఉజ్జయినిపై యుద్ధ మేఘములు క్రమ్ముకొనుచున్నవని నగరవాసులు కడు దినంబుల వెరగందుచునే యున్న వారలు. తుదకు అదియే వాస్తవంబైనది.

శత్రుసేనలు సరిహద్దులు దాటి ఉజ్జయిని దిశగా కదులుచున్నట్టుల వార్తలు వ్యాపించె.

ఇత్తరి ప్రభువు విక్రమభోజుండు యుద్ధసన్నాహముల మునింగినవాడయ్యు, కొన్ని దినంబుల ముంగిట నన్ను జూడనెంచి వర్తమానమనిపియున్నాడు. రాజ మందిరమున ఏకాంతమందు ప్రభు దర్శనమైనది.

నిగూఢము, అతిరహస్యము అగు విషయము మా మధ్య చర్చకు వచ్చియున్నది. అదేమన-

నవరత్నములను కవుల పోషించిన తొలి భోజ ప్రభువు కాలమందు కొన్ని ఆలయాల నిర్మాణము జరిగియున్నది. అందున్నొక్క ఆలయ ప్రాంతమున మూడోతరంలోని చంద్రభోజుని కాలమందు అపార ధనరాశులు నిక్షిప్తం చేయబడినవి.

అది ఇంతదనుక రాజకుటుంబ రహస్యము. ఇత్తరి తమ పరిపాలనా కాలంబు మడిగిననూ నిధి రహస్యంబు మరుగుపడి కాలగర్భమున కలియరాదని ప్రభువుల భయం. ఆ కార్యభారమును నా మీదనుంచి వారు కదనరంగమునకు వెడలినారు. పక్షము దినాలు సాగిన భీకరయుద్ధమందు ఉజ్జయినీ సేనలు ఓడినవి.

ప్రాణావశిష్టుడైన విక్రమభోజుడు శత్రువుల చేతికి చిక్కినాడు. ప్రమర నాయకుడు, గజమల్లుడు నిధిరహస్యం జెప్పమని ప్రభువులను హింసింపగా

వీరకిశోరమగు వృద్ధవీరుడు విక్రమభోజుడు గజమల్లుని శిరస్సునరికి ప్రతీకారం తీర్చుకుని ప్రాణాలు వదిలినాడు.

రాణి భద్రావతి విక్రమభోజుని దేహంతో సహగమనం జేసినది. ఈ విధంగా ఇక్కడ ఉజ్జయిని యందు ప్రస్తుతం భోజులపాలన ముగిసి కొరటుల పాలన ఆరంభమై ప్రజలు కష్టములపాలయినారు.

నాయనా అక్కనాచార్య... నిధి రహస్యాన్ని రాగిరేకు నందు లిఖించి, రెండు భాగములు జేసి అందు ముఖ్యమగు తొలిభాగము నీకు అనుపినాను. రెండవ భాగము మా వంశంలో ఉంటుంది.

నిధికి వారసుడగు విక్రమభోజుడు, వారి రాణి భద్రావతి వారసులకు, అది ఎన్ని శతాబ్దము లైననూ చేరువరకు తామ్రనాళికలు మనవంశమందే భద్రముగా ఉండవలె. ఇట్లు, మేనమామ శంభులింగయాచారి" అంటూ తర్జుమా చేసిన లేఖ సారాంశం మొత్తం చదివి వినిపించింది స్నిగ్ధ.

అంతా శ్రద్ధగా విన్నాడు కృతయుగ్. మధ్యలో అతడు కలుగజేసుకోలేదు. చిన్న ప్రశ్న కూడా అడగలేదు. అంతా విని భారంగా నిట్టూర్చాడు.

"బాగుంది. భవిష్యత్తులో ఎక్కడో పుట్టబోయే భోజవంశ వారసులకు చేరాల్సిన నిధి రహస్యం.

దీనికి మనం ఇక్కడ కాపలా ఉండగలమా? చుట్ట చుట్టి ఇచ్చెయ్యి. భద్రాచలం పట్టుకెళ్ళి బోషాణంలో పడేస్తాను" అన్నాడు కృతయుగ్.

"ఆగాగు. అప్పుడే తొందరపడితే ఎలా? పెద్దల మాట ఎన్నడూ వృథాపోదు. నాలుగు తాళపత్రాల్లోని లేఖసారాంశమే చదివి వినిపించాను. ఇంకా రెండు తాళపత్రాలున్నాయి. క్లుప్తంగా అవి కూడా చెప్తాను విను. ఎందుచేతో గాని లేఖ నకలు మాత్రమే అక్కనాచార్యుడికి పంపించారు శంభులింగయాచారి. మిగిలిన రెంటినీ రహస్యంగా ఉంచాడు. చదువుతా విను.

నిధి విషయమందు స్వయం నిర్ణయాధికారం తనదే అయిననూ ప్రభువు తుదికోరికననుసరించి నిధిలో ఒకవంతు ఈ నిధిని నిక్షిప్తం చేయబడిన ఆలయాల సముదాయపు పునరుద్ధరణకు, మరో వంతు చుట్టుపక్కల ఆలయాల పునరుద్ధ రణకు, మూడోవంతు తమ వారసులకు, మిగిలిన నాలుగోవంతు స్థపతుల వంశ వారసులకు సర్వహక్కులు ఉండు.

ఇట్లు
ఆచారి శంభులింగయాచారి
నామధేయులు

అంటూ చదివి వినిపించింది స్నిగ్ధ. “ఓ.కె. కృతా... లీవిట్. ఇక ఈ విషయాన్ని పక్కన పెడదాం. రాగిరేకులోని విషయాల్ని మనమింకా చర్చించాల్సి వుంది” అంటూ గుర్తుచేసింది. తల ఊపి లేచాడు కృతయుగ్.

“ఎక్కడికి?” అడిగింది స్నిగ్ధ.

“టైమ్ పదకొండు దాటింది. ఫోన్‌చేసి కాఫీ చెప్తాను. ఈ లోపల నీ లవ్‌లీ గోల్డెన్ రేబిట్స్ గొడవపడుతున్నట్టున్నాయి చూడు” అంటూ కార్నర్‌లోని లాండ్‌లైన్ రిసీవర్ అందుకుని రిసెప్షన్‌కి ఫోన్‌చేశాడు కృతయుగ్.

స్నిగ్ధ లేచివెళ్ళి కుందేళ్ళ జంటకు క్యారట్ దుంపలు వేసి, డిష్‌లో నీరుపోసి వచ్చింది. రూమ్‌బోయ్ కాఫీ ఫ్లాస్కు, రెండు కప్పులుతెచ్చి ఉంచాడు. పనిలో పనిగా భోజనం కేరియర్‌కి ఆర్డర్ చేస్తూ ఒంటిగంటకు తీసుకురమ్మని చెప్పి డోర్ క్లోజ్ చేశాడు కృతయుగ్.

చెరో కప్పు కాఫీ తాగగానే కొత్త ఉత్సాహం ఏర్పడింది. రాగిరేకు అందుకుని పరిశీలించాడు. ఓ మూలగా కత్తిరించబడిన రేకు. దానిమీద గుర్తులు గాని, ప్రాకృతంలోని ఆ భాషగాని ఏమీ అర్థంకాలేదు కృతయుగ్‌కి.

“అది నీకర్థంకాదుగాని ఇది చూడు” అంటూ ఒక పేపర్ చార్ట్‌ని అతడి ముందుంచింది స్నిగ్ధ.

ఓ పక్క తాళపత్రాల్ని అనువదించటం, మరోపక్క ఈ చార్ట్ తయారు చేయటం అంటే రాత్రంతా మేలుకొని ఆమెపడిన శ్రమ ఏమిటో అర్థమైపోతోంది. “స్నిగ్ధా! నాలాగే నీకూ మన పురాణాలు, ఇతిహాసాల మీద మంచి నమ్మకం ఉన్నట్టుంది. ఇప్పుడు జరుగుతున్న కల్పం ఏమిటో చెప్పగలవా?” చార్ట్‌ని ముందేసుకుంటూ అడిగాడు.

“శ్వేతవరాహకల్పం” వెంటనే బదులిచ్చింది. “నాలుగు యుగాల్ని మన్వంతరం అంటాం గదా. ఇప్పుడు నడుస్తున్న మన్వంతరం అధిపతి అయిన మనువు ఎవరు?”

“వైవస్వతమనువు. అందుకే దీన్ని వైవస్వతమన్వంతరం అని అంటారు. ఇతను సూర్యకుమారుడు, యమధర్మరాజు సోదరుడు”

“వెరీగుడ్. రానున్న మన్వంతరం పేరు ఏమిటి?”

“సూర్య సావర్ణి మన్వంతరం”

“అబ్బో మొత్తానికి పురాతత్వశాఖ అమ్మాయివి అన్పించావ్. ఓ.కె. ఈ చార్ట్‌లో చూస్తుంటే పెద్ద దీర్ఘ చతురస్రం కన్పిస్తోంది. ఇక్కడ ఈ మూలగా ఎడంపక్క దిగువమూలనుంచి కుడిపక్క పై మూలకోణంవరకు లైను గీశావ్.

అంటే దిగువముక్క పీటర్ తెచ్చిన రాగిరేకు నమూనా, పైభాగం నేనిచ్చిన రాగిరేకు నమూనాగా అనుకోవచ్చా?"

"అనుకోవడం కాదు. అదే నిజం"

"ఇక్కడ క్షిప్రానది గీత కొంత పైరేకులోనూ మిగిలింది. కిందిరేకులోనూ ఉంది"

"అవును. ఇక్కడ ఉజ్జయినీ నగరం గుర్తించబడింది చూడు" అంటూ చార్ట్‌ని ఎదురుగా ఉంచి కృతయుగ్‌కి వివరించనారంభించింది స్నిగ్ధ.

"క్షిప్రానదీతీరాన ఇది ఉజ్జయినీ నగరం. ఇక్కడి నుండి దక్షిణంగా నదివెంట మూడుయోజనాల దూరం ఎగువకు వస్తే ఇక్కడ ఉంది విష్ణుపురం. ఇక్కడే ఆదివిష్ణు ఆలయం ఉంది..."

"ఆగాగు... యోజనం అని అంటే ఎంత దూరం?"

"ఎనిమిదివందల ధనువుల దూరం. ధనువు అంటే బాణం. ఆ దూరాన్ని ఒకమైలు అంటారు. అలాంటి రెండుమైళ్ళ దూరం ఒక క్రోసు, అలాంటి నాలుగు క్రోసులు అంటే ఎనిమిది మైళ్ళ దూరాన్ని ఆమడ అంటారు.

అలాంటి నాలుగు ఆమడలదూరం ఒకయోజనంగా ఆ కాలం లెక్క"

"అంటే ఉజ్జయినికి దక్షిణంగా క్షిప్రానదిమీద సుమారు వందమైళ్ళ దూరంలో విష్ణుపురం అనే ఊరు ఉండాలి. అంతేగా?"

"అవును. ఈ గుర్తులు సరిగా గమనించు. ఇక్కడ నది రెండుపాయలుగా చీలి దిగువన కలుస్తూ చిన్న ఐలాండ్ ఏర్పడుతోంది. ఆ దీవిమీద ఆదివిష్ణు ఆలయ నిర్మాణం జరగ్గా నదికిరు వంకలా విష్ణుపురం ఊరు వ్యాపించి విస్తరించి వుండేది"

"వెరీ ఇంట్రెస్టింగ్. ఈ విష్ణుపురం ఇప్పటికీ ఉందంటావా? ఉన్నట్టుగా వినలేదు"

"నేనూ వినలేదు. అసలీ ఆలయాల నిర్మాణమే చాలా విచిత్రంగా జరిగి నట్టుంది. చుట్టూ అష్టలక్ష్ములను కొలువుతీర్చి మధ్యలో విష్ణుమూర్తినుంచిన ఆలయ నిర్మాణాల గురించి నేను ఇంతవరకు వినలేదు. ఈ మార్కు చేసిన ప్రాంతాల్ని గమనించు... నా అభిప్రాయం ప్రకారం ఆలయం తూర్పుముఖంగా నిర్మించబడివుండాలి.

ఈ ఆదివిష్ణు ఆలయంచుట్టూ క్రోసునుండి ఆమడదూరాల పరిధిలో అష్టదిక్కులందు అష్టలక్ష్ముల ఆలయ నిర్మాణం జరిగివుండాలి.

ఆదివిష్ణు ఆలయానికి ఎదురుగా ఎనిమిది మైళ్ళ దూరంలో ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయం, అటు నుండి ఎడంగా రెండుమైళ్ళ దూరంలో విద్యాలక్ష్మి, నాలుగు మైళ్ళ దూరంలో ధైర్యలక్ష్మి–

ఆరుమైళ్ళ దూరంలో గజలక్ష్మి, సరిగ్గా ఆదివిష్ణు ఆలయం వెనుక భాగంగా ఎనిమిది మైళ్ళదూరాన సంతానలక్ష్మి ఆలయం, ఆరుమైళ్ళదూరంలో ధనలక్ష్మి, నాలుగుమైళ్ళదూరంలో ధాన్యలక్ష్మి, రెండుమైళ్ళదూరాన విజయలక్ష్మి ఆలయాలనిర్మాణం సాగింది.

ఆ యా ఆలయాల వద్ద గ్రామాలు వెలిశాయి. ఆదిలక్ష్మి టెంపుల్ ఉన్న ఊరు ఆదిపురమని, విద్యాలక్ష్మి ఉన్న ఊరు విద్యాపురమని, అలాగే ధైర్యపురి, గజపురి, సంతానపురి, ధనపురి, ధాన్యపురి, విజయపురి నామాలతో ఆ ఊళ్ళు పిలవబడేవి.

అంటే అష్టదళాకారంలో అష్టలక్ష్ముల ఆలయాలు, మధ్యలో ఆదివిష్ణు ఆలయం. ఇక ఇందులో నిధి నిక్షిప్తం చేయబడిన చోటు ఏది అనేదానికి శంభులింగయాచారి ఒక సూచన చేశాడు"

"ఆగాగు డియర్..." అంటూ ఆమె మాటలకు అడ్డువచ్చాడు కృతయుగ్.

"ఏమిటి? నా ఎక్స్‌ప్లనేషన్ అర్థంగావటంలేదా?" అడిగింది స్నిగ్ధ.

"అర్థంగాకే. బుర్ర తిరిగేంత స్పష్టంగా అర్థమవుతోంది. ఇంతకీ నిధి నది మధ్యలోని దీవిమీదే ఉందా మరోచోటా?"

"అక్కడికే వస్తున్నానుగదా. తొందరపడతావేం? అది కనిపెట్టడం అంత సులువుకాదు"

"అంటే ఈ ఆధారాలు చాలవా?"

"సరిపోతాయి. ఆలయం ఉన్నదున్నట్టు ఉంటే. ఇప్పుడక్కడ ఆలయమే లేదనుకో. అదే సమస్యవుతోంది"

"ఎలా?"

"ఈ ఆరో తాళపత్రంలోను, మొదటి రాగిరేకు భాగంమీద రాతల్నిబట్టి నిధి నిక్షిప్తం చేయటానికి రెండు మూడు తరాల ముందునుంచే దీనిపై ఉన్న ప్రసిద్ధ ఆలయం ఆదివిష్ణుఆలయం.

కాబట్టి నిధి దాచటం కోసం ఆలయ ఆవరణ ప్రాంతంలో ఎలాంటి తవ్వకాలుజరిపి నలుగురికీ తెలియకూడదన్నది అప్పటి భోజరాజు లేదా వాస్తు సిద్ధాంతుల అభిప్రాయం కావచ్చు. కాబట్టి ఆలయం వెలుపల నైరుతి భాగంలో తవ్వకాలు జరిపి నేలమాళిగలు నిర్మించివుండవచ్చు నైరుతి కుబేరస్థానం.

గ్రీష్మఋతువులో ఆలయం పశ్చిమదిక్కు గాలి గోపురం నీడ నైరుతివైపు సాగినప్పుడు గోపుర విమానం నీడ ఉదయం ఎక్కడ పడుతుందో చూసి అక్కడ ఆరు ధనువుల లోతు తవ్వకం జరిపితే అంటే సుమారు పదడుగుల లోతులో ఒక కవాటం కన్పిస్తుంది.

దీన్ని తెరిస్తే నేలమాళిగలోకి మెట్లదారి కన్పిస్తుంది. అక్కడికి ఇరవై ధనువుల లోతు అనగా ముప్ఫై అడుగులు, పై పది కలిపి మొత్తం నలభై అడుగుల లోతులో ఉన్న నేలమాళిగలో నిధి దాచబడివుండవచ్చు"

"ఆగాగు... అంటే గాలిగోపురం ఇప్పుడు లేదనుకో. నైరుతిలో ఎక్కడ తవ్వకాలు జరపాలో తెలీదు. అంతేగా?" అని అన్నాడు.

"అవును. అయితే ఇంకో మార్గం కూడా సూచింపబడింది"

"ఏమిటది?" అనడిగాడు.

"గ్రీష్మఋతువు అంటే మండు వేసవికాలం. క్షిప్రానదిలో నీరు తక్కువగా ఉన్న కాలం. ఉజ్జయిని నుంచి ఆరు పడవల్లో రాత్రివేళ రహస్యంగా ప్రయాణిస్తూ నిధిని పడవలమీద విష్ణుపురం తెచ్చారు.

నదివైపునుండి నేలమాళిగలోకి ఒక మార్గం ఏర్పరచివుంచారు. ఆ మార్గంగా పడవల్లోని నిధిని భూగృహంలోకి మార్చాక ఆ దారిని శాశ్వతంగా మూసేశారు. ప్రస్తుతం ఆ మార్గాన్ని కనిపెట్టి పగలగొట్టినా లాభం ఉండదు. క్షిప్రానది నీరు లోపలికి ప్రవేశించి నేలమాళిగ మొత్తం జలమయమైపోతుంది. కాబట్టి అది అనుకూలం కాదు. మొదటి మార్గాన్నే అన్వేషించాలి"

స్నిగ్ధమాటల్ని శ్రద్ధగా విన్నాడు కృతయుగ్. "నువ్వు చెప్పింది బాగానే ఉంది. ఆలయం శిథిలమైపోతే మొదటి మార్గం కనిపెట్టడం అసాధ్యం. అయినా నాకో సందేహం..." అన్నాడు.

"ఏమిటా సందేహం?" అంది స్నిగ్ధ.

"ఒక ఆలయానికి ఒకే ధ్వజస్తంభం, ఒకే గాలిగోపురం కదా ఉండాలి. అసలు ఎన్ని గోపురాలు ఉంటాయి?" "నువ్వు పురాతన ప్రసిద్ధ ఆలయాల్ని గమనించి వుండవు. చిన్నగుళ్ళకు గాలిగోపురం ఒకటే ఉంటుంది. కాని శ్రీశైలం, రామేశ్వరం, శ్రీరంగం, తిరుపతి, కంచి వంటి క్షేత్రాలు చూస్తే అర్థమవుతుంది. నాలుగు దిక్కులా నాలుగు గాలిగోపురాలుంటాయి.

ఆగమశాస్త్రం ప్రకారం ప్రసిద్ధిచెందిన పుణ్యక్షేత్రాల్లో మనం వీటిని చూడొచ్చు. నాలుగుదిక్కులా నాలుగు గాలిగోపురాలు, నాలుగు తిరువీధులు ఉంటాయి. దీనిక్కారణం కూడా చెప్తాను.

ఆ కాలంలో క్షత్రియరాజుగాని, రాజైన అన్యకులస్థుడుగాని విధిగా నలుగురు స్త్రీలను వివాహం చేసుకోవాలి. ఆ నలుగురూ నాలుగు జాతులకు చెందినవారైవుంటారు.

క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్య, శూద్రజాతుల స్త్రీలు. క్షాత్రవం, వారసత్వం, సంతానం కోసం, మంత్రాంగం చెప్పటంకోసం క్షత్రియకన్య, వైదిక మతాచారాలు, దైవపూజల గురించి వివరించేందుకు బ్రాహ్మణ కన్య, రాజ్యంలో వ్యాపారాలు, పన్నులు మొదలైనవాటిలో తగిన సంప్రదింపులకోసం వైశ్యకన్య– ఈ పై మూడు జాతుల కన్యలకు దాసీలచేత సపర్యల విషయంలో అజమాయిషీ కోసం శూద్రకన్య– ఇలా నలుగుర్నీ వివాహం చేసుకునేవాడు రాజు.

ఈ నలుగురూ ఆలయానికి వచ్చినప్పుడు ప్రధానవీధిగుండా మహారాజు, పట్టపురాణితో ప్రధాన గాలిగోపుర మార్గంలో ఆలయప్రవేశం చేయగా, మిగిలిన ముగ్గురూ వారివారికి కేటాయించబడిన మార్గాలగుండా ఆ యా గోపురమార్గాల్లో ఆలయంలో ప్రవేశించాలి.

పూజల అనంతరం అవే మార్గాలగుండా తిరిగి వారు నిష్క్రమించేవారు. ఊరేగింపు సమయాల్లో ఈ నాలుగుమార్గాల వెంట స్వామిని ఊరేగిస్తారు.

ఈ నాలుగు వీధులే తిరుమాడవీధులు. వీటిలో ప్రధాన గాలిగోపురం కన్నా మిగిలిన మూడు గోపురాలు కొంత తక్కువ ఎత్తు కలిగివుంటాయి. ఆలయ ప్రహరీని ఆనుకొనే వీధులు వెలుపలపక్క ఉంటాయి"

స్నిగ్ధ వివరణ విని అర్థమైనట్టు తలపంకించాడు కృతయుగ్. "ఓ.కె. నిధికి మార్గం తెలియాలంటే అక్కడ గోపురం ఉండాలి. ఒకవేళ లేదంటే మరో మార్గం అన్వేషించాలి! అంతేగా?" అనడిగాడు.

అవునన్నట్టు తలూపింది స్నిగ్ధ.

"ప్రాభవం తగ్గటంచేత ఊరుపేరు లేకుండా శిథిలావస్థలో ఉండొచ్చేమోగాని మొత్తం నాశనమైవుంటాయని అనుకోను. అయినప్పటికీ ఈ నిధి విషయంలో నీకు ప్రత్యర్థులున్నారని, వారినుంచి ప్రమాదం పొంచివుంటుందనీ మర్చిపోకు. మీ డిపార్ట్‌మెంట్ సహకారంతోనే అన్వేషణ ఆరంభించటం మంచిది"

"ఇప్పుడే కాదు, లొకేషన్ చూసి గుర్తించిన తర్వాత అప్పుడు ప్రాజెక్టును సబ్మిట్ చేసి అనుమతి తీసుకోవాలి. టైమ్ పడుతుంది" చెప్పింది.

"ఓ.కె. ఎప్పుడు వెళ్తున్నావ్?"

"వెళ్ళటం ఏమిటి? నువ్వు రావా?"

"నా ట్యాక్సీ నాకుంది. లైఫ్ హ్యాపీగా ఉంది. అనవసరంగా రిస్క్‌లో పడ్డం ఎందుకు? నాకు ధనాపేక్షలేదు. నువ్వు, మీ డిపార్ట్‌మెంట్ వాళ్ళు వెళ్ళండి"

"నీకు ధనాపేక్ష లేకపోయినా, నిధిలో నాలుగోవంతు షేర్ నీది. ఆపైన నువ్వు పక్కన లేకుండా ఇంత సాహసం చేయలేను. నువ్వు నాతో వస్తున్నావ్ అంతే. ఇంకేం మాట్లాడకు" కృతయుగ్ ఏదో చెప్పబోయాడు...

తలుపు చప్పుడైంది. టైం ఒంటిగంట. రూమ్‌బోయ్ భోజనం తెచ్చినట్టున్నాడు. స్నిగ్ధ గబగబా రాగిరేకు, పేపర్లు అన్నీ టేబుల్ సొరుగులో దాచేసింది.

కృతయుగ్ వెళ్ళి తలుపు తీశాడు.

భోజనం క్యారియర్ రెండు ప్లేట్లు, కూలింగ్ వాటర్ బాటిల్స్ తెచ్చి టీపాయ్ మీద ఉంచి వెళ్ళిపోతూ తలుపు మూశాడు బోయ్. "సో... నువ్వు నాతో హైదరాబాద్ వచ్చేస్తున్నావ్!" అడిగింది స్నిగ్ధ.

"ఓ.కె. నిధికోసం కాకపోయినా నీకోసం వస్తాను. ఐ లవ్ యూ" అంటూ ఆమెను ప్రేమగా దగ్గరకు తీసుకుని పెదవులు గాఢంగా చుంబించాడు.

"ఐ లవ్ యూ టూ కృతా. నువ్వు నా పక్కన లేకపోతే ఏమీ సాధించలేను" అంటూ కౌగిలి బిగించి జుట్టు నిమిరి ముద్దులిచ్చింది స్నిగ్ధ.

ఇద్దరూ భోజనం చేశారు. "ఓ పనిచేద్దాం. నాతోపాటు నువ్విక్కడుండి నువ్వు చేసేదేమీ లేదు. సాయంత్రం హైదరాబాద్ బస్ ఎక్కిస్తాను వెళ్ళిపో.

నేను ఇక్కడ పనులు చూసుకుని వారంరోజుల్లో హైదరాబాద్ వస్తాను. ఈ లోపల ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లు అవీ చూసుకో. ఏమంటావ్."

"నువ్వు చెప్తే ఓ.కె. బట్ నిజంగా నువ్వు వస్తావ్ గదా?" అంది స్నిగ్ధ.

"నీకోసం వస్తా... అన్నట్టు స్నిగ్ధా, ఒక ముఖ్యమైన విషయం నీకు చెప్పాలి"

"ఏ విషయం?"

"నీ అనుమానం నిజమే. ఆ రోజు పీటర్ గ్రూప్‌ని ఫోన్‌లో కంట్రోల్ చేసింది ముగ్ధ. నువ్విచ్చిన నంబర్‌కి ఫోన్ చేశాను. తన అసలు పేరు కాంచన.

తను కన్పిస్తే బి కేర్‌ఫుల్. ఎట్టి పరిస్థితిలోను ఈ రెండో రాగిరేకు రహస్యం మనిద్దరిమధ్యనే ఉండాలి. మూడో మనిషికి తెలీకూడదు.

మీ డిపార్ట్‌మెంట్‌కి కూడా. అందువల్ల శత్రువులు పెరిగే అవకాశం ఉంది" హెచ్చరించాడు.

"ఓ.కె. డిపార్ట్‌మెంట్‌కి చెప్పను. ఎవరికీ చెప్పను" అని ఆలస్యం చేయకుండా తన ఎయిర్‌బ్యాగ్ సర్దుకుంది స్నిగ్ధ. తన దుస్తులు అవీకూడా తన ఎయిర్‌బ్యాగ్‌లో సర్దుకున్నాడు కృతయుగ్.

కుందేళ్ళజంటవున్న బోను అందుకుంటూ ఎయిర్‌బ్యాగ్ భుజాన వేసుకున్నాడు.

సుమారు మూడు గంటల ప్రాంతం. హోటల్‌రూమ్ ఖాళీచేసి కౌంటర్‌లో బిల్లు పేచేసి రోడ్డుమీదికి వచ్చారు. అర్ధగంట వెయిట్ చేశాక విజయవాడ నుండి హైదరాబాద్ వెళ్ళే బస్ వచ్చింది.

స్నిగ్ధకు మరోసారి జాగ్రత్తలు చెప్పి బస్ ఎక్కించాడు. బస్ కదలగానే అటుగా వచ్చిన ఆటో ఎక్కి మున్నలూరు బయలుదేరాడు కృతయుగ్.

* * * * *

నలుగురు మనుషుల్ని వెంటబెట్టుకొని బసవడు ఉజ్జయిని వెళ్ళాడుగదా! వెళ్ళిన అయిదో రోజున తన బాస్ ఆత్మకూరు అన్నారావుకి ఫోన్ చేశాడు.

"ఏరా! మీరంతా ఇప్పుడు ఎక్కడున్నారు?" అడిగాడు ఆత్మకూరు అన్నారావు.

"ఉదయమే ఉజ్జయిని చేరుకున్నాం సార్"

"ఆచూకీ ఏమన్నా తెలిసిందా?"

"లేదు సార్. ఎవరినడిగినా మీరు చెప్పిన విధంగా ఆలయాల గురించి తెలీదంటున్నారు. నదివెంట కూడా ప్రయాణించి గాలించాం. లాభం లేకపోయింది"

"మరోసారి తిరిగిచూడండి" కూల్‌గా హెచ్చరించాడు అన్నారావు.

"అదికాదు సార్"

"ఇంకేం చెప్పకు. నేను చెప్పింది చేయండి. మీరు గాలిస్తూనేవుండాలి. ఎక్కడో చోట ఏదో ఒక ఆధారం దొరక్కపోదు. అంతవరకు మీరు అక్కడే ఉండాలి. డబ్బు చాలకపోతే ఫోన్ చెయ్యి. రిజల్ట్ కావాలి. డూ వాటెసే" అంటూ ఫోన్ పెట్టేశాడు కోపంగా.

"ఏమంటున్నాడు?" అక్కడే ఉన్న మంత్రవాది అనంతస్వామి అడిగాడు.

"ఇంతవరకు ఆలయాల ఆచూకీ లభించలేదంటున్నాడు"

"లభిస్తుంది. అయితే కొంత సమయం పడుతుంది. ప్రధాన ఆలయమైన ఆదివిష్ణు ఆలయం నదీతీరాన ఉండాలి. కాబట్టి నదివెంట గాలింపు కొనసాగిస్తే ఫలితం ఉంటుంది. బసవడికి ఫోన్ చేసి చెప్పండి" అంటూ సలహా ఇచ్చాడు అనంతస్వామి.

* * * * *

బయటకు బయల్దేరుతుండగా స్నిగ్ధ సెల్‌మోగింది. ఆమె హైదరాబాద్ వచ్చేసి వారంరోజులైంది. అవతల లైన్లో ఉంది కృతయుగ్. ఆమె ముఖం వికసించింది.

"చెప్పు. ఎప్పుడు వస్తున్నావ్...?" ఆమె అడిగిన మొదటి ప్రశ్న ఇది.

"ఏయ్. నువ్వు ప్రశ్నలు మింగి తర్వాత పుట్టావా ఏమిటి? ఎత్తిందే ఎప్పుడొస్తున్నావంటూ దబాయిస్తావ్. నేను రావటంలేదు. ఇది చెప్పటానికే ఫోన్‌చేశాను"

"డోంట్‌వర్రీ. నీది అదే నిర్ణయం అయితే ఈసారి నేరుగా భద్రాచలం వచ్చి బామ్మదగ్గర పంచాయితీ పెడతాను. ఫరవాలేదంటే చెప్పు"

"అంతపని చేయకు. తమాషాకి అన్నాను. నిజానికి నేను ఆల్రెడీ గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో ఉన్నాను"

"నిజంగానా?"

"అవును డియర్. పదిగంటల ఫ్లైట్‌కి హైదరాబాద్ వస్తున్నాను. ఎయిర్ పోర్ట్‌లో దిగ్గానే ఫోన్ చేస్తాను"

"నేను ఎయిర్‌పోర్ట్‌కి వస్తున్నాను"

"వద్దు. నేను హోటల్లో దిగాక ఫోన్ చేస్తాను"

"నథింగ్ డూయింగ్. నువ్వు మా ఇంటికి వస్తున్నావ్ అంతే" అంది స్నిగ్ధ.

"స్నిగ్ధా ప్లీజ్..."

"ష్... ఇంకేం చెప్పకు. నాకన్నా ముందే డాడీ మమ్మీకి నీ గురించి చెప్పేశారు. నిత్య నీ గురించి గొప్పగా పొగిడేసింది. దాన్ని కాపాడావ్ గదా. దాంతో కాబోయే అల్లుడ్ని చూడాలని మమ్మీ గొడవ చేస్తోంది. నువ్వు బయట హోటల్లో దిగి నా పరువు తీయకు. నువ్వొస్తున్నావని తెలిస్తే నిత్య నావెంట పడుతోంది"

"ఓ.కె... ఓ.కె. నిత్యతో ఇప్పుడే చెప్పకు. నువ్వు మాత్రం ఎయిర్‌పోర్టుకి రా. అన్నట్టు బంగారుకుందేళ్ళు ఎలా ఉన్నాయి?" అన్నాడు కృతయుగ్.

"ఆ విషయం నిత్యనడగాలి. ఇప్పుడు వాటిని తనే చూసుకుంటోంది" అంది స్నిగ్ధ.

"ఓ.కె. ఎయిర్‌పోర్ట్‌లో కలుద్దాం. సీయు"

"కృతా నాకోసం ఏం తెస్తున్నావ్?"

"నేను వస్తున్నాను చాలదా?"

నవ్వేస్తూ లైన్ కట్ చేసింది స్నిగ్ధ.

*   *   *   *   *

ధుమధుమలాడుతూ బయటికి వస్తున్న కూతుర్ని చూసి హాల్లోనే ఆగిపోయాడు అన్నారావు. కాంచన ముఖం కోపంతో కందగడ్డలా ఉంది. ఆమె వెనకే వస్తున్న మహీధర్‌ని చూడగానే ఈ వెధవ మళ్ళీ ఏదో కెలికినట్టున్నాడు.

దీని చేతిలో తన్నులు తింటేగాని బుద్ధిరాదు వీడికి అని మనసులోనే విసుక్కుంటూ కూతురువంక ఏమైందన్నట్టుగా చూశాడు అన్నారావు. జీన్స్‌ప్యాంట్, టీషర్టు ధరించింది. ఛాతీకి అడ్డంగా స్ట్రాప్‌కి వ్రేలాడుతూ నడుంమీద వేనిటీ బ్యాగు. అసలే కాలుబారు యువతి. పలకబాడీ.

కాస్త రంగు తక్కువగాని జక్కనాచార్యుడు చెక్కిన హంపీశిల్పంలా మతిపోయే అందం తనది.

"డాడీ, మీ మేనల్లుడికి చెప్పండి ఇంకెప్పుడూ నా జోలికి రావద్దని" అంది వస్తూనే కోపంగా.

"బావే కదమ్మా, అసలేమైంది?" కూపీ లాగుతున్నట్టుగా అడిగాడు అన్నారావు.

"బావ కదా అని మర్యాదిస్తున్నాను. అది కాపాడుకోమని చెప్పండి. ఇంతకుముందూ మీకు చెప్పాను. ఇప్పుడూ చెప్తున్నాను. తనంటే నాకిష్టంలేదు. నేను బావను పెళ్ళిచేసుకోను. అర్థమైందిగదా!

అయినా కూడా వేధింపులేమిటి? ఎందుకు పెళ్ళి చేసుకోవు, ఎవర్ని చేసుకుంటావు, నీ మనసులో వాడెవడు అంటూ నన్ను గుచ్చిగుచ్చి అడగాల్సిన అవసరం తనకు లేదు. తన లిమిట్స్‌లో తనుండాలి.

లేదంటే తర్వాత పరిణామాలకు నేను బాధ్యురాల్ని కాను" అంటూ స్ట్రాంగ్‌గా హెచ్చరించింది.

ఎక్కడివాళ్ళక్కడ షాకై నిలబడిపోయారు.

కాంచన ఇంత ఘాటుగా స్పందించటం ఇదే మొదటిసారి. హాలు దాటబోతూ ఆగి తలతిప్పి తండ్రిని చూసింది కాంచన.

"డాడీ, నా ఫ్రెండ్ మహేశ్వరి హైయర్ స్టడీస్‌కి లండన్ వెళ్తోంది. సెండాఫ్ ఇవ్వటానికి ఎయిర్‌పోర్ట్‌కి వెళ్తున్నాను. రావటం ఆలస్యమవుతుంది" అని చెప్పి చరచరా బయటకు వెళ్ళిపోయింది.

మేనమామచేత నాలుగు చివాట్లు తీసుకుని తనూ కోపంగా బయటి కొచ్చాడు మహీధర్.

అదే సమయంలో బైక్ దిగి లోనకొస్తున్న పీటర్‌ని చూడగానే మహీధర్ ఆలోచనలు మారిపోయాయి. కోపం పోయింది. "పీటర్, అలా బయటికి వెళ్ళొద్దాం. నాతోరా" అంటూ తన కారు డోర్ తెరిచాడు.

"ఇప్పుడా... నేను రాను. బాస్‌తో మాట్లాడాలి" అన్నాడు పీటర్.

"వచ్చాక మాట్లాడొచ్చులేరా. రా చెప్తాను" అంటూ వాడ్ని లాగి సీట్లోకి తోసి డోర్ మూశాడు. రెండోపక్క డోర్ తెరిచి స్టీరింగ్ అందుకుని స్టార్ట్ చేశాడు.

"ఇంతకీ ఎక్కడికో చెప్పరేంటి సార్... పొద్దుటే వేళాకోళం ఏంటి?" విసుక్కున్నాడు పీటర్.

బదులుగా డాష్‌బోర్డు లాగి విస్కీబాటిలు, చిప్స్ ప్యాకెట్టు తీసిచ్చాడు. మందు చూస్తే పీటర్‌కి మనసాగదు. మూత తీసి సరుకు రెండు గుక్కలు తాగి చిప్స్ నోట్లో వేసుకుని మహీధర్‌వంక చూశాడు.

అప్పటికే కారు సిటీ వీధుల్లో పరుగుతీస్తోంది.

"విషయం లేందే నన్నిలా తీసుకురారని తెలుసు. ఏంటి సంగతి?" చిప్స్ నములుతూ ఎంతో ఆసక్తిగా ఉత్సాహంగా అడిగాడు పీటరు.

"తెలివైనవాడివిరా. ఊహించగలిగావ్. నాకు కొంత ఇన్ఫర్మేషన్ కావాలి. చెప్తే డబ్బు ఇస్తాను" చెప్పాడు మహీధర్.

"అడుగు. నాకు తెలిస్తే చెప్తాను"

"ఏంలేదు. దంతెవారా నుంచి వచ్చినప్పట్నుంచీ కాంచనలో చాలా మార్పు వచ్చింది. నన్ను పెళ్ళిచేసుకోనని తెగేసి చెప్పింది"

"అలాగా. తనెవరినన్నా ప్రేమించిందేమో" అన్నాడు పీటర్.

"ఆ ఎవరో నీకు తెలియాలి. ఆమె వెంట దంతెవారా వెళ్ళింది మీరేగదా!" అన్నాడు మహీధర్.

"ఓహో... అలా వచ్చారా. కాని నాకు తెలిసి అలాంటిదేమీ లేదే"

"బాగా ఆలోచించు..."

"ఆగాగు... ఎస్. నా అనుమానం కరెక్టయితే ఆ ట్యాక్సీ డ్రయివర్ అయివుంటాడు"

"ట్యాక్సీ డ్రైవరా!"

"అవును. డొక్కు అంబాసిడర్ తోలుతూ టూరిస్ట్ గైడ్‌గా కూడా వ్యవహరిస్తాడు. మనిషి చాలా బాగుంటాడు. చెప్తే నమ్మరుగాని సార్... భయమంటే ఏమిటో వాడికి తెలీదు. ఆ ప్రాంతంలో వాడికి తెలీనివాడులేడు. మంచికి మంచి చెడుకు చెడు– అదీ వాడి పాలసీ.

పదిమందినైనా కలేసి కొట్టేస్తాడు. మహామొండి. మార్షల్ ఆర్ట్స్ తెలిసిన ఫైటర్"

"అంటే కాంచన, వాడు ప్రేమించుకున్నారు అంటావా?" అడిగాడు మహీధర్.

"అలా చెప్పను. ఎందుకంటే ఆధారాల్లేవుగదా. కాని ఛాన్సెస్ ఉన్నాయం టాను. వాడ్ని చూస్తే ఏ అమ్మాయైనా ఇట్టే పడిపోవాలసిందే" అంటూ బాటిల్ ఖాళీ చేసి పక్కనపడేసి చిప్స్ నోట్లో వేసుకున్నాడు పీటర్. మహీధర్ ఆలోచనల్లో మునిగిపోయాడు.

తనకు తెలిసి హైదరాబాద్‌లో ఆమె ఎవరినీ ప్రేమించిన సమాచారం లేదు. కాబట్టి పీటర్ చెప్పిందే నిజం కావచ్చేమో. అసలిప్పుడు ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళటం వాడికోసం కాదుగదా! "వాడి పేరేమిటి?" అడిగాడు.

"కృతయుగ్"

"నైస్ నేమ్. ఎక్కడివాడు?"

"భద్రాచలం అని విన్నాను సార్... నాకు మందు చాల్లేదు. బ్రాందీషాపు దగ్గర కారాపాలి"

"ప్రస్తుతం తాగింది చాలు. పగటిపూట ఎప్పుడూ ఎక్కువ తాగకు. వెళ్ళేప్పుడు కొనిస్తాను. అప్పటికి తాగింది దిగుతుంది."

"ఎక్కడికెళ్తున్నాం సార్?"

"ఎయిర్‌పోర్ట్‌కి"

కారుని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ దిశగా మళ్ళించాడు మహీధర్.

*　　*　　*　　*　　*

కాంచన ఫ్రెండ్ మహేశ్వరి ఆమె పైచదువులకి లండన్ వెళ్తున్నమాట నిజమే. బాంబే నుండి రాత్రికి డైరెక్ట్ లండన్ ఫ్లైటుంది. ప్రస్తుతం బాంబే ఫ్లైట్‌కి ఎయిర్‌పోర్ట్‌కి వచ్చింది.

ఆమెకు సెండాఫ్ ఇవ్వటానికి కుటుంబసభ్యులు, స్నేహితులు చాలామంది వచ్చారు.

కాంచన కూడా వచ్చింది. మహేశ్వరి ఫ్లైట్ ఎక్కగానే అంతా వెనుతిరిగారు. షెడ్యూల్ టైమ్‌కి గంట ఆలస్యంగా బయలుదేరింది ఫ్లైట్.

వెనుతిరిగివస్తున్న కాంచన టెర్మినల్స్ బయటకి వస్తూ అక్కడ ఎవరికోసమో ఎదురుచూస్తున్న యువకుడ్ని చూసి ఎవరో పట్టి ఆపినట్టు ఆగిపోయింది.

బంధాలు వేసినట్టు పాదాలు ముందుకు కదలమని మొరాయించాయి. ఒక్క క్షణం– ఒకే ఒక్క క్షణం అది కలో నిజమో అర్ధంకాలేదామెకు. తన కళ్ళను

నమ్మలేనట్టు కళ్ళు నులుముకొని మరీ చూసింది. సందేహం లేదు. అతను కృతయుగ్.

భుజాన చిన్న ఎయిర్‌బ్యాగ్, కుడిచేతిలో లగేజ్ కేరియర్ బ్యాగ్‌తో ఎవరికోసమో ఎదురుచూస్తున్నాడు.

ఎక్కడో భద్రాచలం ప్రాంతంలో ట్యాక్సీలో తిరిగే కృతయుగ్ ఇక్కడ హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో– ఇప్పుడే ఫ్లైట్ దిగి వస్తున్నట్టున్నాడు.

పూర్ణచంద్రుడి రాకతో ఉప్పొంగే కడలిలా ఆమె మనసు సంతోషంతో ఉప్పెనవుతుండగా ఒక్క దూకులో అటు పరిగెత్తింది. పరిసరాల్ని మర్చిపోయింది.

వచ్చీరావటమే సుడిగాలిలా తనను చుట్టేసుకుని బుగ్గ ముద్దాడిన కాంచనను చూడగానే కృతయుగ్‌కి పెద్ద షాక్. హైదరాబాద్ రాగానే ఎప్పుడో ఎక్కడో తను ఎదురుపడొచ్చనుకున్నాడుగాని తన రాక ముందే తెలిసినట్టు ఇలా ఎయిర్‌పోర్ట్‌లోనే తారసపడుతుందని ఊహించలేదు. నిజానికి అతన్ని రిసీవ్ చేసుకోడానికి అరగంట ముందే స్నిగ్ధ ఎయిర్‌పోర్ట్‌కొచ్చింది.

అతన్ని రిసీవ్ చేసుకుంది. ఆమె కారు తీసుకురావటానికి పార్కింగ్‌వైపు వెళ్ళటంతో లగేజ్‌తో అక్కడ నిలబడ్డాడు కృతయుగ్.

ఈ టైమ్‌లో మబ్బులేని పిడుగులా కాంచన ఎలా వచ్చిందో అర్థంగాక బిత్తరపోయి తేరుకునేలోపలే బిగియార కౌగిలించి అరడజను ముద్దులు పెట్టేసింది కాంచన. ఆ సమయంలో అది పబ్లిక్ ప్లేస్ అని, నలుగురూ చూస్తున్నారని కూడా ధ్యాస లేదామెకు.

ఆమె ఆనందం చూస్తేనే చాలు ఎంతగా తనను ప్రేమిస్తోందో అర్థమవుతోంది.

ఈ దృశ్యం స్నిగ్ధ కంటబడితే కొంప మునుగుతుందన్న భయంతో “కాంచన ప్లీజ్, అంతా మనల్నే చూస్తున్నారు. కంట్రోల్ యువర్ సెల్ఫ్” అంటూ సున్నితంగా ఆమెను విడిపించుకున్నాడు కృతయుగ్.

అయితే అదృష్టంకొద్దీ స్నిగ్ధ కంటపడలేదుగాని, అంత దూరంలో కార్లో ఉన్న మహీధర్, పీటర్‌ల కంటపడింది. కోపంతో పళ్ళుకొరికాడు మహీధర్.

“కృతయుగ్ నిన్ను చూస్తుంటే నాకెంత సంతోషంగా ఉందో నీకు తెలీదు. సడెన్‌గా హైదరాబాద్ వచ్చావ్. ఏమిటి విశేషం? పద మా ఇంటికి వెళ్దాం” అంది హుషారుగా.

"కాంచనా! అనుకోకుండా చిన్న పనివుండి వచ్చాను. స్నిగ్ధకు ఫోన్ చేశాను. కారు తీసుకురావటానికి వెళ్ళింది" అన్నాడు కృతయుగ్.

"ఓ.కె. తనైతే ఏమిటి, నేనైతే ఏమిటి! మేం ఇక్కడ వుండగా నీకు ప్రాబ్లమ్ లేదు. కాని మళ్ళీ నువ్వు నాకు ఫోన్ చేయలేదు. అదే బాధగా ఉంది. నేను ఫోన్ చేస్తాను. వెళ్ళేలోపు నువ్వు మా ఇంటికి రావాలి"

"ఇప్పుడు కూడా నేను ఎవరింటికీ వెళ్ళటంలేదు కాంచనా. హోటల్ నాకు కంఫర్టబుల్‌గా ఉంటుంది. వీలుపడితే నీకు ఫోన్‌చేసి మీ ఇంటికొస్తాను"

"అడ్రసు తెలీదుగా"

"నిన్నడుగుతాగా"

"అవునూ, స్నిగ్ధకు నిజం తెలిసిపోయిందా? నామీద కోపంగా ఉందా? పీటర్ వాళ్ళ విషయంలో" అంది కాంచన.

"అదేం లేదు" అన్నాడు కృతయుగ్.

ఇద్దరూ మాటల్లో ఉండగానే స్నిగ్ధ కారు తీసుకు వచ్చింది. అక్కడ కాంచనను చూసి తనూ షాకైంది. ఐతే కాంచన తను అనుకోకుండా కృతయుగ్‌ని ఎలా కలిసిందీ చెప్పటంతో రియలైజైంది.

ఫార్మాలిటీగా రెండు మాటలు మాట్లాడాక కృతయుగ్ లగేజీని వెనక సీట్లో ఉంచింది.

కృతయుగ్ ఆమెతో కారులో వెళ్లిపోయాడు. కాంచన కూడా తన కారులో వెళ్ళిపోయింది. కాని జరిగిందంతా చూస్తున్న మహీధర్‌కి బుర్ర తిరిగి, కారు స్టార్ట్ చేయలేక అక్కడే ఉండిపోయాడు. ఈసారి తనే విస్కీ సీసా దించకుండా తాగేశాడు. అప్పటికిగాని తేరుకోలేకపోయాడు అతను.

"ఏరా పీటర్ నువ్వు చెప్పిన కృతయుగ్ వాడేనా?" సిగరెట్ ముట్టించుకుని అడిగాడు.

"అవును వాడే. చూశారుగా వాడికి ఎన్ని ముద్దులిచ్చిందో. వాడితో లవ్‌లో పడిపోయాక ఇక నిన్నేం పట్టించుకుంటుందిలే" అన్నాడు పీటర్.

"మరి ఆ పిల్ల ఎవర్రా? వాడిని కార్లో తీసుకువెళ్ళింది?" అడిగాడు మహీధర్.

"ఆ పిల్ల తెలీదా. అదేమిటి మేం కష్టపడి దంతెవారా వెళ్ళి ఆ రాగిరేకులో ఏముందో రాయించుకొచ్చింది ఎవరి దగ్గరనుకుంటున్నారు?"

"అంటే ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్‌కి చెందిన స్నిగ్ధ అనే అమ్మాయి..."

"అవును ఆ అమ్మాయే ఈ అమ్మాయి"

"అదే నిజమైతే..." అన్నాడు మహీధర్.

"ఇంకో నిజం కూడా చెప్పనా?"

"చెప్పు" అన్నాడు మహీధర్.

"ఆ అమ్మాయి సాదాసీదా అమ్మాయి కాదు. సెంట్రల్ మినిస్టర్ శివప్రసాద్ గారి పెద్దకూతురు"

"ఏమిట్రా నాకంతా గందరగోళంగా ఉంది. ఆఫ్టరాల్ ఓ ట్యాక్సీ డ్రైవర్‌గాడ్ని రిసీవ్ చేసుకోడానికి కేంద్రమంత్రి కూతురు ఎయిర్‌పోర్ట్‌కి రావటం ఏమిటి? కాంచన రావటం ఏమిటి?"

"వచ్చారు. మనం చూశాం. ఇంకా డౌటేమిటి? అసలు విషయం ఇంకోటి చెప్పాలి నీకు"

"ఏమిటది?"

"ఆ స్నిగ్ధ కూడా కృతయుగ్‌ని ప్రేమిస్తోంది"

"ఆఁ!" అంటూ తెరిచిన నోరుమూయటం మర్చిపోయాడు మహీధర్.

* * * * *

రెండ్రోజులుగా దంతెవారాలో వర్షాలు పడుతున్నాయి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, పశ్చిమ బెంగాల్ ఉత్తరాంధ్ర మీదుగా ఏర్పడిన అల్పద్రోణి ప్రభావంతో ఆకాశం మేఘావృతమై ఉరుములతో కూడిన జల్లులు పడుతున్నాయి.

అప్పుడప్పుడూ ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడుతోంది. దంతెవారా సిటీలో అది మాజీ హోం మినిస్టర్ లక్ష్మణస్వామి భవంతి. దంతెవారా ప్రాంతపు స్థానిక ఎమ్మెల్యే ఆయన.

అదృష్టం బాగుండి హోం మినిస్టర్ అయ్యాడు. ఏం లాభం? కొడుకు చింటూభాయ్ చేసిన ఘనకార్యంతో పదవి, పరువు రెండూ పోయాయి.

ప్రస్తుతం ఇంటిదగ్గరే ఉన్నాడాయన. పదిరోజులు ఆస్పత్రిలో ఉన్నాక రెండురోజుల క్రితమే చింటూభాయ్‌ని ఇంటికి తీసుకొచ్చారు. నున్నగా గుండుకొట్టి తలమీద మూడు కుట్లు వేశారు.

ఒకవిధంగా చెప్పాలంటే చచ్చి బతికినమనిషి. వచ్చినప్పట్నుంచీ ఎవరితోనూ మాట్లాడ్డంలేదు. మేడమీద తన గదిలోనే ఒంటరిగా కాలక్షేపం చేస్తున్నాడు. ఎవరినీ చూడ్డానికి ఇష్టపడ్డం లేదు. జరిగింది తలుచుకుంటూ పగతో తనలో తనే రగిలిపోతున్నాడు.

ఆ రోజు ఉదయం! బయట కుండపోతగా వర్షం పడుతోంది. పార్టీ కార్యకర్తలెవరో వస్తే కింద హాల్లో కూర్చుని వాళ్ళతో మాట్లాడుతున్నాడు లక్ష్మణస్వామి.

ఆ సమయంలో! మేడమీద కొడుకు గదిలోంచి బిగ్గరగా చప్పుళ్ళు వినరావటంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారంతా.

ఇంట్లో కుటుంబ సభ్యులంతా భయపడి హాల్లోకి పరుగులెత్తుకొచ్చారు. ఏవో పగలగొడుతున్న కర్కశధ్వనులు వరసగా వినిపిస్తూనే ఉన్నాయి. పార్టీ కార్యకర్తల్ని పంపించేసి హడావుడిగా మేడమీదకు పరుగెత్తాడు లక్ష్మణస్వామి. అతడు వెళ్ళేసరికి ఉగ్రరూపంతో కన్పించాడు చింటూభాయ్.

దొరికిన వస్తువులన్నీ నేలకు విసిరికొట్టి బీభత్సం చేస్తున్నాడు. టీవీతో సహా విలువైన వస్తువులన్నీ పగిలి చెల్లాచెదురై గది కార్పొరేషన్ డంపింగ్ గ్రౌండ్‌లా ఉంది. ఒక్క దూకులో వెళ్ళి కొడుకును వాటేసుకుని ఆపాడు లక్ష్మణస్వామి. "ఏమిట్రా? ఏమైంది నీకు? ఏం పనిది?" అనరిచాడు గట్టిగా.

"నన్నాపకండి డాడీ, ఈ అవమానం భరింపరానిది. గుండెలు మండి పోతున్నాయి. కోపం... కోపం కట్టలు తెంచుకుంటోంది. ఆఫ్టరాల్ ఒక ట్యాక్సీ డ్రైవరు.

మన ఊరు కాదు, మన రాష్ట్రం కాదు, ఎక్కడో ఆంధ్రానుంచి వచ్చి ఇంతమందిని కొట్టిపోయాడు అంటే వాడ్ని తలుచుకుంటేనే నెత్తురు మరుగుతోంది డాడీ. ఆవేశం ఆపుకోలేకపోతున్నాను" అంటూ పెద్దగా అరిచాడు చింటూభాయ్.

"అందుకని? వాడిమీది కోపంతో మన ఇల్లు పీకి పందిరేస్తావా, చేతగాని చవటా. వచ్చాడు కొట్టాడు వెళ్ళిపోయాడు. సెంట్రల్ మినిస్టర్‌కి కాబోయే అల్లుడు. ఏంచేయగలవ్? అయిందేదో అయింది మర్చిపో"

"నువ్వు మర్చిపోయినా నేను మర్చిపోలేను డాడీ. ప్రతీకారం తీర్చుకోలేదంటే నా తలమీద పడ్డ మూడు కుట్లూ నన్ను పరిహాసం చేస్తూనే వుంటాయి. నా మిత్రులు ఇద్దరూ ఇప్పటికీ ఇంకా ఆస్పత్రిలోనే ఉన్నారు.

నాతో పెట్టుకుంటే ఎంత ప్రమాదమో జన్మజన్మలకీ వాడికి గుర్తుండేలా చేస్తాను" అరిచాడు.

"మాటల్లో కాదురా, చేతల్లో చూపాలి. ముందా ఆవేశం తగ్గించు. ఇలా కూచో" అంటూ కొడుకును శాంతింపజేసి బెడ్ మీద కూచుండ జేశాడు లక్ష్మణస్వామి.

"ప్రతీకారం తీర్చుకోవాలంటే ఆవేశం కాదు, ఆలోచన కావాలి. పక్కా ప్లాన్‌తో రంగంలోకి దిగాలి. ఏమీ లేకుండా ముందుకెళ్తే మరోసారి భంగపడతావ్" హెచ్చరించాడు.

"అంటే మీ ఉద్దేశం ఏమిటి డాడీ! నేను అసమర్థుడిగా చేతులు ముడుచుకుని కూర్చోమంటావా?" అంటూ కోపంగా అడిగాడు చింటూభాయ్.

"నేనలా అనటంలేదు. పులి వేటగాడిమీదకు డైరెక్ట్‌గా పోదు. అదను చూసి మాటువేసి దూకుతుంది. పగబట్టిన పాముకూడా వీలు సాలు చూసుకోకుండా డైరెక్ట్ అటాకివ్వదు. అదను చూసి పడగ విసురుతుంది. ఆవేశం తగ్గించి ఆలోచనలకి పదునుపెట్టాలి.

దేహబలంకన్నా బుద్ధిబలం గొప్పది. కోపావేశాలు తప్పులు చేయిస్తాయి. అందుకే వాటిని తగ్గించుకోమంటున్నాను. నిజంగానే నీలో రోషం ఉంటే వాడి తల నరికితెచ్చి నాకు కానుగ్గా ఇవ్వరా. సంతోషిస్తాను. అంతేగాని ఇలా ఇల్లంతా ధ్వంసం చేస్తానంటే కాదు"

"థ్యాంక్యూ డాడీ, వాడి తల నరికి తెచ్చి మీ ముందు ఉంచి నా రోషాన్ని నిరూపించుకుంటాను"

అప్పుడే అక్కడికివచ్చిన లక్ష్మణస్వామి భార్య ఆ మాటలు విని, "ఏమిటండీ ఇది. అయిందేదో అయిందనుకోకుండా వాడికి రోషం ఎక్కిస్తారు. వాడిని కుదురుగా ఉంచరా?" అని అరిచిందావిడ.

"నీకు తెలీదు మమ్మీ. ఈ విషయంలో ఇంకెవరూ కలగజేసుకోవద్దు" అనరిచాడు చింటూభాయ్. అరుస్తూనే గదిలోంచి విసురుగా బయటికొచ్చాడు.

బయట ఉరుములు మెరుపులతో ఆకాశం బీభత్సంగా ఉంది. కుండపోతగా వర్షం పడుతోంది. నేరుగా ఓపెన్ టెర్రెస్‌లోకి పోయి వర్షంలో తడుస్తూ కూర్చున్నాడు. బోడిగుండు మీదుగా జారే చల్లని వాననీటికి కూలవుతూ కళ్ళుమూసుకున్నాడు.

ఆ స్థితిలో అతడ్ని కదిలించడానికి లక్ష్మణస్వామికి కూడా ధైర్యం చాలక కిందకు వెళ్ళిపోయాడు.

పనిమనిషిని పిలిచి గది శుభ్రం చేయించే పనిలో మునిగిపోయింది అతడి భార్య.

*   *   *   *   *

హైదరాబాద్‌లో మూడురోజులు మాత్రమే ఉన్నాడు కృతయుగ్. స్నిగ్ధ ఎంత చెప్పినా పెళ్ళికాకుండానే వెళ్ళి ఇంటల్లుడిలా వాళ్ళింట్లో దిగటం అతడికి ఇష్టంలేదు. అందుకే హోటల్లో ఉంటానని పట్టుబట్టడంతో స్నిగ్ధ అతడికోసం తాజ్‌లో సూట్ బుక్ చేసింది.

అతడు స్నానాదికాలు ముగించి రెడీ అయ్యాక తన కారులో ఇంటికి తీసుకెళ్ళింది. రాజభవనంలా ఉంది ఇల్లు. సెంట్రల్ మినిస్టర్ రెసిడెన్స్ కావటంతో ఫుల్ సెక్యూరిటీ ఇంటిచుట్టూ.

అతడ్ని చూడగానే స్నిగ్ధ చెల్లెలు నిత్య సంతోషానికి మేరలేదు. అతడు తనను కాపాడిన అనుభవం ఆమె ఇంకా మర్చిపోలేదు. "బావా బావా" అంటూ క్షణం వదిలింది లేదు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండటం చేత శివప్రసాద్‌గారు ఢిల్లీలోనే ఉన్నారు.

స్నిగ్ధ ఫోన్‌చేసి కృతయుగ్ వచ్చినట్టు చెప్పగానే ఆయన చాలా సంతోషించాడు.

కృతయుగ్‌తో మాట్లాడాడు. ఇంటికి రాకుండా హోటల్లో దిగినందుకు నొచ్చుకున్నాడు కూడా. ఇక స్నిగ్ధ తల్లిగారు సాంప్రదాయం మనిషి. కట్టు బొట్టు పద్ధతి చూస్తే చూడగానే నమస్కరించాలనిపిస్తుంది. అంత హుందాగాను, ఆత్మీయంగాను ఉంది. ఆ రోజు వాళ్ళింట్లోనే అందరితో కలిసి భోంచేశాడు.

అయితే వచ్చినప్పట్నుంచీ ఐదునిముషాలు కూడా కృతయుగ్‌తో ముచ్చట్లకు వీల్లేకుండా నిత్య అతడ్ని అంటిపెట్టుకునే ఉండటంతో స్నిగ్ధకు ఒళ్ళు మండిపోతోంది. పైగా తనకన్నా ముందే కృతయుగ్‌కి ఇల్లంతా తనే తిప్పి చూపించింది.

దాంతో కోపం ఆపుకోలేక చెల్లెల్ని పక్కకు లాగి– "ఏమిటే? ఈగలా బావ చుట్టూ? ఏమిటి సంగతి? కావాలంటే చెప్పు. వాడ్ని నీకే వదిలేస్తాను. నువ్వే చేసుకో" అంది. ఆ మాటతో నిత్య కళ్ళు చక్రాల్లా తిప్పి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతూ–

"నిజమా అక్కా... మా అక్క ఎంత మంచిదో" అంటూ మీదపడి బుగ్గమీద ముద్దుపెట్టేసింది. "అయితే ఆ మాటమీదే ఉండవే అక్కా. అసలు బావనిష్టపడని అమ్మాయి ఈ లోకంలో ఉంటుందా? నేను రెడీ" అంది హుషారుగా నిత్య.

అది చూసి నెత్తి కొట్టుకుంది స్నిగ్ధ.

"ఉన్న పోటీ చాలదని నువ్వూ తయారయ్యావా తల్లీ, నన్నిలా ఉండ నియ్యవే..."

"అది కాదక్కా..." "మాట్లాడకు. కళ్ళు పీకేస్తాను. ప్రాణమైనా ఇస్తాగాని వాడ్ని వదులుకుంటానా. పిచ్చివేషాలేయకు..."

"అదీ సంగతి. ఉడుక్కుంటున్నావ్ కదూ? అక్కా, నాకోసం ఎవడో ఒకడు పుట్టేవుంటాడు. బావమీద నాకలాంటి ఉద్దేశం లేదు. కాసేపు నిన్ను ఉడికించాలని అలా చేశానంతే. ఓ.కె. పానకంలో పుడకలా ఇక నేను మీ మధ్యకు రాను. సరేనా?" అంటూ నిత్య నవ్వుతుంటే స్నిగ్ధ తేలిగ్గా ఊపిరి తీసుకుంటూ చెల్లెలి తలమీద చిన్న మొట్టికాయ వేసింది.

ఇటు కృతయుగ్‌లో ఒక అనుమానం ఉంది. అది కాంచన విషయంలో. ఆమె నిధిరహస్యం తెలిసిన యువతి. తమకు ప్రత్యర్థి.

ఆమెను ఉపేక్షిస్తే తప్పు చేసినట్టవుతుంది. ఆమెకు సంబంధించి వివరాలేమీ తెలీదు. ఇక్కడినుంచి వెళ్ళే లోపలే ఆమె గురించి తెలుసుకోవటం చాలాముఖ్యం. స్నిగ్ధ కూడా అదే ప్రయత్నంలో ఉన్నట్టు వాళ్ళకి తెలీదు. తెలిసేలోపే ఆమె నుంచి కొంత సమాచారం రాబట్టాలి. రెండోరోజు ఉదయం కాంచనకు ఫోన్ చేశాడు.

ఆమె చాలా సంతోషించింది. తొమ్మిది గంటల ప్రాంతంలో ట్యాంక్‌బండ్ మీద కలుసుకున్నారు.

బెంచిమీద కూచోగానే అతడి భుజంమీద తలాన్చుకుని ఛాతీని చేతులతో చుట్టేస్తూ కళ్ళుమూసుకుని అలాగే ఉండిపోయిందామె.

ఏదో స్వప్నజగత్తులో విహరిస్తున్నట్టుగా ఆమె ముఖారవిందంలో ద్యోతకమవుతున్న ఆనందాన్ని గమనిస్తున్నాడు కృతయుగ్.

వారించలేకపోయాడు. ఈ పూట తనకోసమే ప్రత్యేకంగా, ఆ రోజు దంతెవారా మార్గంలో ధరించి కనిపించిన అదే నెమలికన్నుల డిజైన్ చీర జాకెట్ ధరించి వచ్చింది. ఆమె ఒంటినుంచి వస్తున్న సెంటువాసన మత్తెక్కిస్తోంది. స్నిగ్ధకు చీరలు, పంజాబీ డ్రస్‌లే బాగుంటాయి. కాని కాంచన విషయం వేరు.

మోడరన్ డ్రెస్‌లతో సహా ఏ డ్రెస్సులో అయినా ఆ డ్రెస్సుకే అందం వచ్చినట్టనిపిస్తుంది.

"కాంచనా..." పిలిచాడు.

"ఊఁ" అంది.

"మాట్లాడవా?"

"నువ్వు చెప్పు. వింటాను. ఏదో అడగాలనుకుని సందేహం ఎందుకు?" అంది.

"నేనేమీ అడగాలనుకోవటంలేదు"

"అబద్ధం నీకు అతకదు డియర్. నా వివరాలు తెలుసుకోవాలని ఉందిగా మనసులో"

"అమ్మాయిలకి దేవుడు ఇన్ని తెలివితేటలు ఎందుకిచ్చాడో అర్ధంకాదు. నీకేమన్నా మనసుల్ని చదివే విద్య తెలుసా? ఎలా కనిపెట్టావ్?"

"ఇప్పటికీ నా ప్రేమను నువ్వు అంగీకరించకపోయినా నన్ను పిలిచావంటే ఆమాత్రం అర్ధంచేసుకోలేనా?"

"ఓ.కె అయితే నీ గురించి చెప్పొచ్చుగా"

"ష్‌... ఈ అదృష్టం నాకు మళ్ళీ దక్కుతుందో లేదో. కాసేపు నన్ను ప్రశాంతంగా ఇలాగే ఉండనీ"

"ఏయ్. ఏమిటీ పిచ్చి?"

"పిచ్చికాదు. ప్రేమ... నాకిలాగే నీ ఒడిలో చనిపోవాలనుంది" ఆమెగొంతు ఆర్ద్రమై మాట తడబడింది.

"కాంచనా, ఏమిటీ మాటలు?" కోప్పడ్డాడు.

అతడ్ని వదిలి నిటారుగా కూచుంటూ చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకుంది కాంచన.

"నాగురించి నీకు నేను చెప్పుకోవాలి. నా అసలు పేరు కాంచన. ఆత్మకూరు అన్నారావు, సుమిత్రలు నా తల్లిదండ్రులు. నేను ఒక్కదాన్నే సంతానం.

నాకో బావ ఉన్నాడు. పేరు మహీధర్. మా డాడీకి పురాతననిధులంటే చాలా ఇష్టం.

మధ్యతరగతి కుటుంబం నుంచి ఉన్నత కుటుంబ స్థానానికి మేం ఎదిగామంటే కారణం నిధులు తవ్వి సంపాదించిన డబ్బే పెట్టుబడి.

ఈ రోజు కోట్లకు అధిపతి అయ్యి ఎన్నో వ్యాపారాలున్నా ఆయనలో నిధులమీద మోజు తగ్గలేదు. వాటికోసం మా డాడీ చేతికింద ఒక ముఠానే పనిచేస్తోంది. మా బావను పెళ్ళిచేసుకోవటం నాకు ఇష్టంలేదు. నిధుల అన్వేషణ వద్దని డాడీకి ఎంత చెప్పినా ఆయన వినటంలేదు.

ఆ మధ్య ఎప్పుడో భోపాల్ వెళ్ళినప్పుడు ఒకడు ఇందులో నిధిరహస్యం ఉందంటూ లక్షరూపాయలు తీసుకుని ఆ రాగిగొట్టాన్ని మా డాడీకి అమ్మాడు.

దాని మూత ఓ పట్టాన ఊడిరాలేదు. మా డాడీవద్ద పనిచేసే మంత్రవాది అనంతస్వామి పూజలు చేసి దాని మూతతెరిచాడు.లోపలి రాగిరేకు మాకు అర్ధంకాలేదు. అందుకే స్నిగ్ధను ఫాలో అవుతూ దంతెవారా వచ్చాం. మిగిలింది నీకు తెలుసు" వివరించింది.

"తర్వాత...?" అడిగాడు.

"సారీ! ఆపైన వివరాలు చెప్పి కన్నతండ్రికి ద్రోహం చేయలేను. లీవిట్. ఇక్కడ ఎన్ని రోజులుంటున్నావ్?"

"రేపు వెళ్ళిపోతున్నాను"

"ఇంటికా?"

"కాదు, ఢిల్లీకి. ఒక ఫ్రెండ్‌ని కలవాలి" అబద్ధం చెప్పాడు కృతయుగ్.

"ఓ.కె. తిరుగు ప్రయాణంలో నన్ను కలవకుండా వెళ్ళొద్దు"

"సరి. ఇంతకీ మీ డాడీ ఎలా ఉంటారు?"

"మనిషిలాగే... రెండు కళ్ళు, రెండు చేతులు, రెండు కాళ్ళు" నవ్వింది. చాలాసేపు మౌనంగా ఉండిపోయాడు కృతయుగ్. ఆమె మాటలు విన్న తర్వాత నిధి గురించి ఆమె తండ్రి తీసుకుంటున్న చర్యలు ఏమిటో అడగాలనిపించలేదు కృతయుగ్‌కి.

అతడి కాళ్ళకి ముందే బంధం వేసిందామె. ఆ విషయాలు చెప్పి కన్నతండ్రికి ద్రోహం చేయలేనని. కాబట్టి ఆమెను ఇంకేమీ అడగలేదు కృతయుగ్.

అర్ధగంట తర్వాత ఒక పార్లర్‌లో ఐస్‌క్రీమ్ తిని బయలుదేరారు. తన కార్లో అతన్ని తాజ్ ముందు దించి వెళ్ళిపోయింది కాంచన.

*           *           *           *           *

మూడోరోజు సాయంత్రం ఫ్లైట్‌లో స్నిగ్ధ, కృతయుగ్‌లు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చేరుకునేసరికి సిటీలో లైట్లు వెలుగుతున్నాయి.

రాత్రి ఏడుగంటల సమయం. ఆకాశం మబ్బుపట్టి చిరుజల్లులుపడుతూ వేసవితాపం నుంచి ఉపశమన మిస్తున్నాయి. లోకల్ ఎమ్.పి తాలూకు మనుషులు ఎయిర్‌పోర్ట్‌కి వచ్చి వారిద్దర్నీ రిసీవ్ చేసుకున్నారు. సాదరంగా ఆహ్వానించి కారులో ఎమ్.పి. తాలూకు గెస్ట్‌హౌస్‌కు తీసుకెళ్ళారు.

రాత్రికి భోజనం వసతి ఏర్పాట్లన్నీ చక్కగా ఏర్పాటు చేశారు. ఇదంతా స్నిగ్ధ తను ఉజ్జయిని వెళ్ళాలనుకుంటున్న విషయం చెప్పగానే ఆయన పెట్టిన కండిషన్ ఒకటే. రోజూ తనతో ఫోన్‌లో టచ్‌లో ఉండాలి. ఏం కావాలన్నా మొహమాటం లేకుండా అడగాలి అని.

ఎందుకంటే తన కూతురు ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్‌కి అతీతంగా రంగంలోకి దిగి నిధికి సంబంధించిన అన్వేషణ చేపడుతోంది. ఎప్పుడే అవసరం వస్తుందో తెలీదు. అందుకే ముందుజాగ్రత్తకొద్దీ కండిషన్ విధించాడాయన.

ఆ రాత్రి భోజనం చేసి చెరో గదిలో నిద్రపోయారు. రాత్రంతా బయట వర్షం పడుతూనే ఉంది. వాతావరణం చలిచలిగా ఆహ్లాదంగా ఉంది. పడుకున్న కొద్ది సేపట్లోనే గాఢనిద్రలోకి జారుకున్నారు.

కృతయుగ్‌కి తిరిగి మెలుకువ వచ్చేసరికి సమయం తెల్లవారుజాము అయిదు గంటలు.

రాత్రి ఎన్ని గంటలకు పడుకున్నా అయిదుగంటలకు లేచిపోవటం అతడి అలవాటు. అప్పటికింకా గాఢనిద్రలో ఉంది స్నిగ్ధ. బయట వర్షం తగ్గింది.

ముఖం కడుక్కుని ఒక గంట మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ చేశాడు. ఆరుగంటలకి చెమటలు కారుతున్న శరీరంతో బాత్‌రూమ్‌కెళ్ళి కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేసి డ్రెస్సప్ అయి వచ్చాడు.

బయట తెలతెలవారుతోంది. భోపాల్‌నుండి ఉజ్జయిని పశ్చిమ నైరుతిగా సుమారు రెండువందల ఏభైకిలోమీటర్ల దూరంలో ఉంది. మధ్యాన్నం భోంచేశాక ఉజ్జయినికి బయలుదేరిద్దరూ.

వారికోసం మంచి కండిషన్‌లో ఉన్న జీప్ ఒకటి ఏర్పాటు చేయబడింది. తమకు ఉజ్జయినిలో అవసరమైన తాళ్లు, పనిముట్లు పరికరాలు మొదలైనవాటిని భోపాల్లోనే సమకూర్చుకున్నారు. చక్కగా గూడు ఉండి వ్యాన్ షేప్‌లో కన్పిస్తూ రఫ్ రూట్లో కూడా దూసుకుపోగల ఫోర్ వీల్ డ్రైవ్ జీప్ అది.

దక్షిణంగా ఉన్న ఇండోర్ సిటీనుండి ఉజ్జయినికి రోడ్ మార్గం దగ్గరే. వందకిలోమీటర్లలోపే ఉంటుంది మార్గం. కాని తండ్రి శివప్రసాద్‌గారి సూచన ప్రకారం కృతయుగ్‌తో భోపాల్ వచ్చింది స్నిగ్ధ.

అటు ఇండోర్‌నుంచి ఉజ్జయినిగాని, ఇటు భోపాల్ నుంచి ఉజ్జయినిగాని బిజీ రూట్స్. అక్కడ లారీ ట్రాఫిక్ అధికం. ఇక దశాబ్దకాలానికి ముందు జరిగిన కార్బైడ్ గ్యాస్ దుర్ఘటనలో ఎంతోమందిని పోగొట్టుకుని తిరిగి కోలుకున్న భోపాల్ నగరాన్ని ఉదయమే ఒక రౌండ్ తిరిగి చూసివచ్చారిద్దరూ.

ఉజ్జయిని మార్గంలో సెహోర్ సిటీవరకు స్నిగ్ధ జీప్ డ్రయివ్ చేసిందిగాని తర్వాత హెవీ ట్రాఫిక్‌కి భయపడి స్టీరింగ్ కృతయుగ్‌కి ఇచ్చేసింది.

రెండుచోట్ల ఫ్లైఓవర్స్‌వద్ద ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణం కొంత ఆలస్యమైంది. మొత్తానికి వీరు ప్రయాణిస్తున్న జీప్ ఉజ్జయిని వీధుల్లో ప్రవేశించే సరికి రాత్రి ఏడుగంటలు దాటింది సమయం. ఇక్కడ వర్షం లేదు. వాతావరణం పొడిగానే ఉంది.

తమకోసం సూట్ బుక్‌చేసిన మినర్వా హోటల్‌కి నేరుగా జీప్‌ని పోనిచ్చాడు కృతయుగ్.

*          *          *          *          *

ఒక్కోసారి మనం చెప్పే సాదాసీదా అబద్ధాలు కూడా మనకు తెలీకుండానే ఉపకారం చేస్తాయి. అలాంటిదే కృతయుగ్ విషయంలో ఒకటి జరిగింది.

ట్యాంక్‌బండ్‌వద్ద కూచున్నప్పుడు మాటల సందర్భంలో కాంచన కృతయుగ్‌ని భద్రాచలం వెళ్ళిపోతున్నావా అనడిగింది. అప్పుడు తమ ఉజ్జయిని ప్రయాణం గురించి చెప్పకుండా ఒక ఫ్రెండ్‌ని కలవటంకోసం ఢిల్లీ వెళ్తున్నట్టు అబద్ధం చెప్పాడు.

దంతెవారా నుంచి ఒక విషపురుగు తనను చంపి ప్రతీకారం తీర్చుకోవాలని బయలుదేరిన సంగతి కృతయుగ్‌కి తెలియకపోవటం.

ఏం జరిగిందంటే–

ఆ రోజు ఉదయం మహీధర్ సోమాజిగూడావైపు కారులో వస్తూండగా అతడి సెల్ మోగింది. కొత్త నంబరు, ఎవరిదో కూడా గుర్తులేదు.

"హలో... ఎవరు?" పిలిచాడు.

"అరే మహీభాయ్, హమ్‌కో భూల్‌గయారే క్యా? మై హూ చింటూ... చింటూభాయ్ దంతెవారాకా..." ఫోన్‌లో గరగరలాడింది అవతలి గొంతు. చింటూభాయ్ గొంతువినగానే మహీధర్ ముఖంలో సంతోషం తొంగిచూసింది. వెంటనే కారుపక్కకు తీసి ఆపాడు.

"అరే చింటూ... కైసారే... ఎంతకాలమైందిరా నిన్నుచూసి! సంవత్సరం దాటిపోలేదూ? చాన్రోజులకి గుర్తొచ్చాను. థాంక్స్‌రా. దంతెవారాలో అంతా క్షేమంగదా!"

"ఆగాగు మిత్రమా... నన్ను చెప్పనీ. ఇప్పుడు నేను దంతెవారాలో లేను" మహీధర్ మాటలకి అడ్డొస్తూ చెప్పాడు చింటూభాయ్.

"మరెక్కడున్నావ్?" అడిగాడు.

"ఇక్కడే... మీ హైదరాబాద్‌లో... నిన్న ఉదయం వచ్చాం..." అన్నాడు చింటూభాయ్.

"డామిట్. నిన్ననే సిటీలోకొచ్చినవాడివి ఇప్పుడా ఫోన్‌చేయటం. ఎవరెవరు వచ్చారు?" కోపడ్డాడు మహీధర్.

"నాతోపాటు నామనుషులు నలుగురు" అన్నాడు భాయ్.

ఆ మాట వింటూనే మహీధర్ ముఖంలో ఆశ్చర్యం. అసలే పరమ కరోడా. ఆపైన అహంభావి.

సిటీలో ఏ ఘనకార్యం చేయటానికి వచ్చాడో తెలీదు. తమ ఫ్యామిలీతో వచ్చి వుంటే కంట్రోల్లో ఉండొచ్చుగాని వచ్చింది తన మనుషులతో. వెధవపనులు చేయటం తమకు కొత్తేమీ కాదుగాని వెనకా ముందూ చూడకుండా కొరివితో తలగోక్కోవటం వీడికి అలవాటు. తను జాగ్రత్తగా ఉండటం మంచిది.

రెండేళ్ళ క్రితం ఛత్తీస్‌ఘర్ రాజధాని రాయ్‌పూర్‌లో ఒక పురాతన విగ్రహం అమ్ముతుండగా పట్టుబడ్డ కేసులో మంత్రి లక్ష్మణస్వామి, అతని కొడుకు చింటూభాయ్ తనకి చాలా సహాయం చేసి ఆ కేసునుంచి బయటపడేశారు. అప్పట్నుంచి తమమధ్య స్నేహం కుదిరింది. "చింటూ– ఇప్పుడెక్కడున్నావ్?" అడిగాడు.

అడ్రస్ చెప్పాడు చింటూభాయ్.

"ఓ.కె. నేను వస్తున్నాను" అంటూ లైన్ కట్ చేశాడు మహీధర్. సరిగ్గా అర్ధగంట తర్వాత–

హోటల్ గదిలో చింటూభాయ్ ముందున్నాడు మహీధర్. అతడ్ని చూసి గుర్తుపట్టలేకపోయాడు. తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు.

ఒకప్పటి చింటూభాయ్ కళ్ళముందు మెదిలాడు. బాగా మదించి అడవిలో ఇష్టారాజ్యంగా తిరిగే ఒక మృగరాజులా ఉండేవాడు. కాని ఇప్పుడు? ఏమైంది వీడికి? బోడిగుండుతో మనిషి చిక్కిపోయి గుర్తుపట్టలేనంతగా మారిపోయాడు.

ఇంత మార్పేమిటో అర్ధంగాక తెల్లబోయాడు మహీధర్. "ఆశ్చర్యపోయింది చాలు! వచ్చి ఓ పెగ్గెయ్యి. మనం చాలా విషయాలు మాట్లాడుకోవాలి" అంటూ చింటూభాయ్ హెచ్చరించగానే ఒక లార్జ్ పెగ్ లాగించేశాడు మహీధర్.

"ఇప్పుడు చెప్పు ఏమైంది! ఏదో ముఖ్యమైన పనిమీదే హైదరాబాద్ వచ్చినట్టున్నావ్" అడిగాడు.

"అవును. చాలా పెద్దపని. నాకో శత్రువు ఉన్నాడు. ఆఫ్టరాల్ ఒక ట్యాక్సీ డ్రయివరు. వాడ్ని వెతుక్కొంటూ భద్రాచలం వెళ్ళాను.

ఇంటిదగ్గర వాడి బామ్మ ఉంది. వాడు హైదరాబాద్ వెళ్ళాడని చెప్పింది. ఎక్కడుంటాడో ఆ ముసల్దానికి తెలీదు. నిన్న ఉదయం వచ్చినవాళ్ళం సిటీ అంతా గాలించినా వాడి జాడ తెలీలేదు. ఈ విషయంలో నువ్వేమన్నా సాయపడతా వని ఫోన్ చేశాను" పొడిపొడిగా వివరించాడు చింటూభాయ్.

పూర్తి వివరాలు తెలీకపోయినా వాడు ట్యాక్సీడ్రైవర్, ఊరు భద్రాచలం అనగానే మహీధర్ కళ్ళముందు కదిలింది కృతయుగ్ రూపం.

తన శత్రువే చింటూభాయ్‌కి శత్రువని ఊహిస్తూ– "వాడు కన్పిస్తే ఏం చేస్తావ్?" అనడిగాడు.

"వాడి తల నరికితెస్తానని మా డాడీకి మాటిచ్చాను. అది నెరవేరేవరకు ఇంటిముఖం చూడను" ఆవేశంగా చెప్పాడు చింటూభాయ్.

"వాడి పేరు కృతయుగ్ కదూ?"

ఈసారి చింటూభాయ్ షాకయ్యాడు.

"అరె! నీకెలా తెల్సు?" అనరిచాడు ఉత్సాహంగా.

"వాడి గురించి నాకూ కొంత తెలుసులే. నువ్వు చెప్పిందాన్నిబట్టి వాడే అయివుంటాడని ఊహించాను" వాస్తవానికి దంతెవారా కోటదగ్గర ఏం జరిగిందన్నది ఈ క్షణంవరకు మహీధర్‌కు తెలీదు.

తన మరదలు కాంచన కృతయుగ్‌ని ప్రేమిస్తోంది కాబట్టి కాంచన తనకు కాకుండాపోవడానికి కారణం వాడేనని మనసులో పగ ఉంది. అలాగని ఇప్పటికిప్పుడు తనేమీ చేయలేని పరిస్థితిలో ఉన్నాడు.

అనుకోకుండా చింటూభాయ్ రాక సంతోషాన్నిస్తోంది. కాగలకార్యం గంధర్వులే తీర్చినట్టు చింటూభాయ్ కృతయుగ్‌ని హతమారిస్తే తనకి లైన్ క్లియరవుతుంది. చేతులకి మట్టి అంటదు.

"ఏమిట్రా ఆలోచన? వాడ్ని చూశావా?" అని చింటూభాయ్ అడిగిన ప్రశ్నతో ఆలోచనల నుంచి బయట పడ్డాడు మహీధర్.

"వాడ్ని ఇక్కడ చూశాను. కాని ఎక్కడుంటాడో తెలీదు. అది తెలుసుకోవటం కష్టంకాదు. వెయిటెమినిట్" అంటూ తన సెల్ అందుకుని లేచి బాల్కనీ లోకి వచ్చాడు. అంతకుమించి పొరపాటున కూడా తమకు సంబంధించిన సంగతులేవీ చింటూభాయ్‌కి చెప్పలేదు. కాంచనకి ఫోన్ చేశాడు.

మొదటిసారి ఫోన్ తీయలేదామె. రెండోసారి లిఫ్ట్ చేసింది. "బావా! నాకు ఫోన్ చేయొద్దని చెప్పాను. ఎందుకు చేశావ్?" ఫోర్స్‌గా అడిగింది.

"ఇక్కడ కొంపలంటుకుంటుంటే చూస్తూవుండలేక ఫోన్ చేశాను. ఆ ట్యాక్సీ డ్రైవర్ కృతయుగ్ నీ లవర్ గదా. ఎయిర్‌పోర్ట్ వద్ద నువ్వు వాడ్ని కౌగిలించుకోవటం చూశాను..." అన్నాడు మహీధర్.

"అంటే నువ్వు నన్ను ఫాలో చేస్తున్నావన్నమాట"

"అదేంలేదు. ఆ సమయంలో అనుకోకుండా నేనూ అక్కడే ఉన్నాలే. విషయం ఏమంటే ఇక్కడ కోఠీ సెంటర్లో వాడు ఎవడితోనో గొడవ పెట్టుకున్నాడు. పెద్ద గొడవ జరుగుతోంది..."

"నాన్సెన్స్. ఎవర్ని చూసి ఎవరనుకున్నావో. కృతయుగ్ ఇక్కడ లేడు. నిన్న ఉదయమే ఫ్లైట్‌లో ఢిల్లీ వెళ్ళిపోయాడు. ఏదో వంక పెట్టుకుని ఇంకెప్పుడూ నాకు ఫోన్ చేయకు" అంటూ కోపంగా హెచ్చరించి లైన్ కట్‌చేసింది కాంచన.

ఆమె విసుక్కున్నా కసురుకున్నా తను ప్లేచేసిన చిన్న ట్రిక్కు మాత్రం సత్ఫలితాన్నిచ్చింది.

కృతయుగ్ ఇక్కడ లేడు. ఢిల్లీ వెళ్ళాడు. ఇదే విషయాన్ని లోపలకొచ్చి చింటూభాయ్‌కి చెప్పాడు.

వింటూనే నీరసంగా సోఫాకి వాలిపోయాడు చింటూభాయ్. హైదరాబాద్‌లోనే పనిముగించుకొని వెళ్ళిపోవాలనుకున్నాడు. కాని వ్యవహారం ఢిల్లీవరకు సాగుతోంది. "ఢిల్లీలో ఎక్కడుంటాట్ట?" అడిగాడు చింటూభాయ్.

భుజాలెగరేశాడు మహీధర్.

"తెలీదు. అయితే ఎయిర్‌పోర్ట్ సమీపంలోనే ఏదో లాడ్జిలో దిగవచ్చు" అన్నాడు.

"ఓ.కె. చాలా థాంక్స్‌రా మహీధర్. మేం ఈ రోజే ఢిల్లీ వెళ్తాం. గల్లీగల్లీ వెదికైనా సరే వాడి తల నరికి పట్టుకుపోతా" అంటూ తన మనుషులవైపు తిరిగి సాయంత్రం ఫ్లైట్‌కి ఢిల్లీకి ఐదుటిక్కెట్లు బుక్ చేయమని ఆర్డర్‌వేశాడు.

అక్కడున్న కొద్ది సమయంలోనూ మహీధర్‌కి అర్థమైంది, చింటూభాయ్ వెంట వచ్చిన నలుగురూ అతడి ఫ్రెండ్స్ కాదు, గూండాలూ కాదు. రివాల్వర్ షూటింగ్‌లో ఎక్స్‌పర్ట్‌లైన కిరాయి హంతకులు.

*　　*　　*　　*　　*

"ఏంది బాబు? ఆ లంకమీద గుడి గురించా మీరడుగుతున్నారు? ఓసోసి. ఏనాటి మాట ఏనాటి కత! నేనే మరిసిపోయినాను. మీకెట్టా తెలుసయ్యా" అంటూ

బోసినోరు వెళ్ళబెట్టి నవ్వుతున్న ఆ కురువృద్ధుడి మాటలకు కృతయుగ్ స్నిగ్ధలు ముఖముఖాలు చూసుకున్నారు.

ఆ రోజు ఉదయం ఏడుగంటలకు హోటల్ మినర్వానుండి జీప్‌లో బయలుదేరిన ఇద్దరూ ఎగుడుదిగుడు దారులవెంట నదికి ఎడంపక్కగా ప్రయాణం సాగించారు. క్షిప్రానదికి అటూ ఇటూ కూడా కొండగుట్టలు, దట్టమైన అడవులు ఉన్నాయి.

అక్కడక్కడా గ్రామాలు, పల్లెలు, మెట్టభూములు కన్పిస్తున్నాయి. దారిలో ఎదురైన కాస్త వయసుమళ్ళిన పెద్దల్ని కలిసి ఆదివిష్ణు ఆలయం గురించి, అష్టలక్ష్ముల ఆలయాల గురించి అడిగి చూశారు. అలాంటి గుడులు ఉన్నట్టే తాము వినలేదని సమాధానాలు వచ్చాయి.

సుమారు డెబ్బై కిలోమీటర్ల దూరం ఎగువకు వెళ్ళేసరికి రోడ్డునుంచి ఒక చిన్నదారి చీలిపోయి లోన ఒక గూడెం కనిపిస్తుంటే కొంతసేపు విశ్రాంతి కోసం జీప్‌ని అటు పోనిచ్చారు. అది గిరిజనులైన గోండు తెగవారి చిన్నగూడెం.

ఆ గూడెంలో సుమారు వంద సంవత్సరాల వయసున్న వృద్ధుడ్ని కలుసుకుని అడిగినప్పుడు అతడు పలికిన మాటలవి. ఆ మాటలు వినగానే ఆ వృద్ధుడికి ఎంతో కొంత తమకు పనికొచ్చే సమాచారం తెలిసుండొచ్చన్న చిన్న ఆశ ఏర్పడింది ఇద్దరికీ.

"అంటే... ఆ ఆలయాల గురించి నీకు తెలిసినట్టే గదా తాతయ్యా?" అనడిగింది స్నిగ్ధ.

"లేదమ్మా! నాకే కాదు, మా వంశంలో అయిదుతరాల వెనకటివాళ్ళకూ్కడా తెలీదంటే నమ్ముతావా? కాని అదే నిజం. ఎందుకంటే అప్పటికే ఆ గుడులన్నీ శిథిలమయిపోయాయి. అప్పుడెప్పుడో జరిగిన ఘోర యుద్ధంలో ఉజ్జయిని ఓడిపోయిందట. శత్రువులు దారుణ మారణకాండ సాగించారట. అంతటితో ఆగకుండా గుడులు గోపురాల్నీ ధ్వంసం చేశారట.

శైవులకు, వైష్ణవులకు బద్ధవైరం సాగుతున్న రోజులవి. అందుకే వాళ్ళ వైష్ణవాలయాలన్నీ కూల్చేశారు.

ఆ సమయంలోనే మా క్షిప్రమ్మతల్లి ఎందుకో అలిగి మహోగ్రరూపంతో పొంగిపొరలి ఈ ప్రాంతాన్ని ముంచేసింది. నేలంతా జలమయం. దిక్కుతోచక జనాలు ఈ ప్రాంతం వదిలిపోయారు.

అంతదాకా పల్లెలు, పట్నాలు పంటభూములతో కళకళలాడిన ఈ ప్రాంతమంతా కాలక్రమంలో అడవైపోయింది. అడవితల్లిని నమ్ముకునే మాలాంటి

గిరిజన తెగలకు ఆవాసమయింది గాని నాగరికులు తిరిగి ఈ ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటుచేసుకోలేదు.

ఇదంతా నా చిన్నప్పుడు మా పెద్దలు చెప్పుకుంటే విన్న సంగతులు. నదిలో లంకమీద నాలుగు రాజగోపురాలతో విష్ణు ఆలయం ఉండేదని, అష్టదిక్కుల్లోను అష్టలక్ష్ముల ఆలయాలు వైభవంగా పూజలు అందుకునేవని చెప్పుకునేవారు" అంటూ వివరించాడు ఆ వృద్ధుడు.

"అంటే... అష్టలక్ష్మి ఆలయాలలో ఒక్కటీ మిగల్లేదా తాతా?" అడిగాడు కృతయుగ్.

"బాబూ! మిగిలాయో లేదో నాకయితే తెలీదు. అవి ఎక్కడెక్కడ ఉండేవో ఇప్పుడైతే కనిపెట్టడం కష్టమే. అయితే ఇది కూడా నేను విన్నదే. ఒక విషయం చెప్తా వినండి. లంకకు తిన్నగా ఏటవతల పదిమైళ్ళ దూరంలో ఒక ఊరుంది.

అదికూడా గిరిజనవాడే.

ఆ ఊరి పేరు సంతూరు.

ఆ ఊళ్ళో గంగమ్మతల్లి గుడి ఉంది.

ఒకప్పుడది సంతానపురి అనే ఊరని, ఆ గుడి సంతానలక్ష్మిగుడి అని, మొత్తం అష్టలక్ష్మి ఆలయాల్లో నామమాత్రంగా ఆ గుడి ఒక్కటే మిగిలిందని నా చిన్నతనంలో చెప్పుకునేవారు.

శైవులు ఆ గుడిని గంగమ్మగుడిగా మార్చేశారట. అయినా ఇప్పటికీ సంతానపురిని సంతూరు అనే పిలుస్తున్నారు. సంతు అంటే సంతానం అని తెల్సుగదా. పిల్లలు లేనివాళ్ళు గంగమ్మకు పొంగళ్ళు ఎత్తి మొక్కుకుంటే తప్పకుండా సంతానం కల్గుతుందని నమ్మకం. ఎక్కడెక్కడినుంచో వచ్చి ఆయమ్మని కొలిచి పోతూంటారు" అంటూ వివరించాడా వృద్ధుడు.

ఎంతో ఆసక్తిగా ఆ మాటలు విన్నారిద్దరూ. తమ అన్వేషణ తొలిరోజే కొంత సత్ఫలితాన్నిచ్చిందనిపించింది. ఎందుకంటే అష్టలక్ష్మి ఆలయాల్లో ఒక్క గుడి సమాచారం తెలిసినా చాలు. మిగిలిన గుళ్ళ తాలూకు శిథిలాలను కనిపెట్టడం సులువు.

"తాతా... లంకను నువ్వు చూశావా? అక్కడి విశేషాలేమిటి? గుడి తాలూకు శిథిలాలు ఉన్నాయా? దీవిమీద జనావాసాలున్నాయా?" అడిగాడు కృతయుగ్.

"జనావాసాలా... ఆ లంకమీద ఇల్లు కట్టుకుని నివాసం ఉండే దమ్ము ఎవరికుందయ్యా" అంటూ మరోసారి బోసినోటితో నవ్వాడు వృద్ధుడు.

"ఆ లంక మాకు తెలీకపోడంవేంది బాబూ. నేను వయసులో ఉండగా సానాసార్లు చూసినా.

పడవలోంచి దీవిని చూడ్డమేగాని లంకలోకి కాలు పెట్టలేదు. ధైర్యం చేసి అలా వెళ్ళిన కొందరు చచ్చిపోయారు. కొందరు పారిపోయి వచ్చారు" అని భయం భయంతో చెప్పాడా వృద్ధుడు.

"అంత ప్రమాదమా! ఏముందక్కడ?" అంటూ ఉత్కంఠగా అడిగింది స్నిగ్ధ.

"ఆ దీవిమీద పెద్ద పాము తిరుగుతుందంటారు. దీవిమీదకు ఎవరన్నా వెళ్తే పాములు తరుముకొస్తాయి.

తేనెటీగలు దాడిచేస్తాయి. మంద్రగబ్బలు వెంటపడతాయి. జానెడు జాగా ఉంటే ఆక్రమించేస్తున్న ఈ రోజుల్లో ఆ దీవి జోలికి మనిషి పోడంలేదంటే కారణం అదే.

అయినా నాకు తెలీకడుగుతా బాబు, ఏనాడో అంతరించిపోయిన ఆ గుళ్ళుగోపురాల గురించి మీకెందుకింత అక్కర. ఎవరు మీరు?" చెప్పాల్సిందంతా చెప్పి చివరిలో తన సందేహాన్ని సంధించాడు వృద్ధుడు.

ముఖముఖాలు చూసుకున్నారు స్నిగ్ధ, కృతయుగ్‌లు. "తాతా, మేం దేవాదాయశాఖ మనుషులం. పురాతన ఆలయాల గురించి పరిశోధిస్తున్నాం. అందుకే ఈ ఎంక్వయిరీ. ఓ.కె. తాతా, చాలా విషయాలు చెప్పావు. థాంక్స్" అంటూ లేచాడు కృతయుగ్.

వస్తూ వస్తూ వృద్ధుడి చేతిలో ఐదువందల రూపాయల నోటు ఉంచింది స్నిగ్ధ.

"చల్లగా ఉండు తల్లీ" అంటూ ఆనందంగా ఆశీర్వదించాడు ఆ వృద్ధుడు.

"ఏం చేద్దాం?" జీప్‌లో కూచోగానే అడిగింది స్నిగ్ధ. అప్పటికే భోజన వేళయింది. ఇవాళ సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. గాలి వెచ్చగా వీస్తోంది.

"నువ్వు చెప్పు. నాకైతే ఎగువకు వెళ్ళినా ఉపయోగం ఉంటుందనుకోను. వెనక్కి వెళ్ళిపోయి రెస్ట్ తీసుకోవటం మంచిది. రేపు ఉదయం నది ఆవలివైపు వెళ్దాం. గంగానమ్మ గుడిని చూసి తర్వాత నదిలో దీవిని చూద్దాం. వెనకాముందూ ఆలోచించకుండా దీవిమీద అడుగు పెట్టకూడదు" అన్నాడు. "ఓ.కె!" అంది స్నిగ్ధ.

తిరుగు ప్రయాణం ఉజ్జయినివైపు బయలుదేరింది జీపు. దారిలో ఒక మర్రిచెట్టుకింద కొంతసేపు ఆగి వెంట తెచ్చుకున్న బిస్కట్లు తిని కాఫీతాగి

బయలుదేరారు. జీపు మినర్వా హోటల్‌కు చేరుకునేసరికి సాయంకాలం నాలుగు గంటలయింది.

సరిగ్గా ఆ సమయంలోనే ఒక గమ్మత్తయిన వ్యవహారం జరిగింది. అప్పటికే ఆత్మకూరు అన్నారావు మనుషులొచ్చి ఉజ్జయినిలో తిష్ట వేశారనే విషయం ఈ జంటకు తెలీదు. ఆపైన వాళ్ళు ఎక్కడో లేరు.

మినర్వా హోటల్‌కి ఎదురుగా ఉన్న విశాలమైనరోడ్‌కి అవతల ఉంది ద్వారకా లాడ్జి.

బసవడు తన వెంట నలుగురు మనుషులతో వచ్చి ఆ లాడ్జిలోనే మకాం చేసివున్నాడు. వాళ్ళు రోజూ ఆలయాల గురించి గాలించి, విచారించి వస్తూనే వున్నారు.

అంతక్రితమే వాళ్ళంతా లాడ్జికి తిరిగివచ్చారు. బసవడిగ్గాని, అతని మనుషులగ్గాని స్నిగ్ధ, కృతయుగ్‌లు తెలీదు. కాని ఒకే ఒక్కడున్నాడు. వాడు పీటర్‌వెంట దంతెవారా వెళ్ళినవాడు.

వాడు మరొకడితో కలిసి బాల్కనీలో సిగరెట్ దమ్ముకొడుతూండగా వాడి కంటపడ్డారు కృతయుగ్, స్నిగ్ధలు. అప్పుడే జీప్‌దిగి లోపలికి పోతున్నారు వాళ్ళు. వాడికి విషయం అర్ధమైపోయి– బసవడికోసం లోపలికి పరుగుతీశాడు.

* * * * *

"ఏరా బసవా! వెళ్ళిన పని ఎంతవరకు వచ్చింది?" బసవడి నుంచి ఫోన్ రాగానే కోపంగా అరిచాడు ఆత్మకూరు అన్నారావు.

"ఆ పనిమీదే తిరుగుతున్నాం సార్... అయితే నదికావలగాని ఈవలగాని అష్టలక్ష్ముల గుడుల గురించి ఎవరూ చెప్పలేకపోతున్నారు. కాని..." అంటూ ఆగాడు బసవడు.

"ఊఁ... కాని ఏమైంది?" అరిచాడు అన్నారావు.

"మీరు చెప్పినట్టు నదీతీరంలో ఆదివిష్ణు ఆలయం ఏదీలేదు. కాని ఉజ్జయినికి తొంభై మైళ్ళ ఎగువన నది మధ్యలో పెద్ద దీవి ఉంది.

ఆ దీవిలో ఒకప్పుడు ఆదివిష్ణువు గుడి ఉండేదని, మొత్తం శిథిలమై పోయిందని తెలిసింది. రేపు అటు వెళ్ళి చూసి రావాలనుకుంటున్నాం"

"వెరీగుడ్. అక్కడి పరిస్థితి ఏమిటో తెలుసుకుని చెప్తే వెంటనే మేం బయలుదేరి వస్తాం"

"సార్, మీకో ముఖ్యమైన విషయం చెప్పాలి. అందుకే ఫోన్ చేశాను"

"ఏమిటది?"

"పీటర్ మనిషి ఒకడు ఇప్పుడు నాతో ఉన్నాడు. వాడికి ట్యాక్సీ డ్రయివర్, ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ అమ్మాయి ఇద్దరూ బాగా తెలుసు. మేం దిగిన లాడ్జికి ఎదురుగా మినర్వా హోటల్ ఉంది. వాళ్ళిద్దరూ ఎప్పుడొచ్చారో తెలీదు. మినర్వాలో దిగారు.

మన మనిషి పొరపాటుపడలేదు వాళ్ళే అంటున్నాడు. అందుకే మీకు చెప్తున్నాను" బసవడి మాటలు వింటూనే- అన్నారావు ఆలోచనలో పడిపోయాడు.

వాళ్ళిద్దరూ ఉజ్జయినిలో కన్పించటం ఏమిటి? అంటే ఆ అమ్మాయి నిధిని దృష్టిలో ఉంచుకునే ఆలయాల అన్వేషణకు వెళ్ళుండాలి.

వేరే కారణం కన్పించదు. ఆ అమ్మాయికి రాగిరేకు చూపించటం పెద్దతప్పిదం. డిపార్ట్‌మెంట్ మనుషులొద్దు, వేరే ఎవరి సాయమన్నా తీసుకుందాం అంటే వినకుండా ఈ మహీధర్, కాంచనలు చేసిన పనిది.

ఇప్పుడా అమ్మాయి ఆర్కియాలజీ సాయంతో వెళ్ళిందో లేక స్వయంగా అన్వేషించాలని వెళ్ళిందో లేక వేరే పనిమీద వెళ్ళిందో తెలీదు.

అందుకే ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. కోప్పడలేదు. గతంలో ఎన్నో నిధులు తవ్వి తీసి ఎందరినో దారి తప్పించిన అనుభవం తనది. కాబట్టి పిల్లకాకులు. తన ముందు వాళ్ళెంత అన్పించింది.

"ఓ.కె. బసవా, విషయం అర్థమైంది. నువ్వోపని చెయ్యి. మనవాడొకడ్ని ఆ జంటమీద నిఘా ఉంచు. మిగిలినవాళ్ళతో నువ్వు రేపు ఆ దీవిమీదకెళ్ళి పరిస్థితి చూసిరా. ఇక ఆలస్యం చేయకుండా రేపే మేం కూడా బయలుదేరి వచ్చేస్తున్నాం. సరేనా?" అన్నాడు అన్నారావ్.

"ఓ.కె. సార్" అంటూ లైన్ కట్‌చేశాడు బసవడు.

"ఎవరు మావయ్యా ఫోన్ చేసింది." అప్పుడే లోపలికొస్తున్న మహీధర్ అడిగాడు.

"ఇంకెవరు? మన బసవడు ఉజ్జయిన్నుంచి ఫోన్ చేశాడు. ఒక ముఖ్య సమాచారం చెప్పాడు. అదే ఆలోచిస్తున్నా" అంటూ సోఫాలో కూచున్నాడు అన్నారావు.

"ఏం చెప్పాడు? ఆలయాల జాడలేమన్నా తెలిశాయా?" కుతూహలంగా అడిగాడు మహీధర్.

"అంతకన్నా ముఖ్యమైన విషయం. నేను వద్దన్నా వినకుండా ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ అమ్మాయికి రాగిరేకు చూపించారు. ఇప్పుడేమైందో చూడు" కాస్త కటువుగా పలికాడు. "ఇప్పుడేమైంది?"

"ఇంకా ఏం కావాలి? ఆ ట్యాక్సీ డ్రైవరుతో కలిసి ఆ అమ్మాయి స్నిగ్ధ ఉజ్జయినిలో మనవాళ్ళకి కన్పించింది. వాళ్ళు మినర్వాహోటల్లో దిగారట. బసవడు ఫోన్‌లో చెప్పింది అదే. చూస్తుంటే ఆ అమ్మాయే మనకు పోటీ వచ్చేట్టుంది" వింటూనే షాకయ్యాడు మహీధర్.

తనతో కాంచన చెప్పిన సమాచారం ప్రకారం ఆ ట్యాక్సీ డ్రైవరు ఢిల్లీలో కదా ఉండాల్సింది. స్నిగ్ధతో ఉజ్జయినిలో ఉండటం ఏమిటి? కాంచన తనతో అబద్ధం చెప్పిందా లేక కృతయుగ్ కాంచనకి అబద్ధం చెప్పాడా! "నేన్నమ్మను. వాళ్ళు పొరపాటుపడుండాలి. కృతయుగ్ ఢిల్లీ వెళ్ళినట్టు తెలిసింది" అన్నాడు.

"పొరపాటుకు అవకాశం లేదు. పీటరువెంట వెళ్ళిన మనిషి ఇప్పుడు బసవడితో ఉన్నాడు. వాడికి వాళ్ళిద్దరూ బాగా తెలుసు" అన్నారావు మాటలు విని–

ఆలోచనలో పడిపోయాడు మహీధర్.

కృతయుగ్ ఢిల్లీ పోలేదా? కాంచన తనను తప్పుదారి పట్టించిందా లేక కృతయుగ్ కావాలని ఆమెతో అబద్ధం చెప్పాడా! అనవసరంగా తను కాంచన మాటలు నమ్మి చింటూభాయ్‌ని ఢిల్లీకి డైవర్ట్ చేశాడు.

"ఆలోచించింది చాలు. మనం వెంటనే బయలుదేరాలి. ఈ రాత్రికే మనవాళ్ళు పదిహేనుమందిని రైలెక్కించు. మనం ముగ్గురం, నీకు, నాకు, అనంతస్వామికి రేపు ఫ్లైట్‌కి టిక్కెట్లు బుక్‌చెయ్యి" అన్నాడు.

"అదేమిటి మావయ్యా? కాంచన రావటంలేదా? తనతో కలిపి నాలుగు ఎయిర్ టిక్కెట్లు బుక్ చేస్తాను" అడిగాడు మహీధర్.

"కాంచన ఇక్కడే ఉంటుంది. కారణం లేకుండా ఏ నిర్ణయాలూ తీసుకోనని తెలుసుగదా. డూ వాటైసే గో" అన్నాడు సీరియస్‌గా అన్నారావు.

ఆయన ఏ కారణంతో కాంచనను తీసుకెళ్ళటం లేదో ఊహించాడు మహీధర్. ఆమె వస్తే కృతయుగ్‌కి ఫర్‌గా ఉంటుందన్న అనుమానం కావచ్చు. ఇంకేం మాట్లాడకుండా అక్కడినుంచి వెళ్ళిపోయాడు మహీధర్. ఈ సంభాషణ మొత్తం పక్కగదిలోనే ఉన్న కాంచన వింటూనేవుంది.

స్నిగ్ధ, కృతయుగ్‌లు ఉజ్జయినిలో ఉన్నారని తెలీగానే ఆశ్చర్యపోయింది. విషయం గ్రహించింది. ఢిల్లీ వెళ్తున్నట్టు తనతో కావాలనే అబద్ధం చెప్పాడు. సందేహం లేదు. ఉజ్జయిని అంటే ఆలయాల అన్వేషణకని తెలిసిపోతుందని అబద్ధం చెప్పుండాలి.

అయినా నిధిమీద తనకెందుకు ఇంట్రెస్టు లేదు. స్నిగ్ధ తనకు సాయంగా తీసుకెళ్ళుంటుంది.

ఆలోచిస్తూ బయటికొచ్చి–“డాడీ!” అని పిలిచింది. ఏమిటన్నట్టు తిరిగి చూశాడు.

“డాడీ, మనకున్న ఆస్తులు చాలవా? వ్యాపారాల మీద లాభాలు చాలవా? ఇంకా నిధులు అవసరమా?” సూటిగా అడిగింది.

“పిచ్చిప్రశ్న” అంటూ నవ్వాడు అన్నారావు.

“డబ్బంటే ఎవడికి చేదు? ఈరోజు లోకం పరిస్థితి చూస్తున్నావుగా? వేలు సంపాదించేవాడు లక్షాధికారి కావాలనుకుంటున్నాడు. లక్షలు సంపాదించే వాడు కోటీశ్వరుడవ్వాలనుకుంటున్నాడు. కోటీశ్వరుడు వేలు లక్షల కోట్లు వెనకేసు కోవాలని చూస్తున్నాడు. ధనదాహం, అది ఎన్నటికీ తీరదు. అయినా ఇదంతా నా కోసమా, నీకోసమేగా సంపాదిస్తున్నాను?” అన్నాడు.

“నాకోసమా!” అంటూ పేలవంగా నవ్వింది కాంచన.

“లోకంలో నిజమయిన పేదవాడు ఎవడో తెలుసా డాడీ?” “డబ్బులేని ఎవడైనా పేదవాడే గదా!”

“కాదు, ఎంత సంపాదించినా తృప్తిపడనివాడు ఎవడో వాడే నిజమైన పేదవాడు. మనకి ఏం లేదని నిధులమీద ఇంత ఆశ? గతంలో మీరు ఎన్నోచోట్ల నిధులు తీశారు. అది వేరు. నిజానికి ప్రభుత్వానికి చెందాల్సిన నిధులు మీరు సొంతంచేసుకున్నారు. ఇక వాటి జోలికి వెళ్ళకుండా వుంటే మంచిది డాడీ.

పైగా ఇది ఆలయనిధి. దేవుడి సొత్తు. దాన్ని అపహరించటం పెద్దపాపం. వద్దుడాడీ, దాన్ని వదిలేయండి ప్లీజ్” అర్థించింది.

“వదలడమా, అంతులేని సంపదను వదలడమా... పురాతన ఆలయాల్లో పూర్వం ఎప్పుడో రాజులు, చక్రవర్తులు దాచుకున్న నిధులవి.

కేరళలోని అనంతపద్మనాభస్వామి ఆలయ నేలమాళిగల్లోని సంపద గురించి విన్నావుగదా. పైపై అంచనాలే లక్షా యాభైవేల కోట్ల విలువ చేసే నిధులు. నా అంచనా కరక్టయితే ఈ ఆదివిష్ణు ఆలయంవద్ద అంతకన్నా పెద్ద నిధులే ఉండాలి.

అయినా దేవుడికి నిధులతో పనేమిటే పిచ్చితల్లి. ఏం చేసుకుంటాడు? మనం గుళ్ళో కొబ్బరికాయ కొట్టి నైవేద్యాలు సమర్పించి దండం పెట్టుకుంటాం. అవన్నీ కావాలని దేవుడు అడిగినట్టు విన్నావా?

దేవుడి పేరుతో ఏం చేసినా అదంతా మన తృప్తికోసం చేస్తాం. ఇందులో పాపపుణ్యాల ప్రసక్తి లేదు. నిధి ఉందంటే చాలు. అది దేవుడిదా మనుషులదా అని ఆలోచించను. సొంతం చేసుకునేవరకూ నిద్రపోను”

"అవును. ఆలోచించొద్దు. నిద్రపోవద్దు. మీరు చేస్తున్నది పాపమని మీకు తెలీటంలేదు. ఏదో రోజు మీరు చేసే పాపాలన్నీ మీ కూతురుగా నాకు చుట్టుకుని ఉసురుతీస్తాయి" అంది బాధపడుతూ కాంచన.

అయినా చలించలేదు అన్నారావు.

"పాపం లేదు, పుణ్యం లేదు. అవన్నీ కల్పితాలు. సంపాదించుకున్నవాడికి సంపాదించుకున్నంత. ఏ కరెన్సీ నోటుమీదైనా అది పాపపుసొమ్ము పుణ్యంసొమ్ము అని రాసుంటుందా? ఉండదు. డబ్బు, అంతే. అది చలామణి అవుతూనే వుంటుంది. పిచ్చి ఆలోచనలు చేయకు. వెళ్ళు" అన్నాడు.

ఇంకేం చెప్పినా ఆయన వినడని తనకి అనుభవం నేర్పిన పాఠం. అందుకే ఇక ఒత్తిడి చేయటం అనవసరం అన్పించింది. చివరి ప్రయత్నంగా–

"ఓ.కె. డాడీ, మీ కూతురిగా మీ కార్యకలాపాల్లో కొంత నేనూ గతంలో భాగం పంచుకున్నాను. పాపమో పుణ్యమో ఈసారి కూడా మీతో వస్తాను.

నన్ను పక్కనుంచాల్సిన పనిలేదు. నాకూ టిక్కెట్ బుక్ చేయండి" అంది.

"ఊహుఁ" అంటూ వీలుకాదన్నట్టు తల అడ్డంగా ఊపాడు అన్నారావు.

"ఈసారి నిన్ను పక్కనుంచడానికి తగిన కారణం ఉంది. నువ్వు ఎవరిని ప్రేమిస్తున్నావో నాకు తెలిసిపోయింది. వాడు నాకు శత్రువు. ఈ పరిస్థితిలో నిన్ను తీసుకెళ్ళలేను. నువ్వు ఇంట్లోనే ఉంటున్నావు. నో ఆర్గ్యుమెంట్స్. దట్సాల్" అంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడాయన. ఆయన వెళ్ళిన చాలాసేపటివరకు దీర్ఘంగా ఆలోచిస్తూ హాల్లోనే కూచుంది కాంచన.

అనుకున్నట్టుగానే అదే రాత్రి పదిహేనుమందితో కూడిన బృందం ఉజ్జయినికి రైల్లో బయలుదేరి వెళ్ళిపోయింది. స్వయంగా మహీధర్ వచ్చి వాళ్ళందర్నీ రైలెక్కించి పంపించాడు.

మరునాడు అన్నారావు. అనంతస్వామి, మహీధర్‌లు ఫ్లైట్‌కి బయలుదేరారు. చివరి క్షణంలో బురఖా ధరించిన ఒక ముస్లిమ్ యువతి కూడా హడావుడిగా ఫ్లైట్‌లో కొచ్చింది. కొద్దిసేపట్లోనే విమానం గాల్లోకి లేచింది.

చివరి క్షణంలో ఫ్లైట్ ఎక్కిన ఆ ముస్లిం యువతి ఎవరో కాదు... కాంచన.

*　　*　　*　　*　　*

గంగమ్మగుడి. అతి పురాతన ఆలయం. గుడి భారీ నిర్మాణం కాదు. కాస్త ఎత్తుగా ఉంది అంతే. గుడిచుట్టూ ప్రహరీ లేదు. కాని ఆలయం ఎదురుగా రాతిమండపం ఒకటుంది.

ఆ పరిసరాల్లో శాఖోపశాఖలుగా విస్తరించి భారీగా ఎదిగిన వేపచెట్లు అనేకం కన్పిస్తున్నాయి.

శుక్రవారం కావటంతో చాలా కుటుంబాలు అక్కడ విడిది చేస్తున్నాయి. వేపచెట్ల కింద పొంగళ్ళు వండేవాళ్ళు వండుతున్నారు. గుడిలో పొంగళ్ళు సమర్పించి మొక్కులు తీర్చుకునేవాళ్ళు తీర్చుకుంటున్నారు.

నట్టడవిలోని ఆ గుడికి సరైన రోడ్డు సౌకర్యంకూడా లేదు. అయినా శ్రమనుకోకుండా భక్తులు కాలినడకన, వాహనాలమీద వస్తూనేవున్నారు. గుడికి చెందిన పూజారులు చాలా బిజీగా ఉన్నారు. స్నిగ్ధ, కృతయుగ్‌ల జీప్ అక్కడికి చేరుకునేసరికి పరిస్థితి అది.

ఉదయం సూర్యోదయానికి ముందే ఉజ్జయినిలో బయలుదేరి బ్రిడ్జిమీదుగా గది పశ్చిమభాగానికి చేరి దక్షిణంగా ప్రయాణం చేసి అక్కడికి చేరుకున్నారు. అప్పటికి ఉదయం సమయం పదిగంటలు.

గుడి సంతూరుగ్రామ పొలిమేరల్లోనే ఉంది. ఇది కూడా గిరిజనగూడెం లాంటిదే. గుడివద్దకి ఊళ్ళోని ఇళ్ళు, వీధులు కన్పిస్తున్నాయి.

కేవలం సంతానంకోసమే కాకుండా ఇతరత్రా వరాలు ఆశిస్తున్నవాళ్ళు కూడా గుడికి వస్తున్నారు. గర్భగుడిలోకి వెళ్ళి అమ్మవారి దర్శనం చేసుకున్న తర్వాత ఆలయ పరిసరాలన్నీ ఓ గంటపాటు క్షుణ్ణంగా పరిశీలించి వచ్చి ఆలయం ఎదురుగా ఉన్న మండపంలో కూచున్నారు ఇద్దరూ. ఆలయం కొంతమేర రాతికట్టడంకాగా మిగిలిన పైభాగం ఇటుకల నిర్మాణంతో సాగింది.

ఆలయ మండపం స్తంభాలమీద విష్ణుగాథలకి సంబంధించిన శిల్పాలు బాగా అరిగిపోయిన స్థితిలో కూడా స్పష్టంగా కన్పిస్తున్నాయి.

"సందేహం లేదు స్నిగ్ధా, ఒరిజినల్‌గా ఇది సంతానలక్ష్మి ఆలయమే. వరద ముంపులో గుడి పైభాగం కూలిపోగా తర్వాతికాలంలో దీన్ని ఇటుకల నిర్మాణంతో పునరుద్ధరించి గంగానమ్మ గుడిగా మార్చేశారు. ఇది వైష్ణవాలయం అనడానికి ఈ స్తంభాలమీది శిల్పాలే నిదర్శనం" అన్నాడు కృతయుగ్.

"ఫరవాలేదు. నువ్వు కూడా మా డిపార్ట్‌మెంట్‌కి పనికొస్తావ్" అంటూ నవ్వింది స్నిగ్ధ.

"అంటే నా అంచనా కరెక్ట్ కాదనా?" అడిగాడు.

"హండ్రెడ్ పర్సంట్ కరెక్ట్. అయితే కూలిపోయిన ఈ రాతిమండపాన్ని కూడా పునరుద్ధరించారు. ఆ విషయం నువ్వు గమనించలేదు" అంది.

"ఓ.కె. మన సందేహం తీరిపోయింది. అష్టలక్ష్మి ఆలయాల్లో ఈ గంగమ్మ ఆలయం సంతానలక్ష్మి ఆలయం. సందేహంలేదు. నెక్స్ట్ మన ప్రోగ్రాం ఏమిటి?"

"నీకు తెలీదా? మనకు తెలిసిన ఆధారాల ప్రకారం ఈ గుడి ఆదివిష్ణు ఆలయానికి వెనకపక్కన పదిమైళ్ళ దూరంలో ఉంది. ఇక్కడినుండి తూర్పుగా మనం ప్రయాణంచేస్తే నదిలోని దీవివద్దకు చేరుకోవాలి"

"అయితే ఆలస్యం దేనికి? పద. అదికూడా చూద్దాం" అంటూ మండపం దిగాడు కృతయుగ్.

సంతూర్ గూడెంనుండి తూర్పుగా నేరుగా అడవిలోకి బయలుదేరింది జీప్.

క్షిప్రానది తూర్పుభాగంకన్నా ఇటు పశ్చిమభాగంలోనే అటవీభూములు ఎక్కువున్నాయి. అడవి దట్టంగానే ఉన్నప్పటికీ క్రూరమృగాల సంచారం తక్కువ. గిరిజనులైన గోండులు– సంతాల్ తెగవారు– భిల్లజాతి బోయలకు చెందిన గూడాలు చాలావున్నాయి.

వేట వీరి వృత్తిగావటంతో చాలాకాలం కిందటే ఈ ప్రాంతంలో క్రూర మృగాల సంచారం తగ్గిపోయింది.

అక్కడక్కడా ఎలుగ్గొడ్లు– అడవి నక్కలు– తోడేళ్ళ సంచారం మాత్రం ఉంటుంది.

ఈ రోజు ఆకాశం మబ్బుపట్టి ఎండతీవ్రత తెలీటంలేదు. సంతూర్ నుండి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలోని భిల్లగూడెంవరకు అడవిలోకి కచ్చారోడ్డు ఒకటుంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఎగిరి అవతల పడుతుంది జీప్. అంత పెద్ద గోతులున్నాయి దారి పొడవునా. బాటమీద ఆడుకొంటున్న ఎలుగ్గొడ్డు పిల్లలు ఇంజను సౌండ్‌కి దూరంగా పరుగుతీస్తున్నాయి.

దారి పొడవునా కొత్త జంతువులు, వింత పక్షులు కన్పిస్తున్నాయి. అడవి కుక్కల గుంపొకటి కొంత దూరం జీపు వెంటబడి తరుముకొచ్చాయి.

ఎలాగో భిల్లగూడెం చేరుకున్నారుగాని అక్కడి నుండి నదివైపు ముందుకు ఒక బాటంటూ ఏదీలేదు.

గూడెంవాసులు చెప్పిందాన్నిబట్టి జీపు సాగటానికి అనువుగా ఉన్న ప్రదేశాల గుండా సాగుతూ సుమారు పన్నెండుగంటల సమయానికి క్షిప్రానదిని చేరుకున్నారు. వారు చేరిన ప్రాంతం దీవికి ఫర్లాంగు దూరం ఎడంగా ఉంది. తీరంలో దారి చూసుకుంటూ దీవికి తిన్నగా జీపును తీసుకెళ్ళి అక్కడ ఆపాడు కృతయుగ్.

సందేహం నివృత్తి అయిపోయింది.

నిన్న గిరిజనగూడెం వృద్ధుడు చెప్పిన సమాచారం నూటికి నూరుశాతం నిజమైంది. నిస్సందేహంగా గంగమ్మగుడే ఒకనాటి సంతానలక్ష్మి ఆలయం.

జీప్ నిలిపిన చోటుకి – నదిలోని దీవి స్పష్టంగా – అతి సుందరంగా కన్పిస్తోంది. సుమారు మూడు ఫర్లాంగుల వైశాల్యంతో కోడిగుడ్డు ఆకారంలో ఉండి, దీవిమీద మహావృక్షాలు, పొదలతో దట్టమైన అడవిలా ఉంది.

క్షిప్రానది హుందాగా, ప్రశాంతంగా ప్రవహిస్తోంది. తీరం నుండి దీవి ఫర్లాంగు దూరంలో ఉంది. దీవి నుండి అటు తూర్పుతీరం మరో ఫర్లాంగు దూరం ఉంటుంది. నదికి అటూ ఇటూ కూడా అడవి.

నదిలో దూరంగా రెండు మూడు ఇసుక మేటలు కన్పిస్తున్నాయి. నది దిగువన కట్టిన ఆనకట్ట మూలంగా నదిలో ఎప్పుడూ పుష్కలంగా నీరుంటుంది.

"స్నిగ్ధా, నాకో డౌటు అడగనా?" కాస్సేపు పరిసరాల్ని పరిశీలించాక అడిగాడు కృతయుగ్.

"అడుగు. ఏమిటా డౌటు?" పక్కకొస్తూ అడిగింది.

"గిరిజన వృద్ధుడు నిన్న మనకో హెచ్చరిక చేశాడు. దీవిమీదకు వెళ్ళిన వాళ్ళు వెనక్కిరాలేరని. కొందరు చనిపోయారని, కొందరు ఎలాగో ప్రాణాలు దక్కించుకుని పారిపోయివచ్చారని.

ఇలా... ఇంకా దీవిమీద తేనెటీగలు, పాములు, కోతులు, అడవికుక్కలు వంటివి దాడిచేసి చంపేస్తాయని. అదే నిజమయితే నిధులకు ఏర్పరచిన కావలి శక్తులు దాడిచేస్తున్నాయని అనుకోవాలి. అంతేగా?" తన సందేహాన్ని వివరించాడు.

"అఫ్‌కోర్స్. యు ఆర్ రైట్... మరి నీ డౌట్ ఏమిటి?" అంది స్నిగ్ధ.

"చెప్తాను. ఆలయం నైరుతిభాగంలో నిధి రహస్యంగా దాచిపెట్టబడింది కరక్టే అనుకుందాం. నాలుగు గోపురాలతో అలరారుతూ గర్భగుడిలోని ఆదివిష్ణువు వైభవంగా పూజలందుకుంటున్న కాలంలో నిధులిక్కడ దాచబడ్డాయి. ఆలయానికి దైవదర్శనం కోసం ఎందరో భక్తులు వస్తుంటారు. ఇలా కావలిశక్తుల్ని ఏర్పాటు చేసుంటే భక్తులకు సంకటం కదా!"

"నీ సందేహం అర్థమైంది. నువ్వన్నది నిజమే. నిధి నిక్షిప్తం చేసినప్పుడే కావలి శక్తుల్ని ఏర్పాటు చేస్తారు. నిధిని తవ్వాలని ప్రయత్నించిన వాళ్ళనే అవి దెబ్బతీస్తాయిగాని ఆలయానికొచ్చినా, దీవిమీద తిరిగినా అవి ఎవరి జోలికీ రావు.

కాని దీవిమీద ఆలయాన్ని శత్రువులు, వరదలు కూడా ధ్వంసం చేశాక ఎవరో ఆ శక్తుల్ని ప్రేరేపించారు. బహుశా ఆ పని రాగిరేకు రాసిన శంభులింగయాచారి చేసుండాలి లేదా అతని ఆజ్ఞమేరకు ఎవరో మంత్రవాది చేసుండాలి. కాబట్టి ఆలయాలు శిథిలమైన తర్వాతికాలంలోనే ఈ శక్తులు ఎవరినీ దీవిమీదకు రాకుండా అడ్డుకుంటూవుండాలి" అంటూ తన అభిప్రాయం వివరించింది స్నిగ్ధ.

అదే వాస్తవం కావచ్చని తోచింది కృతయుగ్‌కి. ఇద్దరూ తిరిగి జీప్‌లో కూచుని డోర్ మూశారు. బిస్కెట్లు తింటూ దీవిని పరిశీలించసాగారు. దీవి పరిసర ప్రాంతాల్లో తీరాన పల్లెకారుల ఆవాసాలు ఎక్కడా లేవు. దీవిమీదకు వెళ్ళి చూడాలన్నా కనుచూపు దూరంలో ఎక్కడా నాటు పడవలుగాని, చేపల పడవలుగాని కనిపించటంలేదు.

అంతలో నది దిగువకు చూసిన స్నిగ్ధ, కృతయుగ్‌ను తట్టి అటు చూపించింది. అటు చూసిన కృతయుగ్‌కి ఏదో నాటుపడవ ఒకటి నదిఎగువకు ప్రయాణంచేసి వస్తూ కన్పించింది.

అది చేపలు పట్టే జాలర్ల పడవ కాదు. అందులో జాలర్లు లేరు. ఎవరో నలుగురు నాగరీకులు ఉన్నారు. ఇద్దరు మధ్యలో కూచునుంటే ఇద్దరు తెడ్లు వేస్తున్నారు. ప్రవాహానికి నెమ్మదిగా ఎదురు ప్రయాణిస్తోంది నావ. వాళ్ళు ఎవరు? ఎక్కడికి వెళ్తున్నారు? కృతయుగ్, స్నిగ్ధలు ఆ పడవను గమనిస్తూ బిస్కెట్లు తిని కాఫీ తాగారు. క్షణాలు భారంగా దొర్లిపోతున్నాయి.

ఆకాశంలో మబ్బులు తొలగి – సూర్యుడు తొంగిచూస్తున్నాడు. వాతావరణంలో ఒక్కసారిగా వేడి రాజుకుంది. కాని అడవిమీదుగా వస్తున్న గాలులు తాపాన్ని తెలీనీయటంలేదు. ఆ నావ సూటిగా దీవివైపు కదలటం చూసి నొసలు విరిచాడు కృతయుగ్.

"సందేహం లేదు. వాళ్ళూ దీవివైపు పోతున్నారు" ఉత్కంఠభరితంగా అరిచింది స్నిగ్ధ.

కృతయుగ్ మౌనంగా ఉండిపోయాడు. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. స్నిగ్ధ అంచనా కరక్టే. ఆ నావ దీవివైపు పోతోంది. వాళ్ళు ఎవరైవుంటారు?

తెలీక దీవివైపు వెళ్తున్నారా లేక తెలిసే అక్కడ ఏముందో చూడాలని సాహసం చేస్తున్నారా! ఎందుకు వెళ్తున్నారు? సరదాకి వెళ్ళే సాహసం ఎవరూ చేయరు? అదీ ఒకరిద్దరు కాదు, నలుగురు. వాళ్ళనే గమనిస్తున్న కృతయుగ్‌కి రాకూడని అనుమానమొకటి వచ్చింది.

"స్నిగ్ధా! వాళ్ళు అన్నారావు మునుషులైవుంటారా?" అడిగాడు. స్నిగ్ధ అతడ్ని దిగ్భ్రాంతిగా చూసింది. ఇంత వరకూ తనకా ఆలోచనే రానందుకు సిగ్గుపడింది.

"నాకీ ఆలోచనే రాలేదు చూడు. ఇందుకే నువ్వు నా వెంట ఉండాలన్నాను" అంటూ మీదకు వాలి తీపి ముద్దుతో సత్కరించింది.

"హలో! ఇటువంటి ఏకాంతంలో నువ్విలా ముద్దులిచ్చి రెచ్చగొట్టేపనులు చేస్తే గుర్రాలు అదుపుతప్పి మనకిదే హనీ మూన్ లొకేషనై పోతుంది తెలుసా! కంట్రోల్ యువర్ ఎమోషన్స్" నవ్వుతూనే చురక వేశాడు కృతయుగ్. అతన్ని కొంటెగా చూస్తూ మూతి మూడువంకర్లు తిప్పి వెక్కిరించింది స్నిగ్ధ. ప్రకృతి ఒడిలో ఆమె అందాలు వనకన్యలా మెరిసిపోతున్నాయి.

"నేను కంట్రోల్లోనే ఉన్నాను. నువ్వు కంట్రోల్ తప్పకు. మనకన్నాముందే అన్నారావు మనుషులు ఉజ్జయినిలో తిష్టవేసుండాలి. వాళ్ళు తప్ప ఇంకెవరూ దీవిమీదకు వెళ్ళే ప్రయత్నం చేయరు" అంది.

"అదే నిజమైతే వాళ్ళలో ఒక్కడన్నా బతికి వెనక్కొస్తాడోలేదో అనుమానమే. దీపాన్ని వెదుక్కొంటూపోతున్న శలభాలు వాళ్ళు" అన్నాడు కృతయుగ్.

ఇద్దరూ జీప్‌లో కూచునే – నావను గమనిస్తున్నారు. చూస్తుండగానే నావ దీవి చేరుకుంది. వాళ్ళంతా నావ దిగారు. నావ తాడును తీరంలోని ఒక చెట్టుమానుకు కట్టేశారు. ఒకరి తర్వాత ఒకరుగా నలుగురూ దీవిపైకి వెళ్ళి గుబురు చెట్ల మాటున అదృశ్యమయ్యారు. క్షణాలు మౌనంగా దొర్లిపోతున్నాయి.

ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠతో ఇద్దరూ దీవిని గమనిస్తూ కూచున్నారు. వాళ్ళు దీవిమీదకు వెళ్ళటం మాత్రం కంటబడింది. తర్వాత వాళ్ళ జాడలేదు.

చెట్ల గుబురులో ఎక్కడ తిరుగుతున్నారో, వాళ్ళు ఏమయ్యారో కూడా తెలీలేదు. గంట సమయం ఇట్టే గడిచిపోయింది. "స్నిగ్ధా, నువ్విక్కడ వెయిట్ చేస్తావా? నేవెళ్ళి చూసొస్తాను?" అడిగాడు కృతయుగ్.

"నవ్వు వెళ్తావా... దీవి మీదికి?" ఆందోళనగా అడిగింది.

"అవును"

"ఎలా వెళ్తావ్?"

"ఈదుకుంటూ వెళతాను. నదిలో ఈతలు కొట్టడం మా మున్నలూరు వాళ్ళకి అలవాటే"

"నువ్వు గజ ఈతగాడివి కావచ్చు. అలాగని ఈ క్షిప్రానదిలో ఈదుతానంటే ఒప్పుకోను. ఒంటరిగా దీవిమీదికి అస్సలు పోనీను" అంది నిష్కర్షగా.

"వాళ్ళు ఏమయ్యారో తెలియాలిగా..." అన్నాడు.

"అది వాళ్ల సమస్య. వాళ్ళు తిరిగిరారు"

"మనం ఎలాగూ దీవిమీద అడుగుపెట్టకతప్పదు గదా"

"అదేదో కలిసే వెళదాం. కాని ఇప్పుడు కాదు. రేపు వెళుతున్నాం" అంది.

అంతగా స్నిగ్ధ వారించాక ఇంకేం మాట్లాడలేదు కృతయుగ్. మరో గంట సమయం భారంగా గడిచిపోయింది.

దీవినుంచి ఏ విధమైన అలికిడీ విన్పించటంలేదు. అక్కడ తీరాన కట్టిన నావ కెరటాలకు నీటిపై వూగుతూ అలాగే ఉంది. వెళ్ళినవాళ్ళు ఏమయ్యారో అర్ధంకాదు. సమయం రెండు గంటలు దాటింది.

"ఓ.కె. వాళ్ళ గురించి ఇక ఆలోచించటం అనవసరం. వెనక్కి వెళ్ళిపోదాం" అంటూ స్టీరింగ్ వెనక్కి జరిగాడు.

సరిగ్గా అప్పుడు – "చూడు కృతా... అటు చూడు" అంటూ దీవిమీదకు వేలెత్తి చూపించింది స్నిగ్ధ. దీవిమీద ఉన్నట్టుండి గాల్లోకి లేస్తున్నాయి కాకులు. వేలాది కాకులు ఒక్కసారి నల్లటి మబ్బులా గాల్లోకి లేస్తూ రణగొణధ్వనిగా అరుస్తున్నాయి.

కాకుల రొదతోబాటు హృదయవిదారకమైన ఆర్తనాదాలుకూడా దీవినుంచి నదీజలాలమీద తేలుతూ వినవచ్చాయి. రెండునిముషాలు అలా విన్పిస్తూనే ఉన్నాయి. అంతే – ఆ తర్వాత ఎప్పటిలా నిశ్శబ్దం అలముకుంది. అంతవరకూ గోలగోలగా ఎగిరిన కాకులు తిరిగి యధాస్థానాలకు చేరుకున్నాయి.

ఆ తర్వాత ఏ అలికిడీ లేదు. "పద వెళ్ళిపోదాం" అంటూ జీప్ ఇంజన్ స్టార్ట్ చేశాడు కృతయుగ్.

"ఏమైంది?" గాభరాను అణచుకుంటూ అడిగింది స్నిగ్ధ.

"ఐపోయింది. వాళ్ళంతా అయిపోయారు" జీప్‌ను వెనక్కి తిప్పి వచ్చినదారినే ముందుకు దూకించాడు.

స్నిగ్ధ కళ్ళముందు ఇంకా దీవిమీదకు పోతున్న నలుగురూ మెదులుతూనే వున్నారు.

భయోద్వేగాన్ని అదుపుచేసుకుంటూ మౌనంగా ఉండిపోయింది స్నిగ్ధ.

స్నిగ్ధ, కృతయుగ్‌లు ఊహించింది నిజం. దీవిమీదకు వెళ్లినవాళ్ళు బసవడు, వాడి మనుషులే. దీవి మీదకు వెళ్ళి అక్కడ పరిస్థితులు చూసిరమ్మని నిన్న అన్నారావు ఫోన్‌లో ఆర్డర్ వేయటంతో తనూ వెళ్ళిరావాలని నిశ్చయించుకున్నాడు బసవడు. తన మనుషుల్లో వీరా అనేవాడ్ని స్నిగ్ధ, కృతయుగ్‌ల కదలికల్ని కనిపెట్టి వుండేందుకు ద్వారకాలాడ్జివద్ద వదిలేశాడు.

మిగిలిన నలుగురితో జీప్‌లో బయలుదేరాడు.

వాళ్ళకన్నా ముందే మినర్వా హోటల్ నుంచి స్నిగ్ధ, కృతయుగ్‌లు తమ జీప్‌లో వెళ్ళిపోయారు.

దీవిని చేరుకోవాలంటే బోటుగాని, నాటుపడవగాని అవసరం. మూడు గంటలు ప్రయాణం చేసి దీవికి మూడు కిలోమీటర్ల దిగువనున్న ఒక బెస్తగూడెం చేరుకున్నారు. డ్రయివర్‌ని జీప్‌వద్ద ఉంచేశారు. ఒక నాటు పడవను అద్దెకు తీసుకుని మిగిలిన ముగ్గురితో కలిసి దీవికి బయలుదేరాడు బసవడు.

మధ్యాహ్న సమయానికి – నావ దీవిని చేరుకుంది.

నావ తాడును తీరంలో చెట్టుకుకట్టి దీవిమీదకు నడిచారు. దీవి గురించి ఎంతో కొంత వినివున్నారుగాబట్టి అక్కడ అడుగుపెట్టాలంటే ధైర్యం కావాలి. బసవడి లాంటివాళ్ళు ధైర్యంకోసం లిక్కర్‌మీద ఆధారపడ్డం సహజం. నావలో వస్తున్నప్పుడే ఫుల్‌గా ఆనైపోయారు. దాంతో నలుగురూ మాంచి హుషారుగాను నిర్భయంగాను ఉన్నారు. అంతగా ఏదన్నా సమస్యవస్తే వెంటనే నావవద్దకు పారిపోవచ్చుని వాళ్ళ ఉద్దేశం.

నావవద్ద నుంచి పదిహేనడుగులు ఏటవాలుగా పైకి ఎక్కి దీవిమీద అడుగుపెట్టారు. అందరివద్దా రివాల్వర్లున్నాయి. తన రివాల్వర్ సిద్ధంగా ఉంచుకొని బసపడు ముందు పోతూండగా వాడ్ని అనుసరించారంతా.

దీవి మొత్తం అదో కొత్త ప్రపంచంలా ఉంది. దీవి మీద ఎటు చూసినా అనేక ఫలవృక్షాలు, కొబ్బరిచెట్లు దట్టమైన పొదలు ఉన్నాయి.

దీవిమీద క్రూరమృగాలు కాని, విషకీటకాలుగాని ఏమీ ఉన్నట్టుగా జాడలేదు. గాలి ఆహ్లాదభరితంగా ఉంది. చెట్ల కొమ్మలమీద కాకులు ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఇంకా అనేక పక్షిజాతులు ప్రశాంతంగా జీవిస్తున్నాయి. కొమ్మలవెంట నల్లటి ముఖాలతో ఉండే కొండముచ్చు జాతి కోతులు అనేకం ఉన్నాయి.

వృక్షాల చిటారుకొమ్మల్లో పెద్ద పెద్ద తేనెపట్టులున్నాయి. అర్థగంట గడిచినా దీవిమీద తమకి ఎలాంటి సమస్య ఎదురుగాకపోవడంతో అంతా హుషారుగా కేరింతలు కొడుతూ వృక్షశాఖలనుంచి నచ్చిన ఫలాలు కోసుకుతిన్నారు. దీవి మధ్యలో ఆలయం తాలూకు శిథిలాలు అనేకం కన్పించాయి.

"అన్నా బసవన్నా! చూస్తుంటే ఉజ్జయినివాళ్ళు పిరికిసన్నాసుల్లాగున్నారన్నా. ఏముందన్నా ఇక్కడ భయపడ్డానికి?" అనరిచాడొకడు పెద్దగా నవ్వుతూ.

"అన్నీ కథలు... కట్టుకథలు" అన్నాడు బసవడు.

"అవునన్నా... ఈ దీవిగురించి బయట జనాలు చెప్పుకునే మాటల్లో కొంచెం కూడా వాస్తవంలేదు" అన్నాడు మరొకడు. అంతా నవ్వుకుంటూ ముందుకు సాగారు. అలా ఆలయ శిథిలాలు దాటి పశ్చిమంగా వెళ్ళి అటునుండి దక్షిణంగా తిరిగారు.

బసవడు దీవి విశేషాల్ని చెప్పాలన్న కుతూహలంతో తన సెల్‌ఫోన్ నుంచి ఫోన్లు కొట్టి చూశాడు. అది అటవీ ప్రాంతం. సమీపాల్లో ఎక్కడా సెల్ టవర్లు లేకపోవడంతో ఒక్క నంబరూ కలవలేదు. వాళ్ళలో ఒకడు సెల్‌ఫోన్లో పాటలు పెట్టుకుని వింటూ వస్తున్నాడు.

వాళ్ళంతా పశ్చిమతీరంవైపు వచ్చి అక్కడి నుండి దక్షిణంగా ముందుకు సాగారు.

అలా కొంతదూరం ముందుకెళ్ళగానే ఉన్నట్టుండి పెద్ద గాలితెర వీచింది. నేలమీది ఆకు అలములు ధూళి గాల్లోకి లేచి కొద్దిసేపు ఊపిరి ఆడనట్టైంది.

అంతలో సడెన్‌గా ఆగిపోయాడు బసవడు.

మూలుగు... ఏదో ఒక విచిత్రమైన మూలుగు ధ్వనిని వాడి చెవులు పసిగట్టాయి. వెంటనే అలర్టవుతూ "ఓరే. ఫోన్ ఆపరా" అనరిచాడు. వెనకే వస్తున్న అనుచరుడు వెంటనే ఫోన్ ఆఫ్‌చేశాడు.

"ఏమైందన్నా?" పక్కవాడు అడిగాడు.

"చెవులు రిక్కించి వినండి. ఏదో మూలుగు శబ్దం విన్పించింది" హెచ్చరించాడు. చిన్నగా అడుగులు వేస్తూ – చెవులు రిక్కించారంతా.

"అన్నా... ఇటు చూడండి" అనరిచాడు ఒకడు. ఒకటికాదు రెండుకాదు, కొండముచ్చు కోతులు అనేకం చెట్లకొమ్మలమీద దూకుతూ తమను అనుసరించి వస్తున్నాయి. వాతావరణంలో ఏదో తేడా కన్పిస్తోంది.

"ఏమిట్రా! ఈ కోతులేమిటి మనల్ని ఫాలో అవుతున్నాయి?" ఆశ్చర్యంగా అడిగాడు బసవడు.

అదే సమయంలో మరోసారి విన్పించింది మూలుగు శబ్దం. ఈసారి మరింత స్పష్టంగా పెద్దగా విన్పించింది. అందరికీ వినబడింది. ఆ శబ్దం భూమిలోపలినుంచి వస్తున్నట్టుంది. ఎక్కడో పాతాళం నుంచి వస్తున్నట్టుంది.

ముందుగా అనుచరుల్లో ఒకడు భయపడిపోయాడు. కంగారుగా దిక్కులు చూశాడు. కోతులు ఒక్కటొక్కటిగా కొమ్మలనుంచి నేలకు దూకుతున్నాయి. కోతుల్లో కొండముచ్చులు సైజు పెద్దవి. ఆపైన వాటి ముఖాలే నల్లగా వికృతంగా దయ్యం ముఖాల్లా ఉంటాయి. అవి తమను రౌండప్ చేయబోతున్నట్టు డౌటు వచ్చేసింది.

"అన్నా! నాకేదో భయంగా ఉంది. వెనక్కి వెళ్ళిపోదాం." అన్నాడు బెదిరిపోయినవాడు.

"ఛత్, పిరికినాయాలా. ఈమాత్రానికే భయపడతా వేంటిరా. రివాల్వ రుందిగా. ఏదన్నావస్తే కాల్చిపారెయ్" అంటూ ఒకడు రివాల్వర్ తీశాడు.

ఈ పరిస్థితిలో బసవడు కూడా కొంచెం జంకాడు. అదృశ్యశక్తులు వాటి దాడులగురించి ఎంతో కొంత వినివున్నాడు వాడు. భూమిలోని కావలిశక్తులు లేచినప్పుడలాగే మూల్గుతాయని విన్నాడు.

ఏం చేయాలో అర్థంగాక కొద్ది సెకన్లపాటు ఉన్న చోటే నిలబడిపోయి నుదుట పట్టిన చెమట తుడుచుకున్నాడు. ఒళ్ళంతా గగుర్పొడిచింది.

భయమంటే ఏమిటో వాళ్ళందరికీ ఇప్పుడిప్పుడే బాగా అర్థమవుతోంది. ఎంతగా గుండె గట్టిపరచుకున్నా – అరచేతులు చెమటలుపడుతున్నాయి.

నరనరానా పాదరసంలా వ్యాపిస్తోంది భయం.

మూలుగు శబ్దం భూమిలోంచి అంతకంతకూ అధికమవుతోంది. గోతికాడ నక్కల్లా కొండముచ్చులన్నీ వాళ్ళకి దూరంగా నేలకు దిగి వలయా కారంలో కూచుని కోపంతో తోకలు నేలకేసి బాదుతూ అంగుళం పొడవు ఉండే తమ కోరపళ్ళు చూపించి బెదిరిస్తున్నాయి.

ఇవి చాలదన్నట్టు ఎవరో రాయి విసిరితే లేచినట్టు కొమ్మలకు వేలాడుతున్న తేనెగూళ్ళ నుంచి అడవి తేనెటీగలు గాల్లోకి లేచి ముసురుకోనారం భించాయి. పొదలవెంట ఏదో చరచరా పాకుతున్న శబ్దం వినవస్తోంది. ఉన్నట్టుండి వెనుతిరిగాడు బసవడు.

"పదండ్రా. ఒక్క క్షణం కూడా ఇక్కడ ఉండొద్దు. వెనక్కి పారిపోదాం పదండి" అని పెద్దగా అరిచాడు.

అంతా వెనుతిరిగిన అదేక్షణంలో మరో ప్రమాదం ముంచుకువచ్చింది. సుడిగాలిలా వచ్చి బసవడి దారికి అడ్డంగా నిలబడిందో పాము. అది సాధారణ పాముకాదు.

మిలమిలా మెరిసిపోతున్న గోధుమ త్రాచు. సుమారు ఎనిమిది మూరల పొడవున దుంగలా వుంది. చుట్ట చుట్టుకొని చేటంత పగడ విప్పింది. దాని కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా ఉన్నాయి. దాన్ని చూడగానే పై ప్రాణాలు పైనే ఎగిరిపోయినట్లైంది బసవడికి.

ఆ క్రూర సర్పానికి ఏడడుగుల దూరంలో బసవడు, దాని వెనక ఆరు అడుగుల దూరంలో అనుచరులు ముగ్గురు ఉన్నారు. వాళ్ళని రౌండప్ చేసి కోతుల మూక, పైన గాల్లో తేనెటీగల గుంపు.

అష్టదిగ్బంధనంలో ఇరుక్కున్నట్టయింది అందరి పరిస్థితీ. చేతుల్లో రివాల్వర్లున్నా ఏం చేయాలో తోచని అయోమయంలో పడిపోయారంతా. భయంతో చెమటలు కారుతున్నాయి శరీరాలు.

సుమారు రెండు నిముషాలపాటు బసవడ్ని నిలబెట్టేసిందా సర్పం. తర్వాత చుట్టలు విప్పుకొని మీదకు రావటం ఆరంభించింది.

చివరిక్షణంలో ధైర్యాన్ని కూడదీసుకుంటూ బసవడు రివాల్వర్‌తో సర్పం పడగమీదకు షూట్‌చేసాడు. ఆశ్చర్యకరంగా మెరుపు వేగంతో పడగ వంచి బుల్లెట్ నుంచి తప్పించుకుని అంతకన్నా వేగంగా బసవడి చేతిమీదికి తల విసిరింది. రివాల్వర్ పట్టిన చేతిమీద కాటందుకుంది.

హృదయవిదారకంగా అరుస్తూ విరుచుకుపడిపోయాడు బసవడు. అది చూడగానే అనుచరులు ముగ్గురికీ వెన్నులోంచి పుట్టుకొచ్చింది భయం. ఎంత భయమంటే అక్కడ్నుంచి కదలడానిక్కూడా ఇష్టంలేనట్టుగా కాళ్ళు చచ్చుబడి మొరాయించాయి.

ఒకటికాదు రెండు కాదు. కసితీరా వాడ్ని అరడజను సార్లు కాటువేసి ఎటో వెళ్ళిపోయిందా పాము. బసవడి అరుపులతో ఆ ప్రాంతం మారుమ్రోగింది.

అది వింటూనే చెట్లకొమ్మలమీది కాకులు మరింత భయోత్పాతాన్ని సృష్టిస్తూ గోలగోలగా అరుస్తూ గాల్లోకి లేచాయి. చూస్తూవుండగానే బసవడి శరీరం మసిబొగ్గులా నల్లబడిపోయింది.

అదే సమయంలో వాడి శరీరం పడినచోట భూమిలోంచి గుట్టలు గుట్టలుగా లేచిరానారంభించాయి.

నల్లటి గండు చీమలు. అంగుళం పొడవున లావుగా దుంగలా వున్న చీమలు. చూస్తూండగానే గుట్టలు గుట్టలుగా తేలి బసవడి శరీరాన్ని తినేయటం ఆరంభించాయి. నెత్తురుతో నేల తడిసిపోసాగింది.

అంతవరకే చూసారు అనుచరులు. వెంటనే పారిపోకుంటే తమ గతీ అంతేనని అర్థమైపోయి రివాల్వర్లతో కాల్పులు జరుపుతూ కోతుల గుంపుకి అడ్డంపడి పారిపోవాలని చూశారు. సాధ్యం కాలేదు. ఒక్కసారిగా వాళ్ళని తేనెటీగలు ముసురుకున్నాయి.

కోతులు మీదపడి కండలు పీకటం ఆరంభించాయి. వాళ్ళ అరుపులు ఆర్తనాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది అంతే – ఒకరి తర్వాత ఒకరు నేలకు వాలిపోయారు. అరిచే ఓపిక కూడా నశించిపోయింది. వారి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. గుట్టలు గుట్టలుగా లేచిన చీమలు వారి రక్త మాంసాలతో విందు చేసుకోనారంభించాయి.

కొంతసేపటికి తేనెటీగలు గూళ్ళకు వెళ్ళిపోయాయి. కోతులు వెనక్కి పరుగెత్తి చెట్లకొమ్మల్లోకి చేరుకున్నాయి. అప్పటికే బసవడి శరీరంలో ఎముకలు మాత్రం మిగలగా మిగిలినవాళ్ళ మృతదేహాలమీద నల్ల దుప్పటిలా చీమలు దాడిచేసి స్వాహా చేస్తూనేవున్నాయి.

కాకులన్నీ తిరిగి చెట్లమీద వాలగానే ఆ ప్రాంతం ఎప్పటిలా ఏమీజరగనట్టే తిరిగి ప్రశాంతంగా మారిపోయింది. దీవిమీద ఏముందో చూడాలని వచ్చిన నలుగురూ ఆ విధంగా అక్కడే బలైపోయారు.

* * * * *

అన్నారావు మనుషులు పదిహేనుమంది రైలు మార్గంగా ఉజ్జయిని చేరుకునేసరికి మరునాడు సాయంకాలమైంది. వాళ్ళని లీడ్ చేస్తున్నవాడు పీటర్.

కనుచీకటిపడుతున్నవేళకి అన్నారావు వెంట మహీధర్, మంత్రవాది అనంతస్వామి ఉజ్జయినికి చేరుకున్నారు. వాళ్ళు విమానంలో ఇండోర్ వచ్చి రోడ్డు మార్గంగా ఉజ్జయిని చేరారు. అంతా ద్వారకాలాడ్జిలోనే దిగారు. హైదరాబాద్‌లో విమానం ఎక్కే ముందు మహీధర్ ఢిల్లీలో వున్న చింటూభాయ్‌కి ఫోన్ చేశాడు.

కృతయుగ్ ఢిల్లీలో లేడని ప్రస్తుతం ఉజ్జయినిలో ఉన్నాడని వెంటనే ఉజ్జయిని చేరుకోమని ఉప్పందించాడు. తాముకూడా ఉజ్జయిని వస్తున్నట్టు చెప్పాడు.

ఆ ఫోన్‌కాల్ అందినవెంటనే దొరికిన ఫ్లైట్ పట్టుకుని తన మనుషులు నలుగురితో వాడు భోపాల్ వచ్చాడు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఉజ్జయిని చేరుకునే సరికి చీకటిపడింది. మినర్వా హోటల్‌కి వెనక వీధిలో హోటల్ ఉజ్జయిని ఉంది.

చింటూభాయ్ ఆ హోటల్లో సూట్ తీసుకున్నాడు. తండ్రికి తెలీకుండా బురఖా  ధరించి అదే విమానంలో ప్రయాణంచేసిన కాంచన కూడా హోటల్ ఉజ్జయినిలోనే సూట్ తీసుకుంది. తనూ మినర్వా హోటల్‌కు వెళ్ళిపోదామనుకుంది మొదట. కాని దానికి ఎదురుగా ద్వారకా హోటల్‌లో తమవాళ్ళంతా దిగుతారు.

కాబట్టి వాళ్ళ కన్నుగప్పటం కష్టం. అందుకే కృతయుగ్‌ను చూడాలని మనసు ఎంత తొందర చేస్తున్నా అదుపు చేసుకుంటూ వచ్చి హోటల్ ఉజ్జయినిలో దిగింది. కాని ఊహించనివిధంగా అక్కడ చింటూభాయ్‌ని, వాడి మనుషుల్ని చూసి షాకయింది. అసలు వీడెందుకు ఉజ్జయినికి వచ్చాడు? ఎలా వచ్చాడు?

మొదట అర్థంకాలేదుగాని వాడు బాల్కనీలో నిలబడి ఫోన్‌లో సంభాషిం చటం వినగానే ఆమె డౌటు క్లియరైపోయింది. అవతల లైన్లో ఉన్నవాడు  తన బావ మహీధర్. పగబట్టిన పాము దంతెవారానుండి కృతయుగ్‌ని కాటు వేయాలని వచ్చింది.

వాడికి కృతయుగ్ జాడ తెలియజెప్పింది మహీధర్. వాడు ఏ ఉద్దేశంతో చింటూభాయ్‌కి సహకరిస్తున్నాడో కూడా ఊహించేసింది. కృతయుగ్‌కి ఫోన్‌చేసి హెచ్చరించాలనుకుని కూడా చివరిక్షణంలో విరమించుకుంది.

ప్రస్తుత పరిస్థితిలో తను అజ్ఞాతంలో ఉంటేనే మంచిదనిపించింది. అప్పుడే ఎప్పటికప్పుడు వ్యూహాత్మకంగా వ్యవహరించటం సాధ్యపడుతుంది.

అక్కడ ద్వారకాలాడ్జిలో దిగిన అన్నారావు శిబిరంలో అంతా గందర గోళంగా ఉంది. తను లాడ్జికి రాగానే చిరునవ్వుతో స్వాగతం పలకాల్సిన బసవడి జాడలేదు. మరో ముగ్గురు ఏమయ్యారో తెలీదు.

వాళ్ళ జీపు ఇంతవరకు హోటల్‌కి తిరిగిరాలేదు. మిగిలిన ఒకే ఒక్కడు వీరా... వాడు తనకేమీ తెలీదంటున్నాడు. ఫోన్లో కాంటాక్ట్ చేయాలని ఎన్నిసార్లు ప్రయత్నించినా అవుటాఫ్ కవరేజ్ అనే రిప్లై వస్తోంది.

అయితే చీకటిపడ్డానికి కాస్తముందే కృతయుగ్, స్నిగ్ధల జీప్ ఎదురుగా మినర్వా హోటల్‌కి తిరిగిరావటం వీరా చూశాడు. ఆ విషయాన్ని అన్నారావుతో

చెప్పాడు. ఈ విషయంలో ఎంత హైరానాపడ్డా వెళ్ళిన నలుగురిలో ఒక్కడన్నా తిరిగొస్తేగాని సస్పెన్స్‌కి తెరపడదు.

కాని వెళ్ళింది అడవిలోకి కాదు. దీవిమీదికి. అక్కడేదో జరిగింది. జరక్కపోతే వీళ్ళు ఇంతసేపు ఉండరనేది అన్నారావు అభిప్రాయం.

ఈ టెన్షన్ల మధ్య రాత్రితొమ్మిది గంటలకి తిరిగి వచ్చింది జీప్. అయితే డ్రయివర్ ఒక్కడే తిరిగి వచ్చాడు. బసవడుగాని, మిగిలిన వాళ్ళు గాని ఒక్కడూ వెనక్కిరాలేదు. "ఏమైందిరా? వాళ్ళేరి?" హుంకరించాడు అన్నారావు.

"వాళ్ళు రాలేదు సార్" అన్నాడు భయపడుతూ డ్రయివర్.

"రాకపోవటం ఏమిటి? మీరంతా జీప్‌లోనే వెళ్లారు గదా?" అన్నాడు అన్నారావు.

"సార్... మన బసవడు, మిగతా ముగ్గురు దీవి మీదకు పోవాలన్నారు. నన్ను బెస్తగూడెం దగ్గర వుంచి తిరిగివచ్చేవరకు అక్కడే ఉండమన్నారు. నావ ఒకటి బెస్తలవద్ద అద్దెకు తీసుకుని వాళ్ళే నడుపుకుంటూ వెళ్ళారు. మధ్యాహ్నం బయలుదేరి వెళ్ళినవాళ్ళు సాయంకాలమైనా తిరిగిరాలేదు.

ఫోన్‌చేస్తే వాళ్ళ ఫోన్లు అవుటాఫ్ కవరేజ్ అని వస్తున్నాయి. బెస్తగూడెం వాళ్లు నావకోసం నన్ను నిర్బంధించారు. వాళ్ళకి కొంత డబ్బుకట్టి నేను బయలుదేరి వచ్చేసరికి ఈ టైమైంది. దీవిమీద కెళ్ళినవారు ఏమయ్యారో ఏమిటో తెలీదు" అంటూ ఏడుపు ముఖంతో జరిగింది వివరించాడు వాడు.

అంతవరకూ గదిలో ఓ పక్కగా – కళ్ళుమూసుకుని ధ్యానంలో ఉన్నాడు మంత్రవాది అనంతస్వామి. ఉన్నట్టుండి కళ్ళుతెరిచి అన్నారావువంక చూశాడు.

"ఇక వాళ్ళ గురించి మరిచిపొండి, వాళ్ళు తిరిగిరారు" అన్నాడు.

ఉలిక్కిపడి ఆయనవంక చూశారంతా.

"ఏమిటిస్వామీ... వాళ్ళు తిరిగిరారా... దీవిమీద ఏం జరిగుంటుంది?" గాభరాను అణచుకుంటూ అడిగాడు అన్నారావు.

"అంతా అస్పష్టంగా ఉంది. నా ధ్యానంలో దీవిమీద ఏమీ కన్పించటం లేదు. నాలుగు మృతదేహాలు అదీ ఎముకలగూళ్ళుగా మాత్రం దర్శనమిస్తున్నాయి. ఉదయం పూజలో కూచుంటేగాని ఏమిటన్నది అర్థంకాదు" అన్నాడు గంభీరంగా అనంతస్వామి.

ఆ మాటలు విని ఎవరికి వారు ఆలోచనల్లో మునిగిపోయి మౌనంగా ఉండిపోయారు. ఆ మౌనాన్ని భగ్నపరుస్తూ కాస్సేపటికి అన్నారావు గొంతు విప్పాడు.

"మీ మాటల్నిబట్టి చూస్తే దీవిమీద బలమైన కావలి శక్తులేవో ఉన్నాయనిపిస్తోంది. రేపు పూజకి కావలసిన సామగ్రి ఏమిటో లిస్టు రాసివ్వండి.

ఉదయం మీ పూజా కార్యక్రమం తర్వాతే ఏం చేయాలో నిర్ణయం తీసుకుందాం" అన్నాడు.

"కావలసిన సంబారాలన్నీ ఈ రాత్రికే సిద్ధం చేయించు. చీకటితోనే మనం నదీతీరానికి వెళ్లాలి. పూజ ఇక్కడకాదు. తీరంలో జరగాలి" అంటూ లేచి తన గదిలోకి వెళ్ళిపోయాడు అనంతస్వామి.

అర్ధగంట తరువాత ఆయన రాసితెచ్చిన లిస్టు తీసుకుని అందులోని వస్తువులను కొని తేవటానికి పీటర్‌తోపాటు ఇద్దరు హడావుడిగా జీప్‌లో బయలు దేరి వెళ్ళిపోయారు.

*     *     *     *     *

"రేపు మన ప్రోగ్రాం ఏమిటి?" అంటూ తమ సూట్‌లో రిలాక్స్‌గా కూచున్నప్పుడు స్నిగ్ధను అడిగాడు కృతయుగ్.

"నీ అభిప్రాయం చెప్పు" వచ్చి పక్కన కూర్చుని కళ్ళలోకి చూస్తూ అడిగింది స్నిగ్ధ.

"నా అభిప్రాయమైతే మనం వెనక్కి వెళ్ళిపోవడం మంచిదనిపిస్తోంది. అనవసరంగా రిస్క్ తీసుకోవటం ఎందుకు? ఆమె నడుంచుట్టూ చేతిని పోనిచ్చి నడుం ఒంపులో మృదువుగా తడుముతూ దగ్గరకు లాక్కున్నాడు. ఆమె చొరవగా అతడి అధరాలు ముద్దాడింది.

"రిస్క్ లేకపోతే లైఫ్‌లో థ్రిల్లేముంది? ప్రస్తుతం మన లక్ష్యం ఆ నిధిని సాధించటం. దాని గురించి ఆలోచించకుండా వెనక్కి వెళ్ళిపోదామంటావేమిటి? ఆ నిధి రహస్యం మీ వంశంలో పరంపరగా వచ్చిందిగాబట్టి నీకే ఎక్కువ పట్టుదల– ఉండాలి తెలుసా" అంది.

"నా భయం నా గురించికాదు. నీ గురించి. వెళ్ళిన వాళ్ళు వెనక్కి తిరిగిరాలేదు. చూశావుగదా..."

"చూశాను. కాని నువ్వు పక్కనుంటే నేను చావుక్కూడా భయపడను. రేపు దీవిమీద అడుగుపెడుతున్నాం. అంతే"

"ఓ.కె. దీవిని చేరుకోవాలంటే పడవ కావాలి..."

"అందుకు నేనో ప్లాన్ చేసుంచాను"

"ఏమిటా ప్లాను?" అడిగాడు కృతయుగ్.

"ఉదయం మనం నదీతీరానికి వెళ్ళి ఒక మోటార్ బోట్ కొందాం. బోటులో నదివెంట ప్రయాణం చేద్దాం" అంది స్నిగ్ధ.

"ఈ ఐడియా బాగుంది. కాని...."

"ఇంకేం చెప్పకు. అంతే. నాకు నిద్ర వస్తోంది"

"వెళ్ళి నీ గదిలో పడుకో."

"లేదు. ఇక్కడే... నీ పక్కలో పడుకుంటాను"

"హలో. నా బ్రహ్మచర్యాన్ని పరీక్ష పెట్టకు. ప్లీజ్"

"నేను బ్రహ్మచర్యాన్ని వదిలేయాలనుకుంటున్నాను" ఆమె గొణుగుతుంటే కృతయుగ్‌కి నవ్వొచ్చేసింది.

"పెళ్ళవనీ, ఇద్దరం ఒకేసారి బ్రహ్మచర్యాన్ని వదిలేద్దాం. ప్రస్తుతానికి ఎవరి బెడ్ వారిదే. ఓకె?" అంటూ సున్నితంగా ఆమెను విడిపించుకున్నాడు.

ఇంతలో అతడి సెల్ మోగింది. అది కాంచన కాల్. నెంబర్ చూడగానే నొసలు విరిచాడు.

"హలో!" అన్నాడు.

"హాయ్. ఎలా ఉన్నావ్?" అడిగింది కాంచన.

"ఫైన్. నువ్వెలా వున్నావ్?"

"నాట్ ఫైన్. నువ్వు పక్కన లేవుగా. ఆ విషయంలో స్నిగ్ధ అదృష్టవంతురాలు"

"నిష్ఠూరాలాపి విషయానికి రా"

"ఎక్కడున్నావ్?"

"హైదరాబాద్‌లోనే"

"అబద్ధం. స్టేట్‌లో లేవు. జీరో చేరిస్తేగాని నీ లైన్ కలవలేదు."

"కదా. ఢిల్లీ వెళ్తానని చెప్పాగదా మళ్ళీ ఎందుకు సతాయిస్తావ్?" అవతల కాంచన నవ్వటం విన్పించింది.

"సో. నువ్వు ఢిల్లీలో ఉన్నానంటావ్" అడిగింది.

"డౌటా?" దబాయించాడు.

"పోనీ నేను ఎక్కడున్నానో తెలుసా?"

"హైదరాబాద్ కాదా?"

"ఓ.కె. నువ్వు అబద్ధం చెప్పావ్. నేనూ అబద్ధం చెప్పాను. చెల్లుకు చెల్లు. స్నిగ్ధను అడిగానని చెప్పు. ఐ లవ్ యూ డియర్" అంటూ ఫోన్‌లోనే ముద్దిచ్చి లైన్ కట్ చేసింది కాంచన.

ఆ సంభాషణంతా చెవి ఫోన్ పక్కనపెట్టి మరీ శ్రద్ధగా వింది స్నిగ్ధ. అంతే, చివ్వున బెడ్ దిగింది.

"అరె. ఏమయింది?" అడిగాడు కృతయుగ్.

"అది ఫోన్‌లోనే ముద్దిచ్చిందిగా. ఇక ఆ పక్కన నేనెందుకులే!... గుడ్‌నైట్" అంటూ విసవిసా పక్కడోర్‌లోకి వెళ్ళి కోపంగా చూస్తూ తలుపేసుకుంది. తల పట్టుకున్నాడు కృతయుగ్.

*    *    *    *    *

అనంతస్వామి! చూడ్డానికి చాలా సాదాసీదాగా సింపుల్‌గా కనిపిస్తాడు. మల్లెపూవులాంటి తెల్లనిదుస్తులు ధరిస్తాడు. అప్పుడప్పుడూ కాషాయం కడతాడు. పూజలు చేసే సమయంలో నల్లని వస్త్రాలు ధరిస్తాడు.

నుదుట కుంకుమబొట్టు, మెడలో పూసలదండలు, తెల్లటిజుత్తు, కొద్దిగా పెరిగిన గడ్డంతో ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటాడు. కళ్ళు మాత్రం నిప్పుముద్దల్లా ఎర్రగా ఉంటాయి. ఆయన్ని చూస్తే ఎవరూ గొప్ప మంత్రవాది అనుకోరు. భక్తుడు అనుకుంటారు.

అసలు అన్నారావుకి అనంతస్వామి పరిచయమే విచిత్రంగా జరిగింది. అనంతస్వామి పుట్టింది సద్బ్రాహ్మణవంశంలో. అదీ కేరళలో.

తమ ఇలవేలుపు అనంత పద్మనాభస్వామిమీద భక్తితో తల్లిదండ్రులు బిడ్డకు అనంతస్వామి అని పేరు పెట్టుకున్నారు. అయితే బిడ్డ జాతకం చూసిన పెద్దలు వీడు ఎవడినీ లెక్కచేయడు.

తనకు తోచిన మార్గంలో వెళతాడు. గొప్ప మేధావి. ఏకసంథాగ్రాహి. బాగా చదువుకుంటాడు. కాని పిన్నవయసులోనే దేశసంచారి అవుతాడు. ఎవరికీ అర్ధంకాడు. ఇతను ఎంత గొప్పవాడైనా ఊరు పేరు ఉండదు. బతికినంత కాలం ఏ లోటు ఉండని జీవితం వీడిది అని చెప్పారు. అక్షరాలా అదే జరిగింది.

పెరిగేకొద్దీ అనంతస్వామి ఎవరికీ అర్ధమయ్యేవాడు కాదు. వేదాధ్యయనం చేసేవాడు కాదు. కులాచారాలు పట్టించుకునేవాడు కాదు.

ఎప్పుడూ ఏదో ఆలోచనల్లో ఉండేవాడు. పదిహేనో ఏట ఇంట్లో తిట్టారని అలిగి ఇల్లు వదిలేశాడు.

తనకు ఇష్టమైన మాంత్రిక విద్యలు, తాంత్రిక విద్యల అభ్యాసంకోసం గురువుల్ని వెదుక్కొంటూ దేశసంచారి అయ్యాడు. ఆ కాలంలో మంత్రగాళ్ళకు ప్రసిద్ధి కేరళ.

ఆ మాటకొస్తే ఇప్పటికీ కేరళ, ఒరిస్సా, అస్సాం స్టేట్స్‌లో ఉండే మంత్రగాళ్ళను మించినవాళ్ళు ప్రపంచంలో ఎక్కడా లేరంటారు.

కేరళ మంత్రగాళ్ళు ఎంత ప్రసిద్ధులు అంటే ఎదుటి వ్యక్తి ఉమ్మివేస్తే అది ఆరేలోపు ప్రాణం తీయగల మంత్రప్రయోగం వాళ్ళకి తెలుసంటారు. అటువంటి కేరళలో పదేళ్ళు తిరిగాడు అనంతస్వామి.

మారుమూల ప్రాంతాల్లోని మంత్రగాళ్ళను కూడా ఆశ్రయించి మంత్ర విద్యలు అభ్యసించాడు. అన్ని విద్యలూ అందరివద్దా ఉండవు. కాబట్టి కొత్త గురువు ఎవరిని ఆశ్రయించినా తనకు తెలిసిన విద్యల్ని ప్రదర్శించేవాడు కాదు. వినయంతో గురువుల్ని మెప్పించి తనకు కావలసినవిద్య నేర్చుకొని వచ్చేసేవాడు.

పాతిక సంవత్సరాల వయసు వచ్చేసరికి కేరళ అంతటా తిరిగి అనేక రహస్య విద్యలు సాధించాడు. అయినా ఇంకా నేర్చుకోవాలని తపన.

కొంతకాలం ఒరిస్సా వెళ్ళిపోయి వైతరణీ తీరాన గల విరజామాత ఆలయ ప్రాంతాల్లో సంచరించాడు. ఈ విరజామాత ఆలయం పూరాణ ప్రసిద్ధమైంది. మాంత్రిక తాంత్రిక విద్యలకు అనాదిగా కేంద్ర స్థానంగా విలసిల్లిన చోటు.

ఈ ఆలయ చరిత్ర కూడా విశిష్టమైనది. ఒకప్పుడు గయాసురుడనే రాక్షసరాజు ఆ ప్రాంతాన్ని పరిపాలించేవాడు. అతడు రాక్షసుడైనా తామస గుణంతో తపస్సు చేసి దేవతలను ప్రసన్నం చేసుకున్నవాడు.

ధర్మబద్ధంగా పాలించేవాడు. గొప్ప విష్ణుభక్తుడు. గొప్ప పవిత్రమైన వాడుగా పేరు పొందాడు. ఇలా ఉండగా దేవర్షులు మహర్షులంతా గొప్పయాగం ఒకటి తలపెట్టారు. ఆ యాగప్రదేశం ఎంత పవిత్రంగా ఉండాలని చర్చకు వచ్చినప్పుడు అది గయాసురుడి వక్షస్థమంత పవిత్రంగా ఉండాలని నిశ్చయించారు.

ఎంత గాలించినా అంత పవిత్రమైన ప్రదేశం దొరకలేదువారికి. ఈలోపల ఆ విషయం గయాసురుడికి తెలిసింది. ఒక మంచిపనికి తన శరీరం ఉపయోగపడితే కావలసింది ఏముందనుకున్నాడు.

మహర్షుల్ని సంప్రదించి తన శరీరం త్యాగం చేయటానికి సంసిద్ధత వ్యక్తం చేశాడు.

మహర్షులు సంతోషించారు. గయాసురుడు ప్రాణత్యాగం చేయగానే అతని శరీరం అనూహ్యంగా పెరిగిపోతూ శిరస్సు నేటి గయవరకు వ్యాపించింది. అందుకే అది గయ అని, తర్వాతి కాలంలో బుద్ధుని కారణంగా బుద్ధగయగా ప్రసిద్ధిచెందింది. గయాసురుడి ఛాతీ వైతరణీ తీరాన సువిశాలంగా విస్తరించగా గయాసురుడి పాదాలు ఆంధ్రాలోని పిఠాపురం వరకు వ్యాపించాయట. ఆ విధంగా పాదాలు వ్యాపించినచోటు కాబట్టి దాన్ని పీఠికాపురం అన్నారు. అదే కాలక్రమంలో పిఠాపురం అయింది.

ఇక వైతరణీ తీరాన వ్యాపించిన గయాసురుని ఛాతీప్రాంతంలో యాగశాల నిర్మించి పవిత్రమైన యాగాన్ని మహర్షులు నిర్విఘ్నంగా కొనసాగించారు. ఆ యాగాగ్ని నుంచి ఆవిర్భవించినదే విరజామాత.

ఆవిడ పేరు మీదే తర్వాతికాలంలో అక్కడ ఊరు వెలిసింది. దాన్ని విరజాపురిగా వ్యవహరించేవారు. కాలక్రమంలో అదే నేటి జాజ్‌పూర్ అయింది.

విరజామాత ఆ ఊరి దేవత. అద్భుతమైన ఆలయం నిర్మించారు. బౌద్ధం ప్రబలంగా వ్యాపించిన కాలంలో కూడా చెక్కుచెదరకుండా నిలబడిన అద్భుత ఆలయం అది. దేవిలీలల గురించి స్థానికంగా అనేక గాథలు ప్రచారంలో వున్నాయి. ఈ ఆలయం మాంత్రిక తాంత్రిక పూజలకు కేంద్రంగా మారి ఎందరో ఇక్కడ ఆ విద్యల్ని అభ్యసించేవారు.

అనంతస్వామి పదేళ్ళపాటు జాజ్‌పూర్‌లో ఉండి అనేక క్షుద్రవిద్యలు సాధనచేసి సొంతం చేసుకున్నాడు. కొంతకాలం అస్సాంలో కూడా తిరిగాడు.

ఇలా సమారు ఏభై సంవత్సరాల వయసు వచ్చేవరకు తన అభ్యాసం కొనసాగుతూనే వుండటంతో బ్రహ్మచారిగానే మిగిలిపోయాడు.

ఒకసారి తమవారిని చూడాలని కేరళ వెళ్ళాడు. తండ్రి పోయాడు. తల్లి ఉంది. ఎనిమిదిమంది సంతానంలో ముగ్గురు పోగా తనతోపాటు ఇంకా నలుగురు బతికే వున్నారు. వాళ్ళలో ఒక అక్క, ఒక అన్న, ఇద్దరు తమ్ముళ్ళు ఉన్నారు. అంతా పెళ్ళిళ్ళు చేసుకొని మనవలు, మనవరాండ్రతో ఉన్నారు.

తల్లి, పెద్దకొడుకు ఇంట ఉంటోంది. అయితే అందరూ పేదరికంతో అవస్థలుపడుతున్నారు. చిన్నప్పట్నుంచి తనకున్న ఉత్సాహం కొద్దీ ఎన్నో విద్యలు నేర్చుకుని మంత్రవాది కాగలిగాడుగాని తన విద్యలతో సాటి మానవులకి హానిచేసి

డబ్బు సంపాదించాలనే చెడు తలంపు అనంతస్వామికి ఎప్పుడూ లేదు. తన విద్యలు నలుగురికి ఉపయోగపడాలనే అతడి ఆశయం.

కత్తికి రెండువైపులా పదును ఉన్నట్టే మంత్రశక్తులు రెండు విధాలుగా ఉపయోగపడతాయి. మంచికి, చెడుకి కూడా. చేతబడి, చిల్లంగి వంటి క్షుద్ర విద్యలను నమ్మేవారికి ఈ విషయం అనుభవమే. పగతోనో, ద్వేషంతోనో ఒక మనిషిని చంపాలని మంత్రప్రయోగం చేయటం చెడు. ఆ మంత్ర ప్రయోగాన్ని తిప్పికొట్టి ఆ మనిషిని రక్షించటం మంచి.

సాధారణ మంత్రగాళ్ళ విషయంలో కొందరికి ప్రయోగం చేయటమే తెలిసుంటుంది. తిప్పికొట్టడం తెలిసుండదు. కొందరికి ప్రయోగాన్ని తిప్పికొట్టే విద్య మాత్రమే తెలుసుంటుంది. ప్రయోగించటం తెలీదు. ఇంకొందరున్నారు వీళ్ళకు రెండు విద్యలూ తెలుసు. డబ్బుకోసం ఏదయినా చేస్తారు.

అయితే అనంతస్వామి మహామంత్రవాది. ఎన్నో శక్తుల్ని వశపర్చు కున్నవాడు. సర్వం తెలిసినవాడు.

మామూలు మంత్రగాళ్ళు ఆయనముందు ఎందుకూ పనికిరారు. ఒకరికి హాని చేయకుండా ఎక్కువ సంపాదించటం ఎలాగని ఆలోచిస్తున్న సమయంలో పాల్ఘాట్‌జిల్లాలోని ఒక పాడుపడ్డ గుడివద్ద నిధిఉందని ఎవరో చెప్పుకోవటం విన్నాడు.

వెంటనే వెళ్ళాడు. అక్కడ ఒకచోట భూమిలో కొంత నిధి ఉన్నమాట నిజమే. కాని దాన్ని తవ్వి తీయాలంటే మనుషులు కావాలి. ఎవర్ని పిలిచినా అల్లరవుతుంది.

ఏం చేయాలాని అక్కడే మండపంలో విచారంగా కూచున్నాడు. అదే సమయంలో ఏదో పనిమీద తన మనుషులు ఆరుగురితో కేరళ వచ్చాడు అన్నారావు. అదే దారిన వ్యాన్‌లో పోతూ మండపం వద్ద విశ్రాంతి కోసం ఆగారు. తొలిసారిగా ఇద్దరికీ అక్కడ ఏర్పడింది పరిచయం. సమస్య చెప్పాడు అనంతస్వామి.

"నాకు ఎక్కువ ఆశ లేదు. నిధి ఎంత దొరికితే అంత. అందులో ఒక వంతు నాకిచ్చి మిగిలిన మూడు వంతులు నువ్వు తీసుకో" అన్నాడు. అనంతస్వామి గొప్పతనం గుర్తించాడు అన్నారావు.

తన మనుషులతో అతను చెప్పిన చోట తవ్వగా ఒక ముంత నిండుగా బంగారు కణికలు లభించాయి. వాటిని ఎలా మార్చుకోవాలో అన్నారావుకు

తెలుసు. ఆ బంగారం మొత్తానికీ విలువకట్టి అందులో నాలుగో వంతుకు తనే డబ్బులిచ్చేశాడు.

ఆ విధంగా ఏర్పడిన పరిచయం గురుశిష్య సంబంధంగా మారింది. ఆయన్ని తనతోపాటు హైదరాబాద్ తీసుకొచ్చి వసతి ఏర్పాటు చేశాడు. ఇదంతా పాతికేళ్ళ క్రితం మాట. తర్వాత చాలాచోట్ల నిధులు తవ్వటం తీసుకోవటం జరిగింది. భూమిలో లభించే సంపద ఏదైనా ప్రభుత్వానికి సొంతం.

అలా అందజేసినవారికి లభించిన నిధిలో కొద్దిపాటి పర్సంటెజ్ మాత్రమే బహుమానంగా లభిస్తుంది. కాని ఏనాడో ఎవరో ఏదో ఉద్దేశంతో తమ కష్టార్జితాన్ని భూమిలో దాచిపెట్టిపోయారు.

కాబట్టి దాన్ని ప్రభుత్వానికి ఇవ్వక్కర్లేదన్నది అన్నారావు అభిప్రాయం. దొరికితే అది నేరం గాబట్టి చాలా చాకచక్యంగా నిధులు తవ్వి తీసుకుపోవటం ఒక వృత్తిగా వారికి మారిపోయింది. ఇందుకోసమే పాతికమంది మనుషుల్ని అన్నారావు పోషిస్తుంటాడు.

వాళ్ళలో ఐదుగురు ఎప్పుడూ దేశంలో సంచరిస్తూ నిధుల రహస్యాన్ని సేకరించే పనిలో ఉంటారు.

చిన్నచిన్న నిధుల సంగతి ఎలా ఉన్నా గతంలో తాము తవ్విన నిధుల్లో చెప్పుకోతగ్గది నల్లమల అడవిలోని రాతికోట నిధి.

శిథిలమైన కోట. నట్టడవిలో వుంది. పునాదులే మిగిలాయి. ఏ కాలంలో ఎవరు కట్టారో ఏ యుద్ధంలో కోట నాశనమైందో చరిత్రకు అందని విషయం. కాగా ఆ కోట దక్షిణభాగంలో ఎక్కడో నిధులున్నాయని స్థానిక గిరిజనుల్లో తరతరాలుగా చెప్పుకొంటున్న వార్త.

ఆ వార్త తెలియగానే అన్నారావు బృందం అక్కడ వాలిపోయింది. పదిహేనురోజులు ఆ శిథిలాల వద్ద మకాంవేసి అన్వేషణ సాగించారు. నిధి ఉన్న ప్రదేశాన్ని గుర్తించటం అనంతస్వామికే ఓపట్టాన అంతుచిక్కలేదు. నిధికి ఏదో కావలిశక్తి వుంది. అది చాలా శక్తివంతమైంది.

నిధి అంజనంలో కనబడకుండా ఆ శక్తి అడ్డంపడుతూ అడ్డంకులు సృష్టిస్తోంది.

ఆ శక్తిని వశపర్చుకుంటేగాని చోటు తెలీదు. మూడురోజులపాటు ఏకదీక్షలో పూజలు చేసి ఆ శక్తిని వశపర్చుకున్నాడు అనంతస్వామి. తర్వాత భూమికి ముప్పై అడుగుల లోతులో నిక్షిప్తమైవున్న రెండు రాగిబిందెలు నిండా

బంగారం లభించింది. అనంతస్వామి ప్రశాంతంగా నివసించడానికి చక్కని బంగ్లా నిర్మించి బహుమతిగా ఇచ్చాడు అన్నారావు.

అలాగే తన వంతు వచ్చిన సొమ్ముని తమవాళ్ళకు పంపిస్తూ వాళ్ళ ఆర్థిక సమస్యలు తీర్చి ఆదుకున్నాడు అనంతస్వామి. చివరి దశలో ఆయన తల్లి అనంతస్వామి వద్ద కొంతకాలం ఉండి ఇక్కడే తుదిశ్వాస వదిలింది.

ఇంతకాలం తర్వాత అనంతస్వామి శక్తికి పరీక్షపెడుతున్నది నిధి ఇదే... ఆదివిష్ణు ఆలయం వద్ద దీవిలో నిక్షిప్తంగా చేయబడిన నిధి. దీవి అంతు చూడాలని అనంతస్వామికీ పట్టుదలగా వుంది.

అందుకే ఆ ఉదయం క్షిప్రానది తీరంలోని ఇసుకమేట మీద ప్రత్యేక పూజకు ఏర్పాట్లు చేయించాడు.

అది ఉజ్జయినికి దక్షిణంగా–

నదీతీరంలోని నిర్జన ప్రాంతం.

తీరంనుండి మోకాలి లోతు నీటిలో కొంచెం దూరం నడవగానే అక్కడ విశాలమైన ఇసుకమేట వుంది.

ఆ ఇసుక తిన్నెమీద పూజకోసం ఏర్పాట్లు చేయించాడు అనంతస్వామి. అక్కడ నది చాలా విశాలంగా ఉంది. ఇసుక తిన్నె అవతల ప్రవాహం మందంగా వున్నా నదిలోతు ఎక్కువ. నదిలో చేపల పడవల బోట్లు అప్పుడప్పుడూ వెళ్తున్నాయి.

*        *        *        *        *

ఉదయం ఏడుగంటలకంతా అందరూ అక్కడికి చేరుకున్నారు. నీడకోసం అరడజను పెద్ద పెద్ద గుడ్డ గొడుగుల్ని ఏర్పాటుచేశారు. ఒక గొడుగు కింద పూజకు ఏర్పాట్లు చకచకా ఆరంభమయ్యాయి.

నల్లటి వస్త్రాలు ధరించాడు అనంతస్వామి.

త్రికోణంలో మూడు ఇటుకలు పేర్చి అందులో మూడు రకాల సమిధలు వేసి మంత్రోచ్చాటనతో అగ్ని ప్రజ్వలింపజేసాడు. అగ్ని మండుతున్న హోమగుండాన్ని చుట్టి పసుపు కుంకుమలు చల్లాడు.

చిత్రవిచిత్రమైన కొన్ని ముగ్గులు వేశాడు. మూడు నల్లటి నాటుకోళ్ళను కోసి నెత్తురు ఒకగిన్నెలో పట్టాడు. తర్వాత ఇటుకలు మూడు కోణాలకు సమీపంలో వాటిని ఇసుకలో తల్లకిందులుగా గుచ్చాడు.

కోళ్ళ నెత్తురు పట్టిన గిన్నెలో బియ్యంపోసి వాటిని నెత్తుటి అక్షింతలుగా మార్చాడు. నిమ్మకాయలు రెండుగా కోసి వాటికి కుంకుమ అద్ది నాలుగు దిక్కులందు ఉంచాడు. ఎనిమిది నిమ్మకాయలను అభిమంత్రించి ఎనిమిది దిక్కులకు విసిరాడు. ఈ తతంగమంతా తను ఒక్కడే చేశాడు. ఎవరినీ దగ్గరకు రానీయలేదు. అక్కడ అష్టదిగ్బంధనం చేయబడింది.

ఏవేవో మంత్రాలు చదువుతూ సుమారు గంటసేపు ఒక్కో ప్రక్రియను ముగిస్తూ అంతా సిద్ధం చేసుకున్నాడు. నెత్తుటి అక్షింతలు అగ్నిలో వేస్తుంటే మంటలు నాల్కలు చాస్తూ ఎగసి వస్తున్నాయి. కొన్ని అక్షింతలను చుట్టూ వెదజల్లాడు.

తర్వాత తను ధ్యానంలోకి వెళ్ళేముందు–

అన్నారావుని దగ్గరకు పిలిచాడు.

ఎనిమిదడుగుల దూరంలో ఉండగా అతన్ని అక్కడే ఆపి – "నా ధ్యానం చాలాసేపు కొనసాగుతుంది. ఎవరూ మీరున్నచోటు వదిలి ముందుకు రావద్దు. చాలా ప్రమాదం. అంతేకాదు. ఇక్కడ ఏం జరిగినా మీరు కంగారుపడి పరుగులు తీయటమో లేదా ముందుకు రావటమో చేయకూడదు. ఉన్నచోటు నుండి కదలకూడదు. అర్థమైంది కదా?" అంటూ హెచ్చరించాడు అనంతస్వామి.

అర్థమైనట్టు తల ఊపి–

తిరిగి యథాస్థానంలోకి వెళ్ళి గొడుగు నీడన కూచున్నాడు అన్నారావు. తన మనుషులకు చెప్పి హెచ్చరించాడు. అంత వరకూ మౌనంగా ఉన్న మహీధర్ ఉన్నట్టుండి లేచాడు. "ఏరా. నీకు ప్రత్యేకించి చెప్పాలా?" విసుక్కున్నాడు అన్నారావు.

"అదేంలేదు మావయ్యా. చిన్న పనుంది. అలా తీరంమీదకు వెళ్ళి వచ్చేస్తాను" అన్నాడు.

ఏం పని అంటూ అడగలేదు అన్నారావు. "వెళ్ళి త్వరగా రా" అంటూ పర్మిషనిచ్చాడు. మహీధర్ వడి వడిగా తీరంవైపు వెళ్ళిపోయాడు.

ఈ లోపల – నల్లని వస్త్రం పరచిన పీటమీద కూచుని అసలయిన పూజ ఆరభించాడు అనంతస్వామి. అర్ధనిమీలిత నేత్రాలతో మంత్రోచ్చాటన చేస్తున్నాడు. పెదవుల కదలిక మాత్రమే తెలుస్తోంది. ఆయన నుదుట క్రమంగా

తేజస్సు వికసిస్తోంది. ఆయన చేయి మధ్యలో అప్పుడప్పుడూ హోమంలో రక్త అక్షింతలు వేస్తోంది.

పసుపు వేస్తోంది. సమిధలు వేస్తోంది. అగ్ని జ్వాలలు తరంగంలా ఎగస్తున్నాయి.

అన్నారావుతో పాటు అతడి మనుషులంతా కుతూహలంగా అనంత స్వామినే చూస్తున్నారు. అర్ధగంట... గంట... కాలం నెమ్మదిగా కదులుతోంది. గాలి ఒక్కసారిగా వేడెక్కుతున్న అనుభూతి. గాలిలో తేలుతూ ఏవో విచిత్రమైన ధ్వనులు... గాలి కదలకపోయినా సుడిగాలి లేపినట్టు చుట్టుపక్కల ఇసుక ఛెళ్ళున లేచి కిందపడుతోంది.

ఊపిరి బిగబట్టి ఉత్కంఠభరితులై చూస్తున్నారంతా. అనంతస్వామి ముఖం క్రమంగా ఎరుపు రంగుపులుముకుంటోంది. ఆయన పెదవులు నిరాటంకంగా మంత్రోచ్చాటన చేస్తూనే వున్నాయి. గాలి పూర్తిగా అక్కడ స్తంభించినట్టయింది.

గుడ్డగొడుగుల వద్దనుంచి బయలుదేరిన మహీధర్ ఫ్యాంటు పైకిలాక్కుని నదీ నీటిపాయను దాటి తీరంమీదకు వచ్చాడు. అతడు వచ్చేసరికి ఏటిగట్టు దిగువన వేపచెట్టు కింద మోపెడ్ నిలిపి ఒక బక్కపలచని యువకుడు కూచునున్నాడు. మహీధర్ రాకను గమనించి మోపెడ్ దిగి ఇవతలికొచ్చాడు.

"ఏమైంది?" అడిగాడు మహీధర్.

అతడి పేరు సుహాన్.

మినర్వా హోటల్లో లిఫ్ట్ బోయ్. నిన్న ఉజ్జయినికి రాగానే వాడ్ని కలుసుకుని కొంత డబ్బిచ్చి కృతయుగ్, స్నిగ్ధలమీద నిఘా ఏర్పాటుచేశాడు. కొంచెం సేపటిక్రితం వాడు ఫోన్‌చేశాడు. ఇక్కడికి రమ్మని చెప్పాడు. వాడ్ని కలుసుకోవటం కోసమే లేచి తీరం మీదికొచ్చాడు.

"మీరు చెప్పిన జంట ఇంతక్రితమే రేవులోని జెట్టీవద్దకొచ్చి ఒక మోటార్ బోటు అద్దెకు తీసుకుంది" చెప్పాడు సుహాన్.

ఆ మాట వింటూనే వాళ్ళు దీవికి బయలుదేరే ఉద్దేశంలో ఉన్నట్టు గ్రహించాడు మహీధర్. "తర్వాత?" అడిగాడు.

"వేగంగా దూసుకెళ్ళే ఫోర్ సీటర్ మినీబోట్ అది. టాంక్‌ఫుల్ చేయించటమేకాకుండా స్పేర్‌గా మరో క్యాన్ ఆయిల్ ఉంచమన్నారట. డ్రయివర్‌తో పనిలేదు. వాళ్ళే బోట్‌ని డ్రయివ్ చేసుకెళ్తారట. అంత ఆయిల్ దేనికి ఎక్కడికో

ప్రయాణం వివరాలు తెలీలేదుగాని ఓనర్‌కి బాగానే డబ్బు ముట్టచెప్పారు. అందుకే బోటును అప్పగించటానికి ఒప్పుకున్నాడు" వివరించాడు సుహాన్.

"ఓ.కె. ఈ వివరాలు చాలు. వాళ్ళమీద ఓ కన్నేసిఉంచు. ఇంతకీ వాళ్ళు బయలుదేరి వెళ్ళిపోయారా లేదా?"

"ఓ గంటలో వస్తామని చెప్పి వెళ్ళారట. నేనిక్కడికి రావటానికే అర్థగంట పట్టింది. కాస్సేపట్లో వాళ్లు బయలుదేరొచ్చు" అన్నాడు.

"ఓ.కె. నువ్వెళ్ళిపో" అంటూ సుహాన్‌కి కొంత డబ్బిచ్చి పంపించేశాడు మహీధర్.

వాడు మోపెడ్ మీద వెళ్ళిపోగానే చింటూభాయ్‌కి ఫోన్ చేశాడు. వెంటనే లైన్లోకి వచ్చాడు వాడు.

"ఎక్కడున్నారు?" అడిగాడు.

"హోటల్లో మాత్రం లేము" అటునుంచి సమాధానం.

"ఏం చేస్తున్నారు?"

"ప్రస్తుతం మమ్మల్ని చూసినా నువ్వు గుర్తుపట్టలేవు భాయ్"

"ఎందుచేత?"

"ఎందుకంటే మేము ఇప్పుడు బౌద్ధభిక్షువులం" ఫెళ్ళున నవ్వాడు చింటూభాయ్.

మహీధర్‌కి బుర్రగిర్రున తిరిగినంత పనైంది 'ఉజ్జయిని ప్రాంతాలో బౌద్ధారామాలున్నాయి. భిక్షువులు కన్పించటం సహజమే. కాని వీళ్ళు బౌద్ధ సన్యాసుల్లో కలిసిపోవటం ఏమిటి?

ఈ జ్ఞానోదయం ఎప్పుడైంది వీడికి? కృతయుగ్ తల నరికి పట్టుకుపోతానని చెప్పి ఇలా అయిపోయాడేమిటి?"

"తమాషా చేస్తున్నావా?" సీరియస్‌గా అడిగాడు.

"తమాషా కాదు మహీధర్. నిజంగా బౌద్ధసన్యాసుల వేషం కట్టాం ఈ పూట. ఎందుకోతెలుసా? కాస్సేపట్లో మేం మినర్వా హోటల్‌కి వెళ్తాం. సమయం చూసి కృతయుగ్‌ని కాల్చి చంపి తల నరుక్కుపోతాం" అవతలినుంచి చింటూభాయ్ మాటలు వినగానే మహీధర్ పెదవులమీద చిరునవ్వు ప్రత్యక్షమైంది. తను భయపడినట్టు వాడేమీ తన శపథాన్ని మర్చిపోలేదు. ఆ పనిమీదే ఉన్నాడు.

కాదంటే వీళ్ళు వెళ్ళేసరికి కృతయుగ్ హోటల్లో ఉండడన్న సంగతి తెలీదు. "చింటూభాయ్. నువ్విప్పుడు వెళ్ళినా వాడు హోటల్లో దొరకడు" చెప్పాడు.

"ఎక్కడుంటాడు?" అటునుంచి అడిగాడు చింటూభాయ్. "వాడు ఆ అమ్మాయితో కలిసి నది ఎగువకు చాలాదూరం మోటార్ బోట్‌లో బయల్దేరు తున్నాడు. నీకు లక్కీఛాన్స్, ఫాలో అయితే నదిమీద ఒంటరిగా చిక్కుతాడు. ఇద్దరినీ లేపెయ్. ఉపేక్షిస్తే వాళ్ళు సాయంత్రానిగ్గాని తిరిగిరారు..."

"చాలు మహీధర్. ఈ ఇన్ఫర్మేషన్ చాలు. ఇప్పుడే మేము కూడా అటే బయలుదేరుతున్నాం. తిరిగివచ్చాక ఫోన్‌చేసి శుభవార్త చెప్తాను. థాంక్యు మై ఫ్రెండ్" అంటూ అవతల లైన్ కట్ చేశాడు చింటూభాయ్.

తనకున్న అడ్డంకి కృతయుగ్.

ఆ అడ్డంకి తొలగిపోయి కాంచన తనదవుతుందన్న ఆనందంలో వెనుతిరిగాడు మహీధర్.

అతడు ఏటిగట్టు దిగి నీటిపాయలో అడుగుపెడుతుండగా – ఇసుక తిన్నెమీద ఉన్నట్టుండి చెలరేగింది కలకలం. 'పాము... పాము...' అని అరుస్తున్నారు. వెర్రి కేకలు వేస్తూ తమ మనుషులు కొందరు ఇసుకలో పడుతూ లేస్తూ తనున్నదిశగా పరుగులెత్తుకురావటం చూసి గాభరాతో ఎక్కడివాడు అక్కడే బొమ్మలా నిలబడిపోయాడు మహీధర్.

*　　*　　*　　*　　*

అనంతస్వామి పూర్తిగా పూజలో నిమగ్నుడై వున్నాడు. నిష్ఠతో మంత్రోచ్ఛాటన చేస్తున్నాడు. అరమూత కనులతో భ్రూమధ్యంనుంచి ఏదో వీక్షించే ప్రయత్నంలో ఉన్నాడు.

ఆయన జ్ఞానదృష్టిలో ఏదో ఒక చీకటి ప్రాంతం అస్పష్టంగా గోచరిస్తోంది. దాన్ని స్పష్టంగా చూడాలనుకుంటున్న ఆయన ప్రయత్నం నెరవేరకుండా ఏదో బలీయమైన శక్తి అడ్డంపడుతోంది.

కేబుల్ ప్రాబ్లమ్ ఉన్నప్పుడు టీవీలో క్షణం బొమ్మకన్పించి మరుక్షణం బొమ్మలు చెదిరిపోయి గీతలు చుక్కలు కన్పించినట్టు, దీవిలో తను వీక్షించదలచిన ప్రాంతం కనీకనబడకుండా దోబూచులాడుతోంది.

తనకు అడ్డంపడుతున్న శక్తి ఏమిటో అర్థమవుతోందాయనకి. దాన్ని తొలగించటం కోసం మధ్యమధ్యలో నిమ్మకాయలు చిదిమి విసిరేస్తున్నాడు.

హోమంలో మరిన్ని రక్తాక్షతలు వేస్తున్నాడు. క్షణాలు గడుస్తున్నాయి గాని లక్ష్యం నెరవేరటంలేదు.

తీవ్రంగా తనప్రయత్నం కొనసాగిస్తున్నాడు అనంతస్వామి. ఉదయం తొమ్మిదిగంటలు కాలేదు. వాతావరణంలో నిప్పులు చెరిగేంత వేడిమి ఉద్భవిస్తోంది. తట్టలతో ఎత్తిపోస్తున్నట్టుగా ఇసుక తానుగా ఉవ్వెత్తున లేచి పడుతోంది. హోమగుండంవైపు దూసుకొస్తున్న ఇసుక అంతకన్నా వేగంగా వెనక్కి పోతోంది. పూజకు విఘ్నం కలిగించి హోమాన్ని ఆర్పేయాలని ఏవో శక్తులు శతవిధాలా ప్రయత్నిస్తూ గాల్లో తిరుగుతున్న అనుభూతి అందరికీ కలుగుతోంది.

భయం ! ఉత్కంఠత! ఆందోళన!

ఏం జరగబోతోందన్న ఆత్రుత. అన్నీ ఒకేసారి ముప్పిరిగొని ఎవరికి వారు ఊపిరి బిగబట్టి పరిస్థితిని గమనిస్తున్నారు. అవసరమైతే అక్కడ్నుంచి వెనక్కి పారిపోడానికి అనువుగా కొందరు మోకాళ్ళమీద సిద్ధంగా ఉన్నారు. గాలి స్థంభించినట్టయి చెమటలు కమ్ముతున్నాయి అందరికీ.

అంతటి ఉచ్ఛఘట్టంలో కూడా ధైర్యం సడలకుండా పరిస్థితిని గమనిస్తున్న వాళ్ళు ఇద్దరే. ఒకడు అన్నారావు, రెండోవాడు ముఖ్య అనుచరుడు పీటర్. క్రమంగా అనంతస్వామి ముఖం జేరుగురంగు సంతరించుకుంటోంది.

హోమం ముందు అగ్నిశిఖలా ఉన్నాడాయన. నిరంతర మంత్రోచ్చాటన సాగుతోంది.

ఆయనలో అసహనంతో కూడిన క్రోధం ఛాయలు పొడచూపుతున్నాయి. ఉన్నట్టుండి కళ్ళు తెరిచాడాయన.

"రా... నా ముందుకురా!" మేఘఘర్జనలా గాలిలో ప్రతిధ్వనించింది ఆయన గొంతు.

ఆయన ఎవరిని పిలిచిందీ అర్థంగాక ముఖముఖాలు చూసుకున్నారంతా. కొద్దిసెకన్ల తర్వాత వారికి సమాధానం లభించింది.

ఇసుక తిన్నె పశ్చిమంగా నదివద్ద నుంచి ఒక్కసారిగా కనబడి రివ్వురివ్వున దూసుకురాసాగిందో అద్భుతమైన సర్పం.

తొమ్మిదడుగుల పొడవున దుంగలా లావుగా వుంది. ఎండపొడ్లకు పసుపువన్నెలో మిలమిలా మెరిసిపోతోంది. అది సూటిగా తమ దిక్కుకే రావడం చూడగానే పై ప్రాణాలు పైనే ఎగిరిపోయినంత పనయింది అనుచరులకి. ధైర్యం సడలిపోగా కొందరు చివ్వునలేచారు. 'పాము... బాబోయ్‌పాము' అనరుస్తూ ఏటిగట్టు దిశగా పడుతూ లేస్తూ పరుగులు తీశారు.

అన్నారావు పీటర్‌లతోపాటు మరో నలుగురు మాత్రమే గుడ్డగొడుగుల కింద ఉన్నారు. వాళ్ళుకూడా కలవరంతో లేచి నిలబడ్డారు.

ఆ భయంకర సర్పం తోకతో ఇసుకను చెల్లాచెదురు చేస్తూ భీకరంగా బుసలుకొడుతూ క్రోధావేశంతో సూటిగా అనంతస్వామి దిశకు వచ్చింది.

ఆయన వేసిన ముగ్గుకి మూడడుగుల దూరంలో ఆగి చుట్టచుట్టుకుని నాలుగడుగుల ఎత్తున లేచి చేటలా పడగవిప్పి నాల్కలు తొడుతూ ఎర్రటి నేత్రాలతో అనంతస్వామిని చూస్తోంది.

కళ్ళు తెరిచి సర్పాన్ని గమనిస్తున్నాడు అనంతస్వామి. "రా... ముందుకు రా... ముగ్గులోకి రా..." ఉరుములాంటి గొంతుతో నాగాన్ని శాసిస్తూ గుప్పెడు విభూది చల్లాడు.

ప్రతిగా పెద్దగా బుసకొట్టి రెండడుగులు వెనక్కు జరిగింది సర్పం. మరోసారి ముగ్గులోకి రమ్మని హుంకరించాడు అనంతస్వామి.

ఆ సర్పం ముగ్గులోకి వస్తే కట్టుకట్టి బంధించాలని అనంతస్వామి చూస్తున్నాడు.

అతని ఉద్దేశం తెలిసినట్టు అది ముందుకు రాకుండా అతడి ఆనతిని ధిక్కరించింది. ఆయన మంత్రశక్తిని సవాల్ చేసింది. ఉన్నట్టుండి పడగను ఆడించి గిరుక్కున వెనుతిరిగింది ఆ సర్పం.

అలా అలా తిరుగుతూ తోకతో ముగ్గును బాది చెల్లాచెదురు చేసి ఎంత వేగంతో వచ్చిందో అంతే వేగంతో రివ్వురివ్వున పాకుతూ నీటి వైపుకు దూసుకెళ్ళి అదృశ్యమైంది.

ఎప్పుడైతే పాము తన కట్టునుంచి తప్పించుకు వెళ్ళిపోనారంభించిందో – మరుక్షణం మంత్రాలు ఆపి తను కూచున్న నల్లని వస్త్రం కప్పిన పీఠం నుండి దిగ్గున లేచి పక్కకు వచ్చేసాడు అనంతస్వామి.

అలా రావటమే అతడి ప్రాణాలు కాపాడిందని చెప్పుకోవాలి. అక్కడ పాము అదృశ్యమైన మరుక్షణం ఇక్కడ అంతక్రితం వరకు ఆయన కూచున్న పీఠం భగ్గున మండి బూడిదైపోయింది.

అనంతస్వామి అక్కడే కూచుని వుంటే ఏం జరిగిఉండేదో ఊహించుకుంటేనే అన్నారావుకి వెన్ను జలదరించింది. ఎవరో నీరు చిలకరించినట్టు హోమంలో అగ్ని చిటపటలాడుతూ చల్లారిపోయి నల్లని పొగలు ఎగశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయినట్టయింది. చుట్టూ ప్రశాంతత.

ఎప్పటిలా చల్లటి గాలులు వీస్తున్నాయి. ముఖాన పట్టిన చెమట తుడుచుకుంటూ తనున్న గుడ్డ గొడుగు కింద అక్కడే నేలమీద ఇసుకలో కూచుంటూ చుట్టూ పసుపు నీళ్ళు చల్లాడు అనంతస్వామి.

దగ్గరకు రమ్మన్నట్టుగా అన్నారావుకి సైగచేశాడు.

అంతటి సర్పాన్ని, అంతటి భయానక దృశ్యాన్ని వీక్షించటం అన్నారావుకీ ఇదే ప్రథమ అనుభవం.

ఇంతకాలం తన అనుభవంలో అనంతస్వామికి లొంగని శక్తి కూడా ఇదే. అందుకు కాస్త జంకుతూనే వడివడిగా వెళ్ళి అనంతస్వామి ముందు కూచున్నాడు. మిగిలినవాళ్ళందర్నీ దూరంగానే ఉంచేశారు.

అప్పటికి పారిపోతున్న వాళ్ళని వెనక్కి తీసుకొస్తూ మహీధర్ కూడా అక్కడకి చేరాడు. వాళ్ళనీ అక్కడే ఆగిపోమ్మని సైగ చేశాడు అనంతస్వామి.

"స్వామీ! ఇక్కడేం జరిగింది? ఆ భయంకర సర్పం ఎక్కడ్నుంచి వచ్చింది? నాకేమీ అర్థంగావటంలేదు" అన్నాడు కళవరపడుతూ అన్నారావు. ముఖాన పట్టిన స్వేదం తుడుస్తూ ముఖంలో విసుగు కన్పించకుండా చిరునవ్వు నవ్వాడు అనంతస్వామి.

"మీరు తప్పుచేయకుండా ఉంటే ఆ నాగాన్ని బంధించి ఇక్కడే భూస్థాపితం చేసుండేవాడ్ని" అన్నాడు.

"మేం తప్పు చేశామా...?"

"నా హెచ్చరిక మర్చిపోయావా? ఇక్కడ ఏం జరిగినా మీరంతా ఉన్నచోటే ఉండండి నిశ్శబ్దంగా ఉండమని హెచ్చరించాను గదా.

అందుకు భిన్నంగా నువ్వే లేచి నిలబడ్డావ్. నీ మనుషులు మూర్ఖులు. చెప్పింది గాలికొదిలేసి గావుకేకలు పెడుతూ పరుగులు తీశారు.

ఫలితం చూశావ్‌గా. నా కట్టునుంచి తప్పించుకుంది. ముగ్గులోకి రాకుండా దాన్ని పాడుచేసి పారిపోయింది" అన్నాడు అనంతస్వామి.

"ఎక్కడ్నుంచి వచ్చింది?" అమాయకంగా అడిగాడు అన్నారావు.

"దీవిమీద భారీనిధి ఉంది. నాగ శక్తులు కావలి ఉన్నాయి. ఇప్పుడు వచ్చింది ప్రధాననాగం"

"మరోసారి ప్రయత్నించకూడదా?"

"ఒకసారి తప్పించుకున్నాక ఇక దాన్ని లొంగదీయటం కష్టం. ప్రయత్నిస్తే ప్రాణం తీయాలని చూస్తుంది."

"నాగులకు అంత శక్తి ఉందా?"

"లేదనుకుంటున్నావా పిచ్చోడా. నాగశక్తి గురించి తెలుసు గాబట్టి ఆదికాలం నుంచి మనదేశంలో నాగుల్ని పూజిస్తారు. నాగులచవితికి పుట్టలో పాలు పోస్తారు. జంటపాములకి ప్రత్యేకపూజలు చేస్తారు.

నాగదోషం ఎంత చెడ్డదో అది అనుభవించిన వాళ్ళకి తెలుస్తుంది. ఆదివిష్ణు ఆలయం ఉండేదని చెప్పబడుతున్న దీవిలో గొప్ప నిధి ఉన్నమాట నిజమే.

అక్కడ కొన్ని నాగశక్తులు కాపలా ఉంచబడ్డాయి. వాటిలో ప్రధానమైనది పింగళ నాగశక్తి" అంటూ చెప్పడం ఆపాడు అనంతస్వామి.

"నాగులకు పేర్లు ఉన్నాయా?" ఆశ్చర్యపోయాడు అన్నారావు.

"ఎందుకంత ఆశ్చర్యం? పేర్లు లేకుండా ఎలా ఉంటాయి? అర్జునుడ్ని వలచి గాంధర్వవివాహం చేసుకున్న ఉలూచి నాగకన్య కాదా?

మన హైందవ పురాణాల ప్రకారం సృష్టించేది బ్రహ్మదేవుడయినప్పటికీ సృష్టికి మూలకర్తగా మనం మహనీయుడైన కశ్యపమహర్షి గురించి చెప్పుకోవాలి. దేవతలయినా, రాక్షసులయినా, నాగులయినా, గరుడులయినా, ఆఖరికి తరులతాదులు కూడా కశ్యపమహర్షి సంతానమే.

కశ్యపునికి అనేకమంది భార్యలు. వారిలో అదితి గర్భాన జన్మించినవారు దేవతలు. దితి అనే భార్య సంతానం దైత్యులు. అంటే రాక్షసులు. అదితి గర్భాన జన్మించాడు కనుక సూర్యుడ్ని ఆదిత్యుడు అంటారు.

అలాగే నేడు జరుగుతున్న యుగాధిపతి అయిన కలిపురుషుడు కూడా ముని అనే భార్యవలన కలిగిన కశ్యప సంతానమే. అలాగే వినత, కద్రువ అనేవారు కూడా కశ్యపుని భార్యలు. ఆ ఇరువురిలో కద్రువ సంతానమే నాగులు. నాగవంశం.

ఈమెకు జనించిన నాగసంతతిలో గొప్ప పేరుప్రఖ్యాతులు పొందినవారూ వున్నారు. మహాశక్తి వంతులూ, చెడ్డ నాగులూ ఉన్నారు. నాగలోకాధిపతి నాగరాజు, ఆదిశేషువు శ్రీహరికి శేషపాన్పు అయ్యాడు.

పాలకడలి నుంచి అమృతం పుట్టడానికి కారకుడు అయ్యాడు. వాసుకి అనే సర్పం. ఇతన్ని మందరగిరికి చుట్టి పాలకడలిలో కవ్వంగా చిలకరించగా పుట్టినది హాలాహలం. లోకరక్షణకోసం హాలాహలాన్ని గొంతులో పట్టి శివుడు నీలకంఠుడయ్యాడు.

ఆ తర్వాతే లక్ష్మీదేవి, చంద్రుడు, ధన్వంతరి కామధేనుల కల్పవృక్షం ఐరావతం ఉచ్చైశ్రవం అనే అశ్వం ఇలా అనేకం పుట్టి చివరిగా అమృతం లభించింది. ఒక నాగం శివునికి కంఠాభరణమైనాడు.

ఇంకా కర్కోటకుడని, తక్షకుడని అనేక సర్పరాజులున్నాయి. తక్షకుని గురించి నీకు తెలిసే ఉంటుంది. ముని కుమారుడి శాపకారణంగా పరీక్షిత్తు ప్రభువుని కాటువేసి కడతేర్చింది ఈ తక్షకుడే.

ఈ నాగకులంలోని బలవంతమైన సర్పాల్లో పింగళుడు ఒకడు. ఏ సర్పాన్నయినా ఒకసారి ఫెయిలయితే మరోసారి ప్రయత్నించి కట్టుకట్టి బంధించవచ్చు. కాని పింగళశక్తి అలాంటిది కాదు. ఒకసారి మిస్సయితే రెండోసారి అతని శక్తిని తిరిగి బంధించటం అసాధ్యం. అలా చేయగలగాలి అంటే ఒక మార్గంవుంది. ఆ విషయం తర్వాత చెప్తాను.

కద్రువ గురించి ఆమె సంతానమయిన నాగుల గురించి చెప్పాను కదా. ఇప్పుడు ఆమె సవతి అయిన వినత గురించి చెప్తాను. ఈమె గరుడులకు తల్లి. ఈమె రెండు గుడ్లు పెట్టగా అవి పిల్లలవుతున్నాయో లేదోనన్న ఆత్రంలో సమయానికి ముందే ఒకగుడ్డును పగలగొట్టి తప్పుచేసింది.

ఫలితంగా తొడలు తయారవని స్థితిలో బిడ్డ పుట్టాడు. అతనికి అనూరుడని పేరు. అతడు సూర్యుని గురించి తపస్సుచేసి ఆయనకు రథసారథిగా వెళ్ళిపోయాడు.

రెండోగుడ్డు సకాలంలో పగిలినందున అందులోంచి గరుత్మంతుడు బయటికొచ్చాడు. ఇతను మహాశక్తిమంతుడు. మహావిష్ణువుకు వాహనంగా వెళ్ళిపోయాడు. ఆదిలో నాగులకు, గరుడులకు పగలు శత్రుత్వాలు లేవు.

అవి ఎలా ఏర్పడ్డాయో ఇప్పుడు చెప్తాను. ఇది ఎందుకు చెప్తున్నానంటే ఒక శక్తిని ఎదుర్కోవాలంటే మరో శక్తి అవసరం. అది నీకు ఎలాగో అర్థం కావాలి” అంటూ క్షణం ఆగాడు అనంతస్వామి.

అప్పటికి భోజన వేళ సమీపిస్తోంది.

అనుచరులంతా ఇటే చూస్తున్నారు.

ఆ విషయం గ్రహించాడు అనంతస్వామి. “హోటల్‌కి ఫోన్‌చేసి అందరికీ భోజనాలు ఇక్కడికే రప్పించు. మహీధర్‌తో చెప్పు. ఆ విషయాలు తను చూసుకుంటాడు. వాళ్ళందర్నీ అలా ఏటిగట్టుకు పోయి చెట్లనీడలో విశ్రాంతి తీసుకోమను” అంటూ సలహా ఇచ్చాడు.

అన్నారావు మహీధర్‌ను పిలిచి విషయం చెప్పి పంపించాడు. అతను అనుచరులందరినీ తీసుకుని ఏటిగట్టు వైపు సాగిపోతూ హోటల్‌కు ఫోన్ చేసి భోజనాలు ఆర్డర్ చేశాడు.

అనంతస్వామి తన మాటల్ని కంటిన్యూ చేశాడు. "ఒకసారి వినత కద్రువలు వనవిహారానికి వెళ్ళారు. అక్కడ దూరంలో ఉచ్చైశ్రవం అనే దేవేంద్రుడి అశ్వం పచ్చిక మేస్తూ కన్పించింది.

పాలకన్నా తెల్లని అందమైన ధవళాశ్వం అది. పాలకడలి నుంచి ఉద్భవించింది. ఆ అశ్వంలో ఎక్కడా చిన్న మచ్చ కనబడదు. ఇదే విషయం చర్చకు వచ్చినప్పుడు గుర్రం తోకలో నలుపు ఉందంటూ వాదించింది కద్రువ. లేదని వినత వాదించింది.

చివరకు వాదులాట కాస్తా పందేనికి దారితీసింది. ఓడినవారు నెగ్గినవారికి దాసిగా ఉండేలా పందెం వేసుకున్నారు. అయితే తను ఓడిపోతుందని కద్రువకు తెలుసు. ఎలాగైనా నెగ్గి వినతను దాసిని చేసుకోవాలని కుట్రపన్ని మనసులోనే తన బిడ్డలయిన నాగుల్ని తలుచుకుని ఏం చేయాలో చెప్పింది.

తల్లి ఆనతిమేరకు నల్లనినాగులు కొన్ని ఆ ఆశ్వం తోకభాగంలో చేరిపోయి తోకలో నలుపు మచ్చలున్నట్టు భ్రమింపజేశాయి. దాంతో వినత పందెం ఓడిపోయి కద్రువకు దాసీ అయింది.

ఆ విధంగా తన తల్లిని మోసంచేసి దాసిగా చేసుకుందని కద్రువ మీద, ఆమె సంతతి అయిన నాగుల మీద గరుత్మంతునికి కోపం. నాగులకు, గరుడులకు జన్మవైరం ఎందుకో ఇప్పుడు నీకు అర్ధమైవుండాలి." అంటూ చెప్పటం ఆపాడు అనంతస్వామి.

"తర్వాతేమైంది?" కుతూహలంగా అడిగాడు అన్నారావు. "మనం ముందే చెప్పుకున్నట్టు గరుత్మంతుడు మహాశక్తిశాలి. బుద్ధిశాలి. సూక్ష్మగ్రాహి.

మోసాన్ని మోసంతోనే జయించి ఎలాగయినా తన తల్లి వినతకి దాస్యవిముక్తి కలిగించాలని నిశ్చయించుకుని సవతితల్లి అయిన కద్రువను కలిసి దాస్యవిముక్తికి ఏం చేయాలో చెప్పమని అడిగాడు.

ఇక్కడ కూడా కద్రువ కపటిగానే ప్రవర్తించింది. తన సంతానమైన నాగులకు మరణం లేకుండా చేస్తే భవిష్యత్తులో గరుడుల నుంచి ప్రమాదం ఉండదని భావించింది. స్వర్గలోకం నుంచి అమృతభాండాన్ని తెస్తే వినతకు దాస్యవిముక్తి అవుతుందని చెప్పింది.

వెంటనే గరుత్మంతుడు తన విశాలమైన రెక్కలు సాచి ఎగురుతూ స్వర్గాని కెళ్ళాడు. అక్కడి కాపలా వాళ్ళని చితగ్గొట్టి అమృతభాండంతో తిరుగు ప్రయాణమయ్యాడు. ఇంద్రాదిదేవతలు అడ్డుకుని నాగులకు అమృతమిస్తే,

అందరికీ కష్టాలు తప్పవని హెచ్చరిస్తారు. అప్పుడు గరుత్మంతుడు ఇచ్చినట్టే ఇచ్చి భాండాన్ని వెనక్కి తెచ్చిస్తానంటూ మాటిచ్చి వస్తాడు.

ఇక్కడ నాగులు అమృతం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గరుత్మంతుడు వచ్చి అమృతభాండాన్ని దర్భలమీద దించాడు. అంతా శుచిగా స్నానంచేసి వచ్చి అమృతాన్ని సేవించమని చెప్పాడు.

నాగులు స్నానం చేసి తిరిగి వచ్చేసరికి అమృతభాండాన్ని చేజిక్కించుకుని తిరిగి దేవలోకం వెళ్ళి అప్పగించేశాడు గరుత్మంతుడు. కొందరు నాగులు మోసం, దగా అనరిచారు. దర్భలమీద అమృతం ఒలికి ఉంటుందన్న ఆశతో దర్భల్ని నాకారు. దర్భ ముళ్ళు వాటి నాలుకల్ని చీల్చేశాయి. అందుకే పాముల నాల్కలు చీలిపోయివుంటాయి.

ఆ విధంగా మోసాన్ని మోసంతోనే జయించి తన తల్లి వినతకి దాస్యవిముక్తి కలిగించిన ధీశాలి గరుత్మంతుడు. సో... నాగులకి, గరుడులకి జన్మవైరం ఎందుకో ఇప్పుడు నీకు అర్థమైవుండాలి.

ఒకానొకప్పుడు గరుత్మంతుడు నాగుల్ని చీల్చిచెండాడి ఎందరో నాగుల్ని హతం చేశాడు" అంటూ చెప్పటం ముగించాడు అనంతస్వామి.

"అంటే... నిధి ఉన్న ప్రదేశానికి చేరుకోవాలంటే గరుడశక్తిగల మనిషి అవసరం అంటారా? అలాంటివాడు ఇప్పటికిప్పుడు మనకి ఎక్కడ దొరుకుతాడు" ఆందోళనగా అడిగాడు అన్నారావు.

"తప్పదు. పింగళ నాగశక్తిని బంధించి కట్టు విప్పి నిర్వీర్యం చేయకుండా మనం ఏమీ చేయలేం. అలా చేయాలంటే గురుడశక్తిగల మనిషి మనకి అవసరం.

అన్నిటికన్నా ముఖ్యంగా నేను మరోసారి ధ్యానంలో కూచో బోతున్నాను. మరో పరిష్కారం ఏదన్నా లభిస్తుందేమో చూద్దాం. నేనుగా కళ్ళు తెరిచేవరకు ఎవరూ నా సమీపంలోకి రావద్దు. నువ్వుకూడా వెళ్ళి భోజనం ఏర్పాట్లు చూసుకో. పిలిచే వరకూ ఎవరూ ఇటు రావద్దు" అంటూ హెచ్చరించాడు అనంతస్వామి.

అలాగేనంటూ తల ఊపి లేచి తనూ ఏటిగట్టు మీదికి బయలుదేరాడు అన్నారావు. ఇసుక మీద నల్లని గుడ్డ పరిచి పద్మాసనంలో కూచుని ధ్యానంలో మునిగిపోయాడు అనంతస్వామి.

* * * * *

క్షిప్రానది మీదుగా ఉదయపు గాలులు ఆహ్లాదభరితంగా వీస్తున్నాయి. నదీ జలాల్ని రెండుపాయలుగా చీల్చుకుంటూ నీటిమీద శరవేగంతో దూసుకు

పోతోంది మోటార్‌బోటు. ఫోర్ సీటర్ టాప్‌లెస్ మినీ స్పీడ్ బోట్ అది. చాలా కంఫర్టబుల్‌గా వుంది.

కృతయుగ్ బోటు నడుపుతున్నాడు.

అతడి భుజం మీద తలాన్చుకుని తన్మయంతో కళ్ళు మూసుకుంది పక్క సీట్లోని స్నిగ్ధ. నీటిమీద ప్రయాణం చాలా ఉత్సాహాన్నిస్తోంది ఇద్దరికీ.

ఎగువకు వెళ్ళేకొద్దీ నదికి ఇరువంకలా కొండ గుట్టలు పచ్చని దట్టమైన అడవి ఆహ్వానిస్తున్నాయి. ఏటిమీదుగా కొంగల బారులు ఎగిరిపోతున్నాయి. చూడ్డానికి మనోహరంగా ఉందా దృశ్యం.

నల్లని మబ్బుతునకలు సూర్యుడ్ని కాసేపు తమలో దాచేసుకుంటూ మళ్ళీ వదిలేస్తూ దోబూచులాడుతున్నాయి. ఎండ తగిలి స్నిగ్ధముఖం కందిపోతున్నట్టు గ్రహించాడు కృతయుగ్. పైటచెంగు లాగి తలమీదుగా కప్పాడు. బోటు ఇంజను శబ్దం తప్ప – అంతటా నిశ్శబ్దం. అప్పటికే ముప్పై కిలోమీటర్ల దూరం ఎగువకు వచ్చేశారు.

"కృతా..." పిలిచింది స్నిగ్ధ.

"చెప్పు" అన్నాడు దృష్టిని మరల్చకుండా.

"ఏం లేదు. నిన్న దీవి మీదికెళ్ళిన నలుగురూ చనిపోయివుంటారంటావా?" అడిగింది.

"డౌటా... వాళ్ళ చావుకేకలు విన్నాంగదా"

"మన పరిస్థితి ఏమిటి?"

"ఏమో... వెళ్ళాకగదా తెలుస్తుంది."

కాస్సేపు మౌనంగా ఉండిపోయింది స్నిగ్ధ.

"భయపడుతున్నావా?" నవ్వాడు.

నిటారుగా కూర్చుంటూ సీరియస్‌గా చూసింది స్నిగ్ధ. "లేదు. నాకు భయం లేదు. దీవి మీద ఎదురయ్యే పరిస్థితులేమిటి? వాటిని ఎలా ఫేస్ చేయాలని ఆలోచిస్తున్నాను" అంది స్నిగ్ధ.

కృతయుగ్ ఏదో చెప్పబోతూ ఆగాడు. ఇంజను మోతలో గమనించలేదు గాని తమ వెనక తుమ్మెద ఝుంకారంలా శబ్దంచేస్తూ మరో బోటు ఇంజన్ సౌండ్ ఏదో వినవస్తోంది. తలతిప్పి వెనక్కి చూశాడు.

తమకు వెనగ్గా కొంత దూరంలో ఉందా బోటు. చాలా వేగంగా వస్తోంది. అందులో కాషాయ దుస్తులు ధరించిన వ్యక్తులు కొందరున్నారు. చూడ్డానికి బౌద్ధసన్యాసుల్లా ఉన్నారు. వాళ్ళు ఎవరు ఎక్కడికి వెళ్తున్నారో అర్థం కాలేదు.

అదే సమయంలో ఇటు పశ్చిమతీరానికి సమీపంలో మరో బోటుకూడా కన్పించింది. అది కూడా ఆఘమేఘాల మీద దూసుకొస్తోంది. నల్లని దుస్తులు ధరించి ఒకే ఒక వ్యక్తి ఆ బోటు నడుపుతున్నాడు. ఎవరో ముస్లిం స్త్రీ కావచ్చని కూడా తోచింది.

"ఏమైంది కృతయుగ్?" తల తిప్పి చూస్తూ అడిగింది స్నిగ్ధ.

"అటు చూడు. మన వెనగ్గా ఒక బోటు అటు తీర సమీపంలోంచి మరో బోటు వస్తున్నాయి. ఎవరో అర్ధంగావటం లేదు" చెప్పాడు.

"ఇందులో అర్ధం కానిదేముందిలే. మనలాగే ఏదో పనిమీద వాళ్ళు వెళ్తున్నట్టున్నారు" అంది స్నిగ్ధ.

స్నిగ్ధమాటలు కృతయుగ్‌కి సంతృప్తినివ్వలేదు. వాళ్ళతో ఏం పనిలేదని సరిపెట్టుకోలేక పోతున్నాడు. ఎడంగా వస్తున్నా ఆ సన్యాసుల బోటు తమను ఓవర్ టేక్ చేయటానికే వస్తోందా అన్పిస్తోంది. కాని మరో కోణంలో ఆలోచిస్తే ఇక్కడ ఉజ్జయినిలో తమకు శత్రువులు ఎవరున్నారని అనుమానించటానికి అన్పిస్తోంది. ఆలోచిస్తూనే బోటు పోనిస్తున్నాడు.

మరి కొంత దూరం వెళ్ళేసరికి తమ బోటుకి వంద గజాల దూరంలోంచి తమను ఓవర్‌టేక్ చేసి ముందు కెళ్ళిపోయిందా బోటు. ఇటు రెండోబోటు రెల్లుదుబ్బుల మాటున ఎటు వెళ్ళిపోయిందో కన్పించలేదు. కాని కృతయుగ్ మనసు మాత్రం ఎందుకో కీడును శంకిస్తూనే వుంది. తన దారిన ముందుకు పోతూనే ఓ కన్ను అటు వేసి వుంచాడు కృతయుగ్.

చివరికి అతడి అనుమానమే నిజమైంది.

ఎగువకు వెళ్ళిపోతున్న బోటు అర్ధచంద్రాకారంలో కుడిపక్కకు రౌండ్ కొడుతూ నీటిని ఫౌంటెన్‌లా పైకి విరజిమ్మింది. అది వెనుతిరిగి తమ బోటుకు నేరుగా ఎదుర్రావటం చూసి అనుమానిస్తూ స్నిగ్ధ కృతయుగ్ భుజంమీద చేయి వేసింది.

అదే క్షణంలో బోటుమీద ఒక సన్యాసి లేచి నిలబడ్డాడు. అతడి చేతిలో ఎండపడి నిగనిగా మెరుస్తోంది రివాల్వర్. వాడ్ని గుర్తుపట్టి కరెంట్ షాక్ తగిలినట్టు ఉలికిపడ్డారు కృతయుగ్ స్నిగ్ధలు.

వాడు చింటూభాయ్ ! బోడిగుండు కొట్టి కాషాయం ధరించినా వాడ్ని సులువుగానే పోల్చుకున్నారిద్దరూ. అసలు ఏం జరుగుతోందనేది ఇద్దరికీ అర్థం కాలేదు. ఎక్కడి దంతెవారా... ఎక్కడి ఉజ్జయిని.

పగబట్టి వీడు ఇంతదూరం ఎలా రాగలిగాడు? తను ఉజ్జయినిలో ఉన్నట్టు వీడికి ఎలా తెలిసింది? అన్న సమాధానం దొరకని విచిత్ర ప్రశ్నలే.

బోట్లు రెండూ ఎదురుబదురుగా దగ్గరవుతున్నాయి. వికటంగా నవ్వుతూ రివాల్వర్ గురిచేస్తున్నాడు చింటూ భాయ్. ముంచుకొస్తున్న ప్రమాదాన్ని గ్రహిస్తూనే క్షణం కూడా ఆలస్యం చేయకుండా బోటును లెఫ్ట్‌కి కట్ చేశాడు కృతయుగ్.

'యు' షేప్‌లో ఒక పక్కకు ఒరిగి నీళ్ళను ఫౌంటెన్‌లా పైకి లేపుతూ బోటు వచ్చిన దారికి మళ్ళీ ఉజ్జయిని దిశగా దూసుకుపోనారంభించింది. వెనక నుంచి ధన్‌మంటూ ఘర్జించింది చింటూభాయ్ రివాల్వర్.

దాంతోపాటు మరికొన్ని రివాల్వర్లు మోగాయి. ఐనా తప్పించుకుంది బోటు. మరింత వేగం పుంజుకుంది. ''వాళ్ళు తప్పించుకోకూడదు. పోనీ....మరింత స్పీడ్‌గా" పిచ్చిపట్టినట్టు అరుస్తున్నాడు చింటూభాయ్.

వెనుక నుంచి బుల్లెట్లు తరుముకొస్తున్నా గాభరాచెందలేదు కృతయుగ్. ఇలాంటి సమయాల్లో గాభరా చెందినా భయపడినా తప్పులు దొర్లుతాయి. ఒక్క తప్పు దొర్లినా చాలు తమ జీవితాలు ముగిసిపోడానికి. స్థిరంగా బోటును పోనిస్తున్నాడు.

అయితే అతడిలా నిబ్బరంగా ఉండలేక భయాందోళనలకు గురి అవుతూ మాటిమాటకీ వెనక్కి తిరిగి చూస్తోంది స్నిగ్ధ. ఎటువంటి పరిస్థితిలోనూ వాళ్ళ బుల్లెట్ రేంజ్‌కి దగ్గరపడకూడదని కృతనిశ్చయంతో ఉన్నాడు కృతయుగ్.

వెనక బోటు దగ్గరపడుతోందనగా తన బోటును జిన్‌జాన్‌గా నీటిమీద పోనిస్తూ నదిమీద రౌండ్లుకొడుతూ వాళ్ళని ముప్పుతిప్పలు పెట్టాడు. ఇరవై నిముషాలు తూనీగల్లా పోటీపడుతూ నదిమీద షికార్లు చేశాయి బోట్లు రెండూ. అయితే ఏం చేసినా చింటూభాయ్ తమను వదిలే జాడమాత్రం కన్పించలేదు.

ఈ పరిస్థితుల్లో అనుకోకుండా ఒక బుల్లెట్ దూసుకొచ్చి బోటుకు బెజ్జం పెట్టేసింది.

ఊహించని ప్రమాదం ఇది. బోటు ముందుపక్క నుంచి బోటులోకి వేగంగా నీరు చేరిపోనారంభించింది. నీరు చేరే కొద్దీ బోటువేగం మందగించింది.

దాంతో మరో రెండు బుల్లెట్లు బోటుకి బెజ్జాలు పెట్టటంతో మరింత వేగంగా నీరు బోటులోకి చేరిపోతూ బోటు మునిగిపోయే పరిస్థితి తలెత్తింది.

ఎప్పుడైతే తమ బోటు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందో చింటూభాయ్ బోటు తమ బోటు చుట్టూ రౌండ్లు కొట్టనారంభించింది. విజయగర్వంతో పెద్దగా నవ్వుతున్నాడు చింటూభాయ్.

నది మధ్యలోని నీటిలో మట్టిమేట మీద దట్టంగా పెరిగిన రెల్లుగడ్డి సమీపంలో నిలిచిపోయింది బోటు. ఇంజను ఆపేశాడు కృతయుగ్. తప్పించుకునే దారి కన్పించటంలేదు. "స్నిగ్ధా. నీకు స్విమ్మింగ్ వచ్చుగదా?" చిన్నగా అడిగాడు.

"వచ్చు" అంది ధైర్యం కూడదీసుకుంటూ.

"మన బోటు కాస్సేపట్లో మునిపోతుంది. మనకి వేరే దారిలేదు. నీళ్ళలోకి దూకటానికి సిద్ధంగా ఉండు" హెచ్చరించాడు. "ఊఁ" అంది స్నిగ్ధ.

"ఏయ్ టాక్సీ డ్రైవర్!" తన బోటు మీదనుంచి అరిచాడు చింటూభాయ్.

"ఆ రోజు పెద్ద మొనగాడిలా నన్ను చావుదెబ్బ కొట్టావ్. నీ మూలంగా మేం చాలా నష్టపోయాం. నాతో పెట్టుకుంటే ఎంత ప్రమాదమో నీకు జన్మజన్మలకీ గుర్తుండిపోవాల్రా. అందుకే నీ తల నరికి తెచ్చి కానుగ్గా ఇస్తానని మా డాడీకి మాటిచ్చి బయలుదేరివచ్చా.

నా మాట చెల్లించుకోబోతున్నాను. నీ పక్కనున్న యాపిల్ పండు లాంటి అమ్మాయి ఇక నాసొంతం. అయిపోయావ్‌రా" అంటూ రివాల్వర్ ఎయిమ్ చేశాడు.

వాడి మాటల్ని ఓపిగ్గా విన్నాడు కృతయుగ్. విని ఊరుకున్నాడు. సమాధానంగా ఒక్కమాట కూడా మాట్లాడలేదు. వాడు రివాల్వర్ ట్రిగ్గర్ నొక్కే లోపల స్నిగ్ధ చేయి పట్టుకుని మెరుపువేగంతో వెనక్కి వాలి నీటిలోకి జారిపోయాడు.

'ధన్‌ధన్' మంటూ మారుమ్రోగాయి రివాల్వర్లు. బుల్లెట్లు బోటును తూట్లు పొడిచాయి.

ఆ బోటును అడ్డం పెట్టుకుని తలదాచుకున్నారు స్నిగ్ధ, కృతయుగ్‌లు. క్లిష్టమైన ఆ గడ్డు పరిస్థితిలో ఏం చేయాలో ఎలా ప్రాణాలు కాపాడుకోవాలో ఇద్దరికీ అర్థంగావటం లేదు. నీటిలో మునిగి మాత్రం ఎంత సేపు ఉండగలరు. అయితే కృతయుగ్‌కి మిగిలిన ఒకే ఒక మార్గం నీటిలో మునిగి వెళ్ళి ప్రత్యర్థుల బోటుని కూడా తల్లకిందులు చేసి దాడిచేయటం.

అదే చివరి ప్రయత్నంగా మనసులో సిద్ధపడి రెడీగా ఉన్నాడు కృతయుగ్.

"ఎక్కడికిపోతావ్‌రా? తప్పించుకోలేరు....నీ తల పట్టుకుపోతా.... తప్పించుకోలేరు" అరుస్తున్నాడు చింటూభాయ్. వాళ్ళ బోటు నీటిమీద తాబేలులా నెమ్మదిగా కదిలి ముందుకొస్తోంది.

వాళ్ళు ఇటుపక్కకొస్తే తాము కన్పిస్తారు. పరిస్థితి జాగ్రత్తగా గమనిస్తున్నాడు కృతయుగ్. ఇంతలో మరో సంఘటన కలవరపరిచింది. అంతవరకు తమకు కవర్ చేసిన తమ బోటు పూర్తిగా నీళ్ళు చేరిపోవడంతో ఒక్కసారిగా అది నీట్లో మునిగిపోయింది.

ఆ కాస్త షెల్టర్ కూడా పోవడంతో మరో దారి లేక కృతయుగ్ స్నిగ్ధలు ఊపిరిబిగబట్టి నీటిలోకి మునిగిపోయారు.

క్షిప్రానదిలో ప్రవాహవేగం తక్కువగానే వుందిగాని అద్దంలా స్వచ్ఛంగా మెరుస్తోంది నీరు. ఎంత లోతుకు వెళ్ళినా తమ నీడ శత్రువులకు కన్పిస్తుందని తెలుసు. అందుకే నీటి అడుగున సాధ్యమైనంత దూరం వెళ్ళిపోయే ప్రయత్నంలో వున్నారిద్దరూ.

చింటూభాయ్ బోటు ఆ ప్రాంతంలోనే చక్కెర్లు కొట్టనారంభించింది. చింటూభాయ్‌తోపాటు మిగిలిన వాళ్ళంతా గుడ్డిగా నీటిలోకి కాల్పులు సాగిస్తున్నారు. నీటిలోంచి ఊపిరి తీసుకోడానికి పైకి తీస్తే తల పగిలిపోతుందని తెలుసు.

అతికష్టం మీద మరింత దూరం వెళ్ళే ప్రయత్నంలో ఉన్నారు కృతయుగ్ స్నిగ్ధలు. నీటి పైన తమకు దూరమవుతున్న ప్రత్యర్థులబోటు నీడలా కనబడుతోంది.

అంతలో ఒక అనూహ్య సంఘటన చోటు చేసుకుందక్కడ. ధ్యాసంతా నీటిలో మునిగిన జంట మీద ఉండటంలో చివరి క్షణం వరకు ముంచుకొస్తున్న ప్రమాదాన్ని చింటుభాయ్ వర్గం గుర్తించలేకపోయింది.

పక్కనున్న రెల్లుదుబ్బుల్ని విరగదోచుకుంటూ నీటి మీద పిడుగుపాటులా ఒక్కసారిగా అటు దూసుకు వచ్చింది మూడోబోటు. అందులోని బురఖా యువతికి అప్పటికే అక్కడి పరిస్థితి అర్థమైపోయినట్టుంది. బోటును ఎడంచేత్తో కంట్రోల్ చేస్తూ కుడి చేత్తో రివాల్వర్ అందుకుంది.

వచ్చీ రావటమే నిర్దాక్షిణ్యంగా చింటూభాయ్ వర్గంపైన కాల్పులు ఆరంభించింది. చింటూభాయ్ వర్గానికి ఏం జరుగుతుందో మొదట అర్థం కాలేదు. తనదే విజయమన్న తలబిరుసుతో వున్న చింటూభాయ్‌కి ఈ సంఘటన మింగుడుపడలేదు.

నీటిలో దాక్కున్నవాళ్ళ సంగతి వదిలేసి కొత్తగా రంగ ప్రవేశం చేసిన మూడో బోటు మీదకు కాల్పులు ఆరంభించాడు. కాని అప్పటికే ఆలస్యమై పోయింది. ఒక బుల్లెట్ భుజంలోను మరొకటి పక్కటెముకల్లోను దిగబడ్డంతో పెద్దగా అరుస్తూ అమాంతంగా ఎగిరి నీటిలో పడిపోయాడు.

మిగిలినవాళ్ళు కాల్పులు ఆరంభించేలోపలే వర్షంలా దూసుకొచ్చిన బుల్లెట్లకు ఒకడొకడుగా రాలిపోయారు. బుల్లెట్లు ఖాళీ అయిన రివాల్వర్ పక్కన పెట్టి రెండో రివాల్వర్ అందుకుంది బురఖా యువతి. కసితీరా ప్రత్యర్థుల బోటుమీద కాల్పులు జరిపింది. రెండు బుల్లెట్లు ఇంజన్‌ని తాకటంతో భయంకర విస్ఫోటనం జరిగిందక్కడ.

ముక్కలు చెక్కలైన బోటుభాగాలు దట్టమైన పొగమంటల వెంట పైకి లేచాయి. ఒక్కడయినా బతికి పైకిలేస్తాడేమోనన్న సందేహంతో తన బోటును అక్కడే మూడు రౌండ్లు కొట్టి గాలించిందామె.

నదీజలాలు ఎర్రబారుతున్నాయి. ఒక్కడూ బతికిన ఆధారం లేదు. నీటి మీద ఇంకా మండుతూనే వున్నాయి మంటలు. ప్రేలుడు శబ్దం నది వెంట చాలా దూరం విన్పించింది.

ఈ లోపల-నీటి అడుగున వున్న కృతయుగ్ స్నిగ్ధలకు పైన ఏదో జరుగుతోందని అర్థమైంది. నీడలా నీటి పైన మూడో బోటు జాడ తెలుస్తోంది. రివాల్వర్ శబ్దాలు వినగానే ఇక తట్టుకోలేక వేగంగా నీటిపైకి దూసుకొచ్చారు.

ఎక్కువసేపు నీటిలో మునిగి వుండటంతో గుండెలు మండుతున్నాయి వారి ఇద్దరికీ. తలలు పైకెత్తి ఊపిరితీసుకున్నారు.

సరిగ్గా అప్పుడే బోటు పేలిపోయింది. చింటూభాయ్ వర్గం తుడిచి పెట్టుకుపోయింది.

ఆపద్బాంధవిలా ఈ క్లిష్ట సమయంలో వచ్చి తమని కాపాడిందెవరో తెలీక ఆశ్చర్య సంభ్రమాలతో అటే చూస్తున్నారిద్దరూ.

శత్రుశేషం మిగల్లేదని నమ్మకం కుదిరాక తనబోటును ముందుకు తీసుకొచ్చి ఇద్దరిపక్కగా ఆపింది బురఖా యువతి.

"ఆశ్చర్యపోయింది చాలు. ఆర్ యు ఒకే?" బోటు పైనుంచి అడిగిందామె.

ఓ.కె. అన్నట్టు తలూపారిద్దరూ.

అయితే గొంతు.... ఆమె గొంతును వెంటనే గుర్తుపట్టేశాడు కృతయుగ్. మరింత విస్తుపోయాడు. "కాంచనా!" పిలిచాడు.

వెంటనే ముఖం మీది ముసుగు తప్పించి అందంగా నవ్వింది కాంచన. "గుర్తుపట్టేశావన్నమాట. నిన్ను ఏమార్చలేం బాబు. ఎక్కువసేపు నీట్లోవుంటే రొంప జలుబు చేస్తుంది. ముందు బోటు మీదకు రండి.

అక్కా, నీ చేయివ్వు" అంటూ స్నిగ్ధకు చేయందించింది కాంచన చొరవగా. స్నిగ్ధ నడుం పుచ్చుకుని పైకి లేపి సాయం చేసాడు కృతయుగ్.

ఆమె సేఫ్‌గా బోటులోకి చేరగానే తను బోటు అంచు పట్టుకుని పైకి లేవబోయాడు. ఇంతో షార్క్ చేపలా అతని పక్కనే నీటిపైకి లేచాడు చింటూభాయ్. వాడి చేతిలో తళతళామెరుస్తోంది డాగర్. వాడ్ని చూసి భయంతో కెవ్వుమంది స్నిగ్ధ. వాడు డాగర్ చేతిని కోపంగా విసిరాడు...

చివరి క్షణంలో వేగంగా పక్కకి జరిగాడు కృతయుగ్. అతడి వీపులో దిగాల్సిన డాగర్ అతడి కుడిభుజాన్ని అంగుళం లోతున మూడంగుళాల మేర చీరేసింది. రెండో ప్రయత్నంగా మరోసారి డాగర్ లేపాడు చింటూ.

కాంచన చేతిలో రివాల్వర్ 'ధన్' మంది. క్లోజ్ రేంజ్‌లో బుల్లెట్ చింటూ భాయ్ నుదుటి నుండి తల్లో జొరబడి తల వెనక భాగాన్ని చీలుస్తూ బయటికొచ్చి నీటిలోపడి ఛెళ్ళున ఎగసింది రక్తం. పెద్దగా అరవాలని నోరు తెరిచాడు చింటూభాయ్.

గొంతు దాటి బయటకు రాలేదు అరుపు. అలాగే వెనక్కి వాలిపోయాడు. నీటిలో మునక్క ముందే వాడి ప్రాణాలు ఎగిరిపోయాయి. నీటిలో నెత్తుటి చార తప్ప తర్వాత వాడి శరీరం ఎటు కొట్టుకుపోయిందీ తెలీలేదు.

కాంచన స్నిగ్ధలు సాయం పట్టి కృతయుగ్‌ను పైకి లాగి బోటులో కూచోచెట్టారు. "మనం ఎక్కువసేపు ఇక్కడ ఉండటం ప్రమాదం. వెళ్ళిపోవాలి." అంటూ బోటు ఇంజన్ స్టార్ట్ చేసింది కాంచన.

ఒకటవలు స్నిగ్ధ వైపు విసిరింది. "గాయం లోతుగా అయినట్టుంది నెత్తురు రాకుండా కట్టుకట్టి తర్వాత తల తుడుచుకోండి" అంది.

"కాంచనా. దీవికెళ్ళాలని బయల్దేరాం.బోటుని ఎగువకు పోనీ" అన్నాడు కృతయుగ్. గాయం నరకం చూపిస్తున్న అతడి పట్టుదల అలాంటిది.

"బుద్ధుందా? ఈ పరిస్థితిలో దీవిమీదికెళ్ళి ఏం సాధించాలని. ఇప్పుడు మనకి కావలసింది దీవి కాదు. నీకు వైద్యం. అక్కా ఏమంటావ్." స్నిగ్ధను వరస కలిపి పిలిచేస్తూ అడిగింది కాంచన.

స్నిగ్ధకు ఏడుపొస్తోంది. సమయానికి కాంచన వచ్చి కాపాడిందిగాని లేకపోతే పరిస్థితి ఏమిటి? తమ శరీరాలు క్షిప్రానది చేపలకు ఆహారమయ్యేవి. అసలిదంతా తనమూలానే అని ఆలోచనతో దుఃఖం పొంగుకొచ్చి కృతయుగ్ భుజానికి డ్రస్సింగ్ చేయలేకపోతోంది.

ఆ విషయం గమనించింది కాంచన, "అక్కా. ఏడిస్తే పనులు కావు. నువ్విలా రా. బోట్‌ని కంట్రోల్ చెయ్యి. గాయం సంగతి నేను చూస్తాను" అంటూ స్నిగ్ధను తన వైపు లాగి స్టీరింగ్ అప్పగించింది కాంచన.

తను కృతయుగ్ పక్కకు జరిగింది. భుజానికి లోతుగా పడింది గాయం నెత్తురు ఉబికివస్తోంది. టవల్ చించి నెత్తురు తుడిచింది. రక్తస్రావం అధికం గాకుండా భుజానికి కట్టుకట్టింది. చించగా మిగిలిన టవల్‌తో తనే అతడి తల తుడిచింది. అంతే కాదు. బోటు నడుపుతున్న స్నిగ్ధ తలను కూడా తుడిచింది.

"అక్కా. మీ ఇద్దరూ పెళ్ళిగాకుండానే ఇలా చలి గంగస్నానాలు చేయటం చూస్తే నాకు చాలా సంతోషంగా ఉంది తెలుసా?" అంది. ఆ మాటలకి నవ్వకుండా ఉండలేకపోయింది స్నిగ్ధ.

"ఏయ్. జోకులాపు. అసలు నువ్విక్కడకి...ఎలా వచ్చావ్. ఏమీ అర్థం గావటం లేదు. చింటూభాయ్ అటాక్‌చేస్తాడని నీకు ముందే తెలుసా!" నమ్మలేనట్టు అడిగింది స్నిగ్ధ.

ఇంతకుముందు కాంచనమీద అసూయ ఉండేది. కోపం ఉండేది. కృతయుగ్‌ని ప్రేమించటంలో తనకు పోటీ వస్తోందని అలక ఉండేది. కాని విచిత్రంగా ఇప్పుడా ఫీలింగే లేదు ఆమెలో.

"హమ్మయ్య. ఇప్పటికయినా పెదవి విప్పి మాట్లాడావ్. చాలా హ్యాపీగా ఉందక్కా. మీకు తెలీని విషయాలు చాలా ఉన్నాయి" అంది.

"నీ సంగతి చెప్పు. నిన్నిక్కడ అస్సలు ఊహించలేదు" గాయం బాధను ఓర్చుకుంటూ అడిగాడు కృతయుగ్.

"అవున్లే. ఢిల్లీ వెళ్తానని ఉజ్జయిని వచ్చినవాడివి. నన్నెలా ఊహించు కుంటావ్?" దెప్పిపొడిచింది కాంచన.

"ఓసినీ... పరాచికాలకి ఇదా సమయం. విషయం చెప్పొచ్చుగా" కాస్త కోప్పడ్డాడు కృతయుగ్.

"నేను నిన్ను ప్రేమిస్తున్న సంగతి మా డాడీకి తెలుసు. నా బావ మహీధర్‌కి తెలుసు. వాడికి నీ మీద పీకలదాకా కోపం ఉంది.

ఆలయాల్ని అన్వేషించడానికి ముందే వచ్చి ఉజ్జయినిలో తిష్టవేసిన బసవడు, మీ ఇద్దరూ మినర్వా హోటల్లో దిగిన సంగతి డాడీకి రిపోర్ట్ చేశాడు. వాళ్ళంతా నిన్ననే ఇక్కడికి చేరుకున్నారు. మీరు ఉజ్జయినిలో ఉన్న సంగతి అప్పుడే నాకు తెలిసింది.

ఎప్పుడూ నన్ను వెంట తీసుకెళ్ళే డాడీ ఈసారి నన్ను ఇంటివద్ద వదిలేశాడు. ఎందుకంటే మా సీక్రెట్స్ నీకు చెప్పేస్తానని వాళ్ళ భయం– నేను మీ గురించి ఆందోళనతో హైదరాబాద్‌లో ఉండలేకపోయాను.

బురఖా వేసుకుని పేరు మార్చుకుని వాళ్ళు వచ్చిన విమానంలోనే నేనూ వచ్చేశాను. అలాగే మహీధర్ ఫోన్ చేయటంతో చింటూభాయ్, వాడి మనుషులు కూడా ఉజ్జయిని చేరుకున్నారు. మినర్వాకి ఎదురుగా ఉన్న ద్వారకాహోటల్లో డాడీతో పాటు మావాళ్ళంతా దిగారు. మినర్వాకి వెనక వీధిలోని హోటల్లో నేను దిగాను. చింటూభాయ్ కూడా అదే హోటల్లో దిగటంతో వాడికి నాబావ మహీధర్ సపోర్టు గురించి నాకు అర్ధమైంది.

నిన్న ఉదయం ఆదివిష్ణు ఆలయంజాడ తెలుసుకోడానికి దీవిమీదికి వెళ్ళిన బసవడు మరో ముగ్గురు వెనక్కి రాలేదు.

వాళ్ళు ఏమయ్యారో తెలీదు. అసలు నేను కూడా వచ్చి ఉజ్జయినిలో ఉన్న సంగతి మావాళ్ళకి తెలీదు. నాకు మీరు ముఖ్యం, మీ క్షేమం ముఖ్యం.

బౌద్ధసన్యాసుల్లా వేషాలు మార్చుకొని మినర్వా హోటల్ కొచ్చి మిమ్మల్ని చంపాలనుకున్నాడు చింటూభాయ్. కాని ఎలా తెలిసిందో మీ ఇద్దరూ బోట్లో నది మీదకు వెళ్తున్నారన్న సంగతి తెలిసి మహీధర్ చింటూభాయ్‌కి ఉప్పందించాడు.

దాంతో వాళ్ళు మీ వెంటపడ్డారు. మీకోసం నేను వచ్చాను. కాని కాస్త లేటవటంతో పరిస్థితి ఇంతదాకా వచ్చింది" అంటూ వివరించింది కాంచన.

"ఇంతకీ మీరంతా ఉజ్జయిని ఎప్పుడొచ్చారు?" అడిగింది స్నిగ్ధ. "నిన్ననే వచ్చాం" అంది కాంచన.

"మీ మనుషులు నలుగురు దీవిమీదకు వెళ్ళటం నిన్న మేం చూశాం. నది ఒడ్డున ఉన్న మాకు వాళ్ళ ఆర్తనాదాలు విన్పించాయి.

ఏం జరిగిందో తెలీదు. అది తెలుసుకోవాలనే మేం బయలుదేరివెళ్తుంటే చింటూభాయ్ అడ్డంపడి ఇంతగొడవ జరిగింది" అన్నాడు కృతయుగ్.

"చింటూభాయ్ వాళ్ళ శవాలు దొరికితే మనకి సమస్యలు ఎదురవుతాయనుకుంటా" అంది స్నిగ్ధ.

"మీకు తెలీని విషయం ఒకటి చెప్పనా?" అంది కాంచన. "ఏమిటది?" అడిగాడు కృతయుగ్.

"మీకు ఫిరానా చేపల గురించి తెలుసుగదా. జంతువుల మీద దాడిచేసి చంపి తినేస్తాయి.

ఫిరానా చేపలు కాదుగాని ఆ కుదురులోంచే వచ్చిన ఒక జాతి చేపలకు క్షిప్రానది పెట్టింది పేరు.

ఇవి ఎంత దూరంలో వున్నా నెత్తురు వాసన చూస్తే చాలు శరవేగంగా మందలుగా వచ్చిపడతాయి. బతికిన జంతువుల జోలికి పోవు.

మృతకళేబరాలు ఏం దొరికినా క్షణాల్లో స్వాహాచేసేసి ఎముకల గూళ్ళను మిగుల్చుతాయి.

అందుకే క్షిప్రానదిలో చచ్చినవాళ్ళ శవాల్ని గుర్తించటం కష్టం అంటారు. ఈపాటికి చింటూభాయ్ వర్గం శవాలన్నీ నదీగర్భంలో ఎముకల గూళ్ళుగా మారిపోయి ఉంటాయి" అంది కాంచన.

ఆ మాటల్ని వింటూ బోటు వేగం మరింత పెంచింది స్నిగ్ధ. నీటిని చీల్చుకుంటూ శరవేగంగా ఉజ్జయినివైపు దూసుకుపోసాగింది బోటు.

సుమారుగా పన్నెండుగంటల ప్రాంతంలో ధ్యానంలో కూచున్న అనంతస్వామి సాయంత్రం మూడుగంటల వరకు కదల్లేదు మెదల్లేదు.

శిలావిగ్రహంలా కూచున్నవాడు కూచున్నట్టే ఏకబిగిన ధ్యానంలోనే గడిపాడు. మనోనేత్రంతో ఆయన ఏంచూశాడో ఏం తెలుసుకున్నాడో తెలీదు. సరిగ్గా మూడు పది నిముషాలకు కనులు తెరిచాడు.

అప్పటికే అందరూ మధ్యాహ్న భోజనాలు ముగించి ఏటిగట్టు చెట్లనీడన కాలక్షేపం చేస్తున్నారు.

అన్నారావుతో పాటు పీటరు మరో నలుగురు మాత్రం గుడ్డగొడుగుల కింద నీడన కూచుని అనంతస్వామి ధ్యానం నుంచి బయటపడే సమయం కోసం ఎదురుచూస్తున్నారు. కళ్ళు తెరిచిన అనంతస్వామి రమ్మని అన్నారావుకి చేయి ఊపాడు.

లేచి గబగబా వచ్చి గొడుగునీడన అనంతస్వామి ఎదురుగా కూచున్నాడు అన్నారావు.

"భోజనం వేళ మించిపోయింది స్వామీ. ముందు భోజనం చేయరాదా!" అడిగాడు.

"మించిపోయింది గాబట్టి ఈ పూట భోంచేయను. ఒక గ్లాసు నిమ్మరసం కలిపిన మజ్జిగ ఇస్తే చాలు" అన్నాడు అనంతస్వామి.

పావుగంటలో వచ్చింది మజ్జిగ. మజ్జిగ తాగి గ్లాసు పక్కనపెట్టాడు అనంతస్వామి. ఇప్పుడు తామిద్దరే మిగిలారక్కడ. ఎందుకోగాని ఒకసారి అన్నారావు ముఖంలోకి దీక్షగా చూశాడు అనంతస్వామి.

"ఏమైంది స్వామీ?" అన్నారావు అడిగాడు.

"ఏం లేదు. ఆశ మనిషిని బతికిస్తుంది. ఊరిస్తుంది. ఊహల్లో తేలిస్తుంది. ఒక్కోసారి నిరాశ మిగిల్చి మనః క్లేశాన్ని కలిగిస్తుంది. ఇందుకే మన పెద్దలు చెప్పారు. మన కష్టనష్టాలన్నిటికీ ఆశే కారణమని. ఆశ లేని మనిషుండడు. కానీ సాధ్యాసాధ్యాలను బట్టి ఆశలూ ఉంటే జీవితం సాఫీగా నడుస్తుంది" అన్నాడు.

అన్నారావు నొసలు విరిచాడు.

సాధారణంగా ఎప్పుడోగాని వేదాంతాల గురించి, జీవిత సత్యాలను గురించి మాట్లాడని అనంతస్వామి ఉన్నట్టుండి ఎందుకీ ఉపోద్ఘాతం ఆరంభించాడో అర్థంకాలేదు. "విషయం లేకుండా మరే టాపిక్ తీసుకురాడని తెలుసు. అదేమిటో సూటిగా చెప్పేయొచ్చుగా!" అని అడిగాడు.

దూరంగా నదిలో ఒంటరిగా పోతున్న తెరచాప పడవవంక చూస్తూ కాస్సేపు మౌనంగా ఉండిపోయాడు అనంతస్వామి.

ఉన్నట్టుండి తలతిప్పి ముఖంలోకి చూస్తూ–"ఈ ప్రాజక్టు నీకు లాభసాటి కాదు. దీన్ని వదులు కోవటం మంచిది అని నా అభిప్రాయం" అన్నాడు చివరికి.

"ఇప్పటికే దీనిమీద చాలా ఖర్చు పెట్టాను. ఉన్నట్టుండి వదులుకోమంటే ఎలా? ఏమయిందని?" అన్నారావు అడిగాడు.

"ఏమీ కాలేదు. ధ్యానంలో నాకు తెలిసిన కొన్ని సూచనలను అనుసరించి నేను నీకిచ్చే సలహా మాత్రమే ఇది" చెప్పాడు అనంతస్వామి.

"అంటే... నిధికి కాపలా ఉన్న నాగశక్తుల్ని వశపర్చు కోవటం అసాధ్యమనా?" సందేహం వెలిబుచ్చాడు అన్నారావు. "అది అసాధ్యమని నేననలేదు. నేచెప్పే విషయం దానిగురించి కానేకాదు"

"మరి?"

"నా మాటలు నీకు అర్ధం కావాలంటే నీకు కొన్ని సూక్ష్మవిషయాలు తెలియాలి. ఆవేశపడకుండా వింటానంటే చెప్తాను."

"స్వామీ. నేనేం ఆవేశపడ్డంలేదు. ఆరాటపడ్డంలేదు. సమస్య ఏమిటో తెలిస్తేగదా నేనో నిర్ణయం తీసుకోవటం సాధ్యపడుతుంది? ఎన్నో సందర్భాల్లో మనం చర్చించి నిర్ణయాలు తీసుకుని విజయాలు సాధించాం. ఇప్పుడు కూడా విజయం మనదేనన్న నమ్మకం నాకు వుంది"

"పిచ్చోడా! నమ్మకం అన్ని సందర్భాలలోనూ నిజం కాదు. నీతో వాస్తవాలు చెప్పటం నా ధర్మం. నిర్ణయం నీది. నువ్వు అనుకుంటున్నట్టు భూమిలో నిక్షిప్తం చేయబడిన నిధులన్నీ ఒకటి కాదు తేడాలు ఉంటాయి.

ఆ యా కాలాల్లో పూర్వీకులు ఎవరో ఎప్పుడో ఏదో కారణంతో నిధుల్ని దాచిపెడుతుంటారు.

ఇప్పటిలా పూర్వం బ్యాంకులనేవిలేవుగదా. నీకు తెలీని విషయం కాదు. నిధి నిక్షేపాలు బంగారు లేదా వెండినాణాల రూపంలోనూ ఆభరణాలుగాను ఇంకా రత్నమాణిక్యాలు వజ్రవైడూర్యాలుగాను దాస్తారు.

దొంగలభయంతో ధన కనక వస్తువుల్ని బిందెల్లోనో, కుండల్లోనో ఉంచి తర్వాత తీసుకోవచ్చునే ఉద్దేశంతో భూమిలో గుర్తుగా పాతిపెడతారు. అలాగే దాయాదుల కంటపడకూడదని దాచి పెట్టేది మరో కారణం.

భవిష్యత్తులో తమ వంశీకులకే చెందాలని నిధి నిక్షిప్తం చేయటం ఇంకో కారణం. అలాగే యుద్ధ సమయంలో తమ రాజవంశానికి చెందిన సంపద శత్రువుల పాలు కాకూడదని సంపదని రహస్య నేలమాళిగల్లోకి తరలించి మూసివేయటం మరో కారణం.

ఆ విధంగా నిధి చిన్నదయినా పెద్దదయినా లంకెల బిందెలయినా, ముంతలయినా వాటిని భూమిలో రహస్యంగా పాతిపెట్టి వుంచటం వెనక మనకు

తెలీని ఎంతో చరిత్ర ఉంటుంది. వారి జీవితకాలంలో ఆ నిధుల్ని తిరిగి పొందే అవసరం లేకో అవకాశం లేకో అవి అలా భూమిలోనే ఉండిపోతాయి.

భూమి లోపల లభించే నిధి ఏదయినప్పటికీ ప్రభుత్వానికి చెందాలనేది ఆదికాలం నుంచి ఉన్న చట్టమే. అందుకే నిధి దొరికినవాళ్ళు ఎవరికీ తెలీకుండా సొంతం చేసుకుంటారు. ఒక్కోసారి గుట్టు బయటపడి ప్రభుత్వ పరమవుతుంది.

ఇదంతా లోకంలో మనం చూస్తున్నదే అయినప్పటికీ దీని వెనకగల మరో కారణం గురించి చాలామందికి తెలీదు. ప్రాప్తం వుంటేగాని మనిషికి ఏదీ దక్కదు. ఈ భూమిపైన పుట్టే ప్రతి జీవీ సకారణంగానే పుడుతోంది. అకారణంగా ఏదీ జరగదిక్కడ.

ఆ యా జీవుల నుంచి దేవుడు కర్మఫలాల్ని ఆశిస్తున్నాడు. అలాగే జరుగుతోంది.

మానవుడు జ్ఞానిగాబట్టి దైవాన్ని ప్రార్థించి కర్మఫలితాల నుంచి విముక్తుడవుతున్నాడు. కాబట్టి నిధినిక్షేపాలు దక్కించుకోడానికి యోగం ఉండాలి.

అది మనకి ఉందిగాబట్టే అనేక నిధుల్ని దక్కించుకున్నాం. ఇవన్నీ వారసులో, తగిన కారణాలో లేని నిధులు. కాని కొన్ని నిధులు ఏవో కొన్ని కారణాలను ఆశించి దాచిపెట్టబడి వుంటాయి. వాటికి వారసులో కారణాలో నిర్దేశింపబడి వున్నప్పుడు వాటిని పొందేహక్కు ఎవరికీ ఉండదు. అంటే వీలునామా లాంటిదనుకో.

అలాంటి నిధుల్ని కైవసం చేసుకోవాలంటే సాధ్యం కాదు. ఇప్పుడు దీవిలోని నిధి విషయంలో దానికి సంబంధించి వారసత్వ పత్రం ఏదో ఉందని నా అనుమానం.

అతి ప్రాచీనమయిన ఆ నిధిని ఎవరూ స్వాధీనం చేసుకోలేరన్న సూచనగా ధ్యానంలో తెలుస్తోంది.

ఎవరికీ తెలీకుండా గప్‌చుప్‌గా తవ్వి తెచ్చేసుకునే నిధి వ్యవహారం కాదిది. ఎవరి కంటపడ్డా ప్రభుత్వం రంగంలోకి దిగే అవకాశం ఉంది. కాబట్టి ఆలోచించుకో. నిర్ణయం నీది. ప్రయత్నం నాది" అంటూ చెప్పటం ముగించాడు అనంతస్వామి.

ఆయన మాటలు అన్నారావుకి అర్థమయ్యాయి. కాస్సేపు మౌనంగా ఆలోచించాడు. "నాకో విషయం చెప్పు స్వామీ" అన్నాడు తలెత్తి చూసి.

"ఏ విషయం?"

"నాగశక్తిని ఎదుర్కోడానికి గరుడశక్తి కలిగిన ఒకడు అవసరమని చెప్పావు. అలాంటివాడు దొరికే అవకాశం ఉందా?" అన్నాడు.

'ఉంది' వెంటనే బదులిచ్చాడు అనంతస్వామి.

"అలాంటివాడు ఎవడో ఒకరు మన సమీపంలోనే ఉన్నట్టు ధ్యానంలో గ్రహించాను. వాడ్ని గుర్తించటానికి రెండు మూడు రోజులు పడుతుంది" చెప్పాడు.

"ఓ.కె... మనం ముందుకే వెళ్దాం. మీ ప్రయత్నాన్ని ఆపొద్దు" అన్నాడు అన్నారావు.

తలపంకించాడు అనంతస్వామి.

"ఓ.కె." అన్నాడు.

"దీవిమీదికెళ్ళిన బసవడు వాళ్ళ పరిస్థితి ఏమిటి?" చివరిగా ఏదో ఆశ. అందుకే అడిగాడు అన్నారావు.

"వాళ్ళ గురించి మర్చిపో. వాళ్ళలో ఒక్కడూ బతికిలేడు" అంటూ లేచాడు అనంతస్వామి. కాస్సేపట్లోనే వాళ్ళంతా వెనుతిరిగారు అక్కడి నుంచి.

*     *     *     *     *

"ఇంత గాయం ఎలా తగిలింది?" కృతయుగ్ భుజం పట్టుకుని గాయాన్ని పరిశీలిస్తూ అడిగాడు డాక్టర్ దయానిధి.

ఆ ప్రశ్నకు ఏం బదులుచెప్పాలో అర్థంగాక ముగ్గురూ ముఖముఖాలు చూసుకున్నారు.

"ఇది కొట్లాట బాపతు గాయమయితే పోలీసులకు ఇన్‌ఫాం చేయాలి. ఆన్సర్ ప్లీజ్" డాక్టర్ హెచ్చరించాడు. నదిలోంచి సిటీలోకి రాగానే కృతయుగ్‌ని మిడిల్ క్లాస్ ఏరియాలోని డాక్టర్ దయానిధి క్లినిక్‌కి ట్రీట్‌మెంట్ కోసం తీసుకొచ్చారు కాంచన, స్నిగ్ధలు.

దయానిధి హస్తవాసి మంచిదని చుట్టుపక్కల మంచి పేరుంది. ఆయన వయసు డెబ్బయి సంవత్సరాలు. మనిషి చాలా నెమ్మదస్తుడు. ఆయన్ని దేవుడిగా భావిస్తారు చుట్టుపక్కలంతా.

ఆపరేషన్ గదిలో వాలుకుర్చీలో పడుకునున్నాడు కృతయుగ్. నర్సు భుజం కట్టు విప్పగానే గాయాన్ని చూసి ఆశ్చర్యపోయాడు ఆయన. గాయం లోతుగా ఉంది. మూడంగుళాల పొడవు వుంది.

ఆయనకి ఏదోఒకటి చెప్పి నమ్మించకపోతే ఇబ్బందని గ్రహించి "డాక్టర్‌గారూ. ఇది కొట్లాట గాయంకాదు. ప్లీజ్. మీరు వెంటనే ట్రీట్‌మెంట్ ఆరంభించండి" అంటూ రిక్వెస్ట్ చేసింది.

"నోనోనో... రూల్స్ ఒప్పుకోవు. తర్వాత పోలీసులు కేసులు అంటే నాకు తలనొప్పి. ఏం జరిగిందో చెప్పండి" అని మొండికేశాడు డాక్టర్ దయానిధి.

"ఏం లేదు డాక్టర్. మీ దగ్గర దాపరికం ఏముంది? ఆడవాళ్ళ గొడవలో మగవాళ్ళు తల దూర్చటం కరెక్ట్ అంటారా?" అంది కాంచన.

"కానే కాదు. రెండు పొట్టేళ్ళ మధ్య తలపెట్టొచ్చేమో గాని ఇద్దరాడాళ్ళ మధ్య తల పెట్టి సేఫ్‌గా ఉన్న మగాడు నాకు తెలిసి ఎవడూ లేడు" అన్నాడు.

"ఆ విషయం ఆయనకి చెప్పండి."

"అంటే ఇతను..."

"అదే... తల పెట్టాడు. దెబ్బతిన్నాడు"

"అర్థంకాలేదే...."

"మేము ఇద్దరం గొడవ పడుతుంటే మధ్యలో వచ్చాడు. తోపులాటలో వెనక్కి పడిపోయాడు. అక్కడ కత్తిపీట ఉంది ఊరుకుంటుందా. పెద్ద గాటు పెట్టేసింది"

"ఓ మైగాడ్... ఇంతకీ ఇతనికి మీరేమవుతారు?"

"అయ్యో. అర్థంచేసుకోండి డాక్టర్"

"అర్థం కాలేదే!"

"ఇందులో అర్థం కానిదేముంది డాక్టర్. ఆయన నాకు కాబోయే భర్త" కొంచెం సిగ్గు అభినయిస్తూ చెప్పింది కాంచన.

"ఓహో! మరి ఆ అమ్మాయి?" స్నిగ్ధను చూస్తూ అడిగాడు.

"నా అక్క" అంది కాంచన.

"ఏమయ్యా. ఈ అమ్మాయి చెప్పింది కరెక్టేనా?" కృతయుగ్‌ని అడిగాడు.

"అవునండీ, ఆ అమ్మాయి నాకు కాబోయే భార్య. ఈమె నా భార్య"

"వ్వాట్? ఏమిటమ్మాయ్. అతను ఏం చెప్తున్నాడు?" కంగారుపడుతూ స్నిగ్ధను అడిగాడు.

"ఆయన నిజమే చెప్పారు డాక్టర్. ఆయనే నా భర్త" అంది స్నిగ్ధ.

"ఓ మైగాడ్. టోటల్లీ కన్‌ఫ్యూజ్డ్. ఏమయ్యా నిజం చెప్పు. నీకు ఇద్దరు భార్యలా?" కృతయుగ్‌ని అడిగాడు.

"అవునండి. ఇది పెద్దది. అది చిన్నది"

"అదికాదు మిష్టర్..."

"డాక్టర్" అంటూ కోపంగా అరిచింది కాంచన.

"ట్రీట్‌మెంట్ కోసంవస్తే మీరిలా ప్రశ్నలతో విసిగించటం మంచి పద్ధతికాదు. వెంటనే ట్రీట్‌మెంట్ ఆరంభిస్తారా లేదా చెప్పండి" నిలదీసింది.

"ఓకె ఓకె! డోన్ట్ గెట్ యాంగ్రీ యంగ్ లేడీ. ఇట్సాల్ రైట్. నర్స్ ఆపరేషన్‌కి అంతా రెడీ చెయ్యి" అన్నాడు నర్సుతో డాక్టర్ దయానిధి. ఆ తరువాత క్షణాలమీద పనులు జరిగిపోయి ట్రీట్‌మెంట్ ఆరంభమయింది.

"ఇది బాడీకాదు, ఐరన్" డ్రెస్సింగ్ చేస్తున్నప్పుడు కృతయుగ్ ఛాతిని చూస్తూ కామెంట్ చేశాడు డాక్టరు.

"నా ఒంట్లో రక్తమాంసాలే ఉన్నాయి డాక్టర్. ఐరన్ లేదు" అన్నాడు కృతయుగ్.

"గుడ్ జోక్" అంటూ ఫెళ్ళున నవ్వాడు డాక్టర్ దయానిధి.

"ఇది చేయి కాదు. మర్రి ఊడ. ఏమయ్యా రోజూ జిమ్‌కి వెళ్తావా?" గాయానికి కుట్లువేస్తూ అడిగాడు.

"లేదండీ. టాక్సీ తోలతాను" పళ్ళబిగువున బాధను భరిస్తూ చెప్పాడు కృతయుగ్.

"నోనో... అబద్ధం చెప్పకు. మనిషిని చూడగానే వాడి నేచర్ చెప్పగలను. నాకు అంతా తెలుసు. కీపిటిప్. నీ అందానికి ఇద్దరేమిటి... ముగ్గురు నలుగురు భార్యలున్నా ఆశ్చర్యంలేదు" అన్నాడు డాక్టర్.

ఆ మాటలు వింటూ పక్కనున్న స్నిగ్ధ, కాంచన ముఖాల్లో కోపం ఛాయలు ఆరంభమయ్యాయి.

కృతయుగ్ కంగారుపడ్డాడు. ఈ డాక్టరు చాదస్తంతో కొంపకొల్లేరు చేసేట్టున్నాడ్రానాయనో అనుకుంటూ– "డాక్టర్" అనరిచాడు. "ఏమయ్యా, నొప్పి ఎక్కువగా ఉందా?" అడిగాడు డాక్టర్.

"అవును డాక్టర్. కెలుకుతుంటే పుండు నొప్పిగానే ఉంటుంది. ఉన్న సమస్యలు చాలవని మీరు కొత్త సమస్య తెచ్చి పెట్టకండి.

ముందు పనికానివ్వండి” గుర్రుగా చూస్తున్న అమ్మాయిలు ఇద్దర్నీ గమనిస్తూ అరిచాడు.

“ఐ అండర్‌స్టాండ్ యువర్ ప్రాబ్లమ్. డోన్ట్‌వర్రీ. రిలాక్స్” కుట్లు వేయటం ముగించి చెప్పాడు డాక్టర్. మొత్తం అయిదు కుట్లుపడ్డాయి. పైన మెడిసిన్ వేసి కట్టుకట్టి ఇంజక్షన్లు ఇచ్చాడు. లోనికి కొన్ని టాబ్లెట్స్ ఇచ్చాడు.

“డాక్టర్. ఖర్చు ఎంతయినా బాధలేదు. మంచి మందులు ఇవ్వండి. రెండురోజుల్లో గాయం తగ్గిపోవాలి” అంది స్నిగ్ధ.

“షూర్, డబుల్ పేమెంట్ ఇస్తే రెండ్రోజుల్లో రికవర్ చేయగలను. బట్ పేషెంట్ కోపరేట్ చేయాలి”

“ఏం చెయాలి?”

“చేయి కదపకుండా పడుకోవాలి. ఇక్కడే రూమ్ ఎలాట్ చేస్తాను. స్టే దేర్. లేదంటే గాయం తగ్గటానికి వారంరోజులు పడుతుంది”

“ఓ.కె. ఇక్కడేఉంటాం”

“పేషెంట్‌మాత్రం ఉండాలి. మీరు వెళ్ళిరావచ్చు” అన్నాడు డాక్టర్.

“నథింగ్ డూయింగ్. వెళ్తుంటాం వస్తుంటాం. ఎవరో ఒకరు పేషెంట్‌వద్ద ఉంటాం” అంది స్నిగ్ధ.

“ఇదిగో అమ్మాయ్. అసలు మీ ఇద్దరికీ పెళ్ళి అయిందా?” అడిగాడు డాక్టర్ దయానిధి.

“డౌటా?” అంది కాంచన.

“పెళ్ళయితే నుదుట సింధూరం ఏది? మెళ్ళో మంగళసూత్రాలు, కాలికి మెట్టెలు... ఏమీ లేకుండా పెళ్ళయిందంటే ఎలా నమ్మటం?”

“పెళ్ళయ్యాక అన్నీ వస్తాయి డాక్టర్”

“అర్థమైంది. మీకింకా పెళ్ళి కాలేదు. ఈ పరిస్థితిలో మిమ్మల్ని పేషెంట్‌తో అనుమతించటం కష్టం”

“కష్టమైనా తప్పదు డాక్టర్. అతన్ని మాకన్నా ఎవరు బాగా చూసు కుంటారు?” అంది కాంచన.

“ఇదీ కరక్టే అనుకో. అయినా ఇదిగో అబ్బాయ్. ఇద్దరితో ఎందుకయ్యా నీకీ అవస్థ. ఎవరో ఒకర్నే చేసుకో రాదూ?” కృతయుగ్‌కి సలహా ఇచ్చాడు.

"బెటర్ ఐడియా డాక్టర్. వాళ్ళిద్దర్లో ఎవర్ని చేసుకోమంటారు? మీరేసలహా ఇవ్వండి" అన్నాడు కృతయుగ్ నవ్వుతూ.

డాక్టర్ ముఖం వాడిపోయింది. "నేను...సలహా ఇవ్వాలా. ఏమయ్యా. వాళ్ళిద్దరిచేత నన్ను తన్నిస్తేగాని నీకు తృప్తి ఉండదా? నేను చెప్పేవాడినేగాని సలహా ఇచ్చేవాడిని కాదయ్యా" అన్నాడు డాక్టర్.

"అలా ఎందుకు డాక్టర్?" అడిగాడు కృతయుగ్.

"ఎందుకంటే ఏం చెప్పను. అంతా స్వానుభవం నాయనా. నీ వయసులో ఉండగా ఇలాంటి తప్పే నేనూ చేశాను. ఇద్దరు పెళ్ళాలు. వాళ్ళతో వేగలేక ఇదో... నెత్తిమీద జుట్టంతా రాలిపోయింది.

కొబ్బరి పీచులా మిగిలిన ఈ కాస్త జుట్టు కూడా పీకేయాలని చూస్తున్నారు ఇద్దరూ. నా బాధలేం చెప్పను. నన్నొదిలెయ్. నర్స్.

వీళ్ళకి మూడో నెంబరు గది అలాట్ చేసివ్వు" అంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు డాక్టర్ దయానిధి. అతడి మాటలకి అంతా నవ్వుకున్నారు.

కృతయుగ్ స్పెషల్ రూమ్‌లోకి మార్చబడ్డాడు.

స్నిగ్ధ, కాంచన వంక చూసింది.

"నేను హోటల్‌కెళ్ళి కృతయుగ్‌కి వేరే దుస్తులు అవీ తెస్తాను. నేవచ్చేవరకూ ఉండు" అంది.

"ఉంటాను. బట్ నువ్వు జాగ్రత్త అక్కా. బావ మహీధర్ ఇప్పటికే సస్పెన్స్ భరించలేక చస్తుంటాడు. నదిమీద ఏం జరిగిందో వాడికి తెలీదు.

నిన్ను చూస్తే ఫాలో అయి ఇక్కడికొచ్చే అవకాశం ఉంది" హెచ్చరించింది కాంచన. "త్వరగా వచ్చేస్తాలే" అంటూ ఆస్పత్రిలోంచి బయటికొచ్చి ఆటోలో మినర్వా హోటల్‌కి వెళ్ళిపోయింది స్నిగ్ధ.

నది దగ్గర్నుంచి అందరూ ద్వారకాలాడ్జికి తిరిగొచ్చేసరికి సాయంకాలం నాలుగు గంటలయింది సమయం. వచ్చిన కొద్దిసేపటికే అన్నారావుకి ఫోన్ వచ్చింది. ఫోన్ చేసింది అతని భార్య. కాంచన హైదరాబాద్‌లో లేదని, ఊరెళ్తున్నాను, రావటానికి కొద్దిరోజులు పడుతుంది కంగారుపడొద్దని తల్లికి ఫోన్‌చేసి చెప్పిందట.

అంతే, తర్వాత స్విచ్ఛాఫ్. ఆమె సందేహం కూతురు కూడా తండ్రి వెంట వెళ్ళివుండొచ్చని.

ఈ విషయం తెలీగానే కాంచన కూడా ఉజ్జయిని వచ్చేసుంటుందని అన్నారావుకి డౌటు వచ్చేసింది. వెంటనే మేనల్లుడు మహీధర్‌ను పిలిచి మేటర్ చెప్పాడు. కాంచన ఎక్కడుందో తెలుసుకోమని ఆర్డరేశాడు. నిజానికి ఈ మేటర్ తెలిసేసరికే మహీధర్ మెంటల్‌గా కొంత డిస్ట్రబయివున్నాడు. అందుకు కారణం చింటూభాయ్. నదిమీద ఏం జరిగిందో తెలీదు. అటు చింటూభాయ్ వర్గంగాని, ఇటు కృతయుగ్‌గాని తిరిగిరాలేదు. టెన్షన్‌లో వున్న మహీధర్‌కు కాంచన హైదరాబాద్‌లో లేదన్న విషయం పెద్ద విషయంగా అన్పించలేదు.

చింటూభాయ్ వాళ్ళకి అందిపుచ్చుకొనే చక్కటి అవకాశం కల్పించాడు తను.

నదిమీద ఒంటరిగా చిక్కిన కృతయుగ్ స్నిగ్ధలని అంతంచేశారా లేక తామే అంతమైపోయారా అర్ధంగావటంలేదు. ఫోన్‌చేస్తే అవుటాఫ్ కవరేజ్ అనివస్తోంది. అయితే ఒక్కటిమాత్రం నిజం.

ఎవరో ఒకరు రెండో వర్గం చేతిలో హతమైపోవటం ఖాయం. మినర్వా హోటల్లో దిగిన కృతయుగ్ స్నిగ్ధలు కూడా హోటల్‌కి తిరిగిరాలేదు. ఈ టెన్షన్స్‌లో మహీధర్ ఉండగా అన్నారావు పిలిచి కాంచనగురించి తెలుసుకోమని చెప్పటంతో చాలా అప్‌సెట్ అయ్యాడు.

కాంచనకూడా ఇక్కడికి వచ్చి కృతయుగ్‌తో చేతులు కలిపితే పరిస్థితులు తమకు ఏమాత్రం అనుకూలంగా ఉండవని తెలుసు. అన్నిటికీమించి కృతయుగ్‌ని ముగించేయటం అస్సలు సాధ్యం కాదు.

మేనమామ మాటలు విని గంగిరెద్దులా తలూపి లాడ్జి బయటి కొచ్చేశాడు మహీధర్. సిగరెట్ ముట్టించుకుని ఎదురుగా మినర్వా హోటల్‌వైపు చూశాడు. అంతలో హోటల్ ముందు ఆటో దిగి లోపలికెళ్ళున్న స్నిగ్ధ అతడి కంటపడింది.

ఆమెను చూడగానే మహీధర్ ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే ఆమె ఒంటరిగా వచ్చింది. వెంట కృతయుగ్ లేడు. కృతయుగ్‌కి ఏమన్నా జరిగివుంటే ఆమె అంత నిబ్బరంగా ఉండదనిపించింది. ఏమీ కానప్పుడు కృతయుగ్‌వెంట ఎందుకు రాలేదు? ఎక్కడున్నాడు?

ఇక సస్పెన్స్ భరించటం అతడివల్ల కాలేదు. తన వద్దగల అనేక ప్రశ్నలకు ఆమెవద్ద సమాధానాలున్నాయనిపించింది. దాంతో సిగరెట్ అవతలపడేసి వడివడిగా రోడ్డు దాటి మినర్వా హోటల్లో ప్రవేశించాడు.

నిజానికి మహీధర్ ఎలా ఉంటాడో స్నిగ్ధకు తెలీదు. స్నానంచేసి కృతయుగ్‌కి దుస్తులు అవీ తీసుకెళ్ళాలన్న హడావుడిలో ఆ విషయాలు స్నిగ్ధ పట్టించుకోలేదు. సరాసరి సెకండ్ ఫ్లోర్‌లోని సూట్ ముందుకెళ్ళి డోర్ తెరిచి లోపలకెళ్ళింది స్నిగ్ధ. ఆమె వెనుతిరిగి డోర్ మూసేలోపల డోర్ నెట్టుకుంటూ లోపలికి ప్రవేశించి తలుపు దగ్గరగా మూశాడు మహీధర్.

అతడ్ని చూసి షాకయింది స్నిగ్ధ. "ఎవర్నువ్వు? మర్యాదగా బయటికిపోతావా నలుగుర్ని పిలవనా?" అంది కోపంగా.

"కూల్...కూల్ మేడమ్. ప్లీజ్. మీ గౌరవానికెలాంటి భంగం రాదు. మీతో కొంచెం మాట్లాడాలి. మీరు గొడవ చేయకుండా నా ప్రశ్నలకు సమాధానం చెప్తే చాలు. తలుపు కూడా తీసే ఉంచుతాను. ట్రై టు అండర్‌స్టాండ్ ప్లీజ్" అంటూ తలుపు బార్లా తెరిచాడు.

ఆ మాటలు వింటూ ఎవరైవుండొచ్చో ఊహించేసింది స్నిగ్ధ. సీరియస్‌గా చూస్తూ–

"ఎవర్నువ్వు? నాతో ప్రశ్నలేమిటి?" అంది.

"నా పేరు మహీధర్. కాంచన బావని" చెప్పాడు. కాంచన పేరు వింటూనే క్షణంలో అర్థమైపోయింది స్నిగ్ధకు తన అంచనా కరెక్టని. ఎందుకొచ్చాడో కూడా ఊహించగలిగింది. అయినా తెలీనట్టే–

"కాంచన ఎవరు?" అంది.

"ఇంత జరిగాక కూడా కాంచన ఎవరని మీరు నన్నడగటం హాస్యాస్పదంగా లేదూ? కాంచన మీకు తెలుసు మేడమ్. తెలుసని నాకూ తెలుసు. మీరు ఒక్క రెండు నిముషాలు కూచుంటే సూటిగా మాట్లాడుకోవచ్చు. ప్లీజ్. మీరు నా గురించి భయపడాల్సిందేమీ లేదు" ఎంతో వినయంగా రిక్వెస్ట్ చేశాడు.

ఆ వినయం వెనక ఎంతో కుట్ర ఉందని స్నిగ్ధకు తెలుసు. కృతయుగ్ చింటూభాయ్ ఇద్దరిలో ఎవరు పోయారో తెలుసుకోవాలని వచ్చినట్టున్నాడు.

"ఓ.కె. కూచో" అంటూ సోఫాలో కూచుని ఎదురుగా సోఫా చూపించింది.

"థాంక్యూ" అంటూ కూచున్నాడు మహీధర్. "కాంచన గురించి తెలీదు. ఎవరు ఆమె?" అంది తిరిగి.

"మీరు చాలా తెలివిగా మాట్లాడుతున్నారు. ఓ.కె. నా చేతే చెప్పించాలనుకుంటే... చెప్తాను. దంతెవారాలో మా పీటర్ తన మనుషులతో మిమ్మల్ని కలిశాడు.

రాగిరేకును మీరు విశ్లేషించి ఇచ్చారు. పీటర్ వెనక కాంచన ఉందని మీకు తెలుసు. మీరు కృతయుగ్‌ని ప్రేమిస్తున్నారు. మీకు పోటీ వస్తోంది కాంచన. సో. ఈ విషయాలు చాలనుకుంటాను" వివరించాడు.

"అంటే... కాంచన నీకు దూరమవుతుందని కృతయుగ్‌ని అడ్డు తొలగించుకోడానికే దంతెవారా నుంచి చింటూభాయ్‌ని ఉజ్జయినికి రప్పించావా?"

మహీధర్ పెద్ద షాక్‌కి లోనయ్యాడు. గుక్క తిప్పుకోడానిక్కూడా అవకాశం లేని షాక్. బదులు చెప్పడానికి వెంటనే గొంతు పెగల్లేదు.

"సారీ! చింటూభాయ్ గురించి నాకు తెలియదు..." తడబడింది మహీధర్ మాట. "తెలియదు గదా. ఓ.కె. ఏంకావాలి? నాతో ఏం మాట్లాడి ఏం తెల్సుకోవాలని వచ్చావ్?" అడిగింది స్నిగ్ధ.

"మేం నిధికోసం ఇక్కడికొచ్చాం. కృతయుగ్‌తో కలిసి మీరిక్కడున్నారు. దీనికి అర్థం ఏమిటి? నిధికోసమేనా?" అడిగాడు.

"సారీ... డబ్బే లోకం అనుకునే మీలాంటి వాళ్ళకే నిధులు కావాలి. మాకక్కరలేదు. టూర్‌లో భాగంగా ఉజ్జయిని వచ్చాం. అంతకుమించి ఏం లేదు"

"నమ్మొచ్చా?" అడిగాడతను.

"అది నీ ఇష్టం" అంది స్నిగ్ధ.

"కాంచన కన్పించిందా?"

"లేదు. ఆమె నాకెందుకు కన్పిస్తుంది?" అంది.

"ప్రశ్నకు ప్రశ్న సమాధానం కాదు మేడమ్. మీతో టచ్‌లోనే వుందని నా నమ్మకం"

"నమ్మకాలు ఎప్పుడూ నిజంకావు మిస్టర్"

"నదిమీద ఏం జరిగింది?" స్నిగ్ధ పెదవుల మీద చిన్న దరహాసం వెలిగింది.

"నాకు సంబంధంలేని ప్రశ్నలే అడుగుతున్నావేమిటి? వెళ్ళి ఆ నదినే అడుగు. ఏం జరిగిందో చెప్పొచ్చు" అంది.

ఆ సమాధానంలో అసహనంగా చివ్వున లేచి నిలబడ్డాడు మహీధర్. ముఖంలో విసుగు, కళ్ళలో కోపం పొంగుకొచ్చాయి. "మేడమ్. మేం మంచివాళ్ళం కాదు. మీరు నిజాలు దాచి తప్పు చేస్తున్నారు. ఫలితం చాలా దారుణంగా ఉంటుంది" చివరి అస్త్రంగా బెదిరించి చూశాడు.

స్నిగ్ధకూడా తీవ్రంగా స్పందిస్తూ–లేచి నిలబడింది. "బెదిరిస్తున్నావా? భయపెడుతున్నావా?" నిలదీసింది కోపంగా. "లేదు హెచ్చరిస్తున్నాను" అన్నాడు మహీధర్ ఆగ్రహంగా.

"నిప్పుతో పగ పెంచుకుంటే నిప్పుకేమీ కాదు. నీ ఒళ్ళే తగలబడుతుంది. ఈ విషయం నీకన్నా చింటూభాయ్‌కి బాగా తెలుసు.

ఈసారి ఎప్పుడన్నా ఎదురయితే అడిగి చూడు చెప్తాడు. నౌ యు కెన్ గో. నాకు చాలా పనులున్నాయి" అంటూ డోర్ వంక చూపించింది.

ఇంకేం మాట్లాడీ ఆమెతో ప్రయోజనంలేదని అర్థమైపోయింది మహీధర్‌కి. కోపాన్ని దిగమింగుకొని విసవిసా బయటకు వెళ్ళిపోయాడు.

అతడివెనకే ధడాలున తలుపు మూసి లాక్ చేసుకుంది స్నిగ్ధ. ఆమె స్నానం చేసి బట్టలు మార్చుకుంది. చిన్న ఎయిర్‌బ్యాగ్‌లో కృతయుగ్‌కి రెండు జతల బట్టలు సర్దుకుని తన హ్యాండ్ బ్యాగ్‌కూడా అందులోనే ఉంచి జిప్‌లాగి భుజాన వేసుకుంది. సూట్ లాక్ చేసుకుని బయలుదేరింది.

*　　*　　*　　*　　*

కాంచన అందించిన టాబ్లెట్ వేసుకుని మంచి నీరు తాగాడు కృతయుగ్. తలదిండు నానుకొని కూచుని కాంచనవంక చూశాడు. ఆ చూపులు గమనించి వచ్చి పక్కన కూచుంది కాంచన. ముఖంమీది ముసుగు తొలగించి అతడి కళ్ళలోకి చూసింది.

"ఎందుకలా చూస్తావ్. నాకు సిగ్గుగా ఉంది" అంది నునుసిగ్గుతో. అతడి కళ్ళలో తొలిసారిగా నిర్మలమైన ప్రేమానురాగాలను చూస్తోంది. ఆమె గుండె అతడ్ని హత్తుకుపొమ్మని తొందరచేస్తోంది. కృతయుగ్ ఆమె చేయి అందుకుని ముద్దాడాడు.

"ఇది నాకే కాదు, స్నిగ్ధకూ పునర్జన్మ. మమ్మల్ని కాపాడిన దేవతవు నువ్వు. నీకేమిచ్చి రుణం తీర్చుకోగలను" అంటూ ఆమెను గుండెలమీదకు లాక్కుని హత్తుకుంటూ పెదవులు ముద్దాడాడు.

పులకించిపోయింది కాంచన.

తొలకరి జల్లుకోసం ఎదురుచూసి చూసి చిరుజల్లు పడగానే భూదేవి పొందే అపురూపమైన పులకింతలాంటి తీయని వ్యథ అది. వలచినవాడి కౌగిలి,

ప్రేమపలుకులకన్నా ప్రేయసికి విలువయినదేముంటుంది? ఆ పులకింతలో కలిగిన ఆనందాన్ని తట్టుకోలేక అతడి గుండెలో తలదాచుకుని ఏడ్చేసింది.

"ఏయ్. ఎందుకే ఏడుస్తావ్. చూడు... ఇలా చూడు" అంటూ ముఖాన్ని పైకి లేపి సోగకళ్ళలోకి చూశాడు. కనుకొలకుల్లో ముత్యాల్లా మెరుస్తోంది తడి. ఆ కళ్ళను అరచేత్తో తుడుస్తూ–"ఏమైంది?" అనడిగాడు.

"ఇంతకుముందు చాలాసార్లు నిన్ను ముద్దాడాను. కాని...కాని నీవుగా నన్ను దగ్గరకు తీసుకుని ప్రేమగా ముద్దాడిన తొలిముద్దు ఇది. అందుకే ఆనందం తట్టుకోలేకపోయాను" అంది ఆర్తిగా.

ఆమె చెంపలునిమిరి ముద్దాడాడు కృతయుగ్. "స్నిగ్ధ మీద నీకు అసూయగా లేదా?" లాలనగా అడిగాడు.

"లేదు. ఎందుకుంటుంది? నువ్వే నాప్రాణంగా భావించాక నీ ఇష్టాలు నావి కావా? నువ్వు ప్రేమించే స్నిగ్ధమీద నాకు ప్రేమ ఉండదా? మీ ఇద్దరి మధ్య నాకింత చోటిస్తే చాలనుకొనే చిన్న ఆశ నాది" అంటూ ఆమె కొసరి కొసరి ముద్దాడుతుంటే భుజం గాయం బాధకూడా మర్చిపోయి ఆమెను కౌగిట పొదువుకున్నాడు కృతయుగ్.

స్నిగ్ధ హాస్పిటల్‌కు బయలుదేరి వీధిలోకొచ్చేసరికి సాయంత్రం అయిదు దాటింది సమయం.

ఆమె సందేహిస్తూనే వుంది.

మహీధర్‌లాంటి గుంటనక్కల దృష్టిలో పడనేకూడదు. పడితే ఓపట్టాన వదలరు. తను గుడ్డిగా వెళ్ళిపోతే వాడు వెనకే హాస్పిటల్‌కి వచ్చే ప్రమాదం వుంది.

అదే జరిగితే కాంచన చిక్కుల్లో పడుతుంది. వాడు ఈ పరిసరాల్లోనే ఎక్కడో మాటేసివుంటాడనిపించింది. అందుకే ఆటోని పిలవకుండా కాలినడకన రోడ్డెక్కింది. సాయంత్రంవేళ రోడ్డుమీద ట్రాఫిక్ అధికంగా వుంది. ఫుట్‌పాత్‌వెంట పాదచారులు అధికంగా వున్నారు. వాళ్ళలో కలిసిపోయి ముందుకుసాగింది.

ఆమె వందడుగులు దూరంకూడా పోకముందే రోడ్డుమీదికొచ్చాడు మహీధర్. ఆమెను ఎడంగా ఫాలోఅవుతూ బయలుదేరాడు. అతన్ని గమనించి కూడా గమనించనట్టే ముందుకు సాగింది స్నిగ్ధ.

నడుస్తూనే తీవ్రంగా ఆలోచిస్తోంది. తను భయపడినట్టే అయింది. ఇప్పుడు వాడ్ని వదిలించుకోవటం ఎలా? ఆటో ఎక్కితే మరో ఆటోలో ఫాలోకావచ్చు. టాక్సీఎక్కితే మరో టాక్సీలో ఫాలో చేయొచ్చు. అతడికి స్లిప్ ఇవ్వకుండా తను హాస్పిటల్ మెట్లెక్కలేదు.

ఆలోచిస్తూనే కావాలని చుట్టుపక్కల సందులు గొందులు తిప్పినచోటే వాడ్ని తిప్పుతూ అవతల మరోపెద్ద వీధిలోకి అడుగుపెట్టింది. అదృష్టంకొద్దీ ఒక ఖాళీ ఆటో అటుగా వస్తూ కన్పించింది. ఇక ఆలోచించకుండా ఆటో ఆపి ఎక్కి కూచుంది స్నిగ్ధ.

వెనకే పరుగెత్తుకొచ్చాడు మహీధర్. ఆటోనంబర్ చూడగలిగాడుగాని చేరుకోలేకపోయాడు. మూడు నిముషాల తర్వాత గాని మరో ఆటో దొరకలేదతడికి. ఆటోలో స్నిగ్ధ వెళ్ళినరూట్లో ప్రయాణిస్తూగాలించాడు.

ఎక్కువ దూరం పోకుండానే ఒక ఆటోస్టాండ్‌లో కన్పించింది స్నిగ్ధ వెళ్ళిన ఆటో. డ్రైవర్ని కలిసి ఆమె ఎక్కడ దిగిందో చెప్పమని అడిగితే అతడు విసుగ్గా చూశాడు. "భలే బేరంలే సార్. రెండు వీధులుదాటగానే దిగిపోయింది. ఎక్కడికెళ్ళిందో తెలీదు" అన్నాడు.

తెలివిగా తననుంచి ఆమె తప్పించుకుందని గ్రహించి కోపంతో వెనుతిరిగాడు మహీధర్. ఇక ఆమెను ట్రేస్ చేయటం కష్టం. స్నిగ్ధ ఈ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంది. మూడు ఆటోలు మారి ఆస్పత్రికి చేరుకుంది.

సరిగ్గా అప్పటికి కనుచీకటి పడుతోంది. అంతక్రితమే వీధిలైట్లు వెలిగాయి. ఆస్పత్రిలో విద్యుద్దీపాలు పట్టపగల్లా ప్రకాశిస్తున్నాయి. స్నిగ్ధ వెళ్ళేసరికి కృతయుగ్ గదిలోంచి కంగారుగా బయటికి వస్తూ కన్పించింది కాంచన. స్నిగ్ధకు ఏం జరిగిందో అర్థంగాక గాభరా చెందుతూ కాంచన వద్దకు పరుగెత్తింది.

*    *    *    *    *

ద్వారకా లాడ్జి! అనంతస్వామి గది.

గదిమధ్యలో కూచుని చిన్న చిట్కా పని చేస్తున్నాడు అనంతస్వామి. నేలమీద చిత్రవిచిత్రమైన చిన్న ముగ్గు వేసివుంది. దానిమీద పసుపుకుంకుమలు చల్లి పూలరేకులు చల్లబడివున్నాయి.

మధ్యలో ఒక మూకుడు వుంది. మూడు రకాల నూనెలు కలుపబడి నల్లగా వున్న ఆయిలు మధ్య ఒక జ్యోతి ప్రకాశవంతంగా మండుతోంది. మూకుడు

చుట్టూ నిమ్మకాయలు ఉంచబడ్డాయి. ఎదురుగా కూచుని ధ్యానంలో ఉన్నాడు అనంతస్వామి.

కాస్త ఎడంగా అన్నారావు, మేనల్లుడు మహీధర్, పీటర్ ఇంకా అనుచరుల్లో కొందరు కూచుని ఆత్రుతగా ఏం జరుగుతుందో చూడాలని ఎదురుచూస్తున్నారు. గది తలుపులు దగ్గరగా మూసివున్నాయి.

గదిలో ఉక్కపోతగా ఉన్నా భరిస్తున్నారంతా. ఈ తంతు ఎందుకోసమో వాళ్ళకి తెలుసు. తమ సమీపంలోనే ఎక్కడో ఉన్నట్టు ధ్యానంలో తెల్సుకున్నాక గరుడరేఖ అరచేతిలో వున్న మనిషిని రప్పించే ప్రయత్నంలో భాగంగా అనంతస్వామి ప్రత్యేక పూజలో కూచుని మోహినీశక్తిని ప్రేరేపించి ఆవాహన చేసి పంపించి ఫలితంకోసం ఎదురుచూస్తూ ధ్యానంలో ఉన్నాడు.

దీవిమీద అడుగుపెట్టాలంటే పింగళ నాగశక్తిని దెబ్బతీసే గరుడశక్తిగల మనిషి అవసరం. అందుకే ఈ అన్వేషణ. పంపించిన మోహినీశక్తి అతన్ని ఆవహించి ఇక్కడికి తీసుకురావాలి. అనంతస్వామి అసురసంధ్యలో సూర్యుడు అస్తమిస్తాడనగా పూజలో కూచున్నాడు. అర్ధగంట సమయం గడిచిపోయింది. గదిలో గాలి క్రమంగా వేడెక్కుతోంది. ఊపిరితీసుకోవటం మర్చిపోయి జ్యోతినే గమనిస్తున్నారంతా.

గాలి ఆడకపోయినా ప్రాణం వున్నట్టు రెపరెపలాడుతోంది మట్టి మూకుడులోని జ్యోతి. సూదిపడితే వినిపించేంత నిశ్శబ్దం నెలకొనివుంది గదిలో. "రా... నా శక్తికి లోబడి లేచిరా... ఇది నా ఆనతి... రా..." అనంతస్వామి పెదవులు మృదువుగా హెచ్చరిస్తున్నాయి.

అతడి ఆనతిని ధిక్కరిస్తున్నట్టుగా జ్యోతి నిలకడ కోల్పోయి మరింతగా రెపరెపలాడనారంభించింది. అనంతస్వామి కళ్ళలో ఆశ్చర్యం తొంగిచూస్తోంది. విభ్రమంతో నొసలు విశాలమయ్యాయి.

అవతలి వ్యక్తి సామాన్యుడయితే తన మాటకు కట్టుబడి సమ్మోహితుడై నిద్రలో నడచివస్తున్నట్టు లేచి వచ్చేయాలి. మోహిని ఆవహిస్తే తిరుగులేదు. కాని అలాంటి సూచన ఇక్కడ కన్పించటంలేదు.

అవతలిమనిషి అసామాన్యుడని అనుమానిస్తూనే మరోసారి తీవ్రంగా ప్రయత్నిస్తూ ఆవాహన గావించబోయాడు. అదే సమయంలో ఎవరో చేత్తోచరిచి జ్యోతిని ఆర్పేసినట్టు జ్యోతి ఆరిపోగా మూకుడులో నూనె ఎగిరి చుట్టూ

చిందరవందరగా పడింది. అనంతస్వామితో పాటు అందరూ గాభరాతో లేచిపోయారు.

* * * * *

స్నిగ్ధ హోటల్‌కి బయలుదేరి వెళ్ళాక కాంచన కృతయుగ్ పక్కన కూచుని చాలాసేపు కబుర్లు చెప్పుకున్నారు. ఈ లోపల డాక్టర్ దయానిధి వచ్చాడు. ఆయన్ని చూసి దూరంగా జరిగి నిలబడింది కాంచన.

"హే ఆర్ యు యంగ్ మేన్. యూ ఫీల్ బెటర్?" వస్తూనే తన సహజ ధోరణిలో అడిగాడాయన.

"లేదు డాక్టర్. గాయం నొప్పిగా వుంది. కుట్లువద్ద నెత్తురు చెమరుస్తోంది" అన్నాడు కృతయుగ్ భుజం చూపిస్తూ.

"నాకు తెలుసు. అందుకే ఇక్కడ అమ్మాయిలు ఉండకూడదన్నాను. వినరుగా..." అన్నాడు డాక్టర్.

"అదేమిటి డాక్టర్. తనేంచేసింది? వేళకి మందులు తనేగా ఇస్తోంది..."

"అంతకుమించి ఏమీ ఇవ్వలేదంటావ్. నాకు తెలీదనుకోకు. అందమైన అమ్మాయి పక్కనుంటే చేతులు ఊరుకుంటాయా? చేయి కదపకూడదని వార్నింగిచ్చా. నువ్వు పాటించలేదు. ఇలాగయితే రెండురోజుల్లో గాయాన్ని తగ్గించటం కష్టం. ఆలోచించుకో. పదిరోజులు ఇక్కడే ఉంటానంటే నాకు అభ్యంతరంలేదు" అంటూ బోల్డ్‌గా నవ్వేశాడు డాక్టర్ దయానిధి.

ఆయనదో విచిత్రమైన నవ్వు. కల్లాకపటం తెలీని చిన్నపిల్లాడి నవ్వులా ఉంటుంది. ఆయన మాటల్లో అబద్ధం ఏమీలేదు. కాంచనతో కౌగిలింతలు ముద్దుల మోహంలో గాయం రేగిన సంగతి పట్టించుకోలేదు.

కృతయుగ్‌కి ఇంజక్షనిచ్చాడు డాక్టర్ దయానిధి.

"చూడు... రాత్రికి భోంచేయకూడదు. పాలు, రొట్టె తీసుకో. మా నర్సు తెచ్చిస్తుంది" అన్నాడు డాక్టర్.

"డాక్టర్!" ఆయన మాటలకి అడ్డొచ్చేశాడు కృతయుగ్. "మధ్యాహ్నం భోంచేయలేదు. ఈపూట పథ్యం అంటే నావల్లకాదు. నేను భోంచేస్తాను" అన్నాడు మొండిగా.

"నథింగ్ డూయింగ్. చెప్పినట్టువింటే ఎల్లుండే నువ్వు వెళ్ళిపోవచ్చు. చూడమ్మా ఎదురుగా హోటలుంది. మీరు వెళ్ళి హోటల్లో భోంచేయండి. ఇక్కడయితే

మీ కంచం లాక్కుని తినేసేలా ఉన్నాడితను. ఈపూట స్ట్రిక్ట్‌గా ఇతను పాలు, రొట్టె మాత్రమే తీసుకోవాలి. ఓ.కె.” అంటూ సలహా ఇచ్చాడు.

“డాక్టర్. మీరు దయానిధి కాదు. నిర్ధయానిధి” అన్నాడు అక్కసుకొద్దీ కృతయుగ్.

“తప్పదు మేన్. మేం కఠినంగా లేకపోతే పేషెంట్లు చెప్పినట్టు వింటారా? రోగాలు తగ్గుతాయా?” అంటూ వెళ్ళిపోయాడాయన నవ్వుతూ.

“లాభంలేదు కాంచనా. ఈ డాక్టరు ఆకలితో మాడ్చి చంపేట్టున్నాడిక్క డుంటే. స్నిగ్ధ రాగానే బిల్లుకట్టి మనం హోటల్‌కి వెళ్ళిపోదాం” అన్నాడు అలకతో.

“ష్... బిల్లు కట్టాలంటే అక్క రానక్కర్లేదు. నేనే కట్టేస్తాను. కాని నువ్వు త్వరగా కోలుకోవాలంటే కాస్త ఓర్చుకోవాలి. తప్పదు” అంటూ డాక్టర్ని సమర్థించింది కాంచన. అలిగి బెడ్‌మీద అటు తిరిగిపడుకున్నాడు కృతయుగ్. అంతలో ఎవరో తన మీదికొస్తున్న ఫీలింగ్ ఏర్పడి చివ్వున లేచి కూచున్నాడు.

కాంచన ఎడంగా టేబుల్‌మీద సామాను సర్దుతోంది. తన పక్కన ఎవరూ లేరు. కాని... ఎవరో తిరుగుతున్న ఫీలింగ్. కళ్ళు మూతలు పడుతున్నాయి. ఎవరో సుదూరంలో ఉండి తనను రమ్మంటూ పిలుస్తున్న అనుభూతి. కృతయుగ్‌కి డౌటు వచ్చేసింది. ఏదో జరుగుతోంది. ఎవరో మంత్రప్రయోగం చేస్తున్నారు. ఆవాహన చేసి తనను రప్పించుకునే ప్రయత్నంలో ఉన్నారు.

ఎవరు వాళ్ళు? తను జాగ్రత్తపడకపోతే అనర్థాలు జరిగిపోవచ్చు. తక్షణం బెడ్‌మీద పద్మాసనం వేసుక్కూచున్నాడు కృతయుగ్. తన యోగశక్తిని ఇంతవరకూ ఎప్పుడూ ఉపయోగించలేదు. ఆ అవసరం కూడా రాలేదు. ఇప్పుడా అవసరం ఏర్పడింది. ఛాయా పురుషయోగసిద్ధిని ఉపయోగింపక తప్పదు.

“కాంచనా!” పిలిచాడు.

“ఆఁ!” అంటూ తిరిగి చూసింది కాంచన.

“నేను కళ్ళుతెరిచేవరకు నన్ను పలకరించకు. నాకు దూరంగా ఉండు. ఇక్కడ ఏం జరిగినా భయపడకు”

“ఏమైంది?” ఆందోళనగా అడిగింది కాంచన.

“తర్వాత చెప్తాను. ఇప్పుడు చెప్పింది చెయ్యి” అంటూ కళ్ళు మూసుకుని ధ్యానంలోకి వెళ్ళిపోయాడు కృతయుగ్. కాంచనకు ఏమీ అర్థంకాలేదు. అతడి గురించి స్నిగ్ధకు తెలిసినంతగా కాంచనకు తెలీదు.

అందుకే ఒకింత గాభరా చెందుతూ ఎడంగా కుర్చీలో కూర్చుని అతడ్నే గమనించసాగింది. ధ్యానంలోకి వెళ్ళిన కృతయుగ్‌కి ముందుగా పంచవన్నెల రంగులు కళ్ళముందు ఆవిష్కృతమయ్యాయి. క్షణాలు గడిచేకొద్దీ రంగుల స్థానంలో ఒక జ్యోతి ప్రత్యక్షమైంది. ఆ వెనకే ఆవాహన చేస్తున్న మంత్రవాదిరూపం సాక్షాత్కరించింది.

చివరిగా ఒక వికారరూపం తనలో ప్రవేశించడానికి తనచుట్టూ గాలిలో తిరుగుతూ విశ్వప్రయత్నం చేయటం కనిపించింది. "ఆగు!" శాసించాడు కృతయుగ్. అదృశ్యరూపంలోని మోహినీశక్తి- గాలిలో నిలిచిపోయింది.

"ఎదురుగా రా" ఆజ్ఞాపించాడు.

ఎదురుగా వచ్చి నిలబడింది.

"ఎవరు నువ్వు?" అడిగాడు.

వికృతంగా అతిభీకరంగా ఉన్న ఆ రూపాన్ని సామాన్యులు చూస్తే ఝుడుసుకుంటారనటంలో సందేహం లేదు.

"నన్ను మోహినీశక్తి అంటారు" కర్కశమయిన గొంతుతో బదులిచ్చింది శక్తి. ఎడంగా కుర్చీలో కూర్చున్న కాంచనకి అక్కడ ఏం జరుగుతోందో, కృతయుగ్ ఎవరితో మాట్లాడుతున్నాడో అర్థంకాలేదు. అవి పిచ్చిచేష్టలో, గాలిచేష్టలో తెలీలేదు గాని విచిత్రమయిన ఈ అనుభవం ఆమెలో కంగారుపుట్టించింది.

కృతయుగ్ హెచ్చరిక మర్చిపోయి చివ్వున లేచింది. తనలో తను మాట్లాడుతున్న కృతయుగ్‌ను చూసి అతడికేదో అయిందని భ్రమపడి గాభరా చెంది భయంతో డాక్టర్ని పిలుచుకురావటానికి వేగంగా బయటకు పరుగెత్తింది కాంచన.

ఈ లోపల- "ఎందుకొచ్చావ్?" అంటూ మరో ప్రశ్న అడిగాడు కృతయుగ్. "నిన్ను ఆవహించి తీసుకువెళ్ళటానికొచ్చాను" బదులిచ్చింది శక్తి.

"నన్ను నువ్వు ఆవహించలేవు. పో...ఎక్కడినుంచి వచ్చావో అక్కడికే వెనక్కిపో... ఇది నా ఆన" అన్నాడు.

అంతే-తక్షణం ఇక్కడ అదృశ్యమయింది మోహినీ శక్తి. మరుక్షణమే అక్కడ ద్వారకాలాడ్జి గదిలోని అనంతస్వామి గదిలో ప్రవేశించి ఒకే చరుపుతో మూకుడులోని జ్యోతిని ఆర్పి అంతరించింది.

* * * * *

ఈ లోపల–బయటకు పరుగెత్తిన కాంచనను అప్పుడే మెట్లెక్కి వచ్చిన స్నిగ్ధ ఆపింది.

"నాకు భయంగా ఉందక్కా. కృతయుగ్ బెడ్‌మీద కూచుని తనలో తనే పిచ్చాడిలా మాట్లాడుకుంటున్నాడు. డాక్టర్ని పిలవడానికి వెళ్తున్నాను" అంది కాంచన.

"డాక్టర్ అక్కర్లేదు. భయపడకు. నాతో రా" అంటూ కాంచనను వెంట బెట్టుకుని కృతయుగ్ గదిలోకి వచ్చింది స్నిగ్ధ. ఇద్దరూ గదిలోకి వెళ్ళే సరికి అప్పటికి ఇంకా ధ్యానంలో కూచునే వున్నాడు కృతయుగ్.

నిర్మలంగా ప్రశాంతంగా ఉంది అతడి వదనం. అయిదు నిముషాల తర్వాత కళ్ళు నులుముకొని గాలిలోనే ఒక నమస్కారం సమర్పించి కళ్ళు తెరిచాడు. ధ్యానం నుంచి బయటపడి బెడ్ దిగాడు. "నువ్వు వచ్చి ఎంత సేపైంది?" స్నిగ్ధను అడిగాడు.

"నా సంగతలా ఉంచు. కాంచనను కంగారుపెట్టేశావేమిటి? ఏమైంది?" అడిగింది స్నిగ్ధ.

"కంగారెందుకు? కాంచనా...నీకు ఏం చెప్పాను?"

"చెప్పావనుకో... నీలో నువ్వు మాట్లాడుకుంటే కంగారుపడి" అంది కాంచన.

"సరిసరి. ఎంత గుండెనిబ్బరంవున్నా చివరకు ఆడపిల్లవనిపించావ్. స్నిగ్ధకు తెలిసిన చాలా విషయాలు నీకు తెలీదు. అందుకే కంగారుపడ్డావ్. తర్వాత మాట్లాడుకోవచ్చు. అర్జంటుగా స్నానం చేయాలి. డ్రస్ తెచ్చావ్ గదా?" స్నిగ్ధను అడిగాడు.

"తెచ్చాగాని అసలు ఇంతకీ ఎమైందో చెప్పవేమిటి?" కోప్పడింది స్నిగ్ధ. "ఏముంది? నన్ను రప్పించుకోడానికి అనంతస్వామి మోహినీశక్తిని అంపకం చేశాడు. నేను తిప్పికొట్టాను. అంతే. అనవసరంగా కాంచన కంగారు పడినట్టుంది" చెప్పాడు కృతయుగ్. "వాళ్ళకి నీ అవసరం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగింది కాంచన.

"ఎవరి అవసరాలు వాళ్ళకుంటాయి. విచిత్రం ఏంటంటే నేనెవరో, ఎలా ఉంటానో కూడా అనంతస్వామికి తెలీదు" చెప్పాడు కృతయుగ్.

"కాని, మా బావ మహీధర్‌కి నువ్వు తెలుసు"

"తొందరలోనే అందరం తెలిసిపోతాంలే"

"నీకు మంత్రవిద్యలొచ్చా?"

"మీ అనంతస్వామి అంత కాదులే" అని నవ్వుతూ స్నానానికి వెళ్ళిపోయాడు కృతయుగ్.

"అక్కా! నాకంతా అయోమయంగా ఉంది. కృతయుగ్ గురించి నాకు తెలియాల్సింది చాలా వున్నట్టుంది" అంది ఆశ్చర్యంనుంచి తేరుకుంటూ కాంచన.

"అతడి గురించే కాదు. నిధి గురించి కూడా నీకు తెలియాల్సింది చాలా ఉంది. ఆ విషయాలు తీరిగ్గా తర్వాత మాట్లాడుకుందాం. ఇప్పుడు నీకో ముఖ్యమైన విషయం చెప్పాలి" అంది స్నిగ్ధ.

"ఏ విషయమక్కా?"

"నువ్వు హైదరాబాద్‌లో లేవని ఉజ్జయిని వచ్చేసి వుంటావని మీవాళ్ళకి తెలిసిపోయింది"

"కావచ్చు. ఈ సంగతి నీకెలా తెలిసింది?"

"మహీధర్ చెప్పాడు"

"బావ...బావ నిన్ను కలిశాడా?"

"కలవటం కాదు. బెదిరించాడు కూడా"

ఇంకేదీ దాచకుండా మహీధర్ హోటల్ గదిలోకొచ్చి తనని కలవటం, బెదిరించటం, వాడి కన్నుగప్పి ఆటోలు మారి తనిక్కడికి చేరుకోవటం అంతా పూసగుచ్చినట్టు వివరించింది స్నిగ్ధ.

మరునాడు ఉజ్జయిని స్థానిక పత్రికలలో రెండు సంచలన వార్తా కథనాలు వెలువడ్డాయి. అందులో ఒకటి మోటర్ బోటుమీద వెళ్ళిన బౌద్ధ సన్యాసులకు సంబంధించింది. "నది ఎగువకు వెళ్ళిన బౌద్ధసన్యాసులు ఐదుగురు ఏమయ్యారు? వాళ్ళంతా ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారు? ఎక్కడికి వెళ్ళారు? ఏమయ్యారు?

వారికి అద్దెకిచ్చినబోటు తిరిగిరాకపోయినా నోరు విప్పని బోటు యజమాని. మరో సంఘటనలో ఇద్దరు యువతీ యువకులు వెళ్ళిన బోటు కూడా తిరిగి రాకపోవటం, వారేమయ్యారో తెలీకపోవడంతో జెట్టీవద్ద ఈ విషయాలు చర్చనీయాంశమయ్యాయి.

బోట్లు రెండింటి యజమానులు కూడా ఈ విషయంలో నోరువిప్పక పోవటం స్థానికుల్లో చర్చనీయాంశమయింది" అంటూ ఒక వార్త రాగా, రెండోది ఇసుక తిన్నెమీద క్షుద్రపూజల గురించి.

"ఇసుకతిన్నెమీద క్షుద్రపూజలు" అంటూ పతాక శీర్షికతో అదో వార్తా కథనం.

ఉజ్జయినికి దూరంగా దక్షిణ ప్రాంతంలో నదిమీద ఇసుకతిన్నెలో కొందరు వ్యక్తులు చేరి క్షుద్రపూజలు నిర్వహించటం స్థానికంగా సంచలనం రేపింది.

విషయం ఆలస్యంగా వెలుగుచూడ్డంతో వారంతా ఎవరు? ఎందుకోసం పూజలు చేశారు? ఎక్కడినుంచి వచ్చారు? అసలేం జరిగిందక్కడన్నది మిస్టరీగా మారి స్థానికుల్లో చర్చనీయాంశమైంది. ఈ విషయమ్మీద దృష్టి సారించి నిజాలు నిగ్గుతేల్చాల్సిందిగా స్థానికులు అధికారుల్ని కోరుతున్నారనేది రెండో వార్త సారాంశం.

ఈ విషయంలో స్థానికులు గాని మీడియాగాని ఆందోళన చెందటంలో ఆశ్చర్యంలేదు. అలాగని ఉజ్జయినీ వాసులకు మంత్రతంత్రాలు క్షుద్రపూజలు తెలీవనుకుంటే పొరపాటే.

ఇక్కడి నగరదేవత మహంకాళి సుప్రసిద్ధమైన పౌరాణిక, చారిత్రక నేపథ్యంగల దైవం. ఉజ్జయినీ చరిత్రతో ఈ అమ్మవారి ఆలయం ముడిపడివుంది. గతంలో ఉజ్జయిని కూడా క్షుద్రపూజలకు ఉపాసకులకు కేంద్రంగా ఉండేది. అయితే అదంతా గతం.

* * * * *

దట్టమైన అడవులకు, పురాణ, చారిత్రక ప్రసిద్ధమైన ప్రదేశాలకు బౌద్ధారామాలకు, హిందూ ఆలయాలకు మధ్యప్రదేశ్ నిలయం.

బందిపోటు ముఠాలకు నిలయమైన చంబల్‌లోయ ఈ రాష్ట్రంలోనే ఉంది. ఉజ్జయినీ మహంకాళి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. జగత్ప్రసిద్ధమైన ఖజురహో ఆలయాలు ఇక్కడే ఉన్నాయి.

మధ్యభారతావనిలో కాశ్మీర్‌గా వాసికెక్కిన పచ్‌మఢి అనే సుందర ప్రాంతం మధ్యప్రదేశ్‌లోనే ఉంది. సాత్పురా పర్వతాల్లోని పచ్‌మఢి ప్రాంతాన్ని సాత్పురా రాణిగా అభివర్ణిస్తారు.

ఆలయాలకు, ఎత్తయిన జలపాతాలకు, విహారయాత్రలకి ఈ ప్రాంతం పెట్టింది పేరు. మండు వేసవిలో కూడా కాశ్మీరంలో చల్లదనాలుపంచే ప్రాంతం ఇది.

సముద్రమట్టానికి సుమారు 3560 అడుగుల ఎత్తున ఎనభై కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన భూలోక స్వర్గం అనబడే సుందర ప్రాంతం ఇది. మధ్యప్రదేశ్ అనగానే మనకు గుర్తొచ్చే మరో ముఖ్యవిషయం ఉంది.

సహజంగా మనం చూసే నదులన్నీ పశ్చిమకనుమల్లో పుట్టి తూర్పుగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తాయి. ఇలాగే తూర్పున పుట్టి పశ్చిమంగా ప్రవహించి అరేబియా సముద్రంలో కలిసే నదులూ కొన్ని ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి నర్మద, తపతి, మహి నదులు. పవిత్రమైన నదులు.

వీటిలో నర్మదా నది పొడవైనది. దట్టమైన అడవులు కొండలవెంట ప్రవహిస్తుంది. మనదేశంలో ప్రతి నది ఆవిర్భావం వెనక ఒక పురాణగాథ వున్నట్టే నర్మదానది పుట్టుకవెనుక ఒక గాథ వుంది. ఈ నది సాక్షాత్తూ పరమశివుని త్రిశూలాగ్రం నుండి ఉద్భవించింది. అందుకే ఈ నదికి శోణ అనే పేరు కూడా వుంది.

శివుడు తపస్సులో ఉండగా త్రిశూలాగ్రం నుండి బిందు రూపంలో కిందపడి నదిగా మారి స్త్రీరూపం ధరించి శివుని తపస్సుతో మెప్పించింది నర్మద. ఘోరపాపాలు చేసిన వారైనా తనలో స్నానం చేస్తే పవిత్రులు కావాలని, పుడమి పైన సమస్త నదుల్లోనూ స్నానంచేస్తే ఎంత పుణ్యం వస్తుందో, తనలో ఓసారి స్నానం చేసినవారికి అంతటి పుణ్యం లభించాలనీ, తన తీరాన శివార్చన చేసిన వారికి శివలోకప్రాప్తి కలగాలని వరంగా పొందింది.

అందుకే గంగానది తర్వాత అంతటి పుణ్యప్రదమైన నదిగా నర్మదను భావిస్తారు భక్తులు. ఈ నదికి దక్షిణ గంగ అనిపేరు రావటానికీ కారణమిదే. ఈ నది జన్మస్థానం మధ్యప్రదేశ్‌లోనే ఉంది. వింధ్యపర్వత సానువుల్లోని అమర్ కంఠక్‌వద్ద జన్మించింది.

ఈ నది భూలోకానికి రావటం వెనక ఆసక్తికరమైన ఒక పురాణగాథ ఉంది. ఒకప్పుడు భారతఖండాన్ని పాలించిన పురూరవ చక్రవర్తి తన పితృదేవతలకు మోక్షప్రాప్తి కలిగించటానికి పవిత్రమయిన నర్మదను భూమికి తీసుకురావాలని శివుని గురించి ఘోరతపస్సు చేస్తాడు. శివుడు ప్రత్యక్షమయి వరం కోరుకోమనగా పురూరవుడు నర్మదను కోరుకున్నాడు.

అంతవరకు కైలాసంలో వున్న నర్మదను భూమికి పంపించటానికి శివుడు అంగీకరించాడు. కాని పరవళ్ళు తొక్కుతూ దూకేనదికి అడ్డుకట్టగా నిలిచి శాంతపరిచే వారు ఎవరన్న సమస్య వచ్చింది.

అప్పుడు వింధ్యపర్వత రాజు ఆనతిమేరకు ఆయన కుమారుడు అమర్ కంఠక్ ఆ బాధ్యత వహిస్తాడు. ఆ విధంగా నర్మదానది అమర్‌కంఠక్‌లో జన్మించింది.

అక్కడినుండి మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌ల మీదుగా ఒక వేయి మూడు వందల పన్నెండు కిలోమీటర్ల దూరం ప్రవహించి గుజరాత్ లోని బారూచ్ జిల్లాలో అరేబియా సముద్రంలో కలుస్తుంది. దట్టమైన అడవులు, కొండల నడుమ ప్రవహించే ఈ నది అందాలు చూడవలసిందే గాని చెప్పనలవికాదు.

ఇక నదీ తీరంవెంట వెలిసిన అనేక ఆలయాలు పుణ్యక్షేత్రాలు సరేసరి. ఇప్పటికీ సాగుతున్న నర్మదా బచావో ఉద్యమం గురించి తెలిసినవారికి ఈ నది గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

నర్మదానదికి అనేక పేర్లు ఉన్నాయి. ఆ పేర్లన్నిటినీ ఉదయకాలంలో స్మరిస్తే, నర్మదానదీ స్నానమాచరించి నంతటి పుణ్యం లభిస్తుందని హైందవుల నమ్మకం.

ఈ నదికి గురుడు వృషభరాశిలో ప్రవేశించినపుడు పుష్కరాలు వస్తాయి. మొన్న 2012 సం॥ లోనే ఈనదికి పుష్కరాలు జరిగాయి.

ఇక రెండో నది తపతి. పరమపవిత్రమైన ఈ తపతీ నది ఎవరో కాదు. యమునానదికి సోదరి. ఇరువురూ సూర్యకుమార్తెలే. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే మధ్యప్రదేశ్‌లో పుణ్యక్షేత్రాలకు కొదవలేదు.

అలాగే కన్నులపండువ చేసే ప్రకృతి దృశ్యాలకు, ఎత్తయిన జలపాతాలు, దట్టమైన అడవులకు ప్రసిద్ధి.

ఇక చరిత్ర ప్రసిద్ధమయిన ఖజురహో ఆలయాలు ఇక్కడే ఉన్నాయి. విదిశీ, గ్వాలియర్, జబల్‌పూర్, సాంచీ, అంబికాపూర్, కాన్హా మొదలైన అనేక ప్రాచీన నగరాలు ఉన్నాయి.

ఈ విధంగా అటు పురాణ ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రాలు, ఇటు చరిత్ర ప్రసిద్ధమైన నగరాలతో అందమైన ప్రకృతితో పులకింపచేసే విహార కేంద్రాలతో అలరారుతూవుంటుంది గాబట్టి మధ్యప్రదేశ్‌కు టూరిస్ట్‌ల తాకిడి అధికంగా ఉంటుంది.

ఈ పరిస్థితిలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరిగినా టూరిజం దెబ్బతింటుందన్న భయం సహజం. అందుకే ప్రతి విషయాన్నీ ఇక్కడి మీడియా వేయి కళ్ళతో గమనిస్తూంటుంది.

అయితే ఈ వార్తలగురించి ఇటు కృతయుగ్ వర్గం గాని అటు అన్నారావు వర్గంగాని పట్టించుకోలేదు. అది వేరే విషయం. ఆ రోజు ఉదయం న్యూస్‌పేపర్ తిరగేస్తూ కాసేపు కాలక్షేపం చేశాడు కృతయుగ్. అప్పటికే తెల్లవారి ఏడుగంటలు దాటింది సమయం.

రాత్రి హాస్పిటల్లో ఉండటం వసతిగా ఉండదని అమ్మాయిలిద్దర్నీ హోటల్‌కి పంపించేశాడు. అదీ ఒంటరిగా స్నిగ్ధ మినర్వాహోటల్లో ఉండటం సేఫ్‌గా ఉండదని, మహీధర్ కంటపడ్డాక హోటల్ సూట్‌లో స్నిగ్ధను ఒంటరిగా ఉంచటం భద్రం కాదని భావించి కాంచన వెంట ఆమె ఉంటున్న హోటల్‌కి పంపించాడు. ఇది కూడా కాంచన ప్రపోజలే.

కృతయుగ్ పాలు, బ్రెడ్ తీసుకున్నాక వాళ్ళిద్దరూ హోటల్లో భోంచేసి అటునుంచి అటే వెళ్ళిపోయి ఉదయం ఆరుగంటలకి వస్తామని చెప్పి వెళ్ళిపోయారు.

మందులు వేసుకున్న మత్తులో తనూ వెంటనే నిద్రపోయాడు. ఉదయం ఆరుగంటలగ్గాని మెలుకువరాలేదు. తెల్లారి ఫోన్‌చేస్తే ఇద్దరి ఫోన్లు స్విచ్ఛాఫ్.

నిన్న తిరుగుడువలన అలసిపోయున్నారు ఇంకా నిద్రపోతున్నారేమో అనుకున్నాడు. ఏడు దాటినా ఫోన్లు పనిచేయకపోవటం, ఇక్కడికి రాకపోవటంతో ఇప్పుడిప్పుడే కృతయుగ్‌కి ఏదో జరిగిందన్న సందేహం పొడచూపనారంభించింది. ఎందుకయినా మంచిదని కాలకృత్యాలు తీర్చుకుని డ్రెసప్ అయ్యాడు.

డాక్టర్ దయానిధి గొప్ప వైద్యుడు. అందులో సందేహం లేదు. ఆయనిచ్చిన ఇంజక్షన్లు, మందులు చాలా బాగా పనిచేశాయి. తెల్లవారేసరికే గాయం నొప్పి చాలా వరకు తగ్గిపోయింది. బ్యాండేజ్ తడవకుండా జాగ్రత్తలు తీసుకుని స్నానం చేశాడు.

మరోసారి ఫోన్లు చేశాడు. అప్పుడూ స్విచ్ఛాఫ్ అనే వస్తోంది. ఏం జరిగుంటుంది? తన కూతురు కాంచనతో బాటు స్నిగ్ధనూ పట్టుకుని అన్నారావు తాముంటున్న ద్వారకాలాడ్జిలో బంధించాడా? లేక ఇందులో మహీధర్ కుట్ర ఉందా! ఇది తెలియాలంటే తను ఓసారి ద్వారకా లాడ్జికి వెళ్ళి చూడ్డం మంచిది.

ఆలోచనలతోనే సమయం గడిచి ఎనిమిది దాటింది టైం. ఇక ఆస్పత్రిలో ఉండలేకపోయాడు కృతయుగ్. ఎవరూ చూడకుండా ఆస్పత్రిలోంచి బయటపడి

వీధిలో కొచ్చాడు. అటుగా వస్తున్న ఆటో ఎక్కి కాంచన హోటల్ అడ్రస్ చెప్పాడు. ఉజ్జయినీ వీధుల్లో పరుగుతీసింది ఆటో.

*       *       *       *       *

ముందుగా కాంచన స్పృహలోకొచ్చింది. కళ్ళు మండుతున్నాయి. తలంతా దిమ్మగా ఉంది. ఒక విధమైన వికారంతో కళ్ళు గిర్రున తిరుగుతున్నాయి. కాస్సేపు అసలు తనెక్కడుంది ఏం జరిగిందీ ఏదీ గుర్తులేకుండాపోయింది.

కళ్ళు నులుముకుని కాసేపు స్థబ్దుగా అలాగే ఉండిపోయింది. గదిలో సీలింగ్ ఫ్యాన్ తిరుగుతోంది. అంతటా నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది.

బాగా తెల్లవారిపోయినట్టు వెలుతురు వ్యాపించి ఉంది. ఫ్యాన్ సౌండ్ కూడా భయపెడుతున్నట్టుంది. క్రమంగా జరిగిన సంఘటనలు గుర్తుకు రానారంభించాయి. రాత్రి ఆస్పత్రి నుంచి బయలుదేరి సమీపంలోని భోజన హోటల్‌కు వెళ్ళారు.

భోజనంచేసి హోటల్లో తను బసచేసిన గదికి చేరుకోవాలని కాంచన ఉద్దేశం. భోజనంచేసి స్నిగ్ధ తను బైటికొచ్చేసరికి ఆవరణలో ఒక వ్యాన్ ఆగుంది.

వ్యాన్ పక్కనుంచి వస్తుండగా అకస్మాత్తుగా నలుగురు ఆగంతకులు చుట్టుముట్టారు. జాగ్రత్తపడే లోపలే ఘాటైన మత్తుమందుతో కూడిన జేబు రుమాలుతో ముఖాన్ని అదమటంతో తెలివి తప్పిపోవటం జరిగింది. తర్వాత ఏం జరిగిందీ తెలీదు.

బహుశా తామిద్దరూ హోటల్లోకి కలిసి వెళ్ళటం తమ మనిషి ఎవడో చూసుంటాడు. తను బురఖాలో ఉన్నందున గుర్తుపట్టే ఛాన్సులేదు. కాని స్నిగ్ధతో కలిసి వుండటంతో గుర్తించి ఫోన్ చేసుంటాడు. భోజనంచేసి వస్తూండగా కాపువేసి కిడ్నాప్ చేశారు.

నిస్సత్తువగా ఉన్నా ఓపిక కూడతీసుకొని లేచి బాత్‌రూమ్‌లోకెళ్ళి ముఖం కడుక్కుని వచ్చింది కాంచన. ముఖం మీద నీళ్ళు చల్లగానే స్నిగ్ధకూడా లేచింది.

తలుపులు, కిటికీలు బయట బంధించి వుంచటంతో తాము ఎక్కడున్నదీ ఏదీ అర్ధంగాకుండా పోయింది. స్విచ్ ఆఫ్ చేస్తున్న తమ ఫోన్లను ఆన్ చేసింది కాంచన. అదే సమయంలో బయట కలకలం విన్పించింది.

చెవులు రిక్కించారు. బయట చిన్నపాటి అరుపులు, మూల్గులు. ఏం జరుగుతోంది?

''కాంచనా! కృతయుగ్‌కి ఫోన్ చెయ్యి. మనకోసం కంగారుపడుతూంటారు'' హెచ్చరించింది స్నిగ్ధ.

"ఒక్క నిముషం వెయిట్ చేయక్కా... బయట గొడవేమిటో మనం ఎక్కడున్నామో తెలియాలి కదా" అంటూ డోర్‌వైపు అడుగులేసింది కాంచన. అదే సమయంలో– గది తలుపులు బార్లా తెరుచుకున్నాయి. ఎదురుగా డోర్‌లో కృతయుగ్.

బయట ముగ్గురువ్యక్తులు నేలమీదపడి మూలుగుతున్నారు. కోపంతో అగ్నిశిఖలా ఉన్నాడు మనిషి. నేలమీదపడున్న ఆగంతకులు ముగ్గురుని గదిలోకి లాగి తలుపులు దగ్గరగా మూశాడు.

దుఃఖం ఆపుకోలేక కృతయుగ్‌ని కౌగిలించుకొని ఏడ్చేసింది స్నిగ్ధ. కాంచన కళ్ళలో కూడా నీళ్ళు తిరిగాయి. "సారీ కృతా... ఏం జరిగిందో ఇప్పటికీ నాకు అర్థంగావటంలేదు" అంది బాధగా.

చెరో చేత్తో ఇద్దర్నీ అక్కున చేర్చుకుని ఓదార్చాడు కృతయుగ్. "తెల్లారి కూడా మీ ఫోన్లు పనిచేయక పోవటంతో అనుమానించి బయలుదేరాను. నువ్వు దిగిన హోటల్‌కి వెళ్ళాను. రాత్రి నువ్వు రాలేదని తెలిసింది. మినర్వా హోటల్లోనూ అదే సమాధానం.

దాంతో అనుమానం బలపడి ద్వారకాలాడ్జికొచ్చాను. చివరిగదిలో మిమ్మల్ని బంధించివుంచి వాళ్ళంతా ఎక్కడికో వెళ్ళిపోయారు. గదిముందు వీళ్ళు కాపలా ఉండటం చూసి అనుమానించాను.

అదే నిజమైంది. ఒక్కనిముషం'' అంటూ వాళ్ళలో ఒకడ్నిలేపి కూచోబెట్టాడు. "చెప్పరా. వీళ్ళని కిడ్నాప్ చేసింది మహీధరేనా?" అడిగాడు. అవునన్నట్టు తలూపాడు వాడు.

"ఈ సంగతి అన్నారావుకు తెలుసా?"

"మొదట తెలీదు. తర్వాత తెలిసింది. ఆయనే ఈ గదిలో ఉంచమని మమ్మల్ని కాపలా ఉంచాడు"

"వాళ్ళంతా ఎక్కడికెళ్ళారు?"

"తెలీదు. కాని నదిమీదకి వెళ్ళాలని చెప్పుకోడం విన్నాం. నిన్నరాత్రే పాతికమంది ప్రయాణం చేయటానికి అనువుగా వుండే పడవ ఒకటి మోటారు ఇంజను అమర్చింది మాట్లాడుకుని వుంచారు"

"దీవిమీద అడుగుపెడితే వీళ్ళలో ఒక్కడూ ప్రాణాలతో తిరిగిరాడు" కాంచనవంక చూస్తూ చెప్పాడు.

"వెంట అనంతస్వామి ఉన్నాడన్న ధైర్యం కావచ్చు. వెళ్ళనీ. బహుశా అక్కడి పరిస్థితి తెలుసుకురావటానికి ట్రయల్ రన్ కావచ్చు" అంది కాంచన.

"ఇంతకీ వీళ్ళు మమ్మల్ని ఎందుకు కిడ్నాప్ చేసి బంధించారు? నాకేమీ అర్థంగావటంలేదు" అంది స్నిగ్ధ.

"ఇందులో అర్థం కానిదేమీలేదు. కృతయుగ్‌ని ఒంటరివాడ్ని చేయాలనే మహీధర్ చేశాడీ పని. నన్ను బయట తిరగకుండా ఆపే ఉద్దేశంతో మా డాడీ మనల్ని ఇక్కడ బంధించమని చెప్పుంటాడు" అంది కాంచన.

"ఓ.కె. ముందిక్కడ్నుంచి మనం బయటికెళ్ళిపోవాలి పదండి. ఏరా. వాళ్ళంతా ఎంతసేపయింది వెళ్ళి?" అడిగాడు. "ఓ గంట అయుంటుంది సార్" బదులిచ్చాడు వాడు. కృతయుగ్ యువతులిద్దర్నీ తీసుకుని ద్వారకా నుండి బయటికొచ్చేశాడు.

"కాంచనా. మీ ఇద్దరూ ఓ పని చేయండి. మినర్వా హోటల్లో మా సూటుంది. స్నిగ్ధ వెంట వెళ్ళు. టిఫిన్ చేసి మీరు రెస్ట్ తీసుకోండి" చెప్పాడు.

"నువ్వు రావా?" అడిగింది స్నిగ్ధ.

"నేను మీకోసం ఆస్పత్రినుంచి చెప్పకుండా వచ్చేశాను. డాక్టర్ దయానిధి కంగారుపడుతూంటాడు. పైగా భుజంనొప్పిగా ఉంది. ఆస్పత్రి కెళ్ళిపోతాను. మీరు సాయంత్రం రండి. వెళ్ళండి" అన్నాడు.

అతడి మాట కాదనలేక కాంచన స్నిగ్ధలు రోడ్డు దాటి మినర్వా హోటల్లోకి వెళ్ళిపోయారు.

కృతయుగ్ అటుగా వచ్చిన ఆటో ఎక్కి కూచున్నాడు. కాని ఆటో పరుగుతీసింది ఆస్పత్రిక్కాదు. నదీతీరం రేవులోని జెట్టీకి.

* * * * *

సువిశాలమైన క్షిప్రానది మధ్యలో నీటిని పాయలుగా చీల్చుకుంటూ నదీ జలాలకు ఎదురు దూకుతూ శరవేగంతో దూసుకుపోతోంది మోటారు పడవ. సుమారు ముప్పైమంది ప్రయాణం చేయటానికి అనువుగా వున్న పెద్ద పడవ.

డగడగమంటూ ఇంజను ధ్వని నీటిమీద ప్రతిధ్వనిస్తోంది. ఉదయం తొమ్మిది గంటలకు జెట్టీ నుంచి ప్రయాణం ఆరంభిస్తూ బయలుదేరింది పడవ.

నదిలో ప్రయాణమంటే కనువిందుచేసే ప్రకృతిదృశ్యాలు పరవశింప చేస్తాయి.

ఇక దట్టమైన అడవులు కొండగుట్టల నడుమ సాగే క్షిప్రానదీ సోయగాల గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అనుచరులంతా ఆ సుందర దృశ్యాలను ఆస్వాదిస్తూ కబుర్లలో మునిగిపోయారు.

పడవమధ్యలో అనంతస్వామి. ఆయనకి అటూఇటూ అన్నారావు, మహీధర్‌లు బల్లమీద కూచున్నారు. కాస్త ఎడంగా మరో బల్లమీద పీటరున్నాడు. మిగిలినవాళ్ళు తలోచోట ఉన్నారు. మొత్తం ఇరవై ఒక్కమంది.

పడవ నడిపే కళాసీ పడవ చివర తిన్నెమీద కూచుని చుక్కాని వేస్తున్నాడు. మనిషి నల్లగా, పొడుగ్గా, చింపిరి జుత్తు, గడ్డంతో చూడ్డానికి రఫ్‌గా ఉన్నాడు.

ఓ పట్టాన అతడు దీవివరకు నావను పోనివ్వటానికి ఒప్పుకోలేదు. రానన్నాడు. ఎక్కువ డబ్బు ముట్టచెప్పాక అంగీకరించి వచ్చాడు. అప్పుడు కూడా దీవిమీద అడుగు పెట్టను, పడవ దిగను. మీరంతా వచ్చేవరకు నదిమీదే వెయిట్ చేస్తానంటూ కండిషన్ మీద వస్తున్నాడు.

అసలు ఇలా దీవికెళ్ళి చూసిరావాలన్న ఆలోచన అన్నారావుది. రాత్రి కూడా ఈ విషయంగా ఏమీ ఆలోచించలేదు. కాని రాత్రి తొమ్మిది పదిగంటల మధ్య మహీధర్, కాంచన, స్నిగ్ధలను తెలివి తప్పించి తెచ్చి ద్వారకాలాడ్జి గదిలో బంధించాక అనుకోకుండా ఈ ఆలోచన వచ్చింది అతనికి.

దీవి ప్రమాదమైనదే. కాని నిధినిక్షేపం తీయనైనది. దాన్ని సొంతం చేసుకునే వరకు–

కంటిమీద కునుకు ఉండదు. ఇప్పటికే తను దీవిపైన నలుగురు మనుషుల్ని కోల్పోయాడు. అందులో బసవడు తనకు కుడిభుజం లాంటివాడు. అలాగని దూరంగానే ఉండిపోతే ఏమీ సాధించలేము. నిధికి కాపలా ఉన్న పింగళ నాగశక్తి ఎంత శక్తివంతమైందో కళ్ళారా చూసినా కూడా ఏదో మొండి ధైర్యం.

తమవెంట మహామంత్రవేత్త అనంతస్వామి ఉన్నాడన్న నమ్మకం కావచ్చు. అతడ్ని దీవికి వెళ్ళాలని పురికొల్పాయి. రాత్రే అనంతస్వామితో చర్చించాడు.

ఆయన అంగీకరించటంతో మహీధర్‌ను తీరానికి పంపించి పడవను మాటాడి సిద్ధం చేయించాడు. ఉదయం అంతా పడవలో బయలుదేరారు.

"నాకు ఇప్పటికీ అర్థంగావటంలేదు స్వామీ! అరచేత గరుడరేఖ వున్న ఆ వ్యక్తి ఎవడైవుంటాడు? నువ్వు పంపినశక్తినే తిప్పకొట్టాడంటే వాడూ మంత్రవాదే అయివుంటాడా?" అనంతస్వామిని అడిగాడు అన్నారావు.

"అదే నాకూ అర్థంకావటంలేదు. కాని ఒక్కటి నిజం. వాడు సామాన్యుడు కాదు. అలాంటి వాడి సహకారం మనకి అవసరం.

వెనక్కి తిరిగి వెళ్ళాక వాడి కోసం మరో ప్రయత్నం తప్పక చేస్తాను" అన్నాడు అనంతస్వామి.

"ఇంతకీ కృతయుగ్ సంగతేమిటి. ఏరా మహీధర్. వాడ్ని నువ్వు చూశావ్‌గా? ఎలా ఉంటాడు?" మహీధర్‌ని అడిగాడు అన్నారావు.

"వాడా... వాడో వేస్ట్ ఫెలో మావయ్యా. కాంచన స్నిగ్ధ ఏమయ్యారో తెలీక పిచ్చిపట్టి ఉజ్జయిని వీధుల్లో తిరుగుతుంటాడు. వాడు మనకి ఎందుకూ పనికిరాడు" అన్నాడు చాలా తేలిగ్గా మహీధర్.

అన్నారావు భృకుటి ముడిపడింది ఆ మాటలు వినగానే. మేనల్లుడివంక కాస్త చురుగ్గా చూశాడు. "అంటే నా కూతురు అంత తెలివితక్కువది, చేతకాని ఓ దద్దమ్మను ప్రేమించిందని నీ ఉద్దేశమా?

ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్‌లో మంచి పొజిషన్‌లో వున్న చదువుకున్న మేధావి స్నిగ్ధ. ఓ వేస్ట్ ఫెలోని తనకు సాయంగా ఇంత దూరం వెంట తెచ్చుకుం దంటావా?" సూటిగా అడిగాడు.

"అదికాదు మావయ్యా..." మహీధర్.

"షటప్... ఎదుటివాళ్ళను తక్కువగా అంచనా వేయకెప్పుడూ. దెబ్బతింటావ్ నీలోని అసూయని పక్కనపెట్టి వాస్తవాల్ని తెలుసుకునే ప్రయత్నం చెయ్యి. నా ఉద్దేశం కరక్టయితే మనం వెనక్కి వెళ్ళేసరికి వాడు అమ్మాయిలిద్దర్నీ విడిపించి తీసుకెళ్ళిపోతాడు.

కిడ్నాప్ చేయించింది నువ్వని తెలిస్తే నిన్ను క్షమించడు. కాస్త హెచ్చరిగ్గా ఉండు"

మేనమామ సున్నితంగా మందలించినా ఆ మాటల్లో వాస్తవం ఉందని మహీధర్‌కి తెలుసు. చింటూభాయ్ లాంటివాడ్ని ఖంగు తినిపించిన కృతయుగ్‌కి

వీళ్ళని విడిపించుకుపోవటం ఓ లెక్కకాదు. కాని అస్సలేం జరిగింది నిన్న? చింటూభాయ్ వాడి మనుషులు ఏమయ్యారు? ఇప్పటికీ తనకి అంతుచిక్కటం లేదు. బహుశా వాళ్ళని చంపేసినా ఆశ్చర్యంలేదు.

దీర్ఘంగా ఆలోచిస్తూ ఇక నోరు విప్పలేదు మహీధర్. ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండగా బోటు శరవేగంతో దూసుకుపోతూనే వుంది. క్రమంగా మధ్యాహ్నాం పన్నెండు గంటలు కావస్తోందనగా నది మధ్యలోని సువిశాలమైన దీవి వారికి అగుపించింది.

*　　　*　　　*　　　*　　　*

ఒంటరిగా బెడ్ చివర ఒదిగి కూచుని తనలో తను బాధపడుతున్న కాంచనను చూసి స్నిగ్ధ షాకయింది.

ఏం జరిగిందీ అర్థంగాక కంగారుపడుతూ దగ్గరకెళ్ళింది. ద్వారకా లాడ్జిగది నుంచి తమను విడిపించి కృతయుగ్ వెళ్ళిపోగానే ఇద్దరూ మినర్వాహోటల్లోని కృతయుగ్ సూట్‌లోకి వచ్చేశారు.

ముఖాలు కడుక్కుని టిఫిన్ చేయగానే తిరిగి నిద్ర ముంచుకొచ్చింది. మూడుగంటలు నిద్రపోయి లేస్తే గాని తిరిగి మామూలు మనుషులు కాలేకపోయారు. అప్పటికి పదకొండు దాటింది సమయం. తన పంజాబీ డ్రెస్ ఒకటి కాంచనకిచ్చి స్నానానికి పంపించింది స్నిగ్ధ.

తర్వాత తనూ స్నానంచేసి వచ్చేసరికి రెడీ అయికూచున్న కాంచన చాలా విచారంగా కన్పించింది. "కాంచనా! ఏమైంది? ఎందుకింత బాధపడుతున్నావ్?" అడిగింది స్నిగ్ధ.

"డాడీ గుర్తొచ్చారు" అంది కళ్ళు తుడుచుకుంటూ. "ఆయన బాగానే ఉన్నారుగా"

"వాళ్ళు దీవిమీదకు వెళ్ళుండకూడదు. అక్కడికెళ్ళి ఇప్పటికే నలుగురు చనిపోయారు. వీళ్ళే మవుతారో తెలీటంలేదు. నీకు తెలీదక్కా. ఒక్కతే కూతుర్ని గదా. డాడీకి నేనంటే ప్రాణం. ఆయన తిక్కమనిషేగాని చెప్పేలా చెప్తే అర్థం చేసుకుంటారు.

ఇక్కడ ఆయనకేమన్నా ఐతే మమ్మీ ముఖంచూడలేను" అంది రుద్ధకంఠంతో.

"అందుకని ఇలా బాధపడాలా? నీ ధైర్యమంతా ఏమైపోయింది? డోన్ట్ వర్రీ. వాళ్ళకేమీ కాదు. అనంతస్వామి వెంట ఉండగా ఏ ప్రమాదం రాదు- నిశ్చింతగా ఉండు. ఇలాంటప్పుడే మనం ధైర్యం కోల్పోకూడదు" అంటూ హితవు చెప్పింది స్నిగ్ధ.

"అది కాదక్కా..."

"ఇంకేం చెప్పక. అనవసరంగా టెన్షన్ పడకు. వాళ్ళకేమీకాదు" అంటూ డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూచుని తల దువ్వుకోనారంభించింది.

"అక్కా! దీవిమీద నిజంగా నిధి ఉందంటావా?" ఈ చివరకు వచ్చి బెడ్ చివర కూచుంటూ అడిగింది కాంచన.

"ఎందుకొచ్చిందా డౌటు? సందేహంలేదు. నిధి ఉంది. కాని ఈ నిధి విషయంలో మీ డాడీ ఆశ వదులుకోవటం మంచిది. చాలా విషయాలు మీకు తెలీదు" అంది.

"ఏ విషయాలు?" చిన్నపిల్ల అడిగినట్టు కాంచన అడుగుతుంటే స్నిగ్ధకు నవ్వొచ్చింది.

"రెండో రాగిరేకు గురించి" అంది నవ్వుతూనే.

"మా డాడీ వద్ద ఒకటుందని తెలుసు. మిగిలిన సగం ఎక్కడుందో ఎవరికీ తెలీదుగా" ఆశ్చర్యపోతూ అంది కాంచన. "అది మా వద్ద ఉంది"

"వ్వాట్? నిజంగానా?"

"మరీ ఆశ్చర్యపోవద్దు. నేన్నిజమే చెప్తున్నాను. అడిగావుగాబట్టి నీకు వివరంగా చెప్తాను" అంటూ జడ వదులుగా వేసుకుని వెనక్కి వదిలి లేచి ఛైర్ లాక్కుని కాంచన ఎదురుగా కూచుంది.

ఆ రోజు దంతెవారాలో మాటల సందర్భంలో ఇలాంటి గొట్టంలో రాగిరేకును తను ఎక్కడో చూశానంటూ కృతయుగ్ చెప్పటం దగ్గర్నుంచి తర్వాత జరిగిన సంఘటనలన్నీ వరసగా కాంచనకు వివరించింది స్నిగ్ధ.

"కృతయుగ్ సామాన్యుడని నువ్వూ పొరపాటుపడుతున్నావ్. అతడి అరచేతిని గమనించావో లేదో, ఎద్దుమూపురంలా ఉబ్బెత్తు కండ ఉండి అరచేతిలో గరుడరేఖ కలిగి ఉన్నాడు. ఆపైన ఛాయా పురుషయోగమనే సిద్ధిని పొందివున్నాడు.

అనంతస్వామి హాస్పిటల్లో వున్న కృతయుగ్‌ని ఆవాహనచేసి తనవద్దకి రప్పించుకునే ప్రయత్నం వెనుక కారణం ఇప్పుడు నీకు అర్థమైవుండాలి. అయితే

ఇందులో విచిత్రం ఏంటంటే తను ఆవాహన చేసింది కృతయుగ్‌నని అనంత స్వామికి తెలీకపోవటం" అంటూ నవ్వింది స్నిగ్ధ.

"ఇప్పుడర్థమైందక్కా... సాయంత్రం బెడ్‌మీద కూచుని కృతయుగ్ తనలో తను మాట్లాడుకుంటుంటే అర్థంగాక కంగారుపడిపోయాను. అవునూ. మా డాడీ నిధిమీద ఆశ వదులుకోవాలన్నావ్ ఓకె. కాని మీరూ నిధికోసమే వచ్చారా?" డౌటు క్లియర్ చేసుకోడానికి అడిగింది కాంచన.

"యు ఆర్ రైట్. మేం వచ్చింది నిధికోసమే. కాని నిధిని సొంతం చేసుకోవాలని మాత్రం కాదు"

"మీ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ కోసమా... లేక ప్రభుత్వానికి అప్పగిం చాలనా?"

"రెండూ కాదు. మా డిపార్ట్‌మెంట్‌కి చారిత్రక విశేషాలు అవశేషాలు కావాలి. అవే ముఖ్యం.

ఇక నిధి సంగతి... ఎప్పుడో పూర్వీకులు ఏదో కారణంతో పాతిపెట్టి వదిలేసిన నిధినిక్షేపాలు లభిస్తే ప్రభుత్వానికి వప్పగించటం మన ధర్మం.

అలా వప్పగించకుండా స్వార్థపరులు కొందరు దొరికిన నిధిని సొంతం చేసుకోవటమూ సహజం..."

"మా డాడీ లాంటివాళ్ళు" నవ్వింది కాంచన.

"ఓకె. అలాగే అనుకో. అయితే భవిష్యత్తు తరాల్లో నిధి ఎవరికి లభించినా దాన్ని ఈ విధంగా ఉపయోగించాలి అని సూచిస్తూ శాసనంగాని లిఖిత పూర్వకంగా విల్లులాంటిది రాసి ఉంచితే ఆ నిధి అన్యాక్రాంతం కాకూడదు. పూర్వీకుల ఉద్దేశాన్ని నెరవేర్చడానికి ఆ నిధిని వెచ్చించటం న్యాయమవుతుంది"

"అక్కా. నాకేమీ అర్థంగావటంలేదు. దీవిమీది నిధిని ఎలా ఖర్చుపెట్టాలో శాసనం లిఖించబడివుందా?" అనడిగింది. స్నిగ్ధ తల ఊపింది.

"ఓకె. నీ సందేహాలు అనుమానాలు నివృత్తికావాలంటే నువ్వే ఓసారి వీటిని పరిశీలించు. తర్వాత నీ డౌట్సు ఉంటే తీరుస్తాను" అంటూ లేచి వెళ్ళి రహస్యంగా దాచివుంచిన చిన్న బ్యాగ్‌ను తెచ్చింది.

అందులో భద్రంగా ఉన్న రాగిగొట్టం, రాగిరేకు తాళపత్రాలు వాటిని తర్జుమా చేసిన కాగితాలు అన్నీ కాంచన ముందుంచింది. వెళ్ళి దగ్గరగా

మూసివున్న డోర్ ఒకసారి తెరిచి బయటకు చూసి ఎవరూ లేరని నిర్ధారణ చేసుకున్నాక డోర్ మూసి లాక్ చేసి వచ్చి కాంచన ఎదురుగా కూచుంది.

వాటిని క్షుణ్ణంగా పరిశీలించింది కాంచన. తర్జుమా చేసిన పేపర్స్‌ని చదివి అర్థంచేసుకోడానికి అర్ధగంట సమయం పట్టింది.

నమ్మలేనట్టు స్నిగ్ధవంక చూసింది. "అంటే... అక్కా ఈ నిధి భోజరాజ వంశానికి చెందిందా?" దిగ్భ్రాంతికి లోనవుతూ అడిగింది కాంచన.

"నువ్వు చదివిందానికి అర్ధం అదేగా!" అంది స్నిగ్ధ. "నిధి ఏమాత్రం ఉండొచ్చు? రాజవంశానిదిగదా. రెండు మూడు బస్తాల బంగారం ఉండొచ్చా?"

"ఇంకా ఎక్కువే ఉండచ్చు. నిధి ఏమాత్రం అనే వివరణగాని, లెక్కలుగాని ఇవ్వలేదు గాబట్టి మనం ఊహించుకోవటం పొరపాటు. ఒక్కటి మాత్రం నిజం. అక్కడ భారీనిధి నిక్షేపాలే ఉండొచ్చు. లేకపోతే వాటికి నాగశక్తుల్ని కాపలా ఉంచరు"

"నాకు తెలీకడుగుతాను. అసలీ భోజులు ఎవరు ఏ కాలం వారు?"

"నిజం చెప్పాలంటే భోజరాజుల పరిపాలనా కాలానికి సంబంధించి సరైన చారిత్రకాధారాలు ఇంత వరకు లభ్యం కాలేదనే చెప్పాలి. ఆ తాళపత్రాల్లో శంభులింగయాచారిగారి లేఖలోని తేదీనిబట్టి ఇప్పటి కాలానికి అనుగుణంగా మారిస్తే సుమారు పదిహేనువందల సంవత్సరాలక్రితం రాసినట్టుంది. అప్పటికే సుమారు ఒకటి లేదా రెండుతరాల ముందు ఈ నిధిని దీవిమీద నిక్షిప్తం చేయటం జరిగింది.

కారణం ఏమైనాగానీ నిధిని నిక్షిప్తం చేసినవాడు చంద్రభోజుడనే మహారాజు. నిధి రహస్యం రాజవంశంలో ప్రభువుల కుటుంబంలోనే ఉంటూ వచ్చింది. విక్రమభోజుడనే రాజు పరిపాలనాకాలానికి వచ్చేసరికి రాజ్యంలో పరిస్థితులు మారాయి. శత్రువులు దండెత్తి వచ్చే సూచనలు కన్పించాయి.

యుద్ధం అనివార్యమైతే జయాపజయాలు ఎలా ఉంటాయో తెలీదు. కాబట్టి శంభులింగయాచారిని పిలిచి విక్రమభోజుడు నిధి రహస్యాన్ని చెప్పి తీసుకోవలసిన జాగ్రత్తలు, నిధి వినియోగం గురించి తన మాటల్నే శాసనంగా చెప్పి పంపించాడు.

ఆ విధంగా విక్రమభోజుని ఆనతి ప్రకారం నిధి రహస్యాన్ని రాగిరేకుమీద లిఖించి దాన్ని రెండు భాగాలు చేసి రెండు రాగిగొట్టాల్లో ఉంచాడు.

శంభులింగయాచారి రెండో రాగిరేకుగల గొట్టాన్ని తమ కుటుంబంలో ఉంచి మొదటి భాగాన్ని మారికపురంగా ఒకప్పుడు పిలువబడిన నేటి మార్కాపురంలో ఉంటున్న తన అల్లుడివద్దకు పంపించాడు.

ఆ విధంగా ఇవి ఆ రెండు వంశాల్లో ఉండిపోయాయి రాగిగొట్టాలు. శంభులింగయాచారి లేఖననుసరించి చివరిరాజైన విక్రమభోజుడి అనుశాసనం ప్రకారం నిధిలో ఒకవంతు ఆదివిష్ణు ఆలయంతో పాటు అష్టలక్ష్మల ఆలయాలను పునర్నిర్మించటానికి వెచ్చించాలి. రెండోవంతు ఆలయాల నిర్వహణకు ఉపయెగించాలి. మూడోవంతు అప్పటికి అంటే నిధి బయటపడే నాటికి వున్న తమ భోజవంశీకుల అభివృద్ధికి వినియోగించాలి.

నాలుగోభాగం రాగిగొట్టాల్ని భద్రంగా కాపాడుతూ వచ్చిన అటు శంభులింగయాచారి ఇటు ఆయన అల్లుడి వంశీకులకు చెందాలి. ఇది విక్రమ భోజుని శాసనం. కాబట్టి దీవిమీది నిధిని ఎవరూ సొంతం చేసుకునే అవకాశం లేదు. ఇందులో విక్రమ భోజుని వంశీకులుగానీ, శంభులింగయాచారి వంశీకులు గాని ఇప్పుడు ఎక్కడెక్కడ ఏ స్థితిలో ఉన్నారో ఎవరికీ తెలీదు.

నా అభిప్రాయం ప్రకారం శంభులింగయాచారికి మగపిల్లల్లేరు. కాబట్టి అతని వంశీకులంటే అల్లుడి వంశీకులకే చెందాలి. ఇంతకీ అల్లుడి వంశీకుల్లో ఇప్పుడు ఎవరున్నారో రాగిగొట్టం ఎవరివద్ద ఉందో చెప్పగలవా?" అంటూ చెప్పటం ఆపింది స్నిగ్ధ.

"నాకెలా తెలుస్తుందక్కా. నువ్వే చెప్పు" అంది కాంచన. "ఆ వారసుడెవరో కాదు. కృతయుగ్" "వ్వాట్?" షాకింగ్‌గా అంది కాంచన.

"ఎస్... మున్నలూరులోని వాళ్ళ పురాతన మండువాలోగిలి నేలమాళిగ లోని భోషాణంలో ఈ రెండో రాగిగొట్టం లభించింది. దీనిమూలంగానే ఈ చరిత్రాంశాలు తెలిశాయి. అయితే నిధిని చేరటం అంత సులువని నేను అనుకోను. నిధి శత్రువులు, అయోగ్యుల పాలవకూడదని చాలా బందోబస్తు చేశారు. శక్తులు కొన్నిటిని కాపలా ఉంచారు"

"భోజరాజుల కాలం ఏది?" అడిగింది కాంచన ఆసక్తితో.

"కాలనిర్ణయాల విషయంలో చరిత్రకారుల్లోనే అభిప్రాయభేదాలు ఉన్నాయి.

నాకు తెలిసిన ఆధారాల ప్రకారం శాతవాహన రాజులు, ఆంధ్రరాజులు తెలుగువారు. విక్రమాదిత్యుడు ఎవరనే విషయంలోనూ అభిప్రాయభేదాలున్నాయి.

మొదటి చంద్రగుప్తుడే విక్రమాదిత్యుడని కొందరంటే, మౌర్యచంద్రగుప్తుడు అని కొందరు అంటారు. అసలీ రెండు వంశాలు కాదు విక్రమాదిత్యుడు ప్రత్యేకమయిన రాజని కొందరి అభిప్రాయం. దీనికి ప్రధాన కారణం– ఆదిత్యుడు అంటే సూర్యుడు. విక్రమాదిత్యుడు సూర్యవంశరాజయి వుండాలి. ఒకవేళ ఇది బిరుదే అయివున్నా అసలు పేరు వంశం కూడా సూర్యవంశాన్నే సూచించాలి.

గుప్తులు అంటే గుప్తశబ్దం వైశ్యుల్ని సూచిస్తుంది.

కాబట్టి విక్రమాదిత్యుడు ఏదో రాజవంశానికి చెందినవాడని కొందరి అభిప్రాయం.

ఆంధ్ర శాతవాహన శకస్థాపకుడయిన మొదటి శాలివాహనుడి చేతిలో విక్రమాదిత్యుడు ఓడిపోయాడు. విక్రమాదిత్యుడు శకుల్ని ఓడించిన సందర్భంగా విక్రమార్క శకం, విక్రమాదిత్యుడ్ని శాతవాహనరాజు ఓడించిన సందర్భంగా శాలివాహనశకాలు ఏర్పడ్డాయి.

ఈ శకారంభాల్లో కూడా సందేహాలున్నాయి కాని అవి మనకి అప్రస్తుతం.

భోజులు ధైర్యసాహసాలకు పెట్టింది పేరు. వీరి చరిత్ర మనకి పూర్తిగా తెలీదు. విక్రమాదిత్యుని ఓడించాక సుమారు నాలుగువందల సంవత్సరాలపాటు ముప్పై ఇద్దరు ఆంధ్రశాతవాహనరాజులు ఇటు దక్షిణాదినుండి అటు ఉత్తరాదిన చాలా ప్రాంతాలవరకు ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలించారు.

తర్వాతి కాలంలో శాతవాహన రాజులు బలహీన పడ్డంతో క్రమంగా ఉత్తరాది ప్రాంతాలు చేజారిపోయాయి. ఆ సమయంలోనే భోజుల పరిపాలనా కాలం ఆరంభమయింది. భట్టివిక్రమార్క చరిత్రలో కూడా ఈ ప్రస్తావన కన్పిస్తుంది.

విక్రమార్కుని తదనంతరం నాలుగు వందల సంవత్సరాలకి భోజరాజుకి విక్రమార్కుని సింహాసనం ఒక జొన్నచేలోని మట్టిదిబ్బలో లభ్యమవుతుంది.

ఈ భోజరాజు ఆస్థానంలోనే నవరత్నాలనే ప్రసిద్ధ కవులు, పండితులు ఉండేవారు. భోజులు కవిపండితపోషకులే కాదు విష్ణుభక్తులు, హిందూమతాభిమానులు.

అందుకే దేశంలో ఎక్కడా లేని విధంగా క్షిప్రానది మధ్యలోని దీవిమీద ఆదివిష్ణు ఆలయం నిర్మించి – చుట్టూ అష్టదిక్కుల్లోనూ అష్టలక్ష్ముల ఆలయ

నిర్మాణాలు నిర్మించి ప్రతి ఆలయం వద్ద ఆలయం పేరుతో గ్రామాన్ని వృద్ధిచేశారు. విక్రమభోజుని కాలం వరకు ఈ ఆలయాలు ఎంతో వైభవాన్ని చవిచూశాయి.

యుద్ధానంతర పరిణామాల్లో శైవులైన శత్రువులు వైష్ణవాలయాల్ని ధ్వంసం చేస్తారని ఊహించినందునే, విక్రమభోజుడు శంభులింగయాచారి మూలంగా నిధి రహస్యాన్ని తన శాసనాన్ని ముందు తరాలకు భద్రంచేయించడం జరిగింది" ఆపింది స్నిగ్ధ.

"వింటేనే బుర్ర గిర్రున తిరుగుతోంది. ఇన్ని విషయాలు నీకు ఎలా గుర్తున్నాయక్కా. నాకిప్పుడు విషయం పూర్తిగా అర్థమైంది. వీటిని జాగ్రత్త పెట్టు" అంటూ పేపర్స్‌ని, తాళపత్రాల్ని అన్నీ సర్ది తిరిగి ఇచ్చింది కాంచన. వాటిని బ్యాగ్‌లో సర్ది ఎప్పటిలా జాగ్రత్తపరిచి వచ్చింది స్నిగ్ధ.

"అక్కా, ఒకవేళ ఈ విషయం తెలిసి ప్రభుత్వం అడ్డుపడితే పరిస్థితి ఏమిటి?" చివరిగా తన అనుమానాన్ని బయటపెట్టింది కాంచన.

"ఈ ప్రశ్న నువ్వడుగుతావని తెలుసు. నాకు సెంట్రల్ ఆర్కియాలజీ డిపార్ట్ మెంట్ నుండి పర్మిషన్ ఉంది. నిధిగురించి, ఆలయాల గురించి పరిశోధించమని ఆర్డర్స్ ఉన్నాయి. కాబట్టి ఎవరి నుంచి అభ్యంతరాలు వచ్చినా ఎదుర్కోగలనన్న నమ్మకం నాకుంది" అంటూ వివరించింది స్నిగ్ధ.

అప్పటికి ఒంటిగంట కావచ్చింది సమయం "ఆకలవుతోంది భోంచేద్దాం. రిసెప్షన్‌కి ఫోన్ చేసి మీల్స్ పంపించమంటాను" అంటూ ఫోన్ అందుకోబోతున్న స్నిగ్ధను వారించింది కాంచన.

"అక్కా. ఆస్పత్రికెళ్ళిపోదాం. అందరం అక్కడే భోంచేయొచ్చు గదా!" అంది.

"ఓ.కె. కృతయుగ్‌కి ఫోన్ చేద్దాం" అంటూ తన సెల్ అందుకుని ఫోన్ చేసింది స్నిగ్ధ. క్షణం తర్వాత అవుటాఫ్ కవరేజ్ అని సమాధానం వచ్చింది. అర డజనుసార్లు ట్రై చేసినా అదే సమాధానం రావడంతో అనుమానించి ఆస్పత్రి నంబరుకు ఫోన్ చేసింది.

అటునుంచి డాక్టర్ దయానిధి గొంతు విన్పించింది. "సార్ నేను స్నిగ్ధను మాట్లాడుతున్నాను. ప్లీజ్ డాక్టర్. కృతయుగ్‌ని ఒకసారి ఫోన్ వద్దకు పిలుస్తారా?" రిక్వెస్ట్ చేసింది. "ఎక్కడున్నాడమ్మా ఆ పెద్దమనిషి?" ఎదురు ప్రశ్నించాడు

అటునుండి డాక్టర్. స్నిగ్ధ షాక్‌కి లోనైంది. "అదేమిటి డాక్టర్. తను రూమ్‌లో లేడా?" అంది.

"ఉంటేగదమ్మా పిలవటానికి... చేయి కదపకూడదని భద్రంగా గదిలో ఉంచితే, చెప్పా పెట్టకుండా ఉదయం ఎటో వెళ్ళిపోయినవాడు ఇంతవరకు తిరిగి రాలేదు. మాయలోడు. మొండివాడు. అసలు వస్తాడో రాడో తెలీదు. నువ్వేమో ఫోన్ చేసి అడుగుతున్నావ్.

ఇంతకీ నా ఆస్పత్రి బిల్లయినా వస్తుందా?" ఆయన మాటలు విన్పించడంలేదు స్నిగ్ధకి. ఉదయం వెళ్ళిన వాడు ఇంతవరకు ఆస్పత్రికి చేరుకోలేదంటే తమని హోటల్‌కి పంపించి తను దీవికి ప్రయాణమైవెళ్ళాడా! మాటమాత్రమైనా చెప్పకుండా!

"థాంక్యూ డాక్టర్. మీ బిల్లుకొచ్చిన ప్రమాదం ఏమీలేదు. సాయంత్రానికి పేషెంట్‌కూడా మీ ఆస్పత్రిలో ఉంటాడు. నేను గ్యారెంటీ. సీ యు" అంటూ భరోసా ఇచ్చి లైన్ కట్ చేసింది. చెవి ఒగ్గి డాక్టర్ మాటలు తనూ వింటూనే ఉంది కాంచన. కృతయుగ్ ఆస్పత్రిలో లేడని తెలీగానే ఆమె ముఖం పాలిపోయింది. కళ్ళలో కంగారు తొంగిచూసింది.

"ఏమాత్రం డౌటు లేదక్కా. తనూ దీవికి వెళ్ళుంటాడు. ఇప్పుడేం చేద్దాం?" అని అడిగింది గాభరాగా. "ఏం చేయగలం? వెయిట్ చేద్దాం వచ్చేవరకూ" అని అంది సెల్‌ఫోన్‌ను పక్కన పడేస్తూ స్నిగ్ధ.

"అక్కడ ఏం జరుగుతోందో ఏమిటో! నాకు ఒకటే టెన్షన్‌గా ఉంది. మనం కూడా వెళ్దాం"

"టూ లేట్. మనం అక్కడికి చేరుకునేలోపలే వాళ్ళు తిరుగు ప్రయాణంలో ఉంటారు. రానీ చూద్దాం. మనం ఈ లోపల భోజనం చేసేద్దాం"

"అది కాదక్కా..."

"ష్. చిన్న పిల్లలా మారాం చేయకు. ఇప్పుడు మనం వెళ్ళి చేయగలిగింది ఏమీ లేదు.

మనతో చెప్తే అడ్డం పడతామనే చెప్పకుండా వెళ్ళిపోయాడు. ఎంతయినా మీ వాళ్ళమీద అభిమానం గదా!"

"పో అక్కా, మా వాళ్ళు మంచివాళ్ళు కాదు. వాళ్ళమీద అభిమానం ఏమిటి?"

"ఇంతకుముందే అన్నావ్ గుర్తుందా? ఇక్కడ డాడీకి ఏమన్నా జరిగితే మమ్మీ ముఖం చూళ్ళేను అని. జరక్కుండా ఆపడానికే తను వెళ్ళాడు. కంగారుపడకు.

అసలు అంతా సవ్యంగా జరిగితే మేమిద్దరం నిన్ననే దీవి మీదకు వెళ్ళుండేవాళ్ళం. మధ్యలో చింటూభాయి రాకతో అంతా తారుమారైపోయింది.

ఓ.కె. మనం భోంచేసేద్దాం" అంటూ మీల్స్ ఆర్డర్ చేయటానికి లాండ్‌లైన్ రిసీవర్ అందుకుంది స్నిగ్ధ.

*　*　*　*　*

"ఫ్లయింగ్ బర్డ్" అనే ఫోర్‌సీటర్ స్పీడ్ బోటు నది మీద నిజంగానే ఎగురుతోందా అన్నట్లు ఫుల్ స్పీడ్‌లో దూసుకుపోతోంది.

ప్రశాంతంగా స్టీరింగ్ వెనక కూచున్నాడేగాని కృతయుగ్ మనసంతా గజిబిజిగాను, అల్లకల్లోలంగానూ ఉంది. ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోతోంది. తను దీవికి చేరుకునేలోపలే ఘోరం జరిగిపోవచ్చున్న సందేహం కూడా పీడిస్తోంది.

ఇప్పుడు వీళ్ళంతా అక్కడికి ఎందుకు వెళ్తున్నట్టు? ఏం సాధించాలని? ప్రమాదమని తెలిసికూడా అన్నారావు ఎందుకీ నిర్ణయం తీసుకున్నాడు.

కనీసం అనంతస్వామికైనా తెలీదా? స్థానబలిమితో అప్రమత్తంగా నిధికి కావలి ఉంటున్న నాగశక్తుల్ని తను ఆపగలడా! అవి విజృంభిస్తే ఏ మేరకు వాటిని అదుపుచేయగలడు?

అన్నీ సమాధానం దొరకని ప్రశ్నలే. అతడి ఆలోచనలతో సంబంధం లేనట్టు నీటిమీద దూసూకుపోతోంది బోటు. 'హలో! నువ్విలా చేయడం నీకే బాగుందా?' ఉన్నట్టుండి తన అంతరాత్మ ప్రశ్నించడంతో ఉలిక్కిపడ్డాడు కృతయుగ్.

'నువ్వు దేనిగురించి అడుగుతున్నావ్' తనను తానే ప్రశ్నించుకున్నాడు కృతయుగ్.

'అన్నారావు వర్గం గురించి ఆందోళనపడుతున్నావ్. బాగానే ఉంది. కాని నిన్నే నమ్ముకున్న యువతులిద్దరికీ మాటమాత్రం కూడా చెప్పకుండా ఈ ప్రయాణం పెట్టుకున్నావ్. వాళ్ళు నిన్ను క్షమిస్తారా?' నిలదీసింది అంతరాత్మ. 'క్షమిస్తారో లేదో తర్వాత సంగతి. చెప్తే నన్ను రానిస్తారా? తామూ నాతో వస్తానంటారు.

మత్తుమందు ప్రభావంతో ఇద్దరూ బలహీనంగా ఉన్నారు. తీసుకొచ్చి వాళ్ళతో అవస్థపడ్డంతప్ప ఏమాత్రం ప్రయోజనం ఉండదని అలా వాళ్ళని హోటల్‌కి పంపించి నేనిటు వచ్చాను.

'సమర్ధించుకోకు. చెప్పకుండా రావడం నీ తప్పే. పైగా చేయి కదపకూడదని డాక్టర్ దయానిధి స్ట్రిక్ట్‌గా చెప్పినా పట్టించుకోకుండా ఆస్పత్రి నుండి పారిపోయి వచ్చావ్. ఇప్పుడు చూడు నీ చేయి పరిస్థితి...

తప్పుతుందా... అనుభవించు, అంటూ వెక్కిరిస్తున్న అంతరాత్మ గొంతు నొక్కేసి తన భుజం కట్టు వంక చూసుకున్నాడు.

నెత్తుటి చెమరింపుతో కట్టు ఎర్రబారింది. తను బోటుని కంట్రోల్ చేయడానికి చేతులు ఉపయోగించక తప్పదు. మరి గాయం రేగటంలో ఆశ్చర్యం ఏముంది? పళ్ళబిగువున బాధను భరిస్తూ స్పీడ్‌గా బోటును దూకిస్తున్నాడు కృతయుగ్.

నదిమీద ఒక మలుపు తిరగ్గానే దూరంగా నది మధ్యలో దృష్టిపథంలోకి వచ్చింది అందర్నీ భయభ్రాంతుల్ని చేసే మృత్యుదీవి.

* * * * *

ఆకాశం మబ్బులు పట్టి సూర్యుడు అదృశ్యమయ్యాడు. మానవుల్లో ఊరించే లాలసలాగే తీరాన కట్టివున్న పడవ కూడా అలల తాకిడికి ఊగిసలాడుతూ గింజుకుంటోంది.

పిల్లకోతులు కొన్ని గట్టునుంచి పడవలోకి పడవ నుంచి గట్టుమీదకి దూకుతూ ఆడుకుంటున్నాయి.

తీరంమీద ఏపుగా పెరిగిన విప్పచెట్టు కొమ్మమీద తీరిగ్గా కూచునుంది పెద్ద మగ కొండముచ్చు కోతి ఒకటి. అది దోరపండిన తియ్యని విప్పపూలు కొసరి కొసరి కోసుకుతింటోంది. పక్క కొమ్మల వెంట మరో మూడు ఆడకోతులున్నాయి.

ఆకాశం మబ్బులు పట్టి చల్లటి ఈదురుగాలులు వీస్తున్నాయి. అంతకు ముందే అక్కడ వర్షంపడి ఆగింది. వాతావరణం చల్లబడి ఆహ్లాదభరితం కావడంతో వృక్షశాఖలమీద పక్షులు ఆనందంగా కిలకిలారావాలు ఆలపిస్తున్నాయి.

పై కొమ్మమీది కాకి ఒకటి కుప్పించి గాల్లోకి లేవడంతో ఆకులవెంట చినుకులు రాలి ముఖంమీద పడగా, అసలే నల్లగా వికారంగా ఉండే తన

ముఖాన్ని తుడుచుకుంటూ చెవులు రిక్కించింది మగకోతి. గాలివాటున నది దిగువనుంచి డగడగమంటూ వినవస్తోంది మోటారు ఇంజను శబ్దం ఒకటి.

కొమ్మపైనుండి లేచి కళ్ళు చికిలించి చూడగా ఏదో ఇంజను పడవ వేగంగా దీవివైపు వస్తూ కనిపించింది. పడవలో అనేకమంది కన్పిస్తున్నారు.

ఆ పడవను చూస్తూనే– "హూప్" అనరిచింది బిగ్గరగా. బదులుగా పక్కన ఎక్కడి నుంచో "హూప్" అంటూ మరోకోతి బదులిచ్చింది.

ఆటవికులు ఒకరినుంచి ఒకరు సంకేతాలు అందించుకున్న మాదిరిగా కోతులు కొమ్మల్ని ఊపేస్తూ ఒక దాన్నొకటి హెచ్చరించుకోవడంతో అనేక శంఖాలు ఒక్కసారిగా పూరిస్తున్నట్టు దీవి కోతుల అరుపులతో మారుమోగుతూ ఒక విధమైన భీతిని సృష్టిస్తున్నాయి. తీరంలో పడవమీదకు దూకుతూ అంతవరకు ఆడుకుంటున్న కోతిపిల్లలు ఒక్కసారిగా ఆట ఆపేసి చెట్టు కొమ్మలమీది తల్లికోతులవైపు గాభరాగా పరుగుతీశాయి.

ఆ పడవలో వస్తున్నది అన్నారావు బృందం. దూరం నుంచే వాళ్ళంతా ఆ దీవిని నదిపరిసరాల్ని జాగ్రత్తగా గమనిస్తూవస్తున్నారు. పైన వ్యాపించిన మబ్బులు సూర్యుడ్ని తమలో దాచేసుకుని ఉజ్జయినీ దిశగా ఉత్తరంగా సాగిపోతున్నాయి.

గాలిలో తేమనుబట్టి ఆ పరిసరాల్లో వర్షం పడిందని గ్రహించారు. పడవ దీవిని సమీపించేకొద్దీ ఎవరికి వారే ఊపిరి బిగబట్టి దీవిని చూస్తున్నారు. దీవి పైనుంచి కోతుల అరుపులు గాలివాటున చెవులకి సోకుతున్నాయి. తీరంలో ఓ నాటుపడవ నీటిమీద ఊగుతోంది.

నీటిమట్టంనుంచి సుమారు పదడుగుల ఎత్తుపైగా ఉండి చాలాదూరం వ్యాపించిన ఎత్తయిన వృక్షాలు, తరులతలతో కూడిన ఆ దీవిని చూస్తుంటేనే ఒకవిధమైన జంకు గుండెల్ని ఆవహిస్తున్నట్టుంది.

కనుచూపుమేర నదిలో ఎక్కడా మరో పడవగాని మనిషి జాడగాని లేదు.

జాలర్ల పడవలు కూడా దీవి పరిసరజలాల్లోకి చేపల వేటకు రావని అర్థమవుతోంది.

అటూ ఇటూ తీరం వెంట దట్టమైన అడవులు నది మీదకు వాలిపోయిన చెట్లు, పొదలు దూరంగా కొండ గుట్టలు కనువిందు చేసే దృశ్యాలయినా ఆ ఏకాంతం ఎంతటివారినైనా బెదరగొట్టి భీతిని కలిగించేదిగా ఉంది. అనుచరులంతా చేష్టలు దక్కి చూడ్డం తప్ప గొంతువిప్పి మాట్లాడిన వారు లేరు.

అన్నారావు, మహీధర్‌లు కూడా మౌనంగా ఉండిపోయి చూస్తున్నారు. అంతులేని సంపదను తనలో దాచుకున్న ఆ దీవిని చూస్తుంటే ఆనందమే కాదు, భయాందోళనలూ కలుగుతున్నాయి.

తీరం ఇంకో రెండువందల గజాలదూరం ఉందనగా పడవ ఇంజను ఆపేసి గెడ అందుకున్నాడు కళాసీ. గెడసాయంతో పడవ వేగాన్ని నియంత్రిస్తూ జాగ్రత్తగా తీరం పట్టించాడు.

"మనకన్నా ముందే ఎవరో ఈ పడవలో వచ్చి దీవిమీదకెళ్ళినట్టున్నారు" పక్కన నీటిమీద ఊగుతున్న పడవను చూస్తూ అన్నాడు పీటరు.

''ఎవరొస్తారు? మన బసవడు వాళ్ళు వచ్చిన పడవ ఇదే అయివుంటుంది." అన్నాడు మహీధర్.

నిజం కూడా అదే. ఆ మాట వింటూనే గుండెల్లో రాయిపడినట్టు ఉలిక్కిపడ్డారంతా. బోరవిరుచుకుని ఎనుబోతులా తిరిగే బసవడి రూపం అందరి కళ్ళముందూ మెదిలింది. వాడే తిరిగిరాలేదంటే తమ పరిస్థితి ఏమిటి? ఎవడికి వాడే మనసులోనే మథనపడి పోసాగారు. అయినా స్వామికార్యంగాబట్టి తప్పదు.

లేని ధైర్యాన్నయినా కూడగట్టుకొని ముందుకు సాగాలి. అయితే హుషారుగా లేచి తీరంలో కాలుపెట్టడానికి ఒక్కడికీ తెగింపు రాక కదలక, మెదలక వాళ్ళు కూచునే ఉన్నారు. ముందుగా అనంతస్వామి లేచి నిలబడ్డాడు. ఆయన భుజానికి ఓ గుడ్డసంచి వేలాడుతోంది. అందులో మంత్రించిన అక్షింతలు, ఒక వెండిబెత్తం ఉన్నాయి. చిటికెనవేలు లావున రెండడుగుల పొడవుందది.

"పడవ దిగేముందు మీరు నా హెచ్చరికలు రెండు వినాలి. ఎక్కడివాళ్ళక్కడే ఓ నిముషం ఉండండి" అన్నాడు. ఆయన హెచ్చరిక వినటానికి– అంతా కుతూహలంగా చూశారు అనంతస్వామి వంక.

"మనం దీవిమీద కాలుపెట్టబోయే ముందు నా మొదటి హెచ్చరిక– ఏ క్షణంలో, ఏ రూపంలోనయినా ప్రమాదం ముంచుకురావచ్చు. నేను ముందుంటాను గాబట్టి మీరు భయపడాల్సిన పనిలేదు.

అయినాకూడా చెప్తున్నాను– మీలో భయస్తులు, పిరికివాళ్ళు ఎవరన్నా ఉంటే, మమ్మల్ని అనుసరించే సాహసం లేకపోతే– ఇక్కడే ఆగిపోండి. మేం తిరిగొచ్చేవరకు పడవలోనే ఉండండి.

ఇక నా రెండో హెచ్చరిక– ప్రమాదమంటూ వస్తే అది నన్ను దాటి మీమీదకు రావాలి. ఎందుకంటే అందరికన్నా ముందు నేను నడుస్తుంటాను. మీరంతా వరసగా నా వెనుకే ఫాలో అవ్వాలి.

పొరపాటున కూడా అటూఇటూ వెళ్ళకూడదు. ఒంటరిగా అస్సలు వెళ్ళకూడదు. ఎలాంటి బీభత్సదృశ్యం కంటపడ్డా ధైర్యాన్ని కోల్పోకూడదు. నేనున్నానన్న నమ్మకంతో నా వెనకే ఉండాలిగాని నన్ను దాటి ముందుకెళ్తే ప్రమాదంలో పడతారు.

ఈ మాటల్ని అర్థం చేసుకుని పాటిస్తే మీకే భయంలేదు. కొంచెం ఏమరుపాటుగా ఉన్నా ప్రాణాలకు గ్యారంటీ లేని ప్రదేశమిది. మర్చిపోవద్దు. ఇక మీరంతా ఎంతోకాలంగా అన్నారావుని నమ్ముకొనివున్నారు. మిమ్మల్ని తను ఎంత బాగా చూసుకుంటాడో మీకు తెలుసు. లభించిన నిధుల్లో మీ వంతు వాటా ఇవ్వటానికి తను ఎప్పుడూ వెనుకాడలేదు.

అలాగే ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకున్నవారి కుటుంబాలు వీధినపడకుండా వారిని ఆదుకోవడంలోనూ తను ముందుంటాడు.

కాబట్టి ఇది అతనొక్కడి పనికాదు. మనందరి పని, బాధ్యతా. నిధిని సాధించాలనే పట్టుదల. కాబట్టి ఇవి దృష్టిలో ఉంచుకుని మా వెంట రండి" అంటూ అందర్నీ హెచ్చరించాక ముందుగా పడవ దిగి తీరం మీద కాలుపెట్టాడు అనంతస్వామి.

ఆయన మాటలు సత్యాలన్న సంగతి అనుచరులందరికీ తెలుసు. తాము దేశం మీద పడి ఎక్కడ తిరుగుతున్నా ఈ రోజు ఇంటిదగ్గర భార్యాపిల్లలు సుఖంగా ఆర్థిక ఇబ్బందులు ఏమీ లేకుండా నిశ్చింతగా జీవిస్తున్నారంటే అన్నారావు కారణం. ఈ విషయంలో వంకపెట్టడానికి లేదు.

ఆయనకోసం అవసరమైతే ప్రాణాలివ్వడానికైనా సిద్ధమే. కాని చెప్పకుండా వచ్చే చావు విషయంలో భయం ఉండదు. చెప్పి వచ్చే చావుతోనే ఉన్న సమస్య అంతా. దీవిమీద కాలు పెడితే చస్తారని తెలిసీ అడుగు పెట్టాలంటే ఎంతధైర్యవంతులకయినా బెదురు, భయం సహజం. అనుచరులు కొందరిలో ఈ భయం ఉంది. కాని ఎవరూ వెనుకంజవేసే అవకాశం లేదు.

ఆగిపోతే మిగిలినవాళ్ళు తమను చూసి నవ్వుతారు. పిరికివాడని ముద్ర వేయించుకోవాలి. కాబట్టి పడవలోనే ఆగిపోదామనే ఆలోచన ఎవడికీ కలగలేదు.

అనంతస్వామి వెనకే అన్నారావు మహీధర్‌లు పడవ దిగారు. తర్వాత పీటర్‌తో సహా అంతా ఒకరి తర్వాత ఒకరు తీరంమీద కాలుపెట్టారు.

"అయ్యా! మీరంతా పొద్దు గుంకకముందే వచ్చేయాలి. ఇక్కడే నదిలో తిరుగుతుంటాను. చీకటిపడితే వెనక్కి వెళ్ళిపోతుంది పడవ" అంటూ కళాసీ అందర్నీ హెచ్చరించాడు.

"నువ్వేం కంగారుపడకు. ఈలోపలే వచ్చేస్తాం" అంటూ హామీ ఇచ్చాడు అన్నారావు.

'వస్తారో అక్కడే ఉసురుతీసుకుంటారో ఎవరికెరుక' అంటూ తనలో తనే గొణుక్కుంటూ పడవను నీటి వాలున వెనక్కి వదిలేసి దీవికి దూరంగా తీసుకుపోయాడు కళాసీ. అనంతస్వామి తన భుజాన వేలాడుతున్న సంచిలోంచి గుప్పెడు అక్షింతలు తీసి చుట్టూ చల్లాడు. వెండిబెత్తాన్ని చేత్తో పట్టుకుని అడుగులు ముందుకు సారించాడు.

వర్షానికి తడిసిన మట్టిమీద అడుగులు జారకుండా జాగ్రత్తగా స్లోపు వెంట పైకి ఎక్కి దీవి అంచున నిలబడ్డాడు. ఆయన వెనక ఒకరిచేయి ఒకరు పట్టుకుని అంతా పైకి వచ్చారు. ఆకాశంలో వానమబ్బులు అలాగే ఉన్నాయి. చినుకు చినుకు చిరుజల్లుగా రాలుతున్నాయి. ఆగి ఆగి ఈదురుగాలులు వీస్తున్నాయి.

దీవిమీద అంతకుముందువరకూ గోలచేసిన కోతులు ఒక్కసారిగా నిశ్శబ్దం అయిపోయాయి. వాటి జాడకూడా తీరంలో కన్పించడంలేదు.

"నేను చెప్పిన మాటలు అందరికీ గుర్తున్నాయి గదా?" వాళ్ళందర్నీ కలియజూస్తూ అడిగాడు అనంతస్వామి. "మరోసారి కూడా గుర్తుచేస్తున్నాను. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి.

నేను చల్లే అక్షింతలు మనకు శ్రీరామరక్షలాంటివి. మనం వెళ్తున్న దారిలోకి ఏ దుష్టశక్తులూ అడుగు పెట్టలేవు. మనం వెళ్తున్నదారిలోనే వెనక్కి రావల్సి వుంటుంది. కాబట్టి దారి గుర్తుపెట్టుకోండి.

అతిప్రమాదకరమైన దీవిలో మనం ఉన్నామని మర్చిపోవద్దు. ఇక్కడి ఆనుపానులు చూసి వెళ్ళడం కోసం మనం వచ్చాంగాని ప్రాణాలు పోగొట్టుకోడానిక్కాదు. ఇక్కడి కావలి శక్తులు ఎన్నో కూడా తెలీదు. అందుకే హెచ్చరిస్తున్నాను. ఎలాంటి పరిస్థితిలోనూ భయపడి పారిపోయే ప్రయత్నం చేయవద్దు. నా వెనక ఉన్నంత వరకు మీకే ప్రమాదం రాదు. రండి" అంటూ దీవి మీదకు దారితీశాడు అనంతస్వామి.

ఎందుకయినా మంచిదని అన్నారావు, పీటర్‌ని అందరికన్నా చివర ఉంచి ఎవడూ లైను తప్పి వెళ్ళకుండా చూసుకోమని హెచ్చరించాడు.

దారి పొడవునా అక్షింతలు చల్లుకుంటూ అనంతస్వామి ముందు నడుస్తూండగా వరసగా ఆయన్ని అనుసరించసాగారంతా.

ఈ ఊరేగింపు ఎందుకో అర్థంగాక వృక్షశాఖల మీది ఉడతలు, తొండలు, పక్షిజాతులు ఉత్కంఠభరితంగా వాళ్ళని చూస్తున్నాయి.

మనుషుల్ని చూడగానే "కాఁవ్" మని అరిచే కాకుల క్కూడా గొంతు పెగలడంలేదు. దీవి అంతటా నిశ్శబ్దం రాజ్యంచేస్తోంది.

ఇక్కడ ఎవరి భయాలు వారివి. ఎవరి కంగారు వాళ్ళది. అంతటి మహామంత్రవాది అనంతస్వామిలో కూడా భయం ఉంది. కాని ఆ భయం తన గురించి కాదు.

తననునమ్మి ఇంతమంది వెంట వస్తున్నారు. వాళ్ళందర్నీ తిరిగి సురక్షితంగా దీవి దాటించగలనా అనేది ఆయన భయం.

ఎందుకంటే దీవిమీద వేస్తున్న మొదటి అడుగులివి. ఇక్కడి పరిస్థితులు పూర్తిగా తనకీ తెలీదు. అసలు ఎన్ని శక్తులిక్కడ కాపలా ఉన్నాయో ఎంత లోతులో నిధి ఉందో తెలీని పరిస్థితి.

ధ్యానంలో కూడా నిధి తన కంటపడకుండా అడ్డుకుంటున్న మహాశక్తి ఏదో ఇక్కడ ఉంది. అదేమిటో తెలుసుకునే ప్రయత్నమే ఇది.

అతిజాగ్రత్తలు కూడా ఒక్కోసారి మనిషిలోని భయాన్ని ద్విగుణీకృతం చేస్తాయి.

సడెన్‌గా ఎదురయ్యే విపత్తుకు భయపడ్డం వేరు, ఏదో ప్రమాదం ఉందని ముందే తెలిసి భయపడుతూ ముందుకు సాగటం వేరు. ఒక మనిషి నడిచిపోతూండగా సడెన్‌గా పులి ఎదురుపడితే ప్రాణాలు కాపాడుకోవాలి కాబట్టి తృటిలో భయాన్ని వదిలి తెగించి పులితో పోరాటమో లేదా పరుగెత్తి చెట్టెక్కడమో చేస్తాడు. అప్పటికప్పుడు కలిగే భయం తాత్కాలికం.

అదే దారిలో పులి ఉందని తెలిసి కూడా తప్పని సరై నడిచే మనిషి పులి వస్తుందో లేదోగాని అడుగడుగునా భయపడుతూనే వుంటాడు.

తీరా పులి ఎదురుపడేసరికి అతడిలో భయం పరాకాష్ఠకి చేరి అవయవాలు అచేతనమై పులికి బలయిపోతాడు.

మరి అనంతస్వామి తెలిసే చేశాడో తెలీక చేశాడో గాని అనుచరుల్ని అతిగా హెచ్చరించి తప్పుచేశాడనుకోవాలి. ఆపైన గతదినం పింగళి నాగశక్తి ఉగ్రరూపాన్ని స్వయంగా వీక్షించారంతా.

కాబట్టి దీవివరకు ధైర్యంగానే వచ్చినా దీవిమీద కాలుపెట్టాక ఉన్న కొద్దిపాటి ధైర్యం కూడా ఆవిరైపోగా అనుచరులంతా బలిపశువుల్లా అనంత స్వామిని మౌనంగా అనుసరిస్తున్నారు.

అంతటి చలిలో కూడా వాళ్ళకి చెమటలు పోస్తున్నాయి. అడుగులు తడబడుతున్నాయి. గుండెలు పీచుపీచుమని కొట్టుకుంటున్నాయి. సమీపంలో చిన్నచప్పుడైనా ఉలిక్కిపడుతున్నారు.

వాళ్ళు ఎంత భయాందోళనలో ఉన్నారంటే ఆ భయంలో వృక్షశాఖల వెంట మిగలపండిన మామిడి, సపోటా, జామలాంటి ఫలాలుగాని, సువాసనలు వెదజల్లుతున్న పనసపండ్లు గాని ఇప్పుడు వాళ్ళని ఆకర్షించలేకపోతున్నాయి. వాళ్ళలో ఏ వికారమూ లేకుండా నడుస్తోంది అన్నారావు, మహీధర్, పీటర్‌లు మాత్రమే.

క్రమంగా అందరూ–దీవి మధ్యకు చేరువవుతున్నారు. ఆలయం తాలూకు శిథిలాలు అక్కడా ఇక్కడా కన్పిస్తున్నాయి. చిరుత పులిని పోలిన అడవి పిల్లి ఒకటి సడెన్‌గా వచ్చి అనంతస్వామి ఎదురుగా నిలబడింది. అది క్రూరంగా చూస్తోంది. దాని కళ్ళు జ్యోతుల్లా ప్రకాశిస్తున్నాయి. అనంతస్వామి మీదకు దూకటానికి అది సిద్ధంగా ఉందనిపించింది. అయినా నడక ఆపలేదు అనంతస్వామి.

వెంట నడుస్తున్న వాళ్ళకి మాత్రం గుండెలు ఝల్లుమన్నాయి పిల్లిని చూడగానే. అనంతస్వామి గుప్పెడు అక్షింతలు పిల్లిమీదకు చల్లాడు. అంతే! పిల్లి శరీరాన్ని తాకగానే చిటపటలాడుతూ పేలాలు పేలినట్టు పేలాయి అక్షింతలు.

బాధతో దారుణంగా అరుస్తూ ఎగిరెగిరి దూకి పొదలమాటున అదృశ్యమైంది పిల్లి. ఏవో శక్తులు జంతువుల్ని ప్రేరేపిస్తున్నాయని అనంతస్వామి గ్రహించాడు. మరో పదడుగులు వెళ్ళే లోపల మరో సంఘటన జరిగింది. ఆకాశంలో పెద్ద మెరుపు మెరిసింది.

ఆకాశం బీటలుతీసి ముక్కలై విరిగి పడుతోందా అన్నంతగా తటిల్లత అంబరాన తీగలుసాగింది.

కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. ఏటి అవతల అడవిలో పిడుగుపడింది. పిడుగు శబ్దంతో దిక్కులు ప్రతిధ్వనించాయి. గుండెలు చిక్కబట్టుకొని ఎక్కడి వాళ్ళక్కడ ఆగిపోయారు.

సరిగ్గా ఇదే సమయంలో– పక్కన అశ్వత్థవృక్షం శాఖలనుంచి నల్లగా ఏదో గిరికీలు కొడుతూ వచ్చి దబ్బున శబ్దం చేస్తూ వాళ్ళ మధ్యలో పడింది... అంతే. కెవ్వున అరిచారు కొందరు. పడింది ఏమిటో కూడా చూళ్ళేదు కొందరు.

ప్రాణభయంతో గిరుక్కున వెనుతిరిగి పరుగుతీశారు. చిన్నపాటి గందరగోళం.

ఈ గొడవ మధ్య తీరిగ్గా పైకిలేచిన నల్లని ఎలుగ్గొడ్డు కంగారుపడిపోతూ వేగంగా పొదల్లోకి పరుగుతీసింది. ఏటవతల అడవిలోంచి అప్పుడప్పుడూ ఎలుగ్గొడ్లు ఏటిలో ఈదుకొంటూ దీవిమీదికొస్తాయి. చెట్లకొమ్మల పైకెక్కి తేనెతుట్టెలో తేనె తాగేస్తూంటాయి.

ఎప్పటిలాగే అశ్వత్థవృక్ష శాఖల్లోని తేనెతుట్టలో తేనె జుర్రుకుంటూండగా పిడుగు శబ్దానికి భయమొంది పట్టు తప్పివుంటుంది. జారి కిందపడి అందరినీ భయభ్రాంతుల్ని చేసింది. అనంతస్వామి, అన్నారావులు పెద్దగా అరిచి పారిపోతున్న వాళ్ళని వెనక్కి పిలవాల్సి వచ్చింది. "మీకు ముందే చెప్పాను. ఏం జరిగినా నా వెనకే ఉండండి, మీకు భయంలేదని. ఎందుకు పారిపోతున్నారు?

ఇంత భయపడే వాళ్ళు మాతో రావడం దేనికి? పడవలోనే ఉండి పోవచ్చుగా. ఇకనయినా భయాన్ని వదలండి" అంటూ అనుచరులందరినీ చాలా సున్నితంగా మందలించాడు అనంతస్వామి. "నీకేం స్వామీ. ఎన్నయినా చెప్తావు. ఇక్కడ మాకు చెడ్డీలు తడిసిపోతున్నాయి." చివరగా వున్న పీటర్‌తో గొణిగాడు ఒకడు.

"భయంతోనే చచ్చేలా ఉన్నాంరాబాబు. టెన్షన్ భరించలేం" మరొకడు గొణిగాడు. మొత్తానికి మూడు నిముషాల తర్వాతగాని పరిస్థితి సాధారణస్థితికి రాలేదు. షాక్‌నుంచి అంతా బయటపడి సర్దుకున్నారు. తిరిగి నడక మొదలైంది. ఆలయ శిథిలాల్లో ప్రవేశించాడు అనంతస్వామి. అక్షింతలు చల్లుతూనే వున్నాడు. తోకలా ఆయన్ని అనుసరిస్తూనే వున్నారంతా.

ఆలయ ప్రాంతమంతా విరిగిన శిల్పాలు, స్తంభాలు, రాళ్ళు, బండలు అక్కడక్కడాపడున్నాయి. గుడి పునాదులుకూడా కొన్నిచోట్ల మూసుకుపోయాయి. ఎటు చూసినా పిచ్చిమొక్కలు, పొదలు, చెట్లు పెరిగిపోయాయి.

ఆ కాలంలోనే ఎప్పుడో గుడిని పునాదులవరకూ సర్వనాశనం చేసుండవచ్చు. కాని గర్భగుడి ప్రాంతాన్ని, ఆవరణను, నాలుగుదిక్కులా గోపురాలు, బయట ప్రహరీ, పునాదుల్ని పరిశీలించాక ఆదివిష్ణు ఆలయం భారీ నిర్మాణమని పెద్దగుడి అయివుంటుందని ఊహించారు. సుమారు ఫర్లాంగు చతురస్రంలో ఆలయ నిర్మాణం జరిగివుంటుందనిపించింది.

అయితే నిర్జనమైన ఈ దీవిలో శిధిలాలయ ప్రాంతంలో ఆ కాలం వాళ్ళు నిధిని ఎక్కడ దాచినట్టు? ఈ విషయంలో స్నిగ్ధకు తెలిసిన చాలా వివరాలు అన్నారావు వర్గానికి తెలియదు గాబట్టి నిధి ఉన్న ప్రదేశాన్ని కనిపెట్టడానికి తాంత్రికవిద్యను ఆశ్రయించాడు అనంతస్వామి.

సంచిలోంచి పసుపు పూసిన దారంముక్క తీశాడు. దాన్ని వెండిబెత్తం మధ్యలో కట్టాడు. దారానికి అటూ ఇటూ సమంగా వేలాడింది వెండిబెత్తం.

దానికి ఒక చివర మైనస్ గుర్తు రెండో చివర ప్లస్ గుర్తు ఉన్నాయి. అది దారానికి వేలాడుతూ గిరగిరా తిరిగింది. అనంతస్వామి ఏవో మంత్రాల నుచ్చరించి వెండిబెత్తం మీద గాలి ఊదాడు.

విచిత్రంగా అది తిరగడం మాని– నిశ్చలంగా ఉండిపోయింది. మూడు సెకన్ల తర్వాత ప్లస్ గుర్తుగల భాగం దిక్సూచిలా కదిలి ఒక దిక్కుకు చూపించింది. అంటే నిధి అటుపక్కనుందని అర్థం. ఓ పక్క అనంతస్వామి తన పనిలో ఉండగా– అందరికన్నా ముందుగా అన్నారావుకి విన్పించింది ఒక మూలుగు శబ్దం.

చివ్వున తలెత్తి అందర్నీ చూశాడతడు. "ఎవడ్రా అది? ఎవడ్రా ఇప్పుడు మూలిగింది?" అనరిచాడు తన మనుషుల్ని చూస్తూ. ఒకరి ముఖాలొకరు చూసుకున్నారంతా. "లేదు సార్. మూలిగింది మేం కాదు" అని బదులిచ్చాడో అనుచరుడు.

"అవును సార్. అసలు అలాంటి శబ్దం కూడా మేం వినలేదు" అన్నాడు మరొకడు. "ఏమైంది?" నొసలు విరిచి వెనక్కి చూస్తూ అడిగాడు అనంతస్వామి.

"స్వామీ. నేను స్పష్టంగా విన్నాను. ఎవరో మూలిగిన శబ్దం" చెప్పాడు అన్నారావు.

"మూలుగు శబ్దమా!"

అనంతస్వామి కళ్ళువిశాలమయ్యాయి.

ఆయన అనుభవజ్ఞుడు. "అంతా కాస్సేపు నిశ్శబ్దంగా ఉండండి. తిరిగి వినబడుతుందేమో చూద్దాం" అని హెచ్చరించాడు.

ఒకటి... రెండు... మూడు నిముషాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి. సరిగ్గా నాలుగో నిముషంలో మరోసారి వినబడిందా మూలుగుశబ్దం.

సుమారు ముప్ఫై సెకన్లపాటు సుదీర్ఘంగా వినబడింది. అది భూమిలో నుంచి వినవస్తోంది. ఒక విధమైన ప్రతిధ్వనితో కూడిన గుండెల్ని పిండే విచిత్రమైన మూలుగు. ఆ గొంతును బట్టి ఆడా మగాని నిర్ధారించి చెప్పడం కష్టం.

"అదిగో స్వామీ... విన్నారా... ఆ మూలుగు ఏమిటో వినండి" అన్నాడు గాభరా చెందుతూ అన్నారావు.

అనంతస్వామి తల ఊపాడు. అదేమిటో ఆయనకి అర్ధమైంది. కాని ఇప్పటికే బెదిరిపోతున్న అనుచరులముందు ఆ విశేషం చెప్పాలా వద్దా తెలీక సందిగ్ధంలో ఉండిపోయాడు.

గుండెల్లో చేయిపట్టి కెలుకుతున్నంత వికారంగా, భూమిలోంచి మంత్ర స్వరంలో ఏదో నేలమాళిగనుంచి వస్తున్నట్టుందా మూలుగు.

అధికమైన ధనరాశులు భూమిలో నిక్షిప్తం చేయబడినప్పుడు ధనశక్తి లేదా ధనపిశాచి అనే శక్తి ఆ నిధులకు కావలిశక్తిగా ఆవిర్భవిస్తుంది. ఆ శక్తిని నెత్తుటితో తృప్తిపర్చకుండా ధనరాశిని స్వాధీనపర్చుకోలేరు.

అందుకే నిధులు దొరికిన సందర్భాల్లో కోడినో, మేకనో బలిచ్చిగాని నిధిని తాకరు. అలా చేయకుంటే తాకినవాళ్ళు నెత్తురు కక్కుకుని చస్తారు.

పూర్వకాలంలో ఎనుబోతుల్ని, కొన్ని సందర్భాల్లో నరబలికూడా సమర్పించేవాళ్ళు. చాలా శక్తివంతమైన ధనపిశాచి అది. "ఏమిటి స్వామీ ఆలోచిస్తారు. భూమిలోంచి వచ్చే ఆ శబ్దానికి అర్ధం ఏమిటి?" తొలిసారిగా అన్నారావు గొంతులో ఆందోళన తొంగిచూసింది.

"కంగారుపడకండి. ప్రస్తుతానికి దానివలన మన కొచ్చిన ప్రమాదం ఏదీలేదు. నిధికి కావలిశక్తి ఆకలితో చేస్తున్న మూలుగు అది. నిధిజోలికి వెళ్ళినప్పుడే ఆ శక్తితో చాలా ప్రమాదం, మీరు అనవసరంగా భయపడొద్దు. నా వెనకేరండి" అంటూ వాళ్ళు ఎవరూ భయపడకుండా తేలిగ్గా ఈ విషయాన్ని కొట్టిపారేస్తూ ముందుకు సాగాడు అనంతస్వామి.

ఆయన చేతిలో దారానికి వేలాడుతున్న వెండి బెత్తం క్రమంగా దీవి నైఋతిదిక్కును సూచించడం ఆరంభించింది. పశ్చిమగోపుర శిథిలాలను దాటి కొద్దిగా ఎడం వైపు తిరిగి జాగ్రత్తగా అడుగులు సారించాడు అనంతస్వామి. ఇంతలో మరో విచిత్రం అన్నారావు బృందం గుర్తించగలిగింది.

అదీ చివరిగా వస్తున్న పీటర్ మొదట గుర్తించి మిగిలినవాళ్ళకి సిగ్నల్స్ పాస్‌చేశాడు. అడవి మనుషులు నిశ్శబ్దంగా శత్రువుని ఫాలో అవుతున్నట్టు చప్పుడు గాకుండా కొమ్మల వెంట తమని అర్ధచంద్రాకారంలో ఫాలో చేసి వస్తున్నాయి అనేక కోతులు.

అసలే కొండముచ్చులు. కోతుల్లోనే బలిష్టమైనని. తారు పూసినట్టు నల్లటి వికృతమైన ముఖాలు.

దీనికి తగ్గట్టే అవి క్రూరంగా చూస్తూ పళ్ళికిలించి బెదిరిస్తుంటే తెల్లగా మెరిసే వాటి కోరపళ్ళు చూడగానే ఒక్కొక్కరికి పై ప్రాణాలు పైనే ఎగిరిపోతున్నంత పనైంది. మీద పడితే కండలు పీకేస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదనిపించింది.

ఏ క్షణంలోనయినా అవి మీదపడతాయన్న భయంతో బిక్కచచ్చిపోతూ అడుగులు తడబడ్డాయి అందరికీ. పరిసరాల్ని గమనించింది అనుచరులే కాదు, అన్నారావు, మహీధర్‌లూ గమనించారు.

కోతులు తమను రౌండప్ చేయబోతున్నాయని గ్రహించగానే ఒక్కొక్కడికి చెమటలు కారుతున్నాయి. ఇది చాలదన్నట్టు – వృక్షశాఖలో ఎత్తులో పట్టిన పెద్దపెద్ద తేనెతుట్టెల నుంచి ఝుంకారాలు సృష్టిస్తూ అడవి తేనెటీగల దండు గాల్లోకి లేచి వలయాకారంగా సుడి తిరగనారంభించాయి.

“స్వామీ... చూస్తుంటే మనం ఏదో తప్పించుకోలేని దిగ్బంధనంలోకి అడుగు పెడుతున్నట్టున్నాం. ఓసారి ఇటు చూడండి” అంటూ హెచ్చరించాడు అన్నారావు.

“అవి మనల్ని బెదిరిస్తాయి. భయపడకండి. మనల్ని ఏమీ చేయలేవు. గాభరాచెంది దారితప్పి పక్కలకు వెళ్తే అవి అటాక్ చేస్తాయి. నేను చల్లిన అక్షింతల బాటలోనే ఉండాలంతా.

నిధి వున్న ప్రదేశంలోకి అడుగు పెడుతున్నాం. నా వెనకే రండి” అంటూ ధైర్యం చెప్పాడు అనంతస్వామి.

అయితే ఆయన చెప్తున్నంత తేలిగ్గా లేదు అనుచరుల పరిస్థితి. అన్నారావు, మహీధరలే బేజారయిపోతున్నారు. ప్రాణాలమీద ఆశ వదులుకోక తప్పదని పిస్తోంది. అనంతస్వామి మీద నమ్మకం ఏమూలనో అందరికీ ధైర్యాన్ని నింపుతోంది.

మరికొంత దూరం ముందుకు నడిచాడు అనంతస్వామి. ఆయన చేతిలో దారానికివేలాడుతున్న వెండి బెత్తం ప్లస్‌గుర్తున్న భాగం క్రమంగా నిధిని సూచిస్తూ

నిటారుగా నేలకు వంగింది. అది చూడగానే అనంతస్వామి ముఖం వికసించింది. వెండిబెత్తాన్ని చేతిలోకి తీసుకుని అన్నారావు వంక ఉత్సాహంగా చూశాడు.

"నిధి ఉన్న చోటు తెలిసిపోయింది. మనమిప్పుడు సరిగ్గా నిధి ఉన్నచోటే నిలబడున్నాం." అన్నాడు.

ఆయన మాటల్లో ఉత్సాహం మిగిలినవాళ్ళలో కన్పించలేదు. ఎక్కడి వాళ్ళక్కడ భయంతో బిగిసిపోయి చూస్తున్నారు. అనంతస్వామి గమనించలేదుగాని అక్కడ పొదల వెంట తలో పక్కనా నాలుగు అస్థిపంజరాలు కన్పిస్తున్నాయి. వాటిని చూడగానే పై ప్రాణాలు ఎగిరిపోయినంత పనయింది అందరికీ.

ఎక్కడి వాళ్ళక్కడ స్థాణువుల్లా నిలబడిపోయి భయాందోళనలతో చూస్తున్నారు. ఆ అస్థిపంజరాలు నాలుగూ తమ అనుచరులవేనని అర్థమై పోయింది. ఇవేమీ గమనించని అనంతస్వామి–

"ఏమిటి దయ్యం పట్టినట్టు అలా చూస్తున్నారు. నా మాటలు విన్పించడం లేదా?" అనడిగాడు.

నోటితో బదులు చెప్పలేకపోయాడు అన్నారావు. చేయెత్తి అస్థిపంజరాల్ని చూపించాడు.

అనంతస్వామి తలతిప్పి అటు చూడబోయాడు.

సరిగ్గా అప్పుడు... ఎవరూ ఊహించని మరో సంఘటన జరిగింది. అంతవరకూ ఎక్కడ ఉందోగాని కన్నుమూసి తెరిచేలోగా పక్క పొదమీదుగా ఎగిరి అనంతస్వామి పైకి లంఘించింది ఒక భల్లూకం.

ఇంతకు ముందు తమను భయపెట్టిన భల్లూకం అదే. క్షణం ఆలస్యమైతే అనంతస్వామి గొంతుపట్టేసేదే. అతి వాడిగా వున్న తన గోళ్ళతో ఆయన ఛాతీని చీల్చేసేదే. చివరిక్షణంలో గమనించిన అనంతస్వామి తన చేతిలోని వెండి బెత్తంతో తలమీద ఒకటిచ్చాడు. ఆ విసురుకు అనంతస్వామి కిందపడిపోయాడు.

భల్లూకం పెడబొబ్బలు పెడుతూ అవతలకు దూకింది. నల్లని దాని బొచ్చునుండి కాలిపోతున్నట్టు పొగలు వెలువడ్డాయి.

దారుణంగా బాధతో రంకెలేసింది భల్లూకం. అక్కడ్నుంచి నేరుగా దీవి అంచుకు పరుగెత్తి కుప్పించి నదిలోకి దూకేసింది. తర్వాత ఇక దాని జాడలేదు.

అన్నారావు ధైర్యం తెచ్చుకుని కిందపడిన అనంతస్వామికి చేయి అందించి పైకి లేపాడు.

ఈలోపల మరో సంఘటన చోటుచేసుకుంది. కొంచెం దూరంలో అస్థిపంజరం పక్కన ఎర్రరంగులో మెరుస్తూ సెల్‌ఫోన్ కన్పించింది.

అది మరణించిన బసవడి తాలూకు సెల్‌ఫోన్.

దాన్ని చూడగానే మహీధర్ వెనక నిలబడిన అనుచరుడు అత్యుత్సాహంతో ముందువెనకలు ఆలోచించకుండా అనంతస్వామిని దాటి ముందుకెళ్ళి సెల్‌ఫోన్ అందుకున్నాడు.

"రేయ్ మూర్ఖా! ఏం చేస్తున్నావ్‌రా, వెనక్కి రా" గాభరాతో పెద్దగా అరిచి పిలిచాడు అనంతస్వామి. కాని అప్పటికే ఆలస్యమైపోయింది.

ఎటునుంచి వచ్చిందో రివ్వున వచ్చి సెల్‌ఫోన్ అందుకుంటున్నవాడి ముందుకొచ్చి అంతెత్తున పడగవిప్పి లేచి నిలబడింది పింగళనాగం.

దాన్ని చూస్తూనే భయంతో కెవ్వున అరిచాడు వాడు. సెల్‌ఫోన్ అక్కడ పడేసి గిరుక్కున వెనుతిరిగాడు. తిరిగేతిరక్కముందే వాడిని కసికసిగా కాళ్ళమీద రెండుచోట్ల కాటువేసింది పింగళ నాగశక్తి.

దిక్కులు పిక్కటిల్లేలా బాధతో భయంకరంగా అరిచి విరుచుకుపడి పోయాడు వాడు.

వాడిని ఇవతలకు లాగాలని మహీధర్ రెండడుగులు ముందుకేసి వాడి కోసం చేయి చాపాడు.

క్షణం ఆలస్యమైతే మహీధర్ కూడా పింగళ నాగశక్తి కాటుకు బలయి పోయేవాడే. కాని ఇంతలో – ఎటునుంచి వచ్చాడో సుడిగాలిలా అక్కడికి దూసుకొచ్చాడు కృతయుగ్. వస్తూనే యు బ్లడీఫూల్. కం బాక్ అనరుస్తూ మహీధర్ జబ్బ పట్టుకుని బలంగా వెనక్కి లాగి ఆ ఘోరసర్పానికి ఎదురుగా తాను నిలబడ్డాడు.

చినుకు చినుకు చిరుజల్లుపడుతూనే ఉంది. దూరంగా ఆకాశం ఉరుము తోంది. ఈదురుగాలికి చెట్లకొమ్మలు అల్లాడుతున్నాయి. చినుకుల్లో తడుస్తూ బొమ్మల్లా నిలబడిపోయున్నారు అంతా.

అక్కడున్న వాళ్ళలో ఒక్క మహీధర్‌కు మాత్రమే కృతయుగ్ తెలుసు. మిగిలినవాళ్ళకు తెలీదు.

తమను రక్షించడంకోసం దేవుడే ఇతన్ని పంపించాడా అన్నట్టు సంభ్రమాశ్చర్యాలతో కృతయుగ్‌ని చూస్తున్నారు అంతా.

కృతయుగ్‌ని చూడగానే బుసలుకొడుతూ రౌద్రం ప్రదర్శిస్తూ ముందుకు రాకుండా ఉన్నచోటే ఆగిపోయింది నాగశక్తి. ఈ గందరగోళ పరిస్థితికి అనుచరులందరికీ కాళ్ళలో వణుకు పుట్టింది.

పింగళనాగశక్తి నాల్కలు తోడుతూ రౌద్రంగా ఉన్న చోటేఉంది. కాటు తిన్న అనుచరుడి శరీరం చూస్తూండగానే నల్లగా కమిలిపోయి నోటనురగలు పొంగుతుండగా క్షణాల్లో ప్రాణాలు పోగొట్టుకున్నాడు.

"స్లోగా మీరంతా నానుంచి కాస్త దూరంగా జరగండి. ఎవరూ వెనక్కి తిరిగి వెన్ను చూపించకూడదు. వచ్చిన దారినే వెనక నడకన జరగండి" హెచ్చరించాడు కృతయుగ్. అతడు చెప్పినట్టే మూడుగజాలు వెనక్కి జరిగారంతా. వచ్చిన యువకుడు ఎవరో అర్థంగాక ఆశ్చర్యంగా చూస్తున్నారంతా.

"మామయ్యా. ఇతడే కృతయుగ్' మేనమామ చెవిలో గుసగుసలాడాడు మహీధర్.

నమ్మలేనట్టు చూశాడు అన్నారావు.

"అంటే కాంచన ప్రేమించింది..."

"ఇతన్నే"

ఆ మాటలు వినగానే ఒకింత షాకవుతూ ఆశ్చర్యంగా కృతయుగ్‌ని చూడసాగాడు అన్నారావు.

ఎప్పుడైతే అడ్డం వచ్చాడో మరుక్షణమే మత్తు వదిలినట్టయి మూకుమ్మడిగా దాడిచేయటానికి వస్తున్న కోతులన్నీ ఒక్కసారిగా ఆగిపోయాయి. పైన ఎగురుతున్న తేనెటీగలు కూడా ముసురు కోవడం మాని వెనక్కి వెళ్ళిపోనారంభించాయి.

అందుక్కారణం ఏమిటో ఒక్క కృతయుగ్‌కి తప్ప మిగిలిన ఎవరికీ తెలీదు.

అరచేతిలో బలమైన గరుడరేఖ కలిగినవాడు కృతయుగ్. ఆ పైన తన యోగశక్తిని కూడా ఉపయోగించి ఆ ప్రాంతాన్ని దర్శిస్తున్నాడు.

అక్కడ కావలికి ఉంచబడిన నాగశక్తి ప్రధానమైంది. మిగిలిన నాలుగూ చిన్నవి.

అవి అదృశ్యరూపంలో సంచరిస్తూ ఎవరన్నా మనుషులు నిధి ప్రాంతంలోకి వస్తే ప్రకృతిలోని జీవుల్ని ప్రేరేపించి దాడి జరిపించి హతమారుస్తాయి. పింగళశక్తి మాత్రం సహజ సర్పంలాగే బయటికొచ్చి కాటువేసి ఉసురుతీస్తుంది. వచ్చినవాళ్ళు తప్పించుకు పారిపోకుండా కోతులు, తేనెటీగలు, పక్షులు ప్రేరేపించబడతాయి. ఎందరు వచ్చినా తప్పించుకోలేరు.

ఈ పంచనాగశక్తుల నెలవు ఎక్కడనేది యోగశక్తినుపయోగిస్తున్న కృతయుగ్ కళ్ళకి కన్పిస్తోంది. అక్కడ భూమిలో అయిదు పుట్టలు కన్పిస్తున్నాయి.

పుట్టలు అంటే అవి నిజమైన పుట్టలు కాదు. శంఖం సైజులో తయారుచేసిన లక్క పుట్టలు.

అవి భూమికి మూడుఅడుగుల లోతున మధ్యలో ఒకటి, కాస్త ఎడంగా నాలుగుదిక్కులా నాలుగు పాతిపెట్టబడివున్నాయి. అవే వాటి స్థావరాలు. గరుడరేఖ కలిగిన కృతయుగ్ అక్కడ అడుగు పెట్టగానే మిగిలిన నాలుగు నాగశక్తులూ చాలా వేగంగా తమ పుట్టల్లోకి అదృశ్యమయ్యాయి. వాటి కదలికల్ని చాలా స్పష్టంగా చూడగలిగాడు కృతయుగ్. అవి అదృశ్యమైన మరుక్షణం వాటి ప్రభావం తొలగిపోయింది.

అంత వరకూ రౌండప్ చేస్తూ వచ్చిన కోతులు ఒక్కసారిగా మైకం తొలగినట్టు పిచ్చిచూపులు చూసి వెనక్కి వెనక్కి తొలగి చెట్టు కొమ్మల వెంట దూరంగా వెళ్ళిపోయాయి.

పైన సుడి తిరుగుతున్న తేనెటీగల గుంపు కూడా తమ తమ నెలవులకు తొలగి పోనారభించాయి.

కాని శక్తి వంతమైన పింగళనాగశక్తి మాత్రం భీకరంగా నాల్కలు తోడుతూ కృతయుగ్ వంక రౌద్రంగా చూస్తూ ఎదురుగా పడగవిప్పి ఆడుతూ అలాగే ఉంది. "వెళ్ళిపో... నీ తావులోకి వెళ్ళిపో...." పెద్దగా అరుస్తూ తన అరచేతిని పామువైపు సాచాడు కృతయుగ్. అది అతడి అరచేతిలోని గరుడరేఖ ప్రభావం.

ఉన్నట్టుండి తన రౌద్రాన్ని తగ్గించుకుందా ఘోర సర్పం. విప్పిన పడగను ముడుచుకుంటూ యజమాని ఆజ్ఞకు బద్ధుడైన బానిసలా శిరస్సు వంచింది. వెనక్కి వెనక్కి జరిగింది. తర్వాత గిరుక్కున వెనుతిరిగి కొంతదూరం వెళ్ళి అదృశ్యమైంది. సంభ్రమాశ్చర్యాలతో ఆ దృశ్యాన్ని వీక్షించారంతా.

అది అదృశ్యంకావడం మాత్రమే అందరికీ కన్పించింది. కాని భూమిలో జొరబడి పుట్టలోకి వెళ్ళిపోవడం వరకు చూడగలిగాడు కృతయుగ్. మృత్యు ముఖంలోకి వెళ్ళి బయటపడ్డట్టు తేలిగ్గా ఊపిరి తీసుకున్నారంతా. మంత్రవాది అనంతస్వామి అంతటివాడే మహదాశ్చర్యానికి లోనయ్యాడంటే విచిత్రం ఏమీలేదు. పింగళ నాగశక్తిని ఎంతవరకు తను ఆపగలిగి వుండేవాడో తెలీదు గాని చివరిక్షణంలో చిన్న పొరపాట్లు దొర్లి అందర్నీ ప్రమాదం అంచుకు నెట్టేశాయి.

సెల్‌ఫోన్ కోసం తమ వాడు అక్షింతలు చల్లబడనిచోటుకు దూకివుండ కూడదు.

ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండగా–

కృతయుగ్ మాత్రం ఇంకా అటే చూస్తున్నాడు. వెనుతిరిగి చూడలేదు.

చాలా బలమైన నాగశక్తుల్ని కాపలా ఉంచిన ఆనాటి మంత్రవేత్తల శక్తి సామర్థ్యాలకు జోహారు చేస్తున్నాడు. ఆ కాలం పోయింది. ఆ మనుషులూ పోయారు. వందల సంవత్సరాలు గతించాయి.

అయినా ఈ రోజుకీ నిన్ననే కొత్తగా ప్రయోగించిన ఎఫెక్ట్‌తో మంత్రబద్ధమై ఇక్కడ కావలికాస్తున్నాయీ నాగశక్తులు. వీటిని తొలగించనిదే నిధివైపు ఎవరూ కన్నెత్తి చూడలేరు.

“చెప్పేది జాగ్రత్తగా వినండి. నాగశక్తులు మరోసారి దాడిచేయకముందే మనం ఇక్కడినుంచి వెళ్ళిపోవాలి. దయచేసి నా మాటలు శ్రద్ధగా వినండి. మీలో ఒక్కడు వెనుతిరిగి వెన్నుచూసినా వాటికి అమితమైన బలం, అవకాశం వస్తుంది. మనమీద విరుచుకుపడి చంపేస్తాయి.

పొరపాటున కూడా వెన్ను చూపవద్దు. వెనక నడకన వచ్చిన దారినే వెనక్కి పదండి. తీరం చేరగానే నీటిలో మూడు మునకలువేసి లేవండి. దోషం పోతుంది. పదండి.” పెద్దగా అరుస్తూ అందర్నీ హెచ్చరించాడు.

హెచ్చరించడమే కాదు, తను కూడా వెనక నడక ఆరంభించాడు. బ్రతుకు జీవుడా అనుకుంటూ తేలిగ్గా ఊపిరి తీసుకున్నారంతా.

నిష్కారణంగా ప్రాణాలు పోగొట్టుకున్న అనుచరుడ్ని చూసి జాలిపడ్డా చేయగలిగింది లేదు. నల్లగా మాడిపోయింది శవం. భూమిలోంచి గుట్టలుగా లేచివచ్చి శవంమీద దాడిచేస్తున్నాయి గండుచీమలు. అందరికన్నా చివరవున్న పీటర్ ముందుగా వెనక నడక ఆరంభించాడు.

అతడ్ని అనుసరించి మిగిలినవాళ్ళు. తల అటూ ఇటు తిప్పి దారి చూసుకోవడం తప్ప పొరపాటున వెను తిరిగి వెన్ను చూపే ధైర్యం ఎవరికీ లేదు.

అనంతస్వామి అక్షింతలు చల్లుతూ వచ్చిన అదే మార్గంలో వెనక నడక సాగిస్తూ క్రమంగా దీవి అంచుకు చేరుకున్నారు. ఒకరిచేయి ఒకరు అందుకుంటూ వెనక నడకనే స్లోపు దిగి తీరంలోకి వచ్చారు. వచ్చినవాడు వచ్చినట్టు నదిలో దూకి మూడు మునకలు వేశారు.

దూరంలో నదిలో తిరుగుతున్న కళాసీ, వాళ్ళంతా తీరానికి రావడం చూడగానే పడవ ఇంజను స్టార్ట్‌చేసి తీరానికి రానారంభించాడు. వాళ్ళంతా

ప్రాణాలతో తిరిగి రావడమేగాక నదిలో స్నానాలు కూడా చేయడం చూసి ఆశ్చర్యపోయాడతను.

కృతయుగ్‌తో సహా అంతా స్నానాలు చేసి ఒడ్డెక్కారు. కృతయుగ్ పరిస్థితి దారుణంగా వుంది. బోటు నడపటంలో గాయం రేగింది. రెండు కుట్లు తెగి నరకం చూపిస్తున్నాయి. పళ్ళ బిగువున బాధను భరిస్తూ అనంతస్వామి ముందుకెళ్ళాడు. వయసురీత్యా తనకన్నా చాలా పెద్దాయన. మహామంత్రవాది.

"స్వామీ. నేనెవరో ఇప్పుడు మీకు తెలిసిపోయిందనుకుంటాను. ఇక మీరు నాకోసం ఆవాహన చేయాల్సిన అవసరం లేదు" అన్నాడు నవ్వుతూ.

"అర్థమైంది నాయనా. నేను ప్రయోగించిన మోహినీ శక్తినే తిప్పికొట్ట గలిగిన నీ శక్తి అర్థమైంది. అన్ని మంత్ర తంత్రాలకు మించిన ఛాయాపురుష యోగసిద్ధి పొందిన మహర్జాతకుడివి. అరచేతిలో బలమైన గరుడరేఖ గలవాడివి.

శత్రువులమని తెలిసీ మమ్మల్ని రక్షించడం కోసం గాయాన్ని కూడా లెక్కచేయకుండా ఇంతదూరం మా వెనకే వచ్చి పెద్ద ప్రమాదం నుంచి మమ్మల్ని బయటపడేసిన నీ సద్బుద్ధిని, మంచిగుణాన్ని ఎంత శ్లాఘించినా తక్కువే. మేమంతా నీకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి."

"అక్కర్లేదు స్వామీ. నన్నర్థం చేసుకుంటే చాలు. పెద్దవారు ఒక మహత్కార్యం సాధించాల్సిన సందర్భంగా నాకు మీ ఆశీస్సులు అవసరం. మీముందు నేను చాలా చిన్నవాడిని. ఆశీర్వదించండి" అంటూ సవినయంగా వంగి పాదాలకు నమస్కరించాడు.

"దీర్ఘాయుష్మాన్‌భవ" అంటూ ఆశీర్వదించి భుజాలు పట్టి లేపాడు అనంతస్వామి. తన పైతుండు చింపి నెత్తురోడుతున్న కృతయుగ్ భుజానికి కట్టుకట్టాడు. తడిబట్టలతో అంతా తీరంలోనే నిలబడున్నారు. చినుకు చినుకు వానపడుతూనే వుంది. డగడగమంటూ ఇంజన్ శబ్దం చేస్తూండగా పడవ తీరం వైపు కదలివస్తోంది.

కృతయుగ్ ఓసారి అందర్నీ కలయజూశాడు. చివరిగా వున్న పీటర్‌ని దగ్గరకి పిలిచాడు.

"పీటర్ నువ్వే కదూ? స్నిగ్ధ చెప్పిన పోలికలు నీకు సరిపోయాయి" అడిగాడు.

"అవును సార్" బదులిచ్చాడు వినయంగా పీటర్.

"మీలో ఎవరెవరో నాకు తెలీదు. ఇక్కడ మహీధర్ ఎవరు?" అడిగాడు.

అక్కడకి దగ్గర్లోనే ఉన్న మహీధర్ ఉలిక్కిపడ్డాడు. ఏమిటన్నట్టు చూశాడు. పీటర్, మహీధర్‌ని చూపడంతో దగ్గరకెళ్ళాడు కృతయుగ్.

"సో... యు మహీధర్. కాంచనకు బావ. వెరీగుడ్. నా బాధ, భుజానికి గాయం ఖరీదు ఎంతో తెలుసా? అయిదు నిండు ప్రాణాలు. కాంచనను పెళ్ళి చేసుకుని నీ మామ ఆస్తికి వారసుడవు కావాలని ఆశపడ్డంలో తప్పులేదు. కాని అనుభవించే యోగం ఉండాలి.

అది లేదని తెలిశాక వదిలేయాలిగాని అడ్డదారులు తొక్కకూడదు. నేను ఉజ్జయినిలో ఉన్న సంగతి దంతేవారాలో ఉన్న నా శత్రువుకు ఉప్పందించి మొదట తప్పుచేశావ్. స్నిగ్ధ, కాంచనల్ని తెలివి తప్పించి కిడ్నాప్ చేసి ద్వారకాలాడ్జిలో బంధించి రెండో తప్పు చేశావ్. మూడో తప్పు చేయవను కుంటాను. చేస్తే నువ్వు ప్రాణాలతో వుండవు. చివరి క్షణంలో వచ్చి నిన్నెందుకు కాపాడానో నీకు అర్థం కాలేదనుకుంటాను. ప్రాణం విలువ నాకు తెలుసు. మీలో ఎవరూ దీవి మీద ప్రాణాలు పోగొట్టుకోకుండా కాపాడాలనే వచ్చాను. అయినా మీ మనిషి ఒకడు తప్పుచేసి బలయిపోయాడు.

చూడు మహీధర్. నేను సాధారణ ట్యాక్సీడ్రైవర్నే, నా వద్ద ఆస్తి పాస్తులేమీ లేవు. నాకు ధనవ్యామోహం కూడా లేదు. అయినా కాంచన నన్ను ఇష్టపడుతోంది. స్నిగ్ధ కూడా నన్నిష్టపడుతోంది.

మా భవిష్యత్తు ఏమిటనేది తర్వాత సంగతి.

ఇప్పుడు మా ముగ్గురి మీదా ఒక బృహత్తరమైన కార్యభారం ఉంది. అది నెరవేరే వరకు మా పెళ్ళి ప్రసక్తి లేదు.

సో... కావాలంటే నీ మేనమామ ఆస్తి నువ్వే తీసుకో. అంతేగాని ఇంకెప్పుడూ కాంచనజోలికి రాకు.

మహీధర్! నాకు సింహమంటే ఇష్టం. ఎందుకంటే, అది ఎప్పుడూ నేరుగా అటాక్ చేసి పోరాడుతుంది.

గుంటనక్కలంటే అసహ్యం.

అవి ఎప్పుడూ దొంగదెబ్బ తీయాలని చూస్తాయి. నువ్వు గుంటనక్క కావద్దు.

సింహంలా ఉండేందుకు ప్రయత్నించు. ఇప్పుడు కూడా నిన్ను హెచ్చరించకపోతే భవిష్యత్తులో దెబ్బతింటావ్. అందుకే హెచ్చరిస్తున్నాను." అన్నాడు.

నలుగురిలోనూ కృతయుగ్ తన స్వభావాన్ని బయట పెట్టడంతో మహీధర్ ముఖం అవమానంతో వాడిపోయింది. తప్పుదుగాబట్టి 'సారీ' అంటూ ముఖం దించుకున్నాడు.

పక్కనే ఉన్న అన్నారావు అంతా వింటూనే వున్నాడు. ఏం చెప్పాలో అర్ధంగాక మౌనంగా ఉండిపోయాడు. పోలికల్నిబట్టి గుర్తించి అన్నారావు వంక చూశాడు కృతయుగ్. "నా అంచనా కరక్టయితే కాంచన తండ్రి అన్నారావుగారు మీరే అనుకుంటాను" అన్నాడు.

"అవును" అన్నాడు పొడిగా.

"సార్, మీకు నేను చెప్పేది ఒక్కటే. మీ అమ్మాయి అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వండి. విలువ ఇవ్వండి. తనను తండ్రిలేని పిల్లగా చూడ్డం ఇష్టంలేక మిమ్మల్ని, మీ అందర్నీ నా శక్తివంచన లేకుండా కాపాడి వెనక్కి తీసుకెళ్ళాలని వచ్చాను.

నిజానికి నేను ఆస్పత్రి నుంచి కదలకూడదు. నా భుజం గాయం చూస్తున్నారుగా.

అయినా రాక తప్పలేదు. ఒక్కటి మాత్రం నిజం. మనం పర్సనల్ విషయాలు మాట్లాడుకోవడానికి ఇది సమయమూకాదు. సందర్భమూకాదు. బట్... మీరూ నిధికోసం వచ్చారు. మేమూ నిధికోసమే వచ్చాం. ఇందులో సందేహం లేదు.

కానీ మీకు తెలీని చాలా విషయాలు మాకు తెలుసు. ఎందుకంటే నిధితాలూకు మొదటి రాగిరేకు మా దగ్గర వుంది.

మీరు ఆశ్చర్యపడాల్సింది ఏమీలేదు. ఇది నిజం.

"సో... మనమంతా ఒకచోట కూర్చుని చర్చించుకుని ఒక నిర్ణయం తీసుకోవడం మంచిది. పోటీపడటం ఉభయత్రా శ్రేయస్కరం కాదు. మళ్ళీ ఇదేరోజు ఉదయం అంటే వారం తర్వాత ఉజ్జయినికి ఉత్తరాన గల శిధిలబౌద్ధ స్థూపం ఆవరణలో మనం సమావేశమై ఒక నిర్ణయానికి వద్దాం.

అంతవరకు మౌనంగా ఉండండి. తొందరపడి మీడియా దృష్టిలో పడితే మాకన్నా మీకే నష్టం. ఇక బయల్దేరడం మంచిది" అంటూ మరోమాటకి అవకాశ మివ్వకుండా తీరాన కట్టివున్న తన బోటుతాడు విప్పి ఎక్కి కూర్చున్నాడు.

మరుక్షణమే ఇంజన్ స్టార్టయింది. కన్ను మూసి తెరిచేలోన తూనీగలా ఉజ్జయిని దిశగా దూసుకుపోనారంభించింది.

ఇంతలో తమ పడవకూడా తీరానికి రావడంతో మౌనంగా అందరూ పడవలోకి చేరుకున్నారు. పడవ కళాసీ అక్కడ నీటిమీద ఊగుతున్న నాటుపడవ తాడు విప్పి తన పడవ వెనక కట్టాడు. ఇంజను స్పీడు పెంచగానే నీటి వాలున వేగం పుంజుకుంది పడవ. దాన్ని అనుసరించి వెళ్లనారంభించింది నాటు పడవ.

* * * * *

చినుకు చినుకు వానజల్లు పడుతూనే ఉంది.

సాయంత్రం నాలుగు దాటింది సమయం. ఉజ్జయినీ నగరంపైన దట్టమైన వానమబ్బులు ఆక్రమించివున్నాయిగాని వర్షం ఇంకా మొదలుకాలేదు. ఇప్పుడిప్పుడే ఈదురుగాలులు ఆరంభించి వాతావరణం చలిచలిగా మారి పోయింది.

జెట్టీకి సమీపంలోని ఒక షెడ్డు ముందు బల్లమీద కూర్చునున్నారు స్నిగ్ధ, కాంచనలు. ఇద్దరి చూపులూ నది ఎగువనే ఉన్నాయి. ఏ మోటార్‌బోటు వస్తున్నా కృతయుగ్ వస్తున్నాడనే ఆశ. ఏ ఇంజను పడవ వస్తున్నా అన్నారావు బృందం వస్తోందని ఆశ. గంటసేపటిగా ఇద్దరూ ఎదురుతెన్నులు చూస్తూనే వున్నారు.

"అక్కా! అంతా సేఫ్‌గా తిరిగొస్తారంటావా? కృతయుగ్‌కేమీ కాదుగదా?" అప్పటికి ఏ ముప్పయ్యోసారో అడిగి ఉంటుంది కాంచన.

"అనవసరంగా కంగారుపడకు. వాళ్ళకేమీ కాదు. నదిమీద ఇక్కడ్నుంచి వెళ్ళటానికి మూడుగంటలు, రావటానికి మూడు గంటలు ప్రయాణం చేయాలి. మధ్యాహ్నం రెండు గంటలకి బయలుదేరినా కాసేపట్లో వచ్చేయాలి. డోన్ట్‌వర్రీ" అంటూ కాంచనను సముదాయిస్తోంది స్నిగ్ధ.

ఇంతలో పెద్ద ఈదురుగాలి వీచింది.

"అయ్యయ్యో. అక్కా! గాలిదుమారం కూడా మొదలయింది. వర్షం పడితే నదిమీద చాలా కష్టం. బోటులో నీరు చేరిపోతుంది. ఎలా వస్తారో ఏమిటో" అంటూ చిన్నపిల్లలా కాంచన హైరానాపడుతోంటే స్నిగ్ధకు నవ్వు, కోపం కూడా వస్తున్నాయి.

సరిగ్గా నాలుగు నలభై నిముషాలకు ముందుగా కృతయుగ్ బోటు జెట్టీని చేరుకుంది. అతడ్ని చూడగానే చంద్రుడ్ని చూసిన కలువల్లా వికసించాయి వాళ్ళముఖాలు. ఇద్దరూ లేచి అటు పెరుగెత్తారు.

బోటు దిగిన కృతయుగ్ దాన్ని ఓనర్‌కి అప్పగించి జెట్టీమీద నడుచు కుంటూ వచ్చాడు. నెత్తురుముద్దలా ఉన్న అతడి భుజం కట్టును చూస్తూనే ఎంతో కంగారు పడిపోయారు స్నిగ్ధ, కాంచనలు.

"ఏమైంది? వాళ్ళంతా ఎక్కడ?" అడిగింది కాంచన.

"అంతా సేఫ్. వెనకాల పడవలో వస్తున్నారు. అర్జంటుగా నేను ఆస్పత్రికి వెళ్ళాలి. ట్యాక్సీని పిలవండి" అన్నాడు బాధను ఓర్చుకుంటూ. వెంటనే రోడ్డుమీదకు పరుగెత్తి ట్యాక్సీని పిలుచుకొచ్చింది కాంచన.

"కాంచనా. మీవాళ్ళు వచ్చేవరకు ఇక్కడే వెయిట్ చేయడం బెటర్. వాళ్ళను చూస్తేగాని నీ మనసు నెమ్మదించదు..." సలహా ఇచ్చాడు కృతయుగ్.

"వాళ్ళు సేఫ్ అని నువ్వు చెప్పావు చాలదా? నీమాట మీద నాకు నమ్మకం లేదనా.

అయినా గాయాన్ని కూడా లెక్క చేయకుండా ఇంత రిస్క్ తీసుకోవాలా. పదండి. వెళ్ళిపోదాం" అంటూ తనూ ట్యాక్సీ ఎక్కేసింది కాంచన.

ట్యాక్సీ అక్కడ్నుంచి వెళ్ళిపోయిన అర్ధగంట తర్వాత అన్నారావు అతని బృందం వస్తున్న మోటారు ఇంజన్ పడవ, జెట్టీని చేరుకుంది.

*      *      *      *      *

"ఇతను మనిషి కాదు. ఇతగాడికి వైద్యం చేయడం నావల్లకాదు" కృతయుగ్ భుజం కట్లు విప్పుతూ గొణిగాడు డాక్టర్ దయానిధి.

నెత్తుటి ముద్దలా ఉన్నాయి కట్లు.

అంతక్రితమే బయట వర్షం కూడా మొదలయింది. చలిచలిగా ఉంది వాతావరణం. పది నిముషాల క్రితమే అమ్మాయిలిద్దరూ కృతయుగ్‌ని ఆస్పత్రికి తీసుకొచ్చారు. చెప్పాపెట్టకుండా ఆస్పత్రినుంచి వెళ్ళిపోయి గాయాన్ని పెంచు కొచ్చినందుకు దయానిధి చాలా కోపంగా ఉన్నాడు. "అదేమిటి డాక్టర్! ఇతన్ని మనిషి కాదంటారు దేనికి? అంటే మృగం అనుకుంటున్నారా?" అంటూ కావాలనే కామెంట్ చేసింది కాంచన.

"మృగమన్నా చెప్పినట్టు వింటుంది తల్లీ. ఇతను అంతకన్నా ఎక్కువ. ఇలాంటివాళ్ళకి వైద్యం చేయాలంటే పశువుల డాక్టరే కరెక్టు" అన్నాడు దయానిధి.

"పోన్లే డాక్టర్. కాసేపు మీరే పశువుల డాక్టరనుకోండి" అన్నాడు కృతయుగ్.

"జోకా... అనుకోవడం కాదోయ్. నిన్నలాగే ట్రీట్ చేస్తాచూడు. యూ ఫూల్. గాయం రెండ్రోజుల్లో తగ్గిపోవాలని చెప్పి పారిపోయి గాయాన్ని పెంచుకు నొస్తావా. గాయం తగ్గేదాకా నిన్ను కాళ్ళు, చేతులు కట్టిపడేయమని మా స్టాఫ్‌కి చెప్తా. ఓ మైగాడ్... రెండుకుట్లు తెగిపోయాయి. మళ్ళీ కుట్లుపడతాయి." అరిచాడు.

"కుట్టండి డాక్టర్. మీకు డబుల్ పేమెంట్ వస్తుందిగా" అంటూ డాక్టర్ నవ్వినట్టే నవ్వి చూపించాడు కృతయుగ్.

"అసలు నాకు తెలీకడుగుతాను. ఇంత బాధలోనూ ఎలా నవ్వగలుగు తున్నావోయ్... నీకు నొప్పి తెలీటంలేదా?" అన్నాడు దయానిధి.

"అయ్యో. అదేమడుగుతారు డాక్టర్. ఏడవలేక నవ్వు ఇది. నొప్పి చంపేస్తోంది. ఓ మైగాడ్" అరిచాడు.

"ఏమైనా నీలో ఓర్చుకునే శక్తి ఎక్కువ. ఐ లైకిట్. కాని... ఇక మీదట బెడ్ దిగనని, బయటకెళ్ళనని నాకు మాట ఇస్తేనే ట్రీట్‌మెంట్. అంతే"

"ప్రామిస్ డాక్టర్. వారంరోజులపాటు  బెడ్ దిగను" మాటిచ్చాడు కృతయుగ్. "ఓ.కె. ఆ మాటకి కట్టుబడి వుంటేనే నాలుగు రోజుల్లో గాయం మానేలా చేస్తాను. లేదంటే ఆపరేషన్ వరకు వెళ్తోంది జాగ్రత్త" అంటూ హెచ్చరించి ఎన్నో సూచనలు ఇచ్చి ట్రీట్‌మెంట్ ఆరంభించాడు డాక్టర్ దయానిధి.

ఇద్దరు నర్సులు సాయం చేస్తుండగా గాయాన్ని శుభ్రంచేసి కుట్లు వేసి బ్యాండేజ్ చుట్టాడు. రెండు ఇంజక్షన్లు చేసి మందులు రాసిచ్చాడు. కృతయుగ్‌ని తిరిగి గదిలోకి తీసుకొచ్చి బెడ్‌మీద పడుకోబెట్టారు.

"అవునూ... నువ్వు విడిగా హోటల్లో ఎందుకు. స్నిగ్ధకు సాయంగా మినర్వా హోటల్ కొచ్చేయరాదూ?" కాంచనకు సలహా ఇచ్చాడు కృతయుగ్.

"ఆల్రెడీ వచ్చేశాను. నేనున్న హోటల్ గది ఖాళీచేసి నా లగేజ్ మినర్వాలో పడేసింది అక్క.

ఆ తర్వాతే మేం నదివద్దకొచ్చి నీ కోసం ఎదురు చూస్తూ కూచున్నాం" అంది కాంచన. "మంచి పని చేశారు" అంటూ కళ్ళు మూసుకున్నాడు కృతయుగ్.

"ఏం జరిగింది అక్కడ?" పక్కన కూచుని మృదువుగా అడిగింది స్నిగ్ధ.

దీవిమీద జరిగిందంతా లోగొంతుతో అమ్మాయిలిద్దరికీ వివరించడం ఆరంభించాడు కృతయుగ్.

*　　　*　　　*　　　*　　　*

ద్వారకాలాడ్జి! అన్నారావుగది. ఎక్కడ ఉన్నా ఆయన గది విడిగా ఉండాల్సిందే. వేరేవాళ్ళతో షేర్‌చేసుకోవడం ఇష్టం ఉండదు.

లాడ్జిలో ప్రస్తుతం ఎనిమిది గదులు తమకిందే ఉన్నాయి. వాటిలో మూడు తను, మహీధర్, అనంతస్వామిలవి. మిగిలిన అయిదింటిలో పీటర్‌తో సహా తన మనుషులు ఉంటున్నారు. ఈరోజు చనిపోయినవాడితో కలిపి నిధికి ఇప్పటికే ఐదుగురు బలయిపోయారు. శవాల్ని వెనక్కి తెచ్చుకునే అవకాశం కూడా లేని అతి ప్రమాదకర ప్రదేశం.

తలచుకుంటే ఇప్పటికే వెన్ను జలదరిస్తోంది. ఇంకా ఎంతమంది పోతారో తెలీని పరిస్థితి. తన కెరీర్‌లోనే ఒక సవాల్‌గా నిలిచిన నిధి ఇది. ఇందులో కృతయుగ్, స్నిగ్ధల ప్రమేయం తనకిష్టంలేని మాట నిజమే. కాని పరిస్థితులకు తలొంచక తప్పదేమో. కృతయుగ్ మాటల్లో ఖచ్చితత్వం, నిజాయితీ కొట్టొచ్చి నట్టుంది.

అదలా ఉంచితే కృతయుగ్ మూలంగా మహీధర్ గురించిన కొత్త విషయాలు కొన్ని విన్నాడు. దంతేవారా నుంచి శత్రువులు రావడం ఏమిటి? కృతయుగ్ భుజానికేర్పడ్డ గాయంతో సంబంధం ఏమిటి?

అయిదు నిండు ప్రాణాలంటే చనిపోయినవాళ్ళు ఎవరు? మహీధర్, కృతయుగ్‌ని అడ్డు తొలగించుకోవాలన్నంతగా అసూయచెందాడా?

ఇవన్నీ ఆలోచిస్తుంటే ఎందుకో అన్నారావు మనసు ప్రశాంతంగాలేదు. తనతో చెప్పకుండా, సంప్రదించకుండా మహీధర్ ఏ పనీ చేయడు. కానీ ఈ మధ్య కొన్నిపనులు చేశాకే తనతో చెప్తున్నాడు. కొన్ని అస్సలు చెప్పడం లేదు. ఇప్పుడిప్పుడే తను స్వతంత్రిస్తున్నాడా అనే సందేహం కలుగుతోంది.

పరిష్కారం లభించని సమస్యలు ఎదురైనప్పుడు చికాకుల నుంచి బయటపడ్డానికి మనిషిచేసే తాత్కాలిక ఉపశమనం మనం మందును ఆశ్రయించడం. అన్నారావుకి ఇది మామూలే. విస్కీ బాటిల్ ఓపెన్‌చేసి గ్లాసులోకి విస్కీ, సోడాకలుపుకొని కొద్దికొద్దిగా సిప్‌చేస్తూ కాసేపు ఏవేవో ఆలోచనలతో గడిపాడు.

ఆషామాషీగా ఆరంభించిన వాన చీకటిపడేసరికి ఉధృతమై ఈదురు గాలులతో కూడిన బలమైన వర్షంగా మారిపోయింది.

వీధుల్లో జనసంచారం తగ్గింది. ఒక్కసారిగా వాతావరణం కూలవడంతో వేసవితాపం నుంచి ఉపశమనం లభించినందుకు ఉజ్జయినీ వాసులు ఆనందిస్తున్నారు. ఓసారి అనంతస్వామితో మాట్లాడాలనిపించింది.

కాని, అంతకుముందు మహీధర్‌తో మాట్లాడ్డం మంచిదనిపించింది. తన మనిషిని పిలిచి మహీధర్‌కోసం కబురుచేశాడు. కబురంపిన అయిదు నిముషాల తర్వాత మేనమామ గదిలోకొచ్చాడు మహీధర్.

"డోర్ క్లోజ్ చేసి బోల్ట్ వేసిరా" గ్లాసు ఫినిష్ చేసి పక్కన పెడుతూ చెప్పాడు అన్నారావు.

మౌనంగా డోర్ బోల్ట్‌వేసి వచ్చి ఎదురుగా సోఫాలో కూచున్నాడు మహీధర్. ముఖం వాడిపోయివుంది.

జరిగిన పరిణామాలు తనకు సంతృప్తికావని అర్ధమవుతూనే వుంది. తన ప్రయత్నాలు బెడిసికొట్టడమేకాదు, తను సేఫ్‌గానే ఉంటూ హీరో అయి కూచున్నాడు కృతయుగ్. వాడు తన ప్రాణాల్ని కాపాడ్డం అవమానంగా ఫీలవుతున్నాడు మహీధర్. మేనమామ ముఖంలోకి చూడలేక ముఖం దించుకున్నాడు.

"సో! కృతయుగ్ విషయంలో నువ్వు రెండు తప్పులు చేశావ్. ఒకటి దంతేవార నుంచి అతడ్ని అంతం చేయడానికి ఎవరినో పిలిపించడం.

రెండోది స్నిగ్ధ, కాంచనల్ని కిడ్నాప్ చేయడం. విషయం పూర్తిగా తెలీక– దూరాలోచన లేక నేనూ తప్పుచేశాను. వాళ్ళిద్దర్నీ బంధించి ఉంచమని చెప్పి. ఓ.కె. లీవిట్. ఇప్పటికైనా ఏంజరిగిందో చెప్తావా? దంతేవారా నుంచి ఎవర్ని పిలిపించావ్?" కూల్‌గా అడిగాడు అన్నారావు.

"లేదు మావయ్యా. నేను పిలవలేదు. అసలక్కడ ఏం జరిగిందో కూడా నాకు తెలీదు. ఆ సమయంలో కాంచన దంతేవారాలోనే ఉంది. గాబట్టి తనకి తెలిసివుండొచ్చు. అయిదు రోజుల క్రితం సడెన్‌గా చింటూభాయ్ ఫోన్ చేశాడు. కృతయుగ్ తల నరికి తీసుకుపోవడానికి నలుగురు షూటర్స్‌ని వెంటబెట్టుకుని వచ్చాడు..."

"ఆగాగు... కృతయుగ్ సొంత ఊరు ఏది?"

"భద్రాచలం. అక్కడికెళ్తే కృతయుగ్ హైదరాబాద్‌లో ఉన్నట్టు తెలిసిందట. హైదరాబాద్ వచ్చాడు..." అంటూ జరిగింది క్లుప్తంగా వివరించాడు మహీధర్.

కాసేపు మౌనంగా ఉన్నాడు అన్నారావు.

గ్లాసులో విస్కీ కలుపుకుని సిప్ చేస్తూ ఆలోచనల్లో మునిగిపోయాడు. "నువ్వు చేసింది తప్పని నేననుకోను" చాలా సేపటి మౌనం తర్వాత పెదవి విప్పాడు అన్నారావు.

"నచ్చింది దక్కించుకోవడానికి ఎవరి ప్రయత్నం వాళ్ళు చేసుకోవచ్చు. చిన్నప్పట్నుంచి మా ఇంటల్లుడు నువ్వే అనుకున్నాం. కాని మనం అనుకున్నట్టే అన్నీ జరగవు. కాంచన, కృతయుగ్‌ని ప్రేమించింది. ఎంతగా అంటే కన్నవాళ్ళని కూడా లెక్కచేయడం లేదు.

సో... రెండు ప్రయత్నాలు చేసి ఫెయిలయ్యావ్. నేను మూడో అవకాశం కూడా నీకిస్తున్నాను. వచ్చే సమావేశం రోజున మూడోసారి ట్రయ్ చెయ్.

కావాలంటే కొందరు గూండాల్ని కూడా సాయం తీసుకో. బట్. మూడోసారి కూడా ఫెయిలయితే ఇక జీవితంలో నువ్వు వాళ్ళ జోలికి వెళ్ళకూడదు. ఇది నా కండిషన్. ఓ.కే.నా?" అన్నాడు అన్నారావు.

మేనమామ మాటలు మహీధర్ మీద టానిక్‌లా పనిచేశాయి. ముఖంలో కాంతి ప్రవేశించింది. కాని... అంతలోనే సందేహం. తనకీ అవకాశం ఎందుకిస్తున్నట్టు? ఒకవేళ కృతయుగ్ చేతిలో తనే చనిపోతే? తనను వదిలించుకునే ఆలోచనా ఇది?

"ఏమిట్రా ఆలోచిస్తున్నావ్? ఇందులో బలవంతం ఏమీలేదు. కృతయుగ్‌ని గెలవగలవనుకుంటేనే ట్రయ్‌చెయ్. లేదా ఇక నువ్వు కాంచనను మర్చిపో. ఛాయిస్ నీదే" హెచ్చరించాడు అన్నారావు.

ఆయన మనసులో ఏముందో తెలుసుకోవాలని ఎంత ఆలోచించినా మహీధర్‌కి అర్థం కాలేదుగాని ఓటమిని మాత్రం అంగీకరించలేకపోయాడు.

"ఓ.కె. మావయ్యా. మూడోసారి ఫెయిలవను. కృతయుగ్‌ని చంపి కాంచనని సొంతం చేసుకుంటాను" అన్నాడు పట్టుదలగా మహీధర్.

"ఓ.కె. ఏం చేస్తావో, ఎలా చేస్తావో నాకేమీ చెప్పక్కర్లేదు. ట్రయ్ చేయడం కాదు. పని పూర్తిచేసి మగాడివనిపించుకో" అన్నాడు అన్నారావు.

"థ్యాంక్యూ మావయ్యా... మీరే చూస్తారుగా"

"నాకో విషయం అర్థంకాలేదు. నీకేమన్నా అర్థమైందా? అసలీ సమావేశం ఎందుకు ఏర్పాటు చేస్తున్నట్టు? ఏం చెప్పదలుచుకున్నాడు?"

"చెప్పడానికేముందని మావయ్యా. నిధిలో మనకి వాటా ఇవ్వడం తనకి ఇష్టం లేదు. మనల్ని ఆశవదులుకుని వెనక్కి వెళ్ళిపొమ్మని చెప్పటానికే సమావేశం"

"అది చెప్పటానికి సమావేశం అక్కర్లేదు. దీవిమీదే చెప్పి తన దారిన వెళ్ళిపోవచ్చు. మరేదోకారణం ఉండాలి..."

"నిధికి వాటాలు నిర్ణయించేందుకేమో..."

"అంతేనంటావా? ఓ.కె. ఈ లోపల వాళ్ళజోలికి వెళ్ళకు. కామ్‌గా ఉండండి. సమావేశంలో చర్చకువచ్చే అంశం ఏమిటో చూద్దాం. వెళ్ళు" మహీధర్ కామ్‌గాలేచి – బయటకు వెళ్ళిపోయాడు. అయిదు నిముషాలు ఆగి గదిలోంచి బయటికొచ్చాడు అన్నారావు.

డోర్ లాక్ చేసుకుని అనంతస్వామి గదివైపు వెళ్ళాడు. అప్పటికే రాత్రి ఏడుగంటలు దాటింది సమయం. బయట వానజోరు తగ్గలేదు. చలికి ఎవరూ వరండాలో తిరగడంలేదు. అన్నారావు వెళ్ళేసరికి ఏదో మంత్రగ్రంధం తీక్షణంగా తిరగేస్తున్నాడు అనంతస్వామి. దాన్ని మూసి పక్కన పెడుతూ సాదరంగా పిలిచాడాయన.

ఎదురుగా సోఫాలో కూచుని సాలోచనగా చూశాడాయన్ని. "ఏదో దీక్షగా చదువుతున్నట్టున్నారు" అన్నాడు నవ్వుతూ.

"అవును . మనముందు చాలా పెద్ద పని ఉంది. ఆషామాషీ వ్యవహారం కాదు.

దీవిమీది పరిస్థితులు స్వయంగా చూశావ్‌గదా! ఎందుకైనా మంచిదని వచ్చేప్పుడు కొన్ని ముఖ్యమైన తాళపత్ర మంత్ర గ్రంధాలు తెచ్చాను.

నాగశక్తుల ప్రస్తావన, వాటి ప్రయోగం, ఉపసంహారం, నాగ బంధాలు వాటి వివరాలకోసం గ్రంధాన్ని తిరగేస్తున్నాను" చెప్పాడు అనంతస్వామి.

"మీకు తెలీని మంత్రాలా స్వామి. మీకు మించిన మంత్రవాది ఇంతవరకు నాకు ఎవరూకన్పించలేదు"

"అదే పొరపాటు. నన్ను మించినవాళ్ళూ లోకంలో ఉన్నారు. నేను నీతో ఉన్నాను గాబట్టి వేరే వాళ్ళతో నీకు అవసరంపడలేదు. అంతేతేడా. అవునూ... అనుకోకుండా వచ్చావ్. ఏమిటి విశేషం?"

"ఉజ్జయినిలో మనకి విశేషాలు కొదవా స్వామీ. చావు తప్పి బతుకుజీవుడా అని దీవినుంచి బయటపడ్డాం.

ఇంతకు ముందే మహీధర్‌తో మాట్లాడి ఇటు వచ్చాను"

"వాడికి కాంచన మీద చెప్పలేని ఇష్టం. కాని ఆ అమ్మాయి వీడ్నికాదు పొమ్మంటోంది. నా ఉద్దేశమయితే వీడు కాంచనమీద ఆశ వదులుకోవడం మంచిది"

"వదులుకునే ఉద్దేశం వాడికి లేదు. అందుకే నీ ప్రయత్నం నువ్వు చేసుకోమని సలహా ఇచ్చాను.

బట్. మూడోసారి కూడా ఫెయిలయితే శాశ్వతంగా మర్చిపోవాలని హెచ్చరించాను"

"ఊహు. ఇది కరెక్ట్ కాదనుకుంటాను. నువ్వలా మహీధర్‌ని రెచ్చ గొట్టకుండా వుండాల్సింది"

"స్వామీ! మంచివాడు మాటతో వింటాడు. చెడ్డవాడు దెబ్బపడితే వింటాడు. మూర్ఖుడు ఏం చేసినా వినడు. అలాంటివాళ్ళకి ప్రాణం మీదికొస్తేనే వింటారు. మహీధర్ మూర్ఖుడు.

ఎంత మూర్ఖుడుగాకపోతే– తన ప్రాణాలను కాపాడినవాడినే చంపుతా నంటాడు? ఇద్దరిలో ఎవరు ఛస్తారో చూద్దాం. ఇప్పుడు నేను వచ్చిన విషయం వేరు"

"చెప్పు, ఏమిటా విషయం?"

"వచ్చే ఇదే రోజు సమావేశం అవుదామని చెప్పాడు కృతయుగ్. సమావేశంలో చర్చకు వచ్చే విషయాలు ఏమై ఉంటాయి? మనం అనుసరిం చాల్సిన వ్యూహం ఏమిటి? ఇందులో మీ అభిప్రాయం ఏమిటి?"

"విషయం తెలీకుండా వ్యూహరచనచేయలేం. ఇది నా అభిప్రాయం. మొదటి రాగిరేకు తమవద్ద ఉందన్నాడు. అంటే నిధికి సంబంధించి మనకు తెలీని విషయాలేవో వాళ్ళకుతెలుసు. అవి తెలియనంత వరకు మనం ఒక అభిప్రాయానికి రాలేం. కాబట్టి ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఏ వ్యూహం అనుసరించాలన్నా సమావేశానంతరం అది సాధ్యం"

"నిధిని చెరిసగం పంచుకుందామని ప్రపోజ్ చేస్తాడనుకుంటున్నాను" ఆ మాటకి చిన్నగా నవ్వాడు అనంతస్వామి.

"ఎందుకు స్వామీ నవ్వుతారు?" అడిగాడు అన్నారావు.

"ఏంలేదు అన్నారావు. మనవద్ద విశాలదృక్పథం లేనందువల్ల ఒక్కోసారి చిన్నపిల్లల్లా ఆలోచిస్తాం.

మొత్తం నిధి అతడే తీసుకున్నా నీ కొచ్చిన నష్టం ఏమన్నా ఉందా? ఎందుకుంటే కాంచన అతడ్ని చేసుకుంటే ఆమెకు చెందదా? నువ్వు ఎంత సంపాదించినా నీ కూతురికోసమే గదా!" అనంతస్వామి తర్కం అన్నారావుకి నచ్చింది.

"అఫ్‌కోర్స్ అయినా ఏదో ఆతృత. చంచల స్వభావంగదా. రకరకాలుగా ఆలోచిస్తూ ఉంటుంది. మొదటి రాగిరేకులో ఏముందో తెలిస్తే బాగుండేది".

"తెలుసుకుని ఏంచేస్తావ్? ఇప్పుడు మనం చేయగలిగింది ఏమీలేదు. సమావేశంలో కృతయుగ్ ఏం చెప్తాడో విన్నాక పరిస్థితిని బట్టి ఆలోచిద్దాం. మీడియా దృష్టికి వెళితే మొదటికే మోసం వస్తుంది. సో... ఈ అయిదారు రోజులు కామ్‌గా ఉందాం. టేకిటీజీ. ఓ.కె?" ఓ.కె. అన్నట్టు తలూపాడు అన్నారావు. కాస్సేపు ఆయనతో మాట్లాడి లేచి తనగదిలోకి వెళ్ళిపోయాడు.

అంతాభోజనాలు చేసి పడుకునేసరికి చాలా పొద్దుపోయింది. రాత్రంతా వర్షం నిలిచిపోయింది.

ఆకాశంలో మబ్బులు మాత్రం అలాగే ఉన్నాయి. సూర్యుడు కన్పించడం లేదు. ఉజ్జయిని వీధులు రాత్రి కురిసిన వానకు జలమయంగా ఉన్నాయి.

*　　*　　*　　*　　*

హాస్పిటల్‌కు వెళ్ళటానికి స్నిగ్ధ, కాంచనలు రెడీ అవుతున్నారు. స్నిగ్ధ అప్పటికే స్నానాదులు ముగించి చక్కటి చీర, జాకెట్‌లో అందంగా డ్రస్సప్‌అయి వుంది.

కాంచన స్నానంచేసి పక్కగదిలో రెడీ అవుతూ ఉంది.

ఇంతలో తలుపు చప్పుడైంది. మినర్వాహోటల్లో తమను పలకరించటానికొచ్చే వాళ్ళు ఎవరూ లేరు అంతక్రితమే కాఫీ ఆర్డర్ చేశారు. వెయిటర్ కాఫీ తెచ్చాడనుకుని వెళ్ళి తలుపుతీసింది.

కాని వచ్చింది వెయిటర్ కాదు. అపరిచిత వ్యక్తి.

నడివయసు దాటి హుందాగా. గంభీరంగా ఉన్నాడు.

ఎప్పుడూ ఎక్కడా ఆయనను చూసిన గుర్తులేదు స్నిగ్ధకు. "ఎస్... ఎవరు కావాలి?" అడిగింది. "నువ్వు... స్నిగ్ధవి కదూ?" అడిగాడాయన.

"అఫ్‌కోర్స్ అయామ్ స్నిగ్ధ. ఇంతకీ మీరు?"ః

"నన్ను అన్నారావు అంటారమ్మా. కాంచన ఫాదర్‌ని" అప్పటిగ్గాని వచ్చింది ఎవరో స్నిగ్ధకు అర్థంకాలేదు.

వాళ్ళు ఎదురుగా ద్వారకా లాడ్జిలో ఉన్నారని తెలుసుగాని, ఇలా అన్నారావు సడెన్ విజిట్ ఉండొచ్చని ఊహించలేదు.

అందుకే క్షణకాలం ఎలా స్పందించాలో, ఏం మాట్లాడాలో అర్థంకాలేదు స్నిగ్ధకు. కాని వెంటనే షాక్ నుంచి తేరుకుంటూ– "రండి... లోపలికి రండి..." అంటూ తలుపు తెరిచింది.

"కాంచన ఎక్కడమ్మా?" అడిగాడు. ఆయన ఒక్కడే వచ్చాడు. వెంట ఎవరినీ తీసుకు రాలేదు.

"వస్తుంది రండి. కూచోండి" అంది స్నిగ్ధ.

"నేనిలా రావడం ఆశ్చర్యంగా ఉందికదూ?"

"అదేంలేదు. మిమ్మల్ని ఇదే చూడ్డం. గుర్తుపట్టలేకపోయాను. సారీ. నేనూ మీ బిడ్డలాంటిదాన్నే. ఆశీర్వదించండి బాబాయిగారూ" అంటూ ఆయన పెద్దరికానికి ప్రాధాన్యతనిస్తూ వంగి పాదాభివందనం చేసింది.

ఆమె వినయం, మాట తీరు అన్నారావుని పులకింపజేశాయి. "ఇష్టకామ్యార్థ సిద్ధిరస్తు... దీర్ఘాయుష్మాన్‌భవ. లే తల్లీ" అంటూ భుజాలుపట్టిలేపి–

"రాగానే నీ సంస్కారంతో నా కాళ్ళు, చేతులు కట్టేశావ్. ఉత్త చేతులతో ఆశీర్వదించకూడదు" అంటూ వెయ్యిరూపాయల నోటు చేతిలో ఉంచాడు.

స్నిగ్ధ వారిస్తుంటే– "తీసుకోమ్మా. సెంట్రల్ మినిస్టర్ కూతురికి. నీకు డబ్బుకొరతా! ఇది సాంప్రదాయం. నా తృప్తికోసం తీసుకోవాలి" అన్నాడు. ఇక అభ్యంతరం చెప్పలేదు స్నిగ్ధ. అన్నారావు సోఫాలో కూచున్నాడు. ఇంతలో వెయిటర్ కాఫీ కప్పులతో ట్రేతెచ్చి టీపాయ్ మీద ఉంచి వెళ్ళాడు. ఒక కప్పులో కాఫీ వంచి అన్నారావుకిచ్చి తను ఒకటి తీసుకుని ఎదురుగా కూచుంది స్నిగ్ధ.

లోనగదిలోని కాంచనకు పక్కగదిలోని సంభాషణ విన్పిస్తూనే ఉంది. వచ్చింది డాడీ అని తెలిసినా పట్టించుకోలేదు. తీరిగ్గా ముస్తాబైముందు గదిలోకి వచ్చి తన హ్యాండ్‌బ్యాగ్ అందుకుంది. స్నిగ్ధలాగే చక్కగా చీర, జాకెట్‌లో సాంప్రదాయంగా, మరింత అందంగా మెరిసిపోతోంది.

తండ్రిని చూసి కూడా పలకరించలేదు. తనే కప్పులోకి కాఫీ వంచుకుని కిటికీ వద్దకెళ్ళి నిలబడింది. తండ్రీకూతుళ్ళు ఇలా ఎడమొఖం పెడమొఖంగా ఉండటం స్నిగ్ధకు ఇబ్బందిగా ఉంది.

"అక్కా! అతిథి మర్యాదలు చూసుకుని వెనకాల వస్తావా? నేను వెళ్తాను. కృతయుగ్ ఎదురుచూస్తుంటాడు" ఖాళీ కప్పు టీపాయ్ మీద ఉంచుతూ అడిగింది కాంచన.

"ఒక్క నిముషం కూచో వెళ్దాం. వచ్చింది మీ డాడీ. పలకరించవా?" ఒకింత కోప్పడింది స్నిగ్ధ.

"సారీ అక్కా. ఆయన మా డాడీనే. కాని ప్రస్తుతం మన శత్రువు. శత్రువుతో మనకి మాటలేమిటి?" నిర్మొహమాటంగా అంది కాంచన.

కూతురి మాటలకు నొచ్చుకున్నాడు అన్నారావు. ఆ బాధ ముఖంలో తెలుస్తోంది.

స్నిగ్ధ వంక చూస్తూ– "చూశావామ్మా. ఈ రాక్షసిని కని చివరికి తనకి శత్రువునయ్యాను. నేను చేసిన తప్పేమిటి? ఇక్కడి పరిస్థితులు బాగుండవు. గాబట్టి ఉజ్జయినీ రావద్దని చెప్పాను" "అబద్ధం" అంటూ ఆయన మాటల్ని ఖండించింది కాంచన.

"కృతయుగ్ ఉజ్జయినీలో ఉన్నాడని తెలిసే మీరు బయలుదేరారు. వస్తే నేను కృతయుగ్‌కి చేరువై పోతానని రావద్దన్నారు" అంది కాంచన.

"ఓ.కె. అలాగే అనుకో. వచ్చిందానివి నాక్కన్పించాలి గదా. తప్పించుకు తిరగడం దేనికి?"

"అందుకేగా శత్రువుల్ని బంధించినట్టు అక్కని, నన్ను మత్తుమందిచ్చి లాడ్జి గదిలో బంధించారు. మిమ్మల్ని ఎలా క్షమించగలను?" అంటూ బలవంతాన దుఃఖం ఆపుకుంటూ కళ్ళు తుడుచుకుంది.

తండ్రీకూతుళ్ళ సంవాదం వింటూ మధ్యలో ప్రేక్షకురాలిగా ఉండి పోయింది స్నిగ్ధ. అన్నారావు కాస్త ఇబ్బందిగా చూశాడు. "ఇందులో నా తప్పు లేదు. చేసిందంతా మహీధర్. ఆ వెధవ ఈ మధ్య నాతో చెప్పకుండానే కొన్ని పనులు చేస్తున్నాడు. సడెన్‌గా మిమ్మల్ని తీసుకురాగానే ఏంచేయాలో తోచక గదిలో ఉంచమన్నాను.

ఉదయం బయటికెళ్ళాల్సి వచ్చింది. మీకు ఎవరూ హాని చెయ్యలేదు గదా!" అన్నాడు.

"సమర్థించుకోకండి. మేం కనబడక భుజంగాయాన్ని కూడా లెక్క చేయకుండా కృతయుగ్ ఎంత హైరానా పడ్డాడో మాకు తెలుసు. మీరిప్పుడు నచ్చచెప్పి నన్ను మీ వద్దకు తీసుకుపోవాలనే వచ్చారు. కాని అది జరగని పని. ఐ లవ్ యూ డాడ్. బట్. ఇప్పుడు మీమాట వినలేను. సారీ" కూతురు అంత ఖచ్చితంగా తన అభిప్రాయాన్ని చెప్పాక కూడా ఇంకేం మాట్లాడాలో అన్నారావుకి అర్థం కాలేదు. అతడ్ని ఆ పరిస్థితి నుంచి బయటపడేయటానికే అన్నట్టు మధ్యలో స్నిగ్ధ కల్పించుకుంటూ–

"కాంచనా! ఎదుటివ్యక్తి అభిప్రాయం తెలుసుకోకుండానే నోరు పారేసు కోవడం మంచిదికాదని తెలీదా? వచ్చింది సాక్షాత్తు మీ డాడీ. శత్రువు కాదు. పొరబాట్లు దొర్లి ఉండొచ్చు. అంతమాత్రాన శత్రువుగా చూడ్డం తప్పు. కాస్సేపు నువ్వు మౌనంగా ఉంటే నీ తరపున నేను మాట్లాడతాను. ఏమంటావ్?" అంది.

"అక్కా. డాడీ అంటే నాకు ప్రాణం. నీకు తెలీని విషయం కాదు. కాని జరిగింది తలుచుకుంటేనే బాధగా ఉంది. ఓ.కె. నువ్వు చెప్పావుగా. ఇక మాట్లాడను" అంటూ ఎడంగాపోయి సోఫాలో కూచుని చెమర్చిన కళ్ళు తుడుచుకుంది. స్నిగ్ధ అన్నారావు వంక చూసింది.

"సారీ బాబాయ్ గారూ. తనమాటలు పట్టించుకోకండి. మీరు కూతుర్ని చూసి వెళ్ళాలనే వచ్చారనుకుంటున్నాను. అంతకుమించి ఏమన్నా సందేహాలు ఉంటే అడగండి. నేను తీరుస్తాను. తను మాట్లాడదు. మీరు నిస్సంకోచంగా అడగండి" అంది.

"ఇఫ్ యూ డోంట్ మైండ్. సిగరెట్ కాల్చుకోవచ్చా తల్లీ?" అభ్యర్థనగా అడిగాడు అన్నారావు.

కూతురి పెడసరం మూలంగా ఆయన నెర్వస్ ఫీలవుతున్నాడు. అందుకే తట్టుకోవడానికి సిగరెట్ అభ్యర్థించాడు. "ష్యూర్. ఇది మీ రూమ్ అనుకోండి బాబాయ్. ఇక్కడ పరాయివాళ్ళు ఎవరూ లేరు. నిరభ్యంతరంగా కాల్చుకోండి" అంటూ కిందనుంచి ఆష్ట్రే తీసి టీపాయ్ మీద ఉంచింది స్నిగ్ధ.

కృతయుగ్ ఎప్పుడన్నా ఒక సిగరెట్ కాలుస్తాడు. అతడి కోసం ఉంచిన ఆష్ట్రే అది. సిగరెట్ ముట్టించుకున్నాడు అన్నారావు. గుర్రుగా తండ్రి వంక చూస్తోంది కాంచన. "రాత్రి మందు ఎక్కువై ఉంటుంది. మమ్మీ నేను ఎంతపోరినా వింటేనా. కళ్ళు ఎర్రబారి ముఖం ఎలా పీక్కుపోయిందో చూడక్కా. సిగరెట్లు, మందు ఎప్పుడు మానేస్తారో అడుగు" అంది బాధగా కాంచన.

వస్తున్న నవ్వుని బలవంతంగా ఆపుకుంది స్నిగ్ధ. ఎన్ని కోపతాపాలున్నా రక్తసంబంధం ఎక్కడికిపోతుంది? కాంచన బాధపడ్డంలో ఆశ్చర్యంలేదు.

"ఏం చేయమంటావ్ తల్లీ. నీ గురించే నా టెన్షను" సమర్థించు కోబోయాడు అన్నారావు.

వెంటనే ఖండించింది కాంచన. "నా గురించి కాదు. నిధి గురించని చెప్పండి" అంది. "అంటే నీ గురించి నాకే బాధ్యతాలేదనా నీ ఉద్దేశ్యం?" "ఉంటే తెగేవరకు పరిస్థితి తీసుకురారు మీరు"

మళ్ళీ గొడవపడేట్టున్నారని గ్రహించి వెంటనే వారించింది స్నిగ్ధ. "కాంచనా... కీప్ క్వైట్. మాట్లాడకూడదు" మందలించింది.

"ఓ.కె అక్కా... సారీ" అంటూ ముఖం అటువైపుకి తిప్పుకుంది కాంచన.

"మీ ఇద్దరే కన్పిస్తున్నారు. కృతయుగ్ ఎక్కడ?" అనడిగాడు. "ట్రీట్‌మెంట్ కోసం హాస్పిటల్లో జాయినయ్యాడు. రావటానికి నాలుగురోజులు పడుతుంది"

బదులిచ్చింది స్నిగ్ధ. ఏ హాస్పిటలని అడగాలని నోటి చివరికొచ్చిన మాటల్ని మింగేశాడు అన్నారావు. అడిగినా చెప్పరని తెలిసీ అడగటం వృథా గదా!

"ఓ.కె. ఒక అబ్బాయి, అమ్మాయి పెళ్ళిగాకుండా కలిసి ఉండటమే తప్పు. అలాంటిది మీరిద్దరూ కృతయుగ్‌తో కలసి ఒకేసూట్‌లో ఉండటం కరెక్టా? నలుగురూ ఏమీ అనుకోరా? మరోలా అనుకోవద్దు. ఈజిట్ కరెక్ట్?"

కాంచనకు సర్రున కోపం ముంచుకొచ్చింది. ఏదో అనబోతుంటే కళ్ళతోనే వారించింది స్నిగ్ధ. అన్నారావు వంక దరహాసంతో చూసింది. "బాబాయ్‌గారూ. మీ సందేహం అర్థమైంది. ఒకరేదో అనుకుంటారని... ఊహు. ఇది కరెక్ట్ కాదు. మనకోసం మనం బ్రతుకుతున్నాం. ఒకరికోసం కాదు. అప్పుడప్పుడూ సంప్రదాయాల్ని పక్కన పెట్టాల్సొస్తుంది. తప్పదు. మనం పవిత్రంగా ఉన్నంత వరకు ఒకరికి భయపడాల్సిన పనిలేదు. ఒకే సూట్‌లో వున్నా కృతయుగ్ గది వేరు, మా గది వేరు.

ఇనుముతో చేరినంత మాత్రాన నిప్పు పవిత్రతకి లోటురాదు. కృతయుగ్ నిప్పులాంటివాడు. మీరు మా గురించి దిగులు చెందక్కర్లేదు" అంది.

"కాని ఇద్దరమ్మాయిలు ఒక అబ్బాయిని ప్రేమించడం, పెళ్ళిచేసు కోవడం లోకవిరుద్ధం కాదా? హిందూవివాహ చట్టం ప్రకారం ఒక యువకుడు ఒక యువతిని మించి పెళ్ళి చేసుకోకూడదు. అలా చేసుకోవడం నేరం."

"అంటే ఇప్పుడు లోకంలో ఒకరికన్నా ఎక్కువ భార్యలున్నవారు లేరనా మీ ఉద్దేశం?"

ఈ ప్రశ్న అన్నారావుని కాస్త ఇబ్బంది పెట్టింది. ఏదో చెప్పబోయాడు. అంతలో కాంచన అందుకుంది. "లోకంలో అలాంటివారు ఎందుకు లేరు? చట్టప్రకారం ఇంట్లో ఒకావిడ, చట్టానికతీతంగా బయట ఒకావిడాను. నువ్వడుగక్కా.

ఆయన చీటికీ మాటికీ హైదరాబాద్ నుంచి సికింద్రాబాద్‌కి ఎందుకెళ్తున్నారో కనుక్కో. మా ఇంట్లో నేను ఒక్కదాన్నే. ఆ ఇంట్లో తమ్ముడు ఒక్కడే. నన్ను చూస్తే అక్కాని పిలవటానికి భయపడతాడు. ఇంటర్ చదువు తున్నాడు. నాకు విషయం తెలిశాక, ఆగలేక స్కూలుకెళ్ళి వాడ్ని చూసి పలకరించి వస్తుంటాను.

ఒకే తండ్రికి పుట్టినవాళ్ళం. కాని ఒకేవిధమైన అర్హత, ప్రేమ పొందలేక పోతున్నాం. ఇదేనా ప్రేమను పంచడం అంటే. ఈ రోజుకీ మమ్మీకి ఈ విషయం

తెలీదు. రెండో భార్యను చట్టం ఒప్పుకోదు. ఉంచుకుంటే పట్టించుకోదు అనుకుంటే, ఓ.కె. కృతయుగ్ నన్నుంచుకోనీ. ఐ డోంట్ కేర్" అంది ఉక్రోషంగా.

మరోసారి ముఖంమీద చన్నీళ్ళు కొట్టినట్టు కుచించుకుపోయింది అన్నారావు ముఖం.

"ఓమైగాడ్. ఈ పిల్ల నా పరువుమర్యాదల్ని ఉజ్జయినిలో ఎండగట్టేట్టుంది. నీకేం అపకారం చేశానని ఈ రకంగా కక్ష సాధిస్తున్నావ్ కాంచనా?" బాధగా అడిగాడు.

"మీరెందుకలా అనుకుంటారు డాడీ. వాస్తవాలు తెలుసుకోవాలనేగా వచ్చారు?

వాస్తవాలు మాట్లాడుకుందాం. మీ జీవితంలోనూ ఇద్దరు ఆడాళ్ళున్నారు. ఒకరికిచ్చిన ఉన్నత స్థానాన్ని రెండో వారికెందుకివ్వరు? న్యాయం గురించి అడిగేవాళ్ళు న్యాయాన్ని పాటించక్కర్లేదా?" అంది నిలదీస్తున్నట్టు కాంచన. చర్చను మరీ పొడిగించడం ఇష్టం లేని స్నిగ్ధ మధ్యలో కల్పించుకుంటూ–

"పర్సనల్ విషయాలు ఇంతటితో ఆపేద్దాం. బాబాయ్‌గారు! మీ ఉద్దేశం నాకు బోధపడింది. మేమిద్దరం కృతయుగ్‌ని ప్రేమించడం, పెళ్ళిచేసుకోవాలనుకోవడం మీకు విడ్డూరంగాను, చట్ట వ్యతిరేకంగాను తోచవచ్చు. మనకి ఎన్నో మంచి చట్టాలు ఉన్నాయి. ఆ చట్టాల్లో మార్పులు, కొత్త చట్టాలూ వస్తున్నాయి.

అయితే వచ్చిన చట్టాలన్నీ అమలవుతున్నాయా? లేదు. ఎవరో ఒకరు ఇక్కడ తప్పు జరుగుతోంది అని కంప్లయింట్ చేస్తే గాని చట్టం మన జోలికి రాదు. ఇక మొదటి భార్య ఉండగానే ఏయే సందార్భాల్లో రెండోభార్యను చేసుకోవడానికి చట్టం అంగీకరిస్తుందీ అంటే, మనం అంత లోతుగా చట్టం గురించి చెప్పుకోనక్కర్లేదనుకుంటాను. త్రేతాయగంలో ఒకే భార్య ఒకే బాణం అంటూ– ఏకపత్నీవ్రతుడైన శ్రీరామచంద్రుడే, ద్వాపరయుగంలో కృష్ణావతారం వచ్చేసరికి ఎనమండుగురు భార్యల్ని చేసుకున్నాడు మరి.

మనుధర్మం ప్రకారం చూసినా రాజైనవాడు తన కులంతోబాటు మిగిలిన మూడు కులాల నుంచిమొత్తం నలుగురు కన్యల్ని వివాహం చేసుకోవాలంటాడు.

రాజుననుసరించే ఆనాటి ప్రజలూ బహుభార్యత్వం పాటించేవారు. ఇందుకే పెద్దలు దేశ కాల పరిస్థితుల్ని బట్టి న్యాయధర్మాలు మారుతుంటాయన్నారు.

ఇప్పుడు కలికాలం గాబట్టి హిందూ వివాహచట్టం ప్రకారం ఒక కన్యనే వివాహం చేసుకోవాలి. కాని ఇష్టపడి చేసుకుంటే ఏ చట్టం ఆపలేదు.

ఇదంతా ఎందుకు చెప్పానంటే లోకంలో లేని వింతేమీ మామధ్య లేదు. మీకు అర్థంకావాలని ఇదంతా చెప్పానుగాని నిజానికి పెళ్ళి గురించి ఇప్పుడు మేం ఆలోచించడం లేదు. మా భుజాలమీద ఒక గురుతరమైన బాధ్యత ఉంది.

అదేమిటో మీకు కృతయుగ్ చేప్తేనే బాగుంటుంది. ఆ బాధ్యత నెరవేరాకే పెళ్ళి ఆలోచన. సందేహం అక్కర్లేదు. మీ అందరి సమక్షంలోనే అప్పుడు మా వివాహం జరుగుతుంది. బాబాయ్‌గారూ! నేనూ సగటు ఆడపిల్లనే. అందరిలో ఉండే భావోద్వేగాలు నాలోనూ ఉన్నాయి. మామధ్య మరో అమ్మాయి వస్తోందంటే ఒప్పుకునే దాన్ని కానేమో! కాని ఈ రోజు నేను, కృతయుగ్ ఇలా ప్రాణాలతో ఉన్నామంటే కారణం కాంచన.

తన ప్రాణాలను పణంగాపెట్టి మమ్మల్ని కాపాడుకుంది. ఏమిచ్చి ఋణం తీర్చుకోగలం.

తనను మాలో కలుపుకోవడం తప్ప? నన్ను తన అక్కలా చూస్తోంది. మా ముగ్గురి ప్రాణాలు ఒకటని తెలిశాక ఇక దూరంగా ఉంచలేను గదా?

సో... మా గురించి మీరు బాధపడక్కర్లేదు. కాంచన మాతో ఉంటేనే సంతోషంగా ఉంటుంది. మీరు మమ్మల్ని అర్థంచేసుకుంటారని ఆశిస్తాను" అంది.

స్నిగ్ధ అంత వివరంగా చెప్పాక ఇంకేం అడగాలో అన్నారావుకి తోచలేదు. భారంగా నిట్టూర్చి లేచాడు.

స్నిగ్ధ, కాంచనలూ నిలబడ్డారు.

"అమ్మా స్నిగ్ధా. నువ్వింత చెప్పాక కూడా నేను నా బిడ్డ గురించి బెంగపడ్డంలో అర్థం లేదు. వస్తాను" అంటూ కాంచన ముందుకెళ్ళి ప్రేమగా జుత్తు నిమిరాడు.

"ఎప్పుడూ నన్ను శత్రువుగా చూడకు తల్లీ. భరించలేను. కృతయుగ్ నాతో ఓ మాటన్నాడు. "కాంచనను తండ్రిలేని పిల్లగా చూడలేను. అందుకే మీతోబాటు మీ మనుషులందర్నీ కాపాడాలనొచ్చాను" అన్నాడు.

ఆ ఒక్కమాట చాలు. అతనెంత బాధ్యత ఎరిగినవాడో చెప్పటానికి. "కృతయుగ్ నాకు నచ్చాడు. ఒద్దికగా అతడి ప్రేమను పంచుకోగలిగితే మీ ఇద్దరూ అదృష్టవంతులే. నే వెళ్తున్నాను. నీ క్షేమంకోరే నీ తండ్రి ఇక్కడే ఉన్నాడని మర్చిపోకు" అని చెప్పి చరచరా బయటికి నడిచాడు. డోర్ దాటబోతూ ఒక్కక్షణం ఆగి తిరిగి చూశాడు. " నా నుంచిగాని, నా మనుషులనుంచి గాని మీకెలాంటి హాని జరగదు. కాని మహీధర్ విషయంలో మీరు అప్రమత్తంగా ఉండకతప్పదు.

కృతయుగ్ మీద వాడికి ద్వేషం పోలేదు. రేపు మీరు నన్ను అపార్థం చేసుకోకూడదని ఓ మాట ముందే చెప్తున్నాను" అంటూ హెచ్చరించి వెళ్ళిపోయాడు.

ఆయన వెళ్ళిన పదినిముషాల తర్వాత యువతులిద్దరూ తమ సూట్ లాక్ చేసుకుని ఆటోలో కృతయుగ్ వున్న ఆస్పత్రికి బయలుదేరారు.

* * * * *

వారం గిర్రున తిరిగిపోయింది. కృతయుగ్ కదలకుండా బుద్ధిగా ఆస్పత్రిలోనే ఉన్నాడు. డాక్టర్ దయానిధికూడా తనమాట నిలబెట్టుకున్నాడు. నాలుగో రోజుకే గాయం ఆరిపోనారంభించింది.

నొప్పి తెలీకుండాపోయింది. అయిదోరోజు ఉదయం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశాడాయన. ఆ రోజు మరునాడుకూడా ఉజ్జయిని దాని పరిసరాలు హ్యాపీగా తిరిగి చూసొచ్చారు ముగ్గురూ. ఏడోరోజు వచ్చింది. ఆ రోజు ఇరువర్గాలు సమావేశం కావలసిన రోజు.

ఉజ్జయినికి ఉత్తరంగా అయిదు కిలోమీటర్ల దూరంలోని నిర్జన ప్రాంతంలో ఉంది శిథిలబౌద్ధారామం. చుట్టూ మూడు కొండగుట్టల మధ్య ప్రాంతం అది. పరిసరాలన్నీ దట్టమైన పొదలు చెట్లతో నిండి కన్పిస్తాయి.

ఈ ప్రాంతం అడవి కాదు. ఒకప్పుడు అడవిలో భాగమైనా తర్వాత కాలంలో చుట్టూ పంటభూములు ఏర్పడి ఇది సేద్యానికి అనుకూలంగాని ప్రాంతంగావటంతో అందరూ దాన్ని వదిలేశారు.

అక్కడికి ఎగువకెళ్తే పంటభూములు కన్పిస్తాయి. ఆరామం చాలావరకు శిథిలమైపోయింది. రెండు మండపాలు మాత్రం ఇప్పటికీ నిలిచి ఉన్నాయి. ఇది ఏ కాలంలో ఎవరు కట్టారో కూడా తెలీదు.

ఆధారాలు కూడా లేవు. బౌద్ధం ఉచ్ఛదశలో వున్న కాలంలో దీని నిర్మాణం జరిగి వుండాలంటారు.

ఉదయం ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ పశువుల కాపరులు విశ్రాంతికోసం వస్తూంటారు. అప్పుడప్పుడూ సాయంకాలం వేళ ప్రేమజంటలకు ఈ ప్రాంతం భూలోక స్వర్గంలా ఉంటుంది అంటే ఆశ్చర్యం కాదు.

అక్కడికి రెండు వందలగజాల దూరంలో కొండగుట్ట అవతల హైవేలో ఆటోదిగి పంపించేసి కృతయుగ్‌తో బాటు స్నిగ్ధ, కాంచనలు బౌద్ధారామ

ప్రాంతంలోకి అడుగుపెట్టారు. అప్పటికింకా అన్నారావు వర్గం రాలేదు. ముగ్గురూ మండపంలో కూచున్నారు.

"కృతా... మనకి ఈ సమావేశం అవసరమంటావా? చూడు ఇంత వరకు రాలేదు. మనమాట వాళ్ళు వినరు. మనపనులు మనం చూసుకోవడం బెటరనుకుంటాను" అంది విసుగు ప్రదర్శిస్తూ కాంచన.

"అక్కడే పొరబాటు పడుతున్నావ్. మనం మాత్రమే చూసుకోవడం సాధ్యంకాని పనులివి. నీకు ముందు ముందు అర్ధమవుతుంది. ముఖ్యంగా అనంతస్వామి సహకారం మనకి చాలా అవసరం.

చూద్దాం. ఎంతవరకు మనతో కలిసి వస్తారో చూసి తదుపరి కార్యక్రమం ఆలోచిద్దాం" అన్నాడు కృతయుగ్. అంతలో స్నిగ్ధ అతడి భుజంమీద చేయి వేసింది. ఏమిటానిచూసిన కృతయుగ్‌కి పొదలమాటు నుంచి ఒక్కొక్కడుగా బయటికొస్తూ కన్పించారు కొందరు అపరిచితులు. చూస్తుంటే వాళ్ళంతా లోకల్ గూండాలు లేదా క్రిమినల్స్‌గా కన్పిస్తున్నారు.

ఒకడుకాదు, ఇద్దరు కాదు... సుమారు ఇరవైమంది ఉంటారు. ఉత్తినే రాలేదు వాళ్ళు. చేతుల్లో ఐరన్‌రాడ్‌లు, పొడవు కత్తులతో వచ్చారు. ఇది యాధృచ్ఛికం కాదని తమకోసం ఇక్కడ కాపువేశారని కృతయుగ్‌కి అర్ధమై పోయింది.

లోకల్ గూండాల్ని తమపైకి అంపకంచేసిన పెద్ద మనిషి ఎవడై ఉంటాడని ఆలోచిస్తూ మండపం దిగాడు కృతయుగ్. "అక్కా! నువ్వు మండపం దిగొద్దు. వీళ్ళ సంగతి మేం చూసుకుంటాం" అంటూ స్నిగ్ధను హెచ్చరించి హుషారుగా మండపం దిగింది కాంచన. "వీళ్ళ సంగతి నే చూస్తాలే. నువ్వూ స్నిగ్ధ వద్ద ఉండు" అన్నాడు కృతయుగ్.

"సారీ! నా సంగతి తెలిసి కూడా ఆపకు. నా చేతి దెబ్బ ఏమిటో బావకు రుచి చూపించాలి"

"బావా... అంటే మహీధర్..."

"సందేహం లేదు. నిన్ను చంపాలని ఈ వెధవల్ని వెంటేసుకొచ్చినట్టున్నాడు. ఇక్కడే ఎక్కడో ఉంటాడు" అంటూ తనూ రెడీ అయింది కాంచన.

ఇంతలో ఒక పొదచాటు నుంచి ఇవతలికి వచ్చాడు మహీధర్. వస్తూనే– "వాడే... వాడ్ని చంపండి. ఖతం చేయండి" అంటూ కృతయుగ్‌ను వేలెత్తి చూపిస్తూ పెద్దగా అరిచి తన మనుషులకు ఆర్డర్ వేశాడు.

సందేహనివృత్తి అయిపోయింది. కాంచన తనకు దక్కదన్న ఉక్రోషంతో తనను చంపించటానికి కిరాయి మూకతో బయలుదేరి వచ్చాడు మహీధర్. ఆవేశంతో కృతయుగ్ పిడికిళ్ళు బిగించాడు.

వచ్చిన గూండాలంతా మందుకొట్టి కన్ను మిన్ను తెలీకుండా ఉన్నారు. మహీధర్ ఆర్డర్ వింటూనే ఆయుధాలు ఝళిపిస్తూ దూసుకొచ్చేశారు. వాళ్ళ వెనకే తనూ ఓ ఇనపరాడ్‌తో వచ్చేశాడు మహీధర్. పరిస్థితి చూడగానే- కోపావేశంతో ఊగిపోయాడు కృతయుగ్. అవధులు దాటిన రౌద్రావేశంతో మంద పైకి ఎగబడిన పెద్దపులిలా వాళ్ళ మీదకు దూకాడు. అతడి వెనకే ఆడ చిరుతలా కాంచన కూడా పోరాటంలోకి ఎంటరై పోయింది.

సంకుల సమరం ఆరంభమైంది. మండపం మీద నిలబడి భీకర పోరాటాన్ని వీక్షిస్తోంది స్నిగ్ధ.

తనకి ఈ గొడవలు, పోట్లాటలు తెలీదు. గతంలో దంతేవారా కోట సమీపంలో జరిగిన పోరాటం గుర్తుంది. తన చెల్లెలు నిత్యను కాపాడ్డంకోసం అప్పుడు చింటూభాయ్ వర్గంతో కృతయుగ్, కాంచనలు వీరోచితంగా జరిపిన పోరాటం తనింకా మర్చిపోలేదు.

వీళ్ళిద్దరూ రంగంలో ఉండగా ఏభైమంది వచ్చినా ఏమీ చేయలేరని తెలుసు. మహీధర్ గూండాల్ని తెచ్చి చాలా తప్పుచేశాడనిపించింది స్నిగ్ధకు.

ఈ విషయం పోరాటం ఆరంభమైన అయిదో నిముషంలోగాని మహీధర్‌కి అర్థంకాలేదు. కాంచన మార్షల్ ఆర్ట్స్‌లో దిట్టని తెలుసు. కృతయుగ్ అంతకు మించిన ప్రతిభాశాలి అని కళ్ళారా చూశాకగాని అర్థంకాలేదు. సాదాసీదా యువకుడు పది ఇనపరాడ్ దెబ్బలుపడితే తల పగిలి ఛస్తాడు అనుకున్నాడు. అంచనా మొత్తం తారుమారై చూస్తుండగానే అరడజనుమంది తెలివితప్పి కిందపడిపోయారు.

ఆయుధం చేత్తో పట్టకుండానే దెబ్బకు ఒకడ్ని పడగొడుతున్నాడంటే చేతిలో ఆయుధం పడితే వీళ్ళంతా నిలవగలరా అని సందేహం రావడంతో మూర్ఛ వచ్చినంత పనైంది వాడికి. మతి పోగొట్టుకుని చూస్తున్నాడు పోరాటాన్ని. మొదట "కొట్టండి... చంపండి" అని రంకెలేసినా తరువాత అరవటానిక్కూడా గొంతు పెగలక పోరాటానికి బయటే నిలబడిపోయాడు.

వచ్చినవాళ్ళు కరడుగట్టిన క్రిమినల్స్, అందులో సందేహం లేదు. కాని చేతిలో ఆయుధం పట్టకుండానే గిరికీలు కొడుతూ తమ ఆయుధాలకు అందకుండా

అదను చూసి దెబ్బకు ఒక్కడుగా పడగొట్టేస్తున్న కృతయుగ్, కాంచనల్ని చూడగానే వచ్చిన వాళ్ళకి చుక్కలు కన్పించాయి.

అయినా పట్టుదలగా పోరాడుతూనే ఉన్నారు. ఈ లోపల ఆరుగుర్ని పడగొట్టిన కాంచన నెమ్మదిగా తనవైపు కదలిరావడం చూడగానే మహీధర్‌కి నిలువునా చమటలుకమ్మాయి.

గిరుక్కున వెనుతిరిగాడు మహీధర్. వాడు పారిపోతున్నాడని గ్రహించిన కాంచన అడ్డంగావున్న ఇద్దరు గూండాల్ని చెరో తన్నుతన్ని ఒక కత్తిని అందిపుచ్చుకుని పారిపోతున్న మహీధర్ వెంటబడింది.

ఆరంభమైన క్షణం నుండి కేవలం ఇరవై నిముషాలు వ్యవధిలోనే పోరాటం అంతమైంది.

కృతయుగ్ చేతిలో చావుదెబ్బలు తిని కిందపడి కొందరు మూలుగుతుంటే, కొందరు తెలివితప్పిపోయారు. ఆఖరివాడ్ని కూడా పడగొట్టాక చుట్టూ చూసిన కృతయుగ్‌కి మహీధర్ ఎటుపోయాడో కన్పించలేదు. చూస్తే కాంచన కూడా లేదు.

చేతికి దొరికితే కాంచన వాడ్ని చంపేస్తుందని భయపడ్డాడు కృతయుగ్. వాళ్ళని వెదుకుతూ చెట్ల వెనక్కి పరుగుతీశాడు.

మండపం దిగి అతడ్ని అనుసరించింది స్నిగ్ధ.

కొంతదూరం వెళ్ళాక అక్కడ కన్పించిన దృశ్యం చూసి ఇద్దరూ షాకయిపోయారు.

కాంచన చేతిలో చావుదెబ్బలు తిని ఒక పొద పక్కన నేలమీద పడున్నాడు మహీధర్. బట్టలు చినిగి ముఖం డోక్కుపోయి ఉంది. ఎదురుగా కత్తి వాటంగా పట్టుకుని అపరచండిలా నిలబడుంది కాంచన.

కోపంతో ముఖం కుంకుమపువ్వులా ఎర్రబారింది. ఆవేశంతో ఊగిపోతోంది. "వద్దు...ప్లీజ్ కాంచనా.... నన్ను చంపకు" బతిమాలుకుంటున్నాడు మహీధర్.

"నీలాంటి కీటకాన్ని చంపేయాలి. లేదంటే మళ్ళీ మళ్ళీ కుడుతూనే ఉంటుంది. మా జోలికొస్తే నా చేతిలోనే ఛస్తావని ముందే నిన్ను హెచ్చరించానా లేదా?" అరుస్తోంది కాంచన. "తప్పయిపోయింది ఇక రాను".

"గ్యారెంటీ ఏమిటీ? నీ ప్రాణాలు కాపాడి కృతయుగ్ తప్పు చేశాడు. విశ్వాసంలేని కుక్కవి గాబట్టి తనని చంపాలని వెధవల్ని వెంటేసుకొచ్చావ్.

అమ్మా, బాబు పోయారని జాలిపడి నిన్ను మా ఇంట్లో ఉంచి నాతో బాటు నిన్ను పెంచారు డాడీ. నిన్ను ఇష్టపడుతున్నానని ఏ రోజూ నేను చెప్పలేదు. ఆస్తి కోసం, నాకోసం ఏ దుర్మార్గానికీ వెనుకాడని విశ్వాసఘాతకుడివి. నువ్వు చావాల్సిందే...." కత్తి లేపింది కాంచన.

కెవ్వున అరిచాడు మహీధర్. "కాంచనా... స్టాపిట్... ఆగు" అనరిచాడు కృతయుగ్.

"నీకు తెలీదు బావా. వీడు బతక్కూడదు" కృతనిశ్చయంతో అరిచింది కాంచన.

"ఏయ్...నీ బావని నేను కదా.... వాడ్ని బావా అంటావేమిటీ?" మహీధర్ అరిచాడు.

"అక్కమొగుడు బావే కదా!" అంది కాంచన.

"అక్కెవరు?" "స్నిగ్ధ"

"వాళ్ళకింకా పెళ్ళికాలేదు" "చేసుకుంటారు"

"మరి నువ్వు?"

"అక్క మొగుడే నా మొగుడు. నీకేంటి బాధ. చచ్చేవాడివి నీకీ వివరాలు అవసరమా...."

"ఇదన్యాయం. లోకంలో మగాళ్ళకు కొరత వచ్చినట్టు ఇద్దరమ్మాయిలు ఒకడ్ని చేసుకోవడం ఏమిటీ?" "ఒరే ఫూల్. నోరు మూసుకోకుండా దాన్ని రెచ్చగొడతావేంట్రా. అనవసరంగా ఛస్తావ్. కత్తి పట్టాక చంపకుండా వదలదు" అరిచాడు కృతయుగ్.

"లేదు బావా, వీడయిపోయాడు. చంపేస్తాను" కత్తిపిడిని బలంగా పట్టుకుంటూ అంది కాంచన.

"నీ...అలాంటి పిచ్చిపని చేయకు. మనం వచ్చింది ఇక్కడ హత్యలు చేసి జైలుకెళ్ళటానిక్కాదు. వాడ్ని వదిలెయ్" అన్నాడు కృతయుగ్.

ఒక్కక్షణం ఆగింది కాంచన. "అవును కాంచనా వాడ్ని వదిలెయ్. అవతల మనకు చాలా పనులున్నాయి. ఈ టైమ్‌లో హత్య పద్ధతి కాదు. వదిలెయ్" అంటూ స్నిగ్ధ కూడా హెచ్చరించింది.

"ఓ.కె. మీరిద్దరూ వీడ్ని క్షమించినా నేను క్షమించలేను. ప్రాణం తీయను. కాని పదిరోజులు ఆస్పత్రిలోపడుంటే మన పనులకి అడ్డంరాకుండా ఉంటాడు–"

అంటూ కత్తిని నిలువునా భుజంలోకి దించేసి వేగంగా ఇవతలికి వచ్చేసింది కాంచన.

బాధతో మహీధర్ పెట్టిన కేకలకి చెట్లకొమ్మల మీది పక్షులు కకావికలై గాల్లోకి ఎగిరాయి. "ఓ మైగాడ్. మరీ ఇంత ఆవేశం మంచిదికాదు కాంచనా. వీడ్ని వదిలేయాల్సింది" అంటూ మహీధర్ వద్దకెళ్ళి పక్కన కూచున్నాడు కృతయుగ్.

షర్టుచించి గాయాన్ని పరిశీలించాడు. భుజం ఎముకను టచ్‌చేయకుండా కండను చీల్చుకొని నాలుగంగుళాల వెడల్పున గాయం చేస్తూ ఇటునుంచి అటు పొడుచుకొచ్చి ధ్వజస్తంభంలా నిలబడుంది కత్తి.

కత్తిని బయటకు లాగేశాడు కృతయుగ్. షర్టును పీలికలుగా చించి నెత్తురు ఎక్కువ పోకుండా కట్టుకట్టాడు. సరిగ్గా ఇదే సమయానికి అన్నారావు బృందం మూడు వ్యాన్‌లలో అక్కడికి చేరుకుంది.

పరిస్థితి చూడగానే ఏం జరిగిందీ అన్నారావుకి అర్ధమైపోయింది. తను ఊహించినట్టే జరిగింది. తనిచ్చిన మూడో ఆవకాశంలో మహీధర్ ఓడిపోయాడు. తాము వచ్చిన వ్యాన్‌లలో ఒక వ్యాన్‌లో మహీధర్‌ని ఎక్కించి తోడుగా ఇద్దర్ని ఇచ్చి వెంటనే ఆస్పత్రికి పంపించాడు అన్నారావు.

గూండాలు వచ్చిన పెద్దవ్యాన్ ఒకటి చెట్ల వెనుక ఉంది. డ్రైవర్ వ్యాన్‌లోనే ఉన్నాడు. గూండాలందర్నీ వ్యాన్‌లోకి ఎక్కించి వాళ్ళని కూడా పంపించేశాడు.

"డాడీ! కృతయుగ్ ఆపకుంటే ఈ రోజు బావ నాచేతిలో చచ్చుండేవాడు. తనతో చెప్పండి. ఇంకెప్పుడూ మా జోలికి రావద్దని" అంటూ రిపోర్ట్‌చేసింది కాంచన.

"నాకు తెలుసమ్మా. అందుకేగా ముందే నిన్ను హెచ్చరించాను. ఇక పిచ్చివేషాలేయడులే. పదండి. అరే పీటర్.

మేమిలా వెళ్ళి మండపంలో కూచుంటాం. కొత్త వాళ్ళెవరూ అటు రాకుండా చూసుకోండి" అని హెచ్చరించి ముందుకు దారితీశాడు అన్నారావు.

పీటర్ తన మనుషులతో చుట్టూ కాపలా ఉండగా అనంతస్వామి, అన్నారావులతో బాటు కృతయుగ్, స్నిగ్ధ, కాంచనలు ఒక మండపంలోకి వెళ్ళి రౌండ్‌టేబుల్ సమావేశంలా కూచున్నారు వృత్తాకారంలో.

"గాయం ఎలా ఉంది నాయనా?" పరామర్శించాడు అనంతస్వామి.
"తమదయ స్వామీ. తగ్గిపోయింది" అన్నాడు కృతయుగ్.

"అంతా ఈశ్వరేచ్ఛ. ఇక ఆరంభించండి"

కృతయుగ్, స్నిగ్ధ వంక చూశాడు, "నువ్వు చెప్తావా, నేను చెప్పనా?" అడిగాడు.

"నువ్వు చెప్పు. సందేహాలుంటే నేను తీరుస్తాను" అంది స్నిగ్ధ. "ఓ.కె." అంటూ గొంతు సవరించుకున్నాడు కృతయుగ్ "పాపపుణ్యాలమీద మీ అభిప్రాయం ఏమిటీ?" అన్నారావుని సూటిగా అడిగాడు.

"పాపపుణ్యాలా! అవి ఎలా ఉంటాయి. ఎక్కడుంటాయి?" అంటూ నవ్వాడు అన్నారావు.

"పుణ్యాత్ముడు పుష్కలంగా డబ్బు సంపాదిస్తాడు. అదే అతడి పుణ్యం. పాపాత్ముడు డబ్బు సంపాదించలేక ఎప్పుడూ ఆర్థిక ఇబ్బందులతో కష్టాలు పడుతుంటాడు. అదే అతడి పాపం.

ఇంతకుమించి వేరే పాపపుణ్యాల గురించి నాకు తెలీదు" అంటూ బదులిచ్చాడు.

అతడి అభిప్రాయంతో ఏకీభవిస్తున్నట్టు గాని విభేదిస్తున్నట్టుగాని కృతయుగ్ తెలపకుండా "అలాగా" అన్నట్టు చూసి ఊరుకున్నాడు.

"దేవుడి సొమ్ము అపహరించడం మహా పాపమని అంటారు. మీరేమంటారు?" తన రెండో ప్రశ్న అడిగాడు కృతయుగ్. "పాపమని నేననుకోను" వెంటనే బదులిచ్చాడు అన్నారావు.

"ఎందుకంటే నిజంగా అది పాపకార్యమైతే దేవుడెందుకు వాళ్ళని శిక్షించడంలేదు? ఈ రోజుల్లో నీతులు చెప్పేవాళ్ళెవరూ నీతిగా నడుచుకోవడం లేదు. ఆ మాటకొస్తే దేవుడి సొమ్మును ఇష్టంగా తినే ఘనులు గతకాలంలోనూ ఉన్నారు. దొరకాలేగాని దేవుడేమిటి, దయ్యం ఏమిటి ఎవరి సొమ్మయినా గుటకాయస్వాహా చేసేస్తున్నారు.

దేవుడికి ధూపదీపనైవేద్యాలకు లోటురాకుండా దేవాదాయం కోసం ఆనాటి భక్తులు మడులు, మాన్యాలు ఆలయాలకు రాసిచ్చారు. ఆ భూములన్నీ ఎలా అన్యాక్రాంతమయ్యాయి? మనరాష్ట్రంలోనే ప్రముఖక్షేత్రాలెన్నో ఉన్నాయి.

సింహాద్రి అప్పన్నభూములకు ఎలా రెక్కలొచ్చాయి? అంతర్వేది నరసింహస్వామి వేలాది ఎకరాలు ఎటుపోయాయి? తిరుపతి వెంకన్న భూములు ఎలా తరిగిపోయాయి? ఆనాటి ప్రభువులు చేయించి ఇచ్చిన వెలలేని ఆభరణాల్లో అనేకం కనిపించకుండా ఎలా పోయాయి? గుళ్ళమీద పెత్తందార్లు వాటిని పక్కదారి పట్టించి సొంత ఆస్తులు పెంచుకున్నారు.

తిరుపతిలో ఈ రోజుకీ ఎక్కడోచోట ఎవరో ఒకరు చేతివాటం చూపిస్తూనేవున్నారు. అది పాపకార్యమే అయితే పాపాలు చేస్తున్న వాళ్ళంతా సుఖసంతోషాలతోనే ఉన్నారు. మరి పాపపుణ్యాలు ఎక్కడున్నాయి?" అంటూ

తన అభిప్రాయం వివరించాడు అన్నారావు. అతడి మాటలు విని- చిన్నగా నవ్వాడు కృతయుగ్.

"పాపపుణ్యాలు ఎక్కడున్నాయో నాకు తెలీదు గాని మనిషిని పుణ్యం కాపాడుతుంది. పాపం పతనం చేస్తుంది. ఇది నా నమ్మకం.

దీనికి ఓ చిన్న ఉదాహరణ కూడా చెప్తాను.

ఓ గ్రామంలో రామయ్య, చుక్కమ్మనే దంపతులు ఉండేవారు. రామయ్య చాలా మంచివాడు. దైవభక్తి ఎక్కువ. ఎవరు ఆపదలో ఉన్నా ఆదుకునేవాడు.

దైవకార్యాల్లో ముందుండేవాడు. పరుల సొమ్మును పాములా చూసేవాడు. ఆకలితో ఎవరు ఇంటికొచ్చినా భోజనం పెట్టి పంపేవాడు. ఇదంతా భార్య చుక్కమ్మకు నచ్చేది కాదు. ఆమె పరమలోభి.

మొగుడు ఇల్లు గుల్లచేస్తున్నాడని ఆడిపోసుకునేది. చివరికి ఆమెకు ఓ దురాలోచన వచ్చింది. ఎలాగైనా భర్తను చంపి వదిలించుకుంటే అతడి ఆస్తి తనది అవుతుంది. ఆ తరువాత నచ్చిన మరొకడిని పెళ్ళి చేసుకోవచ్చనుకుంది.

ఓరోజు ఉదయం విషం కలిపిన చద్దన్నం మూట గట్టి భర్తకిచ్చింది. రామయ్య పొలం చేరుకున్నాడు. చద్ది మూటను చెట్టుకొమ్మకు కట్టి చేలోకి దిగి అరక దున్నుకుంటున్నాడు. ఆ సమయంలో ఒక దొంగ అటుగా వచ్చాడు. గుళ్ళలో దొంగతనాలు చేసి పాపం మూట కట్టుకున్న వాడు. చద్దన్నం మూట చూడగానే వాడికి నోరూరింది. రైతు తనపనిలో ఉన్నాడు.

చప్పుడు గాకుండా మూటవిప్పుకుని చాలాదూరం వెళ్ళాక ఓ చెరువు గట్టున కూచుని మూట విప్పాడు. గడ్డపెరుగు, ఆవకాయముక్కతో చద్దన్నం. తినేశాడు. సగం అన్నం తినకముందే కళ్ళు తేలేసి ప్రాణం పోగొట్టుకున్నాడు..." అంటూ చెప్పడం ఆపాడు కృతయుగ్. అందరూ ఆసక్తిగా వింటున్నారు.

అసలు అతడు ఆరంభించిన విధానమే స్నిగ్ధకు అర్థంకాలేదు. విషయాన్ని సూటిగా చెప్పేస్తాడనుకుంది. కాని కృతయుగ్ ఎటునుంచి ఎటో తీసుకెళ్తున్నాడు? అందుకే తనూ కుతూహలంగా వింటోంది.

"తర్వాత ఏమైంది?" ఆసక్తిగా అడిగాడు అనంతస్వామి. "చస్తాడనుకున్న భర్త నిక్షేపంగా ఇంటికి తిరిగి రావడం చూసి చుక్కమ్మ షాకయింది. చద్దిమూట ఎవడో దొంగవెధవ ఎత్తుకుపోయాడని తెలిసి చాలా బాధపడింది. తన భర్తప్రాణాలకు తన ప్రాణం అడ్డం వేసిన దొంగను మనసులోనే తిట్టుకుంది.

ఇలా కాదనుకుని మరునాడు స్వయంగా తనే విషం కలిపిన భోజనం గంపలో ఉంచుకుని పొలానికి బయలుదేరింది, భర్తకు అందించడానికి.

దారిలో కొద్దిపాటివర్షం పడింది. ఒకచోట తడి మట్టిమీద కాలుపడి జారిపడిపోయింది చుక్కమ్మ. ఆమె పడినచోట పెద్దపుట్ట ఉంది. అప్పుడే కలుగులోంచి వస్తున్న నాగుపాము తనదారికి అడ్డంపడిన చుక్కమ్మను చూసి కోపంతో రెండుచోట్ల కాటువేసి వెళ్ళిపోయింది. అంతే నురగలు కక్కుకుంటూ ప్రాణాలు వదిలింది.

ఏ విషంతో బంగారంలాంటి భర్తను చంపాలనుకుందో అదే విషానికి బలయిపోయింది. ఆమె పాపమే ఆమెను అంతం చేసింది. పుణ్యవశాన రెండుసార్లు గండం నుంచి బయటపడ్డాడు రామయ్య. కిందపడి ఒలికిన అన్నం తిని అనేక పక్షులు కూడా మరణించాయి.

ఎవరిదా పాపం? ఇదంతా పాపపుణ్యాల ఫలితాలు ఎలా ఉంటాయో మీకు అర్థంకావాలని చెప్పాను.

దేవుడి సొమ్ము తినడం మహాపాపం. అది ఎప్పుడో ఒకప్పుడు మనల్ని దెబ్బతీస్తుంది.

ఇది ఇలా ఉంచితే– మనం ఇప్పుడిక్కడ సమావేశమైంది చాలా ముఖ్యమైన విషయాలు చర్చించుకోవడానికి. మీరూ నిధికోసమే ఉజ్జయిని కొచ్చారు. మేమూ నిధికోసమే వచ్చాం. సందేహం లేదు.

కాని నిధి విషయంలో మీ దృక్కోణం వేరు. మా దృక్కోణం వేరు. అదేమిటో కాస్సేపట్లో మీకు అర్థమవుతుంది. కాబట్టి మనం ఒకరి అభిప్రాయాలు ఒకరు కలబోస్తేగాని ఏకాభిప్రాయానికి రాలేం. అందుకే కాస్త సుదీర్ఘమైన చర్చ అవసరమైంది" అంటూ కాస్సేపు చెప్పడం ఆపాడు కృతయుగ్.

"ఇంతకీ నువ్వు చెప్పదలుచుకున్నదేమిటి?" అడిగాడు అన్నారావు.

"ఇది ఒక్కముక్కలో విశదపర్చడం సాధ్యం కాదు. ఇప్పుడు నేను చెప్పబోయే విషయాలు చాలా ముఖ్యమైనవి. కాబట్టి మీరు జాగ్రత్తగా వినాలి.

ప్రతి విషయాన్నీ మీకు క్షుణ్ణంగా వివరించడం మా బాధ్యత. నిన్న మనం వెళ్ళిన దీవిమీద నిధి ఉంది. ఎంత అంటే ఖచ్చితంగా ఇంత అని చెప్పలేంగాని భారీ నిధినిక్షేపాలే ఉన్నాయి. ఈ సంగతి మనకి ఇప్పుడు తెలుసు. కాని తరతరాలుగా ఎప్పటినుంచో ఉజ్జయినీ ప్రాంత ప్రజలకూ తెలుసు.

దీవిమీద నిధి ఎక్కడ దాచబడిందో ఎవరికీ తెలీదు. తెలుసుకుని తెచ్చుకుందామని సాహసించి దీవిమీది కెళ్ళిన వాళ్ళెవరూ ప్రాణాలతో తిరిగి దాలేదు. అందుకే ఆ దీవిని మృత్యుదీవి అంటారు. పేరు చెప్తేనే భయపడతారు. ఆ దీవిమీది సంపద ఎవరిదో ఏ కాలంలో ఎవరు దాచిపెట్టారో దాని చరిత్ర

ఏమిటో తెలిసినవాళ్ళు లేరు. కాని ఇప్పుడు మనకి ఆ చరిత్ర తెలుసు. అదివింటే మీ సందేహాలు కూడా తొలగిపోతాయి" అంటూ చెప్పడం ఆపాడు కృతయుగ్.

"అంటే ఈ నిధికి చరిత్ర ఉందంటావ్" సందేహంగా అడిగాడు అన్నారావు. "చరిత్ర ఉంది. చారిత్రకాధారాలు ఉన్నాయి"

"అంటే... ఆ మధ్య కేరళలో అనంతపద్మనాభస్వామివి బైటపడ్డ నిధులకున్నట్టే ఈ దీవిమీది నిధులకీ చరిత్ర ఉందనా"

"సార్... అనంతపద్మనాభస్వామి ఆలయనిధుల పరిస్థితి వేరు. ఇక్కడ దీవిమీది నిధుల పరిస్థితి వేరు. ఎలాగంటారా! అనంత పద్మనాభస్వామి సంపదంతా ఆయన ఆలయం నేలమాళిగలలోని ఆరుగదుల్లో భద్రపర్చబడుతూ వచ్చాయి. అవన్నీ తిరువాన్కూరు రాజవంశీకుల రక్షణలో ఉన్నాయి. అవి నిక్షిప్తంచేయబడ్డవి కాదు. భద్రపర్చబడ్డనిధులు.

ఆలయంలో అవకతవకలు జరుగుతున్నాయని, నేలమాళిగల్లోని నిధులకు లెక్కలులేవని వాటి వివరాలు నిగ్గుతేల్చాలని సుప్రీంకోర్టులో ఒకరు పిటీషన్ వేయడంతో నిధుల సంగతి బయటి ప్రపంచానికి తెలిసింది. సుప్రీంకోర్టు ఆర్డర్ మేరకు అయిదు గదులు తెరిపించి అంతులేని సంపద లెక్కలు కట్టగా లక్షా పాతిక వేలకోట్ల సంపదగా లెక్కతేలింది.

ఆరోగదికి నాగబంధం ఉన్నందున ప్రస్తుతం దాన్ని తెరవకుండా యధాతధంగా ఉంచారు.

ఆ సంపదంతా తిరువాన్కూరు ప్రభువులు పద్మనాభస్వామికి చేర్చివుంచినది.

అయితే ఇక్కడ దీవిమీది నిధి అలాంటిది కాదు. ఇక్కడి పరిస్థితులు, పరిణామాలు వేరు. ఒకప్పుడు విక్రమాదిత్యుడనే చక్రవర్తి ఉజ్జయిని రాజధానిగా అనేక సంవత్సరాలు పరిపాలించాడు. భట్టివిక్రమార్కుల చరిత్రగా విక్రమారుని సాహసాలు లోక విదితం. ఇతను శకుల్ని ఓడించిన సందర్భంగా విక్రమార్క శకం ఏర్పడింది. ఈ విక్రమార్కుడ్ని ఆంధ్ర శాతవాహనుడు ఓడించాడు. ఈ సందర్భంగా మనకు శాలివాహన శకం ఏర్పడింది.

అమరావతి రాజధానిగా శాతవాహన రాజుల పరిపాలన సాగింది. విక్రమార్కుని ఓడించిన తర్వాత ఉజ్జయినితోపాటు రాజ్యాన్ని మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్‌లో కొంతభాగం అటు ఒరిస్సా దిగువన కర్ణాటకవరకు విస్తరించి సామంతరాజుల్ని ఏర్పరుచుకున్నారు.

ముప్ఫై రెండుమంది శాతవాహనరాజులు సుమారు నాలుగు వందల సంవత్సరాలు సువిశాల సామ్రాజ్యాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించి ఆంధ్రుల ఖ్యాతిని దిశదిశలా చాటారు. క్రమంగా చివరి శాతవాహనరాజులు బలహీన పడ్డంతో ఉత్తరప్రాంతాల్లో చాలాభాగాలు చేజారిపోయాయి. సామంతులు స్వతంత్రించారు. ఉజ్జయిని భోజరాజు పరిపాలనలోకి వచ్చింది.

అంటే విక్రమార్కుని తదనంతరం నాలుగు వందల ఏళ్ళ తర్వాత ఉజ్జయిని భోజరాజు పాలనలోకి వచ్చింది. సుమారు క్రీస్తుశకం రెండు లేదా మూడో శతాబ్దం అది. భోజులు ధైర్యసాహసాలకు పెట్టింది పేరు. మహావీరులు. ప్రజారంజకమైన పరిపాలనాదక్షులు.

వీరు విష్ణుభక్తులు. భరతఖండంలో మరెక్కడాలేని విధంగా ఒక అద్భుతమైన విష్ణు ఆలయం నిర్మించాలని సంకల్పించారు. ఆ సంకల్పం నుంచి ఆవిష్కరింపబడిందే ఈ ఆది విష్ణు ఆలయం. మనం వెళ్ళిన క్షిప్రానది మధ్యలోని దీవిమీది నాలుగు దిక్కులా నాలుగు గాలిగోపురాలు, అద్భుతమయిన గర్భాలయంతో భారీ నిర్మాణం చేపట్టి పూర్తిచేశారు.

ఈ గుడికి అష్టదిక్కుల్లోను అష్టలక్ష్మి ఆలయాలు నిర్మించారు. ఆ ఆలయాల పేరుమీదనే అక్కడ గ్రామాలు నిర్మించారు. సంతానపురి, విద్యాపురి, విజయపురి ఇలా సాగింది నిర్మాణం.

ఆ ప్రాంతమంతా అడవి నరికించి వ్యవసాయభూములు ఏర్పరిచారు. నీటిపారుదల సౌకర్యం కూడా కల్పించారు.

ఆ కాలంలో ఆదివిష్ణు ఆలయంతోపాటు వెలుపల కట్టిన అష్టలక్ష్ముల ఆలయాలన్నీ ఎంతో వైభవాన్ని అనుభవించాయి.

ఇలా ఉండగా–చంద్రభోజుడనే రాజు పరిపాలానాకాలంలో దేశంలోని పరిస్థితులు మారాయి. చుట్టుపక్కల దేశాల్లో శైవం వ్యాప్తిలోకి వస్తోంది. మరోపక్క బౌద్ధం విస్తరిస్తోంది. ముందుముందు పరిస్థితులెలా వుంటాయో తెలీదు అని తమ రాజసంపదను నిక్షిప్తంచేయాలని ఆలోచించాడు.

అందుకు అనువైన చోటుగా ఆదివిష్ణు ఆలయాన్ని ఎంచుకున్నాడు. రహస్యంగా నేలమాళిగ నిర్మాణం పనులు ఆరంభమయ్యాయి. ఆ విధంగా భోజరాజు కుటుంబానికి చెందిన సంపద దీవిమీది ఆలయ భూగృహంలోకి చేరింది. ఈ నిధి రహస్యం రాజకుటుంబంలో ముఖ్యులకే తెలుసు. అయితే చంద్రభోజుడు ఊహించిన ప్రమాదం అతడి హయాంలో రాలేదు.

ఆ తర్వాత వచ్చిన విక్రమభోజునికాలంలో ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి.

విక్రమభోజుడు మహావీరుడేగాని వృద్ధుడు. ఆయనకి సంతానం లేదు. పెంపుడుకొడుకు మదనభోజుడు భోగలాలసుడై హత్యకు గురయ్యాడు.

అయినవాళ్ళే శత్రువుల్తో చేతులు కలిపి కుట్రచేశారు. యుద్ధం తప్పని పరిస్థితి. ఓటమి తప్పదనే శంక.

అలాంటి విషమపరిస్థితిలో విక్రమభోజుడు తనకు ఎంతో నమ్మకమయిన స్థపతి శంభులింగయాచారిని పిలిచి రహస్యంగా తన సందేశాన్ని శాసనాన్ని విన్పించాడు. కొందరు నమ్మకమైన భటులనిచ్చి పంపించాడు.

శంభులింగయాచారి మహాశిల్పి. మంత్రవాది కూడా.

తనకు బాగా నమ్మకస్తులైన మరికొందరు మంత్రవాదుల్ని కూడా వెంటబెట్టుకుని రాజభటులతో విష్ణుపురి వచ్చాడు. అష్టలక్ష్మి ఆలయాలనుంచి ఆదివిష్ణు ఆలయం నుంచి వెలలేని ఆభరణాలు, సొత్తు సేకరించి తెచ్చి రహస్య మార్గంవెంట నేలమాళిగలోకి నిధుల్ని చేర్పించాడు. అంతకు ముందుగానే అక్కడ అంతులేని నిధి ఉంచబడింది.

తర్వాత నిధుల్ని ఎవరూ తాకకుండా మంత్రప్రయోగాలు నిర్వహించి రహస్య మార్గాన్ని శాశ్వతంగా మూయించేశాడు. పైన నాగశక్తుల్ని ప్రతిష్ఠించి పనులన్నీ ముగించుకుని తిరిగి ఉజ్జయిని చేరుకునే సరికి అక్కడ బాగా ముమ్మరంగా యుద్ధం సాగుతోంది.

యుద్ధంలో శత్రువులదే పైచేయి అయింది. ప్రధాన శత్రువు అయిన ప్రమరనాయకుడు గజమల్లుడు, ఇంకా విక్రమభోజుడ్ని యుద్ధఖైదీగా బంధించి నాడు.

నిధి రహస్యం చెప్పమని హింసించాడు. ఎంతకీ చెప్పకపోవడంతో విక్రమభోజుడి తలను నరికి తాను ఉజ్జయినికి రాజుగా ప్రకటించుకున్నాడు. అతడికి సహకరించిన కొరటుజాతివారు సంబరాలు చేసుకున్నారు. భర్త మరణవార్త వినగానే రాణి భద్రావతి ప్రాణత్యాగం చేసింది.

ఆ విధంగా ఉజ్జయిని వైష్ణవ ప్రభువులనుంచి శైవులచేతిలోకి పోయింది. వాళ్ళు రెచ్చిపోయి దేశంలోని వైష్ణవాలయాలన్నీ ధ్వంసం చేశారు. ముఖ్యంగా ఆదివిష్ణు, అష్టలక్ష్ముల ఆలయాల్ని నాశనంచేసి నేలమట్టం చేసేశారు.

భోజుల నిధిరహస్యం తెలిసినవాడు ఒక్క శంభులింగయాచారి మాత్రం మిగిలాడు. ఆ విధంగా చరిత్రకందని విషాద సంఘటనలతో భోజరాజువంశం

అంతరించింది. యుద్ధానంతరకాలంలో మరోసారి దీవిప్రాంతాలకి వచ్చాడు శంభులింగయాచారి.

అక్కడి ఆలయాలే కాదు గ్రామాలకు గ్రామాలే కొరటు సైనికుల చేతిలో నాశనమయ్యాయి. ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసలుపోతున్నారు.

శంభులింగయాచారి ఆ పరిస్థితులు చూసి ధుఃఖించాడు. గుండె రాయిచేసుకుని దీవిమీదకు చేరుకున్నాడు. నిధి పరులపాలుగాకూడదని నిద్రావస్థలో తను ప్రతిష్ఠించిన అయిదు నాగశక్తుల్ని ప్రేరేపించి ఉజ్జయిని వెళ్ళిపోయాడు. ఆ రోజునుంచి దీవిమీద అడుగుపెట్టిన ఎవరూ ప్రాణాలతో బయటకు పోలేదు.

ఇలా ఉండగా ప్రకృతి కూడా పగబట్టిందా అన్నట్టు ఇరవైరోజులపాటు ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలకు క్షిప్రానది పొంగి ఆ ప్రాంతాలన్నీ జలమయం అయిపోయాయి. దాంతో అక్కడక్కడా గ్రామాల్లో మిగిలిన ప్రజలుకూడా ఖాళీ చేసి వెళ్ళిపోయారు. అంతే... తర్వాతికాలంలో జనావాసాలు, పంటభూముల స్థానంలో తిరిగి దట్టమైన అడవి ఏర్పడింది. ఆ తర్వాత ఉజ్జయినీ పాలకులు ఎవరూ ఆ ప్రాంతాలమీద శ్రద్ధ చూపించలేదు. ఇప్పటికీ ఆ ప్రాంతాలు అటవీభూములుగానే ఉన్నాయి.

ఇది ఇలా ఉంచితే– నిధిరహస్యం రహస్యంగానే మరుగుపడిపోకూడదని, నిరుపయోగం కాకూడదని చివరివాడైన విక్రమభోజుడి ఆశ. భవిష్యతరాల్లో అది ఉపయోగపడాలని కాంక్షించాడు. ఆ బాధ్యతను శంభులింగయాచారి భుజాలమీద ఉంచాడు.

ప్రభుభక్తిపరాయణుడైన శంభులింగయాచారి ఆ విషయం మర్చిపోలేదు. ఉజ్జయినికి తిరిగి రాగానే నిధి ఉన్నప్రాంతాన్ని సూచిస్తూ ఒక రాగిరేకుమీద ఆలయాల నమూనాను గీశాడు. దాన్ని రెండుభాగాలు చేశాడు. ఒక్కోభాగాన్ని ఒక్కోరాగిగొట్టంలో ఉంచాడు. రెండో రాగిగొట్టాన్ని తనవద్దే ఉంచుకున్నాడు. మొదటి రాగిగొట్టంలో రాగిరేకుతోపాటు రాజశాసనాన్ని లిఖించిన కొన్ని తాళపత్రాలుంచి మూతబిగించాడు. మూతలు ఊడిరాకుండా నాగశక్తిని ప్రయోగించాడు.

జరిగిన గాథనంతా మరో తాళపత్రాల్లో రాసి మొదటి గొట్టాన్ని కాలనేమి అనే తననౌకరుకిచ్చి మార్కాపురంలోని అల్లుడు అక్కనాచార్యుడికి పంపించాడు. మార్కాపురం పూర్వనామం మారికాపురం. ఆ కాలంలో అక్కడ చెన్నకేశవస్వామి అలయనిర్మాణపనుల్లో నిమగ్నమైవున్నాడు అక్కనాచార్యుడు.

ఆయన భార్య మహాదేవి శంభులింగయాచారి కూతురు. కూతురు, అల్లుడు, వారి పిల్లలు అంతా మార్కాపురాన ఉన్నారు. అక్కనాచార్యుడు స్థపతి, మహాశిల్పి. అక్కడ పనిచేస్తున్న అనేకమంది శిల్పులకు ఆచార్యుడు. కాలనేమి ద్వారా మామగారు పంపిన రాగిగొట్టాన్ని లేఖను అందుకున్నాడు. లేఖద్వారా ఉజ్జయిని పరిస్థితులు గ్రహించి బాధపడి రాగిగొట్టాన్ని తమ ఇంట భద్రం చేశాడు.

ఆ విధంగా రాగిగొట్టాల్లో ఒకటి శంభులింగయాచారి వంశంలోను మరొకటి అల్లుడు జక్కనాచార్యుడి వంశంలోనూ ఉంటూ వచ్చాయి.

శంభులింగయాచారికి మగసంతానం లేదు. ఆడపిల్లలున్నారేమో, ఇతర అల్లుళ్ళ గురించీ మనకు తెలీదు. కాని ఆ వంశీకుల్లోనే ఎవరో రాగిగొట్టాన్ని మీకు భోపాల్లో లక్షరూపాయలకు అమ్మడం జరిగింది.

ఇక మొదటి రాగిగొట్టం మాత్రం భద్రంగా అక్కనాచారి వంశంలోనే ఉండిపోయింది" అంటూ అంతవరకూ వివరించి ఆపాడు కృతయుగ్.

ఆత్మకూరు అన్నారావుగాని, అనంతస్వామిగాని ఊపిరి తీసుకోవడం మర్చిపోయారా అన్నంతగా ఉత్కంఠభరితులై ఆశ్చర్యంతో కృతయుగ్ చెప్పిన చారిత్రకాంశాలు శ్రద్ధగా విన్నాడు.

"తర్వాత ఏమైంది? రాగిగొట్టం మీకు ఎలా లభించింది?" అని కుతూహలంగా అడిగాడు అనంతస్వామి.

"స్వామీ! ఇప్పుడు మీకు వివరించిన చారిత్రకాంశాలు అసలుకు కొంత నా కల్పన జోడించి చెప్పాను.

అలాగే జరిగివుంటుంది. శంభులింగయాచారి తన అల్లుడికి రాసిన లేఖతో పాటు రాజశాసనం గురించిన సమాచారం అంతా మావద్ద ఉంది.

వాటిమూలంగానే ఈ చారిత్రకాంశాలు మాకు తెలిశాయి. స్నిగ్ధా! నేను చెప్పింది కరక్టే గదా?" అంటూ స్నిగ్ధ వంక చూశాడు కృతయుగ్.

"కరెక్ట్. నేను చెప్పినా ఇంతా విపులంగా వివరించగలిగి వుండేదాన్ని కాదేమో. మిగిలిన విషయాలు కూడా నువ్వే చెప్పు" అంది స్నిగ్ధ. తిరిగి గొంతు సవరించుకున్నాడు కృతయుగ్.

"ఇంతవరకు నేను చెప్పిందాన్ని బట్టి మొదటి రాగిగొట్టం స్థపతి అక్కనాచార్యుడి వంశంలో ఉంటూ వచ్చిందని మీకు అర్థమైవుంటుంది.

ఆ వంశంలో ఒక అలవాటుంది. ఆ వంశీకులంతా శిల్పాచార్యులు. స్థపతులుగా గొప్ప పేరు ప్రఖ్యాతులు వహించినవారే. తమ పూర్వీకులు వాడిన

పనిముట్లను వారు ఉపయోగించిన కాలాన్నిరాసి వాటిని, వాటితోపాటు వంశపారంపర్యంగా వస్తున్న వస్తువుల్ని ఒక భోషాణంలో భద్రపర్చేవారు.

ప్రతి తరంలోనూ ఆ భోషాణ రక్షణభారం పెద్దకొడుకు వహించేవాడు. ఆ విధంగా చివరి శిల్పాచార్యుడైన మా తండ్రిగారికి ఆయన్నుంచి నాకు ఆ భోషాణం సంక్రమించింది" అన్నాడు కృతయుగ్. "అంటే నువ్వు...." నమ్మలేనట్టు చూస్తూ అడిగాడు అన్నారావు.

"అవునండీ. ప్రస్తుతం అక్కనాచార్యులవారి వంశంలో నేను చివరివాడిని. మా భోషాణంలో రాగిగొట్టం ఉందని తెలుసుగాని వివరాలు నాకుతెలీదు. స్నిగ్ధ, పీటర్ తెచ్చిన రాగి గొట్టం గురించి నాతో చెప్పినప్పుడు మా వద్ద వున్న రాగిగొట్టం గుర్తొచ్చింది.

వెంటనే ఆ రాగిగొట్టాన్ని స్నిగ్ధకు అందించాను. రెండురోజులు శ్రమపడి వాటిని తర్జుమా చేసింది స్నిగ్ధ. దాంతో చరిత్ర బయటపడింది.

"రాజశాసనం ఏమిటి? ఏం చెప్పబడింది?" అడిగాడు అన్నారావు.

"చెప్తాను. ముందే మనం అనుకున్నట్టు భోజరాజులకు తమ కులదైవమైన ఆదివిష్ణువంటే మహాభక్తి. ఆదివిష్ణు, అష్టలక్ష్ముల ఆలయాలంటే ప్రాణం.

అందుకు తగ్గట్టే చివరి రాజయిన విక్రమభోజుడు స్పష్టమైన నిర్ణయాలు తీసుకుని చెప్పాడు. ఆయన చెప్పిందే రాజశాసనంగా తాళపత్రాల్లో లిఖించాడు శంభులింగయాచారి.

దాన్ని అనుసరించి దీవిలో లభించే నిధిని నాలుగుభాగాలు చేయాలి. నిధి అంటే ఇక్కడ ధనమనే అర్థం.

ఆలయాలకు చెందిన ఆభరణాలు, ఇతర సొత్తు ఆలయాలకే ఉంచాలి. ఆ కాలంలో వినియోగించిన బంగారు, వెండినాణాలు, వజ్రవైఢూర్యాలు అన్నీ నాలుగుభాగాలు చేయాలి.

అందులో ఒక వంతు ధనాన్ని ఆదివిష్ణు ఆలయంలో పాటు అష్టలక్ష్ముల ఆలయాలు యధాతథంగా పునర్నిర్మాణాల కోసం వెచ్చించాలి. ఒకవంతు ధనాన్ని మూలధనంగా ఉంచి ఆలయాల నిర్వహణకు ధూపదీపనైవేద్యాలు, ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఉపయోగించాలి.

మూడోవంతు ధనాన్ని తమభోజరాజవంశానికి చెందినవారిలో వారి ఆర్థికస్థితిగతులననుసరించి వారి సంక్షేమానికి వినియోగించాలి.

ఇది భోజరాజవంశీకులకు మాత్రమే వర్తిస్తుంది. భోజకులస్తులందరికీ కాదు.

ఇక మిగిలిన నాలుగోవంతు ధనం ఉంది. దీన్ని రాగిగొట్టాలు భద్రంచేసి నిధి రహస్యాన్ని కాపాడుతూ వచ్చిన శంభులింగయాచారి వంశీకులు, అక్కనాచారి వంశీకుల్లో చివరివారికి చెందుతుంది.

వారు ఆ ధనాన్ని తమ వంశీకుల ఆర్థికాభివృద్ధికి వినియోగించు కోవచ్చు. ఇది రాజశాసన సారాంశం" అంటూ వివరించాడు కృతయుగ్.

"అంటే నిధి మీద వేరే ఎవరికీ హక్కులేదనేగా దీని అర్థం?" అని అడిగాడు ఆత్మకూరు అన్నారావు. "అవును" అన్నాడు కృతయుగ్.

"ఒకవేళ మిమ్మల్నికాదని మేము ఆ నిధిని దోచుకుపోతే?" అన్నాడు అన్నారావు.

"అసాధ్యం. మీరు ఆ పని చేయలేరు. ఎందుకంటే ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. బయటి ప్రపంచానికి ఇంకా ఈ నిధిగురించి తెలీకపోవచ్చు.

అఫీషియల్‌గా ఆయా శాఖలకు తెల్సు. ఇప్పటికే స్నిగ్ధ సెంట్రల్ ఆర్కియాలజీ డిపోర్ట్‌మెంట్‌కు లేఖల నకళ్ళను పంపి దీవిపై నిధి అన్వేషణకు, ఆలయాలను గుర్తించటానికి, తవ్వకాలు జరిపి మరింత చరిత్ర సేకరించటానికి అనుమతి పొందివుంది.

రేపోమాపో అక్కడినుంచి మధ్యప్రదేశ్ స్టేట్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందుతుంది.

ఇదిలా ఉండగా ఉత్తరోత్తరా నిధిమీద వివాదాలు తలెత్తకూడదనే ఉద్దేశంతో పూర్తిసమాచారంతో స్నిగ్ధ సుప్రీమ్‌కోర్టుకు ఒక అభ్యర్థన పంపించివుంది.

అలాగే ప్రభుత్వరంగంలోని ఇతర శాఖలకూ సమాచారం వెళ్ళింది. అందుచేత మీరు ఈ నిధిమీద ఆశ వదులుకోవడం మంచిది. అయితే ఎలాగూ వచ్చారు కాబట్టి నేను మీకో ఆఫర్ ఇస్తాను.

మీరు మాతో చేయి కలపండి. నా వంతుగా ఒక వంతు నిధి వస్తుంది. అందులో నాలుగువంతుల్లో ఒక వంతు వాటాగా మీకిస్తాను.

దీని వలన మీకు పుణ్యం, పురుషార్థం రెండూ చేకూరుతాయి. ఆలయాల పునర్నిర్మాణ పనుల్లో మీరూ భాగం పంచుకుంటే గొప్ప అదృష్టవంతు లవుతారు" అంటూ వివరించాడు కృతయుగ్.

అన్నారావు అసంతృప్తిగా చూశాడు–

"ఇది నాకు అదృష్టంలా కన్పించడంలేదు. చెట్టుకాయలన్నీ కోసుకోవాల నొస్తే గుప్పెడుకాయలు చేతికి ఇచ్చి తృప్తిచెందమన్నట్టుంది.

నువ్వు చెప్పిందాన్ని బట్టి చూస్తే మేం వెనక్కి హైదరాబాద్ వెళ్ళిపోవడం మంచిదనిపిస్తోంది" అన్నాడు.

అంతవరకూ మౌనంగా వున్న కాంచన అప్పుడు కల్పించుకుంటూ– "డాడీ.... జీవితంలో డబ్బే ముఖ్యమా? అలా చూస్తే ఇప్పటికీ మీవద్ద కావలసినంత ఉంది. డబ్బుకోసం ఎందుకంత ఆరాటం? దీన్ని ఒక దైవకార్యంగా తలచి మీరూ మాతో చేయికలిపితే ఆలయాల పునర్నిర్మాణాల్లో పాలుపంచుకున్న కీర్తి మీకూ వస్తుందిగదా! ఆ తృప్తిచాలదా?" అంది.

"అలా అనుకుంటే నాకేమిటి లాభం? ఇప్పటికే నా మనుషులు అయిదుగుర్ని పోగొట్టుకున్నాను. వాళ్ళ కుటుంబాల్ని ఆదుకోవాలి. రెండు లక్షలకుపైగా ఖర్చులయ్యాయి. ఎవరిస్తారు?" అన్నాడు అన్నారావు.

"నా వాటాలో నాలుగోవంతు మీకిస్తానన్నాను" గుర్తుచేశాడు కృతయుగ్.

"డాడీ. మీకేమొస్తుంది అనడుగుతున్నారు గదా. అక్క స్నిగ్ధకి ఏమొస్తుంది? ఆమెకు నిధినుంచి ఏమీ రాదని తెలిసికూడా ఎందుకు ఇంత పట్టుదలగా కృషిచేస్తోంది? ఆలోచించారా? జీవితంలో ఒక మంచిపని చేయటానికి మీకిది చక్కని అవకాశం. కాదనకండి" అంది కాంచన.

ఏంచేద్దామన్నట్టు అనంతస్వామి వంక చూశాడు అన్నారావు. ఆయన ఉత్సాహంగా నవ్వాడు. "నీ కూతురే కృతయుగ్‌ని సపోర్ట్ చేస్తున్నప్పుడు నువ్వు కాదనడం భావ్యం కాదు. ఎలాగూ కాబోయే అల్లుడు. కట్నంకింద నీవంతు సహకారమందించావనుకో. అంతా సంతోషిస్తారు" అంటూ సలహా ఇచ్చాడు.

పరిస్థితుల్ని పూర్తిగా అవగాహన చేసుకోవడంతో చివరకు అన్నారావు కూడా తనవంతు సహకారం అందించడానికి అంగీకరించాడు.

అంతా హ్యాపీగా ఫీలయ్యారు.

"అయితే ఇప్పుడు మన నెక్స్ట్ ప్రోగ్రామ్ ఏమిటి? హోటల్ గదుల్లో ఈ విషయాలు చర్చించడం అనువుకాదు. కాబట్టి ఇక్కడే నిర్ణయాలు తీసుకోవడం మంచిది" అంటూ సూచించాడు అనంతస్వామి.

"ఆ మాట కరెక్టు. ఏం చేయాలో ఇక్కడే చర్చించుకోవడం మంచిది" అంది స్నిగ్ధ.

ఈ రోజు అక్కడే వనభోజనాలు చేసే ఉద్దేశంతో పీటర్‌ని పిలిచి భోజనాలు తేవటానికి ఒక వ్యాన్‌లో ఉజ్జయిని పంపించాడు అన్నారావు.

ఈ లోపల అందరికీ బిస్కట్లు, టీలు సప్లైచేశారు అనుచరులు. "కృతయుగ్.... నీ అభిప్రాయం ఏమిటి చెప్పు" అని అడిగాడు అనంతస్వామి.

"స్వామీ. మీకు తెలీని విషయం కాదు. ముందుగా అక్కడి కావలి నాగశక్తుల్ని అంతంచేస్తేగాని దీవిమీద మనం సురక్షితంగా తిరగలేం" అన్నాడు కృతయుగ్.

"ఆ మాట నిజమేగాని శంభులింగయాచారి నాగశక్తులను భూమిలో ఎక్కడెక్కడ ప్రతిష్ఠించారో ముందు తెలుసుకోవాలి. అది కొంచెం శ్రమతో కూడిన పని"

"అది నాకు తెలుసు స్వామీ"

"తెలుసా... చెప్పు"

"నా యోగశక్తితో వాటి స్థావరాల్ని స్పష్టంగా చూశాను. శంఖం సైజులో లక్కతో చిన్న చిన్న పుట్టలు అయిదు తయారుచేసి వాటిలో నాగశక్తుల్ని ప్రవేశపెట్టి మధ్యలో ఒకటి చుట్టూ ఎడంగా నాలుగుచోట్ల భూమిలో మూడు అడుగుల లోతున పాతిపెట్టబడున్నాయి.

అవే వీటి స్థావరాలు. వాటిని ప్రేరేపించి వదిలినప్పటినుంచి వందల సంవత్సరాలు గతించినా తమ విధిని నిర్వహిస్తూనే వున్నాయి. అవన్నీ లక్కపుట్టల్లోకి పోవడం స్పష్టంగా చూశాను" వివరించాడు కృతయుగ్.

అనంతస్వామి కాస్సేపు కళ్ళు మూసుకుని ఆలోచనలో మునిపోయాడు.

సుమారు అయిదు నిముషాల తరువాత కళ్ళుతెరిచాడు. ఆయన ఏం చెప్తాడా అని ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారంతా.

"ఇది ఒక పురాతన తాంత్రిక ప్రక్రియ. దీన్ని చేయగలవారు ప్రస్తుతం లోకంలో లేరనే చెప్పాలి. తిరుగులేని విధంగా దీవిమీద నాగ శక్తుల్ని ప్రతిష్ఠించి కావలి ఉంచారు. వాటిని తొలగించాలంటే అక్కడ ఒక క్రతువు నిర్వహించాలి" అన్నాడు.

"ఆ క్రతువు నిర్వహించండి. ఖర్చులకి వెనుకాడ నక్కర్లేదు" అంది వెంటనే స్నిగ్ధ.

"అమ్మా, ఇది సాదాసీదా ప్రయోగం కాదు. కృతయుగ్ యోగపురుషుడు, అరచేత గరుడరేఖ కలిగిన జాతకుడుగాబట్టి వాటిని ఎదిరించి నిలబడగలుగు తున్నాడు. ఈ మహత్కార్యం కోసమే ఇతడు జన్మించాడా అన్పిస్తోంది. ఇతను చెప్పినట్టు ముందుగా దీవిమీద నాగశక్తుల్ని తొలగించందే అక్కడ మనం ఏమీ చేయలేం. నా అనుభవాన్ని బట్టి చెప్తున్నాను. వాటిని తొలగించాలంటే అయిదుగురు ఋత్విక్కులతో కూడిన బృందంతో నాగబలి క్రతువు చేయాల్సి వుంటుంది. ఖర్చు ఉంటుంది.

అయిదు వెండి నాగప్రతిమలు చేయించాలి. భూమిలోంచి లక్కపుట్టల్ని పెకలించి క్రతువులో హోమాగ్నిలో వేసి దగ్ధం గావించాలి. ఒక విధంగా ఇది మినీ సత్రయాగంలాంటిది" అన్నాడు అనంతస్వామి.

"ఎప్పుడు నిర్వహిద్దాం?" అడిగాడు కృతయుగ్.

"చెప్తాను. దీనికి తగిన ముహూర్తం కుదరాలి. కాస్సేపు వెయిట్ చేయండి" అంటూ కనులు మూసుకుని తిరిగి ధ్యానంలోకెళ్ళిపోయాడు అనంతస్వామి.

* * * * *

అంతా నిశ్శబ్దంగా ఎవరి ఆలోచనల్లో వారు ఉండిపోయారు. క్షణాలు భారంగా దొర్లిపోతున్నాయి. తనకు తెలిసిన మంత్రశాస్త్రానుభవాల్ని మననం చేసుకుంటున్నాడు అనంతస్వామి.

ఏం చేస్తే నాగశక్తుల్ని తొలగించవచ్చనే విషయంగా ధ్యానంలో పరిష్కారంకోసం శోధిస్తున్నాడు.

చెట్ల ఆకులసందునుంచి గాలిచేస్తున్న సవ్వడి, వృక్షశాఖల వెంట పక్షుల కిలకిలారావాలు తప్ప అంతటా నిశ్శబ్దంగా ఉంది. సుమారు అర్ధగంట పైగా ధ్యానంలో ఉండిపోయాడు అనంతస్వామి.

అంతా ఉత్కంఠభరితులై ఆయన కనులు తెరిచే సమయం కోసం ఎదురుచూస్తున్నారు.

చాలాసేపటి తర్వాత ఆయన కనులు తెరిచి ఓసారి అందర్నీ కలయజూశాడు.

"ముహూర్తం కుదిరింది. చెపుతాను వినండి" అన్నాడు. అంతా సంభ్రమంగా చూస్తున్నారు.

"కృత్తికా నక్షత్రం సర్పనక్షత్రం. అమావాస్యరోజు నాగులుగాని, నాగశక్తులుగాని బలహీనంగా ఉంటాయి. ఆదివారం అమావాస్య మరింత మంచిది. కాబట్టి ఆదివారం అమావాస్య కలిసివచ్చిన రోజు అర్ధరాత్రి కృత్తికా నక్షత్రయుక్త మీనరాశి దివ్యమైన ముహూర్తం.

నాగబలికి, ప్రయోగ ఉపసంహారానికి గొప్ప అనుకూల సమయం. ఇవాళకి సరిగ్గా ఎనిమిదోరోజు....అంటే రేపు ఆదివారంగాక పై ఆదివారం క్రతువు నిర్వహించాలి" అంటూ వివరించాడు అనంతస్వామి.

"ఆ రోజునే ఖాయం చేయండి. ఈ లోపల క్రతువులకి అవసరమైన సంభారాలేమిటో చెప్తే వాటిని సమకూర్చుకుని సిద్ధంగా ఉందాం" అన్నాడు కృతయుగ్..

"కాని ఒక విషయం గుర్తుంచుకోవాలి కృతయుగ్" హెచ్చరికగా పిలిచాడు అనంతస్వామి.

"చెప్పండి స్వామీ" అడిగాడు.

"ముహూర్త కాలం అంటే ఇరవైనాలుగునిముషాలు మాత్రమే. ఆ కాస్త వ్యవధిలోనే లక్కపుట్టల్ని తవ్వి తీసి హోమాగ్నిలో పడవేయగలగాలి.

ఒక్క పుట్టమిగిలినా అది రెట్టించిన బలంతో ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తుంది" అని చెప్పాడు.

"సందేహించకండి స్వామీ. నేను సాధిస్తాను" అన్నాడు కృతయుగ్.

"ఓ.కె. ఆ రోజు రాత్రి చీకటి పడకముందే మనమంతా దీవిమీదకు చేరుకోవాలి. క్రతువుకి ఏర్పాట్లు చేసుకోవాలి. సరిగ్గా రాత్రి పదిగంటలకి క్రతువు ఆరంభిస్తాం. సరిగ్గా అర్ధరాత్రి పన్నెండునుండి పన్నెండు ఇరవై నాలుగు నిముషాల వరకు కృత్తిగా నక్షత్రమీన లగ్నం ఉంది.

ఆ ముహుర్త సమయంలోనే లక్కపుట్టల్ని హోమాగ్నిలో పడవేసి ధ్వంసం చేయాలి. పోతే ఆ రోజు మనకి ఏమేమి అవసరమో నేను లిస్టు తయారుచేసి ఇస్తాను.

అలాగే అయిదుగురు క్రతువు నిర్వహించగల ఋత్విక్కుల్ని వెదికిపట్టుకుని సిద్ధంగా ఉంచాలి..." అని అంటూ వివరించాడు అనంతస్వామి.

అంతలో ఉజ్జయిని వెళ్ళిన పీటర్ భోజనాలతో తిరిగి రావడంతో తాత్కాలికంగా చర్చను నిలుపుచేశారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో అంతా ఉల్లాసంగా వనభోజనాలు చేశారు.

తరువాత ఒక గంటసేపు విశాంత్రి తీసుకున్నారు. తిరిగి సమావేశం ఆరంభమయ్యే సరికి రెండుగంటలు దాటింది సమయం. "స్వామీ. నాదో సందేహం" అన్నాడు తిరిగి సమావేశంకాగానే కృతయుగ్.

"అడుగు నాయనా, ఏమిటి నీ సందేహం?"

"ఏం లేదు స్వామీ. సాధారణంగా విపత్కాల పరిస్థితులు ఏర్పడినప్పుడు గుళ్ళలోని విగ్రహాల్ని సురక్షితమైన చోట భద్రపరచటం ఆనవాయితీ.

మీకు ఉదాహరణకు చెప్పాలంటే ముస్లిం దండయాత్రల సమయంలో శ్రీరంగంనాథస్వామిని రహస్యమార్గం గుండా తిరుపతికి తరలించింది చారిత్రకాంశం. సుమారు నలభై అయిదు సంవత్సరాలు రంగనాథుడు వేంకటేశునికి అతిథిగా తిరుమలలోనే ఉండి పూజలందుకున్నాడు. పరిస్థితులు చక్కబడిన తర్వాత స్వామిని తిరిగి శ్రీరంగం చేర్చారు.

కాబట్టి ఇక్కడ శైవుల దండయాత్ర సమయంలోనూ ఆదివిష్ణుమూర్తి విగ్రహంతో సహా అష్టలక్ష్ముల విగ్రహాలను ధ్వంసం చేయకుండా కాపాడుకోవడానికి వైష్ణవులు ఎక్కడికో తరలించివుండాలి. కాని అందుకు సంబంధించిన చారిత్ర కాధారం లభ్యంకాలేదు.

శంభులింగయాచారి తన లేఖలో ఆ విషయాన్ని ఎక్కడా ప్రస్తావించ లేదు. విగ్రహాలు సురక్షితంగా ఉండే అవకాశం ఉందంటారా...?" అని అడిగాడు కృతయుగ్.

"విగ్రహాలు సురక్షితంగా ఉంటే ఆలయాల నిర్మాణం పూర్తయ్యేలోపల తప్పకుండా బయటపడతాయి. ఇది దైవకార్యం. నువ్వు కారణజన్ముడవు. సందేహంలేదు. నీ ద్వారా సకలం జరిపిస్తాడా శ్రీమన్నారాయణుడు. ప్రస్తుతం విగ్రహాల గురించి నీకు చింతేల? మనం చాలా దూరం ఇంకా ముందుకు వెళ్ళాలి" అన్నాడు అనంతస్వామి. సాయంకాలం వరకు కూలంకషంగా అనేక విషయాల గురించి చర్చించుకున్నారంతా.

అనంతస్వామి క్రతువుకు అవసరమైన సామగ్రిలిస్టు తయారుచేసిచ్చాడు. వాటిని సమకూర్చే బాధ్యతను అన్నారావు తీసుకున్నాడు.

క్రమంగా అయిదుగంటలు దాటింది సమయం. ఆదివారంనాటికి ఏం చేయాలో ఒక పక్కా ప్రణాళిక రూపొందించుకున్నారు.

చీకటి పడకముందే అక్కడినుండి తమ వాహనాల్లో ఉజ్జయినికి తిరుగు ప్రయాణమయ్యారు.

కలలు నిజమవుతాయా! ఈ విషయంలో తరచూ భిన్నాభిప్రాయాలు వింటూంటాం. తమ తమ అనుభవాల్నిబట్టి ఆ యా ఫలితాలు వుంటాయి. కొన్ని కలలు నిజం కావచ్చు. కొన్ని జరక్కపోవచ్చు. అలాంటి ఒక అద్భుతమయిన దివ్యానుభవమే ఆ రాత్రి కృతయుగ్‌కి కలిగింది. తెల్లవారితే ఆదివారం.

దీవిమీదికి వెళ్ళాల్సిన రోజు. తెల్లవారుఝాము.

గాఢనిద్రలో ఉన్నాడు కృతయుగ్. ఆ సమయంలో ఒక కల. కలలో తన దేవేరులు ఇరువురితో తిరుమల వేంకటేశ్వరస్వామి సాక్షాత్కరించాడు. చిరునవ్వుతో ఆశీర్వదిస్తున్నాడు.

ఎలాంటి సందేశంగాని, పలుకుగాని లేదు. దైవదర్శనంతో పులకాంకి తుడయి భక్తి ప్రపత్తులతో ప్రణమిల్లాడు కృతయుగ్.

అంతలోనే స్వామి అదృశ్యమయ్యాడు. సీన్ మారిపోయి దీవి కట్టెదుట సాక్షాత్కరించింది. తను దీవిమీద నడుచుకుంటూపోతున్నాడు. దీవి తీరంలో శాఖోపశాఖలుగా విస్తరించిన పెద్ద అశ్వత్థవృక్షం సాక్షాత్కరించింది.

ఆకుల గలగలలు స్పష్టంగా విన్పిస్తున్నాయి.

దిగువన నది ప్రవహిస్తోంది.

అది దీవి పశ్చిమతీరం కావచ్చు అనిపించింది.

'పక్షులలో గరుత్మంతుడిని నేనే, వృక్షాలలో అశ్వత్థ వృక్షాన్ని నేనే, మునులలో వ్యాసభగవానుడుని నేనే' అంటాడు గీతలో శ్రీకృష్ణుడు.

అటువంటి రావివృక్షాన్ని తనకు ఎందుకు చూపిస్తున్నట్టు? కలలోనే ఆలోచిస్తున్నాడు కృతయుగ్.

అంతలో అశ్వత్థవృక్షం స్థానంలో శంఖుచక్రగదాధారియై అభయముద్రతో నిలువెత్తు శ్రీమన్నారాయణుని బహుసుందరమూర్తి అయిన నల్లని విగ్రహం కట్టెదుట సాక్షాత్కరించింది. ఆయన పక్కనే అష్టలక్ష్మల విగ్రహాలు వరుసగా దర్శనమిచ్చాయి.

పులకాంకితుడై విగ్రహాలకు నమస్కరించాడు కృతయుగ్. చూస్తూండగానే ఆ విగ్రహాలు నదీజలాల్లోకి జారి ఇసుకపొరల్లోకి అదృశ్యమయ్యాయి అంతే–

దిగ్గున మెలకువ వచ్చేసింది కృతయుగ్‌కి.

క్షణకాలం తను ఎక్కడున్నాడు ఏంజరిగిందీకూడా గుర్తురాలేదు. కళ్ళముందు కల ఇంకా కదులుతూనే ఉంది. వేంకటేశుడు కలలో దర్శనం ఇవ్వడం ఏమిటి? ఆదివిష్ణువుతోపాటు అష్టలక్ష్మల విగ్రహాలు కన్పించి నదిలోకి జారిపోవడం దేన్ని సూచిస్తోంది? పరిపరివిధాల ఆలోచిస్తూ లేచి టైమ్ చూశాడు. తెల్లవారుఝాము నాలుగు దాటింది సమయం.

ముఖం కడుక్కుని నీరు తాగి వచ్చి తిరిగి కల గురించే తీవ్రంగా ఆలోచిస్తున్నాడు కృతయుగ్.

ఇంతలో ఎందుకోలేచిన స్నిగ్ధ లైటు వెలగడం గమనించి పక్కగదిలోకి తొంగిచూసింది.

కృతయుగ్ కూర్చునుండటం ఆమెను ఎంతో ఆశ్చర్యపరిచింది. ఆమె ముందు గదిలోకి వచ్చేలోపల కాంచన కూడా లేచివచ్చేసింది. "ఏమిటి ఆలోచిస్తున్నావ్?" పక్కన కూర్చుంటూ అడిగింది స్నిగ్ధ.

"ఏం లేదు" అన్నాడు పొడిగా.

కల విషయం చెప్పాలా, వద్దా అర్థంకాలేదు.

"ఏం లేకపోతే ఈ టైమ్‌లో నిద్రలేచే అలవాటు నీకులేదు. అదేమిటో చెప్పాల్సిందే" అంటూ రెండో పక్కన కూర్చుంది కాంచన.

"విచిత్రమైన కల. దానికి అర్థం ఏమిటాని ఆలోచిస్తున్నాను" అన్నాడు కృతయుగ్.

"ఏమిటా కల? చెప్పు చెప్పు..." ఎంతో కుతూహలంగా అడిగింది కాంచన.

తన కల సారాంశాన్ని వివరించాడు కృతయుగ్.

కాస్సేపు కలకి అర్థం ఏమైవుంటుందాని చర్చించుకున్నారు. ఇలాంటి విషయాల్లో స్నిగ్ధ చాలా హుషారుగా ఉంటుంది. "కృతా... ఆ రోజు బౌద్ధారామం వద్ద అనంతస్వామిని నువ్వో ప్రశ్న అడిగావు గుర్తుందా? ఆలయాల విగ్రహాలు ఏమయివుంటాయి? వాటిని భద్రపరిచివుంటే ఎక్కడ దాచివుంటారు అని. గుర్తుందా?" అడిగింది.

"అవును గుర్తుంది"

"నీ ప్రశ్నకి స్వామి స్వయంగా సమాధానం ఇచ్చాడు."

"అదేమిటక్కా. కల్లో ఒక్కమాట కూడా స్వామి పలకలేదంటున్నాడు గదా!" అంది కాంచన.

"పలకకుండానే తామంతా ఎక్కడ ఉందీ గుర్తులు చూపించాడు. కృతా.... ముందుగా వేంకటేశుడు కన్పించాడంటే ఆయన కృప నీమీద పూర్తిగా ఉందని శుభం జరుగుతుందని అర్థం.

దీవి తీరంలో ఎక్కడో అతిపెద్ద రావివృక్షం ఉంది. దాని సమీపంలోనే ఆనాడు ఆలయపూజారులు విగ్రహాలు శత్రువుల కంటపడకుండా తెచ్చి నదిలో దాచేసి ఉంటారు. ఆ చోటు స్వామి నీకు చూపించాడు.

వాటిని బయటకు తీయాలి" అంటూ కలను విశ్లేషించింది స్నిగ్ధ. ఆమె చెప్పింది నూటికి నూరుశాతం నిజమనిపించింది కృతయుగ్‌కి. ఖచ్చితంగా ఆ ఆదివిష్ణు కలద్వారా తన ఉనికి తెలియచేసి వుండాలి. తీరంలో బోధివృక్షం ఉందంటే కల నిజమైనట్టే.

కాని అనేక వృక్షాలుంటే కనిపెట్టడం కొంత సమస్యే. ఏమైనా విగ్రహాల అన్వేషణకి చాలా సమయం ఉంది గాబట్టి తొందరపడాల్సిన పనిలేదు. ముందు నిధి బయటపడాలి. "ఈ విషయం మన ముగ్గురి మధ్యే ఉండాలి. సమయం వచ్చినప్పుడు విగ్రహాల గురించి అన్వేషిద్దాం" అన్నాడు కృతయుగ్.

"ఐతే ఇంకో రెండుగంటలు నిద్రపోవచ్చుగా" అంది కాంచన. "నిద్రా. మీ ఇద్దరూ ఇలా చెరోపక్కన అతుక్కుపోయికూర్చుంటే ఇంకెక్కడి నిద్ర" గొణిగాడు.

"ఏయ్. మామీద నింద వేయాలని చూడక. మేంకూర్చున్నాం. అంతేగదా" అంది నవ్వుతూ స్నిగ్ధ.

"బ్రహ్మచారులమండీ. ఈ మాత్రం చాలదా నిద్ర ఎగిరిపోవడానికి. ఏమిటో అర్థంగావడంలేదు.

వేంకటేశునికి ఇద్దరు భార్యలు, షణ్ముఖునికి ఇద్దరుభార్యలు, వినాయకునికి ఇద్దరు.

ఎందుకో నాకూ ఇద్దర్ని ఇచ్చాడు దేవుడు. పెళ్ళివరకు దేవుడా మమ్మల్ని పవిత్రంగా ఉంచు" అంటూ పైకి చూసి దండం పెట్టుకున్నాడు.

"భయపడకు భక్తా. నీ పవిత్రతని మేం కాపాడతాం గదా!" అంది స్నిగ్ధ. "అవును కదా" అంది కాంచన.

ఇద్దరూ ఒకేసారి చెరో ముద్దు ఇవ్వగానే కంగారుపడి లేచి బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు కృతయుగ్. అమ్మాయిలిద్దరూ సరదాగా నవ్వుకున్నారు.

ఇక మిగిలిన రాత్రి నిద్రపోలేదు ఎవరూ.

బ్రష్ చేసుకుని ఆ తర్వాత స్నానాదికాలు ముగించి త్వరగా రెడీ అవనారంభించారు.

ఆదివారం! అమావాస్య! ఎదురు చూసిన రోజు రానే వచ్చింది.

రాత్రి పదిగంటల సమయంలో దీవిమీద నాగబలి క్రతువు నిర్విఘ్నంగా ఆరంభమైంది.

ఆ రోజు మధ్యాహ్నం భోజనాలు చేసిన కొద్దిసేపటికే అంతా నదీతీరానికి చేరుకున్నారు. ఎందుకంటే నదిమీద సుమారు మూడు గంటల పైగా ప్రయాణిస్తేగాని దీవికి చేరుకోలేరు. చీకటిపడకముందే చేరుకుని వెలుతురుండగానే ఏర్పాట్లు చేసుకోవాలి.

అప్పటికి మహీధర్ భుజం గాయం కూడా తగ్గుముఖం పట్టడంతో అతనూ జాయినయ్యాడు. కృతయుగ్‌కి సారీ చెప్పడంతో సమస్య సమసిపోయింది.

మోటారు ఇంజను అమర్చిన రెండు పడవల్లో అవసరమైన సరంజామా అంతా వేసుకుని బయలుదేరారు. చీకటిపడకముందే దీవికి చేరుకున్నారంతా. వాతావరణం కూడా పొడిగా అనుకూలంగా ఉంది.

ఈ సారి అనంతస్వామి  చాలా పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకున్నాడు. ఒక గంటపాటు అభిమంత్రించిన శక్తివంతమైన మంత్రాక్షతల్ని వెంట తీసుకొచ్చాడు. అంతా పడవలు దిగి సామానంతా ఒడ్డుకు చేర్చారు.

అటూ ఇటూ దారిపొడవునా అక్షింతలు చల్లుతూ అనంతస్వామి ముందు నడుస్తూవుండగా ఆయన్ని అనుసరించారంతా. నైఋతి భాగానికి చేరుకోగానే ఈ సారి వదలకుండా నాగశక్తులు బయటికిరాకుండా అవి ఉన్న ప్రాంతంలో కూడా అక్షింతలు చల్లాడు అనంతస్వామి. అనేక పాములు బుసలుకొడుతున్న శబ్దాలు స్పష్టంగా విన్నారంతా.

ఇదలా ఉండగా భూమి లోపలినుంచి కావలిశక్తి మూలుగుశబ్దం అందర్నీ గాబారా పెట్టేస్తోంది.

ముఖ్యంగా కృతయుగ్‌తో సహా అంతా ఇంతకు ముందు దీవిమీదికి వచ్చి వెళ్ళినవాళ్ళే. స్నిగ్ధ, కాంచనలకు ఇదే మొదటిసారి. అలాగే క్రతువు నిర్వహించటాని కొచ్చిన ఋత్విక్కులు అయిదుగురికీ ఇదే మొదటి అనుభవం. ఉజ్జయినికి చెందిన వేదబ్రాహ్మలకి స్థానికంగా దీవి గురించి తరతరాలుగా భయాలున్నాయి.

అందుకే ఎవరూ రావటానికి అంగీకరించలేదు. మనిషికి యాభైవేలు ఇచ్చేలా ఒప్పందం కుదిరిన తరువాత ధైర్యం చేసి వెంటవచ్చారు. వచ్చారేగాని వారు భయపడుతూనేవున్నారు.

గతంలో ఎక్కడయితే కృతయుగ్ వచ్చి తమను కాపాడాడో అక్కడ నేలను శుభ్రంచేసి గోమయం చల్లి కొత్త ఇటుకలు పేర్చి  హోమానికి సిద్ధం చేశారు.

అలాగే వెంటతెచ్చిన మూడు పెద్ద పెద్ద ప్లాస్టిక్‌డ్రమ్ముల నిండా పీటర్ మనుషులు నదినుంచి బకెట్లతో నీరు తెచ్చి నింపారు. అప్పటికి సూర్యాస్తమయమైంది. దీవి అంతటా చిమ్మ చీకట్లు ఆక్రమించుకున్నాయి.

వెంట తెచ్చిన అరడజను స్టాండ్‌బైలైట్లను వెలిగించడంతో ఆ ప్రాంతమంతా పట్టపగల్లా మారిపోయింది.

వేదపండితులు హోమాగ్నికి అవసరమైన సమిధలు, నెయ్యి అన్నీ సిద్ధం చేసుకుని రెడీ అయ్యారు. వెండితో చేయించిన అయిదు నాగసర్పాలను ఎదురుగా పీఠం మీద ఉంచి ముందుగా వాటికి పూజ నిర్వహించి తర్వాత దేవతలను ఆవాహన చేస్తూ సరిగ్గా రాత్రి పదిగంటలకు హోమగుండాన్ని ప్రజ్వరిల్ల జేసి ఋత్విక్కులు క్రతువు ఆరంభించారు.

ఈ క్రతువుకోసం ఏయే మంత్రాలను అనుష్ఠించాలో అనంతస్వామి ముందే చెప్పడం మూలంగా క్రతువు సజావుగా జరిగిపోసాగింది.

వేదమంత్రఘోషతో ఆ ప్రాంతం మారుమ్రోగసాగింది. అనంతస్వామి కూడా మధ్యమధ్యలో వారితో శృతికలుపుతున్నాడు. హోమాగ్నుల్లో వ్రేల్చుతున్న హోమద్రవ్యాలు ఆవునెయ్యి సువాసనలు ఆ ప్రాంతాన్ని పరమపవిత్రం చేస్తున్నాయి.

హోమగుండం నుంచి జ్వాలలు నాల్కలు సాచి లేస్తూ ఎర్రని వెలుగులు చిమ్ముతున్నాయి.

హోమం ఆరంభమైన గంట తర్వాత పలుగు అందుకుని బయలుదేరాడు కృతయుగ్.

వెంట ఎవరినీ రానీయలేదు.

"జాగ్రత్త నాయనా! లక్కపుట్టలు బయటపడేవరకు గోతులు తవ్వి సిద్ధం చేసుకో. నాగశక్తులు నీమీద తిరగబడకుండా నేను నీ చేతికి కట్టిన కంకణాన్ని భద్రంగా చూసుకో. త్వరగా కానీ" అంటూ కృతయుగ్‌ని హెచ్చరించాడు అనంతస్వామి.

ధైర్యంగా ముందుకెళ్ళాడు కృతయుగ్.

కృతయుగ్‌కి ఏమీ కాకూడదని ఆదివిష్ణువును ప్రార్థిస్తూ స్నిగ్ధ, కాంచనలు అందరికంటే ఎక్కువ భయాందోళనలతో అతడ్ని చూడసాగారు.

క్రమంగా క్రతువు వేగం అందుకుంది. వేధఘోష నిశీధిలో దీవి అంతటా విన్పిస్తోంది. యాగాగ్నులు చిటపటలాడుతూ ప్రేలుతూనే వున్నాయి.

కృతయుగ్ తన యోగశక్తిని ప్రయోగించి భూమిలోని లక్కపుట్టల్ని సృష్టంగా చూడగలుగుతున్నాడు. ముందుగా మధ్యలోని పింగళనాగశక్తి ఉన్నచోట తవ్వడం ఆరంభించాడు. భూమిలోపలి నుంచి నాగశక్తుల బుసలు బయటికి స్పష్టంగా విన్పిస్తున్నాయి.

మూడు అడుగులలోతు గొయ్యి తవ్వి మట్టి తీయగానే దిగువన లక్కపుట్ట కన్పించింది. లోపల సూక్ష్మరూపంలో ఉన్న నాగశక్తి కృతయుగ్ గరుడరేఖ ప్రభావంతో కుచించుకుని పుట్టలో ఒదిగిపోయిందేగాని బయటికి రాలేదు.

దాన్ని అలాగే ఉంచి మరోచోట తవ్వడం ఆరంభించాడు. మొత్తం అయిదుచోట్ల తవ్వకం పనిని కేవలం నలభై నిముషాల్లోనే ముగించాడు కృతయుగ్.

అప్పటికింకా ఇరవై నిముషాల ముహూర్త సమయం ఉంది. ఈ లోపల అనంతస్వామి అయిదు వెండి సర్పాలను ఒక్కొక్కటీ తీసి పసుపుదారం చుడుతూ మంత్రాలతో దిగ్బంధనం చేసి సిద్ధంగా ఉంచాడు.

మధ్యమధ్యన వాచీలో సమయాన్ని గమనిస్తూనే వున్నాడు. కృతయుగ్ తను తవ్విన గోతుల వద్ద పలుగుతో సిద్ధంగా ఉన్నాడు. క్షణాలు భారంగా దొర్లుతున్నాయి. ఏం జరుగుతుందోనని అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

సరిగ్గా పన్నెండు రెండు నిముషాలు. కృత్తికా నక్షత్రయుక్త మీనలగ్నం ఏర్పడింది. అనంతస్వామి లేచి నిలుచున్నాడు.

"ఇక్కడ ఏం జరిగినా ఎవరూ భయపడవద్దు. లేచి పారిపోయే ప్రయత్నం అస్సలు చేయవద్దు. ధైర్యంగా ఉండాలి" అంటూ హెచ్చరించాడు.

ఋత్విక్కుల్ని క్రతువు కంటిన్యూచేయమని హెచ్చరించి కృతయుగ్ వంక చూసి సైగచేశాడు. వెంటనే పింగళనాగం వున్న లక్కపుట్టను గునపంమొనతో లేపి వేగంగా తెచ్చి హోమగుండంలో వేశాడు. అనంతస్వామి మంత్రోచ్చాటన చేస్తూ ఒక వెండి సర్పాన్ని హోమాగ్నికి సమర్పించాడు.

అంతే- హోమగుండంలో కళ్ళు మిరుమిట్లు గొలిపే మెరుపులు మెరిశాయి. వింతకాంతులు ఆవిర్భవించాయి. ఆ కాంతుల మధ్యనుంచి పడగ విప్పి బుసలు కొడుతూ ఒక మహాసర్పం భగభగ తగలబడిపోతూ రౌద్రావేశంతో పైకి లేచింది.

ఎర్రగా నిప్పులు చెరగుతూ చేటంత పడగ విప్పి పదడుగుల ఎత్తున తోకమీద నిలబడిన ఆ మహా సర్పాన్ని చూడగానే భయంతో ఎక్కడి వాళ్ళక్కడ భయంతో బిగిసిపోయారు.

ఒక్కసారిగా కలకలం రేగిందక్కడ.

అనంతస్వామి ముందే హెచ్చరించడం చేత ఆగారుగాని లేదంటే ఆ మహాసర్పాన్ని చూడగానే భయంతో లేచి అంతా పరుగు తీసేవారే. అంతటి బీభత్స దృశ్యాన్ని ఆ క్షణంలో వీక్షించారంతా.

అలా ఇరవై సెకన్లపాటు నిప్పులు కక్కుతూ చుట్టూ చూసిన సర్పం తర్వాత తగలబడుతూనే నెమ్మదిగా అలా అలా గగనసీమకు ఎగసి చెట్లపైన అదృశ్యమైంది.

ఆ వెనకే ఒక్కటొక్కటిగా లక్కపుట్టల్ని తెచ్చి కృతయుగ్ హోమాగ్నిలో వేయడం, అనంతస్వామి వెండి సర్పాన్ని అగ్నికి సమర్పించగానే తగలబడుతున్న సర్పం హోమాగ్నిలోంచి పైకెగసి గగనసీమలో అదృశ్యంకావడం ఇలా ముహూర్తకాలం ఇంకా అయిదు నిముషాలు మిగిలి ఉండగానే అయిదు పుట్టల్ని అగ్నికి ఆహుతి చేయడం జరిగింది.

ఆ విధంగా వందలాది సంవత్సరాలు నిధికి కాపలాగా దీవిమీద ఉన్న నాగశక్తులు అంతరించి దీవి సురక్షితమైంది. కృతయుగ్ అనంతస్వామి ఆనతిమేరకు కాళ్ళు, చేతులు కడుక్కుని వచ్చి క్రతువులలోకూచున్నాడు. అతడికి నాగదోషం అంటనివిధంగా ప్రత్యేక పూజని నిర్వహించారు.

మొత్తానికి క్రతువు పరిసమాప్తి అయ్యేసరికి అర్ధ రాత్రి దాటి ఒంటిగంట యింది సమయం. ఋత్విక్కులు బలి సమర్పించి క్రతువు ముగించారు.

తదనంతరం ముందుగా కృతయుగ్ డ్రమ్ముల వద్ద నీటితో తలస్నానం చేసి పొడిదుస్తులు ధరించాడు. వెనకే అనంతస్వామి తర్వాత వేదపండితులు అయిదుగురూ స్నానాదులు ముగించారు.

క్రతువు నిర్విఘ్నంగా ముగిసినందుకు అంతా సంతోషించారు. అయితే ఆ సంతోషం ఎక్కువ సేపు నిలవలేదు. ఎలా తెలిసిందో ఏమిటోగాని సుమారు ముప్పైమందికి పైగా సాయుధ ఉజ్జయినీ పోలీసు బలగాలు రెండు మరపడవల్లో దీవికి చేరుకున్నారు. ఒక్కసారిగా అందర్నీ చుట్టుముట్టారు.

ఊహించని పరిణామం ఇది.

వచ్చింది సాదాసీదా పోలీసులు కాదు. సాయుధపోలీసులు. వెంట ఉజ్జయినీ నగర సిటీపోలీస్ కమీషనర్‌తో బాటు ఎస్.పి-ఎ.ఎస్.పి. నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఆరుగురు ఎస్సైలతో భారీ బందోబస్తుతో వచ్చారు. ఒక అర్ధగంట వాళ్ళు ఆలస్యంగా వస్తే బాగుండేది. తామంతా తిరుగుప్రయాణంలో ఉండేవాళ్ళు.

దీవి మీద డైరెక్టుగా దొరికిపోవడంతో అన్నారావుతో సహా అంతా కంగారుపడ్డారు. ఎవరికీ నోటమాట రావడంలేదు. "ఎవరు మీరంతా? ఇక్కడేంచేస్తున్నారు?" కమీషనర్ అందర్నీ కలయజూస్తూ అడిగాడు.

అన్నారావు మాట్లాడబోతుంటే వారించి ముందుకొచ్చాడు కృతయుగ్. "సార్. మీరింత బలగంతో ఎందుకొచ్చారో ఏమిటో మాకయితే అర్ధంగావడంలేదు గాని మేం వచ్చింది మాత్రం పూజలు చేసి ముడుపులు చెల్లించుకోవడానికి" అన్నాడు.

"పూజలా... ఈ దీవిమీద అడుగుపెట్టిన వాళ్ళెవరూ ఇంతవరకు ప్రాణాలతో వెనక్కి రాలేదంటారు. అలాంటిది మీరెలా వచ్చారు? ఏం పూజలు చేశారు?" సీరియస్‌గా అడిగాడు కమీషనర్.

"సార్. జనం అలా చెప్పుకుంటున్నారేమోగాని మాకింతవరకు ఎలాంటి ప్రమాదం ఇక్కడ ఎదురుకాలేదు. చూస్తున్నారుగా. ఒకప్పుడు ఈ దీవి ఆదివిష్ణు ఆలయంతో దివ్యధామంగా అలరారిన చోటు. ఆ స్వామిని వేడుకుంటే మా కోరికలు తీరాయి.

అందుకే వచ్చి పూజలు చేసి మొక్కు తీర్చుకుని తిరుగు ప్రయాణంలో ఉన్నాం. అంతలో మీరొచ్చారు" అన్నాడు. ఆ మాటలు కమీషనర్‌ను తృప్తిపర్చలేదు.

"నీ కాకమ్మ కథలు నమ్మటానికి మేం సిద్ధంగాలేము మిష్టర్. ఒకప్పుడిక్కడ గుడి ఉందో లేదో గాని ఇక్కడ నిధి ఉందనిమాత్రం తెలుసు.

నిధితవ్వి తీసుకుపోవాలని ఒక ముఠా హైదరాబాద్ నుంచి వచ్చి ఇక్కడే తిష్టవేసిందని మాకు ఇన్ఫర్మేషనుంది. మీరంతా నిధికోసం వచ్చి పూజలు చేస్తున్నారు. అవునా?" కటువుగా అడిగాడు.

"నిధులా! ఉంటే మీరే తవ్వి తీసుకోండి సార్. అసలే మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈ మధ్య ఆదాయం తగ్గి కటకటలాడుతోంది.

మీ ప్రభుత్వానికి ఆర్థిక సమస్యలు తొలగిపోతాయి. అంతేగాని అనవసరంగా మమ్మల్ని దొంగల్ని చేయకండి. మీకెవరో రాంగ్ ఇన్ఫర్మేషనిచ్చారు"

కృతయుగ్ మొండిగా వాదించేసరికి కమీషనర్ ఖంగుతిన్నాడు. ఆలోచనలో పడిపోయాడు. అది గమనించి– "సార్. ఇక్కడ పూజలు నిర్వహించడానికి స్థానికంగా ఉండే వేదపండితుల్నే పిలిచాం.

ఈ అయిదుగుర్ని అడగండి. ఇక్కడ మేం ఏ విధమైన క్షుద్రపూజలు చేయలేదు. దైవపూజలే చేశాం" అంటూ వివరించాడు అన్నారావు.

వేదపండితులు కూడా అదే విషయం చెప్పారు. పొరబాటున కూడా నాగశక్తుల ప్రయోగాన్ని తిప్పకొట్టి దీవిని సురక్షితం చేసిన సంగతి బయట పెట్టలేదు.

వారి మాటలు విన్నాడు కమీషనర్. ఆ ప్రాంతంలో తిరిగిచూశాడు. తన సిబ్బందితో చర్చించాడు.

ఎందుకో ఇది మామూలు పూజాకార్యక్రమం అంటే నమ్మబుద్ధి కాలేదు. "ఓ.కె. మీరు ఏం చెప్పుకున్నా పోలీస్‌స్టేషన్లో చెప్పుకోండి. ప్రస్తుతం మీరంతా మాతో రాకతప్పదు. బయల్దేరండి" అన్నాడు. స్నిగ్ధకు ఇదంతా నచ్చలేదు. కమీషనర్‌తో మాట్లాడాలనుకుంది. కాని కృతయుగ్ ఆమెను వారించాడు.

ఈ టైమ్‌లో ఇలాగే మాట్లాడాలి. వేరేలా మాట్లాడితే వాళ్ళ ట్రీట్‌మెంట్ వేరేగా ఉంటుంది. ఉదయం అసలు విషయాలు వివరిద్దాం" అంటూ హెచ్చరించాడు.

తెచ్చిన సరంజామా అంతా తిరిగి పడవల్లోకి చేర్చారు. ఇంజన్లు స్టార్టయి పడవలు బయలుదేరాయి. కృతయుగ్ వర్గం పడవలకు ఎస్కార్టుగా పోలీసు బలగాల పడవలు ప్రయాణించాయి. వారంతా ఉజ్జయిని చేరుకునేసరికి తూరుపు తెలవారుతోంది.

*   *   *   *   *

తీరంలో మూడు పోలీస్‌వేన్‌లు, రెండు జీప్‌లు ఉన్నాయి. కమీషనర్ ఆర్డర్‌తో అందర్నీవేన్‌లలో ఎక్కించబోయారు పోలీసులు. రాత్రంతా నిద్రలేమితో అందరూ చాలా నీరసించి ఉన్నారు. పోలీస్ కంట్రోల్‌రూమ్‌కి వెళ్తే తమ పరిస్థితి దారుణంగా ఉంటుంది.

కృతయుగ్ కూడా ఏం చేయాలో అర్ధంగాక ఆలోచిస్తున్నాడు. ఇంతలో పోలీస్ కమీషనర్ సెల్ మోగింది. అవతల లైన్లో ఉంది మధ్యప్రదేశ్ ఛీఫ్‌మినిష్టర్. స్వయంగా ఆయనే మాట్లాడుతున్నాడు.

"ఏం జరుగుతోందక్కడ? రాత్రి దీవిమీద మీరు ఎవరినన్నా అరెస్ట్ చేశారా?" అడిగాడు.

కమీషనర్‌కి షాక్. ఇంతవరకు మీడియాకే తెలీని ఈ అరెస్టుల గురించి సి.ఎం.కి ఎలా తెలిసిందో ఎంత ఆలోచించుకున్నా అర్ధంకాలేదు.

"అవున్సార్" అంటూ జరిగింది వివరించాడు.

"ఓ.కె. వాళ్ళంతా ఏ హోటల్లో దిగారో కనుక్కుని వదిలేయండి" "అది కాదు సార్"

"చెప్పింది చెయ్యవయ్యా. మీరు అరెస్ట్‌చేసిన వాళ్ళలో సెంట్రల్ మినిస్టర్ శివప్రసాద్‌గారి అమ్మాయి ఉంది. ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్‌లో ఆఫీసరామె. ముందు వాళ్ళందర్నీ విడిచిపెట్టండి. నేను మూడు గంటలకి ఉజ్జయిని వస్తున్నాను. నాలుగు గంటలకి వాళ్ళని క్యాంప్ కార్యాలయంలో నన్నుకలవమని చెప్పు. దూ వాటైసే" అంటూ లైన్ కట్ చేశాడాయన.

పెద్ద ముఠానే పట్టుకున్న సంతృప్తితో వున్న కమీషర్‌కు సి.ఎం. ఆర్డర్ కొరుకుడు పడలేదు. గొంతుదిగలేదు. అందర్నీ ఓసారి చూస్తూ అమ్మాయిలిద్దరి వంక నిశితంగా చూసి దగ్గరకెళ్ళాడు.

"మీ ఇద్దరిలో సెంట్రల్ మినిష్టర్ శివప్రసాద్ గారమ్మాయి ఎవరు?" అనడిగాడు.

"నేనే సర్" అంది స్నిగ్ధ.

"ఆర్కియాలజీ డిపార్ట్‌మెంటా మీది?"

"అవునండి"

"ఈ మాట దీవిమీద చెప్పొచ్చుగదా. మీరంతా ఎక్కడ దిగారు?" చెప్పింది స్నిగ్ధ.

"ఓ.కె.! మీరంతా హోటల్‌కెళ్ళిపొండి. సాయంత్రం భోపాల్ నుంచి సి.ఎం.గారు వస్తున్నారు. నాలుగుగంటలకి సి.ఎం.గారి క్యాంప్ కార్యాలయంలో మీరంతా ఆయనముందు హాజరవ్వాలి. వేన్ పంపిస్తాం. వచ్చేయండి" చెప్పాడు.

"అంతారావాలా? ముఖ్యమయిన వాళ్ళం వస్తే చాలాసార్?" అడిగాడు.

"అంతా రావాలి. డోన్ట్ మిస్"

పోలీస్ వేన్లు వెళ్ళిపోయాయి. ఏం జరిగి ఉంటుందో ఎవరికీ అర్థం కాలేదు గాని కృతయుగ్ ఊహించాడు.

"ఏమయింది? మీ డాడీకి ఫోన్ చేశావా?" స్నిగ్ధను అడిగాడు. అవునన్నట్టు తల ఊపింది.

"అర్ధగంటక్రితమే డాడీకి ఫోన్‌చేసి పరిస్థితి చెప్పాను. లేకపోతే మనం నిద్రముఖాలతో పోలీస్ స్టేషన్లో దొంగల్లా కూచోవాలా? రాత్రంతా నిద్రలేక ఇప్పటికే నీరసించిపోయాం. విశ్రాంతి అవసరం. రానీ, సి.ఎం.తో డైరెక్ట్‌గా నేనే మాట్లాడతాను" అంది స్నిగ్ధ.

తమ వాహనాలు తీరంలోనే ఉన్నాయి. ఋత్విక్కులు అయిదుగురూ దొరికిన ఆటో పట్టుకుని తమ దారిన తాము వెళ్లిపోయారు.

కృతయుగ్ బృందం తమ వాహనాల్లో హోటల్‌కి బయలుదేరేసరికి తూర్పున పొద్దు పొడిచింది.

*    *    *    *    *

సి.ఎం. క్యాంపు కార్యాలయం. సాయంత్రం సరిగ్గా నాలుగు గంటలు. స్నిగ్ధతోబాటు కృతయుగ్, కాంచన, అన్నారావు, అనంతస్వామి అయిదుగురూ సి.ఎం. ఎదురుగా కూర్చునున్నారు.

స్నిగ్ధ అభ్యర్ధన మేరకు సౌండ్‌ప్రూఫ్ హాల్లో సమావేశం వద్దకి మీడియాని గాని, సిబ్బందిని గాని రానీయలేదు. సి.ఎం. చీఫ్ సెక్రటరీని కూడా బయటే వుంచారు.

స్నిగ్ధ ఏదీ దాచకుండా క్లుప్తంగా జరిగిందంతా సి.ఎం.కు వివరించింది. శంభులింగయాచారి రాసిన లేఖ నకళ్ళను, రాగిలేకుల్ని కూడా చూపించింది. అంతా శ్రద్ధగా విన్నాడాయన. "మీ మాటల్నిబట్టి దీవిమీద అపారమైన నిధి

ఉందని అర్ధమవుతోంది. ఆ దీవి మృత్యు దీవిగా పేరుబడింది. దీవి మీద అడుగు పెట్టిన వాళ్ళు ప్రాణాలతో బయటకు రాలేదంటారు" అన్నాడు.

"మా మనుషులు అయిదుగురు మృత్యువాత పడ్డారు సార్. వాళ్ళ ఎముకల గూళ్ళు ఇంకా దీవిమీద పడున్నాయి" అన్నాడు అన్నారావు.

"దీవిని సురక్షితం చేయడం ముఖ్యం. అందుకే రాత్రి మేం అక్కడ నాగబలి క్రతువు చేసి కావలి నాగశక్తుల్ని పరిశీలించాం" అన్నాడు అనంతస్వామి.

"అంటే ఇప్పుడు దీవిమీద అడుగుపెట్టిన వాళ్ళెవరూ చనిపోరు. అంతేగా?" సందేహ నివృత్తికోసం అడిగారు సి.ఎం. "అవున్సార్. కాని నిధికోసం తవ్వకాలు జరపటానికి ఇంకా చాలా తతంగం ఉంది.

అవన్నీ ముగించి తవ్వకాలు జరిపాకే అసలు లోన పరిస్థితి ఏమిటి, ఎంత నిధి ఉంది అనేది తెలుస్తుంది" అన్నాడు అనంతస్వామి. ఓసారి అందర్నీ కలయజూసి– గొంతు సవరించుకున్నాడు సి.ఎం.

"మీరు చూపిన ఆధారాలు, మీ మాటల్ని బట్టి దీవి మీద అపారమైన నిధులున్నాయని అర్ధమవుతోంది. అది మా స్టేట్‌కి చెందిన నిధి. ఆ నిధిని ఆలయాలకు వెచ్చించడం ఎంత వరకు కరెక్టో అర్ధంగావడంలేదు. ఎప్పుడో పద్దెనిమిది వందల సంవత్సరాల క్రితం రాజశాసనాన్ని ఇప్పుడు పాటించాలా?

ఆ నిధిని రాష్ట్ర సర్వతోముఖాభి వృద్ధికి ప్రజాసంక్షేమానికి ఉపయోగించవచ్చు. అది మా ప్రాంతపు పూర్వీకుల సొత్తు. దానిమీద సంపూర్ణ ఆధికారం మాకే ఉంటం న్యాయం" అన్నాడు.

అప్పుడు కృతయుగ్ కల్పించుకుంటూ– "సార్. మీకు తెలీని విషయాలు కాదు. ప్రజాసంక్షేమానికి వెచ్చిస్తున్న నిధులు ప్రజాప్రతి నిధులు దళారీల జేబులు నింపుతున్నాయి. జలయజ్ఞం పేరుతో ఆరంభమైన వివిధ ప్రాజెక్టు పథకాలు ధనయజ్ఞంగా మారి నాయకులు, కాంట్రాక్టర్లు ఒక్క ప్రాజెక్టు పూర్తిగాకుండానే వేలకోట్ల రూపాయలు మింగేశారు.

ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌ను గమనిస్తే పరిస్థితి మీకు అర్ధమవుతుంది. అవినీతి లంచగొండితనం పెరిగిపోయింది. ఐఏఎస్‌లు, ఐపిఎస్‌లు, మంత్రులు, నాయకులు కాంట్రాక్టర్లు ఒక్కొక్కరే జైలు పాలవుతున్నారు. నాయకుల్లో ముందుచూపు, చిత్తశుద్ధి లోపించడంవల్ల ఎవరికివారు అందినంత దోచేసు కుంటున్నారు.

ధరలు చుక్కలనంటుతున్నా అడిగే నాధుడు లేడు. సామాన్యుడి గోడు పట్టించుకునేవాడు లేడు. ఇక దేవాదాయశాఖలో జరుగుతున్న అక్రమాలు అవకతవకల గురించి చెప్పక్కర్లేదు.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే ఈ నిధిమీద పెత్తనం నాయకుల చేతుల్లోకిపోతే అక్కడ దేవుడికి మిగిలేదేమీ ఉండదు. ఆ కాలంలో భోజరాజులు ఒక లక్ష్యం కోసం ఎంతో పకడ్బందీగా నిక్షిప్తం చేసి ఉంచిన నిధి అది. ఆ లక్ష్యాన్ని కాదనే హక్కు ఎవరికీ లేదు.

ఆ నిధిని ఎలా ఉపయోగించాలో చివరివాడైన విక్రమభోజుని శాసనం తెలియజేస్తోంది. నిధిమీద వివాదాలు తలెత్తకూడదని ముందుగానే మేం సుప్రీంకోర్టుని ఆశ్రయించడం జరిగింది.

కోర్టుతీర్పుననుసరించే మనం నిర్ణయాలు తీసుకోవాలసుంటుంది" అంటూ వివరించాడు.

"కాని ఇది మా స్టేట్‌కి చెందిన నిధి. దీనిమీద సంపూర్ణ హక్కు మాకే ఉండాలి"

"అలా ఉన్నప్పుడు ఇంత వరకు మీకు పూర్వపు ప్రభుత్వాలుగాని మీ ప్రభుత్వం గాని నిధిని బయటకు తీసే ప్రయత్నం ఎందుకు చేయలేదు?" సూటిగా అడిగాడు కృతయుగ్.

"ఒకటి కాదు రెండు కాదు. సుమారు పద్దెనిమిది వందల సంవత్సరాలుగా ఆదివిష్ణువు, ఆయన దేవేరులైన అష్టలక్ష్మిల విగ్రహాలు క్షిప్రానదిలో జలసమాధి స్థితిలో ఉన్నాయి. వాటిని శాశ్వతంగా అలాగేనదిలో వదిలేస్తారా?" కృతయుగ్ మాటలకు– ఉలిక్కిపడి చూశాడు సి.ఎం. ఆయనకి చిన్న షాక్. నమ్మలేకపోయాడు.

"విగ్రహాలు నదిలో ఉండటం ఏమిటి? నేను నమ్మను" అని అన్నారు సి.ఎం.

"మీరు నమ్మినా, నమ్మకపోయినా ఇది నిజం. శైవుల దండయాత్రలో గుళ్ళు పాడయినా, విగ్రహాలు నాశనం కాకూడదని ఆనాటి పూజారులు విగ్రహాల్ని శత్రువుల కంటబడకుండా నదిలో దాచారు. ఆ విగ్రహాలు ఇప్పటికీ అక్కడే ఉన్నాయి"

తల అడ్డంగా ఊపారు సి.ఎం. "నో... నో... ఇంపాసిబుల్. విగ్రహాలున్నాయంటే నేన్నమ్మను. ఉన్నాయని మీరు ఊహించారా? లేక వాటిని మీరు చూశారా?" అని అడిగారు.

"ఉన్నాయి సార్. మా నమ్మకం వమ్ముకాదు" తన మాటకి కట్టుబడి ఉన్నాడు కృతయుగ్.

ఒక్కక్షణం ఆలోచించాడు సి.ఎం. "నమ్మకాలు నిజమవుతాయని నేననుకోను. ఆధారాలు కావాలి. మీ వద్ద అలాంటివేమీ లేవు.

ఓ.కె. ముందుగా విగ్రహాల్ని బయటికి తీసి చూపండి. నిజమైతే ఆలయాల నిర్మాణంలో మా సహకారం కూడా ఉంటుంది" అన్నారాయన.

"ఓ.కె. సర్. విగ్రహాలను ముందే బయటికి తీసుకొస్తాం. శాటిలైట్ ఫోన్‌తో మీ ప్రతినిధి ఒకర్ని మేము వెళ్ళేటప్పుడు మా వెంట పంపించండి.

అలాగే ఆక్సిజన్ ఎక్విప్‌మెంట్‌తో నీటిలో మునిగి పనిచేయగల ఇద్దరు గజ ఈతగాళ్ళను పంపించండి. రేపే తిరిగి దీవిమీదకువెళ్తాం.

విగ్రహాలను బయటకు తీయగానే మీకు ఇన్‌ఫాం చేస్తాం" అని అన్నాడు కృతయుగ్.

"మీరు కోరిన విధంగా రేపు ఉదయం ముగ్గురూ మీ హోటల్‌కొచ్చి కలుసుకునే లాగా ఏర్పాటు చేయిస్తాను.

మీరు చెప్పినట్టుగానే ఈ విషయాలేవీ ఇప్పుడే మీడియాకు తెలీడం అంత మంచిదికాదు. కొత్తవాళ్ళెవరూ దీవిమీదకు రాకుండా కాపలాకి కొంత పోలీస్ ఫోర్స్‌ని కూడా ఏర్పాటు చేయమని చెప్తాను. బెస్టాఫ్ లక్. వెళ్ళిరండి" అంటూ లేచారు.

"థ్యాంక్యూ సర్" అని అన్నాడు కృతయుగ్.

సి.ఎం. వద్ద సెలవు తీసుకుని– హోటల్‌కి తిరుగు ప్రయాణమయ్యారంతా.

* * * * *

అనుకున్నవిధంగా కృతయుగ్ వర్గం మరునాడు దీవికి వెళ్ళడం వీలుకాలేదు. వరసగా రెండ్రోజులు వర్షం పడడంతో ప్రయాణం వాయిదా పడింది. మధ్యప్రదేశ్ సి.ఎం. తనిచ్చిన మాటమేరకు శాటిలైట్ ఫోన్‌తో తన మనిషి ఒకడ్ని ప్రత్యేకంగా పంపించాడు. అలాగే ఇద్దరు గజ ఈతగాళ్ళూ వచ్చారు. కాని ఎగువన కురిసిన భారీవర్షాలకు క్షిప్రానదికి వరద నీరు తగలడంతో ప్రయాణం ఆపుకోవలసొచ్చింది.

మూడోరోజుకు వర్షం తగ్గింది. నాలుగోరోజుకు వరద కూడా తగ్గుముఖం పట్టింది. అయిదోరోజున రోడ్డు మార్గంగా అడవిదారిలో ప్రయాణించి దీవి

సమీపంలో నదీతీరానికి చేరుకున్నారంతా. వస్తూ వస్తూ వెంట ఒక మర పడవను ట్రక్కులో ఎక్కించి తీసుకొచ్చారు.

ప్రతిసారీ నదిమార్గంగా ప్రయాణం ఎక్కువ సమయం తీసుకుంటోంది. అందుకే ఈ సారి రూట్ మార్చి ఉదయం పదిగంటలకే తీరం చేరుకున్నారు. మర పడవను నీటిలోకి దించారు.

అక్కడినుండి దీవి ఫర్లాంగు దూరం మించదు. మర పడవ నాలుగు ట్రిప్పుల్లో అందర్నీ దీవిమీదకు చేర్చింది. డ్రైవర్లను వెహికిల్స్ వద్దే ఉంచి అందరూ త్వరగానే దీవికి చేరుకున్నారు.

దీవిమీద కాలు పెట్టగానే కృతయుగ్ ఆలోచించాడు. ఆ కాలంలో ఆలయం తూర్పుముఖంగా ఉండేది. కాబట్టి విగ్రహాల్ని పశ్చిమగోపురం మార్గంలో దీవి పశ్చిమతీరానికి చేర్చి ఉండాలి.

ఈ ఆలోచన రాగానే పశ్చిమ గోపురం పునాదులు దాటి తీరానికి వచ్చి అక్కడి చెట్లను గమనించాడు. తీరంవెంట అనేక వృక్షాలున్నాయి.

వాటిలో రావిచెట్లూ ఉన్నాయి. కాని గోపురమార్గం తిన్నగా నదీ తీరంలో ఒక అశ్వత్థవృక్షం ఉంది.

మహావృక్షం. ఏకాలం వృక్షామో తెలియదు గాని శాఖోపశాఖలుగా విస్తరించి చాలా లావుగా ఎత్తుగా ఉంది.

కలలో తనకు కన్పించిన వృక్షం అదేనని గుర్తించాడు కృతయుగ్.

అదే తనకు కలలో కన్పించిన వృక్షంగా పోల్చుకున్నాడు కృతయుగ్. అయిదు నిముషాలు కళ్ళు మూసుకుని ఆ మహావృక్షంకింద కూచున్నాడు.

అతడి మాటకోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నారంతా.

కృతయుగ్ కళ్ళుతెరిచాడు. “ఈ వృక్షం నుండి నదిలోకి వందడుగుల దూరం వెళ్ళి అక్కడ ఇసుకను తొలగిస్తూ లోతుగా తవ్వండి” అన్నాడు. గజ ఈతగాళ్ళు ఇద్దరూ ఆక్సిజన్ సిలిండర్లను వీపుమీద బిగించుకుని ముక్కుకు ట్యూబ్ కనెక్ట్ చేసుకుని నీటిలో మునిగారు.

తీరంనుంచి వందడుగుల దూరంలో నది పదడుగులలోతు వుంది. పారలతో అక్కడ ఇసుకను తొలగించడం ఆరంభించారు. కృతయుగ్‌తోబాటు స్నిగ్ధ, కాంచనలు, అన్నారావు, అనంతస్వామి, మహీధర్, పీటర్ అనుచరవర్గం అంతా చెట్లనీడన కూర్చుని ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

నీటిలోపల ఇసుకను తవ్వడం అంటే చాలా శ్రమతో కూడినపని. ఒకపక్క తవ్వుతుంటే మరోపక్క ప్రవాహం ఇసుకను తోసేస్తూ ఉంటుంది.

క్షణాలు గడుస్తున్నాయి. అందరిలోనూ ఆత్రుత. నీట మునిగినవాళ్ళు ఎంతకీ పైకి తేలడంలేదు.

గంట గడిచాక ఒకడు నీటి పైకి తలెత్తి చూశాడు. నాలుగడుగుల లోతుతవ్వినా విగ్రహాల జాడ తెలీలేదని అనౌన్స్ చేశాడు.

"మరికాస్త లోతుకు తవ్వండి. విగ్రహాలు అక్కడే ఉన్నాయి" హెచ్చరించాడు కృతయుగ్.

మధ్యాహ్నం రెండు గంటలవరకు నీటి అడుగున ఇసుకలో అన్వేషణ సాగింది. అయినా విగ్రహాల జాడలేదు. గజ ఈతగాళ్ళు పని ఆపి భోజనాలకి పైకి వచ్చేశారు.

అప్పటికే సిటీనుంచి అందరికీ భోజనాలు వచ్చాయి. అంతా భోంచేసి ఒకగంట విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు తిరిగి అన్వేషణ ఆరంభమైంది.

ఈసారి గజ ఈతగాళ్ళతోబాటు కృతయుగ్ కూడా నదిలోకి దిగాడు. ఊపిరి బిగించి పదడుగుల లోతులోకి వెళ్ళడం కష్టం కాదు.

మూడు నుంచి నాలుగు నిముషాల వరకు దమ్ము బిగించి నీటిలో ఉండగల శక్తి కృతయుగ్‌కి వుంది. మున్నలూరు పక్కనే ప్రవహించే కృష్ణానదిలో గతంలో ఈతలు కొట్టిన అనుభవం అతడిది.

చేపలా నీటి అడుక్కిపోయి ఇసుకను పరిశీలించాడు. వాళ్ళు తవ్విన చోటుకు మూడడుగుల అవతలగా చూపించి అక్కడ తవ్వమని వారికి సైగచేశాడు.

వాళ్ళతో బాటు తనూ పనిచేస్తూ మధ్య మధ్య ఊపిరి తీసుకోవడానికి నీటిపైకి రాసాగాడు కృతయుగ్.

సాయంత్రం అయిదున్నర గంటలకు వారి కృషి ఫలించింది.

ఒక విగ్రహం పాదాలు బయటపడ్డాయి అదీ ఇసుకలో ఆరడుగుల లోతుకు తవ్వకం జరిపాక. అది ఆదివిష్ణు మూర్తి విగ్రహంగా గుర్తించి భక్తితో పాదాలకు నమస్కరించి కళ్ళకద్దుకున్నాడు కృతయుగ్.

నీటిపైకి వచ్చి విగ్రహాలు దొరికాయని అనౌన్స్‌చేయగానే అందరిలోనూ ఒక్కసారిగా ఉత్సాహం ఉరకలేసింది. అవతల సూర్యాస్తమయం కావస్తోంది. ఇవాళ్టికి బయటకు తీయడం సాధ్యం కాదు.

కృతయుగ్ ఒక పగ్గాన్ని అందుకుని నీట మునిగాడు. దాని ఒకకొసను విగ్రహం పాదాలకు బంధించాడు.

ఎందుకంటే అలాగే వదిలేస్తే ఉదయానికి తిరిగి ఇసుకలో వూడుకుపోయి– కథ మొదటికొచ్చే ప్రమాదం ఉంది. ఆ రోజుకు పని ఆపేసి అంతా తీరానికి వచ్చేశారు. పగ్గం రెండో కొసను రావిమానుకు బంధించి వదిలేశాడు.

సి.ఎం. మనిషి శాటిలైట్ ఫోన్ ద్వారా విగ్రహాలు దొరికిన విషయాన్ని సి.ఎం.కు సమాచారం అందించాడు. మరునాడు ఉదయం విగ్రహాల్ని నదినుంచి ఉద్ధరించనున్న విషయాన్ని రిపోర్ట్ చేశాడు.

రాత్రికి తిరిగి ఉజ్జయిని వెళ్ళే ఉద్దేశం ఎవరికీ లేదు. జరగనుంది ఒక అద్భుతచారిత్రకాంశం. ఇందులో పాలు పంచుకుంటున్న ఆనందం అందరిలోనూ ఉంది. పద్దెనిమిది వందల సంవత్సరాలుగా జలగర్భంలో వున్న స్వామి తన దేవేరులతో దర్శనం ఇవ్వబోతున్న సువర్ణ ఘడియలు ఇవి.

రాష్ట్ర ముఖ్యమంత్రే విగ్రహాలు దొరకడం అసాధ్యమని చెప్పినా కృతయుగ్ సుసాధ్యం చేశాడు. తాత్కాలికంగా టెంట్ వేసుకుని కృతయుగ్, అన్నారావు, అనంతస్వామి దీవిమీదే ఉండిపోయారు. స్నిగ్ధ, కాంచనల్ని నది దాటి అవతలున్న వ్యాన్‌లలో నిద్రపొమ్మని చెప్పినా వినకుండా టెంట్‌వద్దే ఉండిపోయారు.

మిగిలిన వాళ్ళు నది దాటి కొందరు వాహనాల్లోనూ, కొందరు మరపడవలోనూ నిద్రపోయారు. ఆ రాత్రి ఎలా గడిచిందో వారికే తెలీదు. తెల్లవారగానే అందరూ దీవిమీదకు వచ్చేశారు.

ఎవరికీ టిఫిన్లు లేవు. టీకాఫీలు లేవు. స్నానాదికాలు కాగానే దీవిమీది ఫలవృక్షాలమీద దాడిచేశారు.

దీవిలో మామిడి, సపోటా, బొప్పాయి, పనసవంటి అనేక ఫలవృక్షాలు విరగకాచివున్నాయి.

అలాగే కొబ్బరిచెట్లు ఉన్నాయి. కృతయుగ్ ఏమీ తీసుకోకుండా ఉపవాసం ఉంటాననడంతో స్నిగ్ధ, కాంచనలు కూడా ఉపవాసదీక్ష తీసుకున్నారు.

స్వామి జలగర్భంనుంచి బయటకు రాగానే కొట్టడానికి వచ్చేప్పుడే ఏభై టెంకాయలు దీవికి తీసుకువచ్చారు. కాని అవి చాలవనిపించింది.

వెంటనే పీటర్ బృందం రంగంలోకి దిగి కొబ్బరి చెట్లెక్కి మరిన్ని టెంకాయల్ని దించారు.

కొందరు వాటిని ఒలచడంలో బిజీ అయిపోయారు. ఒక్కోసారి అన్నీ విచిత్రంగా కలసివస్తాయి.

*　　　*　　　*　　　*　　　*

ఎనిమిది గంటలకు స్టేట్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ నుండి పదిమంది దీవిమీదికొచ్చి స్నిగ్ధను కలిశారు. వచ్చినవారిలో సర్వేయర్లు, పురాతత్వ శాస్త్ర నిపుణులు. అనుభవజ్ఞులు ఉన్నారు. స్నిగ్ధ వారితో మాట్లాడుతూండగానే సుమారు రెండువందల మంది సాయుధ పోలీసు బలగాలు దీవికి చేరుకున్నాయి.

సి.ఎమ్.రాక సందర్భంగా దీవి దక్షిణ ప్రాంతంలోని చిన్న మైదాన ప్రాంతాన్ని మొక్కలు, పొదలు నరికి హెలికాప్టర్ దిగటానికి అనువుగా హెలీపాడ్ నిర్మించడంలో వారంతా బిజీ అయిపోయారు.

ఇప్పుడు దీవిలో ఎటు చూసినా మనుషులు. ఒకటే సందడి. ఒకటే హడావుడి. దీవిమీద ఉన్న కోతులన్నీ తెలతెలవారుతూ ఉండగానే నదిలో ఈదుకుంటూ పశ్చిమదిశలో ఉన్న అడవుల్లోకి పారిపోయాయి.

సరిగ్గా తొమ్మిదిగంటలకు ముందుగా స్నిగ్ధ, కాంచనలు మహావృక్ష రాజం, సాక్షాత్తూ విష్ణురూపమయిన అశ్వత్థవృక్షానికి పసుపు, కుంకుమలు పూసి భక్తితో ముమ్మారు ప్రదక్షిణ చేసి కొబ్బరికాయలు కొట్టారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు.

మిగిలినవారు కూడా భక్తితో నమస్కరించారు. గజ ఈతగాళ్ళు ఇద్దరితో కలసి కృతయుగ్ కూడా జలప్రవేశం చేశాడు. సరిగ్గా ఇదే సమయంలో–

భోపాల్ నుంచి బయలుదేరిన సి.ఎమ్. హెలీకాప్టర్ దీవికి చేరుకుంది. మైదానంలో మార్కు చేసినచోట హెలీపాడ్‌మీద హెలీకాప్టర్ సురక్షితంగా దిగింది. పోలీసు బలగాల్ని దీవిచుట్టూ భద్రతా ఏర్పాట్లు చూడమని ప్రత్యేకంగా ఆర్డర్ వేశారాయన.

అన్నారావు, అనంతస్వామిలు స్వయంగా వచ్చి అశ్వత్థవృక్షం సమీపంలోకి ఆయన్ని తీసుకువెళ్ళారు. ఆయనకోసం వేసిన కుర్చీలో కూర్చుని జరుగుతున్న పనుల్ని గమనించసాగారాయన.

సరిగ్గా తొమ్మిదిన్నరకు పీటర్‌తో సహా అతని మనుషులు పగ్గాన్ని అందుకుని ఆదివిష్ణు విగ్రహాన్ని తీరంవైపు లాగడం ఆరంభించారు. ఇది చాలా సున్నితమయిన వ్యవహారం.

విగ్రహం డ్యామేజ్ కాకుండా – అతి జాగ్రత్తగా హ్యాండిల్ చేయాలి. ఇసుకమీద నెమ్మది నెమ్మదిగా విగ్రహం జరుగుతుంటే కృతయుగ్, గజ ఈతగాళ్ళు ఇద్దరూ అనుసరిస్తూ వచ్చారు. అది తీరం సమీపంలోకి రాగానే పగ్గం విప్పేశారు.

కృతయుగ్‌తో సహా పీటర్ మనుషులు అంతా సుమారు ఇరవయిమంది నాలుగు పక్కలా పట్టి లేపితేగాని ఆ విగ్రహం పైకి లేవలేదు.

నీటినుండి విగ్రహం బయటపడగానే ఒక్క సారిగా హరినామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది. విగ్రహాన్ని అతిభద్రంగా స్లోపు వెంట పైకి తీసుకొచ్చారు. విగ్రహం కంటపడగానే సి.ఎమ్. తన ఛైర్‌లోంచి లేచి సంభ్రమాశ్చర్యాలతో, భక్తితో వీక్షించాడు.

ఆరడుగుల నల్లరాతి భారీవిగ్రహం. శంఖుచక్రగదా హస్తుడై అభయ ముద్రతో దర్శనమిస్తున్నాడు. స్వామి విగ్రహాన్ని అద్భుతంగా మలిచిన ఆనాటి శిల్పుల్ని ఎంత పొగిడినా తక్కువే అన్పించింది.

హడావుడిగా నదిలో దాచటంలో స్వామి ఒంటిమీద మణిమయ కంఠాభరణం భుజకీర్తులు విగ్రహాన్ని అంటిపెట్టుకుని అలాగే ఉండిపోయాయి.

స్వామి దర్శనంతో పులకించిపోయారంతా. జాగ్రత్తగా విగ్రహాన్ని రావి వృక్షం కింద నీడలో పరుండజేశారు. వెంటనే స్నిగ్ధ, కాంచనలు స్వామిని పసువునీళ్ళతో అభిషేకించి ధూపదీపాలు సమర్పించారు. కొబ్బరికాయ కొట్టవలసిందిగా సి.ఎమ్.ను ఆహ్వానించారు.

ఆయన భక్తి శ్రద్ధలతో స్వామి పాదాలు తాకి నమస్కరించి తొలి కొబ్బరికాయ కొట్టారు. ఆ వెనకే తలో కొబ్బరికాయ కొట్టి స్వామిపాదాలు అభిషేకించారు.

ఎప్పుడైతే ఆదివిష్ణు విగ్రహం బయటపడిందో ఇక అందరిలోనూ ఉత్సాహం ఇనుమడించింది. ఈ కార్యక్రమాన్ని ఆరంభం నుంచి సి.ఎమ్. వెంటవచ్చిన సిబ్బందిలో ఇద్దరు వీడియో చిత్రీకరిస్తూనే వున్నారు.

కృతయుగ్ మిగిలిన ఇద్దరూ తిరిగి నదిలోకి వెళ్ళారు. ఈసారి అన్నారావు వర్గంలోని పీటరుతోపాటు మరి కొందరు కూడా నదిలోకి దిగారు.

అర్థగంట తర్వాత ముందుగా ధాన్యలక్ష్మి దొరికొంది మూడడుగుల అతిసుందరమయిన విగ్రహం. పదిమంది సాయంపట్టి అమ్మవార్ని తీరానికి చేర్చారు. గంట తర్వాత సంతానలక్ష్మి, ధనలక్ష్మి, ధైర్యలక్ష్మి ఒక్కొక్కరే బయటి కొస్తున్నారు.

ప్రవాహ ఉధృతికి విగ్రహాలు కాస్త అటూ ఇటూగా చెదిరిపోవడంచేత అన్వేషణ ఆలస్యమవుతూవచ్చింది. ఎలాగయితేనేం మధ్యాహ్నం భోజన సమయానికి ఏడు విగ్రహాలు తీరానికి చేరాయి.

ఇంకో అమ్మవారు లభించాలి. ఆమె విజయలక్ష్మి. ఆవిడకూడా లభిస్తే పూర్తి విజయం చేకూరినట్టే. ఒక పని సాధించాలంటే – అంతులేని పట్టుదల ఉండాలి.

విసుగు, విరామం ఉండకూడదు. ఒక పని ఆరంభిస్తే అది పూర్తయ్యే వరకు నిద్రపోకూడదు. కృతయుగ్‌ది పట్టినపట్టు వదిలే వ్యక్తిత్వం కాదు.

అష్టలక్ష్ముల్లో ఒక లక్ష్మి కనబడలేదని వదిలేస్తే ఎలా? ఓ గంట విశ్రాంతి తర్వాత తిరిగి బయలుదేరాడు. ఉదయం నుండి ఏమీ తీసుకోలేదు.

స్నిగ్ధ, కాంచనలు కూడా ఆహారం తీసుకోకుండా ఉపవాసదీక్షలోనే ఉన్నారు.

అలసిపోయి కన్పిస్తున్నారు. కాని యువతులు ఇద్దరిలోనూ ఒక దివ్య తేజస్సు ప్రకాశిస్తోంది. నీరసంగా ఉన్నా రెట్టించిన ఉత్సాహంతో తిరిగి జల ప్రవేశం చేశాడు కృతయుగ్.

రెండో గజ ఈతగాడు రక్షణగా అతన్ని అనుసరించాడు. సుమారు రెండు గంటల సుదీర్ఘ అన్వేషణ తర్వాత విగ్రహం జాడ తెలిసింది. కృతయుగ్ కృషి ఫలించింది. ప్రవాహం తోసివేయగా అక్కడికి సుమారు రెండు వందల గజాల దూరం లోతు జలాల్లోకి కొట్టుకుపోయి ఇసుకలో ఉందా విగ్రహం.

అక్కడ నీరు సుమారు నలభై అడుగుల లోతుంది. ఇసుకను తొలగించి ఇద్దరూ విగ్రహాన్ని బయటికి లాగారు. మరోసారి నీటిపైకి వచ్చి పగ్గం అందుకుని తీసుకువెళ్ళి విగ్రహానికి కట్టాడు కృతయుగ్.

పీటర్ మనుషులు తాడుపట్టి లాగడం ఆరంభించగానే ఇసుకమీద జారుతూ – తీరంవైపు కదిలింది విగ్రహం. విగ్రహంవెంట అనుసరించి వచ్చాడు కృతయుగ్. తీరం ఏభై అడుగుల దూరంలో ఉందనగా పగ్గం విప్పేశారు. పీటర్ మనుషులు నీటిలో దూకి తలో చేయీ వేసి విజయలక్ష్మి అమ్మవారి విగ్రహాన్ని పైకిలేపారు.

ఒక్కసారిగా ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి అక్కడ. విగ్రహాన్ని జాగ్రత్తగా తెచ్చి వరుసలోఉంచారు.

స్నిగ్ధ, కాంచనలు అమ్మవారికి పసుపునీళ్ళు చల్లి ధూపదీప నైవేద్యాలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి నమస్కరించారు.

సి.ఎమ్.తో సహా అంతా కొబ్బరికాయలు కొట్టారు.

కృతయుగ్ నదిలో స్నానం చేసి వచ్చి పొడి దుస్తులు ధరించాడు. అప్పటికి పొద్దు పడమర వాలింది. రావివృక్షం కింద మధ్యలో ఆదివిష్ణుమూర్తి, ఆయనకు అటు నలుగురు, ఇటు నలుగురిగా అష్టలక్ష్ములు, ఎంతో కన్నుల పండువగా దర్శనమిస్తున్నారు.

విష్ణుమూర్తి నిలబడి ఉండగా అమ్మవార్లంతా కూర్చున్న స్థితిలో ఉన్నారు. సి.ఎమ్. స్వయంగా నిమ్మరసం ఇచ్చి కృతయుగ్, స్నిగ్ధ, కాంచనల ఉపవాసదీక్ష విరమింపజేశాడు. ఆయన చాలా ఆనందంగా ఉన్నాడు. కృతయుగ్ భుజంతట్టి ముఖ్యమంత్రి అభినందించాడు.

"ఎక్కడో హైదరాబాద్ నుంచి వచ్చి ఈ మహత్కార్యాన్ని సాధించారంటే మిమ్మల్ని ఎంత పొగిడినా తక్కువే. అంతేకాదు ఇలా మీరు రోజూ ఉజ్జయినికి, ఇక్కడికి షటిల్ సర్వీస్ చేయడం ఇప్పుడు సాధ్యంకాదు.

మీకే కాదు, మాకూ ఇప్పుడీ దీవిమీద బాధ్యత పెరిగింది. మావంతు సహకారం అందించకుంటే మేం ఘోరతప్పిదం చేసినట్టవుతుంది. మీరిక ఇక్కడ ఉండిపోయి మిగిలిన పనులు చూడండి.

హోటళ్ళ నుండి మీ లగేజీ ఇక్కడికి మా వాళ్ళు చేరుస్తారు. ఆలయ నిర్మాణాలవరకు విగ్రహాల నిలా ఆరుబయట ఉంచలేం. అంతవరకు ఇదేచోట తాత్కాలికంగా షెడ్డు నిర్మించి దేవతా విగ్రహాల్ని నిలిపి రోజూ పూజాదికాలు ఆరంభం కావాలి.

మీరు నివసించడానికి గుడారాల ఏర్పాటు కూడా ఈ రాత్రికే జరిగిపోతుంది. ఇక్కడ నిధికోసం చేయాల్సిన పూజాదికాలు ఏమిటో ఆలోచించండి.

నా సెక్రటరీకి చెప్తే శాటిలైట్ ఫోన్‌ద్వారా నాకు తెలియజేస్తాడు. ఇక నిధి విషయంలో వివాదాలు తప్పవు. సుప్రీంకోర్టు తీర్పుకు కట్టుబడదాం...." అంటూ తన అభిప్రాయం వివరించాడు సి.ఎమ్.

అంతేకాదు, సెక్రటరీకి ఏంచేయాలో తగిన సూచనలు, సలహాలు ఇచ్చి సాయంత్రం అయిదు గంటలకు అందరివద్ద సెలవు తీసుకుని హెలీకాప్టర్‌లో భోపాల్ వెళ్ళిపోయారాయన. ఇక ఆ తరువాత ఆగమేఘాల మీద సాగిపోయాయి పనులు.

మరునాడు ఉదయం ఉజ్జయిని స్థానిక పత్రికలు దీవిగురించి కొన్ని సంచలన వార్తాకథనాలు ప్రచురించాయి. 'మృత్యుదీవిలో నరసంచారం' అనే పతాకశీర్షికతో ఒక పత్రిక ఎంతో కాలంగా, 'మనిషన్నవాడు కాలుమోపడానికి భయపడిన దీవిమీదకు ఇప్పుడు యధేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నదెవరు?

అక్కడ ఏం జరుగుతోంది?' అంటూ తమకు తోచింది రాస్తే, మరో పత్రిక ఇంకో అడుగు ముందు కేసి – హైదరాబాద్ నుంచి ఒక ముఠా దీవిమీది నిధికోసం వచ్చి ఉజ్జయినిలో తిష్టవేసిందనే రూమర్లు విన్పిస్తున్నాయి. దీన్ని ఋజువుచేస్తూ–

"దీనిమీద పూజలు చేసిన ఒక ముఠాను స్వయంగా నగర పోలీసు కమీషనరు సిబ్బందితో వెళ్ళి అరెస్టు చేసి తీసుకొచ్చి కూడా వదిలేయడంలో మర్మమేమిటి?" అంటూ ప్రశ్నిస్తూ తనో కథనం ప్రచురించింది. దీవి మీద ఎవరికీ తెలియకుండా ఏదో జరుగుతోంది.

సాయుధ పోలీసు బలగాల్ని అక్కడికి తరలించడమే అందుకు నిదర్శనం. సి.ఎమ్.గారు భోపాల్ నుంచి హెలీకాప్టర్‌లో హడావుడిగా దీవిని దర్శించి వెళ్ళడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ప్రభుత్వమే నిధిని తవ్వితీసే ప్రయత్నాలు ఆరంభిస్తోందా అనే సందేహాలూ తలెత్తుతున్నాయి.

ఏమయినప్పటికీ మీడియాను దీవివైపు రాకుండా అడ్డుకుంటున్న తీరుచూస్తే ప్రజలకు తెలీకుండా ప్రభుత్వంలో పెద్దలే నిధిని తీసి పంచుకునే ఆలోచనలో ఉన్నారా?" అంటూ మరో పత్రిక తన అనుమానాలను బయట పెట్టింది. ఇవిగాకుండా లార్జ్ సర్క్యులేషన్ గల ఇంగ్లీషు, హిందీ ఇతర భాషల్లోని పత్రికల్లోనూ మరికొన్ని వార్తలు ప్రచురితమయ్యాయి.

ఇవన్నీ ప్రజలను అయోమయంలో పడేయడంలో సఫలమయ్యాయిగాని అసలు విషయాన్ని చెప్పలేకపోయాయి.

ఇదిలా ఉండగా – తెల్లవారేసరికి దీవిమీద రంగురంగుల గుడారాలు అనేకం వెలిశాయి.

తెలతెలవారుతూండగానే పూలు, పూజాద్రవ్యాలతో ఒక వేదపండితు డయిన పూజారి, ఆయన అసిస్టెంటు దీవికి చేరుకున్నారు.

రాత్రికి రాత్రే చెట్లకింద పొదలు, డొంకలు నరికి తొలగించబడ్డాయి. ఆ ప్రాంతాన్ని పాములు విషకీటక రహితం చేసి నేలను చదునుచేశారు. గుడారాలు నిర్మించి ఫోల్డింగ్ కాట్స్ వేయబడ్డాయి.

రెండు షిఫ్టుల్లో దీవిమీద రాత్రీ పగలు కాపలా ఉండాలిగాబట్టి దీవి దక్షిణభాగంలో వారికోసం విశాలమయిన టెంట్‌లు వేయబడి, ఇసుప మంచాలు కొన్నింటిని ఏర్పాటు చేశారు.

ఈ పనులన్నీ స్టాండ్ బై లెట్ల కాంతిలోనే చకచకా సాగించారు మనుషులు. అంతేకాదు రావివృక్షంకింద పందిరి వేశారు. పందిరిమీద కొబ్బరి ఆకులతో కప్పి నీడ ఏర్పరిచారు. విగ్రహాలను వరసగా నిలబెట్టి సపోర్ట్‌గా వెనక కొయ్యల్ని భూమిలో పాతారు.

ఈ పనులన్నీ పూర్తి అయ్యేసరికి అర్ధరాత్రి దాటిపోయింది సమయం.

విగ్రహాలకు సమీపంలోని గుడారంలో కృతయుగ్, అనంతస్వామిలు పడుకున్నారు.

పక్క గుడారంలో స్నిగ్ధ, కాంచనలకు తర్వాత గుడారంలో అన్నారావు, మహీధర్ నిద్రించారు. మిగిలిన నాలుగు గుడారాలు పీటర్ వర్గం తీసుకుంది.

ఆ పైన ఉన్న గుడారాల్లో మిగిలిన సిబ్బంది సర్దుకున్నారు. మరునాడు ఉదయానికి విద్యుత్‌శాఖకు చెందిన ముగ్గురు సీనియర్ అధికారులు, పదిమంది సిబ్బంది కేబుల్స్, వైర్లు, స్విచ్‌బోర్డు, ఇతర సామగ్రితో సహా వచ్చి చేరారు.

నదికి తూర్పుతీరం సమీపంలోంచే హైవోల్టేజి పవర్‌లైన్ ఒకటి వెళ్ళుతోంది. దీవిమీద అవసరమైన చోట్ల చెట్లకు లైట్లు బిగించారు.

గుడారాల్లోకి లైట్లు, ఫ్యాను సౌకర్యం కల్పించారు. నది అవతలినుంచి పవర్‌కేబుల్‌ని నదిలోంచి తీసుకొచ్చి దీవిమీద సప్లయి ఏర్పాటు చేశారు.

మధ్యాహ్న సమయానికి ఈ పనులు అన్నీ పూర్తి చేసుకుని విద్యుత్‌శాఖ సిబ్బంది తమ మనిషి ఒకడ్ని అక్కడ వదిలి వెళ్ళిపోయారు.

ఉదయం ఏడుగంటలకి పదిమంది వంటవాళ్ళు ఒక మేస్త్రితో కూడిన బృందం వంట సామగ్రి, గ్యాస్ సిలిండర్లు, కూరగాయలు, పప్పులు–ఇలా సకల ఏర్పాట్లతో దీవికి చేరుకుంది.

దీవి ఆగ్నేయంలో వాళ్ళకో టెంట్ ఏర్పాటు చేయగా వాళ్ళు వంటపనులు ఆరంభించారు. మధ్యాహ్నం భోజనం వేళకు మరోనాలుగు మరపడవలు దీవికి చేరుకున్నాయి.

బోటుకు నలుగురు సాయుధ పోలీసుల చొప్పున ఆ బోట్లు దీవిచుట్టూ కాపలా తిరగనారంభించాయి.

ఎవరూ దీవికి రాకుండా కన్నేసి ఉంచాయి. నదీమార్గంగా గాని, భూ మార్గంగాగాని దీవి వైపు ఏం జరుగుతోందో తెల్సుకోవాలని చాలా కుతూహలంగా వస్తున్న జాలర్లు, పౌరులు, మీడియా ప్రతినిధులు అందర్నీ దూరంగా ఉండగానే తిప్పి పంపించసాగారు.

నదినుంచి ఉద్ధరించబడిన విగ్రహాలకు ఉదయం నుంచే శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించనారంభించారు ప్రత్యేకంగా వచ్చిన పూజారులు.

దీవిమీద అడుగుపెట్టిన ఎవరూ వెనక్కు వెళ్ళే అవకాశంలేదు గాబట్టి ఏం జరుగుతోందో బయటి ప్రపంచానికి తెలిసే అవకాశం లేదు. విద్యుత్ శాఖనుంచొచ్చిన సిబ్బందికీ పూర్తి వివరాలు తెలియలేదు.

బయటికి వెళ్ళినా వాళ్ళనుంచి బయటపడే సమాచారం చాలా తక్కువ. ఇది ఇలా ఉండగా తమ తదుపరి కార్యక్రమం గురించి అనంతస్వామి గూడారంలో అంతా సమావేశమయి చర్చించుకున్నారు.

కృతయుగ్ వెంట కాంచన మాత్రమే వచ్చింది. అనంత స్వామి ఓసారి అందర్నీ చూసి దీర్ఘంగా నిట్టూర్చాడు.

"ఇంతవరకు పనులన్నీ సజావుగా సాగినా లక్ష్యానికి మనమింకా దూరంలోనే ఉన్నాం.

ముఖ్యంగా ఇక్కడ నాగశక్తులను తొలగించినప్పటికీ భూమిలోపల నిధిని ఆవహించి వున్న ధనశక్తి, దీన్నే ధనపిశాచి అనికూడా అంటారు.

అతి ప్రమాదకరమయిన శక్తి అది. ఆకలితో నకనకలాడుతూ అదిచేస్తున్న మూలుగు ధ్వనులు మనం వింటూనేవున్నాం. తానుగా అది బయటికి రాదు. ఆ శక్తిని ఆవాహన చేసి తృప్తిపరిచాకే తవ్వకం పనులు ఆరంభించాలి.

లేదంటే ఎవరైతే ముందుగా తవ్వకుంటూ కిందకు వెళతారో వాళ్ళు నెత్తురు కక్కుకుని ఛస్తారు. ఇవి నరబలిని కోరతాయి. అలాంటి ప్రమాదం జరక్కుండా ఉండేందుకు కొన్ని తాంత్రిక పూజలు నిర్వహించి ఆ శక్తిని ఆహ్వానించి పొట్టేళ్ళను బలివ్వాలి...." అంటూ వివరించాడు అనంతస్వామి. కాంచన ఏదో అడగబోతుంటే చేయి అదిమి వారించాడు కృతయుగ్. అంతలో అన్నారావు కల్పించుకుంటూ–

"ఆ పని కూడా తొందరగా కానిస్తే తవ్వకం పనులు ఆరంభించవచ్చు గదా?" అని అడిగాడు.

"ఆరంభించవచ్చు. కాని ముహూర్తం కుదరాలిగదా, నీకు తెలీని విషయాలా! అమావాస్యరోజున నాగబలి కార్యక్రమం నిర్వహించాం. వరద తాకిడి వర్షాలవల్ల నాలుగురోజులు రాలేకపోయాం.

అయిదో రోజు వచ్చాం. నిన్న పంచమి, ఇవాళ షష్ఠి, రేపు సప్తమి, ఎల్లుండి అష్టమిరోజు రాత్రి ధనశక్తికి బలి కార్యక్రమం నిర్వహిస్తే నవమి రోజు తవ్వకం పనులు ఆరంభించవచ్చు.

కాబట్టి ఎల్లుండి షష్ఠిరోజు రాత్రి పూజకి అవసరమైన వస్తువుల లిస్టు రాసి ఇస్తాను. వాటితోపాటు ఐదు పొట్టేళ్ళను సిద్ధం చేయించాలి. వాటిని సమకూర్చమని చెప్పండి...." అంటూ వివరించాడు అనంతస్వామి.

ఇక్కడ ఈ చర్చ సాగుతున్న సమయంలో అక్కడ స్నిగ్ధ తన గుడారంలో తమ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చిన పదిమంది అధికారులతో సమావేశమై ఉంది.

వారికి ఆలయాలు, వాటి నిర్మాణం గురించి సంక్షిప్తంగా వివరిస్తోంది. ఒక పేపర్ మీద దీవిమీది ఆలయం, నది ఆవల నాలుగు, ఇవతల నాలుగు అష్ట లక్ష్ముల ఆలయాలను మార్క్ చేస్తూ దీవినుంచి ఒక్కో ఆలయం ఏ దిక్కులో ఎన్నికిలోమీటర్ల దూరంలో ఉండవచ్చో అధికారులకు అర్ధమయ్యేలా పేపర్‌మీద సూచించడమే కాదు. అందరికీ సవివరంగా వివరించింది. ఆలయాలతో బాటు శిథిలమయిన ఆ యా గ్రామాల గురించీ చెప్పింది.

"ప్రస్తుతం ఈ ప్రాంతాలన్నీ అడవిలో కలసిపోయివున్నాయి. ముందుగా శిథిల గ్రామాల్ని గుర్తిస్తే తరువాత ఆలయ శిథిలాలను గుర్తించవచ్చు.

మరో ముఖ్యమైన విషయం ఏమంటే పశ్చిమంగా దీవికి తిన్నగా గంగానమ్మ ఆలయం ఒకటుంది. మేం ఆ ఆలయాన్ని పరిశీలించడం జరిగింది. ఆలయం సంతానలక్ష్మి అమ్మవారిదే. సందేహంలేదు.

కాని గుడిలో అమ్మవారు లేనందున తర్వాత కాలంలో శైవులు గుడిని పునరుద్ధరించి అందులో గంగానమ్మను ప్రతిష్ఠించారు. కాబట్టి ఆ గుడిలో తిరిగి సంతానలక్ష్మి అమ్మవారిని ప్రతిష్ఠించలేము.

ప్రస్తుత పరిస్థితులలో ఆ గుడిని ఆనుకుని మరో గుడి నిర్మాణం చేపట్టడంగాని లేదా విడిగా మరోచోట నిర్మించటానికి గల సాధ్యాసాధ్యాలను పండితులను, స్థపతులను సంప్రదించాక ఒక నిర్ణయం తీసుకుంటాం.

కాబట్టి ఆ గుడిని వదిలేసి మిగిలిన ఏడు ఆలయాల జాడ మీరు తెలుసుకోవాలి. అవసరమైతే డిపార్ట్‌మెంట్ నుంచి మరికొందరిని రప్పించండి.

ఈ దీవి మన కేంద్రంగా ఇవాళనుంచి అన్వేషణ పనులు ఆరంభించండి" అంటూ వివరించింది స్నిగ్ధ.

ఆ వివరాలు తీసుకున్నాక ఆర్కియాలజీ సిబ్బంది రెండు జట్లుగా చీలిపోయి ఒక జట్టు నది దాటి తూర్పు అటవీ ప్రాంతంలోకి, రెండో జట్టు పశ్చిమ అటవీ ప్రాంతంవైపు బయలుదేరి వెళ్ళాయి.

అదే రోజు మరో విశేషం జరిగింది. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో మరోసారి సి.ఎమ్.గారి హెలీకాప్టర్ వచ్చి హెలీపాడ్ వద్ద ల్యాండయింది.

నిన్ననే వెళ్ళిన సి.ఎమ్.గారు ఈ రోజు కూడా రావడం ఆశ్చర్యం కలిగించినా అందుకు తగిన కారణం కూడా ఉంది.

సి.ఎమ్. భార్య కృష్ణభక్తురాలు. దుష్టశిక్షణ శిష్టరక్షణ కోసం అవతారాలు ధరించిన శ్రీమన్నారాయణుడంటే ఎనలేని భక్తి.

దీవిమీద విశేషాలు భర్త నుంచి వినగానే వెంటనే అష్టలక్ష్మీ సమేతుడయి కొలువున్న ఆదివిష్ణువుని దర్శించాలి అని ఆమె పట్టుబట్టింది.

మరుసటిరోజు నుంచి అసెంబ్లీ సమావేశాలుండటంతో తరువాత వీలు కాదని వెంటనే కుటుంబ సమేతంగా బయలుదేరి వచ్చారు ఆయన. వెంట భార్య, ఇద్దరు కొడుకులు, కోడళ్ళు, కూతురు, అల్లుడు మనవళ్ళు, మనవరాళ్ళతో మొత్తం పన్నెండుమంది హెలీకాప్టర్ దిగారు.

కృతయుగ్ బృందం ఆయనకు స్వాగతం పలికింది. సి.ఎమ్. అక్కడందరికీ వసతి ఏర్పాట్లు, లోటుపాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు.

అందరినీ కృతయుగ్ విగ్రహాలవద్దకు తీసుకువెళ్ళాడు. విగ్రహమూర్తులను చూడగానే సి.ఎమ్. భార్య భక్తి పారశ్యంతో పులకించిపోతూ సాష్టాంగదండ ప్రణామాలు ఆచరించారు.

పసుపుకుంకుమలు సమర్పించి కొబ్బరికాయ కొట్టారు. పూజారులు సి.ఎమ్. కుటుంబం పేరున ప్రత్యేక పూజలు నిర్వహించి అందరికీ తీర్థప్రసాదాలు భక్తి శ్రద్ధలతో అందించారు.

కుటుంబం అంతా పందిరికింద విగ్రహాలవద్ద పూజలో ఉండగానే సి.ఎమ్. కృతయుగ్, అనంతస్వామి, అన్నారావులతో విడిగా సమావేశమై మాట్లాడారు.

అనంతస్వామి తాము చేపట్టబోతున్న కార్యక్రమాల గురించి వివరించాడు. సి.ఎమ్. తన కుటుంబసభ్యులతో సాయంత్రం అయిదు గంటలవరకు అక్కడే ఉన్నారు. తరువాత వారంతా హెలీకాప్టర్‌లో బయలుదేరి వెళ్ళిపోయారు.

* * * * *

మరునాడు ఉదయం... భోపాల్... మధ్యప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు యధాప్రకారంగానే వేడిగానూ, వాడిగానూ ఆరంభమయ్యాయి.

పత్రికల్లో రోజూ వస్తున్న వార్తాకథనాలు ప్రతిపక్షాలకు ప్రధానాస్త్రాలయ్యాయి.

దీవిమీద నిధి గురించిన సమాచారం, పోలీసు బలగాలను దీవికి తరలించడం, అక్కడ ఏం జరుగుతోందీ తెలియకుండా చాలా రహస్యంగా ఉంచడం–

మీడియాను కూడా దీవికి అనుమతించకుండా ఆ ప్రాంతాన్ని నిషేధిత ప్రాంతంగా ఉంచడం, సి.ఎమ్. స్వయంగా రెండుసార్లు దీవికి వెళ్ళిరావడం మొదలైన విషయాలపై ప్రతిపక్షాలు వివరణకోరుతూ పట్టుబట్టడంతో సభాకార్యక్రమాలు స్తంభించాయి.

ప్రతిపక్షాల సంగతి అలా ఉంచితే స్వపక్షంలో కూడా ఈ విషయంగా నిరసనగళాలు గుసగుసలు విన్పించటంతో సి.ఎమ్.కు ఏదో ఒకటి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండుసార్లు సభ వాయిదాపడినా పరిస్థితిలో మాత్రం మార్పు రాలేదు.

అటువంటి క్లిష్ట పరిస్థితిలో ఇక ఈ విషయాన్ని దాచి ప్రయోజనం లేదనిపించింది.

"ఇందులో రహస్యం ఏమీ లేకపోయినా కొన్ని భద్రతాపరమైన కారణాలచేత ఈ విషయాన్ని ఇంతవరకు రహస్యంగానే ఉంచాల్సి వచ్చింది. దయచేసి ఈ విషయాన్ని సభలో ఇంతటితో వదిలేసి మిగిలిన కార్యక్రమాలను చేపడదాం.

మీఅనుమానాలను సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత మామీద ఉందిగాబట్టి రేపు సాయంత్రం అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేస్తున్నాను. అప్పుడు

జరిగిందంతా మీ ముందు ఉంచుతాం. అంతవరకు ఓపిగ్గా ఉండాలి” అంటూ సభకు హామీ ఇవ్వటంతో తాత్కాలికంగా ఆ గొడవ సద్దుమణిగింది.

మరునాడు ఉదయం శాటిలైట్ ఫోన్‌ద్వారా సి.ఎమ్. కృతయుగ్‌కి ఫోన్‌చేసి పరిస్థితి వివరించారు.

హెలికాప్టర్ పంపిస్తాను. బయలుదేరి భోపాల్ వచ్చి అఖిలపక్ష సమావేశంలో పాల్గొని జరిగిందంతా వివరించాల్సిందిగా కోరటం జరిగింది.

వెళ్ళి రావటానికి కృతయుగ్‌కి అభ్యంతరం ఏమీ లేదు. కాని అనంతస్వామి అభ్యంతరం లేవనెత్తాడు.

సూర్యాస్తమయంలోనే పూజను ఆరంభించాలి. అర్ధరాత్రికి ధనపిశాచిని ఆవాహనచేసి పొట్టేళ్ళను బలి ఇవ్వాలి.

శక్తిని ఆవాహన చేసినప్పుడు అనూహ్య సంఘటన లేమన్నా జరిగితే సాయపడగలవాడు తమలో ఒక్కడూ లేడు గాబట్టి దీవిమీద అందరి క్షేమం కోసం కృతయుగ్ దీవిమీదే ఉండాలి అంటూ పట్టుబట్టాడు.

పోనీ స్నిగ్ధను వెళ్ళిరమ్మని అడిగితే తను ఒంటరిగా వెళ్ళలేనంది.

అధికారులతోనూ నలుగురిలోనూ ఎంత తెలివిగా మాట్లాడినప్పటికీ ఇలాంటి సభలు సమావేశాల్లో ప్రసంగించే అలవాటు ఆమెకు లేదు.

వివరించటంలో తడబాటు పొరపాట్లు దొర్లవచ్చు. వారు అడిగే ప్రశ్నలకు తగురీతిలో తగు సమాధానం చెప్పలేకపోవచ్చు - ఇత్యాది భయాలతో కృతయుగ్ రాకుండా తను వెళ్ళనంది.

పరిస్థితినంతా గమనిస్తున్న కాంచన ఒక నిర్ణయానికి వస్తూ- “అక్కా. ఎందుకు భయపడతావ్? బావను ఇక్కడే ఉంచేద్దాం. నీ వెంట నేనూ వస్తాను. మన ఇద్దరం వెళ్దాం. రెండు పనులూ అవుతాయి” అంది.

ఆ విధంగా కాంచనతో స్నిగ్ధ భోపాల్ వెళ్ళటానికి అంగీకరించటంతో అప్పటికి ఆ సమస్య పరిష్కారమైంది.

మధ్యాహ్నం భోజనాలయిన కాస్సేపటికి హెలికాప్టర్ వచ్చింది. స్నిగ్ధ కాంచనలు అందులో భోపాల్ వెళ్ళారు.

* * * * *

అఖిలపక్ష సమావేశం ఉన్న కారణంగా అసెంబ్లీని మధ్యాహ్నం వరకు నిర్వహించి మరుసటి ఉదయానికి వాయిదా వేశారు స్పీకర్.

సాయంత్రం మూడు గంటలకి అసెంబ్లీ భవనంలోనే వున్న ప్రత్యేకమైన హాల్లో అఖిలపక్ష సమావేశానికి ఏర్పాట్లు జరిగాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలంతా సమావేశానికి హాజరయ్యారు. మృత్యుదీవి గురించి నిధి గురించిన విశేషాలు తెలుసుకోవాలని అందరిలోనూ ఆత్రుత కన్పిస్తోంది. ఈ సమావేశానికి మీడియాలు కూడా అనుమతించారు.

దేశప్రజలకు కూడా ఈ విశేషాలు తెలియాల్సిన అవసరం వుంది.

ఇంకా ఎక్కువ రోజులు ఈ విషయాన్ని దాచివుంచటం వల్ల తమ అధికారపార్టీమీద ప్రజల్లో ప్రతికూల ప్రభావం చూపిస్తుందని ఆయన భయం. అందుకే ప్రింట్ మీడియా, టీవీ ఛానల్స్‌కు సంబంధించిన రిపోర్టర్లందరినీ అనుమతించారు.

అఖిలపక్ష సమావేశం ఆరంభమైన అర్ధగంట లోపలే స్నిగ్ధ, కాంచనలు అక్కడికి చేరుకున్నారు. హెలీకాప్టర్ దిగిన స్నిగ్ధ, కాంచనలను డైరెక్ట్‌గా అక్కడికి తీసుకురావటం జరిగింది.

ఈ లోపల సి.ఎమ్. గారు తన ఉపన్యాసంలో నిధి గురించి కొంత ప్రస్తావించటం జరిగింది.

అమ్మాయిలు ఇద్దరి రాకతో ఆయన తేలిగ్గా ఊపిరి తీసుకున్నారు.

"కృతయుగ్ రాలేదేమి?" స్నిగ్ధను చిన్నగా అడిగారు సి.ఎమ్.

"మేం వచ్చాంగదా సార్. కృతయుగ్ రావడానికి వీలుకాలేదు" అంటూ బదులిచ్చింది కాంచన.

చీర జాకెట్‌లో సంప్రదాయంగా ఒద్దికగా ఎంతో అందంగా మెరిసి పోతున్న యువతులిద్దర్నీ అంతా ఆశ్చర్యంగా చూస్తున్నారు. డయాస్‌మీద సి.ఎమ్. పక్కనే వారిద్దరికీ రెండు చైర్స్ వేశారు.

టేబుల్‌మీది మైక్‌ను ముందుకు లాక్కున్న సి.ఎమ్– "ఈ అమ్మాయిలు ఇద్దరూ ఎవరా అని మీకు ఆశ్చర్యంగా ఉండొచ్చు. మీ అందరిలోనూ దీవి గురించి అనేక సందేహాలు ఉన్నాయి.

మీడియావారు సృష్టించిన భయాలున్నాయి. సృష్టించిన అంటూ ఎందుకు అన్నానూ అంటే తాము అరకొరగా విన్నదానికి ఊహాగానాలు జోడించి సంచలన వార్తలుగా ప్రజల్లోకి వదలటం ఎంతవరకు కరక్టో మీడియావారు పునరాలో చించాలి.

వాస్తవాలు తెలుసుకోకుండా కథనాలు విన్పించటం మంచిది కాదు. మీ సందేహాలు తీర్చటం కోసం వీరిద్దరినీ ప్రత్యేకంగా ఇక్కడికి పిలిపించాము.

ఈ అమ్మాయి పేరు స్నిగ్ధ. స్నిగ్ధ ఎవరోకాదు. సెంట్రల్ మినిస్టర్ శివప్రసాద్‌గారి అమ్మాయి.

ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ భాషా విభాగంలో ఆఫీసర్" అంటూ క్షణం ఆగారు సి.ఎమ్.

ఎమ్మెల్యేలతోపాటు మీడియాకు చెందిన అంతా విస్మయంగా చూశారు. ఒకసారి అందర్నీ కలయజూసి తన మాటలు కంటిన్యూ చేశారాయన.

"ఇక ఈ అమ్మాయి పేరు కాంచన. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఆత్మకూరు అన్నారావుగారి కుమార్తె.

స్నిగ్ధ, కాంచనలు మంచి స్నేహితులు. సొంత అక్కా చెల్లెళ్ళలా ఉంటారు. అలాగే పిలుచుకుంటారు. వీరంతా ఉజ్జయిని ఎందుకు వచ్చారు, ఏం జరిగిందనేది స్వయంగా వారే చెప్పటం బాగుంటుందని పిలిపించాను" అన్నారు.

సి.ఎమ్. పరిచయం చేస్తున్నప్పుడే స్నిగ్ధ, కాంచనలు వినయంగా సమావేశంలోని అందరికీ లేచి సమస్కరించి కూర్చున్నారు. సి.ఎమ్. కూర్చోగానే కాంచన లేచి – "మీ సందేహాలు తీర్చటం కోసమే మేం వచ్చాం. మీరు సందేహాలు అడగవచ్చు" అంది.

"ఏం జరిగిందో ముందు మీరు చెప్పండి. మా సందేహాలు తరువాత అడుగుతాం" అంటూ ముందు వరసలోని ఎమ్మెల్యే ఒకరు సూచించారు. స్నిగ్ధ లేచి నిలబడింది. మైక్ తన ముందుకు లాక్కుంది. అయిదునిముషాలు మాట్లాడిందిగాని ఆపైన ఆమెవల్ల కాలేదు.

అంతమంది ప్రజాప్రతినిధులు మీడియావాళ్ళ ముందు ఇలా ప్రసంగించటం తొలి అనుభవం కారణంగా తడబాటు – అలాగే పొరపాటున కొన్ని విషయాలు నోరుజారితే తమలో కొందరికి ఇబ్బందులు తప్పవనే భయం మరోపక్క ఆమెను కంగారు పెట్టాయి.

ఎందుకంటే ఇందులో సున్నితమైన అంశాలు చాలా ఉన్నాయి. జరిగింది చెప్పేటప్పుడు దంతెవారా సంఘటనలుగాని, నిధికోసమే అన్నారావు వర్గం ఉజ్జయిని వచ్చిన సంగతులుగాని పొరపాటున ఎటువంటి పరిస్థితుల్లో కూడా బయటకు తెలియకూడదు.

అలాగే దీవికి వెళ్ళివచ్చే సందర్భాలలో ఎదురయిన చేదు అనుభవాలు– ముఖ్యంగా చింటూభాయ్ నదిమీద తమను చంపాలని దాడిచేసి హతమారిన సంగతి – ఇలా పదుగుపేకల్లా మంచిచెడు కలగలిపివున్న గతం తమది. కాబట్టి కంగారుతో ఏ విషయం చెప్పాలి, ఏ విషయం చెప్పకూడదో విశ్లేషించు కోకపోతే చాలా ఇబ్బంది వస్తుంది.

స్నిగ్ధ ఇబ్బంది గమనించిన కాంచన "అక్కా, నేను మాట్లాడనా?" అంది చిన్నగా.

"ఊఁ" అంది స్నిగ్ధ.

వెంటనే లేచిన కాంచన స్నిగ్ధను కూర్చోమని చెప్పి తను మైక్ అందుకుంది.

"క్షమించాలి. ఆరోగ్యం బాగాలేని కారణంగా స్నిగ్ధ ఎక్కువసేపు మాట్లాడలేదు. కాబట్టి మిగిలిన విషయాలు నేను వివరిస్తాను..." అంటూ టకటకా తనదయిన శైలిలో మాట్లాడడం ఆరంభించింది.

ప్రతి మనిషిలోను ఏదో ఒక ఆర్ట్ ఉంటుంది. సందర్భం వచ్చినప్పుడు గాని బయటపడదు. ఎదుటి మనుషుల్ని సమ్మోహితుల్ని చేస్తూ చక్కగా మాట్లాడటం ఒక కళ.

కాంచన ప్రసంగం వింటూ మొదటిసారిగా ఆమెలోని సమర్థతను గుర్తించి ఆశ్చర్యపోయింది స్నిగ్ధ.

కొంచెం కూడా నదురుబెదురూ లేకుండా ఎంతో అనుభవం వున్న వక్తలా గడగడా మాట్లాడేస్తోంది. తన మాటల గారడీతో కథ మొత్తం మార్చేసింది.

ఎక్కడా దంతెవారా సంఘటనగాని, తన తండ్రి నిధుల్ని తవ్వితీసే ఒక ముఠా లీడరనిగాని, కృతయుగ్ చింటుభాయ్ స్పర్ధలు–

క్షిప్రానదిమీద పోరాటంలో చింటూభాయ్ వాడి మనుషుల్ని హత మార్చటం గాని, ఏదీ తన ప్రసంగంలో చోటుచేసుకోకుండా జాగ్రత్తపడింది.

ఆమె ప్రసంగ సారాంశం ఏమంటే, భోపాల్‌లో ఎవరో అమ్మితే అలంకార వస్తువుగా వుంటుందని కొని పురాతన రాగిగొట్టం ఒకదాన్ని హైదరాబాద్ తెచ్చాడు తండ్రి అన్నారావు.

ఆ గొట్టంలో ఏదో విశేషం ఉందని సందేహించిన తను, దాన్ని తన స్నేహితురాలయిన స్నిగ్ధకు చూపింది. స్నిగ్ధ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ మనిషి గాబట్టి మూత తెరవగా, రాగిరేకు సగభాగం కన్పించింది.

ఆ రాగిరేకుమీద నిధిగురించి కొంత సమాచారం ఉంది. కాని పూర్తి వివరాలు తెలీదు.

ఈ విషయం తమ స్నేహితుడయిన కృతయుగ్‌కి చెప్పినప్పుడు అలాంటిదే ఒక రాగిగొట్టం కృష్ణాజిల్లా, కంచికచర్ల మండలంలోని తమ ఊరు మున్నలూరులో తమ ఇంట్లో వంశపారం పర్యంగా ఉన్నట్టు చెప్పాడు.

దాన్నికూడా తెరవగా రెండో రాగిరేకు అందులో లభించింది. రెంటినీ కలిపి చూసినప్పుడు చాలా ఆసక్తి కరమయిన విషయాలు తెలిశాయి.

అలాగే రాగి రేకులో లభించిన తాళపత్రాల వలన చారిత్రక అంశాలు తెలిశాయి. ఇది అంతా చూసిన తర్వాత నిజానిజాలు తెల్సుకోవాలని ఉజ్జయిని కొచ్చారు. తమకు రక్షణగా తన తండ్రి, ఇతరులు మంత్రవాది అనంతస్వామి వచ్చారు..." అంటూ క్లుప్తీకరించి చాలా సహజంగా నమ్మేవిధంగా వివరించింది. అంతేకాదు - నిధి విషయంలో వివాదాలు తలెత్తకూడదని ముందుగానే సుప్రీంకోర్టుకు తెలియపరిచిన సంగతీ చెప్పింది.

ఆలయాల పునరుద్ధరణ ధ్యేయంగా తాము పనిచేస్తున్నట్టు కూడా ఆమె వివరించింది.

"సో... జరిగింది మీ ముందు ఉంచాం. సి.ఎమ్‌గారు మా తపన, శ్రమలను గుర్తించి మాకు సహకారం అందిస్తున్నారు. మా ప్రయత్నాలు మేం చేస్తున్నాం.

ఇందులో మీ అభ్యంతరాలు గాని, సందేహాలుగాని ఉంటే అడగొచ్చు" అంటూ కూచుంది.

స్నిగ్ధ అభినందనపూర్వకంగా కాంచన చేయి అదిమింది. ఒక నిముషం నిశ్శబ్దం తర్వాత ఒక ఎమ్మెల్యే లేచి నిలబడ్డాడు.

"నిజంగా అక్కడ నిధి ఉందనే మీరు అనుకుంటున్నారా?" అన్నాడు.

"ఉంది గాబట్టే గడచిన పెద్దెనిమిదివందల సంవత్సరాలుగా ఎంతో మంది దీవిమీద కాలుపెట్టి ప్రాణాలు పోగొట్టుకున్నారు.

దీవిమీద మానవ కంకాళాలు, ఎముకలు గూళ్ళే అందుకు నిదర్శనం. వాటిని తొలగించిన పోలీసులే అందుకు సాక్ష్యం. నిధి ఉంది కాబట్టే అది అన్యాక్రాంతం కాకూడదని ఆ కాలంవారు అక్కడ బలమైన కావలిశక్తుల్ని ఏర్పరిచారు.

అయితే ఎంతనిధి వుంది అని అడక్కండి. కళ్ళతో చూడందే ఏమీ చెప్పలేం" అంది కాంచన.

"మేడమ్... నిధి ఉందే అనుకుందాం. ఆ నిధి మా ఉజ్జయినీ రాజ్యానిధి. మా ప్రజలది. దానిమీద పెత్తనం మాకు ఉండాలిగాని ఎక్కడి నుంచో వచ్చిన

మీరో, సుప్రీమ్‌కోర్టో నిర్ణయించటం ఏమిటి? ఇది మాకు ఎలా సమ్మతమవుతుంది?" అంటూ మరో ఎమ్మెల్యే గట్టిగా నిలదీశాడు ఆవేశంగా.

చిరునవ్వుతో అతన్ని చూసింది కాంచన.

"మీ సమ్మతమో, ఈనాటి ప్రజల సమ్మతమో ఇక్కడ ముఖ్యం కాదు. నిధిని దాచి పెట్టిన వారి లక్ష్యం ముఖ్యం. అలాగే నిధి మొత్తం మీ రాజ్య ప్రజలది అనుకోవటం కూడా సరికాదు.

భోజరాజులు పక్క రాజ్యాల్ని కూడా జయించి సామంతులనుండి కప్పాలు వసూలు చేసేవారు. నిధిలో పక్క రాష్ట్రాలకీ వాటా ఇద్దామంటారా?" అని కాంచన అడగగానే సభలో నవ్వులు విన్పించాయి.

"భోజరాజులు ఒక లక్ష్యంతో ఆ నిధిని దాచిపెట్టారు. ఆ నిధిని ఎలా వినియోగించాలో స్పష్టంగా రాసుంచారు. వారి ఆశయం నెరవేర్చాలనే ప్రయత్నమేగాని ఇందులో మా స్వార్ధం ఏమీలేదు. ఆలయాలు పునరుద్ధరించబడాలి..." అంది.

"అందువల్ల మాకేమిటి... ఐ మీన్ మా రాష్ట్రానికి ప్రయోజనం ఏమిటి?" కాంచన మాటలకు అడ్డువస్తూ అడిగాడు అదే శాసనసభ్యుడు.

"ప్రయోజనమా... రాష్ట్రానికా... మీకా?" అడిగింది.

"నేనడిగింది రాష్ట్రంకోసం. నిధి మాది, పెత్తనం ఎవరిదో అయితే మేమెలా ఒప్పుకుంటాం?"

"ఒప్పుకోమని, ఊరుకోమని మేమనటంలేదే! సుప్రీమ్‌కోర్టులో మీ వాదనలు విన్పించుకోవచ్చు. కోర్టుతీర్పుకు మేం కట్టుబడతాం.

మీరు కూడా కట్టుబడివుండాలి. పెత్తనం మీకు ఇస్తే ఏం జరుగుతుందో అందరికీ తెలుసు.

ఇక మీకేమిటి లాభం అన్నారు. ఏం లాభం కావాలి? పెత్తనం మీది అయితే ఏం చేస్తారు? పర్సంటేజీనా? వాటానా? నిధిని తలో కాస్త పంచుకుంటారా? అందినది అంతా దోచేస్తారా? ఈ రోజు దేశం మొత్తంమీద ఉన్న రాజకీయనాయకులు, ప్రజాప్రతినిధులు ఏంచేస్తున్నారు?

ప్రజాధనాన్ని ఎలా దోచుకుంటున్నారు–దేశప్రజలు అంతా చూస్తూనే వున్నారు.

అణా కానీ పనికి కూడా పదిరూపాయల విలువ పెంచి పని జరుగుతుందో లేదోగాని కాగితాలమీదే లెక్కలు చూసి పర్సంటేజీల ప్రకారం కిందిస్థాయి నుంచి పైవరకు దోపిడీనే కదా.

ఒక్కో రాష్ట్రంలోని భాగోతం ఎవరికి తెలీదు? ఎన్ని కుంభకోణాలు, ఎందరు ప్రస్తుతం జైలులో ఉన్నారో తెలీదా?" అంటూ కాంచన నిలదీస్తుంటే, అడిగిన ఎమ్మెల్యేకి చెమటలు పోశాయంటే ఆశ్చర్యం లేదు. అతడికి మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదు కాంచన.

"మీరు అడిగిన ప్రశ్నల్లో చివరిది – మీ రాష్ట్రానికి ఏమిటి లాభం అని? – మీరుగాని, మీ ప్రభుత్వంగాని పైసా పెట్టుబడి పెట్టకుండానే దేశంలో ఎక్కడా, ఆ మాటకు వస్తే ప్రపంచంలోనే ఎక్కడా లేనటువంటి ఒక అద్భుతమయిన ఆదివిష్ణు ఆలయం పద్మదళాకారంలో అష్టదిక్కుల్లో అష్టలక్ష్ముల ఆలయాల నిర్మాణం జరుగుతుంది.

ఆ ప్రాంతం ఒక దివ్య పుణ్యక్షేత్రం కాబోతోంది. అంతేకాదు. ఉజ్జయిని నుండి దీవివరకు నదిమీద బోటు ప్రయాణాలు పెరుగుతాయి. దానివల్ల తీర్థ యాత్రీకులు వెల్లువెత్తుతారు. మీ పర్యాటకరంగానికి, దేవాదాయశాఖకు గణనీయంగా ఆదాయాలు పెరుగుతాయి.

అటవీప్రాంతంలో తిరిగి గ్రామాలు వెలిసి రెవెన్యూ అధికంగా వస్తుంది. అది అంతా మీకు లాభంకాదా?

ఇక మా స్విర్ధ ఇంట్రెస్టు ఏమిటంటారా? ఇక్కడి పరిశోధనలవలన మరుగునపడిన ఆ కాలం చరిత్ర, భోజరాజుల కాలంనాటి చారిత్రక వస్తువుల సేకరణ ఆనాటి పరిస్థితులు తెలుసుకోవటం ప్రధానాంశాలు. ఇవన్నీ మాకోసం కాదు.

మీకోసం, మీ రాష్ట్రం కోసం, ఉజ్జయిని పూర్వవైభవాన్ని లోకానికి చాటడం కోసం.

సో.... మేం చెప్పవలసింది చెప్పాం. మీ అభ్యంతరాలు ఇంకా ఏమన్నా వుంటే కోర్టుద్వారా మాకు తెలియజేయవచ్చు...."

అనర్గళంగా మాట్లాడి ప్రశ్నలు అడగదలుచుకున్నవారి నోళ్ళు మూయించింది కాంచన.

ఆ తర్వాత విలేకరులు అడిగిన కొన్ని ప్రశ్నలకు స్నిగ్ధ సమాధానాలు ఇచ్చింది. సి.ఎమ్. అనుమతితో ఆదివిష్ణు అష్టలక్ష్మి అమ్మవార్ల విగ్రహాల ఫోటోగ్రాఫ్‌ని మీడియాకు విడుదల చేసింది.

ఈ కార్యక్రమమంతా ముగిసేసరికి సాయంత్రం అయిదున్నర గంటలు దాటిపోయింది సమయం.

కాంచన స్నిగ్ధల వివరణతో ప్రజాప్రతినిధులు మీడియా వర్గంకూడా సంతృప్తిచెందినట్టైంది.

చీకటిపడే వేళకావటంతో హెలీకాప్టర్‌లో యువతులు ఇద్దరినీ వెనక్కి దీవిమీదకు పంపించడానికి సి.ఎమ్. అంగీకరించలేదు.

రాత్రివేళ హెలికాప్టర్ దీవిలో దిగటానికి వసతిలేదు. ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువ.

అందుచేత రాత్రికి వారి ఇద్దర్నీ తన అతిధులుగా తమ ఇంటికి తీసుకువెళ్ళారు సి.ఎమ్.

ఆ విధంగా రాత్రికి దీవికి తిరిగి వెళ్ళిపోవాలనుకున్న స్నిగ్ధ, కాంచనలు అనుకోకుండా రాత్రికి సి.ఎమ్.గారి ఇంట భోపాల్‌లోనే ఉండిపోవలసివచ్చింది.

శాటిలైట్ ఫోన్ ద్వారా కృతయుగ్‌కి స్వయంగా ఈ విషయం తెలియజేశారు సి.ఎమ్.

* * * * *

సంధ్యా సమయం. పశ్చిమాకాశం తగలబడిపోతుందా అన్నట్టు నెత్తుటివర్ణంలో ఎర్రబారింది. సూర్యుడు నెమ్మదిగా అస్తమిస్తున్నాడు.

దీవిమీద పూజకు కావలసిన ఏర్పాట్లన్నీ పూర్తిచేసుకొని సిద్ధంగా ఉన్నాడు అనంతస్వామి.

ఇప్పుడు ఆయన గెటప్ మారిపోయింది. తలస్నానం చేసి ఎర్రటి పంచె కట్టాడు. ఒంటి మీద మరే ఆచ్ఛాదనాలేదు. మెడలో పూసలదండలు, నుదుటి మీద పెద్ద కుంకుమ బొట్టుతో చూడటానికి భీతిగొలిపేలా ఉంది ప్రస్తుతం ఆయన రూపం.

ఇంతకుముందు ఎక్కడ అయితే నాగబలి తదితర కార్యక్రమాలు జరిపారో, అదే చోట తాంత్రిక పూజకు సకలం సిద్ధంచేయబడ్డాయి.

ఒక పక్క ఐదుపొట్టేళ్ళు, అన్నీ నల్లరంగువి చెట్టుకు కట్టివున్నాయి. వాటి అరుపులు చాలా కర్ణకఠోరంగా ఉన్నాయి. వాటిని బలి ఇవ్వటానికి పెద్ద వేట కత్తితో మనుషులు ఇద్దరు ఎప్పుడు సిగ్నల్ ఇస్తారా అన్నట్టుగా సిద్ధంగా ఉన్నారు.

మరోపక్క మూడు నల్లకోడి పెట్టలు అక్కడ సిద్ధంగా ఉన్నాయి. అలాగే కొత్త ఇటుకలు పేర్చి హోమం రగల్చటానికి హోమగుండం సిద్ధంగా ఉంది.

సరిగ్గా సూర్యాస్తమయం అయిన మూడో నిముషం తన చేతిలోని బరిసెలాంటి ఒక ఆయుధానికి పసుపు కుంకుమలు అద్ది పూజా విధానం ప్రకారం భూమిలోకి సరయిన దిశలో గుచ్చి పూజకు కూచున్నాడు అనంతస్వామి. హోమంలో అగ్ని మండించబడింది.

మంత్రాలు చదువుతూ గుప్పెడు సాంబ్రాణి చల్లగానే భగ్గున ఎగశాయి మంటలు.

కార్యక్రమం జరుగుతూండగా మధ్యలో ఏం జరిగినా ఎవరూ భయపడకూడదు, వెనుతిరిగి పారిపోకూడదు అని ఎప్పటిలానే అందరికీ ముందే హెచ్చరిక జారీ చేశాడు అనంతస్వామి.

ఇక దీవంతా పూర్తిగా చీకట్లు అలుముకున్నాయి. దీవిమీద విద్యుద్దీపాలు వెలిగాయి.

హోమాగ్నుల కాంతులలో ఎర్రగా నిప్పుకణికలా మెరిసిపోతున్నాడు అనంతస్వామి.

ఆ క్షణంలో ఆయన్ని చూడ్డానికే బయపడుతున్నారంతా.

ఏకదీక్షగా మంత్రోచ్చాటన చేస్తూ చిత్రవిచిత్రమైన ద్రవ్యాలను అగ్నికి సమర్పిస్తున్నాడు.

ఆయన చుట్టూ ఉన్నప్లేట్లలో ఆయా వస్తువులు ముందే సిద్ధంగా ఉంచుకున్నాడు. అక్కడ ఉన్న అందరికీ- ఒక విషయం చాలా స్పష్టంగా అర్ధమవుతోంది.

అంతక్రితం వరకు భూమి లోపలినుంచి ఎప్పుడో ఒకసారి వినిపించేది విచిత్రమయిన మూలుగు. పూజ ఆరంభంకాగానే మూలుగుధ్వని నిరంతరాయంగా రావటం మొదలయింది. ఆ శబ్దం క్రమంగా పెరుగుతూపోతోంది.

క్షణాలు, గంటలు, నిముషాలు, గడిచిపోతూనే వున్నాయి. ఏకదీక్షగా కొనసాగుతోంది పూజ. భూమిలోపలినుంచి మూలుగు మరింత అధికమయింది.

అది ఎలుగ్గొడ్డు ఘర్జిస్తున్నట్టుండి అందరి గుండెల్లోనూ గుబులు పుట్టిస్తోంది. అక్కడ జరుగుతున్నటువంటి పూజ చూడాలని వచ్చిన సాయుధ పోలీసులు కూడా ఆ విచిత్రమైన శబ్దాలకు భయపడిపోయి వెనుతిరిగి తీరంవైపు వెళ్ళిపోయారు.

కృతయుగ్ అన్నారావులు తప్పిస్తే మిగిలినవారు అంతా భయపడి దూరంగా వెళ్ళిపోయారు. క్రమంగా రాత్రి పదిగంటలు దాటింది సమయం.

ఒక పెద్ద పళ్ళెంనిండా వేడి అన్నం తెప్పించాడు అనంతస్వామి. నల్లకోళ్ళు మూడింటిని కోసి నెత్తురుతో అన్నాన్ని తడిపి బాగా కలియబెట్టి పది అడుగుల దూరంలో నేలమీద ఉంచి వెనక్కి వచ్చి తిరిగి పూజలో కూచున్నాడు. అందిరివంకా చూస్తూ–

"శక్తిని ఆవాహన చేస్తున్నాను. ఎవరూ భయపడవద్దు. దూరంగా ఉండండి...." అంటూ అక్కడున్నవారిని హెచ్చరించాడు అనంతస్వామి.

కృతయుగ్‌ని మాత్రం దగ్గర ఉంచుకుని అన్నారావుని కూడా దూరంగా పంపించివేశాడు.

ఏం జరగనుందోనన్న భయాందోళనలు అందరిలోనూ నెలకొనివున్నాయి.

తిరిగి పూజలో కూచున్న అనంతస్వామి ఈ సారి బరిసెలా వున్న ఆయుధాన్ని చేతుల్లోకి తీసుకుని ధనపిశాచిని ఆవాహన చేశాడు.

మరుక్షణం గుండెల్లో దడ పుట్టించేలా కర్కశమైన, కర్ణకఠోరమైన, ఒక విచిత్రమైన అరుపు విన్పించింది. ఆ వెంటనే నల్లటి దట్టమైన పొగలాంటి వికృతమైన రూపం ఒకటి అప్పుడు అక్కడ ప్రత్యక్షమైంది. సామాన్యులు ఆకస్మికంగా చూస్తే గుండెలు పగిలి చచ్చేంత భయానకంగా ఉంది ఆ రూపం.

వస్తూనే 'ఆకలి' 'ఆకలి' 'ఆకలి' అని అరుస్తూ, పెద్దపెద్దగా కేకలు పెడుతూ నెత్తుటి కూడుమీద ఎగబడింది. క్షణాల్లో ఆరగించేసింది. తిరిగి 'ఆకలి' అని అరిచింది.

"పొట్టేళ్ళను బలిస్తున్నాం. నెత్తురుతో ఆకలి తీర్చుకుని వెళ్ళిపో. ఇక ఇక్కడ నీకు పనిలేదు. వెళ్ళిపోతావా?" అంటూ గద్దించాడు అనంతస్వామి.

ధనపిశాచి అసంతృప్తితో మీదకు రాబోతుంటే చేతిలోని బరిసెను చూపించి అడ్డుకున్నాడు.

"వెళ్ళిపోతావా లేదా?" హూంకరించాడు.

"నా ఆకలి తీరాలి. వెళ్ళిపోతా" బదులిచ్చింది శక్తి.

"తొలగిపో. ఆకలి తీరుస్తా" ఆ మాటనగానే శక్తి అదృశ్యమైంది. ఆ వెనువెంటనే అనంతస్వామి ఆర్డర్‌తో పొట్టేళ్ళను ఒకదాని తర్వాత ఒకటి తలకాయలు నరికి శక్తికి బలిచ్చేశారు.

విచిత్రమైన విషయం ఏమిటంటే అలా బలిచ్చిన ఏ ఒక్క పొట్టేలు మొండెం నుండి చుక్కనెత్తురు కూడా నేల రాల్లేదు. శక్తి నెత్తురు పీల్చేసుకుంది అనటానికి అదే నిదర్శనం.

పొట్టేళ్ళను బలిపెట్టడంతో కార్యక్రమం ముగిసిపోయినట్టే. ఆ తర్వాత ధనపిశాచి మూలుగుగాని, దాని జాడగాని అక్కడ తెలీలేదు.

ఆ విధంగా అర్థరాత్రి లోపలే పూజముగించి నదికివెళ్ళి తలస్నానం చేసి పొడి దుస్తులుధరించి వచ్చాడు అనంతస్వామి.

అదృశ్యశక్తులు ఎంత ప్రమాదకరమైనవో అందరికీ తెలుసు. వాటిని ఆవాహన చేసిన తర్వాత అన్నీ సక్రమంగా జరక్కపోతే మనుషుల మీదకు విరుచుకుపడతాయి. మొత్తానికి అలాంటి ప్రమాదం ఏమీ లేకుండా రెండో అడ్డంకి అయిన ధనపిశాచిని కూడా సంతృప్తిపరచి పంపించివేయటంతో అందరూ తేలిగ్గా ఊపిరి తీసుకున్నారు.

ఆ రాత్రి అంతా నిద్రకు ఉపక్రమించేసరికి అర్థరాత్రి పన్నెండు దాటింది సమయం.

మరునాడు ఉదయం. సరిగ్గా పదకొండు గంటలకు నిధికోసం తొలిసారిగా తవ్వకంపనులకు– ముహూర్తం నిర్ణయించాడు అనంతస్వామి.

ఇక్కడ తొలిసారిగా అనటానికి కారణం వుంది. తామంతా ఏ నిధికోసం ఉజ్జయిని వచ్చారో–వచ్చి ఇరవై రోజులు కావస్తున్నా నిధిని చేరుకోలేకపోయారు.

స్నిగ్ధ, కాంచనలు భోపాల్ నుంచి దీవికి తిరిగి వచ్చేసరికి ఉదయం తొమ్మిది గంటలు దాటింది సమయం. వాళ్ళని దించి హెలికాప్టర్ వెనక్కి వెళ్ళిపోయింది.

రాత్రి నిద్రలేమివలన ఉదయం ఆలస్యంగా లేచారు అందరూ. అంతక్రితమే లేచి స్నానాదికాలు ముగించి రెడీ అయ్యాడు కృతయుగ్.

భోపాల్ విశేషాల్ని స్నిగ్ధ, కాంచల్ని అడిగి తెలుసుకున్నాడు. రాత్రి దీవిమీద జరిగినటువంటి విశేషాలు విని స్నిగ్ధ, కాంచనలు ఆనందించారు.

సరిగ్గా పదకొండు గంటలకు అనంతస్వామి, స్నిగ్ధ, కాంచనలచేత భూమిపూజ జరిపించాడు.

తొలిగునపాన్ని కృతయుగ్ దించాడు. ఆ వెనకే పీటర్ వర్గం తవ్వకం పనులు ఆరంభించారు.

ఆరడుగుల వృత్తాకారంలో నుయ్యి తవ్వినట్టుగా లోతుకు తవ్వుకుంటూ పోనారంభించారు.

కొందరు గునపాలతో తవ్వుతూ ఉంటే....కొందరు మట్టిని తట్టలతో ఎత్తిపోస్తూ ఉంటే, ఒకటే హడావుడి. సుమారు అయిదున్నర అడుగుల లోతుకెళ్ళగానే ఉన్నట్టుండి గునపానికి ఏదో తగిలి ఖంగున మోగింది. ఆ మోత అందర్నీ ఉలికిపడేలా చేసింది. అన్నారావు పక్క నుండి సూచనలిచ్చాడు.

ఇలాంటివి తవ్వటంలో పీటర్ వర్గానికి విశేషమైన అనుభవంవుంది. దిగువన ఉన్నది తలుపు అయివుండాలి. లేకపోతే అంత శబ్దంరాదు. జాగ్రత్తగా మట్టిని తొలగించి పైకి పోస్తూ పరిశీలించారు.

వారి అనుమానాన్ని నిజం చేస్తూ– దిగువన ఒక నలుచదరపు ఉక్కుతలుపు కన్పించింది.

అది నాలుగడుగుల వెడల్పు, అయిదడుగులు పొడవు ఉంది. దాన్ని ఎలా తయారుచేశారో ఆ కాలం పనివాళ్ళకే తెలియాలి. ఇంతకాలమైనా ఆ ఉక్కు తలుపు తుప్పుపట్టలేదు. తెల్లగా మెరుస్తోంది.

అంగుళం మందం ఉండే ఆ తలుపును ఎటునుంచి తెరవాలో కూడా అర్ధంకాక ముఖముఖాలు చూసుకున్నారంతా. ఆ పైన తలుపుతెరిచినా అక్కడ నిలబడే ఆస్కారంలేదు. అంత ఇరుగ్గా ఉంది దిగువన.

కృతయుగ్ సూచనమేరకు తిరిగి మట్టి తవ్వుతూ ఎనిమిదడుగుల పొడవున ఏటవాలుగా దారి ఏర్పాటు చేసి గోతిని మరో అడుగు చుట్టూ తవ్వటంతో దాని దిగువన తగిన జాగా ఏర్పడింది.

అప్పటికి భోజన సమయం కావటంతో పని వదిలి వచ్చేశారంతా. భోజనాలు, విశ్రాంతి అనంతరం తిరిగి మూడుగంటలకు పని ఆరంభించారు.

అర్ధగంట శ్రమపడిన తర్వాత ఇనుపతలుపు తెరిచే కిటుకు తెలిసింది. తలుపు పశ్చిమభాగంలో రెండు చోట్లగల తాళాల్లో అటు ఒకటి ఇటు ఒకటి గునపం మొనలు ఉంచి లేపగానే బరువుగా తూర్పువైపుకు తెరుచుకుంది ఆ తలుపు.

దాన్ని నిటారుగా లేపి ముందుకు పడకుండా పగ్గంతో కట్టేశారు. పదిమందిపడితేగాని–ఆ తలుపు తెరుచుకోలేదు. తెరుచుకోగానే దిగువకు మెట్లు కన్పించాయి. లోపల చిమ్మచీకటిగా వుంది.

ఎన్ని మెట్లు ఉన్నాయో, ఎంత లోతు దిగాలో కూడా అర్థం కాలేదు. ముందుగా కిందకు దిగటానికి ఎవరికీ ధైర్యం చాలలేదు.

తలో టార్చ్‌లైటు అందుకుని ముందుగా అనంతస్వామి వెనకే కృతయుగ్, వారి వెనక అన్నారావులు ఒకరి వెంట ఒకరు లోపలికి దిగారు.

వారిని అనుసరించి స్నిగ్ధ, కాంచనలు దిగారు.

ఎందుకయినా మంచిదని అవసరమైతే పారిపోడానికి అనువుగా ఆఖరున మెట్లు దిగినవాడు మహీధర్. సుమారుగా నలభైమెట్లు దిగువన చిన్న కారిడార్ వంటి ప్రదేశంలో అడుగుపెట్టారంతా, నలభై మెట్లు అంటే సుమారు నలభై అడుగులు అనుకోవచ్చు.

ఏటవాలుగా మెట్లదారిగాబట్టి పదడుగులు తీసి వేసినా ఉపరితలం నుంచి సుమారు ముప్పై అయిదడుగుల దిగువన నేలమాళిగలో ఉన్నారు. అంటే దీవినుంచి పదడుగుల దిగువనున్నాయి నదీజలాలు. కాబట్టి నీటిమట్టం కన్నా చాలా దిగువ నుంది నేలమాళిగ.

ఆలోచిస్తున్నాడు కృతయుగ్.

దిగువన ఏసిలో ఉన్నంత కూల్‌గా వుంది. మొత్తం రాతికట్టడం కాగా నేలమీద పరిచింది చలువరాయి. టార్చిలైట్ల కాంతిలో పరిసరాల్ని స్పష్టంగా చూడగలుగుతున్నారంతా. మెట్లనుంచి ఆరంభమైన సన్నటి దారి–కుడిపక్కగా కొంత దూరంవెళ్ళి మళ్ళీ కుడిపక్కకే తిరిగి ఒక విశాలమైన నడవాలోకి వారిని చేర్చింది.

తొమ్మిదడుగుల వెడల్పున సుమారు తొంభై అడుగుల పొడవున వుందా నడవా. ఎడంపక్క ఎత్తయిన డోర్. గోడమధ్యలో మూసివేయబడిన మార్గం స్పష్టంగా కన్పిస్తోంది. దీవి పశ్చిమతీరంలో నది నానుకొనివున్న ప్రాంతంలో ఉన్నారిప్పుడు.

ఒకనాడు ఆ మార్గం గుండానే నావల మీద నిధిని తెచ్చి లోపలికి చేర్చారు. ఆ గోడ వెనక్కి వాలి ఏటవాలుగా వుంది. ఆ గోడకు అక్కడక్కడా చేతికి అందేంత ఎత్తులో వరసగా ఆరిపోయిన కంచుకాగడాలు ఆరు ఇనుప కొక్కాలకు తగిలించివున్నాయి.

మరో విచిత్రం ఏమిటంటే అదే గోడకు ఒరలతో కూడిన అనేక ఖడ్గాలు, వాటిపైన  బరిసెలు బల్లాలు వరసగా తగిలించబడివున్నాయి.

అవన్నీ సైనికులు యుద్ధాలలో వాడే ఆయుధాలు. వాటిని ఎందుకలా ఉంచారో అర్థంకాలేదు. పద్దెనిమిది వందల సంవత్సరాలక్రితం ఆరిపోయిన ఆ కంచుకాగడాలను తిరిగి వెలిగించినవారు లేరు.

సాధారణంగా ఇన్ని వందలయేండ్లూ గడిస్తే లోపల ధూళిధూసరి లేదా, సాలెగూళ్ళతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉండాలి.

కాని ఆ కాలంవాళ్ళు ప్రయోగించిన మందులుగాని, మరేదన్నా టెక్నిక్‌గాని ఆ పాతాళమాళిగ మూసి వేసినప్పుడు ఎంత పరిశుభ్రంగా ఉందో ఇప్పుడు తెరిచే నాటికీ అదే పరిశుభ్రతతో సువాసనలు వెదజల్లడం విశేషం.

అయితే  ఇంతకీ నిధి ఎక్కడ నిక్షిప్తమై వుంది? ఈ ప్రశ్నకు సమాధానమే– కుడిపక్క వరసతీరివున్న తొమ్మిదిగుమ్మాలు.

పురాతన ఆలయాల్లో గుడితలుపులు ఎంత చక్కటి పనితనంతో కూడిన చెక్కడపు డిజైన్లు కలిగి చిరుగంటలతో ఉంటాయో అంత చక్కగా చూడముచ్చటగా ఉన్నాయి. నిన్ననేచేశారా అన్నంత సరికొత్తగా ఉన్నాయవి. ఒక్కో గుమ్మానికి పైన గోడమీద పాళీ ప్రాకృత భాషల్లో కొన్ని అక్షరాలున్నాయి.

ఒక్కో తలుపు గొళ్ళానికి బోదురుకప్ప సైజులో తాళం కప్పలు వేలాడుతున్నాయి. వాటికి సీల్‌వేసి పైన ఎరుపు నలుపు రంగులతో కూడిన దారాలతో చిత్రవిచిత్రమైన  ముడులు వేసివున్నాయి.

తలుపులమీద ఏవో బొమ్మలు కనబడుతున్నాయి. చూడ్డానికి విచిత్రం గాను, భయం కలిగించే రీతిలో బంధింపబడున్నాయి తలుపులు.

నడవా చివరమేకుకు జాన పొడవున్న తాళం చెవులు తొమ్మిది కలిగిన ఒక తాళాలగుత్తి వేలాడుతోంది.

విచిత్రం ఏమంటే గాలి వీచకపోయినా తలుపులకు వేలాడుతున్న చిరు మువ్వలు సవ్వడి చేయటం.

ఈ చివరినుంచి ఆ చివరకు ఓ సారి నడచి వెళ్ళి తిరిగి చూశారందరూ. తలుపుల్ని పరిశీలించాలని దగ్గరగా పోతున్న అన్నారావుని చటుక్కున భుజంపట్టి వెనక్కిలాగాడు అనంతస్వామి.

“ఏం చేయబోతున్నావ్!” అడిగాడు.

"స్వామీ తలుపుల్ని పరిశీలిద్దాం. తాళంచెవులు ఇక్కడే ఉన్నాయి. లోపల ఏముందో తాళం తెరిచి చూద్దాం" అన్నాడు అన్నారావు.

"పిచ్చోడా! అదంత తేలికైన పననుకుంటున్నావా? పొరపాటున తలుపును తాకావంటే అయిపోతావ్. చాలా ప్రమాదం. తలుపు గొళ్ళేనికి వేలాడుతున్న రంగుదారాల్ని, వాటిపైన వున్న బొమ్మల్ని గమనించావా?

ఎవరుబడితే వాళ్ళు తెరవటానికి వీల్లేకుండా ఒక్కో గది తలుపుల్ని ఒక్కో బంధంతో బంధించివుంచారు. అమ్మా స్నిగ్ధా ఆ అక్షరాల్ని ఓసారి చదువుతల్లీ" అన్నాడు. ఆమె చదివి చెప్పి ఆమె చెప్పిన ప్రకారం ఆ అక్షరాలు అది ఏ దేవత గదో చెప్తున్నాయి.

మొదటి గది ఆదివిష్ణుమూర్తిది కాగా మిగిలినవి ఒక్కో లక్ష్మికి ఒక్కో గది కేటాయించబడింది. అంటే ఎవరి నిధిని వారి గదిలోనే భద్రంచేసివుండాలి.

నిధిని చూడబోతున్న ఆనందంలో ఉన్నా అందరికీ అనంతస్వామి మాటలతో ఒక్కసారిగా నీరసం వచ్చినంత పనయింది.

"ఏమిటి స్వామీ. తలుపుల్ని తెరవలేమా?" అడిగాడు కృతయుగ్.

"ప్రస్తుతం తెరవలేం" వెంటనే బదులిచ్చాడాయన.

"అంత సులువుగా తెరుచుకోవు నాయనా. చూస్తున్నారుగా. అడుగడుగునా మంత్రశక్తులతో ఎంత పటిష్ఠమైన ఏర్పాట్లు చేశారో.

ఆదివిష్ణుగదికి నాగబంధం వేశారు.

వరుసగా గదులకి గరుడబంధం-మండూకబంధం-వృశ్చికబంధం-గంధర్వబంధం ఇలా తొమ్మిదిగదులకు నవ బంధాల్ని ప్రయోగించి పెట్టారు.

ఆ బంధాలు విప్పి దారాలు బొమ్మలు తొలగించకుండా తొందరపడి తాళం తెరిచే ప్రయత్నంచేస్తే నెత్తురుకక్కుకు చస్తారు. ఆ చావు చాలా ఘోరంగా ఉంటుంది" వివరించాడు.

షాక్‌తో నిలబడిపోయాడు అన్నారావు. పొరపాటున తలుపుల్ని తీసివుంటే అయిపోయేవాడు. సమయానికి అనంతస్వామి ఆపబట్టి బతికిపోయాడు.

"ఇవన్నీ అంత ప్రమాదకరమైన బంధాలా?" ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ అడిగాడు కృతయుగ్.

"మరి ఇంతసేపూ నేను చెప్పేది అదేగదా! పొరపాటున తలుపును తాకినా ప్రాణాలకు గ్యారంటీలేదు. మీకు అర్థమయ్యేలా చూపిస్తాను చూడండి" అంటూ

రెండు నిముషాలు ఏవో మంత్రాలు చదివి గుప్పెడు అక్షింతలు సంచిలోంచి తీసి అందరి మీదా చల్లాడు అనంతస్వామి.

అంతే–గుమ్మాలవంక చూసి షాక్‌తో–ఎక్కడి వాళ్ళు అక్కడ నిలబడి పోయారు అందరూ.

నాగబంధం వున్న తలుపుల మీద పెనవేసుకున్న రెండు సర్పాలు బుసలు కొడుతూ తమనే చూస్తున్నాయి. ఒక గుమ్మం తలుపుమీద రెండు గరుడ పక్షులు క్రూరంగా చూస్తున్నాయి.

ఒక గుమ్మం తలుపుల మీద నల్లటి తేళ్ళు కారాడుతున్నాయి.

వరసగా అవి చూడగానే గుండెల్లో గుబులు రేగి భయంతో కాంచన, స్నిగ్ధలు ముఖాలు తిప్పుకున్నారు.

"అర్థమైంది గదా. మనం ఎక్కువసేపు ఇక్కడ ఉండటం కూడా ప్రమాదమే. పైకి వెళ్ళాక మాట్లాడుకుందాంపదండి" అంటూ బయలుదేరాడు అనంతస్వామి. ఆయనపక్కనే అన్నారావు, వారికి వెనక స్నిగ్ధ, కాంచనలు, వారి వెనక కృతయుగ్.

చివరగా మహీధర్ నడుస్తున్నారు.

కృతయుగ్‌ని చూస్తున్న మహీధర్‌లో ఉన్నట్టుండి ఒక దుర్బుద్ధి పుట్టింది.

ఒక టాక్సీడ్రయివర్ ఉన్నట్టుండి హీరో అయిపోయాడు. తన ఆశలమీద నీళ్ళు చల్లి కాంచన తనకి కాకుండా వశం చేసుకున్నాడు.

వీడ్ని అంతం చేయటానికి ఇదే సరైన సమయం. పక్కన గోడకు ఖడ్గాలున్నాయి.

ఒక ఖడ్గం అందుకుంటే చాలు. ఒకే వేటు. కృతయుగ్ తలతెగి నేలమీద దొర్లుతుంది.

చెడు తలంపుగాని, ఆలోచనగాని రానేకూడదు. వస్తే అది కుదురుగా ఉంచదు. లాభనష్టాలు మంచి చెడుల విచక్షణాజ్ఞానాన్ని నశింపచేస్తుంది.

అప్పటికి నడవా మధ్యకొచ్చారు. ఎవరి ఆలోచనల్లో వారు నడుస్తున్నారు.

ఉన్నట్టుండి పక్కకు తిరిగాడు మహీధర్. గోడకు వేలాడుతున్న ఒక ఒరలోంచి సర్రున ఖడ్గాన్ని బయటకు లాగి కృతయుగ్ వైపు ఉరికాడు. అలికిడి విని తిరిగి చూశాడు కృతయుగ్. సరిగ్గా అదే సమయంలో అనుకోకుండా ఒక విచిత్రం జరిగింది.

ఎప్పుడైతే మహీధర్ ఒరలోంచి ఖడ్గాన్నిలాగాడో మరుక్షణం పైన వేలాడుతున్న బరిసెల్లోంచి ఒక బరిసె జారింది.

మహీధర్ కృతయుగ్‌ని సమీపించేలోపలే అది ఎవరో విసిరినట్టు వేగంగా దూసుకు వచ్చి మహీధర్ వెన్నులోంచి గుండెల్లోకి దిగబడిపోయింది.

అతడ్ని పక్కకి లాగి కాపాడాలనుకున్న కృతయుగ్ ప్రయత్నం నెరవేరలేదు.

మహీధర్ చావుకేకతో నేలమాళిగ దద్దరిల్లింది. మహీధర్ గుండెలనుంచి వెల్లువలా పొంగింది రక్తం.

అదే సమయంలో గోడకు వేలాడుతున్న కరవాలాల్లో కదలిక. పైనుంచి బరిసెలు, బల్లాలు వీరివైపు దూసుకురావటం మొదలు అయింది.

ప్రమాదం గ్రహిస్తూనే "పరుగెత్తండి. త్వరగా" అనరుస్తూ స్నిగ్ధ, కాంచనల చేతులు పుచ్చుకుని నడవా చివరకు పరుగెత్తాడు కృతయుగ్.

వయసును కూడా మరిచిపోయి వెంబడించారు అన్నారావు, అనంత స్వామి ఇరువురూ. అలా పరుగెత్తటమే వారి ప్రాణాలు కాపాడింది.

లేకపోతే బళ్ళాలు దిగి అంతా అక్కడే ప్రాణాలు కోల్పోయేవారు. నడవా చివర–సురక్షితమైన ప్రాంతానికి వారు చేరుకున్న తర్వాత కూడా బరిసెలు, బల్లాలు నడవాలోకి జారి పడుతూనేవున్నాయి.

నేలంతా చెల్లాచెదురుగా పడున్నాయవి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులెత్తి వెంట్రుకవాసిలో ప్రమాదం నుంచి బయటపడ్డారంతా.

అసమర్థులు లేదా శత్రువులు నిధికోసం నేలమాళిగలో ప్రవేశిస్తే, హతమార్చడానికి చేసివుండాలీ ఏర్పాటు. ఏ విధమైన టెక్నిక్కో, బల్లాలను, ఖడ్గాలనూ ఎలా అమర్చారో వారికి అర్థంకాదు.

ఒక్కటి లాగితే మొత్తం జారిపడేవిధంగా చేసిన ఆ ఏర్పాటు అబ్బుర పరుస్తుంది.

కాని ప్రస్తుతం దాని గురించి ఆలోచించటంలేదు కృతయుగ్. మహీధర్ గురించి ఆందోళన చెందుతున్నాడు. ఆఖరి బల్లెం కూడా జారిపడగానే ఒక్కదూకులో మహీధర్‌వైపు పరుగెత్తాడు.

శరీరంలో నాటుకున్న మూడు బరిసెలతో నెత్తుటి మడుగులోపడి కొన ఊపిరితో ఉన్నాడతను.

పరుగెత్తుకొచ్చి తన తలను ఒడిలోకి తీసుకుంటున్న కృతయుగ్‌ను చూసి పేలవంగా నవ్వాడు. "నేను నీ శత్రువు అని తెలిసికూడా నాకోసం వెనక్కి ఎందుకు వచ్చావ్?" అనడిగాడు.

"నేనెప్పుడూ నిన్ను శత్రువుగా చూళ్ళేదు. నువ్వే ద్వేషం పెంచుకొని నన్ను శత్రువుగా చూశావ్. అర్జెంటుగా నిన్ను హాస్పిటల్‌కి చేర్చాలి...." అంటూ చేతుల్లోకి ఎత్తుకోబోతుంటే వారించాడు మహీధర్.

ఈ లోపల మిగిలిన వాళ్ళంతా అక్కడి కొచ్చారు. "నీ అంత విశాల హృదయం నాకు లేకపోయింది కృతయుగ్. నా అసూయ, నా స్వార్థం నన్ను బలి తీసుకుంది.

నిధి వున్నచోట నరబలికోరుతుందంటారు. నాతోనే ఆ బలి ఆఖరు – కానీ" అంటూ అక్కడున్న అందర్నీ చూస్తూ పేరుపేరునా పిలిచి క్షమాపణలు కోరుతూ ప్రాణాలు వదిలాడు మహీధర్.

అతడి మరణంతో ఒక్కసారిగా అందరిలో విషాదం అలముకుంది. మహీధర్ బాడీని చేతుల్లోకి ఎత్తుకున్నాడు కృతయుగ్. వెళ్ళిన దారినే ఒకరి తరువాత ఒకరుగా వరుసగా మెట్లవెంట పైకి వచ్చేశారు.

పైన సిద్ధంగావున్న పీటర్ మిగిలినవాళ్ళు కృతయుగ్ చేతుల్లోంచి మహీధర్ బాడీని అందుకున్నారు. జరిగింది వాళ్ళకి క్లుప్తంగా చెప్పారు.

అంతా పైకి రాగానే ఉక్కుపలకను యధావిధంగా ఉంచి మెట్లదారిని మూశారు.

జరిగిన ప్రమాదం గురించి శాటిలైట్ ఫోన్ ద్వారా సి.ఎమ్‌కి రిపోర్ట్ చేశాడు కృతయుగ్. మొత్తానికి సి.ఎమ్ జోక్యంతో ఏవిధమైన పోలీస్ కేసు లేకుండా మహీధర్ బాడీని క్షిప్రానదీ తీరంలోనే ఖననం చేశారు.

కర్మకాండలన్నీ ముగించేసరికి పక్షం దినాలు గడిచాయి. ఈలోపల మరోసారి సి.ఎమ్ దీవిమీదికొచ్చి నేలమాళిగవరకు వెళ్ళి అంతా పరిశీలించారు.

అడిగి తెలుసుకున్నారు.

నడవాలోని బల్లాలు ఖడ్గాలను పోలీసులు స్వాధీనం చేసుకుని ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఇలా ఉండగా నవబంధాల్ని తొలగించటం ఎలా అనే విషయం మీద అంతా తర్జనభర్జన పడుతూనేవున్నారు.

సమర్థులైన తన గురువుల్లో ముగ్గురి గురించి ఫోన్లద్వారా ఆరాతీస్తూనే వున్నాడు అనంతస్వామి.

వారిలో కేరళకుచెందిన భైరవమీనన్ ఒకరు. ఆయన వయసు తొంభైతొమ్మిది సంవత్సరాలు. ప్రస్తుతం అవసానదశలో ఉన్నారు. రాలేరు.

రెండో గురువు నందనార్యుడు. ఆయన ఒరిస్సాలోని జాజ్‌పూర్ సమీపంలో ఉంటాడు.

ఆయన వయసు తొంభై సంవత్సరాలు. ఆయన సంవత్సరం క్రితం కాలం చేశాట్ట. ఇక మిగిలింది అస్సాంకు చెందిన చండీదాసు అనే మహామంత్రవాది. ఆయన వయసు ఎనభై అయిదు సంవత్సరాలు. గౌహతికి నూరుకిలోమీటర్ల దూరంలోని చండీ ఆలయ ప్రాంతంలో ఉంటాడు.

ఆయన క్షేమంగానే ఉన్నాడు. వెంటనే ఆయన్ని రప్పించాడు అనంతస్వామి, "మాంత్రిక తాంత్రిక విద్యలున్నాయ్. ఇవి ప్రయోగించినంత సులువుకాదు విప్పటం.

అందులోనూ ప్రాచీనమైన ఈ బంధనాలను ప్రయోగించగల మొనగాళ్ళు ఇప్పుడు లేరనే చెప్పాలి" అన్నాడు చండీదాసు. ఆయన వయసు ఎనభై అయిదయినా ఇప్పటికీ నడుం వంగలేదు. మనిషి ఆరోగ్యంతో ఉత్సాహంగానే ఉన్నాడు.

చాలాకాలం తర్వాత ప్రియశిష్యుడు అనంతస్వామిని కలుసుకున్నందుకు ఆనందించాడాయన.

గౌహతినుంచి భోపాల్ వరకు విమానంలో వచ్చి అక్కడినుండి రోడ్డు మార్గంగా ఉజ్జయిని మీదుగా దీవికి చేరుకున్నాడు. స్వయంగా అనంతస్వామి కార్లో భోపాల్ విమానాశ్రయానికి వెళ్ళి రిసీవ్ చేసుకుని వెంటబెట్టుకొచ్చాడు. ఆయన కోరిన దినుసులు, వస్తువులన్నీ సమకూర్చబడ్డాయి.

మరునాడు గురుశిష్యులు ఇద్దరూ ఆ రోజంతా పూజాదికాలు చేసి సాయంకాలానికి ఒక్క నాగబంధాన్ని మాత్రం విప్పి తొలగించగలిగారు. ఒక్క నాగబంధాన్ని విప్పటానికే వారికి ఒక రోజు పట్టింది.

ఆ తర్వాత వరసగా ఉదయం ఒకటి సాయంత్రం ఒకటిగా రెండు గుమ్మాలమీది బంధాలను తొలగించారు. అలా నాగబంధంతోపాటు మిగిలిన నవబంధాలన్నిటినీ తొలగించటానికి వారికి అయిదురోజులు పట్టింది.

ఈ ఐదురోజులు ఒంటి పూటభోజనం దీక్షతో పూజావిధానాలను అనుసరించి బంధనాలను విప్పేశారు.

విప్పిన దారాలు, పూసలు, బొమ్మలు పూజాద్రవ్యాలను తీసుకెళ్ళి నదిలో నిమజ్జనం చేయటంతో మొత్తం పనులు పూర్తయి గదులు సురక్షితమయ్యాయి.

అయితే వెంటనే తాళాలు తీసి గదులు తెరవలేదు.

బంధనాలు తొలగించటం ఆరంభం కాగానే స్నిగ్ధ సుప్రీంకోర్టుకు వెళ్ళి జరిగిందంతా విన్నవించుకోవటంతో న్యాయమూర్తిగారు ఆమె అభ్యర్ధనమేరకు ముగ్గురు విశ్రాంత జడ్జీలు, ఆరుగురు న్యాయవాదులతో కూడిన ఒక బృందాన్ని దీవికి పంపించటం జరిగింది. ఆరోరోజు ఉదయం సి.ఎమ్ కూడా రావటంతో పటిష్ఠమైన పోలీసుల బందోబస్తు నడుమ అందరిసమక్షంలో ఒక్కో గదితెరవటం ఆరంభించారు. ముందుగా ఆదివిష్ణు మూర్తి గది తాళంతీసి తలుపులు తెరిచారు. లోపల చిమ్మచీకటిగా వుంది. గదిలో ఏం వుందో చూడాలని అందరిలోనూ ఒకటే ఆత్రుత.

టార్చ్‌లైట్లు లోపలికి ఫోకస్ చేయగానే ఒక్కసారిగా అందరికీ కళ్ళు జిగేల్‌మన్నాయి. కొందరికి మూర్ఛ వచ్చినంతపనైంది.

జీవితంలో ఎవరూ ఎన్నడూ చూడనంత నిధి లోపల వుంది. టార్చ్‌లైట్ల వెలుగుతో బంగారు, వెండినగలు, వజ్రవైఢూర్యాలు ప్రతిఫలించి కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. అత్యంత విశాలమైన గది... తెరవబడున్న ఒక పెద్ద బోషాణం నిండుగా రత్నఖచితమైన స్వామివారి అనేక దివ్యాభరణాలున్నాయి.

అయిదు రాగికాగుల నిండుగా బంగారు, వెండి నాణాలు, వరసగా వున్న బిందెల్లో నిండుగా కెంపులు, నీలాలు, వైఢూర్యాలు, గోమేధికాలు ఇలా వెలలేని మాణిక్యాలు దర్శనమిచ్చాయి.

అవిగాక ఆలయంలో ఆ కాలంలో పూజాదికాలకు ఉపయోగించిన బంగారు, వెండిపాత్రలు, పళ్ళేరాలు, దీపం సెమ్మెలు, బంగారు ఊయల.... ఇలా ఒకటేమిటి మతిపోయేసంపద కళ్ళముందు కనువిందు చేసింది.

కళ్ళు గిర్రున తిరిగేంత వెలకట్టలేని సంపద. అవన్నీ ఒక వరసలో గాకుండా హడావుడిగా తెచ్చినవి తెచ్చినట్టు అడ్డదిడ్డంగా పెట్టేసి వెళ్ళినట్టు కన్పిస్తోంది.

ఇది ఇలా ఉండగా – గది గోడలకు నాలుగుకోణాల్లో చిత్రీకరించిన, నాలుగు ఆదివిష్ణు ఆలయం పెయింటింగులు అక్కడ ఉన్న అందరినీ అబ్బురపరిచాయి.

ఆ రోజుల్లో ఆలయం వైభవాన్ని పొందుతున్న రోజుల్లో ఆ పెయింటింగ్స్ వేయించి తెచ్చి భద్రపర్చివుండాలి.

పదమూడు అంతస్థులు కలిగిన నాలుగుదిక్కులా నాలుగు గాలిగోపురాలు, గర్భాలయం, ధ్వజస్తంభం ఆలయమండపాలు, తిరుమాడవీధులు, ఆలయానికి వచ్చిన ఆ కాలం స్త్రీ పురుషుల వేషధారణ దుస్తుల తీరు అచ్చుగుద్దినట్టు అద్భుతంగా చిత్రించారు.

నాలుగు పెయింటింగ్సు దీవిని, ఆలయాన్ని నాలుగు కోణాల్లో స్పష్టంగా చూపిస్తున్నాయి. ఆలయాన్ని ఆనుకొని తూర్పుదిక్కున కన్పిస్తున్న ఇళ్ళను చూస్తుంటే, ఆలయ పూజారులు అర్చకుల నివాసాలు దీవిమీదే ఉండేవని అర్ధమవుతోంది. ఆలయ గోపురాలు, గర్భాలయం మీద శిల్పసంపద నయన మనోహరంగా వుండి, నాటి ఆలయ వైభవాన్ని చాటుతున్నాయి.

ఆ గదిని చూశాక తాళంపెట్టి పక్కనున్న ఆదిలక్ష్మి అమ్మవారి గది తెరిచి చూశారు. ఎవరినీ లోనికి అనుమతించకుండా గుమ్మంలోనుంచే చూసే ఏర్పాటుచేశారు పోలీసులు. అది సుప్రీంకోర్టు ఆదేశం. సి.ఎమ్. కూడా గుమ్మంలో నిలబడే చూశారు.

ఆదిలక్ష్మి అమ్మవారి గదిలో కూడా ఒక బోషాణంలో నగలున్నాయి. ఒకటి రెండు రాగిబిందెల్లో ధనం వుంది. బంగారు, వెండివస్తువులు పూజాపాత్రలు తలోచోటా పడివున్నాయి. నేలమీద నవరత్నాలు చిన్నచిన్న రాశులు పోసి కనిపిస్తున్నాయి.

గోడకు రెండు ఆలయం పెయింటింగ్స్ ఉన్నాయి. ఆనాటి ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయం ఎలా ఉండేదో ఆ చిత్రాల్లో చాలా స్పష్టంగా ఉంది.

ఆలయానికి గాలిగోపురంలేదు. చుట్టూ విశాలమైన ఆవరణ గోడ ఎత్తయిన గర్భాలయం, ఆలయం ముంగిట ధ్వజస్తంభం ఇవతలగా ఆలయ మండపం ఉన్నాయి.

శిల్పసంపదతో అలరారుతున్న అద్భుతమైన ఆలయం. రెండో పెయింటింగ్‌ను బట్టి గ్రామ ప్రధాన కూడలి వద్ద అమ్మవారి ఆలయం ఉండేదని అర్ధమవుతోంది. ఆ గది మూసి తాళం వేసిన తర్వాత మూడోగది విద్యాలక్ష్మి అమ్మవారి గది తెరిచారు.

ఇక్కడ కూడా భద్రపర్చబడిన అమ్మవారి ఆభరణాలు ఆలయ పూజారులు పూజలకు ఉపయోగించేటటువంటి మృణ్మయపాత్రలు కొద్దిపాటి బంగారు నాణాలు గల పాత్రలు కన్పించాయి.

వాటికి మించి అక్కడ కనబడిన విశేషం ఏమంటే పొడవాటి బల్లమీదగల అనేక తాళపత్ర గ్రంధాలు.

పాళీ ప్రాకృతభాషల్లో రాసిన అనేకమైన తాళపత్ర గ్రంధాలు అక్కడ భద్రపర్చబడివున్నాయి. అవన్నీ వేటిని తెలిపే గ్రంధాలో చదివితేగాని తెలీదు.

ఇక్కడకూడా గోడకు రెండు తైలవర్ణచిత్రాలున్నాయి. వాటిలో విద్యాలక్ష్మి అమ్మవారి గుడి విద్యాపురం గ్రామం, గ్రామవీధులు అతిసుందరంగా చిత్రించబడి వున్నాయి. ఇదీ గ్రామకూడలిలోనే వుంది. గుడి ఆదిలక్ష్మి అమ్మవారి గుడిలాగే వుంది.

ఆ తర్వాత ధైర్యలక్ష్మి అమ్మవారి గదితలుపులు తెరవబడ్డాయి. ఈ గదిలో కూడా ధనరాశులు, ఆభరణాలు వున్నాయి. అయితే అమ్మవారు ధైర్యలక్ష్మి గాబట్టి గదిలో ఆకాలం రాజులు, వీరులు, భోజులు జయించిన రాజులు రత్నఖచ్చితమైన ఒరలతో కూడిన అద్భుతమైన కరవాలాలు, గదలు, బల్లాలు మొదలైన అనేక ఆయుధాలు అక్కడ ఉంచబడ్డాయి.

మిగిలిన గదుల్లాగా ఈ గదిలో ధైర్యలక్ష్మి అమ్మవారి ఆలయం తాలూకు రెండు పెయింటింగ్స్ ఉన్నాయి. ఆ తర్వాత నాలుగోదయిన గజలక్ష్మి అమ్మవారి గదితలుపులు తెరిచారు.

ఆ గదిలో కూడా ఆలయం సంబంధమైన రెండు ఆయిల్ పెయింటింగ్స్ ఉన్నాయి. బంగారు వెండి పాత్రలు, బంగారు వెండి నాణాలతో కూడిన పాత్రలు అమ్మవారి నగల భోషాణం, ఇంకా ఏనుగుదంతాలతో తయారుచేసిన ఆభరణ, అలంకారవస్తువులు ఇతరత్రా అనేకం అక్కడ దర్శనమిస్తున్నాయి.

అవన్నీ అలా ఉంచితే ఇక్కడ మరో విశేషం అందర్నీ ఆకట్టుకుంది. అదేమిటంటే అంతరించిపోయి నేడు కనిపించకుండాపోయిన కొన్ని రకాల జంతువులు, పక్షులు బాగా ఎండించి, భద్రపరిచిన కొన్ని కళేబరాలు భద్రపరచబడి వుండటం.

వాటి డి.ఎన్.ఏను సేకరించగలిగితే ఆయా జాతుల్ని తిరిగి సృష్టించే అవకాశం ఉంది. బహుశా అప్పటికే అంతరించే దశలో ఉన్నందున భవిష్యత్త రాలకోసం వీటిని భద్రపర్చివుండాలి.

ఆ తర్వాత ఆయిదవదయిన సంతానలక్ష్మి అమ్మవారి గదితలుపులు తెరిచి చూశారు.

ఇక్కడా షరామామూలే. ఆలయం పెయింటింగ్స్, అమ్మవారి వెలలేని ఆభరణాలు అనేక పాత్రలు కన్పిస్తున్నాయి. అన్నిటికీ మించి ఇక్కడా కొన్ని తాళపత్ర గ్రంథాలు దర్శనమిచ్చాయి.

ఆవిడ సంతానలక్ష్మి. సంతతిని అనుగ్రహించే అమ్మవారు. కాబట్టి ఆ తాళపత్ర గ్రంథాలు సంతాన సాఫల్యానికి సంబంధించినవి అయివుండాలి.

ఆ కాలంలో గొడ్రాళ్ళుకూడా సంతానవతులు కావడానికి అనుసరించిన పద్ధతులు, ఆయుర్వేద మూలికా వైద్యపరంగా సంతానం లేని స్త్రీ పురుషుల్ని పరీక్షించే విధానాలు, ఏయే వర్గాలకి చెందిన స్త్రీలకు ఏయే మందులు వాడితే సంతానవతులు అవుతారు–

సంతానయోగం కలిగించే రకరకాల మూలికా వైద్యమందుల తయారీ, అలాగే గర్భనిరోధక పద్ధతులు ఇత్యాది ఆ కాలపు విషయాలను తెలిపే అమూల్యగ్రంథాలు, భవిష్యత్తరాల కోసం వారు భద్రంచేసిన ఆ యా గ్రంథాలు నేటి తరాలకక్కూడా ఎంతగా ఉపయోగపడతాయో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు.

ఆ గదితలుపులు కూడా మూసి తాళం బిగించాక ఆరవదయిన ధనలక్ష్మి అమ్మవారి గదితలుపులు తెరవబడ్డాయి. బాప్‌రే... టార్చ్‌లైట్ల వెలుగు పడగానే ధగద్ధగాయమానంగా మెరుస్తూ గదిలోని ధనరాసులు కనులు మిరుమిట్లు గొలిపాయి.

ఇంచుమించుగా ఆదివిష్ణు ఆలయంలోని సంపద అంత ఇక్కడ కూడావుంది.

అసలే ధనానికి అధినాయకి... ఇక చెప్పాలా...

తట్టలతో తెచ్చి గుమ్మరించినట్టుగా నేలమీద బంగారు వెండి నాణాల కుప్పలు, కెంపులు, నీలాలు, మణిమాణిక్యాలతో కూడిన రత్నరాసులు.

అవిగాక రాగిబిందెల్లో బంగారు ఆభరణాలు వెండి సామగ్రితో కళ్ళు తిరిగే సంపద ఉందక్కడ.

గోడలకు అమ్మవారి ఆలయాన్ని చూపించే రెండు తెల్లవర్ణ చిత్రాలున్నాయి. ధనపురిలో కూడా గ్రామకూడలిలోనే అమ్మవారి ఆలయం ఉండేదని ఆ వర్ణచిత్రాలను బట్టి అర్ధమవుతోంది.

అయితే ఈ అమ్మవారి ఆలయానికి మాత్రం తొమ్మిది అంతస్థులతో కూడిన గాలిగోపురం ఉండటం విశేషం. ఆ తర్వాత – ఏడవదయిన ధాన్యలక్ష్మి అమ్మవారి గదితలుపులు తెరిచారు.

ఈ గదిలోనే అన్నిటికన్నా చాలా తక్కువ నిధి కన్పించిందిగాని అమ్మవారి ఆభరణాలు, ఆలయంలో పూజాదికార్యక్రమాలకు ఉపయోగించిన మృణ్మయ పాత్రలు భద్రంగా వున్నాయి.

అయితే ఇక్కడ ఒక విశేషం వుంది. అమ్మవారు ధ్యానలక్ష్మి, ధనంకన్నా ధాన్యం గొప్ప.

మనిషి బతకాలంటే అన్నంకావాలి. ఆకలి తీరితేనే మిగిలిన విషయాలు. ధనాన్ని తినలేరుగదా, కాబట్టి ప్రజలకు పంటలు బాగా పండించి సమృద్ధిగా ధాన్యాన్నిచ్చే అమ్మవారు ధాన్యలక్ష్మి.

ఆ అమ్మవారి ముందు పెద్ద పెద్ద రాగి మూకుళ్ళు అనేకం కన్పిస్తున్నాయి. ఒక్కో మూకుడులో ఒక్కో జాతికి చెందిన తృణధాన్యం వుంది.

వాటిలో వరి, గోధుమ, కొర్రలు, గంట్లు, మొక్కజొన్నలాంటివే గాక ఆ కాలంలో వినియోగిస్తూ క్రమ క్రమంగా అంతరించిపోయిన అపురూపమైన పదిరకాల తృణధాన్యాలు కూడా భద్రపరచబడివున్నాయి.

ఆ గదిలో ఆ యా ధాన్యపుగింజల్ని ఇన్ని వందల సంవత్సరాలయినా పురుగూ పుట్టా ఆశించకుండా తాజాగా ఉంచడానికి వారు ఉపయోగించిన టెక్నిక్ ఏమిటో బుర్ర చించుకున్నా ఇప్పటి మేధావులకు అర్థం కాదనటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అంతేకాదు. అక్కడ కూడా కొన్ని తాళపత్ర గ్రంథాలున్నాయి.

అవన్నీ వ్యవసాయ రంగానికి సంబంధించినవి. ఆ కాలంలో వారు వ్యవసాయరంగంలో అనుసరించిన విప్లవాత్మకమైన మార్పులు ఒకటికి పదిరెట్లు దిగుబడి రావాలంటే ఏం చేయాలి. ఇరవైరెట్లు దిగుబడి పెంచుకోవాలంటే అనుసరించవలసిన పద్ధతులు ఏమిటి-

ఆరోగ్యంకోసం వారు అనుసరించిన పద్ధతులు. వంట వార్పులు మొదలైనవి తెలిపే అమూల్య గ్రంథాలవి. వాటిని ఈ కాలంలో అనుసరిస్తే గణనీయంగా పంటల దిగుబడి పెరిగి ఆహారకొరత లేకుండాపోతుంది.

అలాగే ఆ కాలంవారు వాడిన కూరగాయలు, వాటితో తయారయ్యే రకరకాల కూరల విశేషాలు కూడా తెలుపబడి వుండటం నమ్మశక్యంగాని విషయం. ఇక చివరిది అయినటువంటి విజయలక్ష్మి అమ్మవారి గది తెరవబడింది. విజయాన్ని అనుగ్రహించే అమ్మవారు విజయలక్ష్మి.

ఈ అమ్మవారికీ బోషాణంలో వెలలేని ఆభరణాలు రాగిపాత్రల్లో బంగారం వజ్రవైడూర్యాలు, పూజాపాత్రలు వెండివస్తువులు వున్నాయి. గోడలకు అమర్చబడిన రెండు తెలవర్ణచిత్రాల్లో ఆనాటి విజయపురి గ్రామం. గ్రామ కూడలిలో అమ్మవారి ఆలయం, ఆలయాన్ని, దాన్ని పరిసరాల్ని రెండు చిత్రాల్లోనూ స్పష్టంగా చూడవచ్చు.

ఇక ఈ గదిలో ఉన్న విశేషం ఏమిటంటే గదిలో ఎటుచూసినా కూడా రత్నఖచితమగు ఒరలతో కూడిన ఖడ్గాలు, డాళ్లు, గదలు, కంచుతో తయారు చేసిన ప్రత్యేకమైన ఈటెలు–ఇంకా విల్లంబులు మొదలగు ఆయుధాలు ఎటుచూసినా కనిపిస్తున్నాయి.

కొన్ని కిరీటాలూ ఉన్నాయక్కడ, ఇవన్నీ శత్రువుల్ని జయించిన విజయసూచకంగా భోజరాజులు ప్రత్యర్థి ప్రముఖరాజులనుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, కిరీటాలు అవి.

ప్రతిదానికీ ఆ ఆయుధం ఎవరిది ఏ భోజరాజు లేదా భోజుల సైన్యాధిపతులు జయించి స్వాధీనం చేసుకున్నదీ ఒక తాళపత్రం మీద లిఖించి తగిలించబడింది.

భోజుల చరిత్రకు సంబంధించిన అమూల్యమైన సమాచారం విజయలక్ష్మి అమ్మవారి గదిలో ఉంది అనటంలో సందేహంలేదు.

ఆదివిష్ణుమూర్తి అన్నా, ఆదినారాయణుడన్నా శ్రీహరి అన్నా ఒక్కరే. ఆ నారాయణుని భార్య లక్ష్మీదేవి అని అందరికీ తెలుసు.

ఈ మహాలక్ష్మి వివిధ అంశలుగా శోభిస్తూ ఉంటుంది. ఆ కళలే అష్టలక్ష్మి అమ్మవార్లు. తమతమ కష్టాలు తీరడానికి అవసరాలనుబట్టి ఆ యా అమ్మవార్లను కొలిచి అనుగ్రహిం పొందుతూవుంటారు భక్తులు.

మొత్తం తొమ్మిది గదుల్ని సందర్శించగానే యధాప్రకారం తాళాలు బిగించి సీలువేశారు.

అంతేకాదు. కోర్టు ఆదేశాలమేరకు సాయుధ పోలీసుల్ని దీవినుంచి తొలగించి మిలటరీ దీవిని తమ అధీనంలోకి తీసుకుంది. భద్రతాపరమైన కారణాల చేత ఈ మార్పు అవసరమైంది.

అంతటితో దీవిలోని నిధులకు సంబంధించిన ఉత్కంఠకు తెరపడి అసలు సమస్యకు తెరలేచింది.

దేశం మొత్తంగా ఆ మాటకొస్తే ప్రపంచవ్యాప్తంగానే ఏ న్యూస్ పేపర్ తిరగేసినా ఏ టీవీ ఛానల్ చూసినా కూడా ఉజ్జయిని కేంద్రంగా పూరాతన ఆలయాలు నిధులు దేవిదేవతా విగ్రహాల గురించే చర్చ.

విదేశీమీడియా ప్రతినిధులు కూడా ఉజ్జయినికి రాకపోకలు ఆరంభించారు. దొరికిన నిధి మొత్తం విలువ ఎంత వుంటుందనే విషయంలో రోజురోజుకి ఓ విధంగా ప్రజల్లో చాలా ఆసక్తి రేగుతోంది. ఇది ఇలా ఉండగా-

ఆదివిష్ణు అష్టలక్ష్మి అమ్మవార్ల విగ్రహాలు నదిలో లభించాయని ప్రస్తుతం దీవిమీద పందిరికిందే పూజాధికాలు నిర్వహిస్తున్నారని ఫోటోలతో సహా పత్రికలు టీవీల్లో చూసి దేశవ్యాప్తంగా భక్తులు ఉజ్జయినికి తరలిరావటం ఆరంభమైంది.

ప్రస్తుతం దీవి మిలిటరీ ఆధీనంలో ఉందిగాబట్టి భక్తుల దర్శనానికి మాత్రం అవకాశం లేదు.

ఎవరూ రావద్దని ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రకటనలు ఇవ్వవలసి వచ్చింది. ఇక శిథిల ఆలయాల్ని గుర్తించటం లోను, నిధుల్ని వెలుగులోకి తెచ్చే విషయంలోనూ అవిశ్రాంతంగా కృషిచేసిన కృతయుగ్, స్నిగ్ధ, కాంచన, అన్నారావు, మంత్రవాది అనంతస్వామిల పేర్లు జాతీయంగాను, అంతర్జాతీయంగానూ మారుమోగాయంటే అందులో ఎంతమాత్రం ఆశ్చర్యంలేదు.

నిధులు బయటపడిన తరువాత ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ కూడా ఆలయాలమీద పూర్తిగా దృష్టి కేంద్రీకరించి శిథిలగ్రామాలు, ఆలయాలను అన్వేషించటంలో నిమగ్నమై కొంత విజయం సాధించింది.

ఇక మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిధిమీద పెత్తనం కోసం తమ వంతు వాటాకోసం సుప్రీమ్‌కోర్టులో కేసు వేసి తమవాదనలు వినిపించటం ఆరంభించింది. ఆ విధంగా నిధి వివాదాస్పదంగా అవటంతో మరికొంత మిలటరీబలగాన్ని దీవికి తరలించింది ప్రభుత్వం.

ప్రస్తుతం దీవిమీదనే ఉంటోంది కృతయుగ్ వర్గం. వారికి ప్రత్యేక పాసులు జారీచేయటం వలన వారిని ఎవరూ అభ్యంతరం పెట్టరు. ఇక వంటవాళ్ళు కొందరు సిబ్బందీ అక్కడే ఉంటున్నారు.

సుప్రీమ్‌కోర్టులో వివాదం నడుస్తూండగానే కోర్టు ఒక సంచలనాత్మకమైన నిర్ణయం తీసుకుంది.

అసలు దీవిలో లభించిన నిధుల మదింపు విలువ ఎంతో అత్యవసరంగా తేల్చాల్సిన పరిస్థితి ఉంది గాబట్టి భద్రతాపరంగా గట్టి బందోబస్తు మధ్య నిపుణులైనవారిని రప్పించి విశ్రాంత న్యాయమూర్తులు-

లాయర్లు, కృతయుగ్ వర్గం సమక్షంలో ఇంకా రాష్ట్ర ప్రభుత్వం తరపున వచ్చిన పెద్దల ఎదుట విలువ కట్టే పనులు ఆరంభించారు.

దేవిదేవతల ఆభరణాలు, ఆలయాల్లో వినియోగించిన మృణ్మయపాత్రల వంటివాటిని మినహాయించి మిగిలిన నిధుల్ని లెక్కల్లోకి తీసుకున్నారు.

ఇక్కడ మరో విశేషం ఏమిటంటే, ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ అభ్యర్ధనమేరకు అక్కడ లభించిన తాళపత్రగ్రంధాలను ఆ డిపార్ట్‌మెంట్‌కు అందించారు.

వ్యవసాయ సంబంధమైన తృణధాన్యాలు తాళపత్ర గ్రంధాలను దేశీయ వ్యవసాయరంగానికి అప్పగించారు. సంతానలక్ష్మి గదిలో లభించిన తాళపత్ర గ్రంధాలను భారత వైద్య ఆరోగ్యశాఖకు అప్పగించారు.

ఇక సాధారణ ఆయుధాలు, కత్తులు, డాళ్ళు మొదలైనవాటిని ఉజ్జయినిలోని మ్యూజియంకు తరలించారు. ఇక గజలక్ష్మి అమ్మవారి గదిలో ఆనాడు అనగా పద్దెనిమిది వందల సంవత్సరాల క్రితమే అంతరించిపోయేదశకు చేరుకున్నటువంటి కొన్ని రకాలైన జంతువులు, పక్షుల భౌతిక శరీరాలను శుభ్రం చేసి ఎండబెట్టి, భద్రంచేసి వుంచారు.

బహుశా ఇలాంటి జీవజాలం ఉండేదని భవిష్యత్తరాలకు తెలియటం కోసం వీటిని భద్రం చేసుండాలి.

నేడు శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది గాబట్టి ఆ ఆ యా జీవుల డి.ఎన్.ఎను సేకరించి పునరుత్పత్తికి అవకాశాలున్నాయి గాబట్టి వాటిని పరిశోధనలకోసం శాస్త్రవేత్తలకు అందించారు.

ఆ శాస్త్రవేత్తల కృషి ఫలిస్తే త్వరలోనే ఒకప్పుడు భూమిమీద అంతరించి పోయినటువంటి ఆ యా జాతుల్ని తిరిగి మనం చూడగలం. ఈ పనులన్నీ సుప్రీమ్‌కోర్టు అనుమతితోనే జరిగాయి.

ఇక ఎంతో అనుభవజ్ఞులయిన బంగారు, వెండి, రత్నాల వెల నిర్ణయించే నిపుణులు సుమారు పదిహేను రోజులపాటు శ్రమించి నిధిని రెండుగా వర్గీకరించి లిస్టులు తయారుచేశారు.

మొదటి లిస్టు దేవి దేవతా మూర్తుల ఆభరణాలు, ఆలయాలలో ఉపయోగించే ఉపకరణాల జాబితా మరియు వాటివిలువ...

ఆ విలువ సుమారుగా ఏభై లక్షల కోట్లు. ఆదివిష్ణు, అమ్మవార్ల కిరీటాల్లో పొదిగిన వజ్రాలే ప్రపంచంలో అరుదైనవి, అత్యంత విలువైనవిగా గుర్తించబడ్డాయి.

ఇక మిగిలినటువంటి అంతులేని ఆభరణాలు, బంగారు, వెండి, నాణాలు, వజ్రవైఢూర్యాలు, వాటి మదింపు విలువ సుమారుగా ఒక కోటి కోట్ల రూపాయలుగా వారు నిర్ణయించారు.

వేలం నిర్వహిస్తే వాటి ప్రాచీనతనుబట్టి వాటి విలువ వెయ్యిరెట్లు పెరగవచ్చని అంచనా వేశారు.

లెక్కింపు ముగియగానే నిధిని ఆ యా గదుల్లో యధాతథంగా ఉంచేసి తలుపులు మూసి తాళాలు వేసి సీల్‌వేసి నివేదికను సుప్రీమ్‌కోర్టుకు సమర్పించారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున నిధికోసం సుప్రీమ్‌కోర్టులో దావా రెండోసారి వేయబడింది.

నిధి మధ్యప్రదేశ్ భూభాగంలో లభించింది గాబట్టి అది మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి చెందాలి.

నిధిని వినియోగించుకునే హక్కు రాష్ట్ర ప్రభుత్వానిది. ఎప్పుడో శిథిలమైన ఆలయాల కోసం ఇప్పుడు అంత భారీ నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరంలేదు.

సింపుల్‌గా చిన్న గుడులు కట్టి విగ్రహాల్ని ప్రతిష్ఠించవచ్చు. నిధిమీద ఎవరి పెత్తనం కూడా రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మతం కాదు అని అంటూ ప్రభుత్వం తరపున లాయర్లు తమ వాదనలు విన్పించారు.

స్నిగ్ధ, కృతయుగ్‌ల తరపు లాయర్లు వాటన్నిటినీ ఖండిస్తూ తమవాదనల్ని సమర్థవంతంగా గట్టిగా ఉండేలా వినిపించారు. ఆరు మాసాలపాటు సుప్రీమ్ కోర్టులో సుదీర్ఘంగా నడిచిన ఈ కేసు దేశ ప్రజల్లో ఉత్కంఠను రేకెత్తించింది. తీర్పు ఎవరి పక్షాన వస్తుంది అన్న కుతూహలాన్ని ఏర్పరచింది.

ఇదిలా ఉండగా ఈ మధ్య కాలంలో కొన్ని అనూహ్యమైన సంఘటనలు కూడా కొన్ని చోటు చేసుకున్నాయి.

ఒక మనిషి యొక్క జీవనశైలి ఎలాంటిది అయినప్పటికీ కొన్ని సంఘటనలు వారిలో మార్పును తీసుకొస్తుంటాయి. అన్నారావు విషయంలోనూ అదే జరిగింది. ఉజ్జయిని రాకపూర్వం వరకు అతనిలో ధనాపేక్ష చాలా అధికంగా ఉండేది.

నిధుల్ని అన్వేషించి తవ్వి తెచ్చుకోవటం హాబీగా ఉండేది. కానీ ఇప్పుడు అతడిలో పూర్తిగా పరివర్తన కలిగింది.

నిధుల మీదగాని ధనం మీదగాని అతనికి ఆశలేదు. భక్తి భావం కలిగింది. గతంలో తన కూతురు భవిష్యత్తు కోసం ఆలోచించేవాడు. ఇప్పుడు ఆ ఆలోచనా లేదు.

జీవితం ప్రశాంతంగా హాయిగా వుంది. ఇప్పటికే తన కూతురి కోసం ఎంతగానో సంపాదించి దాచివుంచాడు. అన్నివిధాలా సమర్ధుడయిన కృతయుగ్ కాబోయే అల్లుడు. ఇక తనకి ఎవరిగురించి చింత? ఎందుకు చింత?

ఎన్నో ఆశలు పెట్టుకున్న తన మేనల్లుడు మహీధర్ గతించాడు. పీటర్‌తో సహా తన మనుషులు అందరినీ వెనక్కి హైదరాబాదు తీసుకెళ్ళిపోయాడు.

మరణించిన తన మనుషులు ఐదుగురి కుటుంబాలకు ఆర్ధిక సహాయం అందించి, వారిని ఆదుకున్నాడు అన్నారావు.

పీటర్‌తో సహా తనను నమ్మి ఇంతకాలం సేవలందించిన తన మనుషులందరికీ ఆర్థికసాయం అందించి గౌరవప్రదంగా బతికే వేరువేరు వృత్తులు, వ్యాపారాల్లో స్థిరపడేలా చేసి ఆదుకున్నాడు. కాంచన రెండుసార్లు హైదరాబాద్ వచ్చి వెళ్ళింది. స్నిగ్ధ రెండు సార్లు వచ్చింది. అన్నారావు కుటుంబం ఉజ్జయిని వచ్చి ఆదివిష్ణు అష్టలక్ష్మి అమ్మవార్ల దర్శనం చేసుకుని వెళ్ళింది.

స్నిగ్ధ తల్లి, చెల్లెలు నిత్యతోపాటు సెంట్రల్ మినిష్టర్ శివప్రసాద్ కూడా దీవికి వచ్చి వెళ్ళారు.

*      *      *      *      *

కృతయుగ్ రెండు సార్లు భద్రాచలం వెళ్ళాడు. బామ్మ నారాయణమ్మను ఉజ్జయినికి తీసుకొచ్చి ఆదివిష్ణు దర్శనం చేయించి చుట్టుపక్కలంతా చూపించి తిరిగి భద్రాచలంలో దించి వచ్చాడు.

అన్నారావు తమ వ్యాపారాలను చూసుకుంటూ హైదరాబాద్‌లోనే ఉండిపోగా, మంత్రవాది అనంతస్వామి మాత్రం ఆదివిష్ణులను సేవిస్తూ దీవిమీదే ఉండిపోయాడు. కేసు విషయం తేలేవరకూ ఉజ్జయిని విడిచి వెళ్ళే ఆలోచన ఆయనకి లేదు.

కృతయుగ్, స్నిగ్ధ, కాంచనలకు ప్రస్తుతం దగ్గర వున్న పెద్దదిక్కు ఆయనే.

ఈ నేపథ్యంలో ఆరుమాసాలు గడిచిపోయాయి.

ఇరువైపు తరపున ఉన్న లాయర్లు ఎవరి వాదనలు వారు కోర్టులో వినిపించారు.

అయిదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది.

ఒకదశలో ఈ కేసు వీగిపోయి రాష్ట్ర ప్రభుత్వానిదే పైచేయి కావచ్చునే ఊహాగానాలు చెలరేగాయి. కాని ఉత్కంఠకు ఫుల్‌స్టాప్ పెడుతూ చివరకు విజయం స్నిగ్ధ, కృతయుగ్‌లనే వరించింది. ధర్మాసనం నూటపాతిక పేజీలతోకూడిన తమ తీర్పును వెలువరించింది. తీర్పుకు ముందు రాష్ట్ర ప్రభుత్వానికి సంధించిన కొన్ని ప్రశ్నలు:

1. ఆలయాల పునర్నిర్మాణానికి బదులు నిధిని తమకు అప్పగించినట్లయితే రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఉపయోగిస్తామని అంటున్నారు. అసలు నిధికి, మీ రాష్ట్ర అభివృద్ధికి సంబంధం ఏమిటి?

2. ఇప్పుడు రాష్ట్రం అభివృద్ధి చెందటంలేదా? అయితే ప్రజల ముక్కుపిండి వసూలు చేస్తున్న రాష్ట్ర ఆదాయం అంతా ఏమయిపోతోంది?

3. దుబారా ఖర్చును అరికట్టి రాష్ట్రానికి వచ్చే ఆదాయాన్ని గండికొట్టి మింగేస్తున్న అక్రమార్కుల పనిపట్టి, రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవటానికి మీరు తీసుకున్నటువంటి చర్యలు ఏమిటి?

4. హక్కుభుక్తంగా నిధిని మీ ప్రభుత్వం సొంతం చేయాలని నిధి మీద పెత్తనం మీకే కావాలని అడుగుతున్నారు. దేనికి? ఆ నిధికోసం మీరుగాని, మీ గత ప్రభుత్వాలుగాని ఏమాత్రం శ్రద్ధ తీసుకోలేదు.

మృత్యుదీవిగా ఆ దీవిని గాలికి వదిలేశారు. గత చరిత్రనూ పట్టించుకోలేదు. నిధి బయటపడిన తర్వాతే మీకు హక్కులు గుర్తుకువచ్చాయా?

నిధిని బయటకు తీయటంలోనూ, ఆలయాల గురించి బయటి ప్రపంచానికి తెలియజేయటంలోను కూడా నిస్వార్ధంగా సేవలు అందించినటువంటి స్నిగ్ధ, కృతయుగ్‌ల పాత్ర అపారమైనది. వారితోపాటు అనేక మంది అవిరళ కృషి చేశారు. మరి అంత నిస్వార్ధంగా, మీరు పనిచేయగలరా?

5. నిధిని మీ ప్రభుత్వానికి అప్పగిస్తే చిన్నచిన్న గుడులు కట్టి సరిపెట్టేసి నిధిని రాష్ట్ర అభివృద్ధికి వెచ్చిస్తామంటున్నారు. నిధి ప్రభుత్వ హక్కు భుక్తమని మీ వాదన. ఎందుకలా చేయాలి?

ఎవరిదీ సొత్తు? ఆలయాలది కాదా?

6. నిధి బినామీ కాదు. చరిత్రకందనిది కాదు. ఎవరు ఎందుకు నిధిని అంత పటిష్ఠంగా భద్రం చేశారో చారిత్రక ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి.

అటువంటప్పుడు నిధిని దాటినవారి లక్ష్యానికి గండి కొట్టి నిధిని ప్రభుత్వం ఎలా సొంతం చేసుకోగలదు? నిధి రహస్యాన్ని కాపాడడం కోసం తన ప్రాణాల్ని సైతం పణంగా పెట్టిన చివరి భోజరాజయిన విక్రమభోజుడి త్యాగాన్ని మర్చిపోగలమా?

7. భవిష్యత్తరాలకోసం భోజరాజులు నిధిని మాత్రమే దాచలేదు. నిధితోపాటు అమూల్యమయిన తాళపత్ర గ్రంధాలను, తృణధాన్యాలను అంతరించిపోయిన జీవజాలం భౌతికకాయాలను – ఇలా ఒకటేమిటి.

నిస్వార్ధంతో వాటన్నిటినీ ముందుచూపుతో భవిష్యత్తరాలకోసం దాచివుంచి భద్రంగా అందించారు.

కాని ఈ రోజున భవిష్యత్తరాలకోసం మనం చేస్తున్న కృషి ఏమిటి? ప్రధాన భూమిని ఎప్పటిలా నిరపాయంగా, స్వచ్ఛంగా, కాలుష్యరహితంగా భవిష్యత్తరాలకు అందించగలమా అని ప్రశ్నించుకుంటే లేదనే సమాధానం వస్తుంది.

నేడు ఎటు చూసినా ప్లాస్టిక్ వ్యర్ధాలు, కాలుష్యకారకమైన ప్రాణాంతక వ్యర్ధాలు, వాతావరణంలో కార్బన్‌డయాక్సైడ్ శాతం వేగంగా పెరుగుతోంది.

గ్లోబల్ వార్మింగ్‌తో వాతావరణంలో పెనుమార్పులు సంభవించి మానవమనుగడ ప్రశ్నార్ధకమవుతోంది.

రోజు రోజుకీ... పచ్చదనం కనిపించకుండా పోతోంది. అడవులు, చెరువులు, వాగులు, నదులు, సరస్సులు అంతరించిపోతున్నాయి.

సకాలంలో వర్షాలు కురవటంలేదు.

భవిష్యత్‌లో ఎప్పుడో ఒకసారితప్ప తరచూ కురవటం జరక్కపోవచ్చు.

దేశంలో ఎప్పుడు చూసినా ఎక్కడో ఒకచోట ఎన్నికలు.... ఏర్పాటువాదాలు, ఎక్కడ చూసినా లంచగొండితనం, స్వార్ధం విలయతాండవం చేస్తున్నాయి.

ఈ పరిస్థితులు మారాలి. ఈ విషయాల్లో ప్రపంచ వ్యాప్తంగా అన్నిదేశాలూ ఆందోళన వ్యక్తపరచటమేగాని కఠినమైన నిర్ణయాలతో నడుం బిగించి ఏ దేశం కూడా భూమిని మన ముందుతరాలకు స్వచ్ఛంగా అందించాలనే దిశగా కృషి చేయటంలేదు.

ఎక్కడో దేనికి? ముందుతరాలకోసం మీ ప్రభుత్వం చేపట్టిన చర్యలేమన్నా ఉంటే చెప్పగలరా? ఇలా ధర్మాసనం సంధించిన అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక ప్రభుత్వ పక్షం ఉక్కిరి బిక్కిరయిపోయింది.

ధర్మాసనం తన తీర్పును స్పష్టంగాను, నిష్పక్షపాతంగాను వెలువరించింది. ఆ తీర్పు ప్రకారం–

నిధి ప్రాధమిక విలువ అంచనా ఒక కోటి యాభైలక్షల కోట్ల రూపాయలు. అందులో ఒక వంతు రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించటం జరిగింది. అయితే ఆ నిధిని ఎలా ఎందుకు వినియోగించాలో కోర్టు శాసించింది. దాని ప్రకారం ప్రభుత్వం ఆ నిధితో– దీవివద్ద అటూ ఇటూ క్షిప్రానది కరకట్టలు పటిష్ఠపరిచి అక్కడ నదికి ఇరువైపులా తూర్పు పశ్చిమ విష్ణుపుర గ్రామాల నిర్మాణం చేపట్టాలి. అంతేకాదు. అష్టలక్ష్మి ఆలయాలున్నచోట ఆయాగ్రామాల పునర్నిర్మాణం జరగాలి.

రాకపోకలకు పక్కా రహదారులు నిర్మించాలి. ఈ పనులకోసమే నిధుల్ని వెచ్చించాలి.

ఆలయాల నిర్మాణానికి ముందే ఈ పనులను ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ సహకారంతో పూర్తిచేయాలని కోర్టు ఆదేశిస్తోంది.

యధాతధంగా ఆలయాల నిర్మాణం జరగాలన్నది భోజరాజు ఆశయం.

దానికి ఇంజనీరింగ్ విధానం సరికాదు. పురాతనపద్ధతుల్లో పూర్తిగా శిల్పకళారీతిలో రాతికట్టడాలుగా ఆలయ నిర్మాణాలు జరిపించాలి.

మొత్తం తొమ్మిది ఆలయాలు, అయిదు గోపురాలతో పునర్‌నిర్మాణానికి ప్రాధమిక అంచనాయే సుమారు డెబ్బై ఐదువేల కోట్లరూపాయల ఖర్చు అవుతుందనేది. కాబట్టి ఈ అంచనా తర్వాత పెరిగే అవకాశం కూడా లేకపోలేదు.

ఆలయాల నిర్మాణానికి తర్వాత దేవాదాయం, ఆలయాల నిర్వహణ నిమిత్తం కలిపి ఒక లక్షా ఇరవై వేల కోట్ల రూపాయలు కేటాయించటం జరిగింది.

భోజరాజవంశీయులనగా ఇక్కడ చివరి భోజరాజయిన విక్రమభోజుడ్ని మాత్రం పరిగణనలోకి తీసుకోవాలి. ఆధారాలు చూపగలిగితే అంతకు పూర్వం పాలించిన భోజరాజుల వంశీకుల్నీ పరిగణనలోకి తీసుకోవచ్చు. విక్రమభోజుడికి సంతానంలేదని తాళపత్రాల వలన స్పష్టమవుతున్నా ఆయన సోదరసోదరీమణుల వంశాలనూ పరిగణనలోకి తీసుకోవచ్చు.

వారి సంక్షేమంకోసం రెండోవంతు ఈ నిధిని ఒక ట్రస్టుగా ఏర్పాటుచేసి ఆ యా కుటుంబాల్లోని ఆర్థిక స్థితి గతులను గుర్తించి సంపన్నులను వదిలి మిగిలిన వారి అభివృద్ధికోసం ట్రస్టు పనిచేయాలి.

మరోభాగం కృతయుగ్ ఆధ్వర్యంలో స్థపతి శంభులింగయాచారి, అక్కనాచార్యుల వంశీకులు ప్రస్తుతం ఎవరయితే ఉన్నారో, వారిలో సంపన్నులను వదిలి మిగిలిన బడుగుపేదవర్గాలు ఎవరున్నారో గుర్తించి వారి అభ్యున్నతికి కృషిచేయాలి.

కృతయుగ్‌ని అక్కనాచార్యుని వంశీకునిగా కోర్టు నమ్మినందున ఈ బాధ్యతను అతనికి అప్పగిస్తోంది. ఈ రెండు ట్రస్టులూ కృతయుగ్ ఆధ్వర్యంలో పనిచేయాల్సివుంది.

ఆలయ నిర్మాణం నిధికి ట్రస్టీల్లో స్నిగ్ధ, కృతయుగ్, కాంచన, అన్నారావు, అనంతస్వామిలను సభ్యులను చేయాలి. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఈ ట్రస్టును ఏర్పాటుచేయవలసివుంటుంది.

నిధిని బంగారం, వెండి, వజ్రాలు ఇలా ఆ యా కేటగిరీల్లో వర్గీకరించి చిన్నచిన్న మొత్తాలుగా విభజించి జాతీయ అంతర్జాతీయంగా టెండర్లుపిలిచి విక్రయించాల్సి వుంటుంది.

వాటి ప్రాధమిక అంచనా ధరను అనుసరించి వేలంజరగాలి. నిధి వేలం ద్వారా లభించిన ఆదాయంలో ప్రాధమిక ధరకు పైన వచ్చిన లాభాన్ని విడిగా బ్యాంకింగ్ చేసివుంచాలి.

ఇందులో ముందుగా మనం అభినందించాల్సింది సెంట్రల్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్‌ను.

స్నిగ్ధకు తమ పూర్తి సహకారాన్ని అందించి ప్రోత్సహించటం వల్లనే ఈ మహత్కార్యం సాకారం అవుతోంది. కాబట్టి ఇక్కడ పని చేస్తున్న ఆ డిపార్ట్‌మెంటుకు నిధుల కొరత ఏర్పడితే రాష్ట్ర ప్రభుత్వం అందించి సహకరించాల్సి వుంటుంది.

ఎందుకు అంటే భవిష్యత్తులో రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరగనుంది గాబట్టి.

ఇక చివరి నాలుగో వాటాను దేశంలోని చెరువులు, వాగులు, నదుల పునరుద్ధరణ, నదుల అనుసంధానం కోసం, అడవులపెంపకం కోసం, ప్రత్యామ్నాయ ఇంధన వనరులకోసం, డ్యామ్‌లు, కాలువలు, రైతుల కోసం, దేశ వ్యవసాయ అభివృద్ధికోసం కేటాయించాలి.

ఈ విధంగా ప్రతి కోణాన్నీ స్పృశిస్తూ ధర్మాసనం తమ తీర్పును వెలువరించగానే అందరూ హర్షాతి రేకంతో పులకించిపోయారు.

ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ వాళ్ళు స్నిగ్ధ పర్యవేక్షణలో ఆ యా గ్రామాలను గుర్తించి త్రవకాలు జరిపినప్పుడు కొన్ని చారిత్రక ఆధారాలు అయిన వస్తువులు, బంగారు, వెండిపాత్రలు ఆ కాలపు బంగారు, వెండి నాణాలు లభించాయి.

ఆయా గ్రామాల పునర్నిర్మాణం కోసం లే అవుట్లు వేయించి రాష్ట్ర ప్రభుత్వం గృహసముదాయాల్ని నిర్మించే పనులు ఆరంభించింది.

మరోపక్క అడవినరికి పక్కా రోడ్లు నిర్మించే పనులు కూడా ఆరంభమయ్యాయి.

స్థపతి శంభులింగయాచారి వంశీకుల్ని గుర్తించటంకోసం అన్నారావుని వెంటబెట్టుకుని భోపాల్ వెళ్ళాడు కృతయుగ్.

రాగిగొట్టాన్ని అన్నారావుకు అమ్మిన వ్యక్తిని కలిసినప్పుడు అతడు ఆ వంశానికి చెందినవాడు కాదని తేలింది. ఉజ్జయినిలో ఎక్కడో అపార్ట్‌మెంట్ల నిర్మాణంకోసం పునాదులు తవ్వుతుండగా కూలీల్లో ఒకడికి ఆ రాగిగొట్టం దొరికిందట. తర్వాత అది మూడు చేతులు మారి అన్నారావుకి చేరింది.

కాబట్టి శంభులింగయాచారి వంశానికి చెందిన వారు ఎవరు ఎక్కడ ఉంటున్నారో గుర్తించటంలో కృతయుగ్ పూర్తిగా విఫలమయ్యాడు.

ఉంటే తనను కలవాల్సిందిగా కృతయుగ్ పేపర్ ప్రకటనలు ఇచ్చినా ఫలితం లేకపోయింది.

ఇక స్థపతి అక్కనాచార్యులవారి వంశీకుల విషయానికి వస్తే – కృతయుగ్ తండ్రి తరపున అన్నదమ్ములు అక్కాచెల్లెళ్ళు వాళ్ళ కుటుంబాలు బంధువులు – ఇలా చాలామందే వున్నారు.

ఆ వంశానుక్రమంలో వెనక్కి చూసుకుంటూ వెళ్ళినప్పుడు సుమారుగా అయిదువందల కుటుంబాలకుపైనే తేలాయి.

పేపరు ప్రకటనలు ఇచ్చిన తర్వాత ఆధారాలతో సహా మరికొన్ని కుటుంబాల వివరాలు తెలిశాయి.

వారిలో కొద్దిమంది మాత్రమే సంపన్నవర్గంలో ఉండగా, మిగిలిన వారంతా పేద మధ్యతరగతి కుటుంబాల వారే. వారిలో కొందరు ఇంకా

శిల్పవృత్తినే నమ్ముకొని జీవిస్తూంటే, చాలామంది ఇతర వృత్తులలోనూ, ఉద్యోగ వ్యాపారాల్లోను స్థిరపడివున్నారు.

అర్హులయిన ఆయా కుటుంబాల సమగ్ర అభ్యున్నతికి తమ ట్రస్ట్‌ద్వారా సహాయ సహకారాలందించాడు కృతయుగ్.

అంతేకాదు.

శిల్పులందరినీ ఆలయాల నిర్మాణం పనుల్లోకి తీసుకుని జీవనోపాధి కల్పించాడు.

ఇక భోజరాజవంశీయులు ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో రాజవంశాలకు కొదవలేదు. ఎన్నో రాజవంశాలు ఆ యా ప్రాంతాల్ని పరిపాలించాయి. అనేక రాజవంశీకుల వారసులు ఇక్కడ అన్నివర్గాల్లోనూ కనిపిస్తారు.

సంపన్నులు కొందరు విదేశాల్లో స్థిరపడగా, కొందరు వృత్తి వ్యాపారాల్లో స్థిరపడున్నారు.

అలాంటివారిలో భోజరాజ వంశీయులూ ఉన్నారు. భోజకులస్తులు కూడా ఉన్నారు. వీరు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో విస్తరించివున్నారు.

కృతయుగ్ ఆ యా ప్రాంతాల్లో పర్యటించి భోజరాజ వంశీయులు అనేకమందిని గుర్తించటం జరిగింది. వారిలో అతికొద్దిమందే సంపన్నులు కాగా మిగిలినవారంతా పేద, మధ్యతరగతివారే.

కొందరయితే స్లమ్ ఏరియాల్లో అత్యంత దయనీయ స్థితిలో కాలం గడుపుతున్నారు.

వారిని చూస్తుంటే కృతయుగ్‌కి చాలా బాధ కలిగింది. బహుశా భవిష్యత్తులో తమ వంశీయులు కష్టాలను అనుభవిస్తారని ఊహించే, విక్రమభోజుల నిధిలో వారికి కేటాయింపు ఇచ్చివుండాలి.

ఈ పర్యటనల్లో కాంచన కృతయుగ్‌ని అనుసరించే ఉంది. ఆమె సహకారం కూడా అసామాన్యం. స్నిగ్ధ ఆర్కియాలజీవారి పనులతో అటు బిజీగావటంచేత కృతయుగ్‌ని అనుసరించే అవకాశం ఆమెకు లేదు.

*    *    *    *    *

ఒక రాజవంశానికి చెందిన కుటుంబమయితే ఉజ్జయిని స్లమ్ ఏరియాలో కడుదీనస్థితిలో బతుకు వెళ్ళదీస్తోంది.

కాగా ఎవరికీ తెలీని విషయం ఏమంటే, ఆ కుటుంబంలో మొదటిగా నేలమాళిగ నిర్మించి నిధిని దాచిన భోజరాజు చంద్రభోజుడి రత్నఖచిత ఖడ్గం ఒరతో సహా భద్రంగా ఉండటం.

తరతరాలుగా ఎన్ని కష్టాలు వచ్చినా భరించారుగాని ఖడ్గాన్ని తమ పూర్వీకుల గుర్తుగా దాచుకున్నారే తప్ప అమ్ముకోలేదు.

వారికి నచ్చచెప్పి ఆ ఖడ్గానికి విలువ కట్టి దాన్ని తీసుకోవటంతోపాటు ఆ కుటుంబానికి ట్రస్టు తరపున అవసరమైన ఆర్థిక సహాయం అందించి వారి కష్టాలు తొలగించాడు కృతయుగ్.

ఇలాగే మరో కుటుంబంలో విక్రమభోజుని రాజముద్రిక లభించింది.

భోజరాజు కుటుంబాల్లో అనేకం నేడు అత్యంత దయనీయమయిన పేదస్థితిలో ఉండగా ఆ యా కుటుంబాలను ఆదుకున్నారు.

దేశంలోనే పేరుగాంచిన శిల్పాచార్యులు, స్థపతులు తొమ్మిదిమందిని ఎంపిక చేసి ఒక్కో ఆలయ నిర్మాణ బాధ్యతను ఒక్కోస్థపతికి అప్పగించారు.

నేలమాళిగలోని గదులనుంచి ఆలయాల చిత్రపటాలను కోర్టు అనుమతితో స్వాధీనం చేసుకున్న స్నిగ్ధ, వాటిని స్థపతులకు అందజేయటంతో, ఆలయాల నిర్మాణానికి అంచనాలు ఊపందుకుని పనులు చాలా చురుగ్గా ఆరంభించడం జరిగింది.

* * * * *

ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని సాత్పురా పర్వతాలు వింధ్యపర్వతాల్లో ఆరువేలమంది శిల్పులు శిల్పాచార్యులు, స్థపతులు నిర్విరామంగా కృషిచేస్తున్నారు. అక్కడి నుండి తయారైన రాతిదిమ్మలు. శిల్పాలను ఆ యా ప్రదేశాలకు తరలించి ఆలయాల నిర్మాణ పనులు చురుగ్గా ఆరంభించారు.

రెండువేల పదిహేనోసంవత్సరాంతానికి నిర్మాణం పనులు పూర్తయి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్తంభాలు నిలపటం–

ఆలయగోపురాల కుంభాభిషేకం పనులు పూర్తి చేయాలని అంతా దీక్షతో పనులు చేస్తున్నారు. ఈ పనులు అన్నిటినీ ప్రముఖ పీఠాధిపతులు కొందరు పర్యవేక్షిస్తూ వస్తున్నారు.

ఆదివిష్ణు ఆలయం పూర్తికాగానే ఆలయంలో జరిగే మొదటి వివాహం తమదే కావాలని–

అప్పుడే వివాహం చేసుకోవాలని కృతయుగ్, స్నిగ్ధ, కాంచనలు ఎప్పటినుంచో కృతనిశ్చయంతో ఉన్నారు.

ఈ పనులు ఇలా జరుగుతుండగానే సుప్రీమ్‌కోర్టు తిరిగి మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

దేశవ్యాప్తంగా ప్రజలు రోజుకి కొన్ని లక్షల ఉత్తరాలు రాస్తున్నారు గౌరవనీయమైన సుప్రీమ్ కోర్టుకి – ప్రస్తుతం దేశంలో ఉన్న ఎమ్.ఎల్.ఏల్ని. ఎంపీలను, మంత్రుల్ని, ఇతర ప్రజాప్రతినిధుల్ని, ఐ.ఎ.ఎస్‌ల్ని ఇక ఎంత మాత్రం మేం నమ్మలేమంటూ.

ఇందుకు కోర్ట్ చింతిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న 50 మంది నిస్వార్థపరులైన, దేశం పట్ల, దేశప్రజలపట్ల ప్రేమాభిమానాలు నిండుగా ఉన్న సమాజ సేవకుల ఆధ్వర్యంలోనే చంద్రభోజుని సంకల్పం నెరవేరాలని కోర్టు ఉత్తర్వులివ్వటం జరిగింది.

అలాగే గతంలో కోర్టు ఈ నిధి ద్వారా దేశ ప్రజలకు ఏం మేలు జరగాలని ఆశించిందో–

ఆ మేలుకూడా ఈ ఏభై మంది ద్వారానే జరగాలని కోర్టు తీర్పు ఇవ్వటం జరిగింది.

ఈ వార్త పత్రికల్లో వచ్చిన రోజు దేశ ప్రజలందరూ పండుగ చేసుకున్నారు.

*– : అయిపోయింది : –*




**Masala Indian Cuisine**

3321, W Kennewick Avenue,
Kennewick, WA-99336 USA

అభినందనలతో...

- సూర్యదేవర రామ్‌మోహనరావు

Website : www.suryadevararammohanrao.com
Email : suryadevaranovelist@gmail.com
Facebook : Suryadevara Ram Mohan Rao
Blog : suryadevaranovelist.com
Twitter : @srmnovelist.com
(For My eBooks : www.kinige.com)
(For My eBooks on Mobiles : www.newshunt.com)